కవులు

వచన

మహాకవి ధూర్జటి



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంథాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్థం TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ లో eBOOK(PDF) అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంధాలయం ఉండాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్థం **ఉచితంగా eBook** రూపంలో TTD(తిరుమల తిరుపతి దేవస్థానం) సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

http://ebooks.tirumala.org



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

తెలుగు పరిశోధన ప్రచురణలు - 11

మహాకవి ధూర్జటి

పిహెచ్. డి. సిద్ధాంత వ్యాసం

డా॥ వి. రత్నమోహిని
ఎం. ఏ., పిహెచ్. డి.

తెలుగు పరిశోధన ప్రచురణలు
1-1-694/2/ఎ, గాంధీనగర్, హైదరాబాద్-500 380

MAHA KAVI DHURJATI
Ph. D., THESIS By
DR. V. RATNAMOHINI, M. A., Ph. D.

తెలుగు పరిశోధన ప్రచురణలు - 11
సంపాదకుడు: వాసిలి వసంతకుమార్
ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : డిసెంబరు 1988
ముఖపత్ర రచన : అశోక్

వెల : సాధారణ ప్రతి రూ. 80
గ్రంథాలయ ప్రతి రూ. 100

ప్రతులకు :

తెలుగు పరిశోధన ప్రచురణలు
1.1.694/2/ఎ, గాంధీనగర్
హైదరాబాద్ 500 380

డా॥ వి. రత్నమోహిని
వి 11, ఎఫ్ 12, విజ్ఞానపురి,
విద్యానగర్, హైదరాబాద్ 500 044

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4.1.435, బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్ 500 001

ముద్రణ :
మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్
1.1.694/2/ఎ, గాంధీనగర్
హైదరాబాద్ 500 380

ఆర్థిక సహాయం : తిరుమల తిరుపతి దేవస్థానం

అంకితము

భగవాన్ శ్రీ శ్రీ శ్రీ
సత్యసాయిబాబా
పాదపద్మములకు

ఆచార్య ఎం. కులశేఖరరావు
తెలుగు శాఖాధ్యక్షులు
ఉస్మానియా విశ్వవిద్యాలయం

అభినందన

స్వర్ణయుగమని ప్రఖ్యాతిపొందిన శ్రీకృష్ణదేవరాయల కాలములో నివసించిన కవుల కావ్యాలను గురించి విశ్వవిద్యాలయాలలో చక్కని సిద్ధాంత వ్యాసాలు వెలువడినాయి. శ్రీమతి రత్న మోహినిగారు మహాకవి ధూర్జటి జీవితము రచనలు అనే విషయంమీద అనేకానేక విషయాలు సేకరించి ఈ గ్రంథం సమగ్రంగా రచించినారు. వారికి నా అభినందనలు.

క్రీ.శ. పదునారవ శతాబ్దం పేరుకే స్వర్ణయుగం కాదు. తెలుగు సాహిత్యం ప్రబంధనామంతో ముందడుగు వేసి, అన్నివిధాల నూతనత్వాన్ని సౌందర్యాన్ని సంతరించుకొని అనన్యమైన కావ్యాలను తెలుగువారికి అందించింది. పెద్దనగారి కావ్యం అన్నింటిలోన 'పెద్ద' అనిపించుకోవడం మన అందరికి తెలిసిందే. రామరాజభూషణుని ప్రబంధం రత్నఖచిత సింహాసనంలాంటిది అంటే అతిశయోక్తి కాదు. ఇక రాయలు స్వయంగా ఆనాటి కావ్యప్రక్రియకు 'ప్రబంధం' అని నామకరణంచేసి తానే తీర్చిదిద్దిన ఆముక్తమాల్యద సర్వకాలాల్లో పరిమళం వెదజల్లుతూనే ఉంటుంది. తెలుగు ప్రబంధానికి రాయల ప్రోత్సాహం అనన్యమైంది. ఆ మహానుభావుడు ఒక మహాకవి కాలికి గండపెండేరాన్ని తొడిగితే ఒక మహాకావ్యం ఉద్భవించింది. ఆయనకు స్వప్నంలో శ్రీమహావిష్ణువు సాక్షాత్కరిస్తే ఇంకొక ప్రబంధం ఆవిర్భవించింది. అనురాగంతో అభిమానించే తన భార్యమీద ప్రణయకోపం కలిగితే పారిజాత

ప్రబంధం మొగ్గతొడిగింది. బహుళా, శైవ వైష్ణవాల కారణంగా అభిప్రాయ భేదం ఏర్పడితే ఇంకొక మహాకవివల్ల మరోకావ్యం ఉదయించింది. ఇంతటి మహోదాత్తమైన సమయం కాబట్టే, అది మనకు బంగారుకాలం.

ధూర్జటి మహాకవి, పెద్దనాది కవులవలె రాయలవారి మతాన్ని అనుసరించేవారు కాకపోయినా, ఆయన ఆస్థాన అష్టదిగ్గజాల్లో చేరి, తన స్వామిచేత 'స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేలకలిగెనో అతులిత మాధురీ మహిమ' అని ప్రశంసను పొందినాడు. ప్రబంధ మార్గంలో కాళహస్తి మాహాత్మ్యం వ్రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినాడు.

పోటీపడితే వారితో, వీరితో కాదు. సాహితీ సమరాంగణ సార్వభౌమునితో స్పర్ధ వహించాలని ధూర్జటి భావించినట్లున్నది. రాయలవారు ఆముక్తమాల్యద రచించి భువన విజయాధ్యక్షుడైనాడు. ధూర్జటి తానేమి తక్కువవాడా! కాళహస్తిమాహాత్మ్యం రచించి ఆయనతో సమానం అనిపించుకొన్నాడు. ఎట్లా సమానుడు? అంటే వినండి. రాయలవారి కావ్యం శ్రీవిల్లిపుత్తూరు, శ్రీరంగం అనే వైష్ణవక్షేత్రాల పూర్వగాథలను వర్ణించేది. కాళహస్తిమాహాత్మ్యం కాళహస్తి అనే శైవక్షేత్ర స్వభావాన్ని వర్ణిస్తున్నది. ఆముక్తమాల్యదలో చూడికుడుత్త నాచ్చియార్ అమ్మవారు, సర్వ లౌకిక సౌఖ్యాలను వదలి శ్రీనాథునిలో లీనమైతే, కాళహస్తి మాహాత్మ్యంలో వేశ్యాయువతులు, అన్ని బంధాలు, అన్ని భోగాలు వదలి కాళహస్తీశ్వరునిలో ఐక్యమైనారు. రాయలవారు మాలదాసరిని పరమ వైష్ణవ భక్తాగ్రేసరుడుగా తీర్చిదిద్దితే, ధూర్జటికవి ఆటవికాగ్రేసరుడైన తిన్నని పరమ మాహేశ్వరునిగా చిత్రించినాడు. తెలుగురాజు శ్రీరంగాన్ని భూలోక వైకుంఠంగా వర్ణిస్తే, తెలుగుకవి కాళహస్తిని దక్షిణ కైలాసంగా తీర్చిదిద్దినాడు. ఆముక్తమాల్యదలో వైష్ణవాగ్రేసరుడైన పెరియాళ్వారుకు విష్ణుమూర్తి సాక్షాత్కరిస్తే, కాళహస్తి మాహాత్మ్యంలో నత్కీరునికి శివుడు సాక్షాత్కరించి ఆయన కోర్కె తీర్చినాడు. ఇట్లా ఎన్నింటిలోనో ఈ రెండు ప్రబంధాలకు సామ్యం కనిపించడంచేత తాను రాయలకేమీ తీసిపోయేవాణ్ని కాదు అని చాటిచెప్పినట్లుగా ధూర్జటి 'మహాప్రబంధా'న్ని రచించినాడని నా కనిపిస్తుంది. ఇంక, రాయలు చేయని పనిని ఒకదాన్ని ధూర్జటి చేసినాడు.

'రాజుల్ మత్తులు - వారిసేన సరకప్రాయంబు' అని నిర్భయంగా చెప్పడమే అది. బహుశా అది రాయలవారిని గురించి కాక, సాహిత్య వాసన లేని యితర భూపతులను గురించి కావచ్చు ననుకొంటాను.

ఈ సిద్ధాంత వ్యాసంలో ధూర్జటి వంశాదికములను గురించి చక్కటి అధ్యాయం ఉన్నది అంతగా లోకానికి తెలియని విశేషాలను, ఈ పరిశోధకు రాలు దీనిలో వివరించినారు. శ్రీవిద్యకు, ఈ కావ్యానికి అవినాభావ సంబంధం ఉన్నదని విజ్ఞులు భావిస్తారు. ఆ సంబంధం ఎటువంటిదో చెప్పడానికి రత్న మోహినిగారు ప్రయత్నం చేసినారు. ఇది మంచి ప్రయత్నమే. కాళహస్తి క్షేత్రం తెలుగుదేశంలో ఉన్నప్పటికీ, దాని ప్రశస్తి యావద్భారత దేశానికి సంబంధించినట్టిది. మాతృకావిచారం అనే ప్రకరణంలో ఈ మహా ప్రబంధానికి, ప్రాచీన తమిళ సాహిత్యానికి ఎటువంటి సంబంధం ఉన్నదో వ్యక్తమైంది. అన్నింటికి మించి 'మార్గదేశి సమన్వయం' అనే భాగంలో అనేక ఆసక్తికర మైన విషయాలు వెల్లడైనాయి. వాటిని చదివితీరవలసిందే. శతకాల్లో కాళ హస్తీశ్వర శతకం యొక్క ప్రశస్తి ఎటువంటిదో ఈ గ్రంథకర్త్రి సోదాహర ణంగా వివరించడం, దానిలోని తత్త్వాన్ని విశదంచేయడం ఉత్కృష్టంగా ఉన్నది.

మహాకవి ధూర్జటికి, అతని కావ్యాలకు సంబంధించిన సమగ్ర సమా చారం ఈ గ్రంథంలో లభిస్తూ ఉన్నది. దాన్ని ఉపయోగించుకోవడమే మనం చేయవలసిన పని. డా॥ రత్నమోహినిగారు ఇటువంటి నూత్న విషయాలను ఇంకా లోకానికి వెల్లడిస్తారని నా విశ్వాసం -

విజ్ఞానపురి - హైదరాబాదు, —ఎం. కులశేఖరరావు
16-10-88.

ఆచార్య నాయని కృష్ణకుమారి

తెలుగుశాఖ,

ఉస్మానియా విశ్వవిద్యాలయం

హైదరాబాద్

ఆశీస్సులు

శ్రీమతి రత్నమోహిని Ph. D పట్టానికై కృషిచేసి, వెలయించిన సిద్ధాంత వ్యాసం, ధూర్జటి జీవితము - రచనలు - చివరవరకూ చూచాను.

ఈ వ్యాస రచనాప్రణాళికకు మూలమైన ప్రకరణ విభజన బాగున్నది. కవి వంశం, వ్యక్తిత్వం, ఆతనికిగల జీవితాభిరుచి - వీటిని వ్యక్తంచేసిన తీరు బాగున్నది.

స్థలపురాణాలకు సాహిత్యంలో ఉన్న స్థానాన్ని గుర్తించి, శ్రీకాళహస్తి మాహాత్మ్యానికి ఆంధ్ర సాహిత్యంలో గల నిర్దిష్ట స్థానాన్ని వివరించడం బాగున్నది.

శ్రీకాళహస్తి మాహాత్మ్యాన్ని ఉగ్గడిస్తూ అందులో "దేశి, మార్గ, రీతుల సమన్వయము" అనే ప్రకరణాన్ని తీర్చడం మన కీగ్రంథంలో కనిపిస్తుంది. - నిజానికి ధూర్జటి ఛందోమార్గం గణచ్ఛందోమార్గం. వాడిన భాష, వర్ణించిన వస్తువు ఎక్కువగా దేశ్యమైన తెలుగు పలుకుబడితో కూడిన భాష, వస్తువున్నూ, అంటే ఇందులోని ఛందం సంస్కృతానుసారి, భాష వస్తువు తెలుగునూ, తెలుగు జీవితాన్నీ, అనుసరించేవి. ఇట్లా విభిన్నాలయిన రెండు అంశాలను మార్గ, దేశి అనే పేర్లుపెట్టి సమన్వయం చేయడం సమంజసంకాదు. నిజానికి

ఈ ప్రకరణంలో రచయిత్రి బేరీజువేసిన అంశం జాతి వార్త. అంటే తెలుగు జాతికి సంబంధించిన ఆచారాదులు, వేష భాషాదికాలు, తెలుగు నుడికారాలు, పలుకుబడులు, సాంఘికస్థితి మొదలైనవి. అందువల్ల ఈ ప్రకరణాన్ని ఛందో గతితో, సంస్కృత సమాస సంపదతో జతచేయకుండా, దీనికి "ధూర్జటి - జాతీయత" అన్న నామకరణం చేసిఉంటే బాగుండేది. ఇందులో అష్టదిగ్గజ కవులు అన్న ప్రకరణం అస్థాన పతితం. ఇంతకూ వాళ్ళెవరో ఖచ్చితంగా ఇంతవరకూ తీర్చినవారూ లేరు. రత్నమోహిని కొత్తగా ఏమీ ప్రతిపాదించనూ లేదు. కాగితాలను పూరించే ఇటువంటి చర్విత చర్వణ విషయాలనుండి దూరంగా ఉండాలని పరిశోధక విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలి.

ధూర్జటి కవిత్వానికి సంబంధించిన అలంకార సంపద, వర్ణనా వైభవం, రసపోషణ వంటి విషయాలు ఈ గ్రంథంలో స్ఫుటంగా చిత్రించబడ్డాయి. ఆ మేరకు ఈ గ్రంథం ధూర్జటి కవిత్వ విశేషాలను ప్రతిఫలించే స్వచ్ఛదర్పణం.

దీనిని వెలయించిన శ్రీమతి రత్నమోహినికి ఆశీస్సులతో

— నాయని కృష్ణకుమారి

ఇరివెంటి కృష్ణమూర్తి
రీడరు, తెలుగు విభాగం
పోస్టుగ్రాడ్యుయేటు కాలేజి, సికింద్రాబాదు
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

చదువునదని మనవి

"........కాంతాసమ్మితతయోపదేశయుజే" అన్న అభియుక్తోక్తికి సజీవోదాహృతి తెలుగు ప్రబంధం. శ్రవణపేయమైన శబ్దమాధురినీ, మనోహరమైన అర్థసౌందర్యాన్నీ తెలుగు కవితకు సమాంతరంగా సమకూర్చినవి ప్రబంధాలే. కేవలం కథాకథనం, అర్థప్రాధాన్యం, శాంతరస పరమావధిగా ఉన్న కావ్యరచనారీతిని, ధర్మాభిరతి ఉన్న వాళ్ళకు మాత్రమే పఠనీయంగా ఉండే కావ్యరచనారీతిని, అనల్ప కల్పనా చమత్కృతులతో, శృంగారవీర రస స్పర్శతో, సమకాలీన సామాజికేతివృత్త స్పృహతో, వస్త్వలంకార రసధ్వని స్ఫూర్తితో, అపారశేముషీ ప్రాగల్భ్యంతో సమలంకరించి ఒక నూత్న కావ్య ప్రక్రియను రూపొందించి చరితార్థులైనారు పదహారవ శతాబ్దంనాటి మేటి తెలుగు కవులు. వీరేశలింగంపంతులుగారి అమృతోదయానికంటె కొంచెం పూర్వం, అంటె నూరేళ్ళకు పూర్వం పాశ్చాత్యుల ప్రమేయంవల్ల ఏర్పడిన అస్తవ్యస్త రాజకీయ పరిస్థితులవల్ల, ఛోటానాయకులు, చిల్లర రాజుల పలుకుబడిలో అనుకరణ ప్రధానములైన నకిలీ ప్రబంధాలు వెలువడిన మాట వాస్తవమే. అశ్లీలతను, శబ్దాలంకారాల దమదమలను, ఛందస్సుల కసరత్తులను ప్రతిభాహీనతను పులుముకున్న ప్రబంధాలు అనేకం వచ్చినవి. మన అదృష్టం వల్ల ఆ రాశిలో చాలాభాగం అచ్చుకాలేదు. కాని పెద్దన, తిమ్మన, రాయలు,

రామరాజభూషణుడు, సూరన, రామకృష్ణుడు, రామభద్రుడు, ధూర్జటి,సంకుసాల నృసింహకవి వంటి మహా ప్రబంధకర్తల కావ్యాలలో అనుకరణల పాలుఎంత? అష్టాదశ వర్ణనలు పనిగట్టుకొని అందరూ చేసినవారేనా? ప్రశ్నలకు అషామాషీగా సమాధానాలు రావు. రావడానికి వీలులేదు. వర్ణనలనురసౌచిత్యానికీ, పాత్రపోషణకూ, కథాగమనానికీ, వస్తుధ్వనికీ ఉపయోగించుకున్న సందర్భాలే యెక్కువ. ఇప్పుడు పండితులు లేనేలేరని అపండితుణ్ణిచూసి గొంతుచించుకుని అరిస్తే ప్రయోజనం? ప్రముఖమైన తెలుగు ప్రబంధాలు ఎంత పాండితీ స్ఫోరకములో అంత రసార్ద్రములు. ఎంత మహిత కల్పనా సముపేతములో అంత భవ్య సందేశ ప్రసరణ క్షమములు.

ఆమూలాగ్రంగా ఒక ప్రబంధాన్నైనా పదిలంగా, అక్షరశః చదివిన వాడు ప్రబంధాన్ని గూర్చి ఎల్లిదముగా మాటాడుటకు సాహసించడు.

ప్రబంధాన్ని వస్తుదృష్టితో, అలంకారదృష్టితో, రసదృష్టితో పరిశీలించ వలసి ఉంటుంది. మనుచరిత్ర ఇచ్చే సందేశం చివరకు వినిపిస్తుంది. మొదటి మూడు ఆశ్వాసాలు చదివి లబ్ధి లేదన్నవానితో వాదమే లేదు. ఇంతకూ మను చరిత్రలో వరూథిని నాయనమ్మ, పెద్దన స్వారోచిషమనవు అమె మనువుడు ధర్మాన్ని పరిపాలించమని అతనికి భగవదాజ్ఞ. ఇది కథాంతంలో సూచితం. పెద్దన పెద్దగా నగర వర్ణన చెయ్యలేదు. రెండే పద్యాలు. ఆ రెండూ భావి కథార్థసూచనకే. పాత్ర పోషణకే. అన్ని ప్రబంధాల్లోనూ సందేశం 'ఆకు లందున అణగి మణగి' ఉంటుంది. తెలుసుకోగలిగే ఓపిక ఉండాలె. చేవ ఉండాలె. పల్లవగ్రాహి పాండిత్యంవల్ల తేలేదికాదు.

పురాణేతిహాసాల తరువాత తెలుగులో అవతరించిన ప్రబంధాలలో సమకాలిక సమాజం అష్టాదశ వర్ణనల మిషతో ప్రత్యక్షమైనది. ప్రబంధాల పాత్ర పోషణ యత్నంలో దేవతల్లోని మనుష్యులు, మనుష్యుల్లోని దేవతలు బయల్పడి కావ్యానికి ప్రయోజనాన్నీ, పవిత్రతనూ, స్వాభావికత్వాన్నీ ప్రకటించ గలిగినారు.

పదునారవ శతాబ్దంలో వెలసిన ప్రబంధకవుల్లో ధూర్జటి ఒకడు. నాటి కవులందరివలెనే ప్రతిభాశాలి. అపార జీవితానుభవం కలవాడు. కాళహస్తీశ్వర

మాహాత్మ్యం, కాళహస్తీశ్వర శతకం ఆయన ప్రతిభా పాండిత్యాలకూ, విశిష్ట వ్యక్తిత్వానికి ప్రతీకలుగా నిలిచి ఉన్నవి. అతి శక్తిమంతమైన కాళహస్తీశ్వర శతకంతో పరిచయంలేని తెలుగువాళ్ళు అరుదే. తిన్నడిని తెలుగు గుండెల్లో పదిలపరచినది ధూర్జటి కావ్యమే !

శ్రీమతి రత్నమోహినిగారు ధూర్జటి రచనలను పలు దృక్కోణాలతో పరిశీలించి పఠనీయమైన గ్రంథాన్ని రచించి పఠితృలోకం కృతజ్ఞతలకు పాత్రులు కాగలిగినారు.

ఇది పిహెచ్.డి. పట్టాకోసం వ్రాసిన సిద్ధాంత వ్యాసం. సిద్ధాంత వ్యాస రచనకు అనుగుణమైన ప్రణాళిక, ప్రకరణ విభజనం సహేతుకంగా ఉన్నవి. క్షేత్రమాహాత్మ్యాలను గూర్చి, శతక ప్రక్రియనుగూర్చి, శైవమత స్వరూపాన్ని గూర్చి, మార్గదేశి రచనలనుగూర్చి, రసస్వరూపాన్ని గూర్చి, ధూర్జటిని అధ్యయనం చేస్తున్నాననే సంస్కారంతో అనేక వివరణములను ఆమె సేకరించి, సరళమైన భాషలో ఈగ్రంథంలో పొందుపరచినారు.

విశేషించి ధూర్జటి వ్యక్తిత్వాన్ని చిత్రించే ప్రయత్నంలో తర్కక్షమం గానూ, సహృదయరంజకంగానూ ఉంది. ఆమె ఈ పట్టున తమ ప్రతిభను, శ్రద్ధాసక్తులను భంగ్యంతరంగా ప్రకటించుకున్నారు. రసపోషణ విషయం లోనూ ఆమె తన మౌలికతను ప్రదర్శించింది.

కాళహస్తీశ్వర ప్రబంధానికి మాతృక ఏది అన్న చర్చ ఈ గ్రంథంలో చాలా పదిలంగా సాగింది. ఎన్నో గ్రంథాలను పరిశీలించవలసివచ్చింది. ప్రజా బాహుళ్యంలో ప్రచారంలో ఉన్న కథలకే అతడు కావ్యరూపం కల్పించినాడన్న యాథార్థ్యాన్ని నిరూపించడంలో శ్రీమతి రత్నమోహిని చూపిన మెలుకువలు మెచ్చుకోదగినవి.

అన్నిపట్టులలోను ఉదాహరించిన పద్యములు హృద్యములు. సరిపడే ఉదాహరణకూ, అందమైన ఉదాహరణకూ భేదం ఉండదామరి?

నేటితరం ఈ పుస్తకాన్ని చదివితే ప్రబంధాలు పఠనార్హములేనన్న అభిప్రాయం మరింత బలపడే అవకాశాలు ఎక్కువౌతాయి.

ఇది పరిశోధన మాత్రమేకాదు, సత్కావ్య పఠనంపట్ల ఉన్ముఖీకరణం కూడా.

బహువిషయాలను అందిస్తున్న ఈ పరిశోధనకృషికి మార్గదర్శనం చేసిన మాన్యమిత్రులు ఆచార్య ఎం. కులశేఖరరావుగారిని అభినందిస్తున్నాను.

శ్రీమతి రత్నమోహినిగారు ఈ సిద్ధాంతవ్యాసం కేవలం పట్టాకోసం వ్రాసినట్టు తోచదు. నిరంతరాధ్యయనశీలత, సూక్ష్మాంశ గవేషాసక్తి, సాహిత్యానురక్తి ఆమెను ఈ పరిశోధనకు ప్రేరేపించినవని నమ్మినాను.

కృషి చేసి వ్రాసిన గ్రంథాన్ని అందరూ చదువాలె. ప్రబంధవాఙ్మయం పనికిరాదన్న అభిప్రాయం ఉన్నవాళ్లు ప్రత్యేకంగా ఈ పుస్తకం చదువాలె. ఒక క్షణం ఆలోచించే అవకాశమైనా లభిస్తుంది. అలాంటి అవకాశాన్ని కలిగిస్తున్న ఈ పరిశోధన కృషి అభినందనీయం. ఈ సిద్ధాంతవ్యాసం రచించిన డా॥ (శ్రీమతి) రత్నమోహినిగారికి ఆశీఃపరంపరలు.

10-10-88 — ఇరివెంటి కృష్ణమూర్తి

డా॥ ఎల్లూరి శివారెడ్డి
రీడర్, తెలుగుశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ప్రమోదన

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన కృష్ణదేవరాయలపాలనలో ఆయన ఆశ్రయం కోరి తలవంచిన ఎందరో కవుల నడుమ తలవంచక నిలిచిన మహాకవి ధూర్జటి ఒక్కడే. కవితామ తల్లికి ఆశ్రయం ఇచ్చాడే కాని ఎవరినీ ఆశ్రయం కోరి అర్థించని ఆత్మగౌరవశీలి ఆయన. ఆత్మాభిమానానికి దెబ్బ తగిలినపుడు తీవిగా శేకవేసిన కవి ధూర్జటి. రచించిన గ్రంథాలు రెండే అయినా అవి రసికతా రమ్యహర్మ్యాలు. ఆయన రచనల్ని అనేక కోణాలనుంచి విడిగా పరిశీలించి తెలియపరిచిన సాహిత్యచరిత్రకారులూ, విమర్శకులు, లేకపోలేదు. అయితే ఆయన రచనల్ని సర్వాంగీణంగా సమీక్షించి, ఆ మహాకవి హృదయాన్ని తేటతెల్లం చేశాడు డా॥ వి. రత్నమోహినిగారు తమ సిద్ధాంత వ్యాసంలో. ఈ సిద్ధాంత గ్రంథంలో ఉన్నవి పన్నెండు అధ్యాయాలు. ఈ పన్నెండు అధ్యాయాల పరిశీలనలో ఈనాటికి ధూర్జటిని గురించి అందిన సమాచారాన్ని రాశిపోసి, వర్గీకరించి ఆయన సాహిత్యమూర్తిని మనకంటి ముందు నిలిపారు రత్నమోహినిగారు.

ధూర్జటి రచనలు ఎంతగా మనను ఆకర్షిస్తాయో ఆయన వ్యక్తిత్వం మనను అంతగా ఆకట్టుకొంటుంది. ఆయన రచనలకు వన్నెతెచ్చింది అనుభవస్పర్శ. అది ఒకచోట "కాయల్గాచె వధూనఖాగ్రములచే కాయంబు" అంటూ గిలిగింత పెడుతుంది. "చదువుల్ నేర్చిన పండితాధములు స్వేచ్ఛాభాషణ

క్రీడలన్ వదరుదురు" అంటూ ఒకచోట గిల్లి మాట్లాడుతుంది. ధూర్జటి రచనలను తలస్పర్శిగా అధ్యయనం చేసి వివరించటం అంత తేలికైన పని కాదు. కొన్నిచోట్ల కష్టపడి పద్యాల అన్వయం కుదిరించుకోవాలి. పదాల పరిమళార్థాన్ని గ్రహించాలి. వస్తువుకు పొందిక కూర్చుకోవాలి. ఆ ఇబ్బందుల్ని తొలగిస్తూ మనకు విషయాన్ని సుష్ఠుగా బోధపరిచారు ఆమె ఈ సిద్ధాంత వ్యాసంలో. ఈ మహాకవి రచించిన గ్రంథాల్లో ఒకటి శతకం, రెండవది స్థల పురాణం. కాళహస్తీశ్వర శతకం కన్నా ముందే అటు సంస్కృతంలోనూ, ఇటు తెలుగులోనూ వెలసిన శతకాలున్నాయి. మల్లికార్జున పండితారాధ్యులు మొదలుకొని శతకాలు రచించిన కవులు ఎందరున్నా అందులో అగ్రపంక్తిలో నిలువదగిన అర్హత సందింపాదుకున్న కవి ధూర్జటి. ఈ శతకంలోని పద్యాల వెనుక ప్రకాశించిన కవి ఆత్మీయతను సమగ్రంగా చిత్రించగలిగారు రత్న మోహిని గారు. పద్యాల తాత్పర్యం మాత్రమే కాకుండ అందులో ప్రతిఫలించిన భక్తి తత్పరత ఎంత గాఢమైందో ఎత్తి చూపడం ఈ సిద్ధాంత వ్యాసంలో మనకు రుచికరమైన అంశం. 'ఏ కవి చెప్పలేనంత ఆత్మోద్రంతము ఇందు గలదు. (పు. 139) అంటున్నారు ఆమె ఈ శతకాన్ని పరామర్శిస్తూ. అది వట్టి శతకమైనా ఆత్మాశ్రయ కవిత అంతస్తుకు ఎదిగింది. కథాత్మక రచనలు చేసిన కవి రచనలో అంతసులభంగా మనకు పట్టుపడడు. శతకాల్లో చాలా మంది కవులు స్వీయభావాల్ని వెలువరిస్తారు. భక్తి శతకాల్లో ఈ లక్షణం మరీ ఎక్కువ. అందుకు ఉదాహరణ కాళహస్తీశ్వర శతకం.

ప్రాచీన సాహితీ రూపాలు చాలా వరకు మతోన్ముఖంగా కొనసాగినవి. ప్రాచీనకాలంలోని జీవితాన్ని మతం నుంచి వేరుచేయడం కష్టం. ధూర్జటి శైవమతానుయాయి. ఆయన రచనలు రెండూ శైవమతాభిమానాన్ని సూచించేవే. శైవంలో ఎన్ని శాఖలున్నా ధూర్జటి అనుసరించింది భక్తి మార్గం. పాల్కురికి లాగా అన్యమత దూషణ చేయకుండా అభిమానంగా హాయిగా పరమేశ్వరుణ్ణి గురించి పాడుకొన్నాడీ భక్తకవి. రత్నమోహినిగారు సమకూర్చిన "శైవ మతము - ధూర్జటి" అన్న ప్రకరణాన్ని చదివితే మనం శైవమతం అంతరంగంలోకి తొంగిచూస్తాం. కాళహస్తి మాహాత్మ్యం స్థలపురాణం. తెలుగులో స్థల పురాణాలు ఎన్నున్నాయో వాటి స్వరూపం ఎలా ఉందో ఈ సిద్ధాంత వ్యాసం

మూడవ ప్రకరణంలో వివరించబడింది. స్థలపురాణాల్లో కాళహస్తి మాహాత్మ్యం స్థానం ఏమిటో తెలపటం జరిగింది. ప్రబంధాల్లో వస్త్వైక్యత కొరవడుతుంది. వస్త్వైక్యత దృష్టిలో పెట్టుకొని చూస్తే ఏ ప్రబంధం అగదు. అముక్త మాల్యద, పాండురంగ మాహాత్మ్యం వంటి ప్రబంధాల్లో భక్తిమాత్రమే కథా మౌక్తికాలను కలుపుతుంది. కాళహస్తి మాహాత్మ్యంలోనూ కనిపిస్తున్నది ఇదే లక్షణం. "....ధూర్జటికి ఒకటే ధ్యేయము. మహేశ్వరుని మహిమలు చెప్ప వలయును. ఈ ధ్యేయము భిన్నకథలు కలిగిన కాళహస్తి మాహాత్మ్యమునకు వస్త్వైక్యతను సాధించుచున్నది." అంటున్నారు ఈ వ్యాసకర్త్రి. ఈ సిద్ధాంత వ్యాసంలోని 'మార్గ–దేశి కవిత్వములు', ధూర్జటి 'అలంకారములు - వర్ణనలు' అన్న ప్రకరణాలు చదివి రుచిచూడతగ్గవి.

ఈ సిద్ధాంత వ్యాసంలో ధూర్జటి వ్యక్తిత్వాన్ని ప్రదర్శించిన ప్రకరణం మణిపూస లాంటిది. వ్యక్తిత్వం అనేది భావనతో భాసిస్తుంది. చేష్టల్లో చిందులు వేస్తుంది. 'హంస సంసద భీష్ట....బ్రహ్మంబు తెరగున పూర్ణమగుచు' అనే పద్యాన్ని ఉదాహరిస్తూ రత్నమోహినిగారు చేసిన వ్యాఖ్య (పు.347) ఆమె సాహితీ వివేచనకు చక్కని ఉదాహరణ. తిక్కన ఆశ్వాసాంత పద్యాల మాదిరి గానే ధూర్జటి ఆశ్వాసాంత పద్యాలు కవి అంతరంగ దర్శనానికి గవాక్షాలు. ఈ పద్యాల్లోని ఒక్కొక్క విశేషణం ఎంతో మెలకువగా వేసిందని తాత్ప ర్యాన్ని బట్టి తెలుస్తుంది. దీనికి నిదర్శనంగా ప్రథమాశ్వాసంలోని 162వ పద్యాన్ని ఎత్తి చూపవచ్చు (పు. 349). కవి భావుకత ఎంత ఎత్తులో ఉందో రత్నమోహినిగారి వ్యాఖ్య సాక్ష్యం చెబుతుంది. ధూర్జటి పోతన్నను అనుసరించా డని, నాచనసోముని నడకను మెచ్చుకున్నాడని ఈ సిద్ధాంత వ్యాసంలో చెప్పడం జరిగింది. అందులో అంతో ఇంతో సత్యం లేకపోలేదుగాని పట్టుబడి వాదించటానికి అవకాశం లేదని నా మనవి. రసికతకు దారిద్ర్యం అడ్డురాదని దారిద్ర్యంలోనూ రాసిక్యం మొక్కవోదని నిరూపించిన ధూర్జటి వ్యక్తిత్వాన్ని అనుశీలించిన ఈ సిద్ధాంత వ్యాసం సహృదయులందరికీ ఆమోదయోగ్యం కాగలదని నా విశ్వాసం.

ఇంత ప్రామాణిక సిద్ధాంత వ్యాసాన్ని వెలువరించిన డా॥ రత్న మోహిని గారికి, ఈ సిద్ధాంత వ్యాసాన్ని పర్యవేక్షించిన ఆచార్య కులశేఖరరావు గారికి సాహితీ జిజ్ఞాసుల అభినందనలు అందుతాయనడంలో సందేహం లేదు. రత్న మోహినిగారు సహజమైన సౌజన్యంతో, స్నేహ భావనతో ఈ నాల్గు మాటలు చెప్పడానికి అవకాశం కల్పించినందుకు నా ధన్యవాదాలు.

— ఎల్లూరి శివారెడ్డి

మనవి

కళాశాలలో తెలుగు సాహిత్యము పాఠ్యాంశముగా చదివినప్పుడు ఆంధ్ర ప్రబంధములను నేను ఆసక్తితో చదువుట సంభవించినది. ఆ ప్రబంధముల లోని తీయతెన్నులు నన్నెంతో ఆకర్షించినవి. తెలుగు శతకములను చదువు చున్నప్పుడు భక్తి శతకములపై నా దృష్టి కేంద్రీకృతమైనది.

ఇట్లుండగా పరిశోధన చేయుటకు నా కవకాశము గలిగినప్పుడు పరిశోధ నాంశమును గ్రహించుటకు ధూర్జటి రచనలను స్వీకరించితిని. మహాకవి ధూర్జటి ప్రబంధమును, శతకమును గూడ రచించినవాడగుటచేత అతనిపై నాకు ప్రత్యేకాభిమానము ఏర్పడినది. "ధూర్జటి కవి జీవితము - రచనలు" అను విషయమును పరిశోధనాంశముగా గ్రహించుటకు విశ్వవిద్యాలయాధికారులు దయతో అంగీకరించిరి. ఆ విషయమును గురించియే వ్రాయబడిన ఈ సిద్ధాంత వ్యాసము విద్వాంసులకు ఎంతటి తృప్తి కలిగించినను నేను కృతార్థురాలనే.

పర్యవేక్షణలో తగిన సలహాల నిచ్చి ఈ సిద్ధాంతవ్యాసమును పూర్తి చేయుటకు ప్రేరణ కలిగించిన ఆచార్య యం. కులశేఖరరావు గారికి నా ధన్య వాదములు. వారి ప్రోత్సాహము ఎన్నటికి మరువలేనిది.

ఈ వ్యాసమును సిద్ధపరచుటలో చాలమంది పండితులు నాకు సాయము చేసిరి. తమిళ గ్రంథముల నుండి విషయము సేకరించుటకు తమిళశాఖాధ్యాప కులు ఆచార్య టి. మాణిక్యముగారు సహాయము చేసిరి. వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ధూర్జటి ఆయన రచనలను పేర్కొనునపుడు శైవమత తాత్త్విక విశేష ముల నెన్నింటినో చర్చించవలసి వచ్చినది. ఆవిషయములను నాకు తేటపరచి

ఒక మార్గమును సూచించినవారు ఆచార్య బొడ్డాల రామయ్యగారు. వారికి నా నమోవాకములు.

నేను పరిశోధనకు ఉపక్రమించిననాటినుండి అనేక విధముల నాకుత్సాహము కలిగించిన పూజ్యులు కీ॥ శే॥ ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు. వారి ఆశీర్వాదవాక్యాలు ఈ గ్రంథంలో ఉండవలసినవే. వారికి నా శ్రద్ధాంజలి.

ఆచార్య యం. కులశేఖరరావుగారు, ఆచార్య నాయని కృష్ణకుమారిగారు, డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు, డా॥ ఎల్లూరి శివారెడ్డిగారు ఈ గ్రంథానికి అలంకారప్రాయమైన పీఠికలు సమకూర్చినారు. వారికి నా కృతజ్ఞతలు.

నాభర్తగారైన శ్రీ కె. వి. ఆర్. సూర్యారావుగారి ప్రోత్సాహమే ఈ వ్యాసము ఒక స్వరూపమును సంతరించుకొనుటకు కారణమైనది. వారికి నేనెంతయు కృతజ్ఞురాలిని.

ఇంకను ఎందరో మహానుభావులు. వారందరికి నా నమస్సులు.

వి. రత్నమోహిని

విషయసూచిక

ప్రథమ ప్రకరణము

ధూర్జటి జీవితము - రచనలు

నేపథ్యము

ప్రబంధములు

ఆంధ్రసాహిత్య చరిత్రలో ప్రబంధయుగము స్వర్ణయుగము. ఆంధ్ర సరస్వతి ఈ కాలమున సుందరముగా సాహితీ రంగముపై ప్రబంధరూపముతో నాట్యము చేసినది. ఈ కాలమునందలి కవులు ప్రధానముగా 'అష్టదిగ్గజము'లని ప్రఖ్యాతి వహించినవారు. ఆంధ్ర సరస్వతిని ప్రబంధ పుష్పములచేత పూజించిరి. తెలుగు సాహిత్యమున ప్రబంధ ఆవిర్భావము నూతన శకారంభము వంటిది. ఎందుచేతననగా తెలుగుభాషలో ఇంతకుముందు వెలువడిన ఇతిహాసములు, పురాణములు సంస్కృత ఛాయలయందే నడచినట్టివి. సంస్కృత భాషలోని గ్రంథములను ఆధారముగా చేసికొని కవిత్రయమువారు మహాభారతమును, భాస్కరాదులు రామాయణమును, మారన మొదలైన వారు ఇతర పురాణములను తెలుగులో వెలయించిరి. ఈ కవులందరును సంస్కృత భాషలోనున్న ఇతిహాస పురాణ విజ్ఞానమును తెలుగువారికి వారి భాషలో అందించుటయే ఆదర్శముగా గ్రహించినట్టి వారు. అయినను, ఈ కవులు ప్రతిభావంతులై పాండితీ ప్రకర్ష కలిగినవారై ఉండుటచేత ఈ ఇతిహాస పురాణములు మన భాషలో ఉత్తమ కావ్యములుగకూడ భాసించినవి. నిజమునకు ఇది తెలుగువారి సౌభాగ్యమనక తప్పదు. కాలము గడచిన కొలది సమాజము నందలి అభిరుచులతోపాటు సాహిత్యముల అభిరుచిలో కూడ మార్పు కలుగుచుండును. ఇట్టి పరిణామమే తెలుగు సాహితీ లోకమున ఆవిర్భవించినది. క్రీ.శ. 16 శతాబ్దము నాటికి మన కవులకు సాహిత్యకులకు పురాణ ఇతిహాసముల కన్న మేల్తరములైన కావ్యములు వ్రాయవలెనన్న కోరిక కలిగినది. దాని ఫలితముగానే వస్తువునందును, రచనయందును, అలంకారాదికముల యందును, శైలీ పరిపక్వత యందును, సమాస ఘటనమునందును నూతన

నత్వమును సంతరించుకొన్న ఆంధ్ర ప్రబంధము ఆవిర్భవించినది. ఈ ప్రబంధమునకు రాయలు నాయకుడు కాగా అష్టదిగ్గజములు ఆయనకు అనుయాయులై అమృత ఫలములవంటి ఆంధ్ర ప్రబంధములను పాఠకలోకమున కందించిరి. ఈ నూతన సాహితీ వాతావరణ పరికల్పనకు అష్టదిగ్గజములలో అందరితోపాటు ధూర్జటి కూడ పాల్గొని చక్కని ప్రబంధమును వెలయించినాడు.

ధూర్జటి కవితా సృష్టియందును, వ్యక్తిగతమైన చరిత్రయందును, ప్రవర్తనయందును క్రొంగ్రొత్త విశేషములు కన్పించును. ఆయన జీవితములో, కావ్యములో, శతకములో కన్పించుచున్న విశేషములను విశ్లేషణాత్మకముగా వివరించి చూపుటయే నేను చేయబూనిన పని.

రాయల యుగము - ప్రబంధములు - లక్ష్య లక్షణ సమన్వయము

రాయల యుగమునకే స్వర్ణ యుగమని, ప్రబంధ యుగమని నామాంతరములు గలవు. విజయనగర సామ్రాజ్యమును పూర్వము నుండియు పెక్కురు మహారాజులు పరిపాలించిరి. అందు కృష్ణదేవరాయల కీర్తి అపారమైనది. వాఙ్మయ విషయము నందేకాక యానాటి ప్రజలు జాత్యభిమానములను, దేశాభిమానమును గలవారై దూరదేశ వ్యాపారములు కొనసాగించి తమ దేశమును సిరిసంపదలతో నింపి జాత్యభ్యుదయమున కనేక విధముల పాటుపడిరి. దుష్కర తురుష్కుల విజృంభణము నణచివేసి నేటి కటకము మొదలు కన్యాకుమారివరకును గల దేశమునకు సార్వభౌముడైన రాయలు ఖండాంతర ప్రసిద్ధిని సంపాదించెను. వారి రాజధానియగు విజయనగరము అపూర్వములైన సిరిసంపదలతో, సాహితీ గోష్ఠులతో పరాక్రమ సంపన్నులైన యోధాగ్రేసరుల బలప్రదర్శనములతో నిత్యోత్సవముగా విఖ్యాతి నొందినది. సాహితీ రంగమునందును, సమర రంగమందును అద్వితీయ ప్రతిభాకుశలుడగుటచే సాహితీ సమరాంగణ సార్వభౌముడని రాయలు కీర్తి వహించెను.

విజయనగర సామ్రాజ్యము నేలిన మహారాజులను గూర్చి పరిశీలించినచో పెక్కు వంశముల వారి రాజ్యమును ఒకరివెంట నొకరు పరిపాలించిరి. క్రీ.శ.

1336 వ సంవత్సరమున హరిహరరాయలు, బుక్కరాయలు హైందవ ధర్మ పరిరక్షణార్థ మీ సామ్రాజ్యమును స్థాపించిరి. విజయనగర సామ్రాజ్యము సుమారు 3 శతాబ్దముల కాలము హైందవ మతమునకు పెట్టనికోటవలె నిలువ బడినది. ఈ సామ్రాజ్యములో ఆంధ్ర భాష, ఆంధ్ర శిల్పము చక్కగా పోషింపబడి నూత్న పథములు త్రొక్కినది. ఈ యుగమునందు పరిశ్రమలు, వాణిజ్యము మున్నగునవి మిక్కిలి అభివృద్ధి చెందినందున ప్రజానీకమునకు కేవలము సుఖ జీవనమే కాక భోగ భాగ్యములు కూడ లభించెను. ఇట్టి స్వర్ణ యుగమును తలంచుకొని ప్రతి ఆంధ్రుడును గర్వింపదగును.

ఈ విశాల సామ్రాజ్యమును పాలించిన రాజవంశముల గూర్చి పండితులలో అభిప్రాయ భేదము కలదు. ఈ రాజన్యులలో సంగమ వంశీయులు, కర్నాటకులో, ఆంధ్రులో వివాదా స్పదమగు అంశము.[1] కాని ఈ సామ్రాజ్యములో ఆంధ్ర కర్నాట, ద్రావిడ ప్రజలు నివసించిరి.

హరిహరరాయలు[2] క్రీ.శ. 1336 నుండి 1356 వరకును రాజ్యపాలనము చేసెను. శత్రురాజులను జయించి రాజ్య విస్తీర్ణము గావించెను. బాదామికోటను స్వాధీన పరచుకొని దానిని బలపఱచెను. గుల్బర్గా పట్టణమున అలాఉద్దీన్ హసన్ గంగూ బహమన్‌షా అనునాతడు 1347 వ సంవత్సరమున బహమని రాజ్యమును స్థాపించెను. విజయనగర బహమనీ రాజ్యములకు నిరంతర వైరములు సాగుచుండెను. 1350లో హరిహరరాయలు మరణానంతరము బుక్క రాయలు రాజ్యము చేపట్టెను. 1351లో విజయనగర ప్రభువులకును మధుర సుల్తానులకును యుద్ధము జరిగెను. ఇరువది సంవత్సరములు యుద్ధము సాగిన పిమ్మట 1371 లో విజయనగర రాజులు సంపూర్ణ విజయము సాధించిరి.

బుక్కరాయని కుమారుడగు రెండవ హరిహరరాయలు (1377-1404) వరకు పరిపాలించెను. ఈతడు గోవా పట్టణము జయించెను. 1404-1422 మొదటి దేవరాయలు పాలించెను. రెండవ హరిహర రాయనికి విరూపాక్ష, ఇమ్మడి, బుక్క-దేవరాయ నామధేయములుగల పుత్రులు ముగ్గురు కలరు. అతని యనంతరము వీరు ముగ్గురును ఒకరి వెనుక నొకరు రాజ్యభారము వహించిరి.

---

1 & 2. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి-ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

తదుపరి మల్లికార్జునరాయలు రాజ్యమునకు వచ్చెను. ప్రౌఢ దేవరాయని యనంతర మాతని కుమారుడు మల్లికార్జునరాయలు ఇరువది సంవత్సరములపాటు రాజ్యము చేసెను. దాన శీలునిగా పేరు వహించెను. ఇంతటితో సంగమ వంశము వారి అధికారము నశించి సాళువ వంశమువారు పరిపాలించ దొడంగిరి. సాళువ నరసింగరాజు రాజ్యమునకొచ్చెను. మల్లికార్జునరాయల కాలమున విజయనగరము వారు కోల్పోయిన ప్రాంతముల నీతడు మరల గెలిచెను.

సాళువ వంశము తరువాత తుళువవంశము వారు పరిపాలించిరి. ఈ తుళువ వంశము వారు తుళు ప్రాంతము నుండి వలస వచ్చి ఆంధ్ర దేశమున స్థిరనివాస మేర్పరచుకొనిరి. తాము చంద్ర వంశపు క్షత్రియులమని వీరు చాటుకొనిరి. ఈ వంశమున ఈశ్వర నాయకుడను నాతడు ప్రసిద్ధి గాంచెను. ఈతడు సాళువ నరసింగరాయల కడ సేనా నాయకుడుగ నుండి పెక్కు దుర్గములను జయించినట్లు వరాహ పురాణము తెల్పుచున్నది. ఈశ్వర నాయకుని కుమారుడు నరస నాయకుడు తండ్రివలెనే గొప్ప వీరుడు. సాళువ నరసింహ రాజున కీతడు దండనాధుడుగను, మంత్రిగను ఉండెను. నరస నాయకునికి ముగ్గురు భార్యలు. వారిలో తిప్పాంబికకు వీరనరసింహరాయడు జన్మించెను. ఈతడు తన తండ్రి మరణించిన వెనుక రాజ్య సింహాసన మాక్రమించి ఐదారు సంవత్సరములు మాత్రము పరిపాలించెను. ఈతని కడ ననన్య సామాన్య శేముషీ ధురంధరుడగు సాళువ తిమ్మరుసు మంత్రిగా గొప్ప ఖ్యాతి గాంచెను. వీరనరసింహరాయలు క్రీ.శ. 1509 వ సంవత్సరమున మరణింపగా తుళువ నరసరాజు రెండవ భార్య నాగలాంబిక కుమారుడగు కృష్ణదేవరాయడు రాజ్యమున కధికారి యయ్యెను. కృష్ణ రాయనికి అచ్యుత రాయడును, రంగరాజునను ఇద్దరు సవతి తమ్ములుండిరి.

శ్రీకృష్ణదేవరాయలు[1] 1509–1530 వరకును విజయనగర రాజ్యమును పరిపాలించెను. పాలించిన ప్రభువులందరిలో నీతడుత్తముడుగా పేర్కొనబడెను. ఈతడు మహాశూరుడై అపజయమనునది యెఱుంగక, శత్రువినాశనము గావించెను. కృష్ణరాయలు స్వయముగ గొప్ప విద్వాంసుడు. రాజనీతిజ్ఞుడు. కృష్ణదేవరాయలు భారతదేశ చరిత్రయందత్యున్నత స్థానమును పొందదగియుండెను. కృష్ణరాయలు

---

1. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

తుళువవంశీయుడగుట సత్యమేకాని, ఈతని తండ్రి తాతలు చిరకాలము తెలుగు దేశముననే నివసించుటచే, వీరు ఆంధ్రమునే మాతృభాషగా స్వీకరించిరని చారిత్రికుల యభిప్రాయమైనట్లు శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు తమ ఆంధ్రులచరిత్ర-సంస్కృతిలో పేర్కొనిరి. కృష్ణదేవరాయలు పెక్కు దండయాత్రలు గావించి విజయము సాధించెను. కృష్ణరాయల అనంతరము అచ్యుతరాయలు, తదుపరి సదాశివరాయలు, పిమ్మట అర్వీటి వంశమువారును ఈ సామ్రాజ్యమును పరిపాలించిరి. ఇక రాయలకాలమునాటి సాంఘిక పరిస్థితుల నించుక పరిశీలింతము. భోగప్రధానమైన ఈ యుగమునందు ప్రబంధములు వెలయుట మరొక విశేషము. వివిధ నూతన ప్రక్రియలకు కూడలియై ఈ యుగము వెలసెను. బహుశ ఆనాటి ప్రభువుల, కవుల, ప్రజలయొక్క భోగలాలసత, రసికత దీనికి కారణములుగా భావింపవచ్చును.

విజయనగర సామ్రాజ్య పరిపాలనా కాలమున విదేశీయులు పెక్కురువచ్చి ఈ సామ్రాజ్య వైశాల్యమును, సిరిసంపదలను, భోగలాలసతను పలువిధముల కొనియాడిరి. సంగమ వంశీయుల కాలమున నికోలోకోంటియను ఇటలీదేశస్థుడును, అబ్దుల్ రజాక్ అను పారసీక దేశపు రాయబారియు నీ పట్టణమును దర్శించిరి. 1520 సంవత్సరములో పోర్చుగీసు రాయబారి తో పెయిస్ అను నాతడీ సామ్రాజ్యమునకు విచ్చేసెను. వీరు వ్రాతలలో నీ సామ్రాజ్య విస్తీర్ణము, కొండలమధ్యమున్న ఈ పట్టణపు సౌందర్యము, మిద్దెలు, మేడలు, ఉద్యానవనములు, ప్రసిద్ధ దేవళములు కన్నులకు కట్టినట్లు వర్ణించిరి. ఇంకను వజ్రములు, నీలములు, ముత్యములు, కెంపులు మున్నగునవన్నియు బహిరంగముగా అమ్మబడుచుండినట్లు తెలియుచున్నది. రాయలయొక్క సభాభవనములను వర్ణించుచు అవి మిక్కిలి సుందరముగను, చాల విలువగల అలంకరణములతో గూడినవిగను, ఉన్నవని అబ్దుల్‌రజాక్ తెల్పియున్నాడు.

పెయిస్ అను విదేశీయుడు కూడ ఈ నగరమును వేనోళ్ళ కొనియాడుచు [1] "ఒక కొండఎక్కి పట్టణములో చాలభాగము నీతడు చూచినట్లు రోమునగరమంత పెద్దదిగానుండి చూచుటకు మిక్కిలి సుందరముగా కాన్పించెనని" వర్ణించినాడు.

1. మహమ్మదీయుల యుగము - కోరాడ లక్ష్మణరావుగారు.

విజయనగర యుగమునందు గీర్వాణ భాషయు, దేశీయ భాషలగు తెలుగు, కన్న డము, తమిళమును కూడ రాజులచేతను, ప్రభువులచేతను పోషింపబడి చక్కగా వర్ధిల్లెను. ఆంధ్రభాషకు విజయనగరము పట్టుకొమ్మ యయెను. సాళువ, తుళువ, అర్వీటి వంశముల పాలనలో తెలుగుభాషకు మిక్కుటమైన రాజాశ్రయము లభిం చెను. [1]విజయనగర రాజులలో రెండవవాడైన బుక్కరాయలు నాచన సోముడను ప్రసిద్ధ ఆంధ్ర కవికిని మతికొందఱు పండితులగు బ్రాహ్మణులకును కలిపి కడప మండలములోని 'పెంచుకలదిన్నె'యను అగ్రహారమును దానముచేసెను. మొదటి దేవరాయల కాలమున విక్రమార్క చరిత్రమును వ్రాసిన జక్కయ యను కవి జీవించెను. సాళువ నరసింహరాజునకు పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి తన "జైమినీ భారతము" నంకితమిచ్చెను.

సంకీర్తనాచార్యులలో మొదటివాడైన తాళ్ళపాక అన్నమాచార్యులు సాళువ నరసింహరాయల కాలముననే తిరుపతి క్షేత్రమున నివసించి తన కృతులను రచించెను.[2] తుళువ నరసనాయకుని యాస్థానమున నంది మల్లయ, ఘంట సింగయ, యను జంటకవులు నివసించిరి. ఇరువురు కవులు కలిసి కావ్యరచనము చేయుటకు తెలుగుభాషలో నిదియే ప్రథమోదాహరణము.

ఇక ప్రబంధ యుగములో, అనగా రాయలకాలమున రచింపబడిన ప్రబం ధములనుగూర్చి పరిశీలించుటకుముందు రాయలకు పూర్వము అనగా శ్రీనాథుని కాలములో, ఎఱ్ఱన కాలములో నన్నెచోడుని కాలములో ఈ ప్రబంధశబ్దము తమ కావ్యముల కెట్లు అన్వయించిరో తెలిసికొందము.

కుమారసంభవము

తెలుగున ప్రబంధధ్భాయలు కాన్పించెడి మొట్టమొదటి కావ్యము 'కుమార సంభవ'మని చెప్పవచ్చును. కాళిదాసుని కుమారసంభవము నాధారముగా నన్నె

1. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి – ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు
2. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

చోడుడు ప్రబంధరీతి వర్ణనలతో దీనిని రచించెను. నన్నయాదులకంటె భిన్న రీతిని దీనిరచన సాగినదని చెప్పవచ్చును.

[1]ఆంధ్రభాషలో ప్రబంధములు పదునారవ శతాబ్దిని పరిపూర్ణ వికాసము బొందినట్లు సాహిత్య చరిత్రలు తెలుపుచున్నవి. ఇది నిజమే అయినప్పటికీ ప్రబంధ శబ్దము మాత్రము నన్నెచోడుని నాటినుండియు తెనుగున కనబడు చున్నది. తరువాత కాలములో తిక్కనాదులును తమ తమ కృతులలో కావ్య శబ్దముతో బాటు ప్రబంధ శబ్దమును గూడ ప్రయోగించుట తరచు కానవచ్చును. కాని ప్రబంధశబ్దమంత కంటెను కడు ప్రాచీనచరిత్ర కలదిగా గోచరించుచున్నది.

[2]ప్రబంధ శబ్దప్రయోగములను పరిశీలింపగా క్రి. శ. 12 శతాబ్ది మధ్య మున అనగా నన్నెచోడుని కాలమున తొలుదొల్త నాంధ్రసాహిత్యమున కావ్యార్థ మున గనుపించు ప్రబంధ శబ్దముయొక్క పూర్వచరిత్రను కూడ డా॥ పల్లా దుర్గయ్యగారు తమ 'ప్రబంధ వాఙ్మయ వికాసము'లో విశదీకరించిరి. భోజుడు తన రామాయణమును చంపూ ప్రబంధమనెను. 12వ శతాబ్దిని గేయమగు గీత గోవింద కావ్యమునకును ప్రబంధ శబ్దము వర్తించెను. 11వ శతాబ్దిని శారదా తనయుడు తన నాట్యశాస్త్ర లక్షణమును ప్రబంధమనుట చూచితిమి. 12వ శతా బ్దిని విద్యామాధవుడు పార్వతీ రుక్మిణీ పరిణయ ద్వ్యర్థి కావ్యమును రచించి దానిని చిత్రప్రబంధమనెను.

మల్లినాథుడు రఘువంశమును ప్రబంధమనెను. శతకమును కొందరాలం కారికులు క్షుద్ర ప్రబంధములనిరి. ఏకైక శ్లోకమునుకూడ 'ప్రబంధ'మనుటకు అమరుకమే సాక్షి.

నన్నయ తిక్కనలకు నడుమనున్న నన్నెచోడ కవిరాజు శిఖామణి తన కుమారసంభవము అవతారికలో నొక్కయెడ మాత్రము ప్రబంధ శబ్దము పేర్కొనెను.

---

1. ప్రబంధ వాఙ్మయ వికాసము - డా॥ పల్లా దుర్గయ్యగారు.

2. ప్రబంధ వాఙ్మయ వికాసము - డా॥ పల్లా దుర్గయ్యగారు.

"జంగమ మల్లికార్జున నిసర్గ కవిత్వ వచీయ సూక్తియు
క్తింగొని యాడి, నక్కవితగేనములే కనురక్తయైన భా
షాంగన చక్కనేలిన మహాత్మ్యము లోకమునం బ్రసిద్ధిగా
భంగిగ విస్తరించెద ప్రబంధము సద్రసబంధురంబుగాన్"

(కు.సం.ప్ర.ఆ 48 పద్యం)

[1]ప్రబంధ శబ్దమును తొలుదొల్త నాంధ్రకావ్యమున ప్రయోగించిన వాడితడే. నన్నెచోడుడు ప్రబంధమనగా తిక్కన 'ప్రబంధ మండలి' యని పేర్కొనెను.

ప్రబంధ నిర్వచన మీవిధముగాగలదు. "పురాణాదుల లోని 'ఏకదేశకథ' ఇతివృత్తమై దివ్యాదివ్య నాయకమై తద్గుణ వంశ శంసనము ద్వారా కాంతాసమ్మితోపదేశయుతమై, సద్యః పర నిర్వృతి సాధారణ ఫలమును, మోక్షసిద్ధియు, పరమ ప్రయోజనమై భక్తి శృంగారముల (వీరము) లో నొకటి ప్రధానమై దృశ్యా దృశ్యకావ్య లక్షణ, సమ్మతమై యష్టాదశ వర్ణనాలంకృతముగ తత్సమ శైలిలో గాని యచ్చ తెలుగులోగాని చంపూపద్ధతిని నాతివిస్తృతముగ కూర్పబడిన మిశ్రబంధము ప్రబంధమనదగును."

శ్రీ కవిరాజశిఖామణియగు నన్నెచోడునికి, అతడు రచించిన కుమార సంభవ కావ్యమునకును, ఆంధ్రసాహిత్య లోకమున నొకవిధమగు ప్రత్యేక ప్రాముఖ్యము గలదు. నన్నెచోడుడు నన్నయకు సన్నిహితకాలముననే యున్నవారైనను వారి కవితలు రెండుభిన్నమార్గములలో నడిచినవి. ఒకరిది పురాణకవిత, మరొకరిది వస్తుకవిత ప్రబంధ కవితా మార్గము. ఇట్లు ఆంధ్రసాహిత్యమున కాదిలోనే రెండువిధములగు భిన్న శాఖలకంకురార్పణము జరిగినది. ఈ మార్పు దేశభేదమును బట్టి, అవలంబింపదలచిన సంప్రదాయములందలి భేదమునుబట్టి, మత భేదమును బట్టి జరిగినదని భావింపనగును.

---

1. ప్రబంధ వాఙ్మయ వికాసము – డా॥ పల్లా దుర్గయ్యగారు.

కుమారసంభవ కథయంతయు హరుని కామాతురునిగ జేయుటమీదనే యాధారపడియున్నది. తరువాత దక్షప్రజాపతి కూడ జపధ్యాన స్తోత్రాదుల బరమేశ్వరుని ప్రత్యక్షంబుసేసి "దేవాధీశ, సమస్తమున్ బడయ"- నీ దేవిన్ సర్వపదార్థమూర్తి నిఖిలస్త్రీరత్నమున్ నీకు నేనావహించితి, మీరు సన్మిథునచర్యాసక్తి మైకొన్న నాకి విశ్వోదయ కార్యసిద్ధియగు" నని ప్రార్థించినాడు.

ఇట్లు ప్రశంసనీయమగు కావ్యము రచింపబూని అష్టాదశవర్ణనలతోగూడి, దశప్రాణంబులు, నవరసములు, షట్త్రింశదలంకారములు వీనితోగూడి రమణీయంబగు కావ్యము రచించుట కలిముఖుండై నట్లు చెప్పుకొన్నాడు నన్నెచోడుడు. ఇవి యన్నియు నాతని కావ్యములో గూర్చినాడు.

"వనజలకేళీరవికళ
తనయోదయమంత్రగతి రతక్షితివరజాం
బునిధి మధు ఋతు పురోద్వా
హ, నగ, విరహ, దూత్యవర్ణనాష్టాదశముల్"

(కు. సం. పీఠిక పుట 29)

హిమవంతంబున పరమేశ్వరుడు తపోవనమునకు పుష్పాయుధుండై వచ్చిన సందర్భములో నీకవి వనవర్ణన విపులముగా చేసెను. ఇట్లే సందర్భానుసారముగా జలకేళి, పురవర్ణన, చంద్రోదయ, సూర్యోదయ, ఋతువర్ణన మున్నగున వన్ని ఈ కావ్యమున వర్ణించినాడు. విరహోపచార వర్ణనకు, మన్మథపూజా వర్ణనకు ఈతడే తెలుగున మొదటివాడు.

కావ్యము నవరసభరితమైయుండవలయు నందురు. అందుకు దగినట్లుగా నాయా సందర్భములయం దాయా రసముల నాతడు వర్ణించెను. శివపార్వతుల రతి సందర్భమున శృంగార రసమును వర్ణించినాడు. అట్లే శివుడు కపటవేషమును దాల్చి పార్వతితో శివుని గూర్చి పల్కిన పల్కులలోను, పార్వతితో జేసిన వాదనలోను కొంత హాస్యము కన్పట్టుచున్నది.

నృసింహపురాణము

ఈ కావ్యమును కవిత్రయములో మూఁడవవాఁడైన ఎఱ్ఱాప్రెగ్గడ రచించెను. నృసింహపురాణనామము సుప్రసిద్ధమైన లక్ష్మీనరసింహావతారమను పురాణకథ [1]. నృసింహపురాణ గద్యమున ఎఱ్ఱన శంభుదాసలక్షణాభిధేయుఁడవని చెప్పుకొనెను. అందే అవతారికలో తన తాత "ఎన్నికమై ప్రబంధ పరమేశుఁడనంగ నరణ్యపర్వ శేషోన్నయమాంధ్రభాష సుజనోత్సవమొప్పఁగ నిర్వహించి' తనని ప్రశంసించినట్లు చెప్పియుండెను. అతని తాతకు శ్రీమదహోబలేశ నృసింహుఁడు ప్రియదైవతము. ప్రబంధ పరమేశ్వరుఁడు ననునది ఎఱ్ఱనకు గల మరొక బిరుదము. ప్రబంధ పరమేశ్వరుఁడనగా ప్రబంధ రచనాపాటవమున పరాకాష్ఠనందిన వాఁడని భావము. ఎఱపోతసూరి ఎఱ్ఱన భావమున నావిర్భావమొంది అత "డెన్నికయై ప్రబంధపరమేశ్వరుఁడనంగ నరణ్యపర్వ శేషోన్నయ మంధ్రభాష సుజనోత్సవ మొప్పఁగ" నిర్వహించెనని పలుకుటయే కాక అతనికి "ప్రబంధ రచనా ప్రావీణ్యము సహజపరిణత సిద్ధ" మనియు ప్రశంసించి యుండెను. దీనినిబట్టి యతని కరణ్యపర్వశేషరచన వలననే ప్రబంధ పరమేశ్వరుఁడను ప్రతీతి కలిగెనని తెలియుచున్నది. ప్రబంధశబ్దము వినగనే తెలుగు వారికి పెద్దనాదులు రచించిన మనుచరిత్రాదులు స్ఫురణకు వచ్చును. తెలుగున ప్రబంధ శబ్దము వానియందే రూఢముగ వ్యవహృతమగుచున్నది. ఎఱ్ఱన కాలమునను అంతకుముందును ప్రబంధ శబ్దముకావ్యసామాన్యవాచకము. అప్పుడు కావ్యప్రబంధశబ్దములు సమానార్థకములు

నృసింహపురాణము. పురాణనామముతోడనే పూర్వమునుంకియు వ్యవహరింపబడుచున్నది. ఎఱ్ఱాప్రెగ్గడ వంశమునకు జెందిన చెదలవాడమల్లన విప్రనారాయణ చరిత్రమున ఎఱ్ఱన "నారసింహుని పురాణమొనర్చి హరిమెచ్చి నన్నునెన్నఁడు చూచినాఁడవనగ" నని దీనిని పురాణమనియే పేర్కొనెను. కాని పురాణమందుండవలసిన సర్గప్రతిసర్గాది పంచలక్షణములలో నిందొక్కటియు గానరాదు. ఎఱ్ఱన కూడ ఆశ్వాసాంత గద్యలందు దీనిని "లక్ష్మీ నరసింహావతారంబను పురాణకథ" యని పేర్కొనెను అట్లే షష్ఠ్యంతములయనంతరమతఁడు "ఏను విన్నపంబు సేయంగల లక్ష్మీ నరసింహావతారంబను పురాణ కథకు ప్రారంభంబెట్టిదనిన"

1 నృసింహపురాణము-పీఠిక-ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు.

నని దీనిని పురాణ కథయనియే వాక్రుచ్చెను. తాత ఎఱ్ఱనతో "శ్రీమదహోబల శైలేశ నరసింహుడు నాప్రియదైవతంబు మత్స్వామియు, తదీయతీర్థ మహిమం బును దన్మహితావతారమున్ నీమధురోక్తిగుంభన మనీషులు మెచ్చగ బ్రస్తుతింపు" మని యిందు అహోబల నరసింహతీర్థ మహిమను, తన్మహితావతారమును వర్ణింపు మని ఆదేశించెను. ఎఱ్ఱన తాత యాదేశమును ఈశ్వరానుశాసనముగా గ్రహించి కావ్యము రచింప నిశ్చయించి "ఈ నిశ్చయంబిట్టిది గావున బ్రహ్మాండాది పురా ణోక్తంబయిన 'శ్రీనరసింహావతారం'బను పురాణంబు తెనుంగు బాస బ్రకటింప వలయు" నని యుపక్రమించెను. ఇచట పురాణ శబ్దమునకు పురాణకథ యనియే యర్థము.

లోకములో దీనికి శ్రీలక్ష్మీనరసింహ పురాణమనియు, అహోబలక్షేత్ర మాహాత్మ్య మనియు ప్రతీతియున్నది. లక్ష్మీ నరసింహుల యవతార వృత్తాంత మందు చెప్పబడుట నిజమే. పంచమాశ్వాసమున అహోబల క్షేత్రమాహాత్మ్యము కూడ సంగ్రహముగా తెలుపబడియున్నది. ఇతర క్షేత్రమాహాత్మ్యములలోవలె క్షేత్రములేర్పడిన విధము, అందలి క్షేత్రతీర్థదేవతా స్వరూప గుణ మాహాత్మ్యములు అందు మరణించి ముక్తినందిన భక్తులకథలు వివరింపబడలేదు.

ఇంకనూ ఎఱ్ఱన నృసింహపురాణములో కొన్నిచోట్ల ప్రబంధమనియు, మహా ప్రబంధ మనియు పేర్కొనెను. "ఇట్లు మహాప్రబంధ కల్పనాకుతూహలాయత్తం బగు చిత్తంబుతో నొక్కనాడు" ఒనరింతు బ్రబంధము సదయ నృసింహావతార సంస్తవ సరణిన్ "విష్ణు ధర్మ ప్రశంసా పవిత్రమైన యస్మదీయప్రబంధ సామగ్రివలన (1-26) "అమ్మహా ప్రబంధమునకు (1-27)" మున్నగున విందుకు తార్కాణము. ఇచట ప్రబంధ శబ్దమునకు ప్రకృష్టమైన బంధముకల కావ్యమను సామాన్యార్థమేకాని ధీరోదాత్త నాయకము, శృంగార రసప్రధానము, పంచమాశ్వాసపరిమితము, అష్టాదశ వర్ణనా శోభితము, అలంకారిక రచనావిలసి తము, వస్త్వైక్యభాసితమునగు వసుచరిత్రవంటి కావ్యమను విశేషార్థములేదు. పై లక్షణములలో నొండు రెండు తప్ప మిగిలినవన్నియు నృసింహపురాణమున నుండుట నిజమేయైనను తరువాతి రెండు శతాబ్దులకు రూఢమైన ప్రత్యేకార్థమున

ఎఱ్ఱన యందు ప్రబంధ శబ్దమును వాడెననుట కవకాశములేదు.[1] నృసింహపురాణము వర్ణనాప్రధానమైన కావ్యము. మూడు నాలుగు తక్కువగా లాక్షణికులు తెల్పిన పదునెనిమిది వర్ణనములను యిందు సందర్భానుసారముగా ప్రవేశపెట్టబడినవి. ఈ కావ్యము ప్రబంధముగా భావింపబడుటకి వర్ణనాబాహుళ్య మొకకారణము.

నృసింహపురాణము నందలి ప్రధానములైన వర్ణనము లివి : 1. క్షీరాబ్ధి 2. శ్వేతద్వీపము 3. వైకుంఠపురము 4. శరత్తు 5. బ్రాహ్మణమహిమ 6. తపశ్చర్య 7. వసంతము 8. అచ్చరల విభ్రమ వ్యాపారములు 9. హిరణ్య కశిపుని పరాక్రమ విజృంభణము 10. అంగవర్ణనము 11. నిదాఘము 12. సాయంకాలము 13. రాత్రి 14. చంద్రోదయము, వెన్నెల 15. మధుపానము 16. గర్భవతి 17. తత్త్వోపదేశము 18. నరసింహావిర్భావము 19. యుద్ధము, సంహారము 20. క్షేత్రతీర్థమాహాత్మ్యము.

నృసింహపురాణము[2] చంపూకావ్యము ఇందెడనెడ పద్యములకు నడుమ వచనములు వ్రాయబడినవి. ఎఱ్ఱన వచనములను సాధారణముగా కథాకథనము నకును, వర్ణనములకును, నీరసవిషయ వివరణమునకును, వినియోగించుచుండును. నృసింహపురాణమునందలి వచనభాగము లన్నిటిలో నాలుగు వచనములు ప్రత్యేకముగా పేర్కొనదగియున్నవి.

1. వైకుంఠపుర వర్ణన వచనము
2. శరదృతు వర్ణన వచనము
3. అంగ వర్ణన వచనము
4. స్తంభోద్భవ వచనము

వైకుంఠపుర వర్ణన వచనము శ్లేషవిరోధాభాసాలంకారములతో గూడి బాణుని కాదంబరి యందలి వచనమును బోలియున్నది. శరదృతు వర్ణన వచనము శ్రీహరి రూప శోభకును, శరత్ప్రకృతి రామణీయకమునకును సాదృశ్యమును

1 నృసింహపురాణము-పీఠిక- ఆచార్య డా॥ దివాకర్ల వెంకటావధానిగారు.
2. నృసింహపురాణము-పీఠిక- ఆచార్య డా॥ దివాకర్ల వెంకటావధానిగారు.

సంఘటించుచు ప్రౌఢమును బాంధురమునై యత్యంత మనోహరముగా నున్నది. అంగ వర్ణన మీ కావ్య మందలి వచనములలోకెల్ల దీర్ఘమైనది. ఇది శ్రీహరి చరణముల నుండి శిరస్సు వరకు గల యవయవముల సౌందర్యము వర్ణశబ్దాలంకార పూరితముగా వర్ణించుచున్నది. దీనికి జివర గాదంబరియందువలె విరోధాభాసము లున్నవి. ఇది శ్రీమన్నారాయణుని దివ్యసుందర రూపమును విశదముగా వర్ణించుచు బఠితల యెదుట సాక్షాత్కరింపజేయుచున్నది. ఇందలి వర్ణనలు సరసములు, భావములు గంభీరములు, రచన అత్యంత ప్రౌఢము. స్తంభోద్భవ వచన మాద్యంత మనుప్రాసాలంకారమయమై, సమాసభరిత మగుటచే నోజోగుణ సమగ్రమై ద్విత్వమహాప్రాణాక్షర ఘటనముచే నరసింహుని యుగ్రతను చక్కగా ధ్వనింపజేయుచున్నది. ఈ వచనములు రచించుటలో ఎఱ్ఱన చూపిన నేర్పు ప్రశంసాపాత్రమైయున్నది.

ఎఱ్ఱాప్రెగ్గడకు ముందు బయల్దేరిన కావ్యములందు ఒక్క నన్నెచోడుని కుమార సంభవమును వదలినచో కేవల మొకే కథను చెప్పవలెనను దృష్టి యా కావ్యకర్తల కున్నట్లు కాన్పించదు. అనగా కావ్యమున వస్త్వైక్యము లేదు. తిక్కన వ్రాసిన నిర్వచనోత్తర రామాయణమున వస్త్వైక్యము కలదన్నను, అందు పెక్కు పరోక్షమైన ఉపాఖ్యానము లున్నవి. భారతాదులందును ఉపాఖ్యానము లధికములే

కాని నృసింహపురాణము మాత్రము కేవలము నృసింహావతార కథను దృష్టియందుంచుకొనియే నిర్మాణము చేయబడియున్నది. ప్రధాన కథకు ప్రత్యక్ష సంబంధము లేని ఒక ఘట్టము కూడ నిందు వర్ణింపబడలేదు ఇట్టి పద్ధతి ఆంధ్ర సాహిత్యమున నపూర్వమును, నూతనమును అనవచ్చియున్నది.

వర్ణనా ప్రధానములైన కావ్యములను, ఎఱ్ఱాప్రెగ్గడ కవికి ముందు తెలుగు సాహిత్యమున లేవు. నన్నయాదులు వర్ణనలు చేయలేదని చెప్ప వీలు లేదు. కాని వారి వర్ణనలు క్లుప్తముగా నున్నవి. అనన్య కల్పనా ప్రతిభతో గూడి అలంకారాన్వితమై సుదీర్ఘములైన వర్ణనములను కావ్యములందు ప్రవేశపెట్టిన వా డెఱ్ఱాప్రెగ్గడ యనియే చెప్పనగును. ఇరువది నాలుగు గద్యపద్యములందు వర్ణించ బడిన శ్వేతద్వీప వర్ణన మిందుకు చక్కని ఉదాహరణము.

స్వతంత్రమైన కథాసంవిధానము కూడ నీతని నూతన కల్పనాప్రతిభను చాటుచున్నది. ఇదియు ప్రబంధమున ముఖ్యముగనే భావించుటకు తగియున్నది. అన్నిటికన్నను ముఖ్యమైనది ఆంధ్ర వచన వాఙ్మయ వికాసము నందు పేర్కొన దగినది ఎఱ్ఱన రచించిన వచన విశేషము. పైని పేర్కొనిన విషయము నందు స్వతంత్రముగా ప్రవర్తించిన ఎఱ్ఱాప్రెగ్గడ తాను రచించిన వచనమునందును స్వతంత్రప్రతిపత్తి నవలంబించి, ఆంధ్ర వచన వాఙ్మయ వికాసమునకు దోహదకారియైనాడు.

శృంగారనైషధము

శ్రీనాథుని యుగము లేక కావ్య యుగములో రచింపబడిన నీ కావ్యములో కూడ ప్రబంధరీతి వర్ణనలు కానవచ్చుచున్నవి. శ్రీనాథు డీకావ్యమును నిండు జవ్వనంబున రచించినట్లు పేర్కొనినాడు. శృంగారనైషధ కావ్య కృత్యాదిలో నిష్టదేవతా స్తుతి, సుకవిస్తుత్యనంతరము నిట్లు కలదు. "నవరస భావానుబంధ బంధురముగా ప్రబంధ ప్రారంభమునకుందగిన పుణ్యశ్లోక పురాతన మహారాజ చరిత్రం బెయ్యదియొకో యని వితర్కించుచున్న సమయంబున కృతిపతియగు మామిడి సింగయ గోష్ఠియందు ప్రసంగంబున శ్రీనాథకవితో "నాకు నొక్క ప్రబంధంబు పుణ్యశ్లోక పురాతన రాజర్షి చరితానుబంధ బంధురంబుగా రచియింపు"మనెను. మఱియు భట్టహర్షుడు సంస్కృత భాషయందు వాక్పాటవమున రచించిన నైషధ సత్కావ్య మాంధ్రభాష నొనరింపుమనియు చెప్పెను. కథా ప్రారంభమునకు బూర్వమున షష్ఠ్యంత పద్యముల యనంతరమున "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన యమ్మహా ప్రబంధమ్మునకుం గథానాయకుండు" — "శ్రీనాథ ప్రణీతంబైన శృంగార నైషధ కావ్యంబునందు" అనియే కలదు. గ్రంథాంతమున మాత్రము ప్రబంధోపసంహార దీర్ఘవచనంబు నందు భట్టహర్ష మహాకవి యొనర్చిన "నైషధశృంగార కావ్యం" బనియు, మాతృకానుసారంబున జెప్పబడిన యీ "భాషానైషధ కావ్యం" బనియు గలదు. తర్వాతి పద్యమున, భట్టహర్షుండు వాక్ప్రౌఢి మెఱయ జెప్పిన నైషధ శృంగార కావ్యంబు తెలియ జెప్పితి నాంధ్ర భాష దేశ భాష అని శ్రీనాథుడు వ్రాసెను. పై ప్రయోగములను పరిశీలించుట వలన హర్షనైషధమును గూర్చి చెప్పునప్పుడు

'నైషధ కావ్య'మనియు 'నైషధ శృంగార కావ్య'మనియు తాను రచింపదలచిన యాంధ్ర నైషధమును గూర్చి చెప్పునపుడు 'ప్రబంధ' మనియు శ్రీనాథుడు చెప్పినాడు.[1] గద్యలో 'నైషధ కావ్య'మనియేచెప్పినను తానొక్క ప్రబంధమునకు దగిన నాయకు డెవ్వరా ? యని వితర్కించుచున్నట్లును కృతిపతి "నాకు నొక్క ప్రబంధంబు రచింపు" మనుటయు, మఱియు నా యొనర్పంబూనిన యమ్మహా ప్రబంధము నైషధ కావ్యమైన ప్రబంధమైనను, తన యాంధ్ర శృంగారనైషధము మాత్రము మహాప్రబంధమనుటయే శ్రీనాథుని యభిప్రాయమైనట్లు స్పష్టము.

"చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు" అనుదానినిబట్టి చూచిన శ్రీనాథుడు చిఱుత కూకటినాడికే ప్రబంధ రచనమున కారంభించెనని తెలియుచున్నది. మూలార్థము చెడక యుండునట్లు ప్రబంధరీతి వర్ణనలతో కావ్యమునకు శోభ చేకూర్చినాడు. కొన్నిచోట్ల రసపుష్టికై మూలములో లేని పదములు పెక్కింటిని చేర్చుచు వచ్చెను. ఉదాహరణ కొక శ్లోకము పరిశీలింతము.

మూలము "సరసీః పరిశీలితుం మయా
గమి కర్మీకృత నైకనీవృతా
తిథిత్వమ నాయి సాదృశః
సద సత్సంశయ గోచరోదరి" (2.40)

దీనికి తెలుగున ఈ విధముగా గలదు.

1) మృదు రీతిం బ్రతిభాసరంబు గమికర్మీభూత నానా నదీ
నదికాంతార పురీ శిలోచ్చయుఁడనై నైదురాద్భుత శ్రీజిత
త్రిదివం బైన విదర్భ దేశమున నారీ రత్నముం గాంచితిన్
సదసత్సంశయ గోచరోదరి శరత్సంపూర్ణ చంద్రాననన్

(శృం. నై. ద్వి. ఆ 20)

2) కమలేందీ వరషండమండి తలసత్కాసార తీరంబునన్
గమి కర్మీకృత నైక నీవృతుడనై కంటిన్విదర్భంబునన్

---

1. శృంగార నైషధము - బులుసు వెంకటరమణయ్యగారు.

రమణిం బల్లవ పాణిపద్మ నయనన్ రాకేందు బింబాననన్
సమపీన స్తని, నస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరిన్.

(శృం. నై. ద్వి. ఆ 21)

ఈ రెండు పద్యము లాతని స్వతంత్ర రచనకు తార్కాణము లనదగునవి.

ఆంధ్ర వాఙ్మయము సంస్కృతాను వాదముతోడనే యారంభించెను. కవి త్రయము వారు పంచమ వేదమునైన మహాభారతమును; మారన కేతనలు మార్కండేయ పురాణ దశకుమార చరిత్రమును, భాస్కరాదులు శ్రీమద్రామాయణమును ఆంధ్రీకరించిరి. ధర్మనీతి తత్త్వ ప్రధానములైన పురాణములను కాక, రస వర్ణన ప్రధానములైన సంస్కృత కావ్యముల ఆంధ్రీకరణమునకు శ్రీకారముచుట్టిన వాడు శ్రీనాథుడే.

నైషధము వర్ణనా ప్రధానమైన మహాకావ్యము. హంస నలునిముందు దమయంతి కేశపాశములనుండి మీగాళ్ళవరకును సర్వావయవములను సంగ్రహముగా వర్ణించెను. నలుడు దూతగా నేగినప్పుడు దమయంతిని జూచి "చికురాది యుగ్మపదనఖాంతముగా" నామె సౌందర్యమును దనివితీర వర్ణించెను. ఈ వర్ణన మాలంకారికమై తరువాతి యాంధ్ర ప్రబంధములందలి నాయికా వర్ణనమున కొజ్జబంతి యైనది. నలుడు శివపూజ యొనర్చిన పిమ్మట హరిపూజ కావించి యాదేవుని దశావతారములను వర్ణించెను.

కావ్యాంతమున సంధ్యా నక్షత్రాంధకార చంద్రవర్ణన గలదు. ఇది యుత్ప్రేక్షాతిశయోక్త్యలంకారములతో కూడి కవి యపూర్వమైన భావనా శక్తిని చాటుచున్నది. చంద్రునియందలి మచ్చను కిరణములను, చంద్రికను అత డుత్ప్రేక్షించిన తెఱంగద్భుతముగా నున్నది. శ్రీనాథుని రచనలన్నింటిలో ప్రబంధ రచనకు విశేష దోహదము చేసినది శృంగార నైషధము.

ఇంతవరకు పురాణ కావ్యములలో, అనువాద కావ్యములలో ప్రబంధచ్ఛాయ లెట్లునది పరిశీలించితిని. ఇక రాయలయుగములో ప్రబంధమెట్లు ఆవిర్భవించినది తెలిసికొనదగును. 13వ శతాబ్దిలో ఆంధ్రకవిత్వమునకు స్వర్ణయుగమనదగిన కాలము ప్రారంభమైనది. ఇంతవరకు నాంధ్ర కవులందఱును కూడి సంస్కృత

భాషయందలి పురాణములను తెలుగులోనికి పరివర్తనము చేయుచుండిరి. భగవద్గీ లలే వారి కృతులయందలి కథాంశములు. శైవకవులు తమ మత ప్రచారమునకై వివిధ గ్రంథములను విరచించుచుండిరి. కాని పదునారవ శతాబ్దియందు కావ్య ప్రపంచమున నొక నూతనోద్యమము ప్రబలెను. అది ప్రబంధ రచన. ప్రబంధము కొంతవరకు స్వతంత్ర కావ్యము. ఇది శృంగార రస ప్రధానము. ఇందష్టాదశ వర్ణనము లుండవలయును. పురాణములయందలి ప్రసిద్ధ పురుషుల జీవితాంశములను గాక స్వకపోల కల్పితములగు కథలను, లేక ఈ రెంటిని మేళవించి కవులు కావ్య రచనమునకు బూనిరి. ఇందు కవి ఊహాశక్తికిని, పాండిత్య ప్రకటనమునకును, భాషా వైచిత్ర్య ప్రదర్శనమునకును కూడ మంచి అవకాశము లభించుచుండెడిది.

విజయనగర రాజుల కాలమందు, ముఖ్యముగా శ్రీకృష్ణ దేవరాయల యుగము నుండి రక్షస తంగడి సంగ్రామము వరకును ఈ సామ్రాజ్య మఖండైశ్వర్యము ననుభవించెను. తత్ఫలితముగ ప్రజలలో భోగపరాయణత్వము హెచ్చెను కావుననే రాజులును, వారి సామంతులు మున్నగు వారును శృంగారరస ప్రధానమైన ప్రబంధ రచనమును ప్రోత్సహించుట జరిగెను. రాయలు తనకు లభించెడి విరామ కాలమును చాలవరకు కవి పండిత గోష్ఠియందు గడపుచుండెను. [1] దండయాత్రలకు పోవునపుడు, రాజ్యపర్యటనము కావించునపుడును కూడా ఈతడు పండితులను, కవులను తనతో తీసికొనిపోవుచుండెడివాడు. ఈతడు వారి కగ్రహారము లిచ్చియు, తదితర విధములుగను గౌరవించుచుండెను. ఈతనికి తెనుగుభాష అభిమాన భాష. రాయలు స్వయముగా కవియై సంస్కృతములో తెలుగులో అనేక గ్రంథములు రచించినాడు. మదాలస చరిత్ర రాయల తొలి కృతి. సత్యవధూ ప్రేరణము, సంకలనజ్ఞానము, జ్ఞానచింతామణి, రసమంజరి అనునవి రాయల సంస్కృత కృతులు. ఇవి నేడు లభించుటలేదు. కాని "ఆముక్త మాల్యద" ఒకటియే తెలుగున రచించిన కావ్యము. ఇది లభ్యమగుచున్నది. ఇది వైష్ణవ మత ప్రబోధకమగు కావ్యము. రాయలు వైష్ణవమత అభిమానియైనప్పటికిని తన ఆస్థానములో ఇతర మతస్థులందరను సమానముగా గౌరవించిన ఉదార హృదయుడు అష్టదిగ్గజ కవులు వ్రాసిన మత గ్రంథములే ఇందులకు తార్కాణములు.

---

1) ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

విజయనగర సమీపముననున్న శ్రీకాకుళ క్షేత్రమునందలి ఆంధ్ర విష్ణు దేవుని సందర్శించిన సందర్భమునందే రాయలకు [1] ఆముక్తమాల్యద వ్రాయుటకు భగవదాదేశమయ్యెను. ఆముక్తమాల్యద రాయల రాజనీతిని తెల్పు గ్రంథము. రచనలోనూ, రససృష్టిలోను వర్ణనారమణీయతలోను, కథలోనూ, పాత్రచిత్రణములోను ఆముక్తమాల్యదకు ప్రత్యేకత గలదు. కృష్ణరాయనిది సునిశితమైన దృష్టి. సున్నితమైన కవితా సృష్టి. వ్యర్థ పదములు పరిహరించుట వలన పద్యములలో కలుగు బిగింపు రాయల రచన నొకింత అభేద్యము చేసినను ప్రతి పద్యములోను ప్రతి పద ప్రయోగములో జాలువారు రస వాహిని పాఠకులను ఆనంద పరవశులను గావించినది. బ్రహ్మానందసదృశ్యమని చెప్పు అలౌకికస్థితికి చేర్చును.

కృష్ణరాయలకు ఆంధ్ర విష్ణువు కలలో కనుపించెను. సంస్కృతములో అనేక కావ్యములు రచించిన రాయలను ఆంధ్రభాషలో కావ్యరచనచేసి తనకు అంకితము చేయవలసినదిగా కోరెనట. "దేశభాషలందు తెలుగులెస్స" కనుక కలకండ వంటి తెలుగుభాషయందే కృతి రచింపుమని చెప్పెను. ఆముక్తమాల్యద యందు కథకన్న వర్ణనలే ఎక్కువ. [2]రాయల వర్ణనలో సామాన్యమైన విషయములు, సామాన్య జనుల జీవిత కాలములో కానవచ్చు చిన్న చిన్న సంగతులు చోటుచేసికొనెను. వర్షకాలములో "గగనము నీరు బుగ్గ కెనగా జడి పట్టినపుడు" తడిసిన కట్టెలతో కళ్లలోనికి పొగపోవునటులు కష్టపడకుండా విష్ణుచిత్తుని భార్య నారికేళపు బొరియలు తిగిలించి వంటచేసెడిదన్న సూక్ష్మమైన పరిశీలన రాయల రచనలో కన్పించును. రెక్కలలో తలదూర్చుకొని బాతులు పంట పొలముల ప్రక్క కాలువలతో పడుకొని ఉండుట రాయలు తప్ప మరెవరును చూడలేదు. అట్లు పడుకున్న బాతులను చూసి బ్రాహ్మణులు విడిచిపెట్టిన అంగవస్త్రములని కాపలాదారులు భయపడినారని చెప్పు విచిత్రమైన ఊహ రాయలకు కలిగినట్లు ఈ రచనలో కన్పించుచున్నది.

---

1) ప్రబంధ వాఙ్మయము - డా॥ యశోదారెడ్డి.

2) ఆముక్తమాల్యద (వ్యాసము) ప్రబంధ వాఙ్మయము - డా॥ యశోదారెడ్డి.
(ప్రపంచ మహాసభల ప్రచురణ)

గోదాదేవి యౌవన వర్ణనలో కవులందరివలె అంగాంగ వర్ణన పరిమితము కాకుండ తెలుగు వారి సంప్రదాయములు కనుపించు వర్ణనలు రాయలు చేసెను. అసాధారణ పాండితీ వైభవముచే రచింపబడిన ఆముక్తమాల్యదయందు గ్రంధ గ్రంధుల వంటి నానానేక శాస్త్ర రహస్యములు సామాన్యుడు దరిదాపులకు కూడ ప్రవేశించుటకు వీలులేని జటిల సమాసములు, ఊహాతీతమైన వర్ణ వైచిత్ర్యము లున్నను శ్రీకృష్ణదేవరాయలా గ్రంథము నందచటచట అతి సామాన్యము, సహజ సుందరములైన వర్ణనములను ప్రవేశపెట్టి పాఠకులకు ఆప్యాయన మొనరించెను. శరదృతు వర్ణనమున కుదాహరణము.

"గగన లక్ష్మిని కోరు నక్షత్రమాలి
కలుబియన్నది జలముల గడుగ బిసుక
నెఱయు కుంకుడు పండుల నుఱువులనగ
జలపలని పొందు రాంజద పంకు లమరె"

(ఆముక్తమాల్యద. చ.ఆ 167)

రాయల ఆస్థానమున "అష్టదిగ్గజముల"ని పేరు మోసిన ఆంధ్ర కవి శిఖామణులుండినట్లు ప్రతీతి. రాయలు వారిని పోషించి సాహితీ గోష్ఠి నెరపెడివాడు. రాయల సభామంటపమునకు 'భువన విజయ' మను పేరుగలదు.

అష్టదిగ్గజములలో ప్రబంధరచనాపరమేష్ఠి యనదగిన అల్లసాని పెద్దన వీరిలో అగ్రగణ్యుడు. రాయలీతనిని 'ఆంధ్ర కవితాపితామహుడని' పిలిచి మిక్కిలి గౌరవించెను. పెద్దన విరచితమైన మనుచరిత్రమునకు కృష్ణరాయలే కృతి కర్త. మను చరిత్రమొక అపూర్వ శృంగార ప్రబంధము. దీనిని నేటికిని పండిత పామరులు చదివి ఆనందించుచుండిరి.

కథానాయకుడైన ప్రవరుని గుణశీలములు, అతడు విచిత్రమైన పరిస్థితులలో వరూధినిని కలిసికొనుట, అతని ఉదాత్త ప్రవర్తన, మాయాప్రవరుడు వరూధిని సమాగమము మను చరిత్రలో రసవంతమైన ఘట్టములు. ఇదికాక మనోరమ వృత్తాంతము, ఇందీవరాక్షుని కథ, స్వరోచి వీర శృంగార వృత్తాంతములు మను చరిత్ర కథకు వన్నెతెచ్చుచున్నవి. ఇంత చక్కని కథను సుందర ప్రబంధముగా

తీర్చిదిద్దుట వలననే పెద్దనగారు 'ఆంధ్రకవితా పితామహుడు' అని ప్రఖ్యాతి వహించినారు.

నంది తిమ్మన 'పారిజాతాపహరణమను' లలిత శృంగార ప్రబంధమును రచించి రాయలంకంకితమిచ్చెను. తిమ్మన రచించిన కావ్యము పారిజాతాపహరణ మొక్కటే ఇప్పుడు లభ్యమగుచున్నది ఈతడు 'వాణీవిలాసమను' నింకొక కావ్యమును కూడ వ్రాసినట్లు కూచిమంచి వేంకటరాయకవి రచించిన కవి మనోరంజని యను పేరు గల అప్రకటీయ విమర్శ వలన తెలియుచున్నది. అది ఇప్పుడు లభ్యమగుట లేదు. అందుచేత నిదియెంత వరకు సత్యమో చెప్పజాలము.[1]

కృష్ణుడు నరకాసురుని జయించి పదియాఱువేవురు కన్యలను నారదుని పంపున వివాహమాడెను. అతడందఱిని సమముగా చూచుచుండినను రుక్మిణీ సత్యభామలను మన్నించి వారి కధికముగా చనువునిచ్చుచుండెను. ఒకప్పుడు రుక్మిణి యింట శ్రీకృష్ణుడు జూదమాడుచు వినోదించుచుండగా నారదుడు పారిజాత పుష్పమును తెచ్చి కృష్ణునకీయగా నతడు దానిని రుక్మిణికిచ్చుట, ఈ వృత్తాంతము తెలియగా సత్యభామ అసూయను జెందుట, కృష్ణుడు వచ్చి ఆమెను అనునయించుటకు ప్రయత్నించుచు 'తత్పదద్వయీ పాటలకాంతి మౌళి మణిపంక్తికి వన్నియపెట్ట' నామెకు మ్రొక్కెను. సత్యభామ నాతని శిరమును వామ పాదముతో దొంగ ద్రోచెను. అంత కృష్ణు డామెను కౌగిట చేర్చుకొని బుజ్జగించి దేవతాకేళి వనము చొచ్చి, ఇంద్రుని జయించి పారిజాతమును తెచ్చి ఆమె కేళివనమున నాటించుట" ఈ కథలోని ముఖ్య వృత్తాంతము.

పారిజాతాపహరణమందలి కథావస్తువల్పమేయైనను దానిని సంఘటించుటలో తిమ్మన యపారమైన కౌశలము ప్రదర్శించెను. ప్రథమాశ్వాసము నందలి కథ పారిజాతపుష్పమును రుక్మిణికిచ్చిన పిమ్మట సత్యసముదంచిత కాంచన సౌధ సీమకరుగు హరి అరదము వలె చాల వేగముగా సాగినది. తిమ్మన కావ్యము నారంభించుటయే "హరి నరకాసురం గెలిచి" యని వేరుగా కథోప క్రమముతో నారంభించినారు. వర్ణనలకీ యాశ్వాసమున ప్రాముఖ్యతలేక కథ

---

1. కావ్యలహరి - వ్యాస సంపుటి - ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు.

వేగముగా సాగినది. ఇంక మిగిలిన రెండు, మూడు, నాలుగు ఆశ్వాసములను వర్ణనలతో నింపెను కృష్ణుని మాధ్యాహ్నిక స్నానము, భోజనము, సాయంకాలము, అంధకారము, నక్షత్రములు, చంద్రోదయము, వెన్నెల, చంద్రికా విహారము, మేల్కొల్పులు, మేరుపర్వతము, స్వర్గ స్త్రీలు కృష్ణుని దర్శించుట, దశావతారములు, వైజయంతము, నందనవనము, పారిజాతము, పుష్పాపచయము, సూర్యాస్తమయము, యుద్ధము, మధ్యాహ్నము, జలకేళి మున్నగువాని వర్ణనము లందు ముఖ్యములైనవి. ఈ వర్ణనలు కావించునప్పుడు తిమ్మన రాయల యంతఃపురము నందలి యాచారములను, దైనిక కృత్యములను, అందలి యుద్యానవనములు భవనములు మున్నగు వాని సౌందర్యమును చక్కగా విశదీకరించెను. కావ్యమున నష్టాదశ వర్ణములుండవలయునను లాక్షణికుల నియమ మిందు పాటింపబడినది. నాటకీయత కూడ నీప్రబంధములో కానవచ్చుచున్నది.

ఇక అష్టదిగ్గజములలో రామరాజ భూషణుడు కూడ నుండినట్లు ప్రతీతి.[1] ఈతడు రచించిన గ్రంథములు మూడు లభ్యమగుచున్నవి. అవి 1. కావ్యాలంకార సంగ్రహము, 2. వసు చరిత్రము 3. హరిశ్చంద్రనలోపాఖ్యానము. కావ్యాలంకార సంగ్రహము విద్యానాధుని ప్రతాపరుద్రీయము ననుసరించి వ్రాయబడిన లక్షణ గ్రంథము. వసు చరిత్రము శ్లేష ధ్వని వైభవోపేతమైన శృంగార ప్రబంధము. హరిశ్చంద్ర నలోపాఖ్యానము హరిశ్చంద్ర నలమహారాజుల చరిత్రమును రెండింటిని శ్లేషగా వర్ణించు ద్వ్యర్థి కావ్యము. ఈ మూడు గ్రంథములను మూడు భిన్న మార్గములకు జెంది భట్టుమూర్తి ప్రతిభా పాండిత్యములను చక్కగా వ్యక్తము చేయుచున్నవి. కావ్యాలంకార సంగ్రహము రామరాయల మేనల్లుడైన తాతిగంటి నరసరాజునకును, హరిశ్చంద్రనలోపాఖ్యానము శ్రీరామునికిని, వసు చరిత్రమును తిరుమల రాయలకు అంకిత మొసంగెను. 'వసు చరిత్రము' ఆంధ్ర ప్రబంధ సంతతికి తలమానికమగు కావ్యముగా పేర్కొనబడుచున్నది. ఇది కూడా వర్ణనా ప్రాధాన్యము గల కావ్యమే. ప్రబంధ కవులు స్వీకరించిన కథా వస్తువును గూర్చి వారి భావముల

---

1. ఈ విషయము "రాయల ఆస్థానమునలంకరించిన అష్టదిగ్గజములు" అను ప్రకరణములో ప్రమాణముగా నిరూపించి యుంటిని.

నెఱుంగుటకు భట్టుమూర్తి తన వసుచరిత్రలోని పద్యము కొంత ఉపకరించుచున్నది. ఈ లక్షణము కథా వస్తువునకు మాత్రమే పరిమితము.

కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్యసత్కథల్
హావిరి పుట్టు రత్నము లవారిత సత్కవి కల్పనావిభూ
షావహ పూర్వవృత్తములు సానలు దీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్.

(వసుచరిత్ర 1-19)

తిరుమలరాయలు సప్త సంతానములలో కృతియే శ్రేష్ఠమని పైవిధముగా ప్రశంసించి భట్టుమూర్తిని తాంబూల జాంబూనదాంబరాగ్రహారాదులతో సత్కరించెను. కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నములనియు, పురాణ కథలు పరిష్కృతములైన పుట్టురత్నములనియు, కల్పనా మిశ్రితములైన పూర్వకథలు సానపెట్టిన జాతిరత్నములనియు నతని యభిప్రాయము.

వసుచరిత్రయందలి కథ మిక్కిలి పరిమితమైనది. నైమిశారణ్యమున శుకశౌనకాది మహర్షులు సౌతిని దివ్యచిహ్నధరుడై మహీమండలమేలిన రాజేంద్రుని కథ తెల్పుమని యడుగ నతడు వారికి వసుచరిత్రమును దెల్పెను. అధిష్ఠానపురమున వసువను పేరుగల మహారాజేలుచుండెను. అతడొకనాడు హిమవత్పర్వత పుత్రుడైన కోలాహల నగాధీశుడు శుక్తిమతి నదిలో వ్రాలి దాని ప్రవాహమును నిరోధింపగా దానిని కాలి బొటనవ్రేలితో గవ్వనువలె నెగమీటి దీనమై పడియున్న యా కొండను దన కేళీ శైలముగా స్వీకరించెను. పర్వతమును శాసించిన యాతని పరాక్రమమునకు మెచ్చి ఇంద్రుడాతనితో చెలిమి పొందెను. ఇట్లు సుభిక్షముగా రాజ్యమేలుచుండగా వసంత వైభవము గాంచుటకు రమ్మని ఉద్యానపాలురాతని నాహ్వానించిరి. ఉద్యానవన వైభవము నానందముగా తిలకించు సమయమున కిన్నర ద్వయ మాతని కొక శుభమాసన్నమైనదని తెల్పి కోలాహర పర్వతాగ్రమున కరిగెను. తదాలోకన ప్రీతి వలన రాజునకు కోలాహర పర్వతమున లీలావిహారము కావింపవలెనను ఉత్సాహ ముదయించగా నర్మసచివుడు రాజున కాకసమువందలి సెల్లమబ్బులో గనిపించు వృక్షములు జూపి యవి నాకభూజములని పల్కెను రాజది తమ

కేళిపర్వతమనియు నా చెట్లందలి వృక్షములనియు చెప్పి తదద్రి సంపద తిలకించుటకై నర్మసచివునితో నరగగా నర్మసఖుడా పర్వతమందలి విశేషము లన్నియు రాజునకు వర్ణించి చెప్పెను.

రాజు విశ్రమించు సమయమున మాధుర్యమగు సంగీతము వినవచ్చెను. నర్మసఖుడా సంగీతము వీణానాదమని తెల్పి రాజాజ్ఞచే ఒక యతి వేషమున నచటి కేగుటయు, నచట "గంధ గజయాన గీత ప్రబంధకలన నంరి యతి వియ్యమై వచ్చు నరిది మగువలార కనుగొంటిరే" యను చెలి వాక్యమొకటి వినరాగా, ఆ చెలి మంజువాణియనియు ఆమె శుక్తిమతి, కోలాహలుల కుమార్తె యగు గిరిక చెలికత్తెయని తెలిసికొని, మాయా యతివేషమున గిరిక వృత్తాంత మెరింగి రాజున కెఱింగించుటయు చివరకు రాజునకు గిరికతో వివాహము జరుగుటయు నిందలి వృత్తాంతము.

వసుచరిత్రయందలి కథకు మూలము భారతాదిపర్వమునగల యుపరిచర వసుమహారాజు వృత్తాంతము. భట్టుమూర్తి దానిని గ్రహించి కొన్ని మార్పులు కావించి యద్భుతములైన కల్పనలచేతను, వర్ణనలచేతను పెంచి వసు చరిత్ర ప్రబంధమును రూపొందించెను.

భట్టుమూర్తి వర్ణనములం దందెవేసినచేయి. అతడు వసుచరిత్రమున పుర వర్ణన రెండుచోట్ల గావించెను. ఒకటి అధిష్ఠానపుర వర్ణనము. రెండవది కోలా హల పుర వర్ణనము. అధిష్ఠానపురమునందలి కోటను, పరిఖను, అందలి నాలుగు వర్ణముల ప్రజలను, రథగజతురగ పదాతులను, స్త్రీలను, పూతోటలను, పుష్ప మాలికలను అతడు మనోహరముగా వర్ణించెను. ఇంకను ప్రథమాశ్వాసములో వసంతఋతువర్ణన, నర్మసచివుడు రాజునకు గిరికా సౌందర్యము వివరించు నపుడు నఖశిఖా పర్యంతము వర్ణించుట, శుక్తిమతి కోలాహలముల ప్రణయగాథా వర్ణనము, వెన్నెల, మున్నగునవెన్నో వర్ణనలు ఈకావ్యమున గలవు. జడములైన నదీ, పర్వతములందాతడు నాయికా, నాయకత్వముల నారోపించిన తీరు అద్వి తీయము.

ఇక రాయల కాలములో తెనాలి రామకృష్ణుడు కూడ ప్రసిద్ధి వహించిన కవిగా అష్టదిగ్గజములలో పేర్కొనబడుచున్నాడు. ఈతడుకూడ పెక్కు కావ్య

ములు రచించి ప్రసిద్ధినందినకవి. ఈతడు లింగపురాణము, ఉద్భటారాధ్య చరిత్ర, కందర్పకేతు విలాసము, హరిలీలా విలాసము, పాండురంగ విజయము, పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యము అను కృతులను రచించి నట్లు తెలియుచున్నది. కాని ఈకృతులలో ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల క్షేత్ర మాహాత్మ్యము సంపూర్ణముగా లభ్యమగు చున్నవి. కందర్ప కేతువిలాస, హరిలీలావిలాస పాండురంగ విజయములలో కొన్ని పద్యములు మాత్రమే లభించుచున్నవి. లింగపురాణమునుండి పద్యములు లభించలేదు.[1] పాండురంగ మాహాత్మ్యము వైష్ణవ మతసంబంధమగు కావ్యము కాగా ఉద్భటారాధ్య చరిత్ర శైవమతసంబంధమగు కావ్యము. ఘటికాచల క్షేత్ర మాహాత్మ్యము అను స్థల పురాణమును 475 గద్య పద్యములతో మూడాశ్వాస ముల గ్రంథముగా వ్రాసినాడు.

ఉద్భటవంశమువారు కాశియందు నివసించిరి. అక్కడనుండి వారి వంశ మభివృద్ధియయ్యెను. వారు కాశినుండి తెలుగుదేశమున ముదిగొండకువచ్చి అచ్చట స్థిరపడిరి. ఆ వంశీయుడే ఉద్భటారాధ్య చరిత్ర కృతిపతి దేచ మంత్రి గురువు చంద్రశేఖరుడు. అతని వంశచరిత్రతో కావ్యము ముగియును. పాల్కురికి సోమ నాథుడు బసవపురాణములో చెప్పిన ఉద్భటుని కథ తెనాలి రామకృష్ణుడు ఇంచుక మార్పులతో ఉద్భటారాధ్య చరిత్ర రచించెను.

పాండురంగ మాహాత్మ్యము ఈకవికి పేరు తెచ్చిన కావ్యము. ఇందు రామకృష్ణకవి 1802 గద్యపద్యములతో తొమ్మిది కథలను కథనం చేసినాడు. (1) పుండరీకునికథ (2) నిగమశర్మోపాఖ్యానము (3) శ్రీకృష్ణావతార చరిత్ర (4) శ్రీ రాధాదేవి చరిత్ర (5) కాకి, హంస, పాము, చిలుక, తేనెటీగ మోక్షము నొందిన కథ (6) సుశీల అను పతివ్రత కథ (7) ధర్మరాజు తమ్ములతో పాండురంగ క్షేత్రము దర్శించినకథ (8) సుశర్మోపాఖ్యానము (9) అయుత నియుతులనే ముని కుమారుల చరిత్ర.

---

1. ఉద్భటారాధ్య చరిత్రము-పీఠిక - శ్రీ నిడదవోలు వెంకట్రావు

[1]వివిధ పురాణములనుండి తీసికున్న కథలతో ఈ స్థలపురాణమును రామకృష్ణకవి రచించియుండును.

ఈ కథలన్నిటిలోనేకాక తెలుగు సాహిత్యములో ప్రఖ్యాతి వహించినది నిగమశర్మోపాఖ్యానము.

పాండురంగక్షేత్రమున నృసింహ దేవుడు కలడు. ఆ స్వామివారి క్షేత్రమున కెడమ ప్రక్కన మరణించినవారు సార్వభౌములగుదురని, కుడివైపున చనిపోయినవారు ముక్తులగుదురని, వెనుక ప్రక్క కనుమూసిన స్వర్గమునకు వెడుదురని ప్రతీతి. పంచమహాపాపములు చేసినవారైనను ఆ కుడిభాగమును చూచిన అన్ని పాపములు హరించునట. ఈ విషయమును చాటి చెప్పుటకు శివుడు నారదునకు నిగమశర్మోపాఖ్యానమును విశదీకరించెను.

కళింగ దేశమున కాభరణమువంటి పిఠాపురములో సభాపతియను ఒక వ్యక్తి కలడు. అయనకు నిగమశర్మ అను కుమారుడు కలడు. ఆతడు లేప్రాయముననే సకల నిగమ శాఖా రహస్యములన్ని తెలిసికొనెను. కాని ధర్మార్థ కామ మోక్షములలో కామమువైపు మొగ్గు చూపి యువతీ భుక్త నిర్ముక్త పరిధానుడై యుండెను. పెండ్లి అయినను దురలవాట్లు మానక తాత ముత్తాతలు కూడబెట్టిన ధనమునంతను దుర్వినియోగ పఱచుచుండెను. తల్లి దండ్రులు వారించినను వినక త్రాగుడు జూదము మొదలగు దుర్వ్యసనములు కొనసాగించుచు తన వంటి మీద సొమ్ములు, తల్లి ఒంటిమీద నగలు కూడ తాకట్టు పెట్టెను.

ఇట్లుండగా పిఠాపురమునకు కొంత దూరములో నున్న 'నిగమశర్మ' అక్కగారు తమ్ముని ప్రవర్తన విని గుణపాఠము చెప్పదలచి భర్తను పిల్లలనూ వెంటబెట్టుకొని పుట్టినింటికి బయలుదేరివచ్చినది. తల్లి దండ్రుల నూరడించి ఇల్లు చక్క దిద్ది తల్లి దగ్గరనున్న మిగిలిన డబ్బు తీసికొని జాగ్రత్త పెట్టినది. మరదలిని చూసి జాలి పడినది. అంత నిగమశర్మ రాగా "సీమంతపు పెళ్లికొడుకువు

1. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర - ఎనిమిదవ సంపుటము.

కమ్మని" దీవించినది. వంటలుచేసి తమ్ముని పంక్తిని కూర్చుండబెట్టి ఇంటిల్లి పాదికి భోజనము పెట్టినది.

భోజనానంతరము తమ్ముని చెంతజేరి జుట్టు ముడివైచి సంభాషణ మొదలు పెట్టినది.

ప్రారంభించిన వేదపాఠమునకున్ బ్రత్యూహమా నంచునో
ఏరా తమ్ముడ ! నన్నుఁ జూడ ఁజనుదే వెన్నాళ్ళనో యుండి, చ
క్షూరాజీవ యుగంబు వాచెనిను గన్గోకున్కి, నీ కావయున్
నీరాకల్ మదిగోరు జంద్రు పొడుపున్ నీరాకరంబుంబలెన్
(పాం. మా. 3-33)

అనేక రీతి నీతులు బోధించగా నిగమశర్మ చెప్పినవి విన్నట్లు నటించినాడు. తదుపరి నిగమశర్మ తల్లి నగలు, అక్కగారి ఆభరణములు, భార్య సొమ్ములు తీసికొని రాత్రికి రాత్రి ఇల్లు విడిచెను. దారిలో దొంగలు ఆ సొమ్ముల నపహరించి బాగుగా కొట్టగా ఒక రెడ్డిగారు కాపాడి ఇంటికి తీసికొని వెళ్లి వైద్యము చేయించగా అతడు కోల్కొనెను. ఆ కాపు కొడుకున కొక అందమైన భార్య గలదు. ఆమె నిగమశర్మ ముందు కామ వికార చేష్టలు చేయగా ఆమె అభిప్రాయము గ్రహించి ఆమెను తీసికొని వెళ్లి బోయపల్లిలో కాపురము పెట్టెను. కొంతకాలమున కామె చనిపోగా, నిగమశర్మ మాలపడుచును పెండ్లియాడి పిల్లలను గనెను. ఒకనాడతడు వేట నుండి తిరిగివచ్చుసరికి ఇల్లు తగులబడి భార్యా బిడ్డలు చనిపోయిరి. పిచ్చిపట్టినట్లయి తిరిగి తిరిగి పాండురంగ క్షేత్రములో నరసింహస్వామి సన్నిధిలో ఉడివైపున మరణించి ముక్తిని పొందెను. ఇంకను ఈ క్షేత్రములో కాకి, హంస, పాము, చిలుక, తేనెటీగ మొదలగు జంతువులు కూడ మోక్షము పొందుట గమనించదగ్గ విషయము.

కృష్ణరాయలచే స్తుతిఁపబడిన ధూర్జటి 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకము' అను రెండు కృతులు రచించెను. ఇందు శ్రీకాళహస్తి మాహాత్మ్యము క్షేత్ర ప్రబంధముగా చెప్పబడుచున్నది. ధూర్జటి తన రెండు కృతులు తన ఇష్టదైవమగు శ్రీకాళహస్తీశ్వరునకే అంకితము గావించినాడు. శ్రీకాళహస్తి మాహాత్మ్యము శైవ కావ్యము. ప్రబంధ లక్షణములన్నియు అందు

కానవచ్చుచున్నవి. ఈ కావ్యమును గూర్చి అందలి కథలను గూర్చి ముందు ప్రకరణములలో వివరముగా చర్చింతును. ఇంకను అయ్యలరాజు రామభద్రుడు, మాదయగారి మల్లన, పింగళి సూరన కూడ నష్ట దిగ్గజముల కోవలో జేరి వారి వారి రచనా పాటవముతో మెప్పు పొందిరి.

మాదయగారి మల్లన రాజశేఖర చరిత్రమును, పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నము, రాఘవ పాండవీయమను ద్వ్యర్థి కావ్యము రచించెను. ఇంకను మిగిలిన ఆంధ్ర కవులలో సంకుసాల నృసింహకవి, తాళ్లపాక తిరుమలాచార్యుడు మున్నగు వారు ప్రముఖులు.

విజయనగర ప్రభువులు సంస్కృతమును కూడ చక్కగా పోషించిరి. రాయలు ఆస్థానమున లొల్ల లక్ష్మీధర పండితుడను బ్రాహ్మణ విద్వాంసుడు నివసించెను. శివానందలహరి మున్నగు గ్రంథములకు వ్యాఖ్యానమును దైవజ్ఞ విలాస మను అపూర్వ గ్రంథమును వ్రాసెను. దైవజ్ఞ విలాస మొక విజ్ఞాన సర్వస్వమని పండితుల అభిప్రాయము. రాయల విఖ్యాత మంత్రి తిమ్మరుసు గొప్ప సంస్కృత విద్వాంసుడు. ఇతడగస్త్య భారతమునకు వ్యాఖ్యానము వ్రాసెను. విజయనగరాస్థానమునకు పలువురు మత బోధకులు వచ్చి శాస్త్ర చర్చలు సల్పుచుండుట ఆచారముగ నుండెను. ఈ కాలమునాటి రచయిత్రులలో 'వరదాంబికా పరిణయము' వ్రాసిన తిరుమలాంబయు, 'మధురా విజయము' వ్రాసిన గంగాదేవియు ప్రశంసార్హులు.

సాహిత్యముతో బాటు సంగీతము గూడ విజయనగర ప్రభువులు పోషించిరి. హరిహర బుక్కరాయల గురువు విద్యారణ్య స్వామి సంగీత సారమను ఒక శాస్త్ర గ్రంథమును వ్రాసెను. అందాతడు 267 రాగములను సూచించినట్లు తెలియుచున్నది. సాళువ నరసింహరాయల కాలమున చెన్నశౌరి అనునతడు మొట్ట మొదటి యక్షగానమును రచించినట్లు హరిభట్టు నృసింహ పురాణము తెల్పుచున్నది. సమకాలిక వాఙ్మయమును చూచిన పక్షమున పైకాలమందు స్త్రీలు సంగీతమును, నృత్యమును అభ్యసించినట్లు తెలియగలదు. ఈనాడు కర్ణాటక సంగీతమను పేరుతో విఖ్యాతి చెందియున్న ప్రత్యేక శాఖ పై కాలమునందే ఒక విశిష్ట రూపమును దాల్చియుండ వచ్చును.

విజయనగర రాజ్యయుగమున నపూర్వమైన దేవాలయములను రాజ ప్రాసాదములను నిర్మింప బడెను. ఇందలి శిల్పకళ అద్భుతమైనది. శిల్పముతో పాటు చిత్రలేఖనము కూడ ఈ యుగమునందు అభివృద్ధి దశయందుండెను. రాజ ప్రాసాదమునకు సమీపమున నున్న హజార రామస్వామి ఆలయమును విఠల స్వామి ఆలయము మఱికొన్ని దేవళములును సంగమ వంశజుల నాటి వాస్తు నిర్మాణములని తెలియుచున్నది. హరిహరస్వామి దేవాలయము మిక్కిలి సుందర మైన నిర్మాణము. ఇందలి చెక్కడపు పని విద్యానగర శిల్పమున కత్యుత్తమ మగు నిదర్శనము. ఈనాడు హంపి క్షేత్రమున గానవచ్చుచున్న అనేక దేవాలయ శిథిలములను మందిరావశేషములు తళువ వంశము నాటివేయని చారిత్రికులు నిర్ణయించిరి. కృష్ణరాయలే వీనిలో పెక్కింటిని నిర్మించెనని ప్రతీతి.

విజయనగర యుగమునందు చిత్రలేఖనము కూడ చక్కగా పెంపొందెను. భారత రామాయణముల యందలి ప్రసిద్ధగాథలను దేవాలయములందును, గృహ కుడ్యముల పైనను, చిత్రించుట ప్రాచీనమగు నాచారము. ఈ యుగమునాటి చిత్ర లేఖన ప్రాశస్త్యమును హంపి సోమపాలెము, లేపాక్షియను ప్రదేశములలోని దేవా లయములయందు నేటికిని మనము గాంచవచ్చును.

రాయల రాజ్యమందు క్రైస్తవులు, మహమ్మదీయులు, యూదులు సర్వ మతముల వారును కూడ యథేచ్ఛముగ శాంత జీవనము గడుపవచ్చుననియు వారి కెట్టి కష్టములు కలుగవనియు బార్బోసాయను విదేశీయుడు తెల్పినాడు. 12, 13 శతాబ్దులలో ఆంధ్రదేశమున ప్రబలిన మత విషయకమగు అసహనము విజయనగర కాలము నాటికి చల్లారినట్లు తెలుపనగును.

ఇట్లు చూడగా తెలుగు దేశచరిత్రలోగాని, ఆంధ్ర సంస్కృత చరిత్ర యందుగాని, సాహిత్య చరిత్రలోగాని రాయల యుగము ఒక విశిష్టమైన కాలము. ఇంతటి ఘనత మనకు మన దేశచరిత్రలో మరెచ్చటను కాన్పించదు. అందువల ననే కాబోలు పెద్దనాది మహాకవులు, అబ్దుల్‌రజాక్ వంటి విదేశీయులు ఈ యుగ ప్రశస్తిని వేనోళ్లకొనియాడినారు తరువాతి చారిత్రకులు ఈ యుగమును స్వర్ణ యుగమని పేర్కొనుట ఎంతో సముచితముగా నున్నది.

ద్వితీయ ప్రకరణము

ధూర్జటి వంశాదికవిశేషములు

ఆంధ్ర సాహిత్యమున ప్రధానస్థాన మాక్రమించిన పాల్కురికి సోమ నాథుడు, నన్నెచోడుడు మున్నగువారి కాలములనుగూర్చి పండితులు తర్కించిరి. వారి కాలము విషయమున భేదాభిప్రాయములన్నియు నొకచో వివరించి చివరకు 'సమంజసమగు విషయమిది' యని తేల్చిచెప్పిరి. అట్లు సాధ్యముకాని సందర్భ ములు కొన్ని లేకపోలేదు. కాని మహాకవి ధూర్జటి విషయమున నిటువంటి చర్చ యేమియులేదు. శ్రీకృష్ణ దేవరాయల సభ నలంకరించిన అష్టదిగ్గజములలో నీతడొక డను అంశము విదితమే. దీనిని బట్టి చూచిన ధూర్జటి రాయల పరిపాలన కాలము ననే అనగా 1509-1530 వరకునుగల సంవత్సరములలోని వాడని ఊహించుట కవకాశము గలదు.

ధూర్జటి మహాకవి తన్నుగూర్చి గాని తన వంశమును గూర్చి గాని తన గ్రంథముల యందెచటను నేమియు తెలుపలేదు. శ్రీకాళహస్తి మాహాత్మ్య ఆశ్వా సాంత గద్య ఈ విధముగా గలదు- "ఇది శ్రీమత్కాళహస్తీశ్వర చరణ కమల సేవా పరాయణ సింగమరపగా నారాయణ జక్కయ నారాయణ తనూభవ భవపరా ఙ్ముఖ ధూర్జటికవి ప్రణీతంబైన శ్రీకాళహస్తి మాహాత్మ్యంబను మహాప్రబంధంబు నందు సర్వంబును జతుర్థాశ్వాసము" అని గలదు. తండ్రి జక్కయ నారాయణు డని తెలియుచున్నది. ప్రబంధ కవులు సామాన్యముగా తమ గ్రంథములలో ఇష్ట దేవతాస్తుతి నొనరించి, సుకవి ప్రశంస చేసి, కుకవి నిందచేసి, తమ వంశాది విష యములు వివరించి తరువాత కృతిపతి వంశవర్ణన గావించి పొగడి షష్ఠ్యంతములు చెప్పి పిదప కథాప్రారంభము గావించిరి. ధూర్జటి ఈ పద్ధతి కించుక భిన్న ముగా తన కావ్యము నారంభించినాడు. ఇష్టదేవతా ప్రార్థనయైన పిమ్మట షష్ఠ్యంత ములకు పూర్వ మీ క్రింది పద్యములను ధూర్జటి చెప్పినాడు.

క॥ ఈ రీతి నిష్టదేవ స
మారాధన మాచరించి యప్రతక్రృతి క
న్యారత్నమునకు విద్యా
పారంగతుడైన వరుని బరికించి మదిన్ (6)

శా॥ వాగర్థంబులు శ్రోతృవక్తలు జగద్వంద్యుండు నద్వైత వి
ద్యా గోష్ఠిన్ వివరింప నీశ్వరుడు కాదా? మత్ప్రబంధాది ప
ద్యా గద్యార్థుడు వేఱొకండు గలదే? యా మాటలే" లంచు జే
తోగమ్యుండగు కాళహస్తిపతినాథుంగా సమర్థించితిన్ (7)

ఉ॥ ఈ శుభ కావ్యరత్నమున కీశు నధీశుని జేసినన్, మహా
దేశిక సార్వభౌముడు మదింబ్రమదంబు వహించి "ధూర్జటీ!
నీ శివభక్తి కావ్యసరణిం గడు ధన్యత బొంద నవ్య బా
షాళతధానిగుంభన రసస్థితి నొప్పు దలిర్ప జెప్పుమీ (8)

క॥ అని గురు దనుపమ కరుణా
వనధి యనుగ్రహము సేయ, వరమౌని మనో
వనజ, వనరాజహంసము,
ననుభవ గోచరు గృతీశు నభివర్ణింతున్ (9)

మ॥ తనయుల్లా లక్ష్మి కై క మాత, సంతానంబు భూత ప్రజం
బను లాపంబులు వేదమూర్ధన విహారా గారము ల్మౌనిహృ
ద్వన జంబు, ల్ఘన సేవకుల్గమల జాత శ్రీధరుల్గా జెలం
గిన దేవోత్తము నమ్మహాత్మ్యదరమే కీర్తింపగా నేరికిన్ (10)

ఈ కవి భగవద్భక్తుడగుటచేత గాబోలు, తన వంశమును గూర్చి కూడ చెప్పుట కిష్టపడియుండక పోవచ్చును. పై పద్యములలోకూడ ధూర్జటి యను పేరొక్కటి తప్ప మరి యేవిషయమును గానరాదు కాని యీతని మనుమడును

కుమార ధూర్జటి బిరుదాంకితుడగు వేంకటార్యుని రచనయగు కృష్ణరాయ విజయమువలన ఈ ధూర్జటి పాకనాటి ఆర్వేల నియోగియనియు, ఆపస్తంబ సూత్రుడనియు, భారద్వాజ గోత్రుడనియు తెలియుచున్నది. కుమారధూర్జటియని నామాంతరముగల వేంకటరాయామాత్య కవి ధూర్జటికి పౌత్రుడయినట్లు 'కృష్ణ రాయ విజయ' మందలి ఈక్రింది పద్యమే తార్కాణము.

సీ॥ నను భరద్వాజ గోత్రుని సదాపస్తంబ
  సూత్రుని బాంధవస్తోత్ర పాత్రు
పాకనా టార్వేల వంశ ప్రసిద్ధుని
  ధూర్జటి పౌత్రు బంధుర చరిత్రు
సద్గురు కారుణ్య సంప్రాప్తవిద్యావి
  హారుని శ్రీకాళహస్తి నిలయ
చిత్రప్రసూనాంబికా శ్రీకరానుగ్రహ
  సాదిత కవితారసజ్ఞహృదయు
తే॥ సార రచనాధురీణు కుమార ధూర్జ
టిప్రధానాగ్రగణ్యు డిండీర హీర
మహిత సత్కీర్తి కతియామాత్యపుత్రు
వేంకటార్యుని బిలిపించి వేడ్కఁ గనియె.

(కృష్ణరాయ విజయము ; పీఠిక 28 పద్యం)

ఇపుడు ధూర్జటి నామధేయముంగల తెలుగు కవులు ముగ్గురు కానవచ్చుచున్నారు. అందొకరిది బిరుదనామము. [1]తక్కిన వారివి సహజనామములు. దక్షిణ హిందూ సామ్రాజ్యమును ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలవారి ఆస్థానమునందలి అష్టదిగ్గజములలో ఒకడని ప్రసిద్ధికెక్కిన ధూర్జటి మొదటివాడు. ఈతని కృతులు రెండు మనకు విదితమే. 1. శ్రీకాళహస్తి మాహాత్మ్యము. 2. శ్రీకాళహస్తీశ్వర శతకము. కాని, పై సీసపద్యములో వర్ణింప

1. కాళహస్తి మాహాత్మ్యము - సమ్యగపరిశీలన - శెట్టివారి అశ్వత్థప్ప.

జడిన ధూర్జటియు, కాళహస్తి మాహాత్మ్యము రచించిన ధూర్జటియు నొక్కడేయని నిశ్చయించుట కాధారములందులేవు. ధూర్జటికి మునిమనుమని వరుసవాడును, కుమారధూర్జటియని ప్రసిద్ధి వహించిన వేంకటార్యుడను కవి ఇంకను కృష్ణరాయ విజయ కావ్యమందీ విధముగా తెల్పెను.

స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో
యతులిత మాధురీమహిమ నాముసు పీ పెదతాత దాల స
న్నుతి గనె గృష్ణరాయల మనోజ్ఞ సభన్ విను మీవునట్లు మ
త్కృత బహుమాన వైఖరుల గీర్తి వహింపుము ధాత్రిలోపలన్

(కృష్ణరాయ విజయము 29 పద్యం)

అని తన్ను దనవంశమును ఆర్వీటి చిన వేంకటరాజు కీర్తించినట్లు చెప్పెను. గ్రంథస్థమైన ఈ ప్రమాణమును బట్టి ధూర్జటి మహాకవి రాయల ఆస్థానమునలంకరించి యుండెననియు ఆ రాజేంద్రునిచే మన్ననలంది యుండెననియు విశ్వసింపవచ్చును. ఈ విషయమును కుమార ధూర్జటియేకాదు, అతని కుమారుడు, పెదకాళహస్తి మాహాత్మ్యమును రచించిన వాడునైన లింగరాజు కూడ సాక్ష్యమిచ్చెను. ముగ్గురు ధూర్జటులుగలరని చెప్పితిని. రెండవ వాడు ధూర్జటి మనుమడగు వేంకటార్యుడు. అతడే కృష్ణరాయ విజయకర్త. అతనికే కుమారధూర్జటియను బిరుదు గలదు. ఈ కుమారధూర్జటి తనయుడు లింగరాజు కవియని శ్రీబాగంటి శేషయ్యగారు కవి తరంగిణి 7 సంపుటములో వ్రాసిరి. ఈ విషయము నిజమేకావచ్చును. ఈయనయే పెదకాళహస్తి మాహాత్మ్య కర్తయని పైన పేర్కొంటిని. ఈ పెదకాళహస్తి మాహాత్మ్యపు తాళపత్రప్రతి యొకటి తిరుపతి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున గలదు. ఈ పెదకాళహస్తి మాహాత్మ్యమును కాళహస్తిని పాలించుచున్న దామెర్ల అక్కరాజు వెంకటపతికంకితమిచ్చి యుండిరనియు దానిని తాము చదివి యుంటిమనియు, వ్రాయుచు ధూర్జటి కవికృత కాళహస్తి మాహాత్మ్య ముద్రిత ప్రతి పీఠికలో టీకాకారులగు కొత్తపల్లి పద్మనాభ శాస్త్రులగారు పెదకాళహస్తి మాహాత్మ్యములోనివని యుదహరించిన పద్యములు బాగంటి వారు తమ "ఆంధ్ర కవి తరంగిణి" 7వ సంపుటిలో నిచ్చిరి. పైన ఉదహరించిన "నను భరద్వాజ గోత్రుని" యను సీస పద్యములో వర్ణింపబడిన ధూర్జటియు. మన అష్టదిగ్గజము

లలో ధూర్జటియే. ఇతడు కేవలము రెండు తరములవెనుక వాడగుటచేతను, దేశవ్యాప్తమైన కీర్తిగడించి యుండుటచేతను కుమార ధూర్జటి ఆతని వివరములు చెప్పియుండక పోవచ్చును. ఇంక పెదకాళహస్తి మాహాత్మ్యములోని పద్యము లిట్లున్నవి.

(శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తాళపత్రప్రతి)

సీ॥ "శ్రీకాళహస్తిగౌరీనాథ పదపద్మ
సద్భక్తి యుక్తి నిశ్చింత గాంచి
సారసుధాసార సరసోక్తి గుంభన
గాళహస్తి మహత్త్వకథ నొనర్చి
కృష్ణరాయ కిరీటకీలితమణిగణా
ర్చిత పదాబ్జద్వయ శ్రీవహించి
యాసేతు శీతటావ నీ విఖ్యాత
సత్కీర్తివిస్ఫూర్తి జాలవెలసి
ధరణి జెలువొందనే కవీశ్వర వతంస
రత్న మమ్మహనీయధూర్జటి సుధీంద్రు
దలతుజలనిధి వీచికాకల కలాను
కారి భూరి కవిత్వ చాక్రుతి మగులుక.

సీ॥ శ్రీకాళహస్తీశ సేవ నాన్విత చిత్త
చిత్తజాకార లక్ష్మీ విహార
రమణీయశీల భారద్వాజ గోత్ర ప
విత్ర యాపస్తంబ సూత్ర మహిత
ధూర్జటి వంశ పాథోధిచంద్రకుమార
ధూర్జటినామ విస్ఫూర్తితాంక
స్తుతమతి వేంకటపతి తనూ భవలింగ
రాజకులేంద్ర దైర్యాచలేంద్ర

క॥ వినుకాళహస్తిమహిమం
దను పమమై వెలయ మనుషదశ్యాయి కథన్
దెనుగున గావ్యము గనొన
ర్చెను బెద ధూర్జటికవీంద్రశేఖరు డనఘా

గీ॥ బహు పురాణ మథిత భవ్యార్థ శివతత్త్వ
సారమెల్లనైక్య సరణి బొదలి
జగతి శివరహస్య సంగ్రహమనినిరి
హాస మొనరు విబుధుల వినుతింప.

సీ॥ అయితి హాసంబు నందలి యుత్తర
భాగంబునందు భాస్వన్నిరూఢి
గాళహస్తి మహత్త్వకథనాటయిర్వది
యధ్యాయముల జెలువమరుచుండు
దత్కథ దెనుగున ద్రాక్షరసోర్మికా
పరిపాక విస్ఫూర్తి బరిఢవిల్ల
గృతి యొనర్చుము మదంకితముగ శబ్ద చ
మత్కృతి బండి తుల్మది గణింప.

ఈ పద్యముల వలన పెదధూర్జటి కవి కాళహస్తిమాహాత్మ్యమును, రచించినట్లును, ఆతడు కృష్ణరాయల ఆస్థానమున గౌరవము నందినట్లును తెలియచున్నది. ఈతనిని పెద ధూర్జటియని చెప్పుటచేత పెదధూర్జటి యనియు, చిన ధూర్జటి యనియు నిరువురు ధూర్జటులు కలరనియు నందు చిన ధూర్జటి పౌత్రుడు కుమార ధూర్జటియనియు కృష్ణరాయ విజయమునందలి పై పద్యమున కుమార ధూర్జటి తనపితామహుడైన చినధూర్జటినే తలపెట్టెనని యూహింప దగియున్నది. ఈ ఊహ సరియైనదనుటకు "స్తుత మతియైన" యను కృష్ణరాయ విజయమందలి పద్యమే తార్కాణము.

ఇపుడు కృష్ణరాయలచే గౌరవము నొందిన ధూర్జటి, కుమార ధూర్జటికి పెదతాతయని యిందు స్పష్టముగా నున్నది. దీనిని బట్టి పై సీస పద్యములో

'ధూర్జటిపౌత్రు' అను వాక్యము నందలి, ధూర్జటికుమారు ధూర్జటికి పితామహుడని ఊహించుటకవకాశమున్నది.

కాళహస్తిమాహాత్మ్యమును రచించిన ధూర్జటి కృష్ణదేవరాయల సభ యందలి అష్టదిగ్గజములలో నొకడనితెలినది. "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటిపల్కులం కేలగల్గెనో యతులిత మాధురీ మహిమ?" అని కృష్ణరాయలు ప్రశ్నించినట్లును నందుపై తెనాలి రామకృష్ణుడు లేచి" "హా తెలిసెన్ భువనైక మోహనోద్ధత సుకుమారవారవనితా ఘనతాపరిహారి సంతత మధురాధరోదిత సుధారస ధారలు గ్రోలుటంజుమీ" అని ప్రత్యుత్తర మిచ్చినట్లును చెప్పెదరు. తెనాలి రామకృష్ణకవి అష్టదిగ్గజములలోనొకడని అష్టదిగ్గజ వర్ధంత్యుత్సవసంచిక యందు (డా॥ నేలటూరి వెంకట రమణయ్య గారు)సప్రమాణముగా నిరూపించిరి. కనుక ఈ సమస్యా విషయము యదార్థమనియె నమ్మదగియున్నది. అదియును గాక కుమార ధూర్జటియే ఈ విషయము గ్రంథస్థము చేసెను. కనుక రాయల సభలో ఏ సంభాషణ జరుగలేదని ఇది అసత్యమనియు చెప్పజాలము. ఇంకను ఆరుద్రగారు ధూర్జటిని గూర్చియు, రామలింగకవిని గూర్చియు తమ "సమగ్ర ఆంధ్ర సాహిత్యము" ఏడవసంపుటములో ఈ విధముగా తెల్పుచున్నారు.

"కాళహస్తి ప్రాంతమునుండి ధూర్జటియు, తెనాలి ప్రాంతమునుండి రామలింగకవియు రాజధానీ నగరమునకు వచ్చి అక్కడ సానివాడలో పాత పుస్తకములలో చదువుకొన్న విషయములలో క్రొత్త అనుభవములు గడిస్తున్న రోజులవి. ఇరువురు షైలా పచ్చీసులో ఉన్నారు. ఇరువురు జాణలు. ఏసాని కూతురు గానరసాన్ని అనడానికో వెళ్లినప్పుడు ఒకరి నొకరు చూసుకొని ఉంటారు" (పుట 209-210) దీనిని బట్టి ధూర్జటి వయస్సు అప్పటికి ఇరవై యైదేండ్లు అయిఉండవచ్చునని ఆరుద్రగారి యభిప్రాయమైనట్లు తోచుచున్నది.

ధూర్జటి రాయల వారి కాలమున తన ప్రబంధమును రచించెన నిరూఢిగా చెప్పజాలము. తదనంతరము వ్రాసినను వ్రాసియుండవచ్చును. రాయలకాలముననే వ్రాసియున్న యెడల పెద్దన తిమ్మలనలవలెనే ప్రభువునకే అంకిత మిచ్చి యుండెడి వాడుగదాయని కొందరు భావించుచుండిరి. వైష్ణవ సంప్రదాయమునకు చెందిన రాయలు, శైవక్షేత్ర మాహాత్మ్యమును తెలుపు గ్రంథమును కృతిగా

స్వీకరించుటకు సమ్మతింపడేమోయను అనుమానము ధూర్జటి కుండవచ్చును. లేదా శివభక్తుడు స్వతంత్ర భావములు కలవాడగు ధూర్జటి మానవ మాత్రులగు రాజులకు తనకృతి నంకితము గావిచ్చుటకు నిష్టపడి యుండలేదని అనుకొన వచ్చును. రాయలు సర్వమతాభిమాని యగుటవలన ధూర్జటి నాస్థానకవిగా నొనరించి సన్మానించుట కెట్టియాక్షేపణములేదు.

రాయల యనంతరమున ధూర్జటి తన ప్రబంధమును, రచించెనని చెప్పుటలో ఎట్టి ఆక్షేపణలేదు. రాయలు జీవించి యున్నంత కాలము కవులకు గొప్ప గౌరవముండెడిది. రాజ పోషణమువల్ల కాలము నిర్విచారముగా, సుఖముగా గడచు చుండెడిది. ఆయన యనంతరము రాజ్యాధికారమును వహించిన వారట్టి గౌరవ మర్యాదలు కవుల పట్ల చూపినట్లు కానరాదు. దినములు గడచుటయే కష్టమయ్యెనేమోయని యూహించుటకు అల్లసానివారి ఈ చాటువే తార్కాణము "కృష్ణరాయలతో దివికేగలేక బ్రదికియున్నాడ జీవచ్ఛవమ్ముకరణి" అని పల్కెను. ఇంక తక్కిన వారి సంగతియు, నట్లేగావచ్చును. ధూర్జటి శతకములో చెప్పిన ఈ క్రింది పద్యము చూచిన యెడల రాజులపట్ల నాతనికిట్టి భావముండుటవలననే తన ప్రబంధమును నరాంకిత మొనరింప లేదని భావింపవచ్చును. ఆ పద్యమిది.

రాజన్నంతనే పోవునాకృపయు ధర్మంబాభిజాత్యంబు వి
ద్యా జాత క్షమ సత్యభాషణయు, విద్వన్మిత్ర సంరక్షయున్
సౌజన్యంబు కృతంబెఱుంగుటయు విశ్వాసంబుగా నున్న దు
ర్బీజ శ్రేష్ఠులుగా గతంబుకలదే శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. ౮౭ పద్యం)

ధూర్జటి వంశస్థులగు కవులు పైని పేర్కొన్న ముగ్గురేకాక ఇంకొక ధూర్జటి కలదని తోచుచున్నది. కాళహస్తీశ్వర దండకమును రచించిన కవి ధూర్జటి యను పేరిట గలడు. శతకము రచించిన ధూర్జటియే దండకకర్తయని చెప్పుట కవకాశము లేదు.

ఈ దండకము తిరుపతి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున తాళపత్ర ప్రతిలో గలదు. అందీ దండకమిట్లున్నది. "వల్లకీగీత లీలాలసద్రవ్య!

మోపేత! మత్తాళిపాళీశరోజాత కంన్నార నిమ్నన్ పరీక్షించి యాళాలికిన్। గీత సద్వాళికి స్వతంమ్మి పూచూళికిన్। నీపీద వరాళిన్। మమోజావళిన్, శీతియ యుంన్నకూరితిన్। నీకు లోకేశ నీకున్ సమర్పించిరిచ్చితి। నీకు ముంమ్మాటికిన్। నిచ్చితిన్, దంచ్చులాసిన్। కటాక్షించ్చి రక్షించ్చవే। యంచ్చు ప్రార్థింభించ్చినన్ పంచ్చబాణేతి। యావారకాంతిశిరోరత్నమున్ రత్నసౌధంబులో! మన్మధా యోవన క్రీడవతిన్‌చెనంచ్చున్ మరంద్దావళిన్ సాదురీమాధురీతిన రచించ్చిన్। ప్రియావల్లకి శాతిజేతోళావారాతిపై నూత్నశృంగార మీదంతకంబాంధ్ర భాషాకవి గ్రామణిన్ జక్కయామాత్య నారాయణ శ్రీసుధీమాధవాఖ్యావ నీదేవతా విశ్వనాథ ప్రధానీందు ప్రోలాంబికా పుత్రుడున్ ధూర్జటి ప్రాఖ్యుడున్ జేసె ముఖ్యంబుగున్ మూడు లోకంబులన్''......... ....

అని చెప్పుకొనినట్లున్నది. దీనినిబట్టి దండకకర్తయగు ధూర్జటి ప్రోలాంబికా విశ్వనాథుల పుత్రుడైనట్లు స్పష్టమగుచున్నది. ధూర్జటి వంశమున కవులు పలుగురైదుగురు కలరని తెలినది. వారినిగూర్చి వంశవృక్షమిట్లుగలదని చాగంటి శేషయ్యగారు 'కవితరంగిణి' యందిచ్చిరి.

భారద్వాజ గోత్రమున.

జక్కయ

|

నారాయణుడు

ధూర్జటికవి.
శాళహస్తిమాహాత్మ్యకర్త

|

తెలియదు

|

ధూర్జటి

|

కాళయామాత్యుడు

|

కుమార ధూర్జటి
కృష్ణరాయవిజయకర్త

|

సుధీమాధవాఖ్యుడు

|

విశ్వనాథ ప్రధాని-భార్య ప్రోలాంబిక

|

ధూర్జటి, కాళహస్తీశ్వర దండకకర్త

లింగరాజు
పెదకాళహస్తి మాహాత్మ్యము
↓
ధూర్జటి వేంకటరాయకవి
రత్నావళీ పరిణయకర్త

వేంకటరాయకవి తన వంశమునకు మూలపురుషుడైన మన ధూర్జటిని రత్నావళీ పరిణయమున నిట్లు నుతించెను.

మ. పటు గంగాలహరీ తరంగ సముదంచత్ప్రౌఢతాంచత్కృపా
ఘటనున్ బాద విన మృకృష్ణవరరాడ్గంభీర కోటీర వి
స్ఫుట రత్నద్యుతి పాటలీకృత పదాంభోజాతు సర్వజ్ఞు ధూ
ర్జటినింగొల్చెద నస్మదీయ కులకర్తన్ భక్తి రంజిల్లగన్.
(రత్నావళీపరిణయము)

ధూర్జటి రాయలకంకితమిచ్చిన గ్రంథములుగాని, రాయలపై జెప్పిన పద్యములుగాని ఎచటను లేవు. ఈతని కాలనిర్ణయము చేయుట కితని గ్రంథములు తోడ్పడుటలేదు. కృష్ణరాయ విజయకర్తయగు కుమార ధూర్జటి చెప్పిన 'మీ పెదతాత' యను శబ్దమునకు 'తాతకు దాత' యని యరముతో గ్రహించిన వీరి బంధుత్వము సరిపోవును.

ఇంకను ధూర్జటి కృష్ణదేవరాయల కాలమువాడు గావున కృష్ణరాయలు కాలమును పరిశీలించిన ఈతనికాలము నదియే యైయుండునని ఊహింపనగును. రాయలవారు ౬౦ సంవత్సరముల కాలము జీవించియుండిరి. అయన జీవితచరిత్ర యందు ముఖ్యమగు తేదీలు పట్టిక ఆరుద్రగారు తమ 'సమగ్ర ఆంధ్రసాహిత్యము'లో నీవిధముగా వ్రాసిరి.

1474 ఫిబ్రవరి 10
వయస్సు 24 → కృష్ణరాయల వివాహము (తిరుమలదేవితో)
1948
వయస్సు 25 → కుమార్తె జననము
1499

వయస్సు 29 → తండ్రి మరణము
1508
వయస్సు 32 → అన్న పట్టాభిషేకము
వయస్సు 35 → అన్న మరణము
1509 జూలై 22
1509 అగస్టు → రాయల రాజ్యస్వీకారము
వయస్సు 36; 1510 కృష్ణరాయల పట్టాభిషేకము
జనవరి 24
వయస్సు 39
1513 జూన్ 9 → ఉదయగిరి విజయము
1513 సెప్టెంబరు 20 రాజధానికి తిరిగి రాక
వయస్సు 45 - 1515
జూన్ 23 కొండవీటి దుర్గముపై గెలుచుట
వయస్సు 56 → రాయల నిర్యాణము
1530

1530 రాయలవారి నిర్యాణములోపున ఇంకను అతడు సాధించిన పను లన్నియు పట్టిక యందీయబడినవి. పట్టాభిషేకము మొదలు అనగా (1509-1530) నిర్యాణములోపంనే ఆయన అష్టదిగ్గజ కవుల నాశ్రయించి యుండును. అనగా 1509-1530 ప్రాంతములలో ధూర్జటి మున్నగు కవీశ్వరులు జీవించి యుండిరనియు తెలియుచున్నది. 1530 నాటికి అనగా రాయలవారు మరణించి నప్పటికి ధూర్జటి మున్నగుకవులు నడియౌవనము దాటియుండిరని అనగా 40 సంవత్సరముల వయసువారని ఊహించుట కవకాశము గలదు. ధూర్జటి నిండు జవ్వనముననే రాయల సభనలంకరించి భోగప్రధానమగు ఆ యుగమునందలి భోగలాలసత ననుభవించి యుండవచ్చును. స్తుతమతి మాధురీమహిమ మున్నగు రాయలవారి మాటలవలన మనకు కొంత నీవిషయము తెల్లమగుచున్నది. అందుచే ధూర్జటి ఈప్రాంతములోనివాడని చెప్పవచ్చును.

ఇంకను *T.B.M.* అయ్యవారు ధూర్జటి 'కావ్యామ శీలనము' అను సిద్ధాంత వ్యాసము వ్రాసి మైసూరు విశ్వవిద్యాలయములో పి.హెచ్.డి. పట్టము

పొందియుండుటచే నచట కేగినపుడు వారి పరిశీలన యంతయు చూడగా 'ధూర్జటి కతిపయ జీవిత విశేషము'లనుచు ఒక ప్రకరణము వ్రాసిరి. అందు వారు దాగంటి వారిచ్చిన వంశ వృక్షమే కాక మరి రెండు వంశ వృక్షముల నిచ్చిరి. అందు వారీ విధముగా వ్రాసిరి.

"కాఱూరగ్రహారము నాత్మీయ నివాసముగ జేసికొని వేంకటగిరి ప్రభువుల యాస్థాన కవిగ నుండిన ధూర్జటి కవి పేరు ప్రతిష్ఠలు కృష్ణదేవరాయలు విని తన యాస్థానమునకు రావించి అష్టదిగ్గజములలో నొకనిగా జేసి సాదరముగా సంభావించెనని వ్రాసిరి. దీనినిబట్టి ధూర్జటి రాజుల యాస్థాన ప్రవేశమునకు ముందు వేరే ఆస్థానములో నున్నట్లు వగత మగుచున్నది. ఈ విషయ మెంతవరకు నిజమో తెలియదు. "రాయలవారి మరణానంతరము ధూర్జటి మహాకవి నిరాశ్రయుడై దేశ దేశముల గ్రుమ్మరితి చివరకు దన యగ్రహారము జేరుకొనెను. సంతానము లేని కారణమున బంధు వర్గమునకు జెందిన యొక శిశువును దత్తతగ స్వీకరించినట్లు తెలియుచున్నది." స్తుతమతియైన యాంధ్రకవిగా కృష్ణరాయ మహనీయునిచే శ్లాఘింపబడిన యీ మహాకవి కాళాత్రిపుర సుందర్యుపాసకుడైన శివభక్తుడని వినికిడి. చివరి రోజులలో శ్రీకాళహస్తి క్షేత్రమున, శివ సన్నిధానమున నివాస మేర్పరుచుకొని యుండెనని ప్రతీతి. కాళహస్తి రాజుగారి దర్బారులో ధూర్జటి వారిదని యొక గౌరవ పీఠము నిన్న మొన్నటివరకు నుండెడిది. రాజాధిరాజుల మన్ననల నొంది దిగంత విశ్రాంత యశోవిశాలుడైన యా మహాకవి పేరనే యా యన్వయమంతయు దరువాత వ్యవహరింపబడుచు వచ్చెను. ధూర్జటి వంశజులందరును 'ధూర్జటి వా'రను నింటి పేరుతో ప్రసిద్ధి కెక్కిరి. కొంతకాలమైన పిమ్మట నీ ధూర్జటి వారి వంశమున నొక వింత సంభవించెను. ఆ వంశము వారి యాతుపదుచొక్కర్తుక వివాహమునకు ముందే మరణించి తన తండ్రికి స్వప్నములో గనిపించి "రేపు వఱువాత నేను మన ధాన్యాగారమున స్వర్ణ ప్రతిమనై కనిపింతును. నన్ను భక్తి తాత్పర్యమున సేవింపుడ''ని నుడివి యంతర్ధాన మందెను. మఱునాడా విధముగానే బంగారపు ప్రతిమ యొండాగేస్తునకు, వాని ధాన్యాగారమున లభించెను. అతడు "కాఱూరమ్మ" యను పేర నా ప్రతిమను ప్రతిష్ఠించెను. ఆలయ ప్రాకారాదుల గట్టించి యా యూధి వారందఱు నామెను బూజించిరి. ఆ యూరికామె గ్రామ దేవతగా బరిగణించినవి. [illegible]

నా దేవత నచ్చోట బూజా పునస్కారము లవిచ్ఛిన్నముగా నడచుచున్నవి. ఆమెకు ప్రతి శుక్రవార మర్చనలు జరుగును. ఇతర శక్తులకువలె, హింసా కాండ మేమాత్రము నచట సాగదు. పానకము, వడపప్పు మాత్రమే మహానైవే ద్యముగ బెట్టుదురు. ఎడనెడ నా యూరి వారిలో నెవరినైన నావహించుటయు, నా గ్రామ దేవత చేయును. ఇట్లావహించి నప్పుడామె యిలవేలుపై యాయురారోగ్య భాగ్యముల ననుగ్రహించుచున్నది. ఆ గ్రామసీమ యందలి నాగుల చెఱువు కట్టపై నీశ్వర లింగమొకటి ప్రతిష్ఠింపబడి యున్నది. ఆ లింగమునకు జేరువ జెన్నకేశవస్వామియు బ్రతిష్ఠితుడై యున్నారు. గ్రామదేవతయగు కాటూరమ్మతో బాటు వీరు గూడను యూరిని కాపాడుచుందురని యచట ప్రజల విశ్వాసము.

శ్రీకాళహస్తి క్షేత్రమున కుత్తరముగ నొక యామడకుపై దూరమున నున్న యీ గ్రామము పూర్వము నుండియు బ్రాహ్మణాగ్రహారముగ నుండెడిది. ధూర్జటి కవి సంతతిలోని వాడును, ప్రస్తుత మత్తివరము గ్రామ కాపురస్థుడును నగు శ్రీ ధూర్జటి వెంకటరమణయ్యగారి తండ్రియగు పిచ్చయ్యగారి కాలము వఱకును సర్వహక్కులతో ననుభవించుచు బ్రతి సంవత్సరమును 118 రూపా యల చొప్పున వెంకటగిరి ప్రభువులకు గందాయమును చెల్లించుచుండిరి. ఇటీవల నా గ్రామము నాంధ్రప్రదేశ్ ప్రభుత్వము స్వాధీనము జేసికొని శిరణము నిప్పిం చుటచే నా వంశీయులు జీవనోపాధికై యన్యత్ర నివసింపవలసినవారైరి. ధూర్జటి కవి సంతతిలో నెన్నవతరము వారో తెలియదు గాని నేడును రెండు కుటుంబముల వారు మాత్రము మిగిలి యున్నారట. వారి వంశ వృక్షములిట్లు అయ్యవారు వ్రాసిరి.

1వ కుటుంబము

ధూర్జటి నాగేశ్వరరావు -	లక్ష్మమ్మ
సుబ్బయ్య -	సుబ్బమ్మ (వెంకమ్మ)
వెంకట్రామయ్య -	మహాలక్ష్మమ్మ
వెంకట్రమణయ్య -	సుశీలమ్మ, మహాలక్ష్మిదేవి

వీరి తండ్రిగారి యనంతరము వరకును వెంకటగిరి రాజాగారి సంస్థాన ములో యున్నట్లు తెలియుచున్నది.

పిచ్చయ్యగారి భార్యయైన మహాలక్ష్మమ్మగారు గూడూరు తాలూకా చిట్టమూరు గ్రామ కాపురస్థులు కౌండిన్యస గోత్రులు ఆపస్తంబసూత్రులు నగు శ్రీయుత కృష్ణయ్యగారి పుత్రిక.

2వ కుటుంబము

ధూర్జటి పెద్దిరాజు - పుల్లమ్మ
↓
శేషయ్య - సుబ్బలక్ష్మమ్మ
నాగేశ్వరరావు.

ఒకటవ కుటుంబము 6వ తరగతిలోని వారగు వెంకటరమణయ్యగారు కాళహస్తి తాలూకా కనమనంచేరు గ్రామవాసులగు వెన్నెలకంటి పిచ్చయ్య సుందరమ్మగార్ల కాపురము అత్తివరము. రెండవ వంశము రెండవ తరగతిలోని వారగు శేషయ్య గారు (పై వెంకటరమణయ్యగారికి దాయాది, అన్న) ప్రస్తుతము నెల్లూరు పట్టణము లోని యిస్మాయిల్ సాహెబ్ పేటలో నున్నారు.

ధూర్జటి వంశమునకు సంబంధించిన వివరములు ఇంతకు మించియేమియు తెలియ రాలేదు

ఇంక ధూర్జటి ఇంటిపేరును గూర్చి తెలిసికొందము. ఈ కవి ఇంటి పేరేదియో తెలియుటలేదు. లింగరాజు కవియును, వెంకటరాయ కవియును వ్రాసి కొనిన పద్యములను బట్టి వారి ఇంటి పేరు 'ధూర్జటి'యే అని ఊహించుట కవ కాశమున్నది. వెంకటగిరి సంస్థానములో కారూరు, ధూర్జటి అమ్మపాళెములు అను గ్రామము లున్నవట.

కరూరులో ధూర్జటివారని[1] ఇంటిపేరుగల వారిప్పటికినున్నారు. వీరి యొద్ద కొన్ని శాసనము లేవో యున్నవట వానినెల్ల పరిశీలించి సాధ్యమైనంత వరకీ కవియొక్క చరిత్రను క్రమముగ ప్రకటింతుము" అని ప్రథమ ముద్రణ పీఠికా కర్తలగు కొత్తపల్లి పద్మనాభశాస్త్రిగారు తెలిపిరి. కాని ఆ ప్రయత్నము కొనసాగ లేదని శ్రీ పోణంగి శ్రీ రామఅప్పారావుగారు తమ కాళహస్తి మాహాత్మ్య పీఠికలో

1. శ్రీ కాళహస్తి మాహాత్మ్యము—పీఠిక-పోణంగి శ్రీరామ అప్పారావు ...

పేర్కొనిరి. ఇంక ప్రస్తుతము ధూర్జటి పూర్వులు 'ధూర్జటి అమ్మపాళెము' గ్రామ వాస్తవ్యులై యుండురనియు ఆ గ్రామనామమే వారి ఇంటిపేరై యుండుననియు, ధూర్జటి తన ఇంటిపేరనే కృష్ణదేవరాయల సభలో ప్రసిద్ధుడైయుండుననియు అందుచేత అసలుపేరు విస్మృతమైయుండుననియు వెంకటార్యుడు కుమార ధూర్జటిగా ప్రసిద్ధుడైనప్పుడు ధూర్జటి 'పెద్ద ధూర్జటి' అయ్యెననియు తలంపవచ్చును. ఇంటిపేరుతో వ్యక్తులను వ్యవహరించుట మనకు నేడువచ్చిన విద్యయేకాదు, పూర్వముకూడ నిట్టి వ్యవహారము కలదని భావింపనగును. అల్లసాని వారియల్లిక జిగిబిగి మొదలైన విట్టివే. ప్రసిద్ధాంధ్రకవులలో చాలామంది పేళ్ళు తెలుగు పదములుగానే యున్నవి. శ్రీనాథుడు, భాస్కరుడు వంటికొన్ని సంస్కృత పదము లున్నప్పటికిని తెలుగుకవుల పేర్లలో ఎక్కువ తెలుగుదనము కనబట్టుట తెల్లము. ధూర్జటి సమకాలికులలోను పెద్దన, తిమ్మన, మల్లనవంటి పేళ్ళే ఎక్కువగా నుండెను. ఒకే వంశమున అనేకమంది కవులుండుట అరుదు. ధూర్జటివంశమున కిదియొక్క ప్రత్యేకతగా పేర్కొనవచ్చును. ధూర్జటివంశమున, ధూర్జటి తరువాత పేర్కొనదగినవాడు లింగరాజుకవి. ఆ వంశమునకు కూడ ధూర్జటిపేరే వచ్చినది. కాళహస్తి ప్రాంతముననే "ధూర్జటివారి తాంబూలమని" పేరు వినికిడి. ధూర్జటి ఇంటిపేరును గూర్చికూడ ఇంతకంటె వివరములు తెలియరాలేదు.

ధూర్జటి కావ్యముల పూర్వాపరములు

ఇంతవరకు మహాకవి ధూర్జటి కాలమును గూర్చి నిశితముగా పరిశీలించితిమి. ఇప్పుడు ఈయన కృతుల పూర్వాపరములను గూర్చిచర్చింపవలసియున్నది. ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకము రచించినట్లు తెలియుచున్నది. పూర్వాపరముల విషయమున పండిత లోకమున అభిప్రాయ భేదములుగలవు.

సంప్రదాయము ననుసరించి కవులు శతకములు లేక శతకప్రాయములైన రచనతో తమ కావ్యరచనలు చేయుటకు ముందుచేసెడి వారని ప్రతీతి. ఈ విషయము శ్రీ వీరేశలింగముగారు తమ స్వీయచరిత్ర యందుకూడ పేర్కొనిరి. అట్లని కవులందరును మొదట శతకరచన చేసినట్లు కానరాదు. తిక్కన మున్నగువారు శతక రచన చేసినట్లు కానరాదు. శతకమును ముందు వ్రాసి కావ్యరచన

చేయవలెనను పై సంప్రదాయమునను సరించి ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకమును మొదట రచించి పిమ్మట గ్రంథరచన చేసియుండ వచ్చునని శ్రీ కాళహస్తి మాహాత్మ్య* పీఠికలో చలమచర్ల రంగాచార్యులుగారు ఈ విధముగా చెప్పిరి.

1) సంప్రదాయమునుబట్టి తెలుగున గవిత చెప్పువారు శతకముతో నారంభించి, ప్రబంధాంతముగ రచనసాగించుచుండెడివారు 2) శతకరచయిత భావ, భావము, శైలియను నీ విషయములందు స్వేచ్ఛాధారము వహించును. ప్రబంధ రచనవట్లుకాక వివిధ విషయములందును నియమబద్ధమై యుండును. వయోభేదమును బట్టి ధూర్జటి మనః ప్రవృత్తిలో వచ్చిన భేదమును ఈ రెండు కృతులందును పరిశీలింప వచ్చును.

కాని పై కారణములు బలముగాలేవు. ధూర్జటి ఈ శతకమున కవిత్వమున నారంభించి యుండునన్నచో నిది యౌవనారంభమందే రచింపబడియుండవలెను, కాని ఈ అభిప్రాయమునకు అంతస్సాక్ష్యము సుభముగాలేదు. ఈ శతకమందు

రాజమాషణ పదికముగా గలదు. కవి శ్రీ కాళహస్తీశ్వరుని భక్తితో ప్రార్థించుచు మోక్షమార్గమునకు దారి చూపుమని అర్థించునట్లుగలదు. పూర్వ జీవితానుభవములన్నియు యిందు వివరించెను. అందుచే ఈ శతకము పరిణత దశలో సంసార సుఖములన్నియు అనుభవించి 'రోత' కలిగిన పిమ్మట రచించినటులే తోచుచున్నది గాని ప్రథమ రచనయని తోచుటలేదు. పద్యములు పరిశీలించిన ఈ విషయము తెల్లము కాగలదు.

"వాణీ వల్లభ దుర్లభంబగు భవద్ద్వారంబు నన్నిల్పిని
ర్వాణ శ్రీఁజెఱబెట్టఁజూచిన విచార ద్రోహమో నిత్యక
ళ్యాణ క్రీడలఁ బాసి దుర్దశల పాలై రాజలోకాధమ శ్రీ
శ్రేణీ ద్వారము దూఱఁజేసితివిగా శ్రీకాళహస్తీశ్వరా!"

(కా. శ. 12పద్యము)

* కా.మా. పీఠిక -చలమచర్ల రంగాచార్యులు

ఇంకను

"రాజుల్మత్తులు వారిసేవనరక ప్రాయంబు వారిచ్చునం
బోజాక్షీచతురంతరయాన తురగీభూషాదులాత్మవ్యథా
బీజమ్ముల్ తదపేక్షజాలు పరితృప్తిం బొందితిన్ జ్ఞానల
క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ముదయతో శ్రీకాళహస్తీశ్వరా!"

(కా. హ. శ. 18)

రాజై దుష్కృతి జెందె జందురుడు రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబున గాంచె దుఃఖము కురుక్ష్మాపాలు డామాటనే
యాజిం గూలె సమస్త బంధువులతో నా రాజశబ్దమ్ము ఛీ
ఛీజన్మాంతరమందు నొల్లనుజుమీ శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. 21)

భవ దుఃఖంబులు రాజకీటములనే ప్రార్థించినం బాయునే
భవదంఘ్రి స్తుతి చేతగాక విలసద్బాల క్షుధా క్లేశ దు
ష్ట విదుల్మానునె మూడ మేకమెడచంటం దల్లి కారుణ్యవృ
ష్టివిశేషంబున నిచ్చు చంటబలె, శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. 44)

ఇంకను పెక్కు పద్యములలో రాజదూషణ గలదు. నృపవాదమున్ బాత్రంబంచు భజింపబోదుర్ (98 పద్యం) [1]ఇట్లు యౌవనోదయమున నోరార రాజదూషణము చేసి, తరువాతికాలములో 'కృష్ణరాయకిరీటఘటితమణిగణార్చిత పదాబ్జద్వయ శ్రీవహించుట' సంగతము కానేరదు. లేదా శతకమును మాహాత్మ్యమును కూడ రాయలవారి ఆస్థానమును విడిచివేసిన తరువాతనే వృద్ధాప్యములో రచించె ననవలసి వచ్చును. ఇదియును సమంజసము కాజాలదు. మాహాత్మ్యమును రచించునాటికి ధూర్జటి ఇంకను పరిణత మనస్కుడు కాలేదనియే చెప్పవలెను. లేనిచో తన కృతి కన్యాగత్నమునకు వరుని పరికింపవలసిన అగత్యము కలుగదు. ఇంకను శతకములో 'నీకుంగాని కవిత్వ మెవ్వరికి నేసీనంచు' శపథము చేసినాడు. ఇది పరిణతదశ. కావున ధూర్జటి కృష్ణదేవరాయల ఆస్థానములో

1. కాళహస్తిమాహాత్మ్యము, పీఠిక - పోణంగి శ్రీరామ అప్పారావుగారు.

నుండగనే ప్రబంధమును రచించియుండును. కాని రాజున కంకిత మీయ దలపక 'శుభకావ్యరత్నము'న కీతనధీశుని జేసినాడు. మహాదేశిక సార్వభౌముడు మదిం బ్రమదంబు వహించుటయు జరిగినది. కృష్ణదేవరాయలు కూడ సంతసించియుండును. ఇంక కృష్ణదేవరాయల అనంతరము దేశమున ఏర్పడిన కల్లోల పరిస్థితులకు క్షుభితహృదయుడైన ధూర్జటి శతకమున చిల్లరమల్లర రాజుల నావిధముగా నిందించియుండును. [1] "దొరతనమువారి పుస్తకభాండాగారమునందే కాళహస్తీశ్వర శతకమొకటి ధూర్జటి కృతమని వ్రాయబడియున్నది. గాని దానిని జదివి చూడగా నది ధూర్జటిచే రచింపబడి యుండునని నూహ బుట్టించు నంశము లెవ్వియు గానరావయ్యె" అని 1895లో ప్రథమ ముద్రణ పీఠికాకర్తలు కీ. శే. కొత్తపల్లి పద్మనాభశాస్త్రిగారు వ్రాసిరట. ధూర్జటి కూడ శ్రీకాళహస్తి మాహాత్మ్యమున తన యితర రచనలను గూర్చి ఏమియును పేర్కొనలేదు. లింగరాజకవి కూడ ఒక కాళహస్తిమాహాత్మ్యమునే పేర్కొనెను. కాగా, శ్రీకాళహస్తీశ్వర శతక కర్తృత్వము సందేహాస్పదమైనది. కాని కస్తూరి రంగకవి (క్రీ.శ. 1740 ప్రాంతములు) తన ఆనందరంగరాట్ఛందమున తృతీయాశ్వాసము 275 పద్యమున ఈ శతకమునుండి "సికుంగాని కవిత్వ మెవ్వరికి నేసీనంచు" అను 114వ పద్యమును అభేదయతి కుదాహరణముగా పేర్కొనుచు "ధూర్జటివారి కాళహస్తీశ్వర శతకమున" అని చెప్పియుండెను. దీనినిబట్టి పరంపరగా వినవచ్చుచున్న జనశ్రుతినిబట్టియు ఈ శతకము ధూర్జటి కృతమేయని విశ్వసింపవచ్చును. అంతియే కాదు- ఈ శతకమునందలి కవనపద్ధతి, పదముల కూర్పు, భావములు, ధార మున్నగునవి శ్రీకాళహస్తి మాహాత్మ్యమందలి కవనపద్ధతితో సంవదించుచుండుటచేత ఈ శతకము ధూర్జటికృతమే యని విశ్వసింపవచ్చును. కొన్ని ఉదాహరణములు పరిశీలించిన యెడల నీ విషయము స్పష్టముకాగలదు. కాళహస్తి మాహాత్మ్యము ద్వితీయాశ్వాసము కాళము, హస్తి, రుద్రగణాకారములు దాల్చి చివరకు శివసాయుజ్యము పడయు సమయమున వారు శివుని ప్రార్థించిన పద్యము కాళహస్తీశ్వరశతక పద్యమును బోలియున్నది.

---

1 పీఠిక, కా. మా., పోణంగి శ్రీరామ అప్పారావుగారు.

ఆపద్యమిది.

శా. ఈ సంసారపయోధిలోనబడి మేమీదిదీం,దేహబుపై
నాసల్మానక, తేలుచున్మునుగుచుం, బ్రాణప్రయాణోన్ముఖా
యాసంబుల్మతసంఖ్యలోర్చితిమి, దేవా ! మమ్ము రక్షించి ఏ
త్యాసౌఖ్యంబులు చాలు. నిత్యసుఖమిమ్మా ! యంచు బ్రార్థించినన్

(కా. మా. ద్వి. ఆ. 164)

శతకమున ఈ విషయమే యిట్లు చెప్పుచున్నారు.

ఆలుంబిడ్డలు తల్లిదండ్రులు ధనంబంచున్మహాబంధనం
బేలా నామెడగట్టినాడవిక నిన్నేవేళ జింతింతు ని
ర్మూలంబైన మనంబులో నెగడు దుర్మోహాబ్ధిలో గ్రుంకి యీ
శీలా మాలపు జింత నెట్లుడిపెదో శ్రీకాళహస్తీశ్వరా !

కా. శ. 9

తిన్నని కథలో చెలికాండ్రువచ్చి తిన్నని తమ పల్లెకు రమ్మని బ్రతిమాలగా శివుని విడి రానని చుట్టములు, తల్లిదండ్రులు అంతా కూడ ఆ పరమేశ్వరుడేయని తిన్నడే ఈ క్రింది విధముగా పల్కెను. ఇటువంటి భావముగల పద్యములు శతకమున గూడ కవి చెప్పినాడు

శా. నాకుం జుట్టము దల్లిదండ్రులు జెలుల్నాధుండు నీదైవమే
మీకిచ్చో బనిలేదు కర్తిపడగా, మీ పల్లెకుం బోండు కా
రాకూరంబులు సేసినం గదలి నేరా, నిచ్చటం బ్రాణముల్
పోకార్తుం దుది వాదు వేలుపునకై బొంకన్నిజంబింతయున్.

(కా. మా. తృ. ఆ. 82)

శా. ఆలుంమన్మెడగట్టి దానికి నపత్యశ్రేణి గల్పించి త
ద్బాలవ్రాతము నిచ్చిపుచ్చుకొను సంబంధంబు గల్పించి
యా తూలారంభమున బాంధవంబనెడి ప్రేమం గొంద
అం ద్రిప్పగా సేంన్సిల యమర్చినట్లోసంగితో శ్రీకాళహస్తీశ్వరా !

(కా. శ. 80)

నత్కీరుడు శివుని ద్రావిడోక్తిచే నూరు పద్యములలో సంస్తుతించెననియు తృతీయాశ్వాసమున ఈ క్రింది పద్యమున చెప్పబడినది.

కుష్ఠవ్యాధియుమానె, హేమముఖరీ కూలస్థ కైలాసమున్
నిష్ఠాధీన మనస్కుడై కదిసి, తన్నీరంధ్ర కల్లోల భూ
యిష్ఠా మంబున దీర్థమాడి, గిరిజాధీశున్ శివున్దేవతా
శ్రేష్ఠున్, సంస్తుతి నూఱు పద్యముల జేసెన్ ద్రావిడోక్తిందగన్

(216 తృ.ఆ)

నత్కీరుడు చెప్పిన ఈ నూఱు పద్యములనే వేశ్యాతనయులు పఠించినట్లు చతుర్థాశ్వాసమున ఒక వచనము నందీవిధముగా జెప్పబడినది.

వ॥ ఆ సమయంబున, నియమంబున శ్రీకాళహస్తీశ్వరునకు గవితా చమత్కారంబు మీఱనత్కీరుండు చెప్పిన నూఱు పద్యంబుల పారంబుచేసి, నిత్యవ్రతంబుగా బఠించుచు, గఠిన కనక కుచకుంభలు శంభుండే తమకు బరమపురుషుండని యుండ, బుంద్రేక్షుకోదండ విద్యాకాంతామ తల్లియగు తల్లి దగ్గరకే తెంచియిట్లనియె" (చ, ఆ, 24)

శతక రచనపైగల మక్కువతో ధూర్జటి కూడ "ఆంధ్రోక్తి" శ్రీకాళహస్తీశ్వర శతకమును రచించియుండు ననుటలో విప్రతిపత్తియుండరాదు.

ఇఁక ఈ రెండు కృతులుగాక ధూర్జటి ఇంకేమైనా రచించెనా యను విషయమై వోలంగివారు తమ కాళహస్తిమాహాత్మ్య పీఠికలో "ఈ రెండు కృతులేకాక మరికొన్ని కృతులను కూడ రచించియుండ వచ్చునని తెలిపిరి. కాని నేడే వియు లభ్యమగుట లేదు. శ్రీనాధుని కృతులు నేడు కొన్ని లభ్యమగుటలేదు. శ్రీనాధుని కృతులు లభ్యము కాకపోయినను కనీసము పేర్లైనను వినవచ్చుచున్నవి. కాని ధూర్జటి కృతుల పేర్లు కూడ విన వచ్చుటలేదు. ధూర్జటిగాని, లింగరాజు కవిగాని మఱి ఇతరు లెవ్వరుగాని ధూర్జటి వేరు కృతులు వ్రాసనట్లు ఎచటను పేర్కొనియుండలేదు. ధూర్జటి సందర్భ వంశమున చెప్పబొనిక మహాదేశిక సార్వభౌముడు అతనికి విద్యాగురువు కాక శైవదీక్ష నొసంగిన యాధ్యాత్మిక గురువై యుండ వచ్చునని మనమూహింప వచ్చును. మిగిలిన సంప్రదాయముల విషయమెట్లున్నను శైవసంప్రదాయమున మాత్రము గురువునకు గల స్థానము చాలా గొప్పది. శివుని

కంటె సాధకునకు దీక్షనొసంగిన దేశికుడు విశేషముగ సంభావింపబడ వర్హుడగును. ఆగమముల దృష్టిలో మంత్రదీక్ష నొసంగిన గురువర్యునకు బరమేశ్వరునకు భేదములేదు. ధూర్జటి గూర్చి ఆతని వంశజుడగు వెంకటార్యుడు రచించిన ఇందు మతీ పరిణయమందీ పద్యము గలదు.

ఏఘాసుర శ్రేష్ఠుడిలలోన వేరొందె
గాళహస్తి మాహాత్మ్య కథయొనర్చి
యేబుధాగ్రణి కథల్ హేరాళముగ గూర్చి
రహి బ్రమదొదంబరం బొనర్చె
నేయాంధ్రకవి కృష్ణరాయ భూపాంకు
నద్భుతంబున దేల్చె నాత్మమహిమ
నేరమ్యగుణశాలి శ్రీరాజయోగసు
జ్ఞాన సద్గురు సేవ సంతరించె
నమ్మహాత్ము మదీయ వంశాబ్ధి చంద్రు
డైన ధూర్జటి కవిరాజు నభినుతింతు
దూర్జటి జటాతటీ నటద్యోధునీత
రంగ రంగద భంగవాక్ప్రౌఢి మెఱయ

(ఇందుమతీ పరిణయ యావతారిక)

[1]ఆంధ్రవాఙ్మయమున భక్తి శతకములలో ధూర్జటి "శ్రీకాళహస్తీశ్వర శతకము" అగ్రగణ్యమైనది. శ్రీకాళహస్తీశ్వర శతకము భక్తినైర్మల్యము చేతను, భావ గాంభీర్యము చేతను మృదుమధుర ప్రయోగము చేతను తెలుగు నందలి శతక వాఙ్మయము నలంకారమని చెప్పబడుచున్నది. పైన చెప్పినట్లే శైలీ సౌందర్య మును, రచనా ప్రౌఢిమనుబట్టి చూచినచో శ్రీకాళహస్తి మాహాత్మ్యమును రచించిన కవియే దీనిని గూడ రచించియుండునని నిరాక్షేపముగా జెప్పవచ్చును. ధూర్జటి రాజుల సేవించుచు గాయోప భోగలాలసుడై పూర్వవయస్సును బుచ్చియుండును. ఈ శతకమున నాతని పశ్చాత్తాపమును, వైరాగ్యమును బక్కగా వెల్లడిచేయబడి

1. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - డా॥ దివాకర్ల వేంకటావధానిగారు.

వవి. ఇందలి శైలి ప్రౌఢమై ధారాశుద్ధి శోభితమై మిగుల హృద్యముగా నున్నది. ధూర్జటి యాత్మీయాంశమిందు తెక్కుటొట్ల గావనగును. భక్తి శతకములు కవి ఆత్మానుభూతి ప్రధానములగుట వలన శతకములు భావగీతములను [1]అభిప్రాయము విమర్శకులు కొందఱు వెలువరించిరి. ఇందుకవులు వారి భావములను పొదిగి రచన సాగించిరి. భక్తి శతకముల సంఖ్య బహుళమగుటచే విమర్శకులు ఆత్మానుభూతి యను ధర్మము శతకములలోని ప్రధాన లక్షణముని భావించిరి. ఈలక్షణము సంస్కృత శతకముల యందును, తదితర శతకముల యందును కవులు ఆత్మానుభూతిని వ్యక్తీకరించి యున్నారు.

ధూర్జటి హృదయమున బాల్యము నుండియు బీజప్రాయముగనున్న శివభక్తి ఆతనికి సన్మార్గము జూపినది. కాళహస్తి మాహాత్మ్యమును ప్రబంధమును రచించిన అనంతరము తిన్ననివలె స్వర్ణముఖీ తీర ప్రాంతముల విహరించి వెనుకజేసిన ఘోర దుర్దశల భావించు కొనుచు పశ్చాత్తప్తుడై కాళహస్తీశ్వరుని సేవించి ముక్తి నొందుటయే ఉత్తమ మార్గమని నిశ్చయమునకు వచ్చెను. అట్టిదశలో ధూర్జటి కాళహస్తీశ్వరశతకమును రచించెనని శతకము నందలి వస్తువు నిరూపించు చున్నది. ఈ శతకము నందలి విషయమును పూర్వ జీవితానుభవ వివరణము-వైరాగ్యదశ అను రెండు ప్రధానవర్గములుగా పరిశీలింపవచ్చును,

ధూర్జటికవి ఎట్టి దాపరికము లేక పూర్వజీవితానుభవములను స్వేచ్ఛగా చాటును. ఇందు రాజదూషణము, సంసారిక జీవితము పట్ల వైముఖ్యము అనువవి ప్రధానముగ గణింపదగినవి. ఈతడు యౌవన దశలో రాజాస్థానముల సందర్శించి అచటి వాతావరణమును కన్నులార జూచెను. రాజ ద్వారముల వేచివేచి ఆస్థాన కవుల నాశ్రయింప ప్రభు సందర్శనమునొంది వారిని స్తుతించి అగ్రహారాది సత్కారముల వలని సుఖము క్షణికమైనదని అచిరకాలమున గ్రహించెను రాజుల చిత్తవృత్తిని నిశితదృష్టితో పరిశీలించెను. ఈ కవి కేవలము కృష్ణరాయల ఆస్థానమును మాత్రమే సందర్శించి ఇట్టి నిర్ణయమునకు వచ్చెననుట సమంజసము గాదు. వివిధ రాజాస్థానముల సందర్శించిన ఈ శతకమునందే అతడు స్పష్టముగా వివరించెను.

---

1. శతక వాఙ్మయ వికాసము - డా॥ గోపాలకృష్ణరావు గారు.

వారాంగనా లోలత్వమున, గృహస్థ జీవితమున కొన్నినాళ్ళు గడచినవి. క్రమముగా ధూర్జటి కుటుంబ జీవనము పట్లను, సంసారము పట్లను వైముఖ్య మేర్పడి విరక్తి భావము ప్రగాఢమైనది. బాల్యమున బీజప్రాయముగానున్న పరమేశ్వరునిపైగల భక్తిభావము కాలక్రమమున ప్రగాఢమైనది. ఈ భక్తి పారమ్యమే అతనికి సంసారము పట్ల విరక్తి గలిగించి యుండును. వార్ధకమున ఇట్టి వైరాగ్య భావము పొడుకొనుట సహజమే (పూర్వజీవితము నొకసారి పర్యాలోచన మొనర్చి, అనుభవించిన సుఖముల దలచి సంసారమును గూర్చి కలిగిన "రోతను తన యిష్టదైవమునకు విన్నవించి వైరాగ్యము నొసగుటకై ధూర్జటి యిట్లు ప్రార్థించెను.

కాయల్గాచె వధూ నఖాగ్రములచే గాయంబు వక్షోజముల్
రాయన్రాపడె ఱొమ్ము మన్మథ విహార క్లేశవిభ్రాంతిచే
ప్రాయంబాయెను బట్టగట్టెదల చెప్పన్ రోత సంసారమే
జేయంజాల విరక్తు జేయగదవే శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 4)

హృదయమున వైరాగ్య భావము స్థిరముగ నిలిచిన తరువాత ధూర్జటి నిశ్చలమైన ధ్యానము చేతను, కవితా శక్తిచేతను ముక్తిని సాధించ వచ్చునని విశ్వసించెను. ఈశ్వరార్చనకు తగిన సాధన సంపత్తి తన కవితకు కలదని భావించెను. పైవిషయముల వలన ధూర్జటి కాళహస్తీశ్వర శతకము రచించెనని మాహాత్మ్యము ముందు రచన యనియు శతకము పరిణతదశయందు వ్రాసెననియు స్పష్టమైనది. ఈ రెండు కృతులే ధూర్జటి రచించెననియు ఇంకవేరేమియు ధూర్జటి రచియించ లేదనియు తేలుచున్నది.

మూడవ ప్రకరణము

స్థలపురాణములు - సాహిత్యప్రాధాన్యము

స్థలము యొక్క మాహాత్మ్యమును తెలుపునదే స్థలపురాణమగును. ఈ స్థల పురాణమనుమాట ప్రాచీన కాలము నుండియు వాడుక యందు గలదు.[1] కవులు తమ కిష్టమగు ఒక ప్రదేశమును గూర్చి వర్ణించుట పరిపాటి. ఈ రీతిని మనకా ప్రదేశము యొక్క మాహాత్మ్యము వెల్లడియగుచున్నది.

క్షేత్ర మాహాత్మ్యములనే 'స్థలపురాణము'లని యందురు. ఒక పుణ్య క్షేత్రమునకుగాని, తీర్థమునకు గాని, ప్రాచీన పౌరాణిక గాథలుండును. వానిని స్థానికులు కథలుగా చెప్పుటయు, నాయాపురాణములందు వీని ప్రశంస కన్పించుటయు కలదు. ఇట్టి కథలను ఆయాక్షేత్ర తీర్థములకు సంబంధించిన వానిని సమీకరించి వ్రాసిన గ్రంథములే 'క్షేత్రమాహాత్మ్యములు' లేక 'స్థలపురాణములు' అనిపించుకొనుచున్నవి.

ఆంధ్రమున స్థల పురాణములలో స్వతంత్రములైనవి, ప్రాచీనములైనవి, శ్రీనాథ కవిసార్వభౌముడు రచించిన భీమఖండ కాశీఖండములు. కాని ఇంతకు పూర్వమే క్షేత్ర మాహాత్మ్యమున దగిన రచనమొకటి కాన్పించుచున్నది. ఇది పాల్కురికి సోమనాథుడు రచించిన పర్వత ప్రకరణము. ఇది క్షేత్ర మాహాత్మ్యముల కుండెడి సామాన్య లక్షణములన్నిటిని కలిగి యున్నను, ప్రత్యేక గ్రంథము కాదు పండితారాధ్య చరిత్రమున నొక ప్రకరణము మాత్రమే. తరువాత, కాళహస్తి మాహాత్మ్యము, పాండురంగ మాహాత్మ్యము మున్నగునవి విశేషముగా నాంధ్ర వాఙ్మయమున వెలువడినవి.

---

1. ఆంధ్ర వచన వాఙ్మయము - డా॥ యమ్. కులశేఖరరావుగారు.

క్షేత్రమాహాత్మ్యములు కేవలము పద్య కావ్యకర్తలనే కాక వచన రచయితలను పలువురు రచయితలను విశేషముగా నాకర్షించినవి. దక్షిణాంధ్ర దేశమున పలువురు రచయితలు స్థల పురాణములను వచన కావ్యములుగ రచించిరి. పురాణముల తరువాత నీ రచయితలు వీని స్థానమును వచన కావ్యములందు కల్పించి యుండిరి. ఈ రచనలు వారికి క్షేత్రములపై గల భక్తి శ్రద్ధలను ప్రకటించును.

మానవుడు నాగరకత పొందినప్పటి నుండియు నూతన ప్రదేశములను దర్శించ వలెననియు వాని విశేషముల నారయ వలెననియు కుతూహలమును కలిగి యున్నాడు. తాను చూచిన విశేషములను ఇతరులకు చెప్పుట మానవ స్వభావము కదా! ఈ కుతూహలముతో కూడిన స్వభావమే మానవుని గ్రంథ రచనకు పురికొల్పినది. ఇదియే యాత్రాచరిత్రములైనవి. ఈ యాత్రలందు మతమునకు సంబంధించిన యంశములను జోడించి రచయితలు స్థలపురాణములుగా రచించిరి. దక్షిణ దేశమునకు పురాణములు వెలువడుటకు, నిట్టి కారణములే యుద్బోధకములైనవి. పుణ్య క్షేత్రములను దర్శించ వలెనను కుతూహలము చాల మంది కుండవచ్చును. కాని వానిని చూచుట కవకాశమున్న వారు ముఖ్యముగా ప్రయాణసాధనములు లేని పూర్వకాలమున చాల తక్కువ. అట్టి వారికి స్థల పురాణములు వరప్రసాదము వంటివి. వీనిని భక్తిశ్రద్ధలతో పఠించి, వీరానందింతురు. ఈ స్థల పురాణములు పద్యకావ్యములైనచో, పఠితలకందరికి నందుబాటులో నుండవు ఇవి సులభ గ్రాహ్యములు గాకుండుటయే దీనికి కారణము. క్రీ.శ. 18వ శతాబ్దమునను, అంతకు ముందును, వెలువడిన క్షేత్ర మాహాత్మ్యములను గూర్చి సంగ్రహముగా తెలిసికొందము.

కావ్యయుగము, లేదా శ్రీనాథుని యుగములో భీమేశ్వర పురాణము, కాశీ ఖండము, ప్రబంధ యుగములో పాండురంగ మాహాత్మ్యము, శ్రీకాళహస్తి మాహాత్మ్యము మున్నగు స్థల పురాణములు రచియింపబడినవి.

భీమేశ్వర పురాణము

ప్రసిద్ధి నొందిన స్థల మాహాత్మ్యములలో భీమేశ్వరపురాణ మొకటి. ఇందు శ్రీనాథుడు ద్రాక్షారామ భీమేశ్వరుని మహిమ కొనియాడినాడు.[1] పంచారామములలో ద్రాక్షారామ మొకటి. దీనినే దక్షిణ కాశియని కూడ నందురు. ఉత్తర హిందూ స్థానమున కాశీక్షేత్రమెంత ప్రసిద్ధమో దక్షిణ హిందూ స్థానమున దక్షిణ కాశినాబడు ద్రాక్షారామము కూడ నంత ప్రసిద్ధి నొందిన ప్రాచీన క్షేత్రమయి యున్నది.

[1]భీమేశ్వర పురాణము శ్రీనాథుని యితర సంస్కృత గ్రంథానువాదములంకంటె మూలమునకెక్కువ చేరికగా రచిత మయినట్లు కానవచ్చును. ఇది స్కాంద పురాణాంతర్గత మగు కథ నాధారము చేసికొని వ్రాయబడినదనియే పలువురి యభిప్రాయము. శ్రీనాథుడు వర్ణనలతో కావ్యమునకు శోభ చేకూర్చుచు స్వతంత్ర రచన కూడ కొన్నిపట్ల గావించినాడు. ప్రథమాశ్వాసమున గల ద్రాక్షారామ పురవర్ణన మిందులకు నిదర్శనము.

సీ. పర్యంత మందార పారిజాత కవనీ
    రమమాణ నిర్ఝరీ సముదయంబు
నరసరసా సిద్ధవర వారి సంపూర్ణ
    గంభీరతర పరిఖా పయోధి
ప్రబల చింతారత్న పాషాణ సంఘాత
    వక్రరేఖా చక్రవలయితంబు
కామధేను సహస్ర కఠిన రింఖాటంక
    దళసదంతురితర ధ్యాముఖంబు
క్షుద్రపాతాళభైరవ పాలితంబు
గుహవినాయక రక్షణాకుంఠితంబు
సప్తమాతృక పరివార సంకులంబు
వసుమ తీనూపురము దక్షవాటి పురము

(భీ.పు. ప్ర ఆ 69)

---

1. భీమేశ్వర పురాణము - పీఠిక - వేదము లక్ష్మీనారాయణ శాస్త్రి

అని వర్ణన చేసెను. ద్రాక్షారామ మాహాత్మ్యము దీనివలన మనకు వెల్లడి యగును. శ్రీనాథునకు తెలుగు దేశముపై గల యభిమానము వలననే కాశీలో ఈ క్షేత్ర మాహాత్మ్యము మరింత విపులముగా పాఠకులకెఱింగించినాడు. భీమేశ్వరుని మహిమతో పాటు చుట్టుప్రక్కల సర్పవరము, పిఠాపురము మున్నగు క్షేత్రముల మాహాత్మ్యములు కూడ శ్రీనాథుడు వర్ణించెను.

కాశీఖండము

శ్రీనాథుడు "ప్రాయ మింతకు మిగుల గైవ్రాలకుండ" రచించిన ప్రౌఢ కావ్యము కాశీఖండము. ఇది స్కాంద పురాణము నందలి యేబది ఖండములలో గల సంస్కృత కాశీఖండమునకు అనువాదము.[1] మహాపురాణైక దేశమగు సంస్కృత కాశీఖండము సులభగ్రాహ్యమై పురాణ రీతిలో నుండగా తెనుగున శ్రీనాథుడు ప్రౌఢతరమగు కావ్య శైలిలో దీనిని రచించెను.

క్షేత్ర మహిమలు వెలయించుట యందు శ్రీనాథునికి గల ప్రత్యేకతను శ్రీయుత మహామహోపాధ్యాయ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు తమ బిల్వేశ్వరీయమున నవతారికలో ఈ విధముగా ప్రశంసించిరి.

శా. స్కాందంబందను వందితము నౌఖండద్వయం బాంధ్ర భా
షం దివ్యంబుగ జేసి క్షేత్రమహిమాచార్యుండనన్ గౌరవం
బందె న్మున్నుగ బిల్వనాథ సమనామాధ్యుం డెవం డెంతు స
త్స్యందోహస్తుత నమ్మహాకవిని విద్వన్నాథు శ్రీనాథునిన్.

శ్రీనాథుని కాశీఖండము అతని సమస్త శాస్త్రపాండిత్యమునకు ప్రమాణము సంస్కృత మూలమునకు ఇది మిక్కిలి సంక్షిప్తముగా నుండుటచేత సంస్కృత మునగల భాగమెంతయు విడనాడబడి యున్నది. శ్రీనాథుడు పురాణవిషయము గ్రహించి ఒక తెలుగుకావ్యముగా రచించెను. కావున ఇతడెంతవరకు మూలము ననుసరించి రచించెనో తెలిసికొనుటకు సంస్కృత మూలముతో తెలుగు కావ్యము శోధించిచదివిననే తెలియును.కాశీఖండము ప్రథమాశ్వాసమున పురాణప్రశంసయు,

1. కాశీఖండము - పీఠిక - శ్రీనిడదవోలు వెంకటరావుగారు.

నారదుడు వింధ్యకు ఏతెంచుట మొదలగు వృత్తాంతములు గలవు. కాశీఖండ ప్రశంస శ్రీనాథుడిట్లు చెప్పెను.

శా. ప్రాశస్త్యంబు వహించు ద్వాదశ సహస్రగ్రంథ సంక్షిప్తి వి
శ్వేశ క్షేత్రవిదయన్న డీ వటుకదుంతీ శ్రీనాథ సత్కీర్తనో
ద్దేశ ప్రక్రమ మశోభితాద్భుత కథాధిష్ఠానమై శ్రేష్ఠమై
కాశీఖండ మఖండవైభవమునన్ స్కాందాబ్ధి మధ్యంబునన్

(కా. ఖం. ప్ర. ఆ 81)

స్కాందపురాణమను సముద్రముయొక్క నట్టనడుమ పన్నెండువేల గ్రంథమై కాశిని గంగను, డుంఠి విఘ్నేశ్వరుని నుతించు అయిా ఘట్టములుగల అద్భుత కథల కాకరమై కాశీఖండము మహావైభవముతో విరాజిల్లుచున్నదని భావము. ఈ ఖండమును వేదవ్యాస సూత సంవాదాత్మకమనికూడ చెప్పెదరు. వింధ్య నారద సంవాదము బ్రహ్మలోక ప్రభావము, గోదావమాహాత్మ్యము, కాశి యందుగల అగస్త్యాశ్రమ వర్ణనము, మునిదేవతా సమాగమము, పతివ్రతా చరిత్రము, అగస్త్యప్రార్థనము, తీర్థప్రశంస, శివశర్మోపాఖ్యానము, సప్తపురీప్రశంస, సంయమనీ ప్రశంస, శనైశ్చర లోకవర్ణనము, సప్తర్షిలోక వర్ణనము, ధ్రువ లోకవర్ణనము, కుమారాగస్త్య సంవాదము, మణికర్ణికా సముద్భవము, గంగా మాహాత్మ్యము, భైరవావిర్భావము, కళావత్యుపాఖ్యానము, సదాచారము, బ్రహ్మచారి ప్రకరణము, స్త్రీలక్షణము, కృత్యాకృత్య ప్రకరణము, గృహస్థ ధర్మము, యోగనిరూపణము, కృత్తివాస సముత్పత్తి దుర్గామాహాత్మ్యము, ఓంకార మాహాత్మ్యము, త్రిలోచన సముద్భవము, కేదారేశ ధర్మేశ మాహాత్మ్యము, క్షేత్ర తీర్థకదంబవర్ణన, ముక్తిమంటప వర్ణన, విఘ్నేశ్వరావిర్భావము, గుణనిధికథ, దేవయాత్రావిధానము మొదలగునవన్నియు కలిపి నూట ఒక్క కథలుగలవు. కాశీమాహాత్మ్యము తెలుపు కథలున్నను, దానికితోడు తెలిసి కొనదగిన యోగవిషయములెన్నో ఈ గ్రంథమందు గలవు స్కాందమను సముద్రమున పుట్టి, యెన్నో ఉపకథలను కొమ్మలతో రెమ్మలతోగూడి, ఈశ్వరానుగ్రహమువలన లభించిన మోక్షమే ఫలముగా ఈ కాశీఖండము కల్పవృక్షమువలె క్షేత్రమాహాత్మ్యమై మహావైభవముతో విరాజిల్లుచున్నది.

పాండురంగ మాహాత్మ్యము

తెనాలి రామకృష్ణకవి విరచిత పాండురంగ మాహాత్మ్యము క్షేత్రమాహాత్మ్యములలో అగ్రగణ్యమైనది. శ్రీకాళహస్తి మాహాత్మ్యము, పాండురంగ మాహాత్మ్యము ఇంచుమించు ఒకేకాలమున రచియింపబడుటచేత కాబోలు పెక్కు పోలికలు కన్పించుచున్నవి. రెండుకావ్యములలో కీటకములు ముక్తినొందుట చెప్పబడినది. శ్రీకాళహస్తి మాహాత్మ్యము శైవమత ప్రబంధముకాగా, పాండురంగ మాహాత్మ్యము వైష్ణవమత ప్రబంధముగా రూపొందినది.

పుండరీకుడను భక్తుని పేరిట ఈ క్షేత్రము ప్రసిద్ధికెక్కినది గనుక పుండరీక క్షేత్రముగా పేరుపొందినది. పాండురంగడు ఈ క్షేత్రమునకు అధిదేవత గనుక దీనికి పాండురంగ క్షేత్రమనియు వ్యవహారము. పాండురంగక్షేత్ర ప్రశంస ఈ కావ్యమందుండుటచేత దీనికి 'పాండురంగ మాహాత్మ్యము' అను పేరు సార్థకమైనది. వైష్ణవమత ప్రచారమే పాండురంగ మాహాత్మ్య రచనలోని పరమార్థము అందుచేతనే ఈ కావ్యము ఒక కథతో ఆద్యంతము సాగక కథలన్నియు కలగలిపిన కావ్యము. దీనిలోని ప్రతికథ సంపూర్ణస్వరూపము సంతరించుకొన్నది. ప్రతిపద్యము రామకృష్ణుని ప్రత్యేకమైన ముద్రను కనబరచుచున్నది. పదగుంభనమునకు పేరుపడిన రామకృష్ణుడు క్లుప్తముగా చెప్పుచునే, ఆత్మీయముగా రచనచేయగలడు. కనుకనే తెలుగువారికి అంతటి ఆత్మీయుడు కాగలిగినాడు.

క్షేత్రము - దేవత - తీర్థము-ఈ మూడును కలిసినచోటు ఈ క్షేత్రము. ఇదియే దీనియొక్క గొప్పతనము. ఇంక అచట ముక్తినొందిన వారివలన మనకీ క్షేత్రముయొక్క మాహాత్మ్యము వెల్లడియగుచున్నది.

శౌనకాది మహామునులు సూతునిజూచి క్షేత్ర-దైవత-తీర్థములు మూడును సమప్రధానములైయుండు స్థలమునుగూర్చి తెల్పుమని కోరగా నతడీ క్షేత్ర మాహాత్మ్యమును వచించెను.

అదికల్పమునందలి పదునెనిమిదవ ద్వాపరమునకు పుండరీకుడను ముని ఘోరతపం బొనరింపగా శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై కావలసిన వరమడుగుమనెను.

పుండరీకుడా దేవుని ఆ లలితరూపముతో అచటనే యుండునట్లును అచటి తీర్థ క్షేత్రములు తనపేరిట పౌండరీకములై యుండునట్లును వరము ప్రార్థించెను శ్రీకృష్ణు 'తథాస్తు' యని ఆవర మొసంగెను.

తొల్లి త్రిదంష్ట్రిడను రాక్షసుడు కోపముతో గదనెత్తి పాండురంగని పార్శ్వముపై వేయగా ఆ దేవుడు ఆ గదను తూలించి రాక్షసుని చంపెను. ఆ గదావేగమునకు పాండురంగని మొలనున్న తోలెసంచి తెగిపోయి నిప్పటికి నచ్చటనే పడియున్నదని చెప్పెదరు. ఆ క్షేత్రమునకు పడమట పద్మతీర్థమును, శంఖ పద్మ నిధులును గలవు. అచటనే పిప్పలాకారమున నర నారాయణులు గలరు. పాండురంగని కీగాన్యదిశను కుందలతీర్థము కలదు అచట అశ్వత్థరూపమున నరసింహుడు గలడు. గోపిక యొకర్తె యచటి శ్రీకృష్ణునిగూర్చి తపస్సుచేయగా నాదేవుడు ప్రత్యక్షమయ్యెను. అప్పటి తత్తరపాటున నామె కేశబంధము వీడెను. నీవి కొంతజారెను. ఆమె శ్రీకృష్ణుని యడుగులను గట్టిగ బట్టుకొని ఆవిధముగనే అచట వెలయునట్లు ప్రార్థింపగా అతడట్లే వర మొసగెను. ఆ స్థలమే ముక్తకేశినీ క్షేత్రము. ప్రతిక్షేత్రము ఇట్లేదోయొక విశేషముతో వెలయుట ప్రత్యేకత గలిగి యుండుట యిచట విశేషము. ఆదిక్కునుండియే భైమీనది పొంగి పొరలుచు క్షేత్రముపైకి వచ్చుచుండగా, పాండురంగడు తన పాదములపైనుండి ప్రవహించునట్లుగా దాని నాజ్ఞాపించెను. అదియే భైమీతీర్థమని ప్రసిద్ధమై యున్నది.

ఇంక నీ పాండురంగమాహాత్మ్యములో 'నిగమశర్మోపాఖ్యానము' చాల ప్రఖ్యాతి వహించి తెలుగు సాహిత్యమున సుస్థిరముగా 'నిగమశర్మ అక్క' అను పాత్ర నాటికినేటికి నిలిచి యున్నది.

నిగమశర్మ సదాచార సంపన్నమైన బ్రాహ్మణ కుటుంబమున జన్మించియు సర్వవిధముల భ్రష్టుడై చరింపగా అక్కగారు వచ్చి హితబోధచేసినది. వినినట్లే విని నిగమశర్మ నాలుగు దినములు సత్ప్రవర్తన గలిగి వినయ విధేయలతో మెలగుచు నొకనాటిరాత్రి అందరు నిద్రించుచుండగా, వారి ఆభరణములన్నింటిని అపహరించి యరవివారినపోసాగెను. ఆయడవిలో నొక దొంగలగుంపు నిగమశర్మవద్దగించి అతనిని చావగొట్టి అతనికడనున్న ఆభరణములనన్నింటిని దోచుకొనెను కదలలేక పడియున్న నిగమశర్మ నొకకాపు తనయింటికి తీసికొనిపోయి.

తగిన చికిత్స చేయించి గాయములుమాన్పి కాపాడి, కొంతకాలము తన యింటనే యుంచుకొనెను. ఆ యింటగల అందగత్తెయగు కాపుకోడలు నిగమశర్మను మరులుకొని, అతనిని మరులు కొలిపెను. ఊరిలో జాతర జరిగిన సందర్భమున నతడామెను తీసికొనిపారిపోయెను. వారొక అడవికిపోయి, అచట బోయలతో గలసి పోయిరి. నిగమశర్మ కిరాతుడయి వేటాడి ఆహారము సంపాదించుచుండెను. పిదప కొంతకాలమునకా పడతి మరణించెను. పిదప నిగమశర్మ యొకచండాల వనితను గూడి యామెవలన సంతానము కూడబడసెను. ఒకనాడు అతడు వేటకుపోయి యుండగా అతని గుడిసె కాలిపోయెను. అందుండిన యతని భార్యా పుత్రులు మృతి నొందిరి. అతడదిగాంచి వాపోయి మతిచెడి ఆహార నిద్ర నుజ్జగించి దేశముల గ్రుమ్మరుచు తుదకు శ్రీ నరసింహుడున్న క్షేత్రమున ప్రవేశించి ప్రాణములు విడిచెను. అతడు మహాపాతకియయ్యును నరసింహ క్షేత్రమున మరణించుటచే వట్టి యుత్తమోత్తమ పదవిని పొందెను. ఆ క్షేత్రమునకు దక్షిణ భాగమున శివుడుండును. ఎట్టి మహాపాతకము లొనరించిన వారైననుసరే, అచట మరణించినచో ఇంద్ర పదవిని పొందుదురు. ఇదియే ఆ స్థలమాహాత్మ్యము.

ఇక మహాకవి ధూర్జటి విరచిత "శ్రీకాళహస్తిమాహాత్మ్యము" కూడ నీకోవలో జేరినదే. శ్రీకాళహస్తి భారతదేశ పుణ్యక్షేత్రములలో నొకటియై స్కాంద పురాణ ప్రసిద్ధమైన మహర్షుల నివాసమున కాలవాలమై పవిత్రనదీతీర్థంబులకునికి పట్టయి పార్వతీ పరమేశ్వరుల కత్యంత ప్రియప్రదమై దక్షిణకైలాస నామాంతరముతో భక్తజనంబులకు దంగేటి జున్నై యలరారుచున్నది. శ్రీకాళహస్తులను కీటక సరీసృపతిర్యక్కులకు ముక్తి లభించిన క్షేత్రము. శివదూషణచే గలిగిన శాపమును బరిహరించిన పవిత్ర స్థలము. బోయవాని యెంగిలిదిని పరమేశ్వరుడు తన భక్తుల యెడ దనకు గల యపార వాత్సల్యమును జూపిన యుత్కృష్ట క్షేత్రము.

శ్రీకాళహస్తి సువర్ణముఖీనదికి తూర్పు తీరమందున్న యతి ప్రాచీనమైన పట్టణము. నదియొడ్డుననే దేవాలయము గలదు. దేవాలయమున పశ్చిమ ద్వారమునకు సమీపమున నదియొడ్డున గొప్పయశ్వత్థవృక్షమున్నది. ఆ వృక్షము క్రింద పరమేశ్వరుని శ్రీపాదములు గలవు. కారణాంతరమున శ్రీకాళహస్తీశ్వరుని దర్శింపలేని వారీ శ్రీ పాదములను దర్శించిన నా పరమేశ్వరుని సందర్శించి

సంతతి ఫలితము నొందుదురని జనశ్రుతి. శ్రీ పాదములకు సమీపముగ దూర్పున సూర్యతీర్థమున్నది. అభిషేకాది నిత్యకైంకర్యముల కాతీర్థమే పరమేశ్వరునకు పయోగపడుచున్నది. ఇంక నీ క్షేత్ర ప్రబంధమును గూర్చిన కథావిశేషములు క్షేత్రమాహాత్మ్యము మున్నగు విషయములన్నియు రాబోవు ప్రకరణములలో విశదీకరింతును.

శతకావిర్భావము-ఆత్మాశ్రయ కవిత్వము

ఏ వాఙ్మయము నందైనను గద్యపద్యములలో పద్యమే అల్పాక్షరములతో అనల్పార్థమైన ప్రక్రియగా ప్రసిద్ధికెక్కినది. అనేక సారస్వత ప్రక్రియలతో బాటు 'శతకము' కూడ సంస్కృతమూలకమనియే చెప్పవచ్చును. కాని శతక స్వరూపమునందు మాత్రము ఉభయ భాషలలోని రచనలకు భేదము గలదు.

ఆంధ్రమున మనకు లభ్యములగుచున్న కావ్యములలో మొదటిది నన్నయ భట్టారకుని ఆంధ్రభారతము. అందలి ఆది పర్వమున సుదంకుడు నాగరాజులను స్తుతించు సందర్భమున "మాకు ప్రసన్నులయ్యెడున్" అను ప్రార్థనతో గూడిన మూడుపద్యములు కానవచ్చుచున్నవి. ఉదాహరణకొకటి.

ఉ॥ దేవమనుష్యలోకముల ద్రిమ్మరుచున్ విపుల ప్రతాపసం
భావిత శక్తిశౌర్యులు నపార విషోత్కట కోపవిస్ఫుర
త్పావకతాపి తాఖిల విపక్షులునైన మహానుభావులై
రావత కోటి ఘోరఫణిరాజులు మాకు ప్రసన్నులయ్యెడున్.

(ఆదిపర్వము)

(మహాభారతము. ప్ర. ఆ. 106)

ఇట్లే నన్నిచోడుడు కుమారసంభవమున రెండుచోట్ల స్తుతిపూర్వకములై శతక పద్యములను దలపించు పద్యములు వచించి యుండెను. అందు దారిద్ర్య విద్రావణా అను మకుటముగల పద్యములు ప్రసిద్ధములైనవి. ఉదాహరణకు

భయరోగార్తి మహాదురాఘచయమున్ బాయన్ముదంబొందని
ర్భయ కల్యాణసుకాంతి సంపద సుఖప్రాప్తుండగున్ దుఃఖసం
క్షయమై కర్మనిబంధనాపహరమై సేవ్యాత్ముడై ముక్తుడౌ
దయ నీవెవ్వని జూచువాడు భువిలో దారిద్ర్యవిద్రావణా

(కుమార సంభవము)

శైవమతాచార్యుడైన మల్లికార్జున పండితారాధ్యుడు "అజా, రుద్రా, శివా" యను మకుటములు గల పద్యములు నాలుగైదువందలు వ్రాసి వానికి శివతత్త్వసారమని పేరుపెట్టెను. శతకమనుపేరు లేకున్నను ఈ పద్యములు సర్వవిధముల శతకము లనే పోలియున్నవి. పాల్కురికి సోమనాథుడు పండితుడు రచించిన గ్రంథములు పేర్కొనుచు 'శతకంబు శివతత్త్వసారము దీపకళిక' అని వ్రాసి యుండెను. పండితుడు శివతత్త్వసారము గాక శ్రీగిరి మల్లికార్జున శతక మొండు రచించెనని చెప్పుచున్నారు. ఎట్లయినను తెలుగున మల్లికార్జున పండితుడే ప్రథమశతక కర్తయని చెప్పవచ్చునని డా॥ దివాకర్ల వెంకటావధాని గారు తమ ఆంధ్ర వాఙ్మయ చరిత్రయందు పేర్కొనిరి. పాల్కురికి సోమనాథుడు రచించిన వృషాధిప శతకము సర్వలక్షణ సంపన్నమైన శతకమే. తరువాత పలువురు కవులు తమయిష్టదైవతముల సంబోధించుచు పెక్కు శతకములు రచించిరి.

శతకమను పేరే యిది నూరు పద్యములతో గూడిన గ్రంథమని తెల్పు చున్నది. కాని పెక్కుశతకములలో నూటయెనిమిది పద్యముల వఱకు గానవచ్చు చుండును. భగవన్నామ స్తోత్రములందు సహస్రమో, అష్టోత్తర శతమో, నామము లుండుట పరిపాటియగుటచే శతకములు కూడ నష్టోత్తర శతపద్య పరిమితములై యుండుట సంభవించినట్లు తోచుచున్నది. నూటికి తక్కువ సంఖ్యగల పద్యము లతో గూడిన రచనలును గొన్ని కానవచ్చుచున్నవి. వానిలో పంచరత్నములు, నవరత్నములు, తారావళులు, అక్షరమాలలు ముఖ్యములైనవి. గ్రహములు తొమ్మిది, రాసులు పండ్రెండు, నక్షత్రము లిరువదియేడు, ఈ సంఖ్యలతో గల సంబంధమును బట్టికూడ శతకములందలి పద్యముల సంఖ్య నూటయెనిమిదిగా స్థిరపడియుండును. సంస్కృత ప్రాకృతములందు త్రిశతులు, పంచశతులు, సప్త శతులు, సహస్రములు, కూడ గలవు.

శతకములు ప్రాయికముగా భగవన్నుతి పూర్వకములైన గ్రంథములు. ఇట్టి స్తోత్రములు ఋగ్వేద కాలమునుండియు గోచరించును. ఋగ్వేదము, నింద్రాగ్ని రవివరుణాది దేవతలస్తోత్రముల సముచ్చయమని చెప్పవచ్చును. లౌకిక సంస్కృత మున మయూరుని సూర్యశతకము, భర్తృహరి సుభాషితత్రిశతి, మున్నగు శత కములు కానవచ్చుచున్నవి. శ్రీ శంకరాచార్యస్వాములవారి 'శివానందలహరి' వంటి స్తోత్రగ్రంథములను గూడ శతకములుగనే పరిగణింపవచ్చును. ఇవిగాక సంస్కృతమున సహస్రనామస్తోత్రములు, అష్టోత్తర శతనామ స్తోత్రములు పెక్కు గలవు ప్రాకృతమున హాలుడు సంకలించిన గాథా సప్తశతి యేడు శతకముల సమాహార మని చెప్పదగియున్నది. ఇదిగాక యవదాన శతకమను వేతొక నామము కూడ ప్రాకృతమున వినవచ్చుచున్నది[1]. కన్నడమున కూడ శతకములు శతకప్రాయములునైన రచనలు పెక్కుగలవట. కర్ణాటక కవి చరిత్ర మొదిగా గల కన్నడ వాఙ్మయ చరిత్రలందు క్రీ. శ. 1070 ప్రాంతమున జీవించిన నాగవర్మ ప్రథమ కన్నడ శతక కర్తగ గీర్తింపబడుచున్నాడు. ఈతని చంద్ర చూడామణి శతకము 'జ్ఞాన సారము' అను నామాంతరమునను ప్రసిద్ధము. ఈ శతకము 'శ్రీ చంద్ర చూడమణీ' అను మకుటమున రచింపబడినది. క్రీ. శ. 1120 ప్రాంత మున జీవించిన మౌక్తిక కవి చంద్రనాథాష్టకమును, శీలవంతయ్య గురు స్తోత్ర మును మకుటాత్మకముగ రచించెను. ఈ శతాబ్దినాటి హరీశ్వరకవి పంపా శతక మును రచించెను. రక్షాశతకము కూడ ఇతని కృతియని తెలియును కాని అది అలభ్యము. ఈ యుగమున గల బొప్పణ ఆదిగా గల కవులెందరో స్తోత్రములను రచించియుండిరి.

శతక పద్యములు చివర సమానమైన మకుటము కానవచ్చును. ఈ మకు టము భక్తి శతకములందు భగవత్సంబోధనా రూపమైయుండును. కాని సుమతీ శతకము మున్నగు వానియందట్లుగాక నీతి బోధకముగా నుండవచ్చును. సంస్కృత శతకములందు మకుట నియమము కానరాదు. శతకములు సాధారణ ముగా నొకే ఛందమున వ్రాయబడుచుండును. సంస్కృత కావ్యములందొక్కొక్క సర్గమున నొక్కొక్క వృత్తభేదము గ్రహింపబడుచుండు నాచారముగలదు. సర్గాంత

---

1. ఆంధ్రశతక సాహిత్య వికాసము-డా॥ గోపాలకృష్ణరావుగారు

మున మాత్ర మొంతు రెండు భిన్న వృత్తములు వ్రాయబడుచుండును. తెలుగున కందరామాయణములని గీతరామాయణములని కొన్ని రచనలు గలవు. కాని ఆంధ్ర కావ్యములలోని యాశ్వాసములు వివిధ పద్యవృత్తమయములై యుండుటయే తెలుచు కావ్యములందువలె శతకములలో నందలి పద్యములన్నిటికిని సంబంధము సమకూర్చు కథాసూత్రము కానరాదు. అందలి పద్యములు వేనికవియే స్వతంత్ర ములు. అందుచే వీనిని ముక్తక కావ్యములని చెప్పవచ్చును. పాత్ర పోషణమున కవకాశముండదు. శతకములు సాధారణముగా గ్రంథకర్త యాత్మ భావములను ప్రకటించునవిగా నుండును. అతడందు దోషములు మన్నించి, యాపదలు నివా రించి తన్ను రక్షింపవలెనని భగవంతుని ప్రార్థించును. ఆత్మ పరిశీలనము చేసి కొని గత జీవిత దోషములు స్మృతికి వచ్చుటచే పశ్చాత్తాపము నొందును. తన మనస్సు నాకర్షించిన వేల్పు గుణగణములను, మహిమానుభావములను వర్ణించును. దీనినే ఆత్మాశ్రయకవితయందురు. భక్తి శతకములు పెక్కు ఆత్మాశ్రయ కవితా జాతికి జెందియుండును. అవి కవులు సహృదయాంతరాళమునను భగవంతునికి బయల్పఱుచుటకై చేయు సంభాషణలు. కొన్ని శతకములలో గవులు ప్రసక్తాను ప్రసక్తముగా దమనాటి సాంఘికాది పరిస్థితులను వర్ణింతురు. కొందఱు కవులు భాగవత రామాయణ కథా సంగ్రహములను శతక రూపమున జెప్పియుండిరి.

[1]సంస్కృత లాక్షణికులు శతకములను క్షుద్ర కావ్యములుగా పరిగణించి యుండిరి. ఇచట క్షుద్రశబ్దము నీచార్థమునగాక యల్పార్థమున వాడబడినది. క్షుద్ర కావ్యమనగా చిన్న కావ్యమని యర్థము. సంస్కృతమున 'అమరుక' మొదలగుగల శతకములు స్తోత్రములు తమ కాలము నాటికి బహుళముగా నున్నను ప్రాచీన సంస్కృతాలంకారికులెవరును శతకమును ప్రక్రియగా గుర్తించలేదు. వారు శతక మును పద్య కావ్యముగ, అనిబద్ధ అసర్గ బంధ కావ్యాంతర్గతముగ గణించియుందు రని తోచును. సంస్కృత ప్రాకృత వాఙ్మయ ప్రక్రియకు ప్రతిబింబమై విశిష్ట లక్షణములతో భాసించినది ఆంధ్రశతక ప్రక్రియ.

ఆంధ్ర శతక స్వరూపమును తల్లక్షణమును నిరూపించుటకు పూర్వము సంస్కృతాంధ్రాలంకారికులు పరిశీలించి వివిధ కావ్య స్వరూపములను గోపాల

---

1. ఆంధ్రశతక సాహిత్య వికాసము - డా॥గోపాలకృష్ణరావుగారు.

కృష్ణరావుగారు తమ 'ఆంధ్ర శతక సాహిత్య వికాసము' యను గ్రంథమున వివరించిరి. భరతముని తరువాత పేర్కొనదగిన ప్రాచీనాలంకారికుడు భామహుడు. భామహుని నాటికి శతకము అనిబద్ధ కావ్యముగ గుర్తింపబడినట్లు స్పష్టమగుచున్నది. క్రీ॥శ॥ ఏడవ శతాబ్దిలో జీవించిన ఆచార్య దండి భామహుని కావ్య భేదములను విపులీకరించి కొన్ని సంఖ్యామూలక కావ్యములను పేర్కొనెను. "ముక్తకం కులకంకోశః సంఘాత ఇతి తాదృశః" ఏకైక శ్లోకము ముక్తకము. ఏకకవికృత ముక్తక సముదాయము కులకము. ఏకకవికృత ఏకార్థ విషయక శ్లోక సముదాయము సంఘాతము. వివిధ కవుల ముక్తకముల సముచ్చయము కోశము. అనంతరము ఎనిమిదవ శతాబ్ది నాటి వామనుడు భామహుని మతము ననుసరించిన బద్ధ, అనిబద్ధ కావ్యము నుదాహరించెను.

14వ శతాబ్ది నాటి విద్యానాధుడు పేర్కొనిన మఱికొన్ని కావ్య భేదములు గమనింపదగినవి. "అసర్గ బంధమపి యదుపకావ్యము దీర్యతే" అని ఈతడు ఉపకావ్య ప్రసక్తి గావించెను. పూర్వాలంకారికు లెవరును అసర్గ బంధ అనిబంధ కావ్యముల నుపకావ్యముగ గ్రహించలేదు. ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత అసర్గబంధ కావ్యమునకు లక్ష్యముగ సూర్య శతకాదుల నుదహరించెను. ఈ శతాబ్ది వాడగు విశ్వనాథుడు ముక్తక కలాపకాదుల లక్షణములను వివరించెను. ఈ అలంకారికు లెవరును కావ్య భేదములు చూపునపుడు శతకమును ప్రత్యేక కావ్యముగ స్పష్టముగ పేర్కొనక దానిని అనిబద్ధ క్షుద్ర, లఘు, సంఖ్యామూలక, ఉపకావ్య ప్రక్రియాంతర్గతముగా మాత్రమే గణించిరి.

నన్నయ యుగము నుండి ఆధునిక యుగము వరకును 'శతకప్రక్రియ' సజీవ స్రవంతివలె కొనసాగినది. మహా కావ్యములతోపాటు శతకమూ వర్ధిల్లెను. శతకమన్న పేరు లేకున్నను శతక పద్యములను బోలిన పద్యములు, పెక్కులు గానబడుచున్నవి. వేరు, వేరు నామములతో పిలువబడుచున్ననూ మొత్తము మీద శతకములను బోలిన రచనలు అనాదినుండియు కలవనుటకు పెక్కు నిదర్శనములు గలవు. క్రీ.శ. 60-70 ప్రాంతమున జీవించిన మల్లికార్జున పండితారాధ్యుడు ప్రథమాంధ్ర శతక కర్తగ గీర్తి వహించెను. అంతకు ముందు తెలుగులో వెలువడిన మహా కావ్యములు రెండు నన్నయ ఆంధ్ర మహాభారతము, నన్నిచోడుని కుమార సంభవము. నన్నయకు పూర్వము కాని నన్నయకు

మల్లికార్జున పండితునకు మధ్యగల కాలమున శతక రచన జరిగినట్లాధారములు లేవు. అష్టకములు - ముక్తకములు, స్తోత్రము మొదలగు ప్రక్రియలు భక్తి ప్రధానములైనవి. బహుళజనాదరము నొందినట్లు మాత్రము పాల్కురికి సోమన రచించిన పండితారాధ్య చరిత్రవలన తెలియుచున్నది. పదములకు విశేషాదరము నాడుండెనని నిరూపించుటకీ వర్ణనలు, ఆధారములు. మల్లికార్జున పండితుడు బౌద్ధగురువులతో వాదించుటకు వెడలిన అతని ననుసరించిన శిష్య బృందము వివిధ పదముల నాలపించుచు వచ్చిరని ఈ సందర్భమున వర్ణితము.

''పదములు, తుమ్మెద పదముల్ ప్రభాత
పదములు, శంకర పదముల్ నివాళి
పదములు, వాలేశు పదములు గొబ్బి
పదములు, వెన్నెల పదములు
బాడుచు నాడుచు........''

సంఖ్యా మూలక పద్య కావ్య భేదముల నుల్లేఖించి అందు శతకమును స్పష్టముగ పేర్కొనిన సంస్కృతాలంకారికుడు అమృతానందయోగి. ఈతని 'అలంకార సంగ్రహము' పదమూడవ శతాబ్ది నాటిదని నిర్ణయింపబడినది.

ఆంధ్ర లక్షణ గ్రంథములలో ప్రథమముగ బేర్కొనదగినది భీమన కృతమని విశ్వసింపబడుచున్న కవిజనాశ్రయము. పదమూడవ శతాబ్ది నాటి ఈ గ్రంథమున గద్య పద్యములను కావ్య భేదములు మాత్రమే వివరింపబడినవి. ఈతని అనంతరము పేర్కొనదగిన లక్షణకారుడు [1]విన్నకోట పెద్దన. పదునేనవ శతాబ్ద్యారంభమున 'కావ్యాలంకార చూడామణి' అను గ్రంథమును రచించెను. ఈతడొనర్చిన కావ్యభేద నిరూపణము సంస్కృతాలంకారికుల మార్గము ననుసరించినది. సంఖ్యా పూర్వకమైన రచనల నీతడు స్పష్టముగ నిరూపించెను.

''పరగు ముక్తక మేక పద్యంబు
పద్య ద్వయంబు ద్వికము నాగనలరు''

---

1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము (గోపాలకృష్ణరావుగారు)

అను పద్యమున త్రికము, పంచరత్నము, అష్టకము, రత్నమాలిక, నలినమిత్ర మాలిక, ఇందుకళ, నక్షత్రమాల మున్నగునవి క్రమముగ నుల్లేఖింపబడినవి.

సప్తవింశతియైన నక్షత్రమాం
తెలియ ముప్పది పద్యముల్ త్రింశదాఖ్య
మవల పంచాశదాహ్వయంబైదు పదులు
శతకమన నొప్పుమతి పద్య శతము గూడ

అష్టోత్తర శత పద్యము
లష్టోత్తర శతమనగ నడరు గవీంద్రుం
డిష్టమగు సంఖ్య జెప్పిన
దుష్టము గాదది కర్తతుష్టిన చేయున్

చిన్నకోట పెద్దన అనంతరము శతకమును సంఖ్యా బద్ధమైన చాటు ప్రబంధమని స్పష్టముగ నిరూపించిన అలంకారికుడు అప్పకవి. ఈతని కావ్య భేద నిరూపణము పూర్వాలంకారికుల కంటె విలక్షణమైనది. ఈతడు పదునేడవ శతాబ్దివాడు. ఈతడు ప్రబంధము, చాటు ప్రబంధము అను కావ్య భేదముల నుల్లేఖించి చాటు ప్రబంధములను సంఖ్యా బద్ధములు, అసంఖ్యా బద్ధములు అను రీతిలో వర్గీకరించెను.

అప్పకవి నాటికి తెలుగులో ప్రశస్తములైన శివతత్త్వసార వృషాధిప, సర్వేశ్వరాది శతకములు వెలువడినవి. అంతియేకాక అతడే స్వయముగ వజ్రపంజర, మరున్నందన, దేవకీ నందన, శతకముల నుండి పద్యములను లక్ష్యములుగ నుదహరించియుండెను. అట్లయ్యు శతకమను పేర కావ్య ప్రక్రియను పేర్కొనక సంఖ్యాబద్ధమగు చాటు ప్రబంధము అను కావ్యభేదమును గ్రహించెను. శతకమును విస్తృత పరిధిలో చేర్చుటలో అతడు తృప్తి నొందెనని తోచును. కావ్య భేదములను పరిశీలింప సంస్కృతాంధ్రాలంకారికులు శతకమును కొందఱు ప్రత్యక్షముగను, మఱికొందరు పరోక్షముగను విశిష్ట కావ్య ప్రక్రియగా గుర్తించి నట్లు స్పష్టము. వారు సంఖ్యాబద్ధమగు రచనగా గ్రహించి ముక్తకాదుల శ్రేణిలో చేర్చి యుండిరి. కాని శతకలక్షణమును సంపూర్ణముగ నిరూపించలేదు. అనిబద్ధ

కావ్యాంతర్గముగ గ్రహించినందున శతకమునందు ఆశ్వాసాదులుండవని సూచ్యము. ముక్తక సముచ్చయము కనుక ప్రతి పద్యము స్వతంత్రమై పరస్పరము నిరపేక్షభావము కలది అనుటయు గ్రహింపనగును. పద్య కావ్య భేద మగుట వలన దాని లక్షణములు కొన్ని శతకములకును అన్వయింపవచ్చును. శతక ప్రక్రియను విశిష్టమైన ప్రక్రియగా గుర్తించియు సంపూర్ణ లక్షణమును నిరూపించనందున ఆంధ్ర లాక్షణికుల మతమును స్పష్టముగ గ్రహించని స్థితి ఏర్పడినది. శతక లక్షణములను నిరూపించు సందర్భమున సంస్కృతాంధ్ర లాక్షణికులు కొంత ఔదాసీన్యము వహించి యుండిరి. అనిబద్ధ కావ్యములలో కొన్నింటిని అనగా ఉదహరణాది ప్రక్రియలను గమనించి లక్షణమును వివరించిన ఆంధ్రాలంకారికులు తమ కాలము నాటికి శతక మొక విశిష్ట కావ్యప్రక్రియగా రూపొందినను తల్లక్షణమును సంపూర్ణముగా వివరింపలేదు.

తెలుగున శతకము మహా కావ్య ప్రక్రియతోపాటు బహుళముగ నాదృతమై కాలోప కాలంతో విస్తరిల్లినందున ఆధునిక సాహిత్య చరిత్రకారులు, విమర్శక పండితులు దాని స్వరూపమును లక్షణమును నిరూపించుటకు యత్నించిరి. వీరిలో కొందరు ప్రాచీనాలంకారికులు శతకమును సమగ్ర దృష్టితో పరిశీలించి లక్షణములు వివరించిరి *కీ.శే. వంగూరి సుబ్బారావుగారు ఆంధ్ర వాఙ్మయ చరిత్రయందు శతకములు భావగీతములని నిర్వచించిరి. కాశీభొట్ల నాగేశ్వరరావుగారు భాగవతములు భౌతికానందమును, శతకము లాధ్యాత్మికానందమును గలుగజేయుననియు, తత్కారణమున శతకములు భావగీతములు కానేరవనియు స్పష్టమొనర్చిరి. వీరు భక్తి శతకములను దృష్టియందిడికొని నిర్వచనము నొసగుటకు ప్రయత్నించినట్లు స్పష్టము. ఆత్మాశ్రయ కవితా ధర్మము భావగీతములందును, శతకములందును ప్రధానముగా భాసించుచున్నది. తెలుగు శతకము సంస్కృత ప్రాకృత ప్రక్రియ లక్షణము ననుసరించినది. అందు 'దేశి' లక్షణ మొకటి యైనను లేదు. తెలుగు శతకమునకు మకుటము ప్రధాన లక్షణమనియు, నట్టి నియమము సంస్కృతాది భాషలలోని శతకములలో లేదని కొందఱు విమర్శకు లూహించియుండిరి. [1]కాని మకుటము అను నియమమును తెలుగువారే ప్రత్యేకముగా పాటించలేదు. అది సంస్కృతము నుండియే తెలుగులో ప్రవేశించినది. తెలుగు శతక లక్షణములలో

---

* శతక వాఙ్మయము -వంగూరి సుబ్బారావు గారు.

ఏ ఒక్క లక్షణమైనను సంస్కృత శతకలక్షణమున కఠినముగ గన్పించదు. ఈ దృష్టితో పరిశీలించినపుడు శతకమును దేశి ప్రక్రియగా గుర్తించుట సమంజసము కాదు. శతకమును ఖండకృతిగా స్వీకరించిన విమర్శకుల అభిప్రాయము పరిశీలింపదగినది. ప్రాచీనాలంకారికులు కొందఱు శతకమును 'ఉపకావ్య' మనిరి. ఏకసూత్రత లేని పద్య సముచ్చయమును ఖండ కావ్యమనుట సమంజసము కాదు. శత, అష్టోత్తర, శత సంఖ్యా నియమము పాటించక శతక రచన చేసిన వారును గలరు. ఆంధ్ర శతక వాఙ్మయము ఏ ఒక్క లక్షణమునైనను విధిగా పాటించని రీతిలో శాఖోప శాఖలుగ వికాసము నొందినది. కథా సూత్రత గలిగిన శతకములు ముక్తక పద్యసముచ్చయ మను శతక లక్షణమునకు భిన్నముగనున్నవి వేలకొలది శతకములలో సర్వ సాధారణముగా గన్పించు ధర్మమును పరిశీలించి "మకుటాత్మక మగు శత ముక్తక సముచ్చయమే శతకము" అని నిర్వచింప వచ్చును. తెలుగు శతకములో ప్రధానముగ పాటింపబడిన లక్షణము లివి.

1. సంఖ్యానియమము. 2. మకుటనియమము 3. ఛందోనియమము. 4. రస నియమము. 5 ఆత్మాశ్రయ కవితా ధర్మము.

తెలుగులో నిర్మకుటముగ కొన్ని శతకములు వెలువడినను, మకుటాత్మక శతకముల సంఖ్యయే బహుళము మకుట నియమము వేదము లందలి స్తోత్రము లందును, సంస్కృత శతకము లందును కన్పించును. ఋగ్వేద తృతీయ మండలమున "సజనాః ఇంద్రః" అను మకుటము పదునాలుగు ఋక్కులలో కలదు. ఆంధ్ర శతక కర్తలు భక్తి శతకములందేకాక తదితర శతకములందును మకుటమును పాటించిరి. ఇందు సంబుద్ధ్యంత మకుటముల సంఖ్య అధికము. కొందఱు ఏకైక మకుట నియమమును మఱికొందరు శతక కర్తలు పద్యపాదాంతమునగాక పద్యారంభము నందును మధ్యలోను మకుటములు ప్రయోగించిరి. శతావధాని చిదంబరశాస్త్రిగారు దారుణ శతకమున ప్రతి పద్యారంభమున 'దారుణమా నీకు నమస్కార' మను మకుటమును గ్రహించిరి.

---

1. శతక వాఙ్మయము - వంగూరి సుబ్బారావుగారు.

శతకము సంఖ్యాబద్ధమగు చాటు ప్రబంధమని లాక్షణికులు నిర్వచించిరి. ఈ కావ్యప్రక్రియా నామమే సంఖ్యాత్మకమై శతనియతిని సూచించుచున్నది. శత శబ్దమునకు కమ్ ప్రత్యయముచేరి శతక మైనది. తొలిదశలోని శతకములలో సంఖ్యానియమము పాటింపబడినను అనంతర కాలమున వెలువడిన శతకము లీ నియమము నతిక్రమించినవి. రెండు మూడు వందల పద్యములు గల రచనలు కూడ శతకములుగ రూఢి కెక్కినవి.

వృత్తనియమము

ఈ నియమమును ఆంధ్ర శతక కర్తలు సంస్కృత శతకముల నుండియే గ్రహించిరి. తెలుగు శతకములో మకుట నియమము వృత్త నియమము పరస్పరాశ్రితమైనవి. మకుటము కారణముగ వృత్తనియమము తప్పదు. విభిన్న మకుటములు పాటించిన వారు కొందఱు వివిధ వృత్తములలో పద్యములలో శతక రచన మొనర్చిరి. కొందఱు శతక కర్తలు పద్యములతో బాటు వచన భాగములు కూడ చేర్చి శతకములు వ్రాసిరి. కొందఱు శతక కర్తలు శ్రవ్య కావ్య లక్షణములతో బాటు దృశ్యకావ్య లక్షణములను కూడ ప్రవేశ పెట్టిరి వీరు శతకములను అంకములుగా విభజించిరి. ఇక్కేపల్లి జగ్గకవి రచితమగు పంచీకరణ పద్య శతకము చంపూ కావ్యసాంప్రదాయము ననుసరించినది. ఇందు మధ్యమధ్య వచన భాగములు గలవు కొటికలపూడి కోదండరామకవి రచించిన జానకీ శతకము త్రిశతి వంటిది.

రస నియమము

భక్తి రసాత్మక శతకముల సంఖ్య తెలుగులో అధికముగా నున్నది. ఏకైక రస నియమము, శతకకర్తలు పాటించినను కొందఱు అంగి అంగరసముల క్రమము ననుసరించిరి. భక్తి శృంగార కరుణ హాస్య వీర రసాత్మకములుగ తెలుగు శతకములు వెలువడినవి.

కొందఱు శతకకర్తలు వర్ణనాత్మక కథాత్మక శతకములు రచింప దొడగిరి. కథాత్మకములగు శతకములలో కొందఱు ఏ పద్యమున కాపద్యము స్వతంత్రముగా నుండునట్లు రచించుటకు ప్రయత్నించినను కథలో ఏక సూత్రత కన్పించును.

ఆత్మాశ్రయ కవితా ధర్మము

భక్తి శతకములు కవి ఆత్మానుభూతి ప్రధానము లగుటవలన శతకములు భావగీతములను అభిప్రాయమును విమర్శకులు కొందఱు వెలువరించిరి. వర్ణనాత్మక కథాత్మక వివిధ శాస్త్ర శతకములలో ఈ నియమము కన్పించదు: భక్తి శతకముల సంఖ్య బహుళమగుటచే విమర్శకులు ఈ ధర్మము శతకములలో ప్రధాన లక్షణమని భావించియుండిరి. కొన్ని నీతి శతకములందును, తదితర శతకములందును కవులు ఆత్మానుభూతిని వ్యక్తీకరించి యున్నారు. కనుక ఇదియు శతకములకు ప్రధాన లక్షణమని గుర్తింపవచ్చును.

కొందఱు శతకకర్తలు కావ్యావతారికా సంప్రదాయమును పాటించిరి. ఇష్ట దేవతాస్తుతి-గురుస్తుతి, సుకవి ప్రశంస, కుకవి నింద, షష్ఠ్యంతములు-శతాంతగద్య మున్నగు లక్షణములను అనుసరించి శతకములు రచించినవారు కలరు. ప్రాచీన శతకకర్తలు దశక విభాగము ననుసరింప, ఆధునికులు శతకములను వివిధ భాగములందు, ఆశ్వాసములందు ప్రథమ, ద్వితీయ పూర్వోత్తర భాగములందు స్కంధ, ఆశ్వాస కాండ అంశములలో శతకములు రచించిరి. ప్రాచీనభక్తి శతకములు భగవదంకితములుగ రచింపబడి యుండెను. ఈ సంప్రదాయము నీతి అధిక్షేప శృంగార శతకములందును అనుసరింపబడెను.

[1]ఆంధ్ర వాఙ్మయము నందలి శతకములను నీతిశతకములు, భక్తి శతకములు, వ్యాజస్తుతి శతకములు, వేదాంత శతకములు అని నాలుగు విధములుగా విభజింపవచ్చును. నీతి శతకములు సర్వజనహితకరములైన నీతులతో గూడి చదువు వారి ప్రవర్తనమును జక్క చేయుటకు దోడ్పడుచుండును. భక్తి శతకములలో గవులకు దమ యిలవేల్పులపై గలహార్దమైన భక్తి జాలువాఱుచుండును. వ్యాజస్తుతి శతకములు నిందా వ్యాజమున నాయా దేవతల మహిమానుభావములను వర్ణించుచుండును. ఇట్టి వానికి పోతన భాగవతాది గ్రంథములలో నుదాహరణములు కానవచ్చును. దేవనిందకులు విష్ణువును దూఱునప్పుడు పోతన సాధారణముగా నీ వ్యాజస్తుతినే యాశ్రయించుచుండును. వేదాంత శతకములు తత్త్వ వేదాంతమయములై దుర్గహములైన వేదవేదాంతముల సారమును ముముక్షువులకు సులభముగా నందజేయును.

---

1. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - డా॥ దివాకర్ల వేంకటావధానిగారు.

నీతి శతకములు

నీతి శతకము లందలి నీతులు మానవ సంఘము నందలి వివిధ వ్యక్తులకు సంబంధించియుండును. ఇందు రాజనీతి, గృహనీతి, లోకనీతి, ప్రవృత్తి నీతి ముఖ్యములైనవి. నీతి శతకములలో నగ్రగణ్యమైనది సుమతి శతకము. 18వ శతాబ్ది యందలి బద్దెన యను భద్రభూపాలుడీ శతకమును రచించెనని ప్రతీతి సుమతి శతకము వలెనే యాంధ్ర దేశమున విశేషప్రచారము నందిన మతియొక నీతి శతకము భాస్కర శతకము మారద వెంకయ్య యనుకవి దీనిని రచించెనని చెప్పెదరు.

భక్తి శతకములు

భక్తి శతకములలో "బసవా, బసవా, బసవా వృషాధిపా" యను మకుటముతో శైవకవి సార్వభౌముడైన పాల్కురికి సోమనాథుడు రచించిన వృషాధిప శతకము మొట్టమొదటిది. ఇందు కవికి బసవేశ్వరుని యందుగల భక్తియు, వివిధ భాషా పరిజ్ఞానము వెల్లడి చేయబడినవి. కొంచె మించుమించుగా పాల్కురికి సోమనాధునికి సమకాలికుడని చెప్పదగిన యధావాక్కుల అన్నమయ్య 1242లో సర్వేశ్వర శతకము రచించెను.

ధూర్జటి మహాకవి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము భక్తి నైర్మల్యము చేతను, భావగాంభీర్యము చేతను మృదు మధుర ప్రయోగము చేతను తెలుగు నందలి శతక వాఙ్మయమున కలంకారమని చెప్పదగినవి. ఈ శతకమున కవి పశ్చాత్తాపము, వైరాగ్యము చక్కగా వెల్లడి చేయబడినవి. ఇందురాజులను వారొనర్చు ధూర్త చర్యలను బలు విధముల నిరసింపబడినవి. ఇందలి శైలి ప్రౌఢమై ధారాశుద్ధిశోభితమై మిగుల హృద్యముగా గలదు. ధూర్జటి ఆత్మీయాంశ మిందు పెక్కుచోట్ల గానవగును. ఇంకను పెక్కు భక్తి శతకములు గలవు.

వ్యాజస్తుతి శతకములు

ఇందు స్తుతిలో నిందగాని, నిందలో స్తుతిగాని అంతర్గతమై యుండును. వ్యాజస్తుతి శతకములలో మొదట పేర్కొనదగినది గోగులపాటి కూర్మనాథకవి

రచించిన సింహాద్రి నారసింహశతకము. ఆ సమయమున ఆంధ్రదేశము యవనుల దురాగతములకు లోనై కడుగండ్లు గుడుచుచుండెను. స్త్రీలను చెరపట్టుట, మత గ్రంథములను మంటగలుపుట, దేవాలయములను బడగొట్టుట మున్నగు నత్యాచారములు సర్వత్ర సాగుచుండెను. ఒకప్పుడు యవనసేన సింహగిరిపైకెక్కి సింహాద్రి క్షేత్రమును గొల్లగొట్ట నుద్యమించెను. ఆ యుపద్రవమును గన్నులార గాంచి భక్తుడైన కవి స్వామి యగ్రభాగమున నిలిచి ప్రజలను, దేశమును గాపాడవలెనని నరసింహస్వామి నీ శతకమునందలి పద్యములతో ప్రబోధించి యుండెను. భల్లా పేరయ్య కవి రచించిన భద్రగిరి శతకముకూడ నిందాస్తుతిమయమైనదే. ఇంకను కొన్ని వ్యాజస్తుతి శతకములు గలవు.

తత్త్వ శతకములు

ఉపనిషదాదులందు నిరూపింపబడిన తత్త్వవిషయములు పండిత జనైకవేద్యములై సామాన్యులకు దుర్బోధకము లగుటచే గొందఱు కవులాగూఢ వేదాంత విషయములనే చక్కని తేటతెలుగు మాటలతో శతక రూపమున వెల్లడించిరి. భక్తి రసమయములైన శతకములన్నింట నెడనెడ నాధ్యాత్మిక విషయములుకూడ వివరింపబడుచునే యుండును. శ్రీకాళహస్తీశ్వర, దాశరథీశతకములిందు కుదాహరణములు. తత్త్వశతకములుకూడ నట్లే ప్రధానముగా దత్త్వవిషయములనే ప్రవచించినను భక్తిరస భరితములైకూడ నుండును. ఆంధ్రమున నిట్టి శతకములలో నారాయణ శతకము ప్రాచీనమైనది. ఇది గేయరూపమై భగవద్గీతాదులందు నిక్షిప్తములైన యద్వైత రహస్యములను చేటతెనుగు మాటలతో వ్యక్తముచేయుచున్నది. రామ రామ శతకముకూడ నిట్టిదే. దీనిని తోట వెంకట నరసింహకవి రచించెను.

ఈ నాలుగు తెఱగుల వర్గీకరణమేకాక శతకములింకను పలుతెఱగుల విభజించిరి. కథాత్మకములని, చారిత్రాత్మకములని, సంకలనములని పలుతెఱగులు కలవు. అనువాద శతకములుకూడ గలవు. సంస్కృత భాషయందు కొన్నివందల శతకములు రచింపబడినవట. తెలుగు వారు సరేసరి. ఈ ప్రక్రియ నెంతగానో ఆదరించిరి. తెలుగు శతకములు విశిష్టములైనవని శతకవాఙ్మయ వికాసమే నిరూ

పించుచున్నది. శతక స్వభావమునందు మార్పులు ప్రవేశపెట్టినట్లే తెలుగు శతక కర్తలు శతక స్వరూపమునకు క్రొత్తదనము గలిగించి యుండిరి.

శతకప్రక్రియను కొందఱు కవిత్వ సాధనకు సోపానముగ స్వీకరించిరి. కొందఱు బాల్యదశలో శతకరచన కుపక్రమించిరి. మఱికొందఱు పరిణత దశలో శతకములు రచించి ఈ ప్రక్రియకు ఉత్తమకావ్య గౌరవమును గలిగించిరి. తప్పులు తరగలుగనున్న శతకములును, మహాకావ్యశ్రేణిలో చేర్పదగిన శతకములును తెలుగులో వెలువడినవి. సంస్కృత కవులవలె కొందఱు తెలుగుకవులు కేవలము శతకములు రచించియే మహాకవులకు దీటుగా సాహిత్యచరిత్రలో విశిష్ట స్థానము నొందినారు. యథావాక్కుల అన్నమయ్య, వేమన, కాసుల పురుషోత్తమ కవి మున్నగువారు శతకములు రచించియే ఉత్తమ కవులుగ ప్రశస్తివహించిరి.

పండిత పామరుల రంజింపజేయునట్టి ప్రక్రియలలో శతకమునకు ప్రత్యేక స్థానము కలిగినది. శతకములవలె బహుజనాదరము నొందినట్టియు, వేలసంఖ్యలో ప్రతులు వెలువడినట్టియు కావ్యప్రక్రియ వేఱొక్కటిలేదు. ప్రాచీనకాలమునుండి నేటివరకును దాదాపు ఎనిమిది శతాబ్దుల వరకు సజీవ స్రవంతివలె నిలిచిన కావ్య ప్రక్రియలో శతకమొకటి. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ వారు విశ్వనాథ వారి మధ్యాక్కరలకు అఖిలభారత స్థాయిలో పట్టముగట్టి తెలుగు శతకమునకు గల పైశిష్ట్యమును లోకమునకు వెల్లడించినారు తెలుగు శతకములు జాతీయజీవన చిత్రణమునకు సమకాలిక సాంఘిక చరిత్రరచన కుపకరించునట్టి అమూల్య ఆధార గ్రంథములు. మహా కావ్యములందు సమకాలిక జీవితమును చిత్రించుటకు ఆధారములు స్వల్పములు. సామాన్యుల జీవనవిధాన మందు మృగ్యము. శతకములలో సామాన్యవ్యక్తి నుండి సామంత మండలేశ్వర చక్రవర్తుల వరకును వారివారి మానసిక వికాసమును, జాతిచరిత్రను, చిత్రించుటకు సాధనసంపత్తి అధికము.

నాల్గవ ప్రకరణము

శైవమతము - ధూర్జటి

ప్రాచీన భారతదేశమున ప్రబలిన మతములలో శైవమొకటి. ఇది అనాదిగా భరతఖండమున నిలిచియున్నది. శైవాగములలో 'శివుడు' పరబ్రహ్మగా పేర్కొనబడినాడు. అష్టాదశ పురాణములందు శివభక్తి ప్రతిపాదకములయినవి కొన్ని గలవు. యావద్భారతమున వ్యాపించిన శైవులలో భేదాభిప్రాయము లేర్పడుట వలన అందు విభిన్న శాఖ లేర్పడుట సంభవించినది. వేర్వేరు మండలములందు శివుడు వేర్వేరు నామములతో పూజింపబడు చుండెను. శైవము క్రమముగా కాలాముఖము, కాపాలికము, తాంత్రికము, పాశుపతము, మున్నగు శాఖలుగ విడివడినది. ఇందు పాశుపత మతి ప్రాచీనమైనదని చెప్పెదరు. లింగ పూజ ప్రధానమయినది లింగపూజ భారతదేశమున ప్రాచీన కాలము నుండి యుండినట్లు హరప్పా మొహెంజదారో శిధిలముల వలన తెలియుచున్నట్లు నెహ్రూ తన ప్రపంచ చరిత్రలో చెప్పెను.

ఆంధ్రదేశమున పాశుపత శైవ మెప్పటినుండి యుండినదో నిశ్చయముగ తెలియుట లేదు దీనిని ప్రప్రథమమున ప్రచార మొనరించినదెవరో కూడ తెలియదు. క్రీస్తునకు పూర్వము నుండి కాకపోయినను క్రీ శ. మొదటినుండియు ఆంధ్ర దేశమున శైవమున్నట్లు శివదాసు, శివల శివస్కంధ శివశ్రీ మొదలగు పురుషుల నామధేయముల వలన తెలియుచున్నది.

కాళహస్తి మాహాత్మ్యమనెడి క్షేత్ర ప్రబంధమును రచించిన ధూర్జటి ఎట్టి శైవుడో కావ్యమున నేరీతిగా శైవ సిద్ధాంతములను పొందుపరచెనో పరిశీలించుటయే ఈ ప్రకరణ లక్ష్యము. ధూర్జటి ద్వితీయాశ్వాసములో శ్రీకాళహస్తుల కథలో రగడలో ఈవిధముగా చెప్పినాడు "దేవా నిన్ను వర్ణింప రమావాగ్దేవీ వల్లభులైనను శక్తులే? నీ విధమెఱుగక నిఖిలాగమముల నేర్పరులైనను జీవన్ముక్తులే?

కొందఱు సోహమ్మని యద్వైతాకుంఠితబుద్ధి న్నిను భావింతురు. కొందఱు దాసోహమ్మని భక్తిని గుణవంతునిగా నిను సేవింతురు. కొందఱు మంత్ర రహస్యమని నినుగోరి సదా జపనియతి నుతింతురు. కొందఱు హఠ యోగాభ్యాకృతివని కుండలిచే మారుతము ధరింతురు తుది నందఱు దమయిచ్ఛల నేయేత్రోవలబోయిన శ్రీరూపమ్మును గదియక, గతిలేకుండుట నిజముగ గని చాలింతురు. మదిసంతాపము నినుసేవించిన కృతకృత్యుడు మఱినేరడు తక్కిన నీచుల గొల్వగ; నినుశరణంబని నిలిచిన ధీరుడు నేరడు తక్కిన బోటుల నిల్వగ; నీవనియెడు నిధిగాంచిన ధన్యుడు నేరడు తక్కిన యర్థము గోరగ; నీవేగతియని యుండెడు పుణ్యుడు నేరడు తక్కిన వారల జేరగ; భవ దుర్వాసన పాయదు మీ పద పంకజముం హృదయము వాసింపక; చపులకు దాంగవు సకలేంద్రియములు సతతమ్మును నిన్నుపాసింపక; జనన మరణములు ధరలో నిన్నును సమ్మతితో సేవింపక డాయవు; మనమునకును మీ చిన్మయ రూపము మరగింపక యణిమాదులు డాయవు, మీ మాహాత్మ్యము మేమింతంతని మితి చేయగ మఱి నెంతటి వారము? మామీదను గృపగల్గి మహేశ్వరా! మన్నింపుము నీకునమస్కారము." (శ్రీ.ఆ. 152 రగడ) [1]'కొందరు సోహమ్మ'ని దీనివలన ధూర్జటి తత్త్వ పదమును జేరుటకు యోగధ్యాన ద్వైత అద్వైత మార్గములు కెల్లవని స్పష్టముగా చెప్పుచున్నాడు. నిను సేవించి అను దానిని బట్టి ఏకదైవో పాసకులైన వీరశైవులవలె ధూర్జటి కన్పట్టుచుండెనేకాని ఈతడు వీర శైవుడు కాడు. భేదాభేదవాదియైన శివశక్త్యాత్మకశైవము ననుసరించినవాడు ధూర్జటి, సామాన్య శైవుడనవచ్చును. కారణమేమనగా చంద్రజ్ఞానాగమమున ఈ క్రింది విధముగా గలదు. శైవము 8 విధములని చంద్రజ్ఞానాగమమున కలదు.

"అనాది శైవం ప్రథమమాది శైవం ద్వితీయకం
పూర్వ శైవం తృతీయంస్యాన్మిశ్ర శైవం చతుర్థకమ్ -(4)
శుద్ధ శైవం పంచమస్యాత్ షష్ఠం వై మార్గ శైవకం
సామాన్యం సప్తమం జ్ఞేయం వీరశైవ మథాష్టమమ్ -(5)

(చం.జ్ఞా. అదశమ పటలం పుట 65) అనాది శైవము ఆదిశైవము పూర్వ శైవము మిశ్రశైవము, శుద్ధ శైవము, మార్గశైవము, సామాన్యశైవము, వీర

1. డా. బాదాల రామయ్యగారు - సిద్ధాంత వ్యాసము - బసవ వచనములు పు. 318.

శైవమని శైవము 8 విధములు. అందు వీర మార్గశైవములందు ప్రేత కర్మ పిండోదకాది విధులు దహన సంస్కారము, జాతా శౌచమృతాశౌచములు లేవు. ధూర్జటి చతుర్థాశ్వాసమున 19వ వచనములో జనని జనకుండును అనుటచే ధూర్జటి అభేదవాది యనవచ్చును. ఈ భేదాభేదమును మొదట చెప్పినవారు శ్రీకంఠ శైవాచార్యుడు.

''ఆదేః పూర్వస్య శుద్ధస్యత థైవం మార్గ వీరయోః
సవిశేషశ్శి వాద్వైతశ్రుతీనాం సమ్మతోమతః (60)
మిశ్రస్య శుద్ధాద్వైతాఖ్యోమతస్తు పరికల్పితః
సామాన్యస్య విశిష్టోఽయం శక్త్యాద్యద్వైత ఏవహి (61)
ఆదేర్మార్గస్య వీరస్య ప్రేతకర్మ నవిద్యతే
దహనం చైవ సాపిండ్యం నైతేషాం సమ్మతే తతః (62)
పూర్వాదీనాంతు ప్రేతత్వం తత్ప్రయుక్తం హి కర్మచ
వి శిష్యతే యతస్తేషాం నదీక్షాగ్నిళవీ పరా (63)

(చం జ్ఞా ఆ దశమ పటలం పుట 78) విశేషముతో కూడుకొనిన పూర్వ శుద్ధ మార్గ వీర శైవములు శివాద్వైతమనియు, మిశ్రశైవము శుద్ధాద్వైత మనియు సామాన్య శైవము శక్త్యద్వైత మనియు శైవ దర్శనము పిలువబడును. బ్రహ్మ సూత్రములకు భాష్యము వ్రాయుచు శ్రీపతి పండితుడు తన శ్రీకర భాష్యమున దీనినే సమన్వయ వాదమనియు, ద్వైతాద్వైతమనియు భేదా భేద మనియు సూత సంహితయందు సూచింపబడినట్లు ''భేదా భేదస్తథా భేదోభేద ఏతే మతాస్త్రయః'' అని చెప్పెను. వీరశైవ సిద్ధాంతమునకు విశిష్టాద్వైత మనియు, ద్వైతాద్వైతమనియు నామాంతరములు పేర్కొనిరి

"శ్రుత్యేకదేశ ప్రామాణ్యం ద్వైతాద్వైత మతాదిను।
ద్వైతాద్వైతమతేశుద్ధే విశేషాద్వైతసంజ్ఞకే।
వీరశైవేక సిద్ధాంతే సర్వశ్రుతి సమన్వయః।"[1]

---

1. బండాల రామయ్య సిద్ధాంత వ్యాసము - బసవ వచనములు - పుట. 8 9

శ్రీపతిపండితుడు శ్రుతిని ప్రమాణముగా దీసికొని వీరశైవ సిద్ధాంతమును ప్రతిపాదించెను. చంద్రజ్ఞానాగమమున ఇది శ్రుతిసమన్వితమని చెప్పబడియుండెను. లకులీశపాశుపత దర్శనములందు ఆగమములనే ప్రమాణముగ గ్రహించియుండిరి. శ్రీపతి పండితుడు నిగమాగమముల రెండింటిని ప్రమాణముగ గ్రహించెను. ద్వైతమున పూర్వపక్షమగు శ్రుతివాక్యము అద్వైతమున సిద్ధాంతమగును కనుక శ్రీపతి పండితుడీ రెండింటిని ప్రమాణముగ గ్రహించి సర్వ శ్రుతి సమన్వయమొనరించుటచే నిదియే సమన్వయవాదమనియు, ద్వైతాద్వైతమనియు భేదాభేదవాదమనియు పేర్కొనబడెను. ద్వైతముతో మొదలుపెట్టి అద్వైతములో నీ దర్శనము పర్యవసించుచున్నది. ఇపవాది భక్తుల యనుభవము సమన్వయవాదమునకు సరిపోయి ద్వైతాద్వైతముల రెండింటిని ప్రతిపాదించుచున్నది. ఇది మనకు షట్స్థల సిద్ధాంతమున స్పష్టము కాగలదు. జీవుడు శివాంశమే. పాశబద్ధుడగుటచే పశువగుచున్నాడు (ఇచట కాళహస్తీశ్వర మాహాత్మ్యమున ప్రథమాశ్వాసాంత పద్యమగు పాశక్లేశగుణేషణేంద్రియ యను పద్యముదహరించవచ్చును). అనాది కర్మబద్ధుడగుటచే జీవుడు పాశబద్ధుడయ్యెను. శివానుగ్రహముచే పాశము సడలిపోవును. అప్పుడు శివశక్తియే భక్తుని ముక్తికి తోడ్పడును శివుడు నిమిత్త కారణము శివశక్తి ఉపాదాన కారణము జీవుల పుణ్యపాపములు సహకారికారణములు. కారణము శివుడు, కార్యము శివశక్తి.

ఇంక సామాన్య శైవలక్షణమేమన భక్తిప్రధానము. శివభక్తిపై యాసక్తి యుండును. అదియే మనము ధూర్జటిలో చూడవచ్చును. గొప్ప శివభక్తుడని చెప్పుటకు ధూర్జటికి అతని గ్రంథములే ప్రమాణములు శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యమంతయు శివభక్తి ప్రతిపాదితము. అట్లే శతకము కూడ శివభక్తిపూరితమే. సామాన్య శైవమున శివుడు ఎంత సత్యమో ప్రకృతి అంత నిత్యము. అతడెంత చైతన్యస్వరూపియో ఇది అంత దివ్య సుందర స్వరూపిణి. ఈ భేదాభేదమనుసరించిన సామాన్య శైవమే ధూర్జటిది. భక్తులైనవారికి జాతికులమత వివక్షత లేదు. కడకు తిర్యక్కులయందును, తిర్యక్కులు కూడ సంస్కారవశంబున ఈశ్వరాభిముఖులైపోవుచున్నవనుటకు ధూర్జటి సాలెపురుగు, సర్పము, మత్తగజముల కథను చెప్పినాడు. ఈ తత్త్వమే నారదుని భక్తిసూత్రములందు గలదు. రామాయణమున నరులకేగాదు, వానరులకేగాదు, శూద్రస్త్రీలకేగాదు (శబరి

మున్నగువారు) కడకు ఉడుతకు కూడా భగవదనుగ్రహము లభించుచున్నది. ఈ విషయమే ధూర్జటి కాళహస్తిమాహాత్మ్యమున శ్రీకాళహస్తుల కథలో చెప్పినాడు. ఈ ప్రాణులలో సంస్కారము బలీయమై యున్నదనుటకు చతుర్థాశ్వాసమున పూర్వజన్మ వృత్తాంతములే తార్కాణము.

ఇక ప్రథమాశ్వాసమున ఈ క్రింది పద్యము పరిశీలించిన యెడల జంతువులకు ఆప్రాంతమున ఉత్తమ, మధ్యమ, అధమత్వములు కనబడుటలేదట!

చ॥ అఖిలములైన జంతువుల కక్కడ నుత్తమమధ్యమాధమ
త్వము లరయంగ గాన మపవర్గ రమాసతి బెండ్లియాడుచో
సమతయెగాని తత్పురము సాటిగ నన్యపురంబు లెన్నగ
నమరునె నన్న హస్తిమశకాంతర మింతియ వాసి చూచినన్
(కా. మా. ప్ర. ఆ. 82)

ఈ పద్యము భక్తికి లక్షణముగా చెప్పవచ్చును. ఇక తరువాతి పద్యములో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల నలుగురి గూర్చి చెప్పినాడు. నలుగురు వారివారి యధికార యోగ్యతలను బట్టి గొప్పవారగుచున్నారేగాని ఒకరితో నొకరికి పోటి లేదు.

సీ॥ నైజంబులగు నిత్యనైమిత్తికంబులు
నడపుచో బ్రహ్మార్పణంబు సేసి
సంగరహిత బుద్ధి శాంత నవస్ఫూర్తి
వైరివర్గంబు సంహారమాడి,
ప్రబల మహార్ఘ ప్రభాసమానస్థితి
కోశంబులుండెడి కొలదులరసి,
యాతపశీతవాతాదుల సమముగా
నాత్మప్రయత్నంబులందు దలచి
సంచరింతురు బ్రాహ్మణ క్షత్ర వైశ్య
శూద్రులవ్వీట సంతత భద్ర హృదయ

నిరుపమానందవిహారణోన్నిద్రులగుచు
రాజయోగైక సామ్రాజ్య రతులభంగి.

(ప్ర. ఆ. 28)

ధూర్జటి యిట వర్ణధర్మములకు వ్యతిరిక్తి కాలేదు. భక్తితత్త్వమును మరచిపోలేదు. ఇఁక ఈ పురమున కవీశ్వరు డెట్టివాడనగా రాజశేఖరుడట! కాళహస్తి పురాధీశ్వరుడు సాక్షాత్తు శివుడే యని ధూర్జటి చెప్పినాడు. ఇంకను ఈ క్రింది పద్యము చూచిన భక్తి లక్షణము తెలియును.

చ॥ కపట కుమారజంగమ వికారమునం జనుదెంచు శైలజా
ధిపుగని భక్తిపూర్వకమతి 'స్మరణార్థి' యొనర్చి, యొక్కచే
బ్రపదములంటి, తన్మృదుల పాణి సరోరుహదత్తభూతిని
ద్దపునుదుటన్ ధరించి, ప్రమదామని యిట్లనియెం బ్రియంబునన్.

(ప్ర. ఆ. 34)

ఇచట శరణార్థి యనుచున్నాడు. ఇది భక్తిలక్షణము. ఇది శైవమునకే గాదు వైష్ణవమునందునూ గలదు.

సీ॥ "భుజించూడు దేవర నిజకృపాదృష్టి జె
న్నారు నా యిల్లు బిడారు మీకు,
నాకు మీ పాదార్చనము సేయనగు లింగ
మూర్తి! చేకుఱ వచ్చి మూర్తమాడు
మొదయ! చిత్తేశ! నా యునికిని మజ్జనం
బాది శివార్చనమాడ బేకు,
విచ్చేయుడు విభూతి పీడియంబందుకో
జంగమస్వామి నా సదనమునకు,
నోగిరంబులు మంచి మేలోగిరములు
నావటించెద బడటు మీరారగింప,
బ్రతిదినంబును జంగమార్చనము లేక
తనివుపడనొల్ల పతిత కందర్ప!" యనుడు

(ప్ర. ఆ. 35)

ఈ పద్యము వీరశైవ సంప్రదాయములతో గూడి యున్నది. సంప్రదాయమే గాక ఆకరణ సాహిత్యములోని పదములను గూడ యథాతథముగ ధూర్జటి యిందు వాడినాడు.

1. బిజమాడు దేవర 2. బిడారు 3. వడయ 4. మాదబేకు శైవాచారము లలో కొన్ని సమయములు గలవట ఆ సమయములలో ఒకటి పంక్తి భోజనము. జంగముడు లేనిచో భక్తులు భోజనము చేయరు. లింగధారులలో ఈ నియమము గలదు. ఇచట దాసి లింగధారిణి, ఈ పశ్లైరపుదాసి ఆ కోవకు జెందినది కనుకనే జంగముని తన యింటి కాహ్వానించుచున్నది. జంగమార్చన లేనిదే యామె భోజనము చేయదు. అంతటి నియమ నిష్ఠలు గలది ఈమె ఇట 'విజిత కందర్ప' యనుటలో రెండర్థములు గలవు. జయింపబడిన మన్మథుడు గలవాడా ! యనియు కావ్య పరముగా నీ సౌందర్యము ముందు శివుడెంతవాడు ? (నీవే శివుడవు?) అని భావము.

లింగముకంటె జంగము దధికుడు. శైవమున శివునికంటె శివభక్తు లెక్కువ యని ఒక సంప్రదాయము కలదు. దాసి హృదయముపై నిలిచిన శివునికంటె (లింగముకంటె) ప్రత్యక్షముగా ఆమెతో మాట్లాడుచున్న జంగమ శివుడే అధికుడని రుజువు చేయుటకు దాసితో జంగముడు వైరీతిగా మాట్లాడినాడు. ఈ కఠిన పరీక్షలో మహాత్మురాలు లోకాతీత సౌందర్యవతి కాంతారత్నము జంగమార్చన కళా సామర్థ్యయైన దాసి ఈశ్వరార్చన బుద్ధితో త్యాగ స్వరూపిణియై పోయినది. తత్ఫలితముగా కేశాలంకారము సర్వము రాజుచే భంగమైపోయినను జంగము స్వామిచే మరల నిజకురుల సంపదతో చిత్త రాజ్యలక్ష్మి కభిషేకము చేయుచు నిల్వగల్గినది. ఈ దాసి వలననే రాజు శివుని మాహాత్మ్యము సర్వము తెలిసికొన గలిగినాడు. ధూర్జటి ఈ కాళహస్తి మాహాత్మ్యమున కథ జంగమునితో ప్రారంభముచేసి వేశ్యా తనయులు ముక్తినందుటతో ముగించినాడు. జంగముని మొదట ప్రవేశ పెట్టినాడు. వాడును మాయాజంగముడు. స్త్రీతో ముగియుట - మాయ. మాయలేనిదే జగత్తులేదు. ఇట్లు కథ సన్వయించుట శైవ సాంప్రదాయము. ప్రథమాశ్వాసమున ౬౨ పద్యములో "భావంబుట్టువుదీరునే ?" యనినాడు. కాళహస్తిమాహాత్మ్యమున వశిష్ఠునికథను చిత్రించుటలో ఔచిత్యము పరామర్శించుచు

ఇది ధూర్జటి శైవమున కెంతవరకు తోడ్పడినదో చూచిన యెడల బ్రహ్మ జ్ఞానిని కూడ మాయ బంధించుచున్నదని తెలియుచున్నది. అందుచేతనే ఈ విషయము ఆశ్వాసాంతములో కూడ ధూర్జటి ధ్వనింప జేసినాడు. పుత్రేషణ యనినాడు. పాశము-దీనిని తొలగించుకొనుటకు గాను వశిష్ఠుని కథను ప్రతిపా దించినాడు బిడ్డలకొఱకు ఈయన మరణించవలెననుకొనుచున్నాడు. పరమేశ్వ రుడు ప్రసన్నుడయ్యెను. వశిష్ఠుని చేతనే శివుని కొలిపించినాడు. ఇదే శైవము యొక్క ప్రాధాన్యత. శైవాగమములలో 36 తత్త్వములుండును. అందు 24 తత్త్వములు ఈ పద్యమున చెప్పబడెను.

క॥ ఇరువది నాలుగు తత్త్వము
లరయగ నీయంద పుట్టియణగెనన, జగ
త్పరి పూర్ణుడవన, దృశ్యే
తరమూ ర్తివనంగ నిందుదత్త్వజ్ఞులచేన్. (ప్ర. ఆ. 79)

ముందు యాదవ రాజు పురుషుడు. అతడు 28 తత్త్వములతో కూడిన పురమున కధిపతి. ఇది శైవాగమసంజ్ఞ. ఈ పురుషుడు భక్తుడగుటకు ముందు శక్తి పాతము ఏర్పడును. అనగా యాదవరాజు జంగముని అనుగ్రహమునకు పాత్రుడై శివభక్తుడయ్యెను. వెంటనే (శక్తిపాతము కల్గిన వెంటనే) భక్తుని మనస్సు శివాభిముఖ మగును. శివభక్తుల కథలపై ఆసక్తికల్గును. ఇచట యాదవ రాజు విషయమున నీ విధముగనే జరిగినది. అట్లు యాదవ రాజులోపుట్టిన ఆసక్తికి తగినట్లుగా ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యమునందలి శివ కథలను అల్లుకొని పోవుచున్నాడు. పైన చెప్పిన తత్త్వముల విషయములో మిగిలిన 12 తత్త్వములు తెలిసికొనుట కనుభవము కావలెనని కవియే యిట్లు చెప్పుచున్నాడు.

క॥ స్వానుభవంబున దభ్యము
గానంబడుగాని, మీయఖండాద్వైత
జ్ఞాన మయాకృతి బహు భా
షా నైపుణి దెలియనది యశక్యమట! శివా! (ప్ర. ఆ. 80)

ఇంతను ధూర్జటి ప్రథమాశ్వాసమునే వశిష్ఠుని, అగస్త్యుని ప్రవేశపెట్టినాడు. వీరిరువురును మైత్రావరుణులకు పుట్టిన వారు. అగస్త్యుడు నీళ్ళయందు పుట్టినాడు కనుకనే సువర్ణముఖరీనదిని తీసికొని రాగలిగినాడు ఇట్లు చెప్పుటలో ఇంకొక రహస్య మేమనగా అగస్త్యుడు శాక్త సంబంధి దేవీ ఉపాసకుడు. ఇంక వశిష్ఠు డన్ననో శివోపాసకుడు. వశిష్ఠుడు జ్ఞాని. అగస్త్యుడు భక్తుడు. అతని భార్య లోపాముద్ర జ్ఞానప్రధానియైన వశిష్ఠునిచేత శివతత్త్వము, కర్మజ్ఞుడై శక్త్యుపాసకు డగు అగస్త్యునిచే దేవీతత్త్వము, ఈ రెండింటిని ప్రథమాశ్వాసముననే గుదిగుచ్చి ధూర్జటి శివ శక్త్యాత్మక శైవమును రూపించినాడు. నేలపై పుట్టిన వశిష్ఠుడు స్థావర సత్య ప్రదీపకమగు శివ జ్ఞానమును, నీట పుట్టిన అగస్త్యుడు భూమిపై సువర్ణముఖిని తెచ్చిన యపర భాగీరథు డగుచున్నాడు. స్థావర జంగమాత్మక మైన ప్రపంచ స్వరూపమును ప్రథమాశ్వాసమున ధూర్జటి తత్త్వ పరముగా ప్రతిపాదించెను. ఈ ఆశ్వాసమున దాసికి కుచులు వచ్చుట హస్తమస్తక న్యాయము. శైవములోనివేదా దీక్ష నిట నన్వయింప వచ్చును.

ఇంక ద్వితీయాశ్వాసము బ్రహ్మ కథతో నారంభమగును. ఈ కథలో బ్రహ్మ కామలోలుడై సరస్వతి వలన నూర్గురు రాక్షసులగు పుత్రులను గనుట యిత్యాదులు వర్ణితములు. బ్రహ్మ సరస్వతుల కథవలన వారి ప్రణయము జగత్ సృష్టికే కాదు, జగత్ వినాశనమునకు తోడ్పడు చున్నదను విషయము రుజు వైనది. బ్రహ్మకు పరతత్త్వము తెలిసినను అనుభవమునకు రాలేదు. అది ఒక్క పరశివ తత్త్వమునకే చెల్లును. బుద్ధి వ్యాపారమున కతీతమైన శక్తియే యిట ధూర్జటి ప్రతిపాదింపదలచెను. ఇది శైవములోని రహస్యము. ఇక తరువాతి కథలో జన్మాంతరసంస్కారమువలన హస్తి కాళము సాలెపురుగు శివుని సాయుజ్యము వడయుట చెప్పబడినది. ఇచట ఇంకొక విశేషమేమనగా ధూర్జటి యింతవరకు చెప్పిన కథలందు కాలము ప్రసక్తి లేదు. కాని యిచట సాలె కథ కృతయుగమని. పాము, హస్తి కథలు త్రేతాయుగమని చెప్పినాడు. కాలము యొక్క ప్రభావము వలననే సాలె, పాము, హస్తి పుట్టినవి

ఊర్ధ్వ నాళము నుండి కాలమును గూర్చి ధూర్జటి చెప్పెను. శైవాగమముల యందు కాలము మాయలో పుట్టిన ఏడు గుణములలో ఒకటి. ఇది మిశ్ర సృష్టికి సంబంధించినది.

[1] "అనాది నిధనాభ్యాం తాభ్యాం పరమ కారణాత్
ఇచ్ఛాశక్తి ర్వినిష్క్రాంతా తతో జ్ఞానంతతః క్రియా।
తత్రోత్పన్నాని భూతాని భువనాని చతుర్దశ"

అని శివాగమము చెప్పుచున్నది. అనగా పరమ కారణుడు, శాంతుడు, అనాది నిధనుడగు పరమ శివుని యిచ్ఛాశక్తిచే జ్ఞాన క్రియాశక్తులు పుట్టెను. వానిచే పదునాలుగు లోకములు పుట్టినవి ఏకాకియైయున్న పరమ శివుడు సృష్టింపదలచెను. అతని యిచ్ఛాశక్తిచే స్పందన కల్గెను. ఇచ్ఛాశక్తి యొక్క అంతర రూపమై జ్ఞాన శక్తిగ, బాహ్యరూపమై క్రియాశక్తిగ రెండుగ విడిపోయెను. పరమ శివుడు జ్ఞాన శక్తితో చేరినప్పుడు "అహంసర్వజ్ఞః" నేను సర్వజ్ఞుడననే అభిమానము పుట్టెను. ఆపరబ్రహ్మయే యిచ్ఛాశక్తి ద్వారా క్రియాశక్తితో చేరినప్పుడు "అహం సర్వకర్తా" నేనే సర్వకర్తయను నభిమానము కల్గెను. "అహం సర్వజ్ఞః" అనునభిమాన తత్త్వమే శివతత్త్వము. "అహం సర్వకర్తా" యనః నభిమాన తత్త్వమే శక్తి తత్త్వము. జ్ఞానతత్త్వము శివుడు. క్రియాతత్త్వము శక్తి అని తేలినది. జ్ఞానశక్తి యొక్క యుద్రేకావస్థలో గర్భవేష్టకమైన చర్మఖస్త్రికవలె శక్తి ఆవరింపగా వీటనాని యటికిన సెనగలవలె "అహమిదం" నేనిదియే యను ప్రపంచాభిమానము పుట్టెను. నేనిదే యనునదియే "సదాశివ" తత్త్వము. అనగా శివునితో శక్తి చేరగనే సదాశివుడు పుట్టెను క్రియాశక్తి యొక్క యుద్రేకావస్థలో శక్తి ప్రవేశింపగనేనే యీ ప్రపంచమమ ఈశ్వర తత్త్వము పుట్టెను. ఈ ప్రపంచమునకు ప్రభుడు నేనను భావము కల్గెను. [1] ఇదే యీశ్వర తత్త్వము. తరువాత నాకును నీ ప్రపంచమునకును భేదములేదను తత్త్వము పుట్టెను. అదియే శుద్ధ విద్యా తత్త్వము. దీనినే శైవులు ఊర్ధ్వమాయ యందురు. పరమ శివునిలో నుండి శివుడు, శక్తి, సదాశివుడు, ఈశ్వరుడు, శుద్ధవిద్య, అను ఐదు తత్త్వములు పుట్టెను. ఈ యైదింటి యందును అహంకారాభిమానములు గలవు. సదాశివుని స్థానమున రుద్రుడు ఈశ్వర స్థానమున నారాయణుడు, శుద్ధవిద్యా స్థానమున బ్రహ్మ, అను త్రిమూర్తు లేర్పడిరి. [2] రుద్రుడు వ్యక్తావ్యక్తుడు. నారాయణుడు వ్యక్త

1. డా॥ బాడాల రామయ్య గారు (బసవ వచనము పుట 812)
2. డా॥ బాడాల రామయ్య గారు (బసవ వచనములు పుట 818)

మగు పూర్ణరూపి, బ్రహ్మ క్రియా ప్రకృతిగల జ్ఞానము. ఈ ఐదు శుద్ధ తత్త్వము లందురు. మయూరాండరస న్యాయమున శుద్ధ తత్త్వము ప్రపంచ నిర్మాణ హేతు వగు సూక్ష్మ పదార్థములందు భేదబుద్ధి గల్గి మాయా తత్వమయ్యెను. అభేదబుద్ధి యున్నంత వరకిది శుద్ధవిద్య. భేదబుద్ధి పుట్టిన వెంటనే యిదే మాయ యగు చున్నది. కాష్ఠయోగమున మిణుగురులు రేగినటుల పరమేశ్వరుని ఇచ్ఛాశక్తి సంబంధముచే వెలువడు శివాంశమే మాయాశక్తిలో ప్రవేశించి పురుషుడయ్యెను. ప్రతి పురుషుని యందును శివాంశము గలదు. అనంతకోటి జీవరాసు లీరీతిగా అతని నుండి వెలువడినవి. పురుషుడు మాయా మాలావృతుడయ్యెను. అప్పుడాత నికి ఆత్మయందు అనాత్మజ్ఞానము అనాత్మయందు ఆత్మ జ్ఞానము కల్గి భ్రాంతి యేర్పడెను. ఈ భ్రాంతిచే నేను పురుషుడు సంసారి యనిపించుకొనెను. శివాంశజు డయ్యు పురుషుడు మాయలోని అవిద్యచే చుట్టబడినప్పు డాతడు కించిద్‌జ్ఞుడ య్యెను. మాయలోని కళచే కలిసినప్పుడు పురుషుడు కించిత్కర్తయయ్యెను. మాయలోని రాగముతో చేరినప్పుడు పురుషుడు స్రక్చందనాది విషయాసక్తు డయ్యెను. అప్పుడు పురుషుడు భూత భవిష్యద్వర్త మానాది కాలములకు లొంగెను. మాయ నుండియే కాలమేర్పడెను. కార్యకారణసంబంధముల బంధితుడైన పురుషునికి నియతి కల్గెను. భేదబుద్ధిచే శుద్ధ విద్యయేమాయమైనది. మాయకళ, కాలము, నియతి, అవిద్య, రాగము, పురుషుడు అని యీయేడు తత్వము లేర్పడెను. ఈ రెండింటిని మిశ్ర తత్వములందురు. మాయతో కూడిన పురుషుడు పై ఆరు కంచుకములచే కప్పబడిన వాడయ్యెను. ఇతని భోగౌత్కట్యముచే సృష్టి ఏర్పడెను.[1]

శైవాగమముల యందు కాలము మాయతో పుట్టిన ఏడు గుణములలో ఒకటియని తేలినది. ఇది మిశ్ర సృష్టికి సంబంధించినది. తననోటి నుండి వెలు వడు నూలుతో ఘటపటాకారమైన ప్రపంచమంతయు నిర్మింపగలశక్తి సూచిత మైనది. శివన్యాయమున ఈ సృష్టియంతయు జరిగినది. కాని యిది యంతయు మాయ. ఈ మాయ శాశ్వతము కాదని ఋజువు చేయుటకు శివుడు జ్ఞానశీలి క్షణ ములో సాలెకట్టిన ప్రాకారములు గోపురములు అన్నియు నాశనము చేసి వైచెను.

1. బసవ వచనాలు-డా. కాడాం రామయ్యగారు.

అంత మాయా సంబంధియగు కాలము స్థంభించును. స్థంభించినను చింతలేదని కాల కాటుడు ఊర్ధ్వనాథమును తన చేంతనే నిలుపు కొనును. అనగా భగవంతునిలో ఈ మాయ ఆవరణములన్నియు అణగి పోవుచున్నవి. ద్వితీయాశ్వాసనమున 158 పద్యములో "ప్రచండార్క" యనుట వలన ఈ విషయముతో సమన్వయము కుదురుచున్నది. మరిరెండు కథల సర్పము గజము· సర్పము మాయలోని కాల మునకు సంబంధించినదే కాని మాయలోని రాగగుణము దీనియందు ఉత్కటమై యుండుటచే ప్రియురాలితో జేరి విద్యుక్తధర్మము మరచినది. పరిణామము కాల మేయని చెప్పదగును. శివుని సేవింప వలసి వచ్చినది. సామజరూపమున మాయ లోని నియతిని ధూర్జటి యిట ప్రపంచించుచున్నారు.

శ్రీ-మాయ; నాగమునకు చిహ్నము-రాగము
దీపము-జ్ఞానము.
సామజము-నియతి

ఇక ఈ కావ్యమునకు జీవనాడి ధూర్జటి తత్వమునకు ప్రాణము తిన్నని కథ తిన్నడు ఆచార వ్యవహారములు ఎఱుగని వాడు. ఆటవికుడు. నిగమాగమముల వాసన లేనివాడు. సామాన్యుడు, శైవములో ఎవ్వరికైనా ఎప్పుడైనా ఎచ్చటైనా సరే దీక్షాహోమ సంస్కార తర్పణాది సమ మోపదేశములేవియు లేకపోయినను సరే ప్రాణియొక్క ఉద్దేశ్య మాత్రము చేతనే సాయుజ్యము పొందవచ్చునని తిన్నని కథ తెల్పుచున్నది. దీనికి ప్రమాణ మీ క్రింది శ్లోకము.

[1] "నాస్యదీక్షాన హోమశ్చన సంస్కారో నితర్పణం।
నకాలోనో పదేశశ్చ సదా శుచిరయంమనః॥"
(స్కాంద పురాణము-బ్రహ్మోత్తర ఖండము)

ఎప్పుడైన, ఎవ్వరైన, ఎచ్చటనైన సరే, దీక్షాహోమ సంస్కార తర్పణాది సమ యోపదేశము లేవియు లేకపోయినను సరే నమస్కార పూర్వకమగు పిరెందక్ష రములను చ్చరించిన చాలును, మహాపాతకములను కూడ పోగొట్టి ముక్తిని ప్రసా దింప గల్గియున్నవి.

1. డా॥ బడాల రామయ్యగారి సిద్ధాంత వ్యాసము (పుట 387)

ఇట తిన్నని కథలో తిన్నడు మాయలోని అవిద్యను తెంచినవాడు' అవిద్యగుణమును ధూర్జటి తిన్నని కథలో సూచించుచున్నారు. శివానుగ్రహముచే అవిద్య అతీతమైన ఆనందతత్వము వారదు పొందుచున్నారు. ఇచట తిన్నడు మరణించలేదు. శివసన్నిధానమందున్నాడు. నత్కీరుని కథలో నత్కీరుడును మరణించలేదు. శైవాగమములలో కనిపించు మాయలో పుట్టుకళను ధ్వనింపజేసినాడు. కీరమనగా చిలుక. నత్కీరుని కథలో కాశ్మీర శైవమును సూచింపజేసి ఆ అద్వైతమునకు వ్యతిరిక్తముగా ధూర్జటి జ్ఞానరహితమైన శక్తిని ప్రతిపాదించుచున్నాడు. ఆశ్వాసాంత పద్యములో 'శకుంత వాగురిక' యనినాడు. ఇట్లనుట వలన తిన్ననికథ ధ్వనించుచున్నది. ఆ తిన్నడు శివునియందేకలడు అని కూడ నిచట ధూర్జటి ధ్వనింపజేసినాడు. ఈ పద్యమును 'యోగీంద్రస్వాంత శకుంత వాగురిక' యనుటలో వ్యంగ్యమానమగుచున్నది. యోగీశ్వరుల యొక్క హృదయము లనెడి పక్షులకు వలలు వేసిన అటవికుడు శివుడో శివభక్తుడైన తిన్నడో రసజ్ఞులు తెలియగలరు. ఆశ్వాసాంతములో 224 పద్యములో "స్వాభావతేజో గండూషిత పద్మబంధ! భగవచ్ఛ్రోత్ర పక్షీశ్వరా!" యనుట వలన నత్కీరుని కథ ద్యోతకమగుచున్నది. ధూర్జటి ప్రథమాశ్వాసమున వశిష్ఠ అగస్త్యుల కథలను చెప్పెను. ఈ ఇరువురి విషయమును గూర్చి ఋగ్వేదములో నున్నది. ఆశ్లోకమిది.

సత్రేహజాతావిషితా నమోభిః
కుంభేరేతః సిషచతుః సమానం
తతోహమాన ఉదియాయ మధ్యాత్తతోజాత
మృషిమాహుర్ వశిష్ఠః (ఋం సం. 2-88-18)
(21 భాగము ఋగ్వేద సంహిత-పుట 507)

[1]సనాతన ధర్మమును ప్రచారము చేసిన మహాపురుషులిద్దరు. ఒకరు అగస్త్యులవారు, రెండు వశిష్ఠులవారు. ఈ ఇరువురు సరస్వతీ నదీతీరమున మిత్రావరుణుల దివ్య తేజస్సుచే ద్విధా భూతముగ పుట్టినవారు. నేలపై పుట్టి పెరిగిన వశిష్ఠుడొకడు. నీటిలో పెరిగి పరిమళించిన అగస్త్యుడొకడు. వశిష్ఠుడు వింత్య

---

1. సేవాసదన, జనవరి 1971, మాసపత్రిక (వ్యాసము)
డా॥ బాదాల రామయ్యగారు.

హిమాద్రిలం మధ్యగం ఆర్యావర్తపు టాచార్య పీఠమున ఆదిత్యుడై ప్రకాశింపగా వింధ్యకు దక్షిణమునగల జలముచే చుట్టబడియున్న దక్షిణాపథమున అగస్త్యుడు అమృతాంశునివలె మన సంస్కృతీభావరిని విస్తరింపజేసెను.

రెండవ ఆశ్వాసమున ధూర్జటి సృష్టికి కారణభూతులైన సరస్వతి బ్రహ్మల పౌరాణిక గాథ చిత్రించెను. ఇచటనే కృత త్రేతాయుగములకు సంబంధించిన ప్రాణులను శ్రీకాళహస్తులను విశదీకరించి ఆగమరహస్యములు నిచటనుండి ప్రతిపాదింపమొదలిడెను. మూడవ ఆశ్వాసములో తిన్నని నక్కీరుని కథలు దాక్షిణాత్యులలో ప్రచలితమైయున్న శైవ కథలను ప్రతిపాదించెను. నాల్గవ ఆశ్వాసమున వేశ్యాతనయులకథ తదుపరి వీరి జన్మాంతరములు చెప్పుచు ద్వాపర యుగములో అర్జునుని కథను ప్రస్తావించినాడు. ఈ కావ్యమందలి ఆద్యంతములు వీర శైవముతోసంబంధించినట్లుగా దాసీతో మొదలిడి వేశ్యా పుత్రికల కథంతో ముగించినాడు. కావ్యమంతయు శైవాగమ ప్రక్రియ కనుగుణముగా నడిపినాడు.

శివుడు పరబ్రహ్మవాచిగా చెప్పబడినది ఆగమములందే. పురాణప్రసిద్ధు డగు శివుడే, పంచాక్షరీ మంత్రమున వచ్చు శివుడు సంసారమను త్రాటిచే కట్టబడిన జీవులకు—

"భవపాశనిబద్ధానాం దేహినాం హిత కామ్యయా
ఆహోం నమశ్శివాయేతి మన్త్రమాద్యం శివః స్వయం"

(స్కాందము-ప్రథమాధ్యాయము-పుట 8)

హితమును ప్రసాదించువాడై శివుడే యీ పంచాక్షరీ మంత్రమును "నమశ్శివాయ" అని చెప్పెనట. ఆచార్య శంకరులవారు కూడ పంచాక్షరీ మంత్రములోని ఒక్కొక్క శ్లోకమును చెప్పి శివ పంచాక్షరీ మాహాత్మ్యమును గుర్తించిరి. బసవన పంచాక్షరీ స్థలమునే ప్రత్యేకించి తన వచనములందు పేర్కొనెను.

పంచమహాపాతకములు పారునది
శివా నీనామ స్మరణకయ్యా (వ. సం. 78)

భవబంధన దురితంబులు గెలువగ
ఓం నమశ్శివాయ శరణన బాలదే (వ. సం. 79)

దయామయుడైన పరమేశ్వరుడే పంచాక్షరీ మంత్రమును దుఃఖజీవుల తరింపజేయ మొదట ఉపదేశించినట్లు స్కాందము చెప్పెను. స్కాందపురాణము నాటికి శివ పంచాక్షరి ప్రజలలో ప్రవేశించినదని చెప్పవచ్చును. అంతేకాదు, దీక్షావినియమము లేవియు దీనికి అవసరములేదు. కడకు శ్మశానము నందైనను దీనినుచ్చరింప వచ్చును. సర్వకాల సర్వావస్థల యందును స్మరింపవచ్చును. ముక్తినిగోరు స్త్రీ శూద్ర సంకర జాతులవారైనను స్మరింపవచ్చును. వేదము స్త్రీ శూద్రులకు పరిగ్రాహ్యముకాదు. ఆగమ మందరకు పఠనీయమే. నమశ్శివాయ మంత్రము అందరికిని తారకమంత్రమే. ఓంకారముతో చేరిన పంచాక్షరి షడక్షరియగును. షడక్షరి గాయత్రివలె బ్రాహ్మణులకు మాత్రమే సీమితమైనది. ఆగమములందే—

[1] "ద్విజైరియంతు జప్త్వా నిత్యం ప్రణవ పూర్వకా।
స్త్రీభిశ్శూద్రైశ్చ జప్త వ్యాచమోఽం తాప్రణవంవినా॥"
(చ॥ జ్ఞా—అష్టమ పటలము 10శ్లో పుట 4)

"ప్రణవేన వినాదద్యాత్ స్త్రీశూద్రాణామి మం మనుం
యది దద్యాత్స ప్రణవముభయోః పతనం భవేత్" (22)

పంచాక్షరే మహామంత్రే స్థితేఽపిక విజానరాః।
పతంతినరకే మూఢామాయయా పరిమోహితః॥ (28)
(సూక్ష్మాగమము శివ పటలము పుట 88)

ఓం కారము ప్రణవము. ప్రణవము వేదమంత్రము కనుక ఓంకార సహిత పంచాక్షరి ద్విజ వర్గమునకు మాత్రమే సీమితమైనది. శ్రుతిని కఠోర నియమముచే ఉదాత్తానుదాత్త స్వరితప్రచయములచే పఠింపవలెను. అనియమమున స్వల్ప దోషము సంభవించినను ఉచ్చరించెడి వానికే హానియగును. కనుకనే శ్రుతిని అందరు పఠింపరాదనిరి. దీనిచే ద్విజులే శ్రేష్ఠులు, అన్యులు అధములని భావింపరాదు. మోక్షము అందరికిని అవసరమే. యోగ్యతను అనుసరించి మార్గము లున్నవి.

---

1. రామయ్యగారి జనపదవచనములు-పుట ౮౬౮.

దేశకాల ప్రకృతులను బట్టి యోగ్యత కల్గును. కష్టసాధ్యమగు వైదిక మార్గమును వదలి, సులభసాధ్యమగు భక్తి మార్గమును బసవాదులందరికిని కాలాను గుణముగ ప్రబోధించిరి. బ్రహ్మత్వము అందరకు నావశ్యకమే. ఈ ఆగమ ప్రోక్తమగు పంచాక్షరికి ఇన్ని నియమములు లేవు. బసవన మొదలగు శివశరణులే ఆగమ సమ్మతమగు పంచాక్షరినే అన్ని వర్గముల వారికిని స్త్రీ శూద్రాది భేదము లేక జపించి తరింపదగునని తలంచిరి.

నమశ్శివాయయనగా కల్యాణమునకు నమస్కారమని మొదటియర్థము. తరువాత కల్యాణునకు (శివునకు) నమస్కారమని అర్థమభివ్యక్తమైనది. కల్యాణము, మంగళము అన శుభము. ఈ శుభము మల త్రయ రహితమయినప్పుడే సంభవించును. మలత్రయము త్రిగుణములయందు పుట్టుచున్నది. మంగళము త్రిగుణాతీతమగు అభేద జ్ఞానమందే కల్గును. కావున శైవము సర్వకాల సర్వావస్థలయందును సకల ప్రాణికోటికి అత్యవసరమైనది. అట్టిమంగళమునకు నియమములతోగాని దేశకాలములతోగాని సంబంధములేదు. శివమునకు నమస్కారమని ప్రతిప్రాణియు తప్పక ఆశించి నమస్కరింప వలసినదియే. మనవారు "సర్వేజనా స్సుఖినోభవంతు" అని చెప్పుదురు. కల్యాణము నాశించుటయు తత్ఫలముచే నాతనికిని కల్యాణమే ప్రాప్తించును. ఈ భావమును శివయను నక్షరములే శివుని పంచమూర్తిత్వము నందభివ్యక్తములగు చున్నవని [1]స్కాందపురాణమున నిట్లు కలదు.

"పంచాక్షర నమో దేవ పంచభూతాత్మవిగ్రహ ।
పంచవక్త్రమయే శానవే దైస్త్వంతు ప్రగీయసే ॥ (19)
సృష్టి పాలన సంహారాంస్త్వం సదాకురుషేనమః
అష్టమూర్తే స్మర హార స్మర సత్యం యథాస్తుతః ॥ (20)
పంచాత్మికా తనుర్దేవ బ్రాహ్మణస్తే ప్రణీయతే ।
సద్యోవామేతథా ఘోరే శుశే తత్పురుషే తథా" (21)

---

1. స్కాందము అనంత ఖండము 21 అధ్యాయము పుట 210 బెంగుళూరు ప్రెసు, మైసూరు రోడ్డు 1949.

పంచాక్షరములే పర శివునకు రూపములు. పర శివుడు పంచభూతాత్మక విగ్రహుడు సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహము లీపంచ కృత్యములను నీ పంచాక్షరములు ప్రచారము చేయుచున్నవి. ఆకృత్యములకు తగినట్లే అయక్షరములు రూపమును పొందినవి. ఆ రూపములచే శివుడు పంచవదనుడయ్యెను. శివుని పంచవదనములు సద్యోజాత, వాసుదేవ, అఘోర, ఈశాన, తత్పురుషము అని ప్రసిద్ధి పొందినవి.

[1]శివ యను రెండక్షరములందు ఆదిమ దంపతులగు పార్వతీ పరమేశ్వరు లిరువురని అర్థమును సూచించును. ఈ భావము శివపురాణము నందు కలదు. శక్తి విశిష్టమయిన శివుడు, శైవ దర్శనము లన్నియు శివ శక్త్యాత్మకముగా పర బ్రహ్మను సూచించుచున్నవి. వీర శైవము కూడ ఈ భావమునే సూచించును.

శివ శబ్దము రెండక్షరములతో కూడి యున్నది.

శి + వ = శివ. — శి - ఆనంద స్వరూపుడు

— వ - అమృత రూపిణి

"శంనిత్యం సుఖమానందమికారః పురుషః స్మృతః ।
వకారశ్శక్తి రమృతమేలనం శివ ఉచ్యతే ॥
తస్మాదేవంస్వమాత్మానం శివం కృత్వార్చయేచ్ఛివం" (77)

శ + ఇ = శి. శ. యనగా సుఖము ఆనంద మని యర్థము కలదు. ఇ అనగా ప్రకృతిని గలవాడు (పురుషుడు) ఆనంద ప్రకృతి గల పురుషుడని యర్థము. శి యక్షరమునదే స్ఫురించును. వ అనగా శక్తి. వ్ + అ = వ. ఆకారమునకు అమృతమని యర్థము. అమృత స్వరూపిణి యగు శక్తిని వ అక్షరము సూచించును. ఆనందమయుడు శివుడు. శి యనునక్షర మీ భావమును సూచింపగా అమృత స్వరూపిణి యగు శక్తిని వ అను అక్షరము సూచించును. శివ అని చేర్చి చదువుటచే ఆనంద స్వరూపుడు అమృత రూపిణితో కలసినవాడని భావము వచ్చును.

1. బసవేశ్వర వచనాలు - డా॥ బాణాల రామయ్య

ధూర్జటి యద్వైతి యని కథా భాగముల వలన కొంతవరకు తెలియు చున్నది. పరమేశ్వర లీలలు అచింత్యములనియు, అధములు కూడ పరమేశ్వ రానుగ్రహ ప్రాప్తులు కాగలరనియు నిరూపించుటకు ధూర్జటి పూనుకొనెను. శివ శతక కర్తయగు నొక కవి ధూర్జటి శివభక్తి మహిమని నిట్లు కీర్తించెను

"చెలి చెంది పీద చేయిడి
చెలువొప్ప శివా! యటన్న జేడియనవ్వన్
జల పట్టి శివుని జూపిన
చెలువున ధూర్జటిని దలంతు జెన్నొంద శివా" (శివ శతకము 78 పద్యం)

మహా భక్తుడైన ధూర్జటి కిట్టి మహిమలుండిన యుండవచ్చును. ఇట్టి కథలు జనన పురాణాదులందు బహుళముగా గలవు. అట్టి కథ నొక దానిని ఈ శివ శతక కర్త ధూర్జటికి కూడ అంటగట్టి యుండును. ఇంకను శతకములో

నిన్నే రూపముగా దలంతు మదిలో, నీరూపు మోకాలో శ్రీ
చన్నో? కుంచమో? మేక పెంటికయో? యీ సందేహముల్మాన్పివా
కన్నారన్ భవదీయ మూర్తి సగుణాకారముగా జూపవే
చిన్నిరేణువిహార మత్త మధుపా! శ్రీకాళహస్తీశ్వరా! (కా.శ. 15)

ఇటువంటి పద్యములలో ధూర్జటియే పైన చెప్పినట్లుగా కథల నెన్నింటినో సూచించి యుండెను. ఇవన్నియు స్వానుభవములని తలంచుట యుక్తము. ఇంకను

ఏలీలన్ నుతియింప వచ్చునుపయోత్ప్రేక్షాద్యనివ్యంగ్యశ
బ్దాలంకార విశేష భాషల కలభ్యంబైన నీ రూపముం
జాలుంజాలు గవిత్వమున్నిలుచునే సత్యంబు వర్ణించుచో
ఛీ! లజ్జింపరు గాక మాదృశకవుల్ శ్రీకాళహస్తీశ్వరా !
(కా శ. 51 పద్యం)

ఇచట శివుని రూపమును వర్ణించుటకు ఉపమ, ఉత్ప్రేక్ష, వ్యంగ్య శబ్దాలంకారము లేవియును సరిపోవని ధూర్జటి చెప్పుచున్నాడు దేనితోను పోల్చుటకు వీలుకాని

శివుని నిజస్వరూపమును వర్ణించుట తనలాంటి కవులకు యలవికాదట. వర్ణించుటకు పాల్పడుటయే అవమానమని ధూర్జటి చెప్పుచున్నాడు. అనగా శివుని రూపము అంత గొప్పదనియు, అది వర్ణించుట ఎట్టి మహాకవులకును సాధ్యము గాదని ఇచట భావము.

శ్రీవిద్య - ధూర్జటి

శ్రీవిద్య యననేమో తెలిసికొనుటకు ముందుగ భారతీయ సంప్రదాయములు తంత్రములు, వేదములు మున్నగు వాని ప్రస్తావన యించుక అవసరము. మహా కవులలో కొందరు శ్రీవిద్యోపాసకులుగానే చెప్పబడియున్నారు. ధూర్జటి శ్రీవిద్యోపాసకుడని అతని గ్రంథముల వలన మనకు తెలియుచున్నది. 'శ్రీ విద్యానిధిత్రై' యనుచు కావ్యారంభము చేసెను. ధూర్జటి ఏ విధముగా 'శ్రీదేవి' ఉపాసన చేసినది ముందు ముందు తెలిసికొనవచ్చును. ముందుగ 'తంత్ర' నిర్వచనము గూర్చి తెలిసికొందము.

[1]మన శాస్త్రగ్రంథములందును, పురాణములందును సాంకేతిక పద్ధతి కలదు. ఆ సాంకేతిక విధానమున ప్రపంచ పరిపాలన దివ్యముగా నుండుటకై అనేక శక్తులేర్పరుపబడినవి. ఆశక్తులకు అధిష్ఠాన దేవతలు గలరు. వారిలో నొక్కొక్కరికి నొక్కొక్క లోకము, ఒక్కొక్క వాహనము, ప్రత్యేకమైన ఆయుధములు కలవు. ఈ సాంప్రదాయిక సాంకేతిక విధానముపైననే భారతీయమైన చిత్రకళ, శిల్పకళ, సంగీతకళ, సాహిత్యకళ ఆధారపడి దివ్యముగా వికసించి, సౌరభ్య కల్లోలిత కళా ప్రతటములైనవి.

బాహ్య ప్రపంచ దేవతానీకమున్నట్లే - అంతర ప్రపంచ దేవతానీకమున్నది. మానసికమైన అంతర మార్గమును అవలంబించి ఈశ్వరాన్వేషణ చేయుటలో తంత్ర శాస్త్రములని చెప్పబడు ఆగమములు పూర్వ సాంప్రదాయిక సాంకేతిక మార్గమునే అవలంబించుచున్నది.

---

1. చూ. శ్రీ చక్ర విలసనము (తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు) పుట 2.

[1]తంత్రము' అనగా శాస్త్రమని యర్థము. "తన్యతే విస్తార్యతే జ్ఞానం అతి తంత్రః" అనగా జ్ఞానమును విస్తరింప జేయునట్టిదని వ్యుత్పత్తి భావము. తత్త్వమును, మంత్రార్థమును విస్తరింప జేయునది కూడ తంత్రమే. తంత్రమునకు త్రాణమొనరించునదను వ్యుత్పత్తి కూడ కనుపించుచున్నది. తంత్ర నిర్వచనమున ప్రసిద్ధోక్తిగా 1. జ్ఞానము అనగా తత్త్వ సిద్ధాంతములు. 2 యోగము అనగా ధ్యాన విధానము 3. క్రియ అనగా కర్మ విధానము 4 చర్య అనగా ప్రవర్తన (సాంఘిక విధులను గురించిన ఉపదేశములు) ఈ నాల్గింటికిని, వీటిని బోధించు గ్రంథమునకు తంత్రమని పేరు వచ్చినది. ఆగమములని పేరు వచ్చుటకు కారణము భోగమోక్షములకు ఉపాయములను బోధించుటే.

"ఆగతాన్ శంభువక్త్రేభ్యః గతాంచ గిరిజాముఖేమతంచ
వాసుదేవేన తస్మాదాగమ ఉచ్యతే."

[2]వేదములు నిగమములు. అవి భక్తి (ఉపాసన) జ్ఞానకర్మములయొక్క రూపములను తెలుపుచున్నవి ఆగమములనబడు తంత్రములు వాటికి సాధనోపాయములను నిరూపించుచున్నవి. కృతయుగమువారికి వేదాధారము, త్రేతాయుగము వారికి స్మార్తాధారము, ద్వాపరయుగమువారికి పురాణాధారము, కలియుగము వారికి ఆగమాధారము అని వేత్తలు పలుకుచున్నారు. మననిత్యాచరణము నందు గల వ్రతము లన్నియు ఆగమ సంబంధములే. వేదములు ఈశ్వరముఖ సంభూతములు కాగా, ఆగమములు వేదముఖ సంభూతములని మహాభారతమున శాంతి పర్వమునందు కలదు. దేవ తంత్రములని పిలువబడు బ్రాహ్మణ తంత్రములు గాక బౌద్ధ తంత్రములు, జైన తంత్రములు కూడ కలవు.

[3]తంత్ర వివరములు : ఉపాస్యదేవతా సంబంధముగా దేవ తంత్రములు మూడు విధములు. అవి వైష్ణవ తంత్రములు, శైవ తంత్రములు, శాక్త తంత్రములు. వైష్ణవ తంత్రములు పాంచరాత్రాగమము, వైఖానస తంత్రము మొదలగు

---

1. శ్రీచక్ర విలసనము (తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు)
2. చూ॥ శ్రీచక్రవిలసనము -తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు.
3. " "

నవి ఇవి ద్వైత, విశిష్టాద్వైతములను బోధించునవిగా నున్నవి. శైవ తంత్రములలో ద్వైత అద్వైత పరమైన బోధలు కలవు. శాక్త తంత్రములు అద్వైతమును మాత్రమే బోధించుచున్నవి. శివ, విష్ణు పుత్రుడైన అయ్యప్ప (శాస్త్ర) సందర్భముగా శారణాగమమను తంత్రము కలదు.

దక్షిణభారత స్మార్తదేవాలయముల నిర్మాణ ప్రతిష్ఠా నిత్యార్చన ఉత్సవాదులకు ప్రమాణభూతముగా నున్నది కేరళీయ తంత్ర సముచ్చయము.

శాక్త తంత్రములు బహుళముగా నున్నవి. వీటియందు సాత్త్వికములు, రాజసములు, తామసములు అని కలవు. సాత్త్వికములకు తంత్రములని, రాజసములకు యామలములని, (రుద్ర, బ్రహ్మ, సిద్ధి యామలములు) తామసములకు డామరము అని (భూత, దేవ, యక్ష డామరములు) నామాంతరములు కలిగినవి. సామాన్యముగా నన్నిటిని తంత్రములని చెప్పుట కూడ వాడుకలో నున్నది. (మహాభారత శాంతిపర్వమున శ్రీకృష్ణుడు శివశక్తులను తాంత్రికోపాసన చేసినట్లుగలదు) శాక్తేయ తంత్రములలో కౌలవామాచారమునకు సంబంధించినవి అరువది నాలుగు కౌలతంత్రములు. మిశ్రమమార్గమునకు చెందిన ఎనిమిది మిశ్రతంత్రములు సమయ దక్షిణాచారమునకు చెందిన శుభాగమ పంచకమని నామాంతరముగల సమయ తంత్రములైదు. అవి వాసిష్ఠ, సనక, సనందన, సనత్కుమార, శుక సంహితలు. తంత్రగ్రంథ సముదాయమునకు మంత్రశాస్త్రమని వ్యవహారము గలదు.

తంత్రశాస్త్రములలో శక్తులకు చిహ్నములుగా యంత్రము లనబడు రేఖా చిత్రముల నుపయోగింతురు. బలసత్వప్రధానమైన శక్తిని రేఖాచిత్రమున సరళ రేఖలతోగాని, వక్రరేఖలతోగాని లేక సరళవక్రరేఖా సంపుటీకరణముచేతగాని చిత్రించుట ఆచారము. దేవతాస్వరూపమును మానవస్వరూపమువలె శిల్పమునందు వర్ణచిత్రములందు నిర్మించుటకంటె రేఖలతో, బిందువులతో, సాంకేతికముగా నిర్మించుట ఉత్తమ మార్గమని నిస్సంకోచముగా అంగీకరింపబడి యున్నది. యంత్రోపాసన ప్రతీకోపాసనకంటె శ్రేష్ఠతమమైనదని ఆగమాది శాస్త్రముల

యభిప్రాయము తాంత్రికమతమున సన్నియంత్రములందును శ్రీచక్రము సర్వోత్కృష్టమైనదిగ చెప్పబడినది. శ్రీచక్రమును మించిన యంత్రము లేదని మంత్ర శాస్త్రవేత్తలు, ఆగమ విదుల అభిప్రాయము. (యమభూతాది సర్వేభ్యోభయేభ్యోఽపి, త్రాయతే సతతంచ 'తస్మాద్ యంత్రమితీరితమ్)[1]

శ్రీచక్రమును గూర్చి తెలిసికొనుట కంటె ముందుగ శ్రీవిద్యగూర్చి తెలిసికొనవలయును.[2] సనాతన వైదిక ధర్మము వేదోపనిషత్తుపై ఆధారపడి యున్నది. పరబ్రహ్మోపాసన సగుణము, నిర్గుణమునని రెండు తెరగుల సాగుచున్నది. బ్రహ్మము అవ్యక్తమై త్రిగుణ రహితమై అచింత్యము, అనిర్దేశ్యము అయి యున్నది మనస్సునకు అంతవరకు పయనించు శక్తిలేదు. బుద్ధి యొక్క వివేక శక్తి అంతవరకు పోయి తిరిగి వచ్చునట. దక్షిణామూర్తి స్తోత్రమున ఈ విషయమిట్లు చెప్పబడినది.

"చిత్రంవటతరోర్మూలే వృద్ధాః శిష్యాః గురుర్యువాఽ గురోస్తుమౌనం వ్యాఖ్యానం శిష్యాస్తుచిన్న సంశయాః" గురువు శిష్యులకు సకల వేదాంతసారము నుపదేశించి నిర్గుణ పరబ్రహ్మ స్వరూపమును వచింపజాలక చిన్ముద్రా ప్రదర్శనము చేసి మౌనమును ప్రకటించెను శిష్యుల సంశయములు నివృత్తియైనవి. అవాఙ్మానసగోచర నిర్గుణ పరబ్రహ్మోపాసన నుపదేశించుట అసాధ్యము. ఈ విషయమే శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు శ్రీమద్భగవద్గీతలోని పండ్రెండవ అధ్యాయము నందుపదేశించెను. కావున సగుణోపాసనయే శ్రేయస్కరము.[3]

సగుణోపాసనమున శక్తిరూప పరబ్రహ్మోపాసనకి సనాతన ధర్మమందు విశేష ప్రాధాన్యమున్నది. సుప్రసిద్ధ మతములందు ఆ పరమాత్మను శక్తికిని భేదము లేదనుటయే శ్రుతినిశ్చితార్థము; అనగా శక్తి శక్తిమంతులకు భేదము లేదనుట.[4] ఉన్నదని యొక్కటే కాని రెండు లేవనుటయే అద్వైతమని చెప్పబడి

---

1. చూ. శ్రీచక్రవిలసనము (తుమ్మలపల్లి లింగేశ్వరరావు గారు)
2,3,4. చూ. శ్రీవిద్యోపాసన (బ్రహ్మవిద్యోపాసన) వ్యాసము తూర్పు వేంకట కృష్ణ శర్మగారు సంచిక 1974.
శరన్నవరాత్రోత్సవ సంచిక పుట. 27.

నది. బ్రహ్మాండ పిండాండముల యందు వెలయు సచ్చిదానంద స్వరూపమైన యా పరవస్తువును బ్రహ్మ శక్తిగా నెరింగి మాతృ భావముతో నారాధించుట శాక్తాద్వైతము. ఆ బ్రహ్మ వస్తువే శ్రీ శబ్దవాచ్యము. శవర్ణ రకార. ఈ కారముల యొక్క కలయికతో "శ్రీ" అయినది. శవర్ణము ఆనందవాచి. రకారము జ్ఞాన వాచి, ఈ మహామాయా స్వరూప పరబ్రహ్మశక్తి "వదంతిశం సుఖం శ్రేయః" "ప్రకాశో దర్శనో దీప్తోరేఫో కృష్ణః పరంబలీ" "ఈ త్రిమూర్తిర్మహామాయా లక్ష్మీ రీకార ఉచ్యతే" అని మాతృకాభిధానము. (సుఖమనగా ఆనందము. ప్రకాశమనగా జ్ఞానము) ఈ శ్రీవిద్యోపాసననా పద్ధతి, వేదోపనిషత్తంత్రములపై ఆధారపడియున్నది. ఈ శ్రీవిద్యోపాసన యనునది అనాదినుండియు అవిచ్ఛిన్న ముగా వచ్చుచున్నది. తైత్తిరీయారణ్యకము నందు ఒక యాఖ్యాయిక, శ్రీవిద్యోపాసనను గూర్చి సవివరముగా తెలుపుచున్నది.[1] "ఓం ఇమానుకం భువనాసీషధేమ. అను కావ్యము మొదలు, ఋషిభిరదాత్ పృశ్నిభిః" అను కావ్యాం తరము వఱకు శ్రీవిద్యోపాస్యను గూర్చియు శ్రీచక్ర స్వరూపమును గూర్చి పృశ్నులు అను మునులు సంభాషించిరి. ఈ ఉపనిషత్తును దర్శించిన వాడు అరుణ కేతువను ఋషి కావున ఈ ఉపనిషత్తుకు అరుణోపనిషత్తు అని పేరు గలదు. శ్రీవిద్యకు సంబంధించిన ఉపనిషత్తులు ఐదు గలవు 1. త్రిపురోపనిషత్తు 2. బహ్వృచోపనిషత్తు 3. త్రిపురతాపిన్యోపనిషత్తు 4. దేవ్యుపనిషత్తు 5. భావో పనిషత్తు; మరియు కాళికా ఉపనిషత్తు పురాణములలో పెక్కని స్మృతులలో పెక్కని గూర్చిన ప్రశంసలు గలవు. ఈ పృశ్నులను మునులు శ్రీచక్ర విద్యనుపాసిం చుచు "ఓదేవి మా యొక్క ఆపాదమస్తకము అమృతమును స్రవింప జేసి తడుపుము. మరి డెబ్బది రెండు వేల నాడుల మార్గములందు అమృత సేచనమును గావించుము. ఓ భగవతీ పిండాండ రూపమైన మాదేహమును బాహ్యమైన బ్రహ్మాండ రూపమైన నీ దేహముతో నీవు పొందుము. నీ సాయుజ్యము నొసగుము" అని ప్రార్థించుచు శ్రీచక్ర విద్యోపాసన చేసిన గాథ చాల విపులముగా తెలియపరచబడినది.

---

1. శ్రీవిద్యోపాసన (బ్రహ్మవిద్యోపాసన) తూండ్ల వెంకట కృష్ణశర్మగారు సంచిక 1974.

శ్రీమచ్ఛంకర భగవత్పాదులు బ్రహ్మ పాపకత్వము శక్తిదేయని యదార్థము నెఱిగిన వారగుటచేత లోకానుగ్రహ బుద్ధితో ప్రపంచసార తంత్ర సౌందర్యల హర్యాది గ్రంథములను వ్రాసి వేదవేదాంతానుకూల స్మృత్యుక్తములైన యోగోపాసనల నంగీకరించి తాంత్రిక యోగ పద్ధతులకును, ఉపాసనకును అన్యోన్య విరోధము లేదని చాటిచెప్పి శృంగగిరి మున్నగు నాలుగు వేదపీఠముల యందును, ఇతర అష్టాదశ పీఠములందును, శ్రీచక్ర స్థాపనలు గావించి శ్రీవిద్యోపాసనయే పరబ్రహ్మోపాసనయని చాటిచెప్పిరి. మరియు 2-1-24 బ్రహ్మసూత్ర భాష్యములందు "తస్మాదేకస్యాపి బ్రహ్మణో విచిత్ర శక్తియోగాత్ క్షీరాదివత్ విచిత్ర పరిణామ ఉపపద్యతే" అని బ్రహ్మ పరిణామమే శక్తి గనుక శక్తి శక్తిమంతుల కభేదమని పలికిరి. ఇదే విధముగ బ్రహ్మసూత్ర భాష్యమందంటను జగత్తును సచ్ఛక్తి పరిణామముగావే వచించిరి. శ్వేతాశ్వతరకేన, త్రిపురాతాపి త్రిపుర, బీతావనా, దేవి, బహ్వృచ, మున్నగు ఉపనిషత్తులందు ప్రతిపాదింపబడి నిర్దేశింపబడిన యీ శ్రీవిద్యా స్వరూపిణి బాలా, గాయత్రీ, సావిత్రీ, సరస్వతీ, త్రిపుర సుందరీ, రాజరాజేశ్వరీత్యాది నామముల చేత ఉపాసింపబడుచు, జగన్మాత యనుచు కోర్కెల నెల్లదీర్చుచు ఇహపర శ్రేయస్సాధన రూపిణియై వెలయుచున్నది. ఇంక గాయత్రీ మంత్రార్థము ఉపాసన ఇత్యాది విషయములు వివతముగా చెప్పబడినవి.

> [1]"నభిన్నాం ప్రతిపద్యేత గాయత్రీం బ్రహ్మణా సహ
> సోహమస్మీత్యు పాసీత విధి నాయేనకే నచిత్॥

వేదమాతయైన గాయత్రిని (గాయంత్రాయత ఇతి గాయత్రీ లేక గాయంతంత్రాయత ఇతి గాయత్రి)

గాయం-శరీరమును కాపాడి రక్షించునది లేక తన్ను గానమును చేయువానిని కాపాడునది కావున ఆ గాయత్రిని బ్రహ్మము కంటే వేరుదలంపక సద్గురూపదిష్ట మార్గమున ఏదో యొక విధిచేత నేను అను జీవాత్మ కంటే అతడు అను పరమాత్మ వేరు కాదను భావముతోనే యుపాసించ వలయును నను ప్రమాణముచే

1. తూర్పు వెంకట కృష్ణశర్మగారు (సావనీర్ 1974) పుట 29.

ద్విజ జాతులనబడు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులను మూడు జాతుల వారికి యోగ మార్గమున గాయత్రీ దేవతయే యుపాస్యమై యున్నది. గాయత్రీ మంత్రార్థము సవిత, సూర్యుడు విశ్వమండలి అన్ని మండలములకు ఆధారభూతుడు. అతని కిరణముల యొక్క ఆకర్షణ శక్తి దేవతనే బ్రహ్మాండ మండలి అన్ని మండలములను ఆకర్షించుచు తమ తమ పరిధులలో సంచరింప జేయుచున్నాడు. అటువంటి ప్రభావిత కిరణములతో గూడి శక్తిమంతుడైనట్టి సూర్యుని యందుండబడిన శ్రేష్ఠమైన భర్గస్సును శ్లో॥ భేతి భాసయతే లోకాన్ రేతి రంజయతే జనాన్। గఇత్యాగచ్ఛతేఽజస్రం భరగో భర్గ ఉచ్యతే॥ ఏతల్లి లోకములను సృజించిన వానిని రక్షించుచు తుదకు [1]లయ మొనరించి తనలోనే లీనమొనర్చు కొనుచున్నదో, అట్టి జగత్కారణమగు ఇచ్ఛాజ్ఞాన క్రియాత్మక పరాశక్తి పంచకృత్య పరాయణ, సృష్టి స్థితి లయ, తిరోధాన అనుగ్రహములు గలది. అధిష్ఠాన, అనుష్ఠాన, అవస్థాన, నామ రూపములయందు బ్రహ్మ సమానమైన బ్రహ్మశక్తిని గాయత్రిని నేను ధ్యానించుచున్నాను (ఉపాసించుచున్నాను) నేను ఏ దివ్యతేజః ప్రభావంబు పూరితమయిన పరాశక్తిని ఉపాసించుచున్నానో అపరాశక్తి జ్ఞాన ప్రదాయినియై తనయందే నాబుద్ధిని నా చిత్త వృత్తులను నిలిపి ధ్యానించునట్లు (ఉపాసించునట్లుగా) ప్రేరేపించు గాకయని గాయత్రీ మంత్రార్థమును మననము జేయుచు ఉపాసించవలయును.

ఉపాసన యనగా శంకర భగవత్పాదులు ఈ విధముగ నిర్వచించినారు.

"ఉపాసన నామయథా శాస్త్రం ఉపాస్యార్థస్య
విషయీ కరణేన సామీప్యము పగమ్య తైల ధారావత్
సమాన ప్రత్యయ ప్రవాహేణ దీర్ఘకాలం యదాసనం"

అనగా శాస్త్రము ననుసరించి ఉపాసించ దలచిన విషయమును, ఇంద్రియములకు గాని, మనస్సునకు గాని, ప్రత్యక్షము చేసికొనుట చేత ద్విషయమును సమీపించి ఆ వస్తువు వద్ద తైల ధారవలె నెరతెగని యావస్తు విషయకమైన సమాన భావ పరంపరలతో దీర్ఘకాల ముండుటయే ఉపాసనయని నిర్వచించిరి. ఇందునాలుగంశ ములను పాటించవలయునట. 1. ఒక వస్తువు ప్రత్యక్షముగాగాని మనస్సుతోగాని

1. తూండ్ల కృష్ణశర్మగారు (శ్రీవిద్యోపాసన – బ్రహ్మవిద్యోపాసన) 1974 పుట ౩౨.

చూచుచుండవలయును. 2. ఆ వస్తువునకు సంబంధించిన సమాన వ భావపరంపరతో మనసున అవ్యాహతముగా భావలయును. 3. ఆ భావములకు మధ్య ఇతర వస్తు విషయక భావనలుండ కూడదు. 4. ఆ విషయములపై లక్ష్యముంచి తద్భావన చేయుచు దీర్ఘకాలముండవలయును. ఇంక సంధ్యోపాసన, అగ్నికార్యము, బహిర్యాగోపాసన, అంతర్యాగోపాసన ఇత్యాది విషయములు తెలిసికొనిన యెడల శ్రీచక్ర ఉద్ధారణ కూడ వ్యక్తము కాగలదు.

[1]సంధ్యోపాసన

ఉదయాస్తమయ సంధికాలములయందు చేయు ఉపాసనకు సంధ్యావందన మందురు. అగ్నికార్యము బహిర్యాగోపాసన: బాలునకు ఏడవ సంవత్సరమునందు జరుగు ఉపనయన సంస్కార కాలమునందు ఆచార్యుడు జ్ఞాననేత్రము ప్రసాదించును. దీనితో మొదటి కనువిప్పు అనగా ఈషణ్మాత్రము జ్ఞానము వికసించును. వటువునకు జ్ఞానమన నేమో బ్రహ్మమననేమో తెలియని వయస్సునందు ప్రకటగాయత్రినే ఉపదేశించి లఘుప్రాణాయామమునే అభ్యసింపజేయును. అట్టితరి బాహిర్యాగక్రమమున బాహ్యమందున్న వేదికయందు ప్రత్యక్షాగ్నిని ఆహ్వానించి అందు సమిధలచే రగుల్కొల్పబడు వైదికాగ్నియందు భక్తిప్రపత్తులతో బ్రహ్మాండమందు వ్యాపించియున్న సూర్య, అగ్ని, సోమ యిత్యాది రూపములతో వెలయుచున్న పరబ్రహ్మశక్తి స్వరూపములకు వైదికాగ్నిజ్వాలయందు ధ్యానించి తత్తత్స్వరూపములకు ఆహుతుల నిచ్చుట జరుగును. ఈ నియమము బ్రహ్మచర్యము ముగిసి గృహస్థాశ్రమము స్వీకరించునంతవరకు జరుగును.

అంతర్యాగోపాసన

బ్రహ్మచర్యాశ్రమమందు వేదములు, ఉపనిషత్తులు, క్రమముగ అభ్యసించుచు, తదర్థాను సంధానము చేయగా గాయత్రి యననేమో ఉపాసన యననేమో బోధపడును. పిమ్మట సద్గురువునాశ్రయించి గుప్తగాయత్రి యనుపేర ప్రసిద్ధమైన శ్రీవిద్యా పంచదశాక్షరీ మంత్రయుక్తలఘుదీక్షనుపొంది, గురూపదిష్టమార్గమున మంత్రజపమును, శ్రీచక్రమందు ఆవరణార్చనను కొంతకాలము భక్తిశ్రద్ధలతో

1. తూండ్ల వెంకటకృష్ణశర్మగారు. శరన్నవరాత్రోత్సవ సంచిక 1974 పుట 30.

ఉపాసన చేయగా చేయగా హృదయము పరిపక్వము చెంది మంత్రము, గురువు, దేవత, ఆత్మ అనువాని ఐక్యభావమేర్పడును. జాగ్రదాద్యవస్థలయందు పర దేవతయే గోచరమగును. అపుడు గురువువలన శుభదివసమందు దీక్షామహాయాగ క్రమాను సారముగ గుప్తతర గాయత్రి యనుపేర ప్రసిద్ధిగాంచిన తురీయ పాదయుక్త పూర్ణదీక్షపాదుకాంతదీక్షను పొందవలయును. అపుడు శిష్యునకు గురువు, దీక్షానామ (ఆనందనాధయనునేదోనొకనామ) కరణము చేయును. మహా కావ్యములను బోధించి, పూర్ణునిగా చేయును. దీనినే శక్తి పాత దీక్ష యందురు. శక్తిపాతము గురువు నుండి సంక్రమించగా శిష్యుడు ఆనందపరిపూర్ణుడుకాగలడు. ఈ క్రమదీక్షను పొందినవాడినుండి అంతర్యాగోపాసకుడు కాగలడు. బ్రహ్మాం డమునావరించియుండు, సమస్తకుండలియే పిండాండమునందు (స్వశరీరము నందు) వ్యష్టికుండలినీరూపపరాశక్తి. ఈ పరాశక్తిని, గురూపదిష్టమార్గమున ప్రాణాయామాభ్యాసము, షట్చక్ర జ్ఞానమును మంత్రార్థమననమును మేళవించి యుపాసించు సాధకులకు సమిధలతో రగుల్చబడు వైదికాగ్ని యపేక్షలేదు. వారు అపేక్షించియాధానము చేయనది పిండాండమందు సర్వదాసిద్ధముగానుండు స్వాధిష్టానగతరుద్ర రూపాగ్నియే ప్రాణాయామ ప్రక్రియ యందు పూరింపబడెడి ప్రాణవాయువే స్వదేహమందు, సూక్ష్మసూక్ష్మతర స్రోతస్సులందు జొచ్చి సంచరించునపుడు స్వాధిష్ఠానచక్రము నందు ఎల్లప్పుడు సిద్ధముగానుండు అగ్ని హోత్రుడు ఇంధనము, విసనకర్రలు లేకయే ప్రజ్వలించును. ఆ జ్వాలితాగ్నిచే స్వాధిష్ఠాన చక్రముపైనున్న మణిపూరక చక్రమందలి తేమయారిపోవును. అపుడు అడుగువదేయైన మూలాధారకుల కుండమందుండి, మణిపూరమందలి తేమచే సదా తడియుచుండును. కుండలి నీ రూపు పరాశక్తికి ఆతేమయందకపోగానే బుస్సుమని చిన్న సీత్కారముతో లేచి సుషుమ్నాంతర్గత సూక్ష్మతమ మార్గమున నడ్డులేక మీదికి శిరోగత సహస్రారకమలము వైపు మెరుపువలె (బాణమువలె) పరిగెత్తుచుండును. అపుడు సాధకుడు ఆయాచక్ర స్థానములయందు శ్రీచక్ర నవావరణ దేవతలను ధ్యానించి ఉపాసించుటచే వివిధ కాంతులతోను, వివిధ నామములతోనూ, సాధకునికి అనుభూతియగును. ఈ విషయమే శ్రీసూక్త మందలి ప్రథమ ఋక్కునందు చెప్పబడినది. (ఓయగ్నిదేవా! బంగారువన్నెవంటి వన్నెగలదియు భక్తుల పాపకర్మలను హరించునదియు పసుపు పచ్చని వన్నె గలదియు, బంగారు వెండిపూల దండలు దాల్చినదియు, వెన్నెలవలె ప్రకాశించు

వదియు, ఆహ్లాద పెట్టునదియు, బంగారు తనరూపుగా గలదియునగు లక్ష్మీదేవిని నాకొరకు పిలువుము) ప్రకటార్థము.

(ప్రకటార్థమననేమో శ్రీతత్త్వము యను పుస్తకమునందు కొద్దిగా వివరింపబడినది.) ఈ విషయము ప్రస్తుత కాలమున శ్రీ విద్యోపాసక అగ్రగణ్యులలో నొకరైన శ్రీ ఈశ్వర సత్యనారాయణశర్మగారి శిష్యులలో అగ్రగణ్యులైన శ్రీ మర్రిపాటి వేంకటనరసింహారావుగారు రచించిన శ్రీ తత్త్వమను గ్రంథమునందు వివరింపబడినది.[1] చతుర్విధైక్యాను సంధానమనగా 1. పరదేవతా శ్రీచక్రములకైక్యము. 2. శ్రీచక్ర బ్రహ్మాండములకైక్యము. 3. బ్రహ్మాండ పిండాండములకైక్యము 4. మాతృకా శ్రీవిద్యా దేవతల కైక్యము (అనగా వేద్యమైన శ్రీదేవికి వేదికమైన మంత్రమునకును అభేదమును గ్రహించుట, మంత్ర సంకేతములను దెలియుట).

ఇంక షడ్విధైక్యాను సంధానమనగా శ్రీచక్ర, మాతృకా, శ్రీలలితా, బ్రహ్మాండ, పిండాండ, మంత్రముల, కార్యకారణ ధర్మములను, పరస్పర సంబంధములను అవగాహనచేసుకొని వానియొక్క ధర్మసామ్యమువలన ఏకత్వ భావనను సాధించుట.

[2]సాధకుడు ప్రారంభమున శ్రీచక్రమును తనముందు పీఠము నందుంచి, కల్పసూత్ర ప్రకారముగా ప్రాణాసాధనాది క్రమ పద్ధతితో, నవావరణార్చన చేయుచు, సాధకుని శరీరమందున్న మూలాధారాది చక్రములతో, శ్రీచక్రమునకు ఐక్యమును సాధించవలయును. భావోపనిషత్తు నందు చెప్పిన ప్రకారము, స్వకీయమైన దేహమే నవచక్రముల సమిష్టి రూపముగలదైన శ్రీచక్రముతో అభిన్నమైనట్లు చెప్పబడినది. సాధకుని శరీరమే సుధాసింధు మధ్యగతమణిద్వీపము. సాధకుని శరీరమందు ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు గలవు. ఈ మూడు శక్తుల నిర్వాహణము

---

1. తూండ్ల వేంకటకృష్ణశర్మగారి వ్యాసముననుసరించి, శరన్నవరాత్రోత్సవ సంచిక 1974.
2. శరన్నవరాత్రోత్సవ సంచిక 1974 (శ్రీవిద్యోపాసన బ్రహ్మవిద్యోపాసన) టి.వి.కె. శర్మగారు.

వలననే అన్ని పనులు జరుగుచున్నవి. ఈ శక్తులన్నియు బ్రహ్మాండమందు వ్యాపించియున్న పరాశక్తి స్వరూపములే. అదియే శ్రీచక్ర త్రికోణ స్వరూపము. సాధకుడే శ్రీచక్ర అంతరుపాసనకు యజమాని. అతడే జ్ఞాత, అనగా విషయ పరిజ్ఞానము కలిగిన సాధకుడు, అర్ఘ్యమే జ్ఞానము, హవిస్సే జ్ఞేయము (తెలియదగినది) జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము ఈ మూడును త్రిపుటి. వీటిని ఐక్యముగా సంభావించుట శ్రీచక్రపూజ. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము, ఇందు మధ్యపదము జ్ఞానము ఇదియే మిగిలిన రెంటికి ప్రసవస్థానము, కావున అది వికసించినచో మిగిలిన రెండును దానియందే లీనమగును. అపుడు నిలుచునది జ్ఞానమొక్కటే. అదే పరబ్రహ్మశక్తి పరస్వగుణము. అదియే బ్రహ్మానందమగు శ్రీచక్రపూజ

[1]బ్రహ్మాండావిర్భావ కాలమున, నిస్తరంగ సముద్రమునందు తరంగములవలె పరమాత్మయందు స్పందన శక్తి ఉద్రేకించినది అట్టి పరబ్రహ్మము యొక్క క్రియాశీల శ్రీమాత (దేవి)యన పిలువబడును. పాలు, పాల తెల్లదనము ఎట్లువేరుచేయబడవో అట్లే బ్రహ్మము, తచ్ఛక్తియు విడదీయ శక్యముకావు. ఇదే విధముగ అగ్ని-వేడి, సర్పము-దాని వంకర నడక, పాలను తలచుకొన్న తెలుపు స్ఫురించును, అట్లే అగ్నినితలచుకొన్న వేడిస్ఫురించును. అగ్నినుండి వేడిని, వేరు చేసిన యది అగ్ని అని పిలువబడదు. ఈవిధముగానే పరబ్రహ్మమునుండి శక్తిని వేరు చేయుటకు వీలుపడదు. నిర్గుణ పరబ్రహ్మమునందు అవ్యక్తమైన నామ రూపములు లేకుండ నుండిన ఆదివ్య శక్తియే సృష్ట్యాది యందు వ్యక్తమై క్రియా రూపము ధరించి ఈ దృశ్య ప్రపంచమందంటను, అనంత శక్తులతో వ్యాపించుచున్నది. ఆజగజ్జననియే సూర్య భగవానుడుగా, విద్యుచ్ఛక్తిగా అంతర్వ్యాపాది శక్తులుగా, రూపొందుచున్నది. ఏదివ్యశక్తి నుండి అగణిత విశ్వములూ, సమస్త వస్తుస్వరూపములు నామరూపములు ఉద్భవించి మరల దేనియందు లయమగుచున్నదో ఆపరబ్రహ్మశక్తియే ఉపాసించ తగినది. [2]విశ్వస్వరూపిణి . విశ్వము స్థూలము, సూక్ష్మము అని రెండు విధములుగ నున్నది.

---

1. శ్రీచక్రనవావరణార్చన, టి. వి. కె. శర్మగారు, శరన్నవరాత్రోత్సవ సంచిక, 1976.
1. శరన్నవరాత్రోత్సవ సంచిక, 1976 పుట 84. టి. వి. కె. శర్మగారి శ్రీచక్రనవావరణార్చన.

1. స్థూలము :

అనంతకోటి జీవ సమిష్టిరూప ప్రపంచము. దీనినే విరాట్టందురు.

2. సూక్ష్మము :

వ్యష్టి (స్వశరీర) జీవరూప పిండాండము జీవియనబడును. ఇవి రెండును తారతమ్యమున తప్ప సర్వత్ర సమాన ధర్మములు గలిగియుండును. ప్రతిజీవికిని జాగ్రత్, స్వప్న, సుషుప్తులను అవస్థాత్రయము కలదు.

1. జాగ్రదవస్థయందలి సమష్టి జీవాభిమాని వైశ్వానరుడనబడును. జాగ్రద్దశయందలి వ్యష్టి జీవాభిమాని విశ్వుడనబడును. ఇట్టి విశ్వుని రూపమున ఎల్లప్పుడు ఆ శ్రీమాత జాగరిణిగా నుండి సర్వేంద్రియములకు జ్ఞానమును కలిగించుచు, స్థూలశరీర వ్యవహారములను జరిపించుచుండును

2. స్వప్నావస్థయందలి సమిష్టి దేహాభిమాని హిరణ్యగర్భుడనబడును. వ్యష్టిదేహాభిమాని తైజసుడనబడును. సూక్ష్మశరీర వ్యవహారమున తైజసుని రూపమున ఆ పరమేశ్వరి సాక్షిణిగా నుండి సూక్ష్మశరీర వ్యవహారములను జరిపించు చుండును.

3. సుషుప్తి స్థితియందలి సమష్టి దేహాభిమాని ఈశ్వరుడనబడును. వ్యష్టి దేహాభిమాని ప్రాజ్ఞుడనబడును. సుషుప్తి స్థితియందలి జీవి జ్ఞానమే స్వరూపముగా గలిగి ప్రాజ్ఞుడనబడును.

ఈ మూడవస్థలయందు సమష్టి వ్యష్టిస్వరూపములతో బ్రహ్మాండ పిండాండముల యొక్క సకల కార్యములను నిర్వహించుచు సదా మనకు ప్రత్యక్ష రూపమున తెలియుచున్న ను విశ్వరూపిణిని, సర్వాంతర్యామిని సదా(మూడవస్థలయందు) ధ్యానించుచుండుటే శ్రీవిద్యోపాసన యనబడును. (చూ. శరన్నవరాత్రోత్సవ సంచిక 1975 వ్యాసము శ్రీ తూండ్ల వేంకటకృష్ణశర్మ)

ఆమెయే పంచకృత్యపరాయణ గాయత్రీ స్వరూపిణిగా చెప్పబడినది. 1. సృష్టికృత్యము 2. స్థితికృత్యము 3. తిరోధానకృత్యము 4. అనుగ్రహ కృత్యము యనునవి.

1. సృ ష్టి కృ త్య ము :

రజోగుణధర్మము. త్రిగుణాత్మకమైన పరమేశ్వరి మూర్తులలో రజోగుణ ప్రధానమైన శక్తి బ్రహ్మమనబడును. అట్టి సరస్వతి శక్తియుత రూపమున బ్రహ్మ ఈ సకల చరాచర ప్రపంచమును సృష్టించుచున్నది.

2. స్థి తి కృ త్య ము :

సంరక్షణాదులు సత్త్వగుణ ప్రధానములు. తాను బ్రహ్మరూపమున సృజించిన ప్రపంచమున సత్త్వగుణ ప్రధాన స్వరూపిణియగు లక్ష్మీదేవి యనెడు శక్తియుక్తముగ సంహార కార్యము నిర్వహించుచున్నది.

3. సం హా ర కృ త్య ము :

సంహారకార్యము తమోగుణ ధర్మము. సృష్టించి రక్షింపబడుచున్న ఈ జగములనెల్ల సంహరించుటకు తమోగుణ రూపిణియైన కాళియను శక్తితో కూడు కొని రుద్రరూపమున సంహరించుచున్నది.

4. తి రో ధా న కృ త్య ము లు :

కల్పాంతమున చరాచర ప్రపంచము యొక్క సకలకారణ శరీరములను బీజరూపమున తనయందిమిడ్చుకొని అగుపడక యుండునట్లు చేయుట తిరోధాన కార్యము నిర్వహించుచున్నది.

5. అ ను గ్ర హ కృ త్య ము :

ఇది శుద్ధసత్త్వ స్వరూపము. అనుగ్రహమను పునస్సృష్టి కున్ముఖత గల వాడు, ఎల్లప్పుడు మంగళములను కూర్చువాడు సదాశివుడు. ఇట్టి సదాశివ రూప మున పరమేశ్వరి పునః కల్పారంభ కార్యమునకు అనుగ్రహకారిణియై వెలయు చుండును.

ఇక శ్రీచక్రోద్ధారమును గూర్చి తెలిసికొందము. [1]శ్రీచక్రమున నొకదాని యందొకటిగానున్న త్రికోణములున్నవి. ఇది వలయాకారముగ నున్నది. కేంద్రమున బిందువు అయిదు త్రికోణములు అధోముఖముగానున్నవి నాలుగు త్రికోణములు ఊర్ధ్వముఖముగా నుండును. అధోముఖములైన త్రికోణములైదును శక్తికి, ఊర్ధ్వ ముఖములైన నాలుగు త్రికోణములు శివునకు చిహ్నములు. ఇవి శివశక్తులు. ఈ తొమ్మిది త్రికోణములు నొకవలయమందున్నవి. ఈ వలయమును చుట్టి ఏక కేంద్రీయములైన రెండు వలయములు గలవు. వీటికి సాంకేతికముగ పద్మములని పేరు. లోపలి వలయము అష్టదళ పద్మము. పైవలయము షోడశదళ పద్మము. దాని పైవలయ మొక్క రేఖగాక మూడురేఖలు ఈ చిత్రమంతయు నొక చతుర్భుజముచేత చుట్టబడినది. ఈ చతుర్భుజమునకు కూడ నాలుగుప్రక్కల సమానాంతరముగ గీయబడిన మూడురేఖలు గలవు. నాలుగు దిశలందు, రేఖల మధ్య భాగమున ద్వారములు - అనగా మొత్తము నాలుగు ద్వారములు కలవు. శ్రీచక్రముయొక్క సమిష్టి చిత్రమును తొమ్మిది ఆవరణలు కలిగినదని భావించెదరు. ఈ నవావరణార్చన గూర్చియే ముందుగా వ్రాసితిని.

తొమ్మిది ఆవరణలను వివరించు సాంప్రదాయిక శ్లోకమిట్లుగలదు.

"బిందు త్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వస్ర నాగదళ షోడశ పత్రయుక్తం।
వృత్తత్రయంచ ధరణీ సదనత్రయంచ
శ్రీచక్రరాజ ఉదితః పరదేవతయాః॥

(త్రిపురతాపినీ ఉపనిషత్)

ఈ వివరములనే శ్రీ గౌడపాదాచార్యులవారు తాము రచించిన శ్రీ సుభగోదయ స్తోత్రమున వర్ణించిరి.

త్రికోణైరష్టారం త్రిభిరపి దశారం సముదభూ
ద్దశారం భూవేశ్మద పిచ భువనాశ్రం సమభవత్।

---

1. చూ. శ్రీచక్రవిలాసము - తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు. పే. 6.

తతో౽ రూన్నాగారం నృపతి దశమస్మాత్త్రివలయం
తతుర్ద్వాః ప్రాకారత్రితయ మిదమేవాంత శరణమ్ ॥

అట్టి శ్రీచక్రమును సౌందర్యలహరిలో శ్రీశంకర భగవత్పాదాచార్యులవారు యిట్లు వర్ణించిరి.

చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పంచభిరపి
ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః ।
చతుశ్చత్వారింశద్వసుదళ కళాశ్రత్రివలయ
త్రిరేఖాభిస్సార్థం తవ శరణ కోణాః పరిణతాః ॥

శ్రీచక్రము నాలుగు శివచక్రములును, ఐదు శక్తిచక్రములును, అష్ట దళ పద్మమును, షోడశదళ పద్మమును, మేఖలాత్రయమును, రేఖాత్రయమును చేరి సిద్ధించుచున్నది. అట్లు యేర్పడిన శ్రీచక్రమునందు బిందువుతో నలుబది నాలుగు కోణములున్నవి. బిందువును విడచిన నలుబది మూడని యీ శ్లోకార్థము. మరియు శ్రీచక్రమును గురించి 'రుద్రయామళము' నందిట్లున్నది.

"పృశ్న యోనామమున యస్సర్వే చక్ర సమాశ్రయాః
సేనమానాశ్చక్రవిన్యాసం దేవ గంధర్వపూజితామ్ ।
అగ్నిషోమాత్మకం చక్రమగ్నిషోమమయం జగత్
అగ్నావంతర్గతౌ తానః అగ్నిషోమమయం స్మృతమ్.
త్రిఖండం మాతృకాచక్రం సోమసూర్యానలాత్మకమ్ ।
త్రికోణం బైందవం సౌమ్యమష్టకోణం చ మిశ్రకమ్ ।
చక్రం చంద్రమయంచైవ దశార ద్వితయంతథా ।
చతుర్దశారం వహ్నేస్తు చతుశ్చక్రం చ భానుమత్ ।
ఏతత్ప్రసాదాదింద్రాద్యావసవోఽష్టౌ మరుద్గణాః
యేయే సమృద్ధాలోకేఽస్మిన్ త్రిపురాచక్రసేవకాః
పురత్రయంచ చక్రస్య సోమసూర్యానలాత్మకమ్
మహాలక్ష్మ్యాః పురం చక్రం తత్రైవాస్తే [illegible] ॥"

రుద్రయామళమునందలి విషయములే స్వల్పభేదముతో అరుణోపనిషత్తు నందును గలవని 'శ్రీచక్ర విలసనము'న తెలుపబడినది. అరుణోపనిషత్తనగా భగవతియైన అరుణను ప్రతిపాదించునది.

శ్రు. "ఇమానుకం భువనాసీషధేమ" ఇన్ద్రశ్చ విశ్వేచదేవాః యజ్ఞం చన స్తన్వంచ ప్రజాం చ ఆదిత్యైరింద్రస్సహ సీషధా తుః అదిత్యైరిన్ద్రస్సగణో మరుద్భిః। అస్మాకం భూత్వవితా తనూనామ్ అప్లవ స్వప్ల ప్లవస్వః అణ్డీభవ ఇమాముపః సుఖాదీం దుఃఖనిధనామ్। ప్రతిముంచ స్వాస్యాంపురమ్। మరీచయ స్స్వాయం భువాః। యే శరీరాణ్య కల్పయన్। తే తేదేహం కల్పయంతు। మాచతే ఖ్యాస్మ తీరిషత్। అప్సావక్ర నవద్వారా।"

[1]పృశ్నులను మునులు పరస్పరము భాషించుకొనుచున్నారు. "శ్రీచక్రమును స్మరించుకొనియే భువనము లున్నవని తలంచెదము ఇంద్రుడు, విశ్వే దేవతలు, శ్రీచక్రము నాశ్రయించి యున్నారు. అగ్నిష్టోమాది యజ్ఞమును అర్థ శరీరమగు ధర్మపత్నిని, సంతానమును, సర్వ సంపదలను, మరుద్గణముతో ఇంద్రుడు శ్రీచక్రమువలన పొందెను ఆయన మనకిట్లు పదేశించినాడు మరుద్గణ సహితు డగు ఇంద్రుడే పుత్రమిత్ర కళత్రములతోడ మన యోగ క్షేమములను చూచు వాడు. శ్రీచక్ర స్మరణమువలన ఆపాదమస్తకము అమృతముచేత తడుపబడును. ఆ స్మరణ డెబ్బది రెండు వేల నాడీ మార్గములను అమృతముచేత తడుపును. శ్రీచక్ర విద్యా! పిండాండ రూపమైన మా దేహమును బ్రహ్మాండ రూపమైన భవదీయ బాహ్యదేహముతో చేర్పుము. సుఖాత్మకమును దుఃఖ రహితమునగు స్వదేహమును వదిలింపుము భగవతి శరీరము నుండియే కాలముత్పన్నమగు చున్నది. ఆ మరీచులు సూర్య చంద్రాగ్నులకు ప్రకాశంబు నొసగుచు దేవీ చరణ సంభూతములై యున్నవి. నీ జ్ఞానము మమ్ము విడువకుండును గాక. శ్రీచక్రము, 1 అష్టకోణము, 2 దశకోణములు, 1 చతుర్దశ కోణము, 1 అష్ట పత్రము, 1 షోడశపత్రము, 1 త్రివలయము, 1 భూపురత్రయము, అను యెనిమిది చక్రములను కలిగి నవద్వారములను త్రికోణములను కలది.

---

1. మా॥ శ్రీచక్ర విలసనము - తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు. పు. ౫-

శ్రీచక్రమున తొమ్మిది ఆవరణలు ఆరోహణక్రమమున నున్నవి. 1. భూపురము, 2. షోడశదళపద్మము 3. అష్టదళపద్మము 4. చతుర్దశారము 5. బహిర్దశారమను దశత్రికోణచక్రము. 6. అంతర్దశారము. 7. అష్టకోణ చక్రము. 8. త్రికోణము. 9. బిందువు.

అవరోహణలో బిందువు నుండి భూపురమువరకు తొమ్మిది కేంద్ర మండలి బిందువు, లోపలనున్న త్రికోణము కలసి మొదటి రెండు ఆవరణ లగును. ఆ తరువాత అష్టకోణ చక్రమున్నది. పిమ్మట అంతర్దశారమను లోపలి దశ త్రికోణ చక్రమున్నది. దీనికి పదికోణములు కలవట. ఆ పిమ్మట బహిర్ద శారమను వెలుపలి దశ త్రికోణ చక్రమున్నది. తరువాత చతుర్దశారమని పిలువ బడు పదునాలుగు త్రికోణములు గల చక్రమున్నది. తరువాతది అష్టదళ పద్మము, పిమ్మట షోడశదళ పద్మమను పేరుగల ఆవరణము. ఆ తరువాత భూపురమను పేరుగల మూడురేఖలుగల చతుర్భుజము కలదు భూపురము మొదలు యీ తొమ్మిది ఆవరణల నొకదానిపై యొకటి నిలిపిన శ్రీచక్రరూపము సిద్ధించును. దూర్వా-సోఋషి విరచితమైన శ్రీలలితాస్తవరత్నమున శ్రీపుర వర్ణనము సాహిత్య రమణీయముగా నున్నది.

పైన వ్రాయబడిన భూపురము మొదలు బిందువువరకు నీయబడిన షోడశ దళ పద్మము చతుర్దశారము, అంతర్దశారము మున్నగు వానిని గూర్చిన వివరము లెంతయు శ్రీచక్రవిలసనమున గలదు (చూ. పుట 85, 94)

శ్రీచక్ర భేదములు

శ్రీచక్రము మూడు ప్రస్తార విధములు. 1. భూప్రస్తారము 2. మేరు ప్రస్తారము 3. కైలాస ప్రస్తారము యని మూడు ప్రస్తార విశేషములు. ఈ ప్రస్తారత్రయమును గూర్చి శ్రీ గౌడపాదాచార్యులవారు సుభగోదయ స్తోత్ర మందిట్లు వ్రాసిరి.

1"ఇమానిత్యావర్గాస్తవచరణ సమ్మేళనవ శా
న్మహామేరుఖాః స్యుర్మను మిళనకైలాస వపుషః
వశిన్యాద్యా ఏతా అపి, తవ, స బింద్వాత్మకతయా
మహీ ప్రస్తారో యం క్రమ ఇతి రహస్యం సమయినామ్"

నిత్యా షోడశ తదాత్మ్య మనునది మేరు ప్రస్తారము మాతృకాతాదాత్మ్య మగునది కైలాస ప్రస్తారము వశిన్యాది తదాత్మ్య మనునది భూప్రస్తారము.

భూ ప్ర స్తా ర ము

భూప్రస్తారమును గురించి సనత్కుమార సంహిత యందిట్లు చెప్పబడెను. "శ్రీచక్రాంగములైన నిత్యం పదునాలిందిని రెండేసి చొప్పున వశినీ మొదలుగాగల అష్టదేవతల తోడ కలిపి బిందు స్థానమైన త్రికోణమును విడచి తక్కిన కోణము లెనిమిదింటి యందుంచునది బిందు స్థానము నందు త్రిపుర సుందరిని భావించునది. ఎనిమిది వర్గములను, [2]వశిన్యాది దేవత లెనమంత్రములను, షోడశ నిత్యలను, ద్వాదశ యోగినులను, గంధాకర్షిణ్యాదులను నాలుగును చేరి నలువది యెనిమిది దేవతలు. ఇందు త్రిపుర సుందరి మాత్రము బైందవ స్థానమునకు క్రిందుగా భావించునది. గంధాకర్షిణ్యాదులను నాలుగింటిని నాలుగు ద్వారము లందు భావింపవలెను. మిగిలిన నలువది మూడు దేవతలు నలువది మూడు కోణములందు భావించుకొనవలెను. దీనిని భూప్రస్తార రూపమైన శ్రీచక్ర మనెదరు.

మే రు ప్ర స్తా ర ము

షోడశనిత్యలు ఎనిమిది వర్గములుగా నున్నవి. ఆ యెనిమిది వర్గములు శ్రీచక్రమున అష్టదళ పద్మమునందుగల యెనిమిది దళములందును క్రమముగా

1. చూ|| శ్రీచక్ర వివరణము పుట-11.

వశిన్యాది దేవతలు : వశినీ, కామేశ్వరీ, మోదినీ, విమలా, అరుణా, జయినీ, సర్వేశ్వరీ కౌలినీ.

2. వశిన్యాది దేవతలు : వశినీ, కామేశ్వరీ, మోదినీ, విమలా, అరుణా, జయనీ, సర్వేశ్వరీ కౌలినీ.

తూర్పు దళము మొదలుకొని ప్రతిదళమునందు నున్నవి. ఇట్లు ప్రతిదళమునందు రెండు వంతున యెనిమిది దళము లందున్నవి పదునారుగుచున్నవి. ఈనిత్యలు పదునారే పదునారు స్వరములుగా (అ ఆ మొదలైన అచ్చులు) షోడశదళ పద్మము నందుండి దశారచక్రముల రెండిట నంతర్భూతములైనవి. ఈ షోడశ నిత్యలలో మొదటి నిత్యాద్వయము (రెండును) త్రికోణమునందలి బిందు రూపముగా నున్నవి. తక్కిన పదునాలుగును మన్వస్రము (చతుర్దశారము) నందున్నవి. మేఖలాత్రయము, భూపురత్రయము, యీ రెండును బైందవ త్రికోణముల రెంటియందు నంతర్భూతములు. శ్రీచక్రమందు షోడశ నిత్యలకు నంతర్భావము. ఈ యంతర్భావమునే మేరుప్రస్తార మనుచున్నారు.

కైలాస ప్రస్తారము

కైలాస ప్రస్తారమును గూర్చి సనందన సంహిత యందిట్లున్నది. షోడశ నిత్యలును శ్రీచక్ర విద్య కంగములు షోడశ నిత్యలు వరుసగా కామేశ్వరీ, భగమాలినీ, నిత్యాక్లిన్నా భేరుండా, వహ్నివాసిని, మహావజ్రేశ్వరీ, శివదూత, త్వరితాకుల సుందరీ, నిత్యా, నీల పతాకా, విజయా, సర్వమంగళా, జ్వాలామాలినీ, చిత్రా యని చెప్పబడినవి. శ్రీమాత పాడ్యమి మొదలు పౌర్ణమి లేక అమావాస్య వరకు ఒక్కొక్క తిథియందు ఒక్కొక్క నామముతో ఉపాసింపబడును.

పాడ్యమి - కామేశ్వరీ
విదియ - భగమాలినీ
తదియ - నిత్యక్లిన్నా
చతుర్థి - భేరుండా
పంచమి - వహ్ని వాసిని
షష్ఠి - మహావజ్రేశ్వరి
సప్తమి - శివ దూత్
అష్టమి - త్వరితా
నవమి - కుల సుందరీ
దశమి - నిత్యా

ఏకాదశి - నీలపతాక
ద్వాదశి - విజయా
త్రయోదశి - సర్వమంగళా
చతుర్దశి - జ్వాలా మాలినీ
పౌర్ణమి - చిత్రా

సర్వాత్మకములైన యీ పదునారు నిత్యలును పంచ దశాక్షరీ మంత్ర మందున్న 'ఏ' అను వర్ణము నందు మొదటనున్న (అ + ఇ = ఏ) 'అ' అను వర్ణము చేతను, విసర్గ రూపమైన 'స' అను వర్ణము చేతను సంగృహీతములై జీవకళా రూపమునంది బైందవ స్థానమునందుండుచున్నవి. (పంచ దశాక్షరీ మంత్ర మనగా శ్రీవిద్యలో ప్రముఖమైన 15 అక్షరముల మంత్రము. బాల, పంచదశి, షోడశీ మంత్రములు ముఖ్యమైనవి) పంచదశాక్షర మంత్రమును గూర్చి ముందు వివరింతును. స్పర్శములు (కకారము మొదలు మకారము వరకు గల వర్ణములు) షోడశాంబుజ బీజ యుక్తములయి అష్టదళ చక్రమునందును, దశార చక్రద్వయము నందును (పది కోణముల చక్రములు రెండి యందు) అంతర్భూతములగు చున్నవి. యకారము మొదలు తక్కిన తొమ్మిది వర్ణములును ద్విరావృత్తిచేత (యకారము మొదలుకొని తొమ్మిది వర్ణముల నొక్కొక్క దళమునందొక్కొక్క వర్ణము చొప్పున వ్రాసి మరల యకారము మొదలుకొని పూర్వము లాగున వ్రాయుట) మన్వస్రము నందలి పదునాలుగు కోణములందును పదునాలుగు వర్ణము లంతర్భూతములగు చున్నవి. మిగిలిన నాలుగు వర్ణములును శివచక్రముల నాలుగింటి యందు నంతర్భూతమగుచున్నది. దీనిని కైలాసప్రస్తార మందురు.

షోడశనిత్యలు :

మేరు కైలాస ప్రస్తారములలో చెప్పబడిన షోడశ నిత్యల యొక్క వివరణము శ్రీచక్ర విలసనమున తత్త్వములని, దివా రాత్రములని చెప్పి గొప్ప వివరణ పద్ధతిలో నీయబడినది. (చూ॥ శ్రీచక్ర విలసనము పుట 14) ఇక పంచదశాక్షరి యొక్క వివరణ కొంత తెలిసికొందము. [1]మంత్రోద్ధారక్రమ మిట్లున్నది. (త్రైలోక్య మోహన కవచము ననుసరించి)

1. శ్రీతత్త్వము, పుట 149, మట్టిపాటి వేంకట నరసింహరావుగారు.

శ్లో॥ కామో భగో రమాశక్రః శంభు రగ్నిస్త్రి మూర్తి భృక్,
ప్రాణో జీవస్స్మర శ్శంభుః శక్ర శ్శంభు స్తనూన పాత్,
వామ నేత్రయుతో జీవః కామశ్శక్రో మహేశ్వరః
వహ్నిర్వామాక్షి సంయుక్తో విద్యాదుర్వాస సాపురా,
ఆరాధితా, శక్రతు నాశకృత్ జ్ఞేయా సుదుర్లభా ॥

కామ బీజమనగా 'క' కారము భగ బీజమనగా 'ఏ' కారము రమా బీజమనగా 'ఈ' కారము. శక్ర బీజమనగా 'ల' కారము. శంభు బీజమనగా 'హ' కారము. శంభు అగ్ని; త్రిమూర్తి రూపమయిన బీజమనగా - "హ్రీ" కారము. "కఏ ఈలహ్రీం."

ప్రాణ బీజమనగా - 'హ' కారము. జీవ బీజమనగా 'స' కారము. స్మర బీజమనగా 'క' కారము. శంభు బీజమనగా 'హ' కారము. శక్ర బీజమనగా 'ల' కారము. శివ బీజము, అగ్ని, వామనేత్ర బీజములతో కలసిన దనగా "హ్రీ" అని అర్థము. "హస కహల హ్రీం"

జీవ బీజమనగా 'స' కారము. కామ బీజమనగా 'క' కారము శక్ర బీజమనగా 'ల' కారము. మహేశ్వర బీజము, వహ్ని వామనేత్ర బీజములతో కలసిన దనగా - "హ్రీం" కారమని భావము.

"సకలహ్రీం" (- త్రైలోక్య మోహన కవచము)
"సమిష్టిగా = క ఏఈలహ్రీం, హసకహలహ్రీం."
"సకలహ్రీం" "త్రిఖండం మాతృ కామంత్రం సోమ సూర్యాన లాత్మకం"

అఖండ సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మ శక్తి యొక్క తత్త్వమును సాధకులకు బోధించు నిమిత్తము పరశివుడు చతుర్దశ విద్యల ప్రకటించినాడు అవి చతుర్వేదములు; తదంగములు ఆరుః న్యాయ, మీమాంస, పురాణ, ధర్మ శాస్త్రములు నాలుగు; వెరశి పదునాలుగు. దీని యందు అనగా చతుర్దశ విద్యల యందును అపౌరుషేయములైన ఋగ్యజుస్సామాఽథర్వణములు ముఖ్యములు. అట్టి వేదములందు ఉదాహృతములైన సప్తకోటి సంఖ్యాక మంత్రముల యందును

ముఖ్యమైనవి - గాయత్రి; పంచదశాక్షరి. ఇందు గాయత్రి స్పష్టాఽస్పష్టము. దీనికి ప్రకట గాయత్రి యను నామాంతరము గలదు. పంచదశాక్షరికి గుప్త గాయిత్రి యని పేరు.

ఇట్లు ధూర్జటి శ్రీవిద్యను తన కావ్యమందెట్లు ప్రతిపాదించెనో తెలిసి కొననగును. ఇతడు 'శ్రీవిద్యానిధియై, యని కావ్యారంభము చేసినాడు.

శ్రీవిద్యానిధియై మహామహిమచే జెన్నై వసిష్ఠాజలూ
తావాతాశన సామ జాటవిక గోత్రాదేవనత్కార రా
జీవాక్షియుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబై నయా
త్యావామాంగము దివ్యలింగము మదీయాభీష్టముల్సల్పెడున్.

ఇటులు కావ్యారంభము చేసి వేశ్యాతనయలు ముక్తినందుటతో కావ్యము ముగించినాడు. జంగముని మొదట ప్రవేశపెట్టి చివర శక్తియగు పార్వతిలో వేశ్యా పుత్రికలు లీనమగుట కావ్యాంతమున సూచించుట ఈ కావ్యమున గలదు. శ్రీవిద్య యనగా పార్వతీ పరమేశ్వరోభయ స్వరూప ప్రతిపాదకమైన పరావిద్య, దానికి నిధియైనవాడు. తదుపాసకులకు సకల శ్రేయో నిధానుడై వెలయువాడు; పరా విద్య కధిష్టాన స్వరూపుడగుటచే మహామహిమాన్వితుడు; వసిష్టునకు, బ్రహ్మకు వెలది పురుగునకు, పామునకు, ఏనుగునకు, తిన్ననికి, బ్రాహ్మణునకు, నత్కీరు నకు, వేశ్యలిరువురకు యాదవాధిపతికి శ్రేయస్సును కలిగించినవాడు; పార్వతి వామాంగముగా గలవాడు; దివ్యలింగస్వరూపుడునగు కాళహస్తీశ్వరుడు నాక భీష్టము లొసగు గాతయని ధూర్జటి గ్రంథారంభమున మంగళాచరణము గావించి నాడు. దీనిని బట్టియే కవి శ్రీవిద్యోపాసనము నెఱపువాడని తెలియవచ్చుచున్నది.

లక్ష్మీధరాచార్యుడు తన వ్యాఖ్యాన గ్రంథమున శ్రీవిద్యను వైదిక మార్గమున ప్రచారము గావించినవారు ఐదుగురని చెప్పెను. వైదికమతము ననుసరించి శ్రీవిద్యను ప్రచారము గావించినట్లైనచో దానిని సమయ మత మందురు. దానికి విరుద్ధమైనది కౌళము. ఈసమయ మతమున మొట్ట మొదట పేర్కొనదగినవాడు వశిష్ఠుడు. ఈ వశిష్ఠుని కథను ధూర్జటి ప్రథమాశ్వాసమున చెప్పినాడు. రెండవవాడు సనకుడు; శుక, సనందన, సనత్కుమార యని

శుభాగమ పంచక వైదికాచారమున గలదు. ఈ ఐదుగురి ననుసరించియే లక్ష్మీధరాచార్యుడు సమయాచారమును విస్తరించెను. (వ్యాఖ్యానించెను) శుభాగమ పంచకమున వశిష్ఠ సంహితలో శివుడు ఈశ్వరున కిట్లుగా చెప్పెను.

1. శృణుదేవి ప్రవక్ష్యామి నిత్యాషోడశికాంతథా
   నతస్య చిన్మయాఖ్యాతం సర్వతం త్రేషు గోపితం
2. తత్రాదే ప్రథమ నిత్యామహా త్రిపుర సుందరీ
   తతః కామేశ్వరీ నిత్యాభిత్యాచ భగమాలినీ
3. నిత్య క్లిన్నాతథాచైవ భేరుండ వహ్ని వాసినీ
   మహావిశ్వేస్వరీ రౌద్రీత్వరితాకుల సుందరీ
4. నిత్యానీల పతాకా చ విజయ సర్వమంగళా
   జ్వాలామాలినీ చిద్రూప ఏతాం నిత్యాస్తు షోడశ
5. ప్రతిపత్ ప్రభృతౌదేవ్యాః పీర్ణమాఖ్యాంత మర్త్యమేత్
   ఏకాది వృద్ధ్యాహమ్యా చదర్శ్యస్తందేవి విగ్రహం

వైదిక సంబంధమగు శైవమునకు, శ్రీవిద్యకును సంబంధించిన తంత్రములకును మొట్టమొదటివాడు వశిష్ఠుడే. కనుక అవశిష్ఠుని కథనే తొలుదొల్త ధూర్జటి ప్రథమాశ్వాసమున చెప్పుచున్నాడు. వేదవిహితమైన శ్రీ విద్యను సమయాచారమందురు. తద్విరుద్ధమైన దానిని కౌళాచారమందురు. సమయాచారమున మొదట నెన్నదగిని వాడు వశిష్ఠుడు. అతడే త్రిపురసుందరీ తంత్రమును ప్రవేశింప జేసెను. శ్రీవిద్యోపాసకుడైన వశిష్ఠుడు బ్రహ్మజ్ఞానియయ్యు శివుని మరచుటచే పుత్ర దుఃఖమునకు ఈడయ్యెను. కాని సమయాచారమున శ్రీ విద్యోపాసకులు భాస్కరాచార్యులు తెలిపినట్లుగా

"యత్రాస్తి భోగోనచ తత్ర మోక్షః
యత్రాస్తి మోక్షోనచ తత్రభోగః
శ్రీ సుందరీసేవన తత్పరాణాం
భోగస్య మోక్షస్య కరస్థైవ"

తత్తురైనవాడు (ధూర్జటి) ఈ సూత్రములోని ఆగమార్థరహస్యమును గురూప దేశముచేపొంది శ్రీకామేశ్వరీ ప్రసాదమున ఇహలోకమున సమస్త భోగములు శరీర పతనానంతరము మోక్షమును పొందుచున్నాడు. ఇట బ్రహ్మజ్ఞానియయ్యు ఐహిక భోగములు పొందినప్పటికిని వశిష్ఠుడు శివానుగ్రహములేక మోక్షమును పొందలేకపోయెను. భోగమోక్షములు రెండింటిని పొందగలిగిన మార్గము శ్రీవిద్యో పాసకులయందున్నది. ఈ వర్గమునకు చెందినవారుగా వశిష్ఠుని అగస్త్యుని మనము చెప్పవచ్చును. ఇక శ్రీకాళములు రెండును శ్రీవిద్యలోని ప్రధాన తత్వములు.

శ్రీ - దేవీతత్వము.

కాళ - కుండలినీతత్వము

గజము - అహంకారమునకు ప్రతీక

ఈ మూడింటితో కూడుకున్నదే శ్రీవిద్య. ఈ విషయమే కథా రూపమున ద్వితీయా శ్వాసమున ధూర్జటి చెప్పినాడు. ఈ మూడింటితో కూడుకున్నది ప్రపంచించుటకై ధూర్జటి ఈ కావ్యములో ప్రయత్నము చేసినాడు.

మాణిక్యవల్లి, బిడ్డలు, జంగమదాసి, శక్తికి ప్రతీకలు. అక్కడ సరస్వతి, లోపాముద్రలేకాక స్త్రీపుం సంయోగమును ముక్తిగా చెప్పుట స్త్రీలను వర్ణించు నప్పుడు పరిపూర్ణముగా శ్రీవిద్యలోని శ్రీవిద్యా తత్వమునే ధూర్జటి ప్రతిపాదించి నాడు.

ఉదాహరణకు ప్రథమాశ్వాసమున -

చ. పరిచిత బిందునైపుణి నపార కళానుభవప్రసక్తి నా
దరస వివేక సంపద సదాశుక వాక్యసుధామధూరి మో
హరహిత వృత్తిప్రస్ఫురదనంగ రహస్య విచారబుద్ధిన
ప్పురమున గామినీ జనులు పొల్తురు యోగిజనంబు పోలికన్

(కా. మా. ప్ర. ఆ. 84

బిందు — ముఖము
కళ—మన్మధకళ
నాద — శుకవాక్యసుధానుభూతి

దీనికి సౌందర్యలహరిలో ఈ క్రింది శ్లోకముతో అన్వయము కుదురును.

ముఖం బిన్దుం కృత్వాకుచయుగ మధస్తత్తదధో
హరార్ధం ధ్యాయేద్యోహర మహిషితే మన్మథకలాం,
స సద్యస్సంక్షోభం నయతి వనితా ఇత్యతిలఘు
త్రిలోకిమ ప్యాశుభ్రమయతి రవీన్దుస్తనయుగామ్
(సౌందర్యలహరి 19 శ్లోకం)

కాళహస్తీశ్వర మాహాత్మ్యమున పైపద్యములో వారకాంతలు యోగిజనంబులను పోలియుందురని శ్లేషాలంకారముతో చెప్పినాడు. ఇరువురికిని బంధనైపుణికలదు. యోగుల విషయమున ఆధారబంధము, ఉడ్డీనబంధము, జాలంధరము మున్నగు యోగ బంధముల నైపుణి. ఇతర వారకాంతల విషయము కామశాస్త్రమునకు సంబంధించిన భ్రమణ చక్రబంధాదుల నైపుణి ఇరువురికిని కళానుభవము గలదు. కళా - యోగి పక్షమున యోగకళలు కామిని పక్షమున కామకళా స్థానములను అర్థము.

నాదరస వివేక సంపద అనుదానికి యోగి పక్షమున నాదబిందు వివేక సంపద, వారకాంతల పక్షమున వీణాదివాద్యధ్వని సంపదయు నర్థములు. శుక వాక్య సుధానుభూతి యనగా యోగిపక్షమున శుకయోగి సిద్ధాంతమనెడి యమృత రసానుభవము. వారకాంతా విషయమున చిలుక పలుకుల వంటి ముద్దు ప్రీతికర ములగు మాటలమాధుర్యపు టనుభవము యని అర్థము. మోహరహిత వృత్తి యోగి విషయమున అజ్ఞానములేనిరీతి. వేశ్యా పక్షమున మొగ్గరమునందు హితమగు పద్ధతి. అనంగ రహస్య విచారబుద్ధియనగా బహుళాఖలులేక ఏకమార్గమునమందు తత్త్వవిచారము నందలి బుద్ధియని యోగిపక్షమున వర్తించును. ఇంక వేశ్యా పక్షమున మన్మథశాస్త్ర విచారమునందలిబుద్ధి. పరస్పర విరుద్ధములగు నీరెండు విషయము లిచట కవి నేర్పుతో సంబంధించినాడు.

సౌందర్యలహరి శ్లోకమర్థమిట్లున్నది తల్లీ! మూలమును బిందువునుగా దలచి, దానిక్రింద పాలిండ్లను కల్పించి యాక్రింద త్రికోణమును ధ్యానించి యచట నీమదన బీజము నెవరు ధ్యానించునో యాయుపాసక ప్రవరుడెల్ల పల్లవాధరలను భ్రమపెట్టు ననవేల! ముల్లోకముల నొక్కపెట్టున మోహింపజేయు గలడు సూర్యచంద్రులు స్తనములనుటచేత స్త్రీయని ధ్వని. జంగమస్త్రీ జంగమని తానంతతానై యాహ్వానించినది. ఇది శ్రీవిద్యలో సమయాచారమునకు సంబంధించిన విషయము. (కౌళములో పురుషుడు స్త్రీని బంధించుట జరుగును.) దాసి జంగము నాహ్వానించు సందర్భములో "బిజమాడుదేవరు నిజకృపాదృష్టిని" అను పద్యము. (కా. మా. ప్ర. ఆ 78) సౌందర్యలహరిలోని ఈ శ్లోకముతో అన్వయించదగును.

నరంవర్షీయాంసం నయన విరసం నర్మసు జడం
తవాపాంగాలోకేపతిత మనుధావన్తి శతశః
గళద్వేణీబంధాః కుచకలశ విస్రస్తసిచయా
హఠాత్త్రుట్యత్కాంచ్యో విగళిత దుకూలాయువతయః

(సౌ.లహరి. 18 శ్లోకం

తల్లీ! నీచల్లని చూడ్కులకు పాల్పడిన వాడెట్టి మోటువాడైనను, యెంత ముసలివాడైనను, ఎంత విరూపియైనను వానినే మన్మథుడని తలచి వలచి విలాసవతులు తమ కొప్పులు వీడగా, పైట జాఱగా, మొలనూళ్ళు తెగగా, కోకలు వీడగా వెంబడించి పరుగులిడుదురు. ఇది దీని భావము. ఇంకను కాళహస్తి మాహాత్మ్యములో 82, 84 పద్యములను కూడ దీని కన్వయించదగును

శా. అనేకంబుర పల్లవ ప్రకర నేత్రానంద బాష్పాంబుధా
రావర్షాగమ చంచలాలతిక, దుర్వార ప్రసూనాస్త్రతే
జోవైశ్వానర సామిధేని, రతనాసూత్రిత స్థిత స్వర్ణపే
టి విన్యస్తక పర్ది యొక్క కలకంఠీ రత్నమే తెంచుమన్

(కా.మా 88 ప్ర.ఆ)

చ. కపట కుమార జంగమ విహారమునం జనుదెంచు శైలజా
ధిపుగని భక్తిపూర్వకమతి న్మరజార్థి యొనర్చి, యొక్కచే
బ్రపదములంది, తన్మృదుల పాణి సరోరుహద త్తభూతిని
ర్దపునుదుటన్ ధరించి, ప్రమదామణియిట్లనియెం బ్రియంబునన్

(కా.మా.ప్ర.అ. 84)

పై పద్యము నందుగల 'విహార' శబ్దము శ్రీవిద్య నుండి వచ్చినదే. ఇంకను 86 పద్యములో

శా. సంతోషించి, "మహాత్మురాలిది, శివాధారైక సంశీల, య
శ్రాంతా పాంతజంగమార్చన కళా సామర్థ్య, కందర్పకు
ద్ధాంత శ్రీపరిహాస కృన్నిఖిల లోకాతీత సౌందర్య,యు
క్కాంతారత్నము, దీని భక్తికి మనః కంజంబు రంజిల్లెడిన్"

(ప్ర. అ. 86 పద్యం)

శివాధారైక సంశీల - శివా = (పార్వతీ) దేవి యొక్క ఆధారము శివాధారము - శ్రీవిద్యకు సంబంధించిన యాధారము మహాత్మిరాలిది యనుచున్నారు.

శ్రీవిద్యలో మన్మథుడు విష్ణువు సదాదేవీ ఉపాసకులై యున్నారు. శివుని మోహింప జేసెడి శక్తి విష్ణువునకు, జగత్తును మోహింప జేసెడి శక్తి మన్మథునకును దేవి అనుగ్రహమున వచ్చినట్లు సౌందర్యలహరిలో గలదు. దేవి అనుగ్రహము ఆతనే ఈ జగత్ వ్యాపారము నడుచుచున్నది. శివుడు లొంగుటయు దేవీప్రభావమే. దాసి జంగమ స్వామిని శివాధారైక సంశీలమై స్వాధీనపఱచుకున్నది కనుకనే చేమె సఖేసి యగుటయేగాదు ఆమె ద్వారానే యాదవరాజును జంగముని చూచి సేవించి ముక్తిని పొందెను. ఇంక తిన్నని విషయమన్నచో అతడు అవిద్యా పరుడు భేదరహిత స్థితి యందున్నాడు. మాతృకావర్ణ స్వరూపిణియైన దేవి యొక్క ప్రతిధ్వనియే నల్కురుని కథ. మధురాపట్టణము దేవికి నెలవై కళలకు పుట్టినిల్లైనది. కాళహస్తి పురవర్ణన నిర్గుణము కాగా మధురాపుర వర్ణనము సగుణము. ఇచట కళయనగా సౌందర్యము. అదియే కుండలినీ శక్తి. కవులు,

కళ ఈ గుణములన్నియు శక్తియగు మీనాక్షీదేవి యనుగ్రహ ప్రభావములే. ధూర్జటి మధురాపురమీ విధముగా వర్ణించినాడు.

సీ. కపట చతుష్షష్టిగతుల నాడినవాఁ
డాయి చొక్కేశుని వాసభూమి
యతని పట్టపుదేవియైన మీనేక్షణా
దర తనూభవకు ప్రధాన గృహము
ద్రవిడ భాషా పీఠతల శంఖ ఫలకంబు
గల కనకాబ్జ పుష్కరిణి కిరవు,
దక్షిణాంబుధి వధూ తామ్రపర్ణీనది
సవతువైఘకు నెన్నఁజాలు నునికి,

నిజదృగబ్జ ప్రపూజిత నీలకంఠ
కూడలళఘయవైకుంఠ కుంతిరామ
నిఖిల సంపత్పరంపరా నిహతకింప
చాన రూపంబు మధురాభిధాన పురము.

(శ్రీ ఆ. 181)

ఇఁక తరువాత ధూర్జటి వేశ్యా తనయుల కథ చెప్పినాడు. వీరు కూడ చివరకు శివసాయుజ్యము పడయుదురు. వేశ్యాతనయులనే గాని ధూర్జటి కావ్యమున వీరిరువురి నామధేయములు తెలుపలేదు పేర్లు చెప్పక పోవుట ఔచిత్య ఫలిత మెట్లనగా పూర్ణ తత్త్వములో లీనమయ్యేడివారు రూప నామక్రియా రహితులు. ఈ తత్వమును ధ్వనింప జేయుటకే ధూర్జటి వేశ్యా పుత్రికలనెనే గాని వారి పేరు చెప్పలేదు. వారికి సాయుజ్య సమయమున ప్రత్యక్షమైనది భోగమోక్ష ప్రదాన మయము. ఇది శ్రీవిద్య యొక్క విశిష్ట లక్షణము. చతుర్థాశ్వాసమున కాళహస్తి మాహాత్మ్యమున (128) వచనములో ఇట్లు గలదు. "జననీజనక శరీరంబును' విద్యా పురుష సామరస్య సుఖాకారంబును, శృంగార కాంతరసమయంబును' ప్రత్యక్ష భోగమోక్ష ప్రదసమయంబునునైన యొక్క మహాతేజం బెదురు కట్టం గన్నులకు మిఱుమిట్లు గొన నిల్చినం, దలంచిన తమ తలపిదేతెనని వనితలవని తలంబున సాష్టాంగ దండప్రణామంబు లాచరించి, యెదుటనుదుట ముకుళిత కర

పుటంబు లిడుకొని, మిన్నకున్న గన్నియల కన్నెఱింగి, తన్ను నెడబాయక సేవ సేయంగాయంబున సగంబిచ్చెదనని దాక్షాయణి సిగ్గుపడ సాయుజ్యం బిచ్చి యంతర్హితుండయ్యె నయ్యవసరంబున గమలాస్యలరాక యాలస్యంబగుటయు సొమ్ముల యొద్దందల వాకిట నుండు నింటి బిడ్డ లిడ్డఱుం దమలోన"

ఇది కట్టకడపడిమోక్షము. దీనిచే ధూర్జటి మతము తెలియుచున్నది. ఇంకనూ ధూర్జటి శివశక్త్యాత్మకమైన మతమును ద్వైతాద్వైతమును భేదాభేదమగు శైవమును సమయాచారమునకు సంబంధించిన శ్రీవిద్య నుపాసించిన వాడని చెప్ప వచ్చును.

ఐదవ ప్రకరణము

తెలుగులో భక్తి శతకములు

శ్రీకాళహస్తీశ్వర శతక ప్రాశస్త్యము

పూర్వము కవులు ప్రౌఢములైన రచనలేవేని చేయుటకు ముందుగా భగవదనుగ్రహప్రాప్తి కొఱకును, కవితా సృజనాభ్యాసము కొఱకును శతక రచనము చేయుచుండిరి. ఆంధ్ర వాఙ్మయమునందు శాఖోపశాఖలుగా వెలువడిన కావ్యప్రక్రియలలో 'శతకము' ముఖ్యమైనది. క్రి. శ. 12వ శతాబ్దినుండి నేటి వరకును ఆంధ్రమున శతక రచన సాగుచునే యున్నది. సంస్కృతము ననుసరించియే తెలుగులో శతక రచన మారంభమై కాలక్రమమున కావ్యప్రక్రియగా రూపొందెను.[1]

[2]ఆంధ్ర వాఙ్మయమున నన్నయ కాలమునుండి నేటివరకు వివిధ కావ్య ప్రక్రియలు క్రమ పరిణామ వికాసము నొందినవి. అందు కొన్ని సంపూర్ణముగ సంస్కృత కావ్యప్రక్రియలకు ప్రతి బింబములు. మరికొన్ని అనుకరణములయ్యు రమణీయ రూపముల సంతరించుకొనినవి. సంస్కృత ప్రాకృత వాఙ్మయ ప్రక్రియకు ప్రతిబింబమై విశిష్టలక్షణములతో భాసించినది ఆంధ్ర శతకప్రక్రియ.

అగ్ని పురాణమున ముక్తకాదుల లక్షణములిట్లు గలవు.

శ్లోకై రనేకైః కులకం స్యాత్ సందానిత కానితన్
ముక్తకం శ్లోక - ఏకైక శ్చమత్కారక్షమః సతామ్

ఈ శతాబ్దికి చెందిన ఆనందవర్ధనుడు ముక్తకాది భేదములను గుర్తించెను. పన్నెండవ శతాబ్ది నాటి హేమచంద్రుడను ఆలంకారికుడు, మహాకావ్య అనిబద్ధ కావ్యముల

---

1. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర -డా॥ దివాకర్ల వెంకటావధానిగారు.
2. ఆంధ్రశతక సాహిత్య వికాసము -డా॥ గోపాలకృష్ణరావుగారు

నుల్లేఖింప పదమూడవ శతాబ్ద్యంతమున జీవించిన వాగ్భటుడు ముక్తకాదుల నిట్లు వర్ణించెను.

తత్ర ఏకేనఛంద సాముక్తకం
ద్వాభ్యాం యుగ్మం సందానితకంచ
త్రిభిర్విశేషకం, చతుర్భికలాపకం
ద్వాదశాంతైః కులకమ్........

[1]సంఖ్యామూలక పద్య కావ్య భేదముల నుల్లేఖించి అందు శతకమును స్పష్టముగ పేర్కొనిన సంస్కృతాలంకారికుడు అమృతానందయోగి. ఈతని 'అలంకార సంగ్రహము' పదమూడవ శతాబ్దినాటిదని నిర్ణయింపబడినది. ఇందు ఏకాదశ పరిచ్ఛేదమున చాటు ప్రబంధముల వివరణము గలదు. అమృతానందయోగి నిరూపించిన చాటు ప్రబంధములివి.

అథ చాటు ప్రబంధానాం లక్షణం కద్యతేఽధునా
ముక్తకం పద్యమేకం సాద్వికం పద్యద్వయమ్ మతమ్
త్రికంత్రయేణ పద్యానాం పంచరత్నాని పంచకమ్
అష్టకం గుణమాలాస్యా ద్పోడశేందు కలామతా
సప్తవింశతి పద్యాని నామ్నా తారావళీ మతా
త్రింశ త్త్రింశికా పంచాశతా పంచాశికేష్యతే
శతేన శతకం ప్రోక్తమష్టోత్తర శతం పరమ్

[2]సంస్కృతాంధ్ర శతకస్తోత్ర వాఙ్మయమున నాటికి ప్రాచుర్యము నొందిన వానిని దృష్టి యందిడు కొనియే అమృతానందయోగి తన గ్రంథమునందు శతకమును అష్టోత్తర శతకమును స్పష్టముగ నుల్లేఖించెననుట కెట్టి సందేహము లేదు. సంస్కృతమున 'అమరుక' మాదిగాగల శతకములు స్తోత్రములు తమ కాలము నాటికే బహుళముగా నున్నను ప్రాచీన సంస్కృతాలంకారికు లెవరును శతకమును

---

1. ఆంధ్రశతక వాఙ్మయ వికాసము -డా॥ గోపాలకృష్ణరావుగారు.
2. ఆంధ్రశతక వాఙ్మయవికాసము - ,, ,,

ప్రక్రియగా గుర్తించక పోవుట విచార్యము. వారు శతకమును పద్య కావ్యముగ, అనిబద్ధ అసర్గబంధ కావ్యాంతర్గతముగ గణించియుందురని తోచును.

[1]క్రీ. శ 1160 - 70 ప్రాంతమున నుండిన మల్లికార్జున పండితారాధ్యుడు ప్రథమాంధ్ర శతక కర్తయని వాఙ్మయ చరిత్రకారుల మతము సర్వ సమ్మతము. సంస్కృత కన్నడ భాషలయందును పండితారాధ్యుడనేక గ్రంథములు రచించి నట్లు తెలియుచున్నది. కాని శివతత్త్వసారమను కృతి ఒకటి మాత్రమే లభ్యము. అదియు కొంతవరకు అసంపూర్ణము. శ్రీగిరిమల్లికార్జునా! అను మకుటముగల పద్యమొకటి లక్షణ గ్రంథమునందు దాహృతము. శివతత్త్వసారము శతకమా? యను సందేహము కలుగుటకు అందు వివిధ మకుటములు ప్రయుక్తములగుటయు, దాదాపు ఐదువందల పద్యములుండుటయే కారణము. "శతకంబు శివతత్త్వ సారము" అని పాల్కురికి సోమన స్పష్టముగ పేర్కొనినపుడు శతక లక్షణ ములుగల శివతత్త్వసారమును శతకముగ గ్రహించుట సమంజసము. మల్లికార్జున పండితారాధ్యుడు ప్రథమాంధ్ర శతకకర్త యని చెప్పనొప్పును.

శతక వాఙ్మయమున మల్లికార్జున పండితుడు, యథావాక్కుల అన్నమయ్య (సర్వేశ్వర శతకము) పాల్కురికి సోమనాథుడు శతక కవిత్రయముగా గీర్తింప బడుచున్నారు. ఉదాహరణాదులగు 'దేశి' ప్రక్రియల నాంధ్రమున ప్రవేశపెట్టిన శైవకవులే యీ శతకములను గూడ ప్రవేశపెట్టుట గమనింప దగిన విషయము. శతకములు సాధారణముగా గ్రంథకర్త యాత్మ భావములను బ్రకటించునవిగా నుండును. అందుచే శతకములు ఆత్మాశ్రయ కవితాశాఖకు జెందినట్టివి. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకము ఈకోవకుచెందినదే. తెలుగులో వెలువడిన మొదటి శత కములన్నియు శివభక్తి ప్రధానములు. ఈ శతకముల నాదర్శముగా స్వీకరించియే శ్రీకాళహస్తీశ్వర, రాజశేఖర, శంభోదయాంభోది, కంచి ఏకామ్రలింగ, శ్రీమల్లే శ్వర శతకములు మున్నగునవి వెలువడినవి. ఆంధ్రవాఙ్మయమున శతకములు ప్రధానముగా నాలుగు శాఖలుగా విభజించినట్లు ఆంధ్రవాఙ్మయ చరిత్రమున శ్రీ అవధానిగారు పేర్కొనిరి. కాని ఇంకను అనేక శాఖోపశాఖలుగా శతకములు కన్పించుచున్నవి. నీతి, భక్తి, వ్యాజస్తుతి, తత్త్వము లనునవి ప్రధాన శాఖలు.

---

1. డా॥ దివాకర్ల వెంకటావధానిగారు- ఆంధ్రవాఙ్మయ చరిత్ర

ఇంకను రాజభక్తికి, దేశభక్తికి సంబంధించిన శతకములు చారిత్రాత్మక శతకములు మున్నగునవెన్నో గలవు. అనువాదశతకములు, అచ్చతెనుగు శతకములు, చాటుశతకములు, జంతుసంబోధన శతకములు ఇంకను ఎన్నో గలవు. భక్తి శతకముల గూర్చి యించుక పరిశీలించి అందు శ్రీకాళహస్తీశ్వర శతకము యొక్క వైశిష్ట్యమును గూర్చి చెప్పుటయే ఈ ప్రకరణ లక్ష్యము.

భక్తిరస ప్రధానములైన శతకములన్నియు దేవతా స్తుత్యాత్మకములు. వీనిలో విష్ణుభక్తిని ప్రతిపాదించునవి హెచ్చుగా గలవు. శివస్తుతి శతకములలో శివలీలలు, శివభక్తుల మహిమలు విరివిగా గన్పట్టును. కాని విష్ణుభక్తి పరములగు శతకములయం దట్లుగాదు-విష్ణువుని దశావతారములలో పూర్ణావతారములగు రామకృష్ణావతారములకే ప్రాధాన్యము హెచ్చు. వానిలో, రాముని గూర్చిన శతకములు నధిక సంఖ్య గలవి. ఈ సందర్భమున గమనింపదగిన విషయ మేమన విష్ణుని శ్రీరామకృష్ణాద్యవతారము లన్నంత మాత్రమున శతకములలో, శ్రీరామానుజ ప్రతిపాదితమైన విశిష్టాద్వైతమత సిద్ధాంతము లున్నవని తలపరాదు. వీని యందు ప్రతిపాదితమైనది త్రిమూర్త్యాత్మకమైన పౌరాణిక విష్ణుభక్తియే. దశావతారములలో, కూర్మావతార నరసింహావతారములను గూర్చి శతకములు గలవు. నరసింహ శతకముదాహరణము.

శ్రీరాముని భక్తితో గూడ రామదాసాగ్రేసరుడగు నాంజనేయస్తుతి శతకములు ప్రచారము లోనికి వచ్చినవి. త్రిమూర్తులలో బ్రహ్మను గూర్చిన శతకములు లేవు. వారి భార్యలగు సరస్వతి లక్ష్మి గౌరీ దేవులను గూర్చిన శతకములు గలవు. పరాశక్తి స్వరూపులగు కాళి మహిషాసురమర్దనిని గూర్చి శతకములు గలవు.

నవగ్రహములలో సూర్యుని గూర్చి శతకములున్నవి. శనిని గూర్చి యొక శతకమున్నది. ఆయాక్షేత్రములలో వెలసిన దేవుళ్ళపైని (ఉదా: నరసింహ శతకము, మల్లికార్జున శతకము; కాళహస్తి శతకము మొ॥నవి) సకల కార్యములకు ముందు విఘ్నములు కలుగకుండ పూజించు విఘ్నేశ్వరుని గూర్చి నాలుగైదు శతకముల కంటే అధికముగలేవు. భక్తి శతకములలో వధునాతన కాలమున కవిశేఖరులు వద్దాది సుబ్బారాయుడు గారి 'భక్త చింతామణి' శతకమునకు మించి

1. శతక సంపుటము - 1వ భాగము-భక్తిశతకములు.

నది లేదు. 1981 నాటికి 82 ముద్రణము లందినట్లు శతక సంపుటము ప్రథమ భాగమున పేర్కొనబడినది. భక్తి శతకములలో కడు ప్రాచీనమైనవి వృషాధిప శతకము, సర్వేశ్వర శతకము, దాశరధి శతకము, వీటన్నిటి యనంతరము శ్రీకాళహస్తీశ్వర శతకము వచ్చినది. ప్రబంధ రచనానంతరమే ధూర్జటి కవి ఈ శతకమును వ్రాసినట్లు ముందు ప్రకరణమున వ్రాసితిని.

వృషాధిప శతకము

ఆంధ్రశతక వాఙ్మయమున, సంఖ్యానియమము మకుటనియమము గలిగిన శతకములలో ప్రథమము వృషాధిప శతకము, దీనిని పాల్కురికి సోమనాథుడు రచించెను. ఈతడు తెలుగుదేశముననేగాక, కర్ణాటక దేశమునను వీరశైవ మత మును తన గ్రంథముల మూలమున ప్రచారము గావించెను. తెలుగున వీరశైవ వాఙ్మయమునకు సోమనాథుడు విజ్ఞానపీఠమని చెప్పనొప్పును ఇతడు శ్రుతి స్మృతి పురాణేతి హాసములను సమగ్రముగా నాలోచించినవాడు. ఆంధ్ర దేశమున సప్రసిద్ధ కమగు నారాధ్య సాంప్రదాయమును ప్రవర్తిల్ల జేసిన పండితారాధ్యుని పండిత సాంప్రదాయమును తెలుగు భాషా మూలమున ప్రచారముచేసి తెలుగున ద్విపద, శతక, ఉదాహరణ గద్య రచనలకు నాద్యుడైన కవి. వీటన్నింటి కంటే మించినది సోమనాథుని శివభక్తిపరత. ఆతడు మూర్తీభవించిన శివభక్తి స్వరూపము. భృంగి అపరావతారము. 1170-1240 ప్రాంతమున ఈతడు జీవించియుండెను.

వృషాధిపశతకము కన్నడ దేశమున వీరశైవమత ప్రతిపాదకుడు బసవని స్తుతి రూపకమైనది. బసవా! బసవా! వృషాధిపా! యనునది మకుటము ఇది సోమనాథుని బసవ పురాణమునకొక విధమగు సంగ్రహరచనయని చెప్పవచ్చును. మొదట ద్విపదాంబు రుహముల కృతి బసవేశు ద్విపదాంబురుహములకు బూన్చి తరువాత చంపకోత్పలమాల పద్యములలో బసవని పూజించుట చెప్పబడినది.

శతక పద్యము నీ విధముగా ప్రారంభించెను.

శ్రీ గురు లింగమూర్తి సవిశేష మహోజ్జ్వల కీర్తిసత్క్రియా
ద్యోగ కళాప్రపూర్తి యవధూత పునర్భవ జార్తి పాలితా

భ్యాగత సంశ్రితార్థి కవిపండిత గాయక చక్రవర్తి దే
వా గతి నీవె మాకు బసవా! బసవా! బసవా! వృషాధిపా!

(పా. సో. వృషాధిప శతకము)

బసవేశ్వరుని ద్రవిడ, సంస్కృత, కన్నడ భాషలతో వర్ణించి చెప్పెను. పిదప తాను తెనుగు మణి ప్రవాళము కూడ ప్రవేశపెట్టి పద్యములు వ్రాసినాడు. మిగిలిన పద్యములలో బసవని భక్తి, భక్తి మహిమ ప్రతిపాదింపబడినది.

బసవని మహిమలు వర్ణించుచు సోమనాథుడు శతకము 67 పద్యమున జొన్నలు ముత్యములుగా చేయుట వర్ణించెను.

ఉ॥తె॥ బలుపొడ తోలుచీరయును పాపసరుల్ గిలుపాడు కన్ను వె
న్నెల తలచేదు కుత్తుకయు నిండిన వేలుపుటేలు పలు పూ
సలు గలతేని లెంకవని 'తానుదెనుంగు'న విన్నవించెదన్
పలవుమదిన్ దలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా

(వృషాధిప శతకము)

తరువాత పద్యమున సభలో దూరమున నున్న చల్లకడవ యెత్తుట, చీర లొలచి నను నారిమానముగాచుట, సిద్ధరామునికి కైలాసము చూపుట, శివ నాగయగారి అర చేతిలో పాలు వచ్చునట్లు చేయుట భాండాగారము జంగముల కిచ్చుట, శివయోగ నిద్రితుడగుట, అద్దమున శివుని జూపుట. ఇత్యాది విషయములన్నియు వరుసన ఆరు పద్యములలో చెప్పెను. ఇంకను మడివాలుమాచయ, శంకరదాసి, కక్కయ, షోడ్డల బాచిరాజు, మాదర చెన్నయ్య, కలికేత బ్రహ్మయ, ముసిడి చౌడయ, కన్నడ బ్రహ్మయ, బిబ్బ బాచయ, చెన్న బసవన, డేదయ అరియమరాజు- అను భక్తుల చరిత్ర లొక్కొక్క పద్యమున చెప్పబడినవి. ఇందు చెన్నబసవన్న బస వని వెనుక వీరశైవమును ప్రచారముచేసిన మహాభక్తుడు. వృషాధిప శతకము 108 పద్యమున పండిత మల్లికార్జున నుతిగలదు.

"దండిత వాదియై శివుడ దైవముగా కని కన్నులిచ్చి తా
నిందు మనంబుతో నిలువునిద్దవు గన్నులు దాల్చి పొల్ప మా

పండిత మల్లికార్జునుడు ప్రస్తుతి సేయగ నేర్చు నిన్ను నె
వ్వండు నుతింపనేర్చు బసవా! బసవా! బసవా! వృషాధిపా"

చివరికి ఫలస్తుతి చేయుచు బసవని మహిమనంతను ప్రస్తుతింప జేసినారు. ఈ శతకము శైవులకేగాక సాహిత్యకులకుపాదేయమైనది.

వృషాధిప శతకము వలెనే సర్వేశ్వర శతకము కూడ భక్తి శతకములలో అగ్రగణ్యమైనది. దీనిని యథావాక్కుల అన్నమయ్య రచించెను. ఈతడు కూడ శివకవి. తెలుగున గ్రంథ రచనా కాలమును తెలిపిన తొలికవి ఈతడేయని శతక సంపుటమున చెప్పబడినది. ఈతడీ శతకమును 1242లో చెప్పినట్లీ క్రింది పద్యము వలన తెలియుచున్నది,

శకాబ్దంబులు వార్ధిషట్క పుర శీతస్సంఖ్యం బ్రవర్తింప సు
శ్లోకానంద కరంబుగాగ మహిలో శోభిల్ల సర్వేశ్వర
ప్రాకామ్యస్తవ మొప్పజెప్పె శుభకృత్ ప్రవ్యక్త వర్షంబునన్
శ్రీకారా ధనవంతమైవసుధలో జెన్నొంద సర్వేశ్వరా !

(సర్వేశ్వర శతకము)

అన్నమయ్య తన కృతిని దూదికొండ యను గ్రామమున సోమేశ్వరారాధ్యుని యనుగ్రహము వలననే రచించినట్లు ఈ పద్యము వలన తెలియుచున్నది.

అభిరమ్యంబుగ దూదికొండ, మహనీయారాధ్య సోమేశ్వర
ప్రభుకారుణ్య వసంత సంజనిత సద్భావ ప్రసూనావళిన్
విభవంబొప్పగ గూర్చి యెంతయు లసద్విఖ్యాతిగా శీర్షంబు
ప్రభవంబైన శివత్పదద్వయము నారాధింతు సర్వేశ్వరా !

[1]అన్నమయ్య వంశీయులు నేటివఱకు, పల్నాటి సీమలో గురజాల తాలూకా చెర్లగుడిపాడులో నున్నారట. ఆయూరి కరిణీకము వారిదే-అన్నమయ్య తరువాత కొన్ని తరముల వెనుక సోమరాజను మహనీయుడు ప్రసిద్ధికెక్కెనట. అందుచే వారింటిపేరు, సోమరాజు వారని వ్యవహారము లోనికి వచ్చినది

1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము- డా॥ కే. గోపాలకృష్ణరావు.

ఆ వంశీయుల వలన అన్నమయ్యను గూర్చి తెలిసిన వృత్తాంతమీ విధముగా శతక సంపుటమునం దీయబడినది.

“అన్నమయ్య ఆరాధ్య బ్రాహ్మణుడు. ఆత్రేయసగోత్రుడు యజుశ్శాఖాధ్యాయి. మొదట గోదావరీ తీరమున నున్న పట్టిస గ్రామమున - వీరభద్ర స్వామిని సేవించుచుండెడివాడు. అతడు ఒక శివరాత్రికి శ్రీశైల యాత్రకు వెడలి మల్లికార్జున స్వామిని సేవించి, తిరిగి వచ్చుచు పల్నాటి సీమలో జెట్టి పాలెము దాపున కృష్ణా తీరమందు విశ్వామిత్రాశ్రమమను సత్రశాలయను పుణ్య స్థలమున శ్రీ మల్లికేశ్వర స్వామిని సేవించుచు గొంత కాలముండి యచ్చటనే సర్వేశ్వర శతకము రచించెను.

ఒక్కొక్క పద్యమొక్కొక్క తాటియాకుపై వ్రాసి యాయాకును కృష్ణలో వైచి “ఇది ప్రవాహమున కెదురీదివచ్చినా దానిని దీసి సూత్రమున కెక్కించెద - అట్లేయాకైనను రాక క్రిందికి గొట్టుకొని పోయెనా అప్పుడే నా శిరసు ఖండించుకొనియెద” అని శపథము చేసి మెడకు గండ గత్తెర వైచికొని, ఆకుల మీద పద్యముల వ్రాసి నీళ్ళలో విడిచిపెట్టగా నవి తిరిగి వచ్చుచుండెడివట. కొంత సేపటికి - “తరులం బువ్వులు పిందెలై” అను పద్యము ఎదురుగా రాక కొట్టుకొని పోవుచుండుట జూచి కంఠమును కత్తిరించుకొనుట కుద్యమించుచుండగా నొక పసులకాపరి ఒక తాటియాకు దొరికినది చూడుమని యిచ్చి అదృశ్యుడయ్యెను. కవియాయాకును జూడగా దానిపై తాను వ్రాసిన పద్యమునకు మాఱుగా వేఱొక పద్యముండుట చూచి యది సర్వేశ్వర కృతమని గ్రహించి యాపద్యము సూత్రమున కెక్కించి శతకమును పూర్తి చేసి కొంత కాలమునకు పిదప నా సత్రశాలయందే సిద్ధి బొందెను. అన్నమయ్య సర్వేశ్వర శతకమునకు తరువాత కాలమున వచ్చిన ప్రచారమును బట్టి చూడగా పైన చెప్పిన కథ వాస్తవమని చెప్పక తప్పదు. వృత్త శతకములలో నిది ద్వితీయమైనను రచనా ప్రశస్తిచే నద్వితీయమై యలరారుచున్నది.

శివపరములగు స్తోత్రములలో ‘శివ పంచస్తవి’ అను పేరున్నవి - “మహిమ్నము - మల్హణము - మలయ రాజీయము - అనామయము - హలాయుధము” అనునవి ప్రధానములు. వానిలో మహిమ్నము ప్రాథమికము,

మహిమ గలది- ఈ స్తోత్రములను, శివకవులే గాక, కవిత్రయములో ఎఱ్ఱన నుండి ప్రబంధ కవులును, శివస్తుతి సందర్భమున గ్రహించియే యున్నారు. పైవానిలో మలయ రాతీయము తప్ప తక్కిన నాల్గింటి నుండి అన్నమయ్య భావములను గ్రహించి యనువదించినట్లు శతక సంపుటమున పేర్కొనబడినది. ఇక సర్వేశ్వర శతకము నందలి కొన్ని పద్యములను పరిశీలింతము. భక్తి శతకము లలో ఇష్ట దైవమును స్తుతి చేయుట యొక పద్ధతి. సర్వేశ్వర శతకమున నీ క్రింది పద్యమున దక్షయజ్ఞ ప్రశంస గలదు.

"అతి దక్షుండగు దక్షుడీజగములో యాగంబు సల్లక్షణ
స్థితిగా జేయుచునుండి మిమ్ము మది నుద్దేశింపమింపజేసి తా
హతుడయ్యెం దుది నెట్టి కార్యములు బొందై యుండునే కర్తస
మ్మతితో జేయని దుర్మదుండు మనునే? భావింప సర్వేశ్వరా !"

(17 పద్యం సర్వేశ్వర శతకం)

దక్షయజ్ఞ ప్రశంసయే కాక శివస్తుతి కూడ యిందు గలదు. ఇక భక్తి, భక్తిలో కర్మ సిద్ధాంత నిరసన కూడ గలదన్న విషయము కూడ నీశతకమున చెప్పబడినది. ఉదాహరణకు

"పలు తీర్థంబుల గ్రుంకు కంటె మహిలో భక్తాంఘ్రి పానీయముల్
తలమీదం జిలికించుకోదగును, దీర్థంబాద భారంబు, త
త్ఫల మత్యల్పము, భక్తపాదయుగళాంభస్స్పర్శనిర్భారమై
యలరున్ శాశ్వత భుక్తిముక్తి ఫలదంబై యుండు సర్వేశ్వరా !"

(28. పద్యం. స.శతకము)

ఇచట సర్వ తీర్థములందు గ్రుంకులిడుటెందులకు? శివభక్తుల పాద తీర్థము నెత్తిని జల్లుకున్న చాలునను భావము స్ఫురించుచున్నది. ఇంకనూ నీ శతకమున శివునకు శివభక్తునకు అభేదము కూడ చెప్పబడినది. శివుడైనను, శివభక్తుడైనను ఒక్కటియే యను సిద్ధాంతము కలదు. దిగువ పద్యమదియే.

కని సద్భక్తుల కంతనంత గడువేడ్కన్ హృత్ప్రదామంబు సే
సిన మాత్రం జెడు సర్వదోషములు తద్భ్రీపాదముల్మట్టిమై

క్కిన సర్వాంగ సమగ్ర శుద్ధియగు భక్తిన్ వారికిం బ్రీతిచే
సిన దృష్టివ్యదయావలోకన ఘనశ్రీ లొందు సర్వేశ్వరా!
(29 పద్యం.స.శతకము)

ఒక్క మాటలో చెప్పవలెనన్న శివభక్తులకు నమస్కరించిన చాలునని ఈ పద్య భావము. ఇంకను కులమత భేదములు లేక భక్తులందరునూ ఒక్కటియే యని కూడ చెప్పబడినది. దీనికి ఉదాహరణముగా

బలవంతుండును దుర్బలుండును మహాప్రౌఢుండు మూఢుండునుం
గుణజుండుం గుణహీనజాతుడు ఘనక్రూరుండు శాంతాత్మ ని
శ్చలచిత్తుండును నొక్కరూప! మదినీసద్భక్తి చిత్తంబులో
పలవర్తించిన మీదనే విధమునన్ భావింప సర్వేశ్వరా
(61 పద్యము.స.శతకము)

ఇదే శతకమున 88 పద్యమున కవి తాత్త్విక విషయము చెప్పినాడు.

"కాయంబన్నది వారి బుద్బుద సదృక్షం బందురూపింప, లే
బ్రాయంబన్నది శారదాంబుద తటిత్ప్రఖ్యంబగుం, దత్సుఖ
శ్రేయంబన్నది మాయ యిట్లెఱిగియున్ శీఘ్రంబ నీధ్యానసం
స్థాయీ భావన జెందదేమిటికయా! సంసారి సర్వేశ్వరా!
(88 పద్యం.స.శతకము)

శరీరము అశాశ్వతమైనది. నీటి బుడగ, బుద్బుద ప్రాయమనియు చెప్పబడినది.

ఇక 'శివోహం' -శివుడే అహము అను విషయము కూడ చెప్పబడినది.

కేవలము శివుని అనేక నామములతో ధ్యానించుట ఇందు వర్ణితము.

"శ్రీకంఠాయ నమోనమో, నతసురశ్రేష్ఠాయ రుద్రాయ లిం
గాకారాయ నమోనమో, విగతసంసారాయ, శాంతాయ, చం
ద్రాకల్పాయ నమోనమో, దురిత సంహారాయ" తే యంచు ని
న్నాకాంక్షం బ్రణుతించు మానవుడు నీవై యుండు సర్వేశ్వరా!
(స. శతకము, 99 పద్యం)

ఇదే శతకమున 106వ పద్యమున మహిమాభివర్ణన గావింపబడినది.

"సకలాధీశ్వర పట్టభద్రుడవు భిక్షగామి, వత్యంత శాం
తకళాత్ముండవు, రౌద్రమూర్తి వతిసౌందర్యాంబికా సంగమా
ధిక లోలుండవు, దివ్యయోగివి, మదిం దెల్లంబు నెట్టివా
రికి దాశక్యమె నీ నిజం బెఱిగి వర్ణింపంగ ! సర్వేశ్వరా !"

(స. శతకము 108వ పద్యం)

శివుని మహిమ వర్ణించు టెవరికి శక్యము గాదట. అనంత సామ్రాజ్యము కలదు. భిక్షాటనము చేయువాడు శివుడు శాంతకళామూర్తివి. శాంతస్వరూపము గలవాడు గాను, భయంకర స్వరూపుడుగాను, మిక్కిలి సుందరియైన పార్వతి వశమైన వాడుగను గొప్ప విరాగిగను ఇందు శివుడు వర్ణింపబడెను.

శైవులు ఐశ్వర్యవంతు లనుటను శైవమతస్థులు విశ్వసింతురు. ఈవిషయ మింకొక పద్యమున పొందుపరుపబడినది.

సకలాధీశ్వరులై, గణాధిపతులై, సర్వజ్ఞులై, నిత్యులై
యకలంకాత్మకులై, మహామహిములై, యంభోజగర్భాండర
క్షకులై యుందురు, రెల్లవారును భవత్పదభక్తి నానాగణా
ధిక లీలావిధి నంతరంగముల వర్తింపంగ సర్వేశ్వరా !

(స. శతకము, 109వ పద్యం)

సకలాధీశ్వరులు గణాధిపతులు రాజులగుదురు, సేనాధిపతు లగుదురు, సర్వజ్ఞు లగుదురు, నిత్యులగుదురు, కళంకము లేని మనస్సు గలవారగుదురు, లోకమును కాపాడువారుగా నుందురు. శివభక్తి నిశ్చలత వహించినవా రీవిధముగా నుందురని చెప్పబడినది. వీరికి పూర్వజన్మ విశ్వాసము కూడ గలదు. మరియు నీ శతక మున వీరశైవము కూడ నొకచో కన్పించుచున్నది.

ఖలులై, యాచకులై, విరుద్ధ వికటాకారాంగులై, పంగులై
బలహీనాతురులై, రుణాపటల తాపచ్ఛన్నులై, భిన్నులై
చలనాందోళిత చిత్తులై, మలినులై, జాత్యంధులై మందులై
తొలిజన్మంబున మిమ్ము గొల్వని దురాత్ముల్ వారు సర్వేశ్వరా !

(స. శతకము 128 పద్యం.)

భక్తిశతకములలో అగ్రగణ్యమైనది దాశరధి శతకము కూడ. దైవ సంకీర్తన మిందు కాన్పించును. ఈ శతక రచయిత కంచెర్ల గోపన. ఈతడు భద్రాచల రామదాసనియు, బందిఖానా రామదాసనియు తెలుగు దేశమునకు ఎఱిక. రామదాసు దాశరథి శతకమే కాక కీర్తనలు చాల రచించెను.

[1]కంచర్ల గోపన ఆనిశాఖ బ్రాహ్మణుడు. ఆత్రేయస గోత్రుడుగను శతక సంపుటము మొదటి భాగమున చెప్పబడినది. కామాంబ తల్లి, లింగనమంత్రి తండ్రి యని కూడ చెప్పబడినది.

గోపన తాను వైష్ణవమతానుయాయియైనట్లును, ఆచార్యోపదేశమును బొందినవాడనియు నిట్లు చెప్పుకొనెను

ఉ॥ పట్టితి భట్టరార్య గురుపాదము లిమ్మెయి నూర్ధ్వపుండ్రముల్
బెట్టితి మంత్రరాజ మొడి బెట్టితి నయ్యమకింకరాళికిం
గట్టితి బొమ్మ మీ చరణకంజములందు దలంపు పెట్టి పో
దట్టితి పాపపుంజముల దాశరథీ ! కరుణాపయోనిధీ !

(దాశరథీ శతకము 102)

ఉ॥ అర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుడనై రఘునాథభట్టరా
చార్యుల కంజలెత్తి కవిసత్తముల స్వినుతించి కార్య సౌ
కర్య మెలర్ప నొక్క శతకం బొనగూర్చి రచింతు నేడు తా
త్పర్యమునన్ గ్రహింపుమిది దాశరథీ ! కరుణాపయోనిధీ !

(దా. శ. 6)

గోపన గోల్కొండయందు మంత్రి పదవులు వహించిన అక్కన్న మాదన్నల మేనల్లుడని రామదాసు చరితమున గలదు వారిరువురును గోల్కొండను క్రీ. శ. 1664-1687 వరకు పాలించిన తానీషా కాలమువారు గావున గోపనయు నా కాలమువాడే ననుట నిస్సందేహము. (చూ. శతక సంపుటము)

---

1. శతక సంపుటము 1వ భాగము.

రామభక్తాగ్రేసరుడగు రామదాసు కథ యాంధ్రులందరకు పరిచితము. అతడు భద్రాచలము తహసీలుదారుగా నియమింపబడుట నవాబుకు ముట్టవలసిన పైక మాఱు లక్షలు గోపన శ్రీ భద్రాచల రాముని కైంకర్యమునకై వినియోగించుట, అది తెలిసి తానీషా గోపన్నను పండ్రెండేండ్లు చెఱలో నుంచుట, అతడు చాలకాలము వఱకు శ్రీరాముడు రక్షించునని నమ్మకముతో నుండి, తుద కాశ విడనాడి, విషము త్రాగబోవుచుండగా, శ్రీరామలక్ష్మణులు తానీషాకు పైక మిచ్చి రసీదును రామదాసున కంపుట, అతడు చెఱ విడివడుట, అతడు బొందితో కైలాసమున కేగుట మున్నగు కథలు నేటికిని వాడుకయందున్నవి.

రామదాసు కీర్తనలు, దాశరథీ శతకమే కాక, యింకను కొన్ని గ్రంథము లంతకు పూర్వము వ్రాసి, వానిని నరుల కంకితము చేసినట్లును దాని వలన నాతడు మోసము చెందినట్లును, దాశరథీ శతకమున నిట్లు చెప్పియుండెను.

చ॥ మసగొని రేగుబండ్లకును మౌక్తికముల్ వెలపోసినట్లు దు
ర్వ్యసనము జెంది కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యె నా
రసనకు బాతవృత్తి సుకరంబుగ జేకురునట్లు వాక్సుధా
రసములు చిల్క పద్మముఖరంగమునందు నటింపవయ్య సం
తసమును జెంది భద్రగిరి దాశరథీ ! కరుణాపయోనిధీ !

(దా. శ. 8)

గోపన నరు లంకిత మీయని కావ్యమేదియో తెలియదు. అవి తెలియకపోయినను, గోపన కాంధ్రశతక వాఙ్మయమున గల యున్నతస్థానము నిరూపించుటకు దాశరథీశతక మొక్కటి చాలును. భక్తిభావబంధురములగు పద్యములు కొన్ని పరిశీలింతము. దైవసంకీర్తన మెట్లు గావింపబడినదో ఈ పద్యమున వర్ణితము.

ఉ॥ శ్రీరమ సీత గాగ, నిజసేవక బృందము వీరవైష్ణవా
చారజనంబుగాగ, విరజానది గౌతమిగా వికుంఠము
న్నారయ భద్ర శైల శిఖరాగ్రముగాగ, వసించు చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ! కరుణాపయోనిధీ!

(20 పద్యము దా. శతకము)

ఇందు సీతాదేవి లక్ష్మిగను, వైష్ణవులు సేవకులుగను గౌతమియే విరజానదిగను, భద్రాచలము వైకుంఠముగను, రాముడే విష్ణుమూర్తిగను వర్ణింపబడిరి.

అజ్ఞానులకు జ్ఞానము కలిగించువాడు విష్ణువన్న విషయ మింకొక పద్యమున చెప్పబడినది.

ఉ॥ దారుణ పాతకాబ్ధికి సదా బడబాగ్ని, భవాకులార్తి వి
స్తార దవానలార్చికి సుధారస వృష్టి, దురంత దుర్మతా
చార భయంకరాటవికి జండకఠోరకుఠార ధార, నీ
తారకనామమెన్నుకొన దాశరథీ! కరుణాపయోనిధీ।
(14 పద్యము. దా. శతకము)

రామ నామమునకు మించినదేదియు లేదని ఇందు చెప్పబడినది. భయంకరమైన పాపమును కాల్చివేయువాడు, పాపమను అగ్నికి అమృత వర్షము వంటివాడట. దుష్టాచారములను అడవికి భయంకరమైన గొడ్డలి. అదియే శ్రీరాముని నామము. రాముడే అందరికన్న శ్రేష్టుడని వివరింపబడినది. తరువాత పద్యమున విష్ణుమూర్తియే పరదైవమనియు, అహల్యకు ద్రౌపదికి, ఈనామము ఆర్తిని హరించునని చెప్పెను. ఆ పద్యమిది.

చ॥ హరునకు నవ్విభీషణునకి ద్రిజకుం దిరుమంత్రరాజమై
కరికి నహల్యకున్ ద్రుపద కన్యకు నార్తిహరించు చుట్టమై
పరగిన యట్టి నీపతిత పావన నామము జిహ్వపై నిరం
తరము నటింప జేయు మిక దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ 15)

ఇదే శతకము 17 వ పద్యమున భక్తులను ఆశ్రయించుట చేత పాపములు హరించునని చెప్పబడినది. మిమ్ముల (సీతారాముల) ధ్యానించు భక్తుల పాదధూళిని సేవించగా యముడు దగ్గరకు రాడుగదా యని భావము.

ఆ పద్యమిది,

చ॥ "పరమదయానిధే పతిత పావన నామ హరే" యటంచు సు
స్థిర మతులై సదా భజనచేయు మహాత్ముల పాదధూళి నా

శిరమున దాల్తు పీరటకు జేరకుడంచు యమునికు కింకరో
త్కరముల కానబెట్టునట దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ 17)

తరువాత ఇందు వేరొక చోట భక్తియే ప్రధాన సిద్ధాంతము యను నంశము కూడ చెప్పబడెను. అందు నవ విధ భక్తులు కూడ సూచింపబడినవి.

చ॥ కరములు మీకు మ్రొక్కులిడ! గన్నులు మిమ్ము నెమూడ, జిహ్వమీ
స్మరణ దనర్చ, వీనులు భవత్కథలన్ వినుచుండ, నాసమీ
యంబు తన బెట్టు పూసరుల కాస గొనం, బరమార్థ సాధునో
త్కర మిది చేయవే కృపను, దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ 84)

చేతులతో మ్రొక్కుట, కన్నుల చూచుట, నాలుకతో స్మరించుట, చెవులతో వినుట వీటి వలన మోక్షము కలుగునని పై పద్య భావము తాత్త్వికదృష్టితో కవి చెప్పిన పద్యమొండు గలదు.

ఉ॥ ఎక్కడ తల్లిదండ్రి? సుతు లెక్కడి వారు? కళత్ర బాంధవం
బెక్కడ జీవుడెట్టితనువెత్తిన బుట్టుచు బోవుచున్నవా
డొక్కడె పాప పుణ్య ఫలమొందిన నొక్కడె కానరాడు వే
తొక్కడు వెంటనంటి భవమొల్లన యా కృప జూడవయ్య నీ
తక్కరి మాయలందిడక దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ 91)

తల్లి దండ్రులు కుమారులు ఎక్కడివారు? భార్యాబంధువు లెక్కడివారు? జీవుడు పుట్టి మరణించుచుండును గదా! ఇట్టి తాత్త్వికతత్వ మీ పద్యమున వివరింపబడెను. శ్రీ కాళహస్తీశ్వర శతకములో నొకచోట పూర్వ కథా సంకీర్తనమున్నట్లే ఇచటను ఈ దాశరథీ శతకములో నొక పద్యమున యిట్టిది కాన్పించును.

ఉ॥ "ఎంతటి పుణ్యమో శబరి యెంగిలి గొంటివి వింతగాదె? నీ
మంతన మెట్టిదో యడుత మైనిగర్వాగ్ర నింబాంకురంబులన్
సంతసమంద జేసితివి, సత్కుల జన్మమదేమి లెక్క వే
దాంతము గాదె నీ మహిమ దాశరథీ! కరుణాపయోనిధీ!
(దా.శ. 98)

శబరి ఎంగిలి తింటివి, ఉడుతను కాపాడితివి. అట్టి శ్రీ రామునకు భక్తులను కాపాడుట యొక లెక్కా యని భావము.

ఇక కాళహస్తీశ్వర శతకమును పరిశీలింపదగును. ఇది ఆంధ్ర వాఙ్మయమున భక్తి శతకములలో నగ్రగణ్యమైనది. శ్రీకాళహస్తీశ్వర శతకము భక్తి నైర్మల్యము చేతను, భావ గాంభీర్యము చేతను, మృదు మధుర ప్రయోగము చేతను శతక వాఙ్మయమున కలంకారమై విశిష్ట స్థానము సంపాదించుకున్నది. ఇది ధూర్జటి కృతమే యను నంశము ముందు ప్రకరణమున చర్చించి యుంటిని. ఆత్మవంచనము, జగద్వంచనము చేయక ఆత్మీయమైన భావమును ఉద్వేగమును ప్రదర్శించుటయే ఆత్మాశ్రయ ప్రధానమైన భావ కవిత్వమని నిర్ణయించుకొనినచో ఈ శతకము నట్టి గౌరవము పొందుటలో నద్వితీయ మనిపించుకొనును. సుఖ దుఃఖాది ద్వంద్వముల కలితులు కాలేక దుఃఖపారవశ్యమున పొంగి పొరలెడి హృదయ వేదనను నిర్భయముగా లోకమునకు వెల్లడించిన కవి ధీరుడు. ప్రవృత్తి నుండి నివృత్తికిని, భోగము నుండి త్యాగమునకును బుద్ధిని మరల్చుటకు ప్రయత్నించి అట్టి పరివర్తనమునకు ఆత్మశక్తి చాలక ఆశక్తి ననుగ్రహింపుమని అశ్రుసిక్తనయనములతో ఈశ్వరుని వేడికొనిన భావ సంపుటియే ఈ శతకము. రోసీ రోయని కామములకును, ఉపేక్షించి ఉపేక్షింపని కర్తృత్వమునకును, తిరస్కరింపని రాజద్వారప్రవేశనమునకును కలపించి వాని యందు చిక్కుకొని ఆ బంధముల నుండి విడివడ జాలక కవి మానసికముగా పొందిన అంతర్యుద్ధము కలికి చిక్కిన గజేంద్రుని తలపించును ఆత్మసంస్కారార్థమై దైవానుగ్రహము నర్థించెనే గాని లోక సంస్కారమునకు గాదు సహజమైన స్వేచ్ఛయు, పశ్చాత్తాప ప్రాబల్యము, నివృత్తి యందు గల యుపేక్షయు వీటన్నిటికి మించిన భావోద్వేగమును రాశీభూతమై ఏర్పడిన మధుర రసాయన మీశతకము. ధూర్జటి యాత్మీయాంశ మిందు పెక్కుచోట్ల గానబడుట ఇందు ముందు పద్యములు పరిశీలించిన తెలియగలదు. తమ తప్పును బహిరంగముగ నంగీకరించిన వారల్ప సంఖ్యాకులు. అందు ధూర్జటి యొకడు. ఇదియే అతని విశిష్టత. ఈ శతకము నను కరింపవలయునని ఎందరో శతకములు వ్రాసిరి గాని ఒక్కటియు దీనితో సరి రాలేదు.

ధూర్జటి రాజాస్థానములను సందర్శించిన వాడే కాని నరస్తుతి పరాఙ్ముఖుడు. ఈ విషయము శతకమున బాగుగా గోచరము. రాజ సభలలో ప్రవేశించి రాజుల మనస్తత్వమును సునిశితముగ పరిశీలించినవాడు ధూర్జటి. రాయలీతని తత్త్వమును గుర్తించి మన్నించి విశాల దృష్టిఁ ఔదార్యమును వ్యక్తీకరించెను. ధూర్జటి వేశ్యాలోలుడై సంసార సుఖముల ననుభవించి వార్ధక్యమున విరక్తుడై కాళహస్తీశ్వరుని సేవించుచు శేష జీవితమును గడిపెను.

బహు భార్యత్వము, వారాంగనా ప్రియత్వము రసికతా లక్షణములుగ భావింపబడిన యుగమున ధూర్జటి. జీవించి యుండెను. యౌవన దశలో వేశ్యా ప్రియులై సంసార సుఖముల ననుభవించి చివరికి యోగులైన ఆంధ్ర కవులలో ధూర్జటి యొకడు. ఇచట ఒక విషయము గమనింపవలసి యున్నది. పోతన్నయు రాజులను తిట్టినవాడే. ఇమ్మనుజేశ్వరాధములని మాత్రమే మృదువుగా పల్కెను. సంకుసాల నృసింహకవి అసలు రాజాస్థానమును ప్రవేశింపకనే రాజ దూషణ గావించెను. కాని ధూర్జటి యట్లు గాక కృష్ణరాయల యాస్థానము నలంకరించియు రాజమన్నన లందుకొనికూడ కృతినంకితమీయక రాజులను నిర్భయముగా నోటికి వచ్చినట్లు తిట్టెను. ఈతడు రాజాశ్రయము ఆశ్రయించినను, ఆశ్రయించనటుల నుండెను. రాజు లీతనిని చేరదీసినను ఈతడు రాజులలోని నిరంకుశత్వమును నిరాఘాటముగా ప్రతిఘటించిన సత్యవాది.

శా॥ రాజుల్మత్తులు, వారిసేవ నరకప్రాయంబు, వారిచ్చునం
భోజాక్షీ చతురంతర యానతురగీ భూషాదులాత్మవ్యథా
బీజంబుల్, తదపేక్షచాలు బరితృప్తిం బొందితిన్ జ్ఞానల
క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా (కా.శ. 18)

రాజులు మత్తులు, వారి సేవ నరకప్రాయము, వారిచ్చు దాసీజనము, పల్లకీలు, గుఱ్ఱములు, నగలు మొదలగునవి ఆత్మ వ్యథా బీజములని నిర్భయముగా చాటి చెప్పిన మొదటి తెలుగు కవి ధూర్జటి. ఇతడు శ్రుతు లభ్యసించెను. శాస్త్రగరిమలు శోధించెను. తత్త్వమును మది నూహించినాడు. శరీర మస్థిరమని బ్రహ్మయే సత్యమని గుర్తించెను. ఈ సంగతినే సభల యందు వృథా వచనములుగా చెప్పు వారిని చూపినాడు ధూర్జటి. ఈ విషయమునే ఈ విధముగా గ్రంథస్థము చేసినాడు.

మ॥ శ్రుతుల భ్యాసము చేసి శాస్త్రగరిమల్ శోధించి తత్త్వంబులన్
మతి నూహించి శరీరమస్థిరము బ్రహ్మం బెన్న సత్యంబుగాం
చితి మంచున్ సభలన్ వృధావచనముల్ చెప్పంగనేకాని, ని
ర్జిత చిత్తస్థిర సౌఖ్యముల్ దెలియరో శ్రీకాళహస్తీశ్వరా !

(కా. శ. 68 పద్యం)

నిండు యౌవ్వనమున రతి రాజద్వార సౌఖ్యములలో సంతసించినాడు. ఐహి రాజ ద్వార సౌఖ్యములలో శాంతిని బొందినాడు. పక్షోజముల రాపిడిలో రొమ్ము రాపాడెననియు, మన్మథ విహార క్లేశ విభ్రాంతిలో వయసు ఉడిగినదనియు నీ విధ ముగా చెప్పెను.

శా॥ "కాయల్గాచెవధూనఖాగ్రములచే గాయంబు పక్షోజముల్
రాయన్ రాపడె రొమ్ము మన్మథ విహారక్లేశ విభ్రాంతిచే
ప్రాయం బాయెను బట్టగట్టెదల చెప్పన్ రోత సంసారమే
జేయంజాల విరక్తు జేయగదవే శ్రీకాళహస్తీశ్వరా !

(కా. శ. 14 పద్యం)

ఇంకను జుట్టు రాలిపోయి శిరస్సు బట్టతల యైనది. మత్తెక్కిన రాజులు విద్వాం సుల నాదరించి రక్షించుట మానివై చిరట. ఇంకను,

జ్ఞాతుల్ ద్రోహులు వారు సేయుకపటేర్ష్యాది క్రియా దోషముల్
మాతంౘ్రాన సహింపరాదు ప్రతికర్మంబించుకే జేయగా
బోతే దోషముగాన మాని యతినై పో గోరినన్ సర్వదా
జ్ఞాతి క్రోధము మానదెట్లు నడతున్ శ్రీకాళహస్తీశ్వరా !

(కా. శ. 69 పద్యం)

అనుచున్నాడు. జ్ఞాతులు ద్రోహులయ్యిరి. వారు చేయు కపటపు క్రియలు, ఈర్ష్యలు మొదలగు క్రియా దోషములు ధూర్జటి సహించలేకపోయినాడు. సన్య సించవలెనని నిశ్చయించుకొనెను. అయినను అతడికి కోపము తీరుట లేదు. అందుచే తను నివసించు సీమలోని దేముడైన శ్రీకాళహస్తీశ్వరుని ముందు తన కోపమంతయు వెళ్ళగ్రక్కెను. తన యొక్క బాధలు, భయములు కోరికలు అన్నియు అణుమాత్రము దాచక చిత్తశుద్ధితో మహోద్వేగముతో శతక మూల మున శ్రీకాళహస్తీశ్వరునకు విన్నవించినాడు.

ఈ శతకమువలన ధూర్జటి జీవిత చరిత్రనంతయు ఊహించుట కవకాశము గలదు. మరి ఏ యితర శతకమునందు, ఏ కవి చెప్పనంత ఆత్మోద్రేకము ఇందుగలదు. సమకాలీన పరిస్థితులు కూడ యిందు వర్ణితములు. ఉదాహరణకు -

మ॥ "ఒకరింజంపి పదస్థులై బ్రతుకదా మొక్కొక్క రూహింతురే
లొకొ కామెన్నడు కావరో? తమకుబోవో సంపదల్పుత్ర మి
త్ర కళత్రాదులతోడ నిత్య సుఖమందం గందురో? యున్నవా
రికి లేదో మృతి యెన్నడుం గటకటా! శ్రీకాళహస్తీశ్వరా!"
(శ్రీ. శ. 67 పద్యం)

ఒకరిని జంపి, పదస్థులై బ్రతుకవలెనని రాజులు అనుకొనుచున్న కాలమట అది. కృప, ధర్మము, ఆభిజాత్యము మొదలగునవి పాలించు వారిలో మృగ్యమగుతున్న వని ధూర్జటి ఇట్లు చెప్పెను.

శా॥ "రాజన్నంతనె పోవునా కృపయు ధర్మం బాభిజాత్యంబు వి
ద్యాజాతక్షమ సత్యభావణము విద్వన్మిత్ర సంరక్షయున్
సౌజన్యంబు కృతం బెఱుంగుటయు విశ్వాసంబు గాకున్న దు
ర్బీజ శ్రేష్ఠులుగా గతంబు గలదే! శ్రీకాళహస్తీశ్వరా!"
(శ్రీ. శ. 89 పద్యం)

ఆ కాలమున తిట్టు కవిత్వము చెప్పకపోయిన యెడల ఎంతటి మహాకవియైనను భయపడక రాజులు నిర్లక్ష్యము చేయుచుండెడివారట. అవిషయమునే ధూర్జటి విధముగా వ్రాసెను.

మ॥ "క్షితినాథోత్తమ! సత్కవీశ్వరుడు వచ్చెన్ మిమ్ములంజూడగా
నతడే మేటి కవిత్వ వైభరిని? సద్యః కావ్య నిర్మాత త
త్ప్రతిభల్మంచివి తిట్టు పద్యములు చెప్పందాతడై నన్ మముం
గ్రితమే చూచెను బొమ్మటంచు రథముల్ శ్రీకాళహస్తీశ్వరా!"
(శ్రీ. శ. 118 పద్యం)

విద్వాంసునిగా పుట్టినందులకు బ్రహ్మను తిట్టువారు, తెలివి తేటలతో బాటు ఆకలి దప్పులను కూడ ఆ భగవంతు డెందుకు పెట్టెనో యని భగవంతుని దూషించు వారిని గూర్చి ధూర్జటిట్లు చెప్పెను.

శా॥ వేదం బిట్టగరాదుగాని భువిలో విద్వాంసులం జేయనే
లాధీదాతురి జేసి చేసిన గులామాపాటునే వోకకు
ద్వారాదుల్ కలిగింపనేల యవికృత్యంబైన దుర్మార్గులన్
ఛీ! ధాత్రీశుల జేయనేటి కకటా శ్రీ కాళహస్తీశ్వరా!
(కా.శ. 88 పద్యం)

సమకాలిక రాజుల దుర్మార్గములకు ధూర్జటి మనస్సు వికలమైనది.

శా॥ ఏలీలన్నుతియింపవచ్చును పయోత్ప్రేక్షా ధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేషభాషల కలభ్యంబైన నీరూపముం
జాలుంజాలు గవిత్వమున్నిలుచునే సత్యంబు వర్ణించుచో
ఛీ! లజ్జింపరు గాక మాదృశకవుల్ శ్రీకాళహస్తీశ్వరా!
(కా.శ. 61 పద్యం)

కృష్ణదేవరాయలు గతించిన క్రొత్త రోజులలో ఉపమానములతో, ఉత్ప్రేక్షలతో, ధ్వని వ్యంగ్య శబ్దాలంకార విశేషభాషలు మొదలైన వాటితో ధూర్జటి కడు తియ్యని కవిత్వము చెప్పెనని ఆరుద్రగారు వ్రాసిరి. కాళహస్తి ప్రాంతమునుండి ధూర్జటి, తెనాలి ప్రాంతమునుండి రామకృష్ణుడు రాజధాని నగరమునకు వచ్చి కవిత్వము చెప్పుట విని కృష్ణరాయలు వారు తమ ఆస్థానమున కాహ్వానించి నటుల ఆరుద్రగారి సమగ్ర ఆంధ్ర సాహిత్యమువలన తెలియుచున్నది. నిజమే కావచ్చును. అందువలననే ధూర్జటిలోని మాధురీ మహిమ రాయల వారిని ముగ్ధులను చేసెను. 1530 సంవత్సరమున రాయలవారి మరణానంతరము అచ్యుత దేవరాయలు, అళియ రామరాయలు కూడ కవిపోషకులే. వారు కూడ పండితులను. కవులను ఆదరించినవారే. అయినను ఏ సంఘటనవల్లనో ఇతమిద్ధముగా తెలియదుగాని ధూర్జటి హృదయము గాయపడినది. రాజులను ఆశ్రయించిన లిట్టి కవులన్న ఆతనికి ఏవగింపు కలిగినది. దానిని గూర్చి శతకమున ఈ విధముగా చెప్పినాడు.

మ॥ చదువుల్నేర్చిన పండితాధములు స్వేచ్ఛాభాషణ క్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవుల ద్రోవల్దప్పి వర్తింపగా

మదన క్రోధికి రాతులందుగని భీమప్రౌఢిచే దాకినం
చెదరుం జిత్తము చిత్తగింప గదవే శ్రీకాళహస్తీశ్వరా!

(శ్రీ.శ. 70 పద్యం)

అతనికంతా సంశయమే. శరీరఘటనమంతా విదారమే. ఈ వైరాగ్య తత్త్వమునంతను ఇట్లు గ్రంథస్థము చేసెను. జీవితమస్థిరమని దానికొరకు ప్రాకులాడుట కంటే శివనామము జపించుటలోనే శాశ్వతానందము మోక్షము లభించునని ధూర్జటి భావన.

శా॥ అంతా సంశయమే శరీరఘటనంబంతా విదారంబె లో
నంతా దుఃఖపరంపరార్థితమే నంతాభయభ్రాంతమే
యంతానాంత శరీర శోషణమె దుర్వ్యాపారమే దేహికిన్
జింతన్నిన్ను దలంచి పొందరు నరుల్ శ్రీకాళహస్తీశ్వరా!

(శ్రీ.శ. 61 పద్యం)

ధూర్జటి మంత్ర తంత్రములను పరిశీలించినవాడు. సాంఖ్యాదియోగ రహస్యములు గురువులు చెప్పినవి విన్నవాడు. అయినను శంకరీరక బోధించిన గురువులసంగతి మాత్రము తెలిసికొనెను.

మ॥ ఆయవారై చరి వింపవచ్చు ధనపాదాంభోజతీర్థంబులన్
దయతో గొమ్మనవచ్చు సేవకుని నర్థప్రాణ దేహాదుల
న్నియు నాసొమ్మనవచ్చుగాని నరులన్నిందించిని న్నాత్మని
ష్క్రియతం గానగరాదు పండితులకున్ శ్రీకాళహస్తీశ్వరా!

(శ్రీ.శ. 78 పద్యం)

చాల మంది వేషధారులు అన్యులను స్తోత్రము చేయునని వ్రతము పట్టినవారు రాజులను దరిచేరి ఇంద్రుడుగను, చంద్రుడుగను పొగడుట చూచి ధూర్జటికి వెగటు కలిగెను. ఆ విషయమే అతడీ విధముగా చెప్పుచున్నాడు.

శా॥ స్తోత్రం బన్యుల జేయనొల్లని వ్రతస్థుల్వోలె వేసంబుతో
బుత్రీపుత్ర కళత్ర రక్షణ కళాబుద్ధిన్ నృపాలాధమున్

బాత్రంబంతు భక్షింపబోదు రిడియున్నాప్యుంటెయివ్వారి చా
రిత్రం బెన్నడు మెచ్చనెంతమదిలో శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 68 పద్యం)

ధూర్జటి తనమదిలో మరొక నిశ్చయము చేసికొనెను. తనకవిత్వము శివునికే అంకితమీయ దలచినాడు. నిర్భయముగా ఆవిషయముచే శతకమున చాటిచెప్పెను.

శా॥ నీకుంగాని కవిత్వ మెవ్వరికి నేనీనంచు మీదెత్తితిన్
చేకొందిన్ బిరుదంబు కంకణము ముంజేగట్టితిం బట్టితిన్
లోకుల్ మెచ్చ వ్రతంబు నాతనువు కీలన్ నేర్పులింగావు ఛీ
ఛీ కాలంబుల రీతి దప్పెదుఖమీ శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 114 పద్యం)

ధూర్జటి రెండు కృతులను భగవదంకితము చేసినట్లు మనకు విదితమే. తిర్యక్కులలో కూడ శివభక్తి గలదని శ్రీకాళహస్తి మాహాత్మ్యము ద్వితీయాశ్వాసమున ధూర్జటి చెప్పినాడు. అటువంటి శివభక్తి యొక్క గొప్పతనము ప్రాశస్త్యము శతకమున కూడ ఈ విధముగా స్మరించినాడు.

శా॥ ఏ వేదంబు పఠించెలూత భుజగంబేశాస్త్రముల్చూచెదా
నే విద్యాభ్యసనం బొనర్చె గరిచెంచే మంత్రమూహించె బో
దా విర్భావని ధానముల్ చదువులయ్యా! కావు! మీపాదసం
సేవాసక్తియెకాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 18 పద్యం)

సాలె శివుని గొల్చుటకు ఏ వేదములు పఠించలేదు. చెంచుతిన్నడు ఏమియు చదువలేదు. అయినను శివభక్తికి కొదువరాలేదు. శివుని కొలిచి చివరకు సాయుజ్యము వడసిరి. కాళహస్తీశ్వరుని విశ్వాసముతో కొలుచుట కేవేదాధ్యయన మక్కరలేదని ఏ చదువులతో పనిలేదని భావము. ఇంక సంసారము పట్ల కలిగిన వైముఖ్యమును ఎట్టి దాపరికములేక కవి వెల్లడించెను. ఆలుబిడ్డలనుచు ఇన్ని బంధము లెందుకు ఆ భగవంతుడు కలిగించెనని వాపోయినాడు.

శా॥ ఆలంచు న్మెడ గట్టి దానికి నపత్యశ్రేణి గల్పించి త
ద్బాలవ్రాతము నిచ్చి పుచ్చుకొను సంబంధంబు గావించి యా

మాలర్క్యంబున బాంధవంబనెడి ప్రేమం కొందఱం ద్రిప్పగా
సీలన్నింయ వర్చినట్లొసగితో శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 86 పద్యం)

ధూర్జటి వైరాగ్యతత్వమున కీపద్యము చక్కని ఉదాహరణగా పేర్కొన వచ్చును. ఇంకను నీ పద్యమున పరమాత్ముడు మానవులకు సంసార చక్రమున భ్రమింప జేయు స్థితిని ధూర్జటి మనోహరముగా చిత్రించినాడు. ధూర్జటి వ్యక్తీకరించిన ఆవేదనము, సంశయము, భయము మున్నగు భావపరంపరలన్నియు అతని మానసిక స్థితిని తెలుపుచున్నవి. 'అంతాసంశయమే' యను పద్యము ఇంతకు పూర్వమే ఉదాహరించితిని.

సంసార జీవితమును గూర్చి ఆతనికి అసంతృప్తి గలిగినది ఆసక్తియు తగ్గినది. ఈ విషయమీ విధముగా తెల్పినాడు.

శా॥ సంతోషించితి జాలు జాలు రతిరాజ ద్వార సౌఖ్యంబులన్
శాంతింబొందితి జాలుజాలు బహురాజ ద్వార సౌఖ్యంబులన్
శాంతింబొందెద జూపు బ్రహ్మ పదరాజ ద్వార సౌఖ్యంబు ని
శ్చింతంబ్మాంతుడ నౌదు నీ కరుణచే శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 62 పద్యం)

మంత్ర తంత్రములు, తీర్థయాత్రలు ముక్తినొసగలేదనియు, అతడు నిశ్చయించుకొనెను. కాళహస్తీశ్వరుని పట్ల నిశ్చలమైన భక్తి కుదురుటకు ఇంద్రియ నిగ్రహమవసరమని గుర్తించి అట్టి శక్తిని ప్రసాదింపుమని ధూర్జటి ఎన్నియో విధముల కాళహస్తీశ్వరు నర్థించెను. పరమేశ్వరుని మెప్పించిన భక్తులు కవులు సూత్రమే తనకు బంధువులని విశ్వసించెను. పృష్ఠాగత బాంధము తగదని లోకమునకుపదేశించెను. ఈ విషయమునే శతకము నందలి పద్యమున పేర్కొనినాడు.

శా॥ నీపై గావ్యము చెప్పుచున్న యతడన్ని పద్యముల్ వ్రాసియి
మ్మా పాఠం బొసరింతునన్నయతడున్, మంజు ప్రబంధంబుని
ష్ఠా పూర్తిం బఠియించుచున్న యతడిన్ సద్బాంధవుల్ గాక చీ
చీ పృష్ఠగత బాంధవంబు నిజమా! శ్రీ కాళహస్తీశ్వరా!

(కా. శ. 86 పద్యం)

శ్రీకాళహస్తి మాహాత్మ్యమున 'తిన్ననికథ' (తృతీయాశ్వాసము) ఒక విధముగా ధూర్జటి వ్యక్తిత్వమునకు దర్పణమువంటిది. నిశ్చలమైన భక్తికి తిన్నడు ప్రతీక. ధూర్జటియునంతే.

హృదయమున వైరాగ్యభావము స్థిరముగ నిలిచిన తరువాత ధూర్జటి నిశ్చలమైన ధ్యానము చేతను, కవితాశక్తి చేతను ముక్తిని సాధించ వచ్చునని విశ్వసించెను ఈశ్వరారాధనకు తగిన సాధన సంపత్తి తన కవితకు కలదని భావించెను. ఉపమ, ఉత్ప్రేక్ష, ధ్వని, వ్యంగ్యముల కతీతమైన రూపమునెట్లు వర్ణింతునని అజ్ఞతను దాటి "కవితా నిర్మాణశక్తిన్నినుం బ్రీతుం జేయగలే"నని తన అశక్తతను ఇట్లుచాటినారు.

శా॥ నీతో యుద్ధము జేయనోప, గవితా నిర్మాణ శక్తిన్నినుం
బ్రీతుంజేయగలేను, నీ కొఱకు దంత్రిం జంపగా జాలనా
చేత న్రోకట నిన్ను మొత్త వెఱతుం జీకాకునాభక్తి యే
రీతిన్నాకిక నిన్ను జూడగలుగున్ శ్రీకాళహస్తీశ్వరా।

(కా. శ. 8 పద్యం)

తిన్ననివలె ఈతడును పరమేశ్వరుని మందలించెను. భక్తులు నానా విధములుగ సేవించుచుండ వారి కోర్కెలు తీర్చక లోభమేటికి? అని "పరమార్థం బిచ్చి పొమ్మన్న నీ శ్రీ భాండరమలో గొరంతపడునా" యని సూటిగా ప్రశ్నించెను.

శా॥ నీభక్తుల్పదివేల భంగుల నినున్సేవింపుచున్ వేడగా
లోభం బేటికి వారి కోర్కులు కృపాళుత్వంబునం దీర్పరా
దా భవ్యంబు దలంచిచూడు పరమార్థం బిచ్చి పొమ్మన్ననీ
శ్రీభాండారములో గొఱంత పడునా శ్రీకాళహస్తీశ్వరా।

(శా. శ. 96 పద్యం)

తన్ననాదరించి వెడలగొట్టినచో మారుపట్టుకొని ప్రేలాడుదునని హెచ్చరించి తనకు గల వజ్రసంకల్పమును వ్యక్తీకరించెను.

మ॥ వెదుగుల్ కొండలు కూడి చేయగలుల్ చీకట్లు దూఱంగరా
ల్పడితింగాని చరింపరాని నిను నొల్లంజాలు బొమ్మంచని

త్వదలంఘ్రోచిన జూరుపట్టుకొని నే వ్రేలాడుదుం గోర్కిగో
రెడియర్థంబులు నాకు వేగఁదగవో శ్రీకాళహస్తీశ్వరా !

(కా. శ. 101 పద్యం)

ఈశతకమునందలి ప్రతిపద్యము ధూర్జటి లోకానుభవమును, కవి అనుభూతిని దర్శింపజేయుచున్నది. ఈ సందర్భములందు నివేదించిన అంశముల వలన ధూర్జటి వ్యక్తిత్వము సన్నులకు గట్టినట్లున్నవి. రాజులను ధూర్జటి దూషించిన విధమంతయు పరిశీలించితిమి కాని శతకమున రాజ తిరస్కారము నంతగా నొనరించిన ధూర్జటియందే యొకచోట "ఉత్తముడైన రాజును శ్రీకాళహస్తీశ్వరునితో సమానముగ జూతు"నని వ్రాక్కుచ్చుటలో నాతని హృదయ విస్తృతి స్వభావ మాధురి సముజ్జ్వలముగా భాసించుచున్నవి ఇదే శతకమున మఱొకచో "ఒక పుణ్యాత్ముండు సిన్నాత్మగొల్చి దినంబుల్ మొఱపెట్టగా గృపఁదలంపవని యిష్ట దైవమునకు తన స్వభావమును గూర్చి విన్నవించుటలో నీకవికి గల యాత్మ విశ్వాసము ప్రతీయమాన మగుచున్నది. స్వతంత్రతా పూర్వకమైన నిర్భీతి, పశ్చాత్తాపము, వైరాగ్యాభిముఖ్యము, కాళహస్తీశ్వరచరణ కమలముల యందలి ప్రపత్తి, పరమశాంతత - ఈగుణగణములు సమపాళముగా సమ్మేళనము నొందిన సదమల మధురస్వభావము ధూర్జటిది. కావుననే తత్కవిత తత్స్వభావ సారభూత మగునమృత రసాయనముగా నలరినది. తిన్నని చేతను, శివగోచరునిచేతను, అద్వైతసత్కారుని చేతను, జ్ఞానక్షేత్రసిలయుడగు పరమేశ్వరునర్థింపజేసిన 'తాదాత్మ్యమే' పరమధర్మముగా చరమలక్ష్యముగా నిడుకొని సాహిత్య సృష్టిగావించిన 'సాహిత్య శ్రీవరుడైన' ధూర్జటి మహాకవి యొక్క సమగ్ర స్వభావమాధురీ మహిమకు సదమల నిదర్శనమీక్రింది పద్యము.

మ॥ దినముంతిత్తములో సువర్ణముఖరీతీర ప్రదేశాశ్రమా
నన మధ్యోపలవేదికాగ్రమున నానందంబునం బంకజా
సన నిష్ఠస్నినను జూడగన్ననదివో సౌఖ్యంబు ; లక్ష్మీవిలా
సినీమాయా నటనల్ సుఖంబులగునే శ్రీకాళహస్తీశ్వరా !

(కా. శ. 85 పద్యం)

పై పద్యమున వివరింపబడిన సువర్ణముఖరీలహరీ శీతలశిలాంతరమే ధూర్జటి ప్రతిదినము సదాశివుని ధ్యానించు పవిత్ర స్థలము. ఆపవిత్రాంతర్యాగ స్థలమున బిల్వ

విటప శ్రేణీసన్నిభ భేదవిలీనాంగమగు దివ్యలింగమును హృదయగేహమున నావాహనమొనర్చుకొని తపముగావించుచు, నంతర్ముఖుడై అద్వితీయ శాంభవ తేజమున వెలుంగుచున్న ధూర్జటినిగాంచి, యాపరమశైవోత్తంసుని స్వభావ మాధురిచే ప్రభావితులై విచిత్రానుభూతిని పొందగలుగువారు ధన్యులన వచ్చును.

పదునాఱవ శతాబ్దియం దాంధ్రసారస్వతా రామమున రెండు పరమేశ్వర మందిరములు వెలసినవి. అందొకటి శ్రీకృష్ణరాయకవి రాజశిల్పి వినిర్మించిన విష్ణుచిత్తీయ వేంకటేశ్వరాలయము రెండవది ధూర్జటి కవి వెలయించిన శ్రీకాళహస్తి మాహాత్మ్య శివాలయము. ఇందు మొదటిది అద్భుతమగు ద్రావిడ వాస్తుకళా విలాసనముచే ఆకర్షణీయముకాగా, రెండవది అత్యపూర్వమైన ఆర్యద్రావిడ వాస్తు సంప్రదాయ సమ్యక్సమ్మేళనముచే ఆహ్లాదకారియైనది. ద్వితీయ మందిరమైన యీ పరమ శివభవనమందుగల ధూర్జటి కవితాత్మయనడు గర్భమంటపమున, వశిష్ఠ ప్రార్థితము, అగస్త్యాభిషిక్తము, బ్రహ్మార్చితము, శ్రీవిద్యా నిలయము, అర్యావామాంగమునైన దివ్యలింగము అద్వితీయముగా సుప్రతిష్ఠితమైనది. అట్టి యమృత లింగము ప్రత్యగ్జ్యోతిగా ప్రకాశించుచు, నాటగోలె నిత్యసాహిత్య దివ్యార్చనతో తేజరిల్లుచున్నది. ఆ యర్చనాక్రమమే శతకమునందీ విధముగా జెప్పబడినది.

మ. జలకంబుల్, రసముల్, ప్రసూనములు వాచాబంధముల్, వాద్యముల్
కలశబ్దధ్వను, లంచితాంబరమలంకారంబు, దీప్తుల్ మెఱుం
గులు, నైవేద్యము మాధురీ మహిమగా గొల్తున్ నిన్నున్ భక్తి రం
జిల దివ్యార్చన గూర్చి, నేర్చిన క్రియన్ శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. 60 పద్యం)

దీర శృంగారాది ప్రధానాంగ రసములు, అంగియైన శాంతరసము అను నదియే అభిషేకజలములు, అర్ధోరాశి కన్యావిభుడు, జ్ఞాన లక్ష్మీ జాగ్రత్పరిణామము, జముదెసవెండికొండ, శీతామృత స్వచ్ఛవాఃపూరము, సువర్ణపర్వత ధనుశ్శుద్ధాంత కాంతామణి వంటి వాచాబంధములెల్ల పూజార్థముపకరించు కుసుమావళి, శ్రుతి సుభగములైన శబ్దముల ధ్వనులే (వ్యంజనాశక్తి విశేషములే) మంగళవాద్య నిస్వనములు, ముచ్చటైన స్వభావోక్త్యుపమా రూపకోత్ప్రేక్షాద్యర్థా

లంకారములు, ముక్తసరిగానున్న యమకాను ప్రాసాది [1]శబ్దాలంకారములును, కాంతులీను కమనీయ వస్త్రయుగ్మము, ఓజోగుణ భూయిష్టములైన రసదీప్తులే యీ యాలయమున వెలుగొందు అఖండ దీపారాధనలు, ఈ కవి పరమేష్ఠి సృజించిన వాఙ్మయమందంతట నిండాయున్న మాధురి మహిమయే మహనీయ నైవేద్యము. ఇట్లు ఈ యర్చన నిరాడంబరముగా, నిర్మలముగా నిరంతరము కొనసాగుచున్నది. ఆంధ్రభోజ నిర్మితమైన ఆముక్తమాల్యదాలయములో నిటువంటి యక్షరార్చన యతిశయించియున్నను, ఈ రెండు మందిరములకు ఒక విషయమున నించుక భేదము కలదు. రాజనీతిజ్ఞుడగు రాయలందు తన కీర్తిమూర్తిని శిరముగా నెలకొల్పుకొనగా, సమస్తైహికములందు విరక్తుడైన ధూర్జటి తాను తటస్థుడుగానుండి, లూతకల్పించిన తంతుసద్మములను, యాదవరాజు కట్టించిన దివ్యాలయపంక్తిని, కన్నప్ప మున్నగు భక్తుల పూర్వజన్మ కథలనెడ కనక కలశములతో నొప్పారెడు తన మాహాత్మ్య కావ్యమందిరమున శాశ్వతముగా ప్రతిష్ఠించి ధన్యత గాంచెను. మహాకవి నక్కీరుడు ద్రావిడభాషలో కాళహస్తీశ్వరునిపై జెప్పిన "కైలయిపాదికాళత్తిప్పాది - అంతాది" అను స్తుతిశతకమే ధూర్జటి కాళహస్తీశ్వర శతకరచనకు ప్రధాన ప్రేరకమయ్యెనని పరిశోధకుల తలంపు. (చూ. కె. జె. కృష్ణమూర్తి. కాదంబిని వ్యాసావళి)

వైరాగ్యధోరణిలో ధూర్జటి చెప్పిన పద్యములింకనూ ఎన్నో ఈ శతకమున గలవు. సంసారవిరక్తుడై మోక్షమును ప్రసాదించమని శివునీవిధముగా వేడుచున్నాడు.

శా. "ఎన్నేళ్ళుండుదు నేమిగందు సిరకనేనెవ్వారి రక్షించెదన్
నిన్నే నిష్ఠభజించెద నిరుపమోన్నిద్రప్రమోదంబు
నా, కెన్నండబ్బెడు నెంతకాలమిక నే నిట్లున్న నేమయ్యెడిన్
జిన్నం బుచ్చక నన్ను నేలుకొనవే శ్రీకాళహస్తీశ్వరా !
(కా. శ. 88 పద్యం)

1. కె. జె. కృష్ణమూర్తిగారు, కాదంబిని (ధూర్జటి మాధురీమహిమ)

చనిపోవుకాల మాసన్నమగుచున్నను సరే ఏ వైద్యుడు రక్షించునా, ఏ మందు పనిచేయునాయని జనులు ప్రాకులాడుదురేగాని నిను (శివుని) కొంచమైనను ఆలో చింపరుగదాయని ఈ విధముగా చెప్పినాడు.

శా. దావంగాలము చేరువౌదెటింగియుం జాలింపంగా లేక త
న్నే వైద్యుండు చికిత్స త్రోవగలడో యేమందు రక్షించునో,
యేవేల్పుల్ కృపజూతురో యనుచు నిన్నింతైన జింతింపడా
జీవ శ్రాద్ధము జేసికొన్ని యటియున్ శ్రీకాళహస్తీశ్వరా !
(కా. శ. 84 పద్యం)

తొలిపద్యమగు 'శ్రీ విద్యుత్కలితాజవంజవహ' యనుశార్దూలమున తాను ప్రస్తావింపబోవు నంశములనెల్ల సూచించినాడు. ఈ వైశిష్ట్యమును గుర్తించిన వారు విద్వాన్ వెంకటేశ్వర్లుగారు. వారు తాము పరిష్కరించి ప్రకటించిన కాళ హస్తీశ్వర శతకమునకు పీఠికవ్రాయుచు నీ రచనా చమత్కారము నిట్లు వివరిం చెను. అత్యున్నత స్థానమునందిన ప్రబంధ యుగమునకు జెందినవాడగుట, ధూర్జటి తన శతకమున నెత్తుకొను ప్రధాన విషయములను శతకారంభ పద్యము ననే సూచించుట యొక గొప్ప విశేషము.

"శ్రీ విద్యుత్కల అజవంజవము నికృష్టము. పాపాంబుధారా ప్రభావము నంతయు మనోజ్ఞనము. దీర్ఘత్వము కోల్పోవుటవలన గలుగు దుస్థితి, భగవ త్కరుణాశరత్నమయ ప్రయోజనము, సేవామాహాత్మ్యము. ఇవి ప్రధాన విషయ ములు. దీనినుండి "తామరతంపర"గా బుట్టినవే మిగిలిన పద్యములు. ఈ రీతిగా గావ్యవస్తు స్వరూపము నే శతకకర్తయు జూపియుండలేదు "

విద్వాన్ బులుసు వెంకటేశ్వర్లుగారు కా. శ. పీఠిక 4. 5 పుట)

[1]ధూర్జటి శతకమున కొన్ని కథలను సూచనప్రాయముగా పేర్కొనెను. అట్టి పద్యములు ఒకటి రెండు పరిశీలింతము.

---

1. శతక సంపుటము 1 భాగము.

మ. నిను నావాకిలి గావుమంటినో? మరుస్నీలాలక బ్రాంతి గుం
 టెన పొమ్మంటినో? యెంగిలిచ్చి తిను తిండేగాని కాదంటినో
 నిను నెమ్మిందగ విశ్వసించు సుజనానీకంబు రక్షింప జే
 సి నా విన్నపమేల గైకొనవయ్యా శ్రీకాళహస్తీశ్వరా!
 (కా. శ. 16 పద్యం)

ఇట వాకిలి గాచుట - బాణాసురుని కథ
కుంటెనదపుట - సుందరమూర్తికథ
ఎంగిలిచ్చి తినమనుట - తిన్ననికథ

ఇట్లే వేరొకపద్యము

శా. బాలన్ ఉవ్వగ జేతులాడవు కుమారా! రమ్ము రమ్మంచు నే
 జాలన్ జంపగ నేత్రము ల్దివియగా శక్తుండనే గాను నా
 శీలంబేమని చెప్పనున్నదికనీ చిత్తంబు నా భాగ్యమో,
 శ్రీలక్ష్మీపతి సేవితాంఘ్రి యుగళా శ్రీకాళహస్తీశ్వరా!
 (కా. శ. 17 పద్యం)

బాలన్ ఉవ్వట - శాక్యతొండనికథ సూచితము.
కుమారుని జంపుట - సిరియాళునికథ
నేత్రముల్ దివియుట - కన్నప్పకథ

పై రెండు పద్యములలో నక్కీరునికథ శ్రీకాళహస్తి మాహాత్మ్యమున చతుర్థ ఆశ్వాసమున గలదు. ఇక రెండుసార్లు పేర్కొనబడిన కన్నప్పకథ శ్రీకాళహస్తి మాహాత్మ్యమున తృతీయాశ్వాసమున గలదు. ఈ కథయే ముఖ్యమైన కథ. కాబట్టియే ధూర్జటి పై రెండు పద్యములలోనే గాక ప్రత్యేకముగా నీ కథను గూర్చి యొక పద్యము వ్రాసియుండెను.

శా. "నీకున్మాంసము వాంఛయేని కఱవా నీచేత లేదుండగా
 జోకైనట్టి కుఠారముండ ననల జ్యోతుండ నీరుండగా

బాణంబొప్ప ఘటించి చేరి పునుకన్ భక్షింపకా బోయచే
తేకొంటెంగిలి మాంసమిట్లు దగునా శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. 20 పద్యం)

ఇందు కొన్ని కథలను పాలకురికి సోమనాథుని బసవపురాణమునుంచి ధూర్జటి గ్రహించెను. నక్కీరుని కథ మాత్రము తమిళ వాఙ్మయమునుండి స్వీకరించెను.

ఇందు ధూర్జటి రూపమును మనము చూడవచ్చును. శివభక్తులిట్లుందురని చెప్పినాడు. కాబట్టి ధూర్జటికూడా అట్లే యుండెనని మనమూహింపవచ్చును. ఇంకను ధూర్జటి శైవభక్తుల విశిష్టత నీవిధముగా చెప్పినాడు.

మ. భసితో ద్ధూళన ధూసరాంగులు జటాభారోత్తమాంగుల్ తపో
వ్యసనుల్ సాధితపంచవర్ణరసనుల్ వైరాగ్యవంతుల్ నితాం
త సుఖస్వాంతులు సత్యభాషణ సముద్యద్రత్న రుద్రాక్ష రా
జిసమేతుల్ తుదనెవ్వరైన గొలుతున్ శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. 102 పద్యం)

శివభక్తులకు కొలుచుటకు కూడ తాను సిద్ధమే యను భావము కూడ వ్యక్తము చేసెను. ఇంకను పెక్కు పద్యములలో నిందాస్తుతి, సప్త సంతానములు, యోగ మార్గము, మానవ మూఢత్వము, శైవ క్షేత్ర మహిమ యిత్యాది విషయము లెన్నో ధూర్జటి పేర్కొనెను.

ధూర్జటి మహాకవి ఆత్మవంచనలేని యంతశ్శుద్ధితో కాళహస్తీశ్వరుని వదనమున చూపులుంచి శతకమును, ఆడంబరము లేని భక్తి భావనతో ఆ పరమేశ్వరుని చరణ కమలములపై దృష్టి నిలిపి మాహాత్మ్యమును రచించెను. ఇట్లు తీవ్రమగు ఆత్మోద్ధరణా కాంక్షతో నిర్మలాంతః కరణసీమలనుండి జాల్వారి యుండుటచే ఆ భక్త కవి మధుర కవితా స్రవంతి విశ్వజనీనమైన విమల సందేశము నొసంగ జాలినదై యొప్పుచున్నది.

అగస్త్యుడు సువర్ణముఖీ తీరముల యందటనట శివలింగ ప్రతిష్ఠలు సేయుచువచ్చి కాళహస్తీశ్వరుని వినుతింప దొరకొనిన సన్నివేశమున "దివ్యమును లెల్లనిది యుపదేశమనగ" నా మహర్షి యొక దండక రూపమున దేవదేవుని స్తోత్రము గావించెను. "తదితర మార్గము లన్నింటికన్న అద్వైత భావనాపూరిత పరమేశ్వర భక్తియే అఖిల జీవుల కాదరణీయమైన తరుణోపాయము. పరమ సుఖదము" - అనునదే ఆ స్తోత్రమందలి సారాంశము.

దివ్యమునులచే కొనియాడబడిన యీ యుపదేశమే సమస్త లోకమునకును సందేశ మని ధూర్జటి యభిప్రాయమైనట్లూహింపవచ్చును. ఈ మహాకవి యీ విషయమునే శతకమునందలి యీ క్రింది పద్యమున చాటినాడు.

మ॥ "పవి పుష్పంబగు, నగ్ని మంచగు, నకూపారంబు భూమీస్థలం
బవు, శత్రుండతి మిత్రుడౌ, విషము దివ్యాహారమౌనెన్నగా,
నవనీ మండలి లోపలన్ శివశివేత్యా, భాషణోల్లాసికిన్,
శివ ! నీ నామము సర్వవశ్య కరమౌ శ్రీకాళహస్తీశ్వరా !

(కా.శ. 45 పద్యం)

ఈ శతకము గూర్చి చెప్పవలెనన్న, ధూర్జటి ఒకవేళ కాళహస్తి మాహాత్మ్య ప్రబంధము రచింపక పోయినప్పటికిని సారస్వత ప్రపంచమున కేవలము ఈ శతకము వలననే ఆయన కీర్తి అజరామరమై యుండెడిది. తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయమునందు శ్రీకాళహస్తీశ్వర శతకపు తాళపత్ర ప్రతులు ఎనిమిది గలవు. అవి అన్నియు చదివి బాగుగా పరిశీలింపగా అధిక పద్యములు కొన్ని అందుకానవచ్చినవి. తాళపత్ర ప్రతులలో అన్నియు సమగ్రములు గావు. ఒక్కొక్క తాళపత్ర ప్రతియందు ఎన్ని పద్యము లున్నవో అందు అధిక (క్రొత్త) పద్యము లేవో జాబితా నిచట నొసంగుచున్నాను.

1524 - ఈ నెంబరుగల తాళపత్రము నందు 14 పద్యములు మాత్రమే గలవు. ఇందు శరభాంక, సర్వేశ్వర శతకములు కూడ గలవు. మొదటి పద్యము "శ్రీవిద్యుత్కలితా" యనికాక "అంతా మిధ్య" అను పద్యముతో ప్రారంభమైనది.

1525 - ఈ తాళపత్రము నందు 82 పద్యములు గలవు.

1526 - ఈ తాళపత్రమున 28 పద్యములు మాత్రమే గలవు.

1529 - ఇందు 87 పద్యము లున్నవి.

1530 - ఇది 90 పద్యములతో కూడిన తాళపత్రము

1531 - ఇందు 117 పద్యములు గలవు.

1523 - ఇందు 129 పద్యములు గలవు.

1527 - 104 పద్యములు గలవు.

ఇక అధిక పద్యముల నిట పేర్కొందును.

1. ఊయూరన్ బవిసీని వాళ్ళు కవులై
యొక్కొక్క కొంటయ్యకున్
గొరొ పీరునుబాణ బాణ లనుచున్
గీతాలు జోడింపుగా (పగా)
సార సార మెఱుంగ లేక మిగులన్
జొక్కై చెరన్ గబ్బముల్
జేరన్ జోటికనేది సత్కవులకున్ శ్రీకాళహస్తీశ్వరా!

2. పుట్టున్ గిట్టుటకై దుఃఖంగుటకునై
పొంగుల్, వియోగంబుకై
మట్టంకూడును, దుఃఖ మొందుకొఱకై
మున్ సౌఖ్య మూహించుచో
నట్టట్టా ననిఖేద మోదములు పా
యన్ జేయు జూతంగదా
చెట్టందోగుమ లోకమందు నలరున్ శ్రీకాళహస్తీశ్వరా!

3. క్షయమై చిత్తము పోక యర్థ మొకటిన్
సాధింపగా గూడదిం

ప్రియ సౌఖ్యప్రదవస్తువుల్ దొరక, వో
వాదించగా గల్గు స
త్క్రియల్లానివరెండు నీతెరగు లే
రీతిన్ నినున్ సేవచే
శియు గోరంగల వస్తువైయ్యది తుదిన్ శ్రీకాళహస్తీశ్వరా !

4. వేదంబుల్గనలే నిన్ను నుతిగా
వింపంగనే నెవ్వదన్
వ్యాకృతిగద్య పద్యముల వ
ర్ణింపంగనే యానినన్
వాదోద్రై భవదీయ పుణ్య చరితల్
వ్రాయన్ నియోగించినన్
వేదోద్రై భవరక్ష చేయగదవే శ్రీకాళహస్తీశ్వరా !

5. అతి దుర్గంధము మూత్ర పూరితమునే
హ్యంబున్ మహారోమసం
వృత మౌబెత్తెడుయోని జూచి నరులెం
తో మోహా విభ్రాంతులై
మతినూహించి సురేంద్ర భోగ మనుచున్
మానంగ లేరెంతయున్
క్షితిలో మూర్ఖులదేటి చోద్యమహాహా శ్రీకాళహస్తీశ్వరా !

6. కోరన్ మోక్షము, కాళరాత్రి గెలువో
గోరన్, జమున్ దోలగా
గోరన్ బిద్మజు కల్పముల్ బ్రదుకగా
గోరన్ మహాల్పంబు నీ
కారుణ్యంబునకున్ మదీయ మగు సం
కల్పంబు దీర్పంగదే
చే రన్వస్తి పరోపకారమగునో శ్రీకాళహస్తీశ్వరా !

7. తగవా మిమ్ము భజించు వారలు రమా
దర్పాంధులన్వేడయే
నుగుపై నెక్కియు దిడ్డి మారుదురె ధ
న్యుల్ దేహ రక్షార్థమై
పొగడం జాలక బొగ్గులన్ బొదవు నే
ర్పుల్లేవ పెద్దమ్మ మె
చ్చి గులామైవర సేవ చేసిన తుదిన్ శ్రీకాళహస్తీశ్వరా!

8. నాకే యర్థమునేల యిచ్చెదవు మా
నన్ లేవుగా యీ వృథా
శోకం బెంతయు దీరునంతట నతి
క్షుద్రక్షమానాథ వా
ధా కోటిం బడనోప వారి కతనన్
ధాన్యంబులున్ గ్రామముల్
చీ కష్టమ్ములు సాధు యూవములకున్ శ్రీకాళహస్తీశ్వరా!

9. ఆధి వ్యాధులు దీపనాదులు కళ
త్రాపత్యముల్ బాలవా
బాధన్ బెట్టగ నన్నుదమ్ములను పా
ప స్వాంతులన్ వేద గా
నే ధర్మంబని కల్లజేసితివి నీ
వేరీతి పీడింపగా
నే ధీరన్ నినుగొల్చినారమనుచున్ శ్రీకాళహస్తీశ్వరా!

10. శ్రుతు లభ్యాసము చేయనీ స్మృతుల సం
శోధింపనీ, శాస్త్ర సం
గ (త) తి గండూషణసేయ నీ నిఖిలమం
త్ర జ్ఞాని కానీ నితాం

త తపోనిష్ఠ జరింప నీకలు గద
ద్వైత ప్రమోదంబు వ
ర్తిత సంసారియె కాని వానికి తుదిన్ శ్రీకాళహస్తీశ్వరా !

11. మది నిన్నే మనకుండ వారలకు కామ క్రోధముల్
ముక్తి సంపద లీనో పుట తెల్లమయ్యె నవీన భావైక
విజ్ఞాన సమ్మదులై నందియు గోటదున్ నదుచు
సన్మార్గంబు సద్భక్త రాజీవివా ర్యాతులు చెప్పగా వినితుదిన్
శ్రీకాళహస్తీశ్వరా!

12 చించున్ పంచ శర ప్రజంబు మది వాధించున్
భవత్ప్రేమ వర్షించున్ సంచిత పాప సంచయము
నిర్జించున్ మహా మోహా మర్దించున్ దుఃఖములన్
భవచ్చర నీరేజము లర్పించువానిన్ చున్ చిత్త శరండమెవ్వడతడో
శ్రీకాళహస్తీశ్వరా!

ఇంకను కొన్ని పద్యములు కలవు కాని అవి మధ్య మధ్య అక్షరములు సరిగా కానరాక పోయినవి.

అడుగన్ పద్మజు కల్పముల్ బ్రతుక పద్మాధీశ్వర
త్వంబున్ నిన్నరగన్ వాసవై భవంబున్నదు గలోకై
కాది పత్యంబునన్ నెడుగన్ నీ చరణంబు జాతయు
గళ వ్యాకంబున్ నాకిమ్ము కోర్కెన్ దిరగ ద్రావిసుఖింతు దాలు నిదియే
శ్రీకాళహస్తీశ్వరా!

శతక సంపుటము ప్రథమ భాగమున శ్రీ నిడదవోలు వేంకటావు గారు పరిష్కరించిన దాని యందు ఒక్క పద్యము అధికముగా కన్పించుచున్నది. ఆ పద్యము తాళపత్రములందుగాని, ఇతర శతక ప్రతులందు గాని లేదు. ఆ పద్యమిది.

మ॥ అల యేకార్ణవ వేళ నీవు వటు పత్రాకారమై యుండగా
చెలువం బొప్పగ మాధవుండు గలిగెన్ జీరంగ జోటంచుదా

నెంమం దామర తంపరై బ్రతికి నాడింతాకుపై నుండియే
సిలుగుల్ పొందక నీశతంబు నగదా శ్రీకాళహస్తీశ్వరా!

ఈ పద్యము కాక ఇంకను రెండు పద్యములు ఇతర శతకములకంటే శతక సంపుటమున, శతకరత్నములను పుస్తకమున కంపు. అవి తాళపత్రములందు మాత్రము గంపు.

1. "ఊరూరన్ జవిసీకాండ్లు"

2. దొప్పెంబెంగిలి దెచ్చి యిచ్చినను గండూ షాంబుధారావళిన్
దొప్పం దోగిన చెప్పు గాంతలపై ద్రొక్కంగ వచ్చై నగ
న్నప్పం బాత్రుని జేసి తిం తదికి సన్మానంబు దీపింపగా
చెప్పు న్నేరము నీ విహార మహిమల్ శ్రీకాళహస్తీశ్వరా!

ఆరవ ప్రకరణము

శ్రీకాళహస్తి మాహాత్మ్యము- మాతృకావిచారము

శ్రీకాళహస్తి మాహాత్మ్యమునకు మూల మేదేని ప్రత్యేకముగా నున్నట్లు ధూర్జటి తన గ్రంథ మందెచ్చటను పేర్కొన లేదు. పైగా అట్టి ఆధారములు కూడ ఏమియు కానవచ్చుట లేదు. సాధారణముగా స్థల పురాణము లన్నింటికిని స్కాంద పురాణమాధారమనుట (కాశీ ఖండము, భీమ ఖండము. మొదలగునవి) మనకు తెలిసిన విషయము. ఈ కాళహస్తి మాహాత్మ్య విషయమున స్కాంద మాధారమను విషయము కూడ స్పష్టముగా నెచటను పేర్కొనబడలేదు. ఒక విషయము తెలిసినదేమనగా ఈ మాహాత్మ్యము నందలి కథలన్నియు శివభక్తి ప్రతిపాదములు, మరియు ఒకే మూలము నుండి గ్రహించినవి కావు. వీని కన్నిటికి ఏదో ఒక మూల మాధారముండి యుండవచ్చుననియు, దానిని ధూర్జటి కొలది మార్పులతో వ్రాసెనని చెప్పవచ్చును. ఎచటెచ్చట ధూర్జటి గ్రహించినాడో యించుక పరిశీలించుటయే ఈ ప్రకరణ లక్ష్యము. శ్రీనాథుని వలె ధూర్జటి మూల మేదియో చెప్పకపోవుట వలన పండిత లోకము ఈ ప్రబంధము మూలమును గూర్చి వివిధాభిప్రాయము లేర్పడుట కవకాశము కలిగినది. ఈ విషయముపై పోణంగి శ్రీరామ అప్పారావు గారి కాళహస్తి మాహాత్మ్య పీఠిక యందిట్లు గలదు.

"శ్రీకాళహస్తి మాహాత్మ్యము నందు నాలుగాశ్వాసములు గలవు ఈ రచనకు మూలమేదియో ధూర్జటి తెలుప లేదు. కాని లింగరాజు కవి కృతమగు పెద కాళహస్తి మాహాత్మ్యమందిట్లున్నది.

1. విను కాళహస్తి మహిమం
   బనుపమై వెలయు మును షడధ్యాయి కథన్

దెనుగున గావ్యముగ నొన
ర్చెను బెద ధూర్జటి కవీంద్ర శేఖరుడనఘా।

2. ఇహ పురాణ మథిత భవ్యార్థి శివతత్త్వ
సారమెల్ల నైక్య సరణి బొదలి
జగతి శివ రహస్య సంగ్రహ మను నీతి
హాస మొనరు విబుధుల భినుతింప.

3. "ఆ యితిహాసంబు నందలి యుత్తర
భాగంబునందు భాస్వన్ని రూఢి
గాళహస్తి మాహాత్మ్య కథ నూట యిర్వది
యధ్యాయముల జెలువ మరుచుందు,
తత్కథ దెనుగున ద్రాక్షరసోర్మికా
పరిపాక విస్ఫూర్తి బరిఢవిల్ల
గృతి యొనర్పుము దదంకితముగ శబ్ద చ
మత్కృతి బండితుల్మది గణింప."

పై తొలి పద్యమును బట్టి, సంస్కృతము నందలి షడధ్యాయి కథను ధూర్జటి తెనుగున కావ్యముగ రచించినట్లు తెలియుచున్నది. కాని తెనుగున శ్రీకాళ హస్తి మాహాత్మ్యము నాలుగాశ్వాసములు మాత్రమే గలదు అందుచే ధూర్జటి రచన కొంత విచ్ఛిన్నమైపోయి యుండునని కొందరు భావించినట్లు శ్రీపోణంగి వారు తమ పీఠికలో తెల్పుచూ అది నిజము కాదనియు [1] దూర్జటి నాలుగు ఆశ్వాసములు మాత్రమే వ్రాసెనని వారభిప్రాయపడినట్లు కాళహస్తిమాహాత్మ్యము పీఠికలో వ్రాసిరి. ఇంకను వీరిట్లు పేర్కొనిరి. సంస్కృతము నందలి ఆరధ్యాయముల కథను దూర్జటి తెనుగున నాలుగాశ్వాసములుగా రచించెను. ఇంక లింగ రాజు కవి పెద కాళహస్తి మాహాత్మ్యమునకు ఆకరము స్కాంద పురాణాంతర్గత మగు శివ రహస్యమను ఖండము. ఇందు 120 అధ్యాయములున్నవి. తెలుగున లింగరాజుకవి 12 ఆశ్వాసముల కావ్యము గానే వెలయించినాడు.

---

1. కాళహస్తిమాహాత్మ్యము -పీఠిక-పోణంగి శ్రీరామ అప్పారావు గారు.

"సంస్కృతము నందొక కాళహస్తి మాహాత్మ్యమున్నది. అది వేంకటగిరి లోనుండు శ్రీమన్మహారాజ రాజశ్రీ వెలుగోటి ముద్దుకృష్ణయాచేంద్ర బహద్దర్వారిచే ముద్రింపబడి యున్నది. అందలి కథలు పిలింగరాజు కవి కృత కాళహస్తి మాహాత్మ్యము నందలి కథలు నొకతీరున నున్నవి" అనియు ఈ లింగరాజు కవి కృత కావ్యమున నత్కీరుని కథ లేదు. తక్కిన వశిష్ఠాదుల చరిత్రలు భేదముగ గన్పట్టు చున్నవి. అనియు ప్రథమ ముద్రణ పీఠికా కర్తలు (కొత్తపల్లి పద్మనాభ శాస్త్రిగారు) తెల్పియున్నారు. అయినచో పెద ధూర్జటి కావ్యమునకు ఆకరమైన అరధ్యాయముల కథ ఎక్కడిది? ఈ అరధ్యాయముల గ్రంథము స్కాంద పురాణాంతర్గతమగు వైష్ణవ ఖండమందలి శ్రీవేంకటేశ్వర మాహాత్మ్య ప్రతిపాదక విషయము నందలిది కానోపునని విమర్శకులూహించిరి. కాని ''అచట నుండెడి యారధ్యాయములలో స్వర్ణముఖరీ నదీ మాహాత్మ్యాదికము, శ్రీకాళహస్తీశ్వర నామప్రసక్తి మాత్రమే కలదు.'' అని చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు తెల్పుచున్నారు. అందుచే దీనికి ప్రత్యేక మూలమేదియు లేదని పోణంగి శ్రీరామ అప్పారావుగారు తమ కాళహస్తి మాహాత్మ్య పీఠికలో దెల్పిరి. ఇంత మాత్రమున ప్రత్యేక మూలము లేదని తలంచుట సమంజసముగా కన్పట్టుట లేదు. ప్రథమ ముద్రణ పీఠికకారులు తెల్పినట్లు వసిష్ఠాదుల చరిత్రల భేదముగా ధూర్జటి కావ్యమున కన్పట్టినను ధూర్జటి దానిని చదివి కొలది మార్పులతో తన గ్రంథమున పొందు పఱచి యుండును. అదియును గాక నత్కీరుని కథ అందు లేకపోయినను తమిళమున తిరువళ్ యాడల్ పురాణమున శ్రీకాళత్తి పురాణమునను కూడ గలదు. ధూర్జటి నత్కీరుని కథను తమిళ వాఙ్మయము నుండి స్వీకరించి యుండును. ఇట్లు ధూర్జటి వేర్వేరు చోటుల నుండి కథలను గ్రహించి శివభక్తి జోడించి తన కావ్యమును రమణీయముగా తీర్చిదిద్దినాడనవచ్చును. కాని ఇతమిద్ధముగా మూలమే లేదని చెప్పజనదు.

ప్రథమాశ్వాసమున "తదాది పురాణకథా ప్రసంగముల్ వినవలతు గృపాంబుధి! సవిస్తర చైఖరి జెప్పవే" (ప్ర. ఆ. 61 పద్యం)

చ॥ అనవుడు భూవరుండు వినయంబున నిట్లను "మీరలానతి
చ్చిన గతి గాళహస్తిశశిశేఖరు దివ్య నివాస పంక్తిమో

హనముగ గట్టబంచెద, దదాని పురాణకథా ప్రసంగము ల్
వినవలతుం గృపాంబుధి సవిస్తరపై భరి జెప్పవే 'యనన్.

(ప్ర. ఆ. 61)

అని యాదవరాజు మాయాజంగమ స్వరూపుడగు శివుని ప్రార్థించెను. అంతట శివుడును కంపాలింగిత స్వాంతుడై యిట్లనుచున్నాడు

మ॥ అను గారంచు ప్రపంచ భర్త యను కంపాలింగిత స్వాంతుడై
జగతీ నాథుని తోడ నిట్లనియె, దద్చారిత్ర మాలింప నిం
పగు నేనివ్వను, మన్మాహత్త్వము పురాణాబ్ధి న్మథింపంగ బూ
ర్జగతింబుట్టిన మోక్ష లక్ష్మికి విహార స్థానమై యొప్పగన్.

(62 పద్యం)

ఇట్టి ప్రసంగము లింకను కొన్ని గలవు. "శ్రీకాళహస్తీశ్వరాప్రాచుర్యంబు పురాణ సిద్ధముగ నెప్పాటన్ జగన్నాయకుండాచంద్రార్కముగా ధరించె! నివి నాకాద్యంతముంజెప్పవే" (ద్వి.ఆ 91 పద్యం) ఈ వాక్యము లాధారముతో శ్రీకాళహస్తీశ మహిమ ద్యోతకములును, పురాణ ప్రసిద్ధములగు కథలను గ్రహించి శివభక్తి జోడించి ధూర్జటి రసవంతముగా నీ కావ్యమును రచించెనని యూహింప వచ్చును.

ఇంకొక విషయ మేమన పై పేర్కొన్న షడధ్యాయి స్కాందపురాణము వెంకటాచల మాహాత్మ్యమునందలి భాగము దానియందు 80 అధ్యాయము మొదలు 85 అధ్యాయమువరకు కాళహస్తి మాహాత్మ్యకథ, సువర్ణముఖరీ జనన కథ యున్నది. ఇది ఆరధ్యాయముల భాగము. లింగరాజు కవి పేర్కొన్న షడధ్యాయి యిదియే యని యూహింపవచ్చును.[1] ఈ కథలకు తోడు మరికొన్ని కథలను జోడించి ధూర్జటి వ్రాసెనని శ్రీ దేకుమళ్ళ అచ్యుతరామయ్యగారు "విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయమున పేర్కొనిరి. ఆరుద్రగారు కూడ తమ సమగ్ర సాహిత్యమున ఇదే విషయమును వెలువరించిరి. కాళహస్తి మాహాత్మ్యము నకు "స్కాందపురాణము వైష్ణవ ఖండములోగల ఆరవ అధ్యాయ మాధారము కావచ్చునని శ్రీ ఆరుద్రగారు వ్రాసిరి. ఈ స్థలపురాణమును సూతుడు శౌనకాది

---

1. దేకుమళ్ళ అచ్యుతరామయ్య, విజయనగరాంధ్ర వాఙ్మయ చరిత్ర.

మహామునులకు చెప్పినది కాదు. వైష్ణవ ఖండములో సువర్ణముఖీ కథకును ధూర్జటి కవి వ్రాసిన కథకును భేదములు కలవు. ఈ భేదములు తర్వాత పరిశీలింతము.

ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక,[1] సంచిక 47 లో శ్రీ జి. వి కృష్ణమాచార్యుల వారు 'కాళహస్తి మాహాత్మ్యము - ఇతివృత్త పరిశీలనము'యను నంశము గూర్చి వ్రాయుచు స్కాందపురాణమునందలి ద్వితీయ ఖండమగు వైష్ణవ ఖండమున వేంకటాచల మాహాత్మ్యము నలువది యధ్యాయములలో నభివర్ణింపబడినదని వ్రాసిరి. అందు ఏకోన త్రింశోధ్యాయము తొలి శ్లోకము నుండి ముప్పది యైదవ యధ్యాయము పదియవ శ్లోకము పర్యంతము సువర్ణముఖర్యావిర్భావ మాహాత్మ్యములు వర్ణింపబడినవి. ఇరువది తొమ్మిదవ యధ్యాయమున చోరులు ధేనువు నపహరింపగావిప్రుడు తదానయనార్థము పార్థుని వేడుట, అతడు ధర్మజుని శయ్యాగారము నాయుధముల కొఱకు ప్రవేశించి పూర్వ మేర్పఱచు కొన్న నియమము ననుసరించి తీర్థాటన మొనర్చుట కాతని యనుజ్ఞను బొందుట వర్ణింపబడినది. ఈ యధ్యాయమునందలి కథ ప్రకృత గ్రంథమున గానరాదు. ముప్పదియవ యధ్యాయమున గిరిటి భరద్వాజుని సువర్ణముఖరీ మాహాత్మ్యమును దెలుపవలసినదిగా వేడుట వివరింపబడినవి. ఏకత్రింశోధ్యాయమున శంకర వివాహ ప్రక్రియ, అగస్త్య దక్షిణ దిగ్గమనము వర్ణనము నొనర్పబడినవి.

వృషభాంకో జగత్స్వామీవివోఢుం సర్వమంగళామ్
ప్రాప్తోహిమవదావాసమ్ ఓషధీ ప్రస్థనామకామ్
(అధ్యాయము 31-16)

తదా సనాత్ సమాజగ్ముః స్థావరాణి చరాణిచ
భూతానిభూత నాథస్య కల్యాణ మభినందితుమ్ (31-17)

తద్భూరిభార సంభగ్న భూమి రుత్తర సంశ్రయా
నిమ్నతామాయ యౌయావత్సారాళ మాస్థితా (31-18)

---

1. సారస్వత పరిషత్ పత్రిక కా.మా. ఇతివృత్త పరిశీలనము సంచిక 47 వ్యాసము శ్రీ జి.వి. కృష్ణమాచార్యులు.

నిర్వర్తితామవాతస్మాత్ భృశం దక్షిణ గామినీ
ఊర్ధ్వం గళాచరం దృష్ట్వా సర్వేషా మభవద్భయమ్ (81-19)

జ్ఞాత్వాతం వికృతం భూమే దృష్ట్వాగ స్త్యం మహేశ్వరః
ఇత ఏహి మహా ప్రాజ్ఞేత్యుక్త్వా వచనమబ్రవీత్ (81-20)

ఆగతేషు సమస్తేషు భూతేష్వత్ర వసుంధరా
తద్భారేణ సమాక్రాంతా వికృతించ సమాగతా (81-21)

తద్ధ్రువః సామ్యకరణీత్వ మర్హసి మహామతే
ఋతేత్వా మిత్రహిత్వ త్త్రః పరేశై తత్కదంతవేత్ (81-22)

పై శ్లోకము లందలి విషయము నాధార పరచుకొని ప్రకృత గ్రంథమున సువర్ణముఖరీ జనన ప్రకార వివరణ మారంభమైనట్లు తోచుచున్నది. స్కాంధ పురాణమున భరద్వాజ ముని ప్రోక్త గ్రంథమునందు తీర్థయాత్రాశీలియగు నర్జునుడు వక్తగా పేర్కొనబడెను.[1] భరద్వాజుని యాశ్రమమునకు వచ్చిన పార్థుడు సువర్ణముఖీ నదిని జూచి దాని జన్మ వృత్తాంతమును జెప్పమని యడుగగా బ్రహ్మర్షియగు నా భారద్వాజుడు తన్నదీ వృత్తాంతమును జెప్పెను. ఈ వృత్తాంతమునకు వైష్ణవ ఖండమునందలి పై శ్లోకములే ఆధారము లనవచ్చును. ధూర్జటి స్కాందపురాణ గాథను చక్కగా ననుసరించి రచన జేసినట్లు కన్పించును.

కాళహస్తికి విచ్చేసి పూర్వాహ్ణిక క్రియలు ముగించుకొని శివారాధనకు దొడంగిన యగస్త్య మహర్షితో నాకాశవాణి యిట్లు పల్కినదట.

నదీ హేనోఽహ్యయం దేశః
ప్రసిద్ధోఽపిన శోభతే
జ్ఞాన విజ్ఞాన విముఖః
సాకార ఇవ భూసురః
దీక్షావ దక్షిణాహీనా

1. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక సంచిక 47 కాళహస్తి మాహాత్మ్యము యితివృత్త పరిశీలనము వ్యాసము. శ్రీ టి. వి. కృష్ణమాచార్యులవారు.

జ్యోత్స్నా హీనేవ శర్వరీ
నవిభాతి నదీహీనం
పృథ్వీయం భూసురోత్తమ
ప్రవర్తయ నదీంకాంచి
ల్లోకానాంహిత కామ్యయా (స్కాందపురాణము)

స్కాందమున నాకాశవాణి యగస్త్యుని ప్రేరేపించినట్లు ఈ శ్లోకము చెప్పుచున్నది. తెలుగు కావ్యమువట్లు గాదు, ఎవ్వరి ప్రేరణముతో బనిలేక అగస్త్యుడే స్వయముగా నదిని తీసుకుని వచ్చుటకై తత్రత్యులగు మునుల సమక్షమున సంకల్పించి ఇట్లనును.

"చంద్రికా కందళితంబుగాని నిండుచందురు చందంబున
మందాకినీ సుందరంబగు పుణ్యనదీ ప్రవాహంబులేని"

కతంబున నిమ్మహాస్థలంబు దుఃఖంబు నావహించుచున్నది. పరమేశ్వరు నుద్దేశించి తపం బొనర్చి, యిక్కడ నొక్కనదిం బ్రవహింప జేయవలయు, నా సంకల్పంబు నిర్విఘ్నంబుగా ననుగ్రహింపుం ''డని వారలచే ననిపించుకొని'' (ప్ర.ఆ వచనము 117) వారి యనుజ్ఞగైకొనెను,[7] స్కాంద పూరాణమున శంకరుని గూర్చి దుష్కరమగు తపంబొనరింపగా బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై యాతని యభీష్టము ననుగ్రహించును.

1) ధూర్జటి కావ్యమున అగస్త్య తపస్తేజస్త్రస్తులగు దేవతలను వెంటబెట్టుకొని బ్రహ్మదేవుడు శంకరుని బోయి దర్శించును. ఆయన వారి వెఱపుమాన్పి యగస్త్యుని తపోనిమిత్తమును వారికెఱింగించి చతుర్ముఖుని నిట్లాదేశించును.

ఉ. ''ఏమిటి కింత మాత్రమునకే వెరగన్, జనినీవు సంయమి
గ్రామణి శోకనే వసుపగా ననుదెంచితి నంచు బల్కి, త
ద్భామిత వస్తువిద్యు, చిరకాం కృతోగ్రతప స్సమాధివి
శ్రామిత ఖేద మెల్ల నిమిషార్థములో మడి వోవునట్లుగాన్''

(కా.మా ప్ర.అ. 186 పద్యం)

శివాజ్ఞ ననుసరించి, సరసిజ భవుడగస్త్యునకు బ్రత్యక్షమై చదలేటి నా ప్రాంతమున బ్రవహింప జేయును. ఇచట ధూర్జటి గావించిన కొంది మార్పులు తప్పదక్కిన గాథ యంతయు స్కాంద పురాణము నందలి కథకు సరిపోవు చున్నది.

మరియు వింధ్య పర్వత గర్వంబు విఱుగ ద్రొక్కి గౌతమీ కృష్ణవేణ్యవ గాహనములు సేసి శ్రీశైల నాథు దర్శించి జ్యోతి సిద్ధవటనాథు గొల్చి విచ్చేయు నపుడు ద్వాత్రింశోధ్యాయమున నాకాశవాణి (1-108) యగస్త్యుని మహానదీ ప్రవర్తనమునకు దపమాచరింపవలసినదిగా నర్థించుట, మునులగస్త్యునట్లే ప్రార్థించుట వివృతములు.

ఆకాశవాణ్యా వాదైనమ్ అగస్త్యం జపతాంవరమ్
నదీ హీనోహ్యయందేశమ్ ప్రసిద్ధోఽపినశోభతే (32-8)

(బొంబాయి వేంకటేశ్వర ముద్రణాలయము ప్రచురిత స్కాంద పురాణము Vol No. 2)

మునులు సహితము ఇదే విధముగా నగస్త్యుని ప్రార్థించిరి. సువర్ణముఖరీ నామ నిష్పత్తి రెండు గ్రంథములందును సదృశమే.

సువర్ణమివ లోకానామ్ భాగాధే యాది యంనదీ
పితాభవ మస్త్యేవ ముఖరీకృత విష్టపా (33-6)
తస్మాత్ యాస్యతి విఖ్యాతిమ్ సర్వ లోకాభినందితామ్
సువర్ణ ముఖరీ నామ్నాధా మ్నికైవల్యపదః (33-7)

ఉ. నావుడు దమ్మిచూలి గగనంబు గనుంగొనగా, సువర్ణలో
కావిభవంబులో బహుళ రంగమహోముఖరత్వ నంతదన్
దేవ నదీరుచిరంబు సమదెంచిన, గాంచి, వచించి తద్గుణ
శ్రీవెలయన్ "సువర్ణముఖరీ" ప్రథనామిక గల్గజేయుచున్

(స్వ.మ. 140 పద్యం)

అనంతరము వేంకటాచల మాహాత్మ్యమున సువర్ణముఖరీ మహిమాను వర్ణనము, సువర్ణముఖరీ స్నానకాల నిర్ణయము అగస్త్య తీర్థాది వర్ణనము, సువర్ణముఖరీ కల్యాణనదీ సంగమము వర్ణింపబడినవి. తత్ప్రసంగమాంధ్రమున గావరాదు. దీనిని బట్టి ఏ భాగము రేఖామాత్రముగా నాధారము గలదనియు బెక్కు స్థలముల మూలనిరపేక్షముగా గవి ప్రవర్తించినాడనియు వర్ణనా భాగమే ఘట్టమున విస్తరించినట్లు తెలియుచున్నది.

(ప్ర.ఆ. 1-108 నుండి 164)

అయితే యిచట ధూర్జటి కొంత ప్రయోజన మర్థించియే ఈ మార్పులను చేసినట్లు తెలియుచున్నది. ఒకరిచే చెప్పించుకొను నవసరములేని కుంభజుని యుచితజ్ఞతను ప్రదర్శించుటకును, పరస్పర విరుద్ధాంశములు దొలగించి శివాధిక్యమును స్థాపించుటకు నాతడీ మార్పులు చేసినట్లూహించు కొనవచ్చును. అయితే ధూర్జటి తన కావ్యము నందెచ్చటను స్కాందము మూలమని ఎందుకు చెప్పలేదు? బహుశః కేవలము ఒకే కథను స్కాందము నుండి గ్రహించిన వాడగుటచే చెప్పక యూరకుండె ననుకొనవచ్చును. చేకుమళ్ల అచ్యుతరావు గారు వైష్ణవ ఖండము నుండి తీసికొనెను గనుక ధూర్జటి చెప్పలేదని భావించిరి. కాని అట్లు కాక ఒకే కథను గ్రహించినాడు గనుక ఆ పేరు చెప్పియుండక పోవచ్చును గాని అన్యము గాదు. శివభక్తి ఎంత ప్రగాఢమైనదైనను విష్ణునామస్మరణ గిట్టనివాడు కాదు ధూర్జటి. ఇటువంటి విషయమున కాధారములు అతని కాళహస్తి మాహాత్మ్యము ననే గలవు. ద్వితీయాశ్వాసమున ఈ క్రింది పద్యము చూచిన మనకీ విషయము స్పష్టము కాగలదు.

మ. సకలాపూర్ణుడు నీలవర్ణుడనుటల్ సత్యంబు గాదెట్లుపో
లిక తెంజీకటి నిండ దారకలు దోల్చెన్నిర్జరాధీశ్వరా
దికులర్పించిన పుష్పలట్టింతవురద్దేవుండు భేదంబుగా
మిక దెల్లంబుగ, సద్ప్రదేశగధరన్ మించెన్ శశాంకాకృతిన్

(ద్వి.ఆ. 188 పద్యం)

ఇది చంద్రోదయ వర్ణన. ఇచట శివకేశవుల కభేదమును కవి చెప్పినాడు. శివుడు చంద్రుని ధరించినవాడు, విష్ణువు నల్లనివాడు. అభావమే యిందు గలదు. అట్లు హరిహరాద్వైత భావమును వలచిన వ్యక్తి వైష్ణవ ఖండము నుండి వస్తువును

గ్రహించుటకు వెనుదీయరు ఇంతవరకీ కథకు మూలము స్కాందమని పరిశీలితమది జరిగినది. తక్కిన కథలకు మూలమేదియను ప్రశ్న ఉదయించును. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక సంచిక 47లో శ్రీ.టి.వి. కృష్ణమాచార్యులుగారు కాళహస్తి మాహాత్మ్యము- ఇతివృత్త పరిశీలనము యను వంశమును వ్రాయుచు బ్రహ్మకథను గూర్చి దానికి ప్రత్యేక మూలము గానరాదని వ్రాసిరి. తరువాతిదగు శ్రీకాళహస్తుల కథ బసవపురాణమున భిన్నముగా గలదు గాని తిన్ననికథను బసవపురాణము నందీ విధముగ స్మరింపబడెను.

"ఇచట దొల్లియునేనుంగుతోడ
జెప్పెర దోరదేచెలది యెట్లువిన
....
....
దుండాగ్రమున జొచ్చి తొలుచుచుజెలది
దండిమదేభంబు తలకెక్కిచంపె"

(పాల్కురికి సోమనాథుని బసవపురాణము
పుట 88 వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పరిష్కరణము)

కొందఱు పరిశోధకులు శివపురాణాంతర్గతమగు శివరహస్య సంగ్రహము మిగిలిన వానికి మూలమని భావించిరి. అదియు పదపద్యముకాదు. శివపురాణము ముద్రిత ప్రతులందెచ్చటను శివరహస్య సంగ్రహము కనిపించుటలేదు. వెలుగోటి వంశస్థులగు వెంకటగిరి సంస్థానాధిపతులు మాత్రము "కాళహస్తి స్థలపురాణము" నొకదానిని ప్రకటించి శివపురాణాంతర్గతమగు శివరహస్య సంగ్రహములోనిదని తెలిపిరి. అందు మాత్రము వీరనృసింహయాదవుని ప్రసక్తియేలేమ భారద్వాజ మునికి రోమశుడు చెప్పినట్లుగా నైమిశారణ్య వాసులగు శౌనకాది మహామునులకు సూతమహర్షి దక్షిణకైలాసమగు కాళహస్తి క్షేత్రమాహాత్మ్యము నభివర్ణించి చెప్పును. దీనియందు సాలీడుకథ, కాళహస్తులకథ, తిన్నని కథ గలవు. వేశ్యా కుమారికల గాథయును వాలీశ్వరుని వృత్తాంతము నక్కీరుని కథలను కల్పింపవు కన్నని కథకూడలేదు. బ్రహ్మదేవుని కథగలదు కాని ధూర్జటి కావ్యమందలి కథ కన్న వేరైనది ... కలవ్యాఖ్యానము గలదు. ప్రసిద్ధములైన శ్రీకాళహస్తుల కథలయును

ధూర్జటి ప్రబంధములో కథలందును భేదము గన్పట్టుచున్నది. ధూర్జటి ప్రబంధము ననుసరించి తెలిసి పూర్వజన్మమున విశ్వకర్మ కుమారుడగు నూర్ణనాభుడు బ్రహ్మసృష్టికి ప్రతిసృష్టియని గర్వించుటచే శాపగ్రస్తుడై గజారణ్యస్థితుడగు మహాదేవుని దంతు వితానముతో సేవించి ముక్తుడయ్యెనని చెప్పబడినది. దానికి శ్రీయను నామమెట్లు గలిగినదో చెప్పట జరుగలేదు. ధూర్జటి సాలీడు కథ కృత యుగము నాటిదనెను. శివపురాణాంతర్గత శివరహస్య సంగ్రహములోనిదని చెప్ప బడుచున్న యీ స్థలపురాణమునందు మాత్రము కన్నప్పకథ, తరువాత జరిగినట్లు చెప్పబడినది. సాలీడు చేసిన శివస్తోత్రములోని "అత్యంతభక్తి భిల్లేశపాదుకాలీఢ మౌళయేత దుష్పృష్ఠ పలాశాయ మహాదేవాయతేనమః" అను శ్లోకమే దీనికి నిదర్శనము. అర్జునుడే కన్నప్పగా బునరుద్భవించెనని ధూర్జటి కావ్యమందు పూర్వజన్మ వృత్తాంతమున చెప్పబడినది. దీనినిబట్టి కన్నప్ప కలియుగము వాడుగా భావించవలెను. ఈస్థల పురాణమునకును, ధూర్జటి కావ్యమునకును ఈకాల విషయమున భేదము గన్పట్టు చున్నది. ధూర్జటి తన కావ్యమునందెచటను శివభక్తి పరాయణమగు నామర్కట కీటకమునకు శ్రీనామమెట్లు గలిగెనో చెప్పలేదు.

ఇక హస్తి - కాళము వీటి విషయము ధూర్జటి ప్రబంధమున ఇట్లు గలదు హస్తియను ప్రమథుడు పార్వతీ పరమేశ్వరుల రహస్యమందిరమునకు ద్వారపాలకులను ధిక్కరించి లోనికి పోయెను. అంత పార్వతి వానిని చూచి కోపముతో "నీవు ఏనుగువై పుట్టెదవుగాక" యని శపించగా అతడు కాళ్ళ - వేళ్ళాపడి దీనముగా ప్రార్థింపగా దయతో నప్పుడు "శివభక్తి కలిగి శివుని పూజించవు మోక్షము నందుదువులే" అని కరుణించెను. అంతట నాతడు ఏనుగై శివుని పూజించి ముక్తిని పొందెను.

ఇంక కాళము కథ ఏమన కైలాసపర్వతముపై శివుడు సర్వాలంకృతుడై నాట్యము చేయుతలంపెట్టెను. అప్పుడు కాళమను నాగుడు భార్యలను వదలి యుండలేక పాతాళమునకు పోయెను. 'శివుడు తన్ను సేవింపక పోయెనని కోపముతో 'కైలాసమునకు రాకుందువుగాక!' యని శపించెను. కాళము అది తెలిసి శివుని పాదములపై బడెను. దయదలచి 'నీవు భూలోకములో నున్న నారూపమును సేవింపుమని ముక్తి గలుగునని' సెలవిచ్చెను.

శివరహస్య సంగ్రహాంతర్గతమగు స్థలమాహాత్మ్యమున ఈకథలు వేరుగ గలవు. మలయాచల నివాసియగు దరిద్రబ్రాహ్మణుడొకడు శివరాత్రినాడు అన్య కృతమగు శివపూజ జూచిన సుకృతమగునని తలంచి జాతి స్మరత్వముగల గజో త్తమముగ జన్మమంది శివసాయుజ్యము పొందెనని చెప్పబడెను. ప్రాగ్జన్మమున వాని మరణమునకు పాము కాటు కారణము చెప్పబడియె. ధర్మవిక్రయ దోష మున నాతడు హస్తి జన్మమెత్తవలసిన వాడయ్యెను.

కాళము కథ యిట్లున్నది. స్థల పురాణము నందలి సర్పము పూర్వ్యాను భవమున వేదశాస్త్ర విశారదుడగు నొక విప్రుడట హిమాలయ కంద రాస్థితుడగు దివాని కమ మూల్య రత్నముల నంలికారమణుని నర్పించును. ప్రగంధర్వునిగని యావిధముగ శివారాధన మొనరించిన వచ్చు ఫలమేమని ప్రశ్నింపగా నతడు పూజా పరాయణులకు బునర్జన్మ ముండదని చెప్పను. కుతూహల వివశుడై శివ పూజకు రత్నము లెట్లు లభించునని యడుగగా పాతాళమునకేగిన లభించునని యా గంధర్వుడు ప్రత్యుత్తర మిచ్చును. అతని వచనము ననుసరించి దూతడు మనుష్య శరీర ముజ్జగించి, సర్ప జన్మము నభిలషించి సదా శివుని సేవించి యప వర్గానంద మనుభవించును. కాళహస్తి క్షేత్రమునకు సంబంధించిన ముఖ్యకథలలో కన్నప్ప కథ యొకటి. ఈ కథ తమిళ వాఙ్మయ మందు కూడ గలదు. తమిళ మాతృక గూర్చి విచారించినప్పుడే విషయము పరిశీలింతము. [1]ఈ స్థలమాహాత్మ్య మందు అదియును భిన్నముగనే కన్పట్టుచున్నది. కన్నప్పకు తిన్నడను పేరులేదు. తండ్రి పేరు మాత్రము తీర్థుడని చెప్పబడినది. అతడు పూర్వ జన్మమున మణి మంతుడను యతుడుగా పేర్కొనబడెను. కైలాస పర్వత ప్రాంతమున సంచ రించుచు లేడి నొకదానిని బాణముచే గొట్టి చంపగా నందీశ్వరుడతనికి గినిసి కిరా తుడవు కమ్మని శాపమిచ్చెను. శివభక్తుడగు పుత్రు డుదయించిన యనంతరము అతనికి శాపమోక్షమగునని యనుగ్రహించెను. శాపతరుణము గావించుటచే నతనికి తీర్థుడను నామమేర్పడునని చూచించెను. ఈ తీర్థుడను పేరు తిన్నడుగా మారి యుండవచ్చును. ఒకవేళ సంస్కృతరూపమైనను కావచ్చును. ఆ తిన్నని కుమారుడే కన్నప్ప. సంస్కృతమున కాళడను మరియొక పేరున్నట్లు

[1] స్థలపురాణము - శివ రహస్య ఖండాంతర్గత శివపురాణము.

చెప్పబడినది. కాకుడనగా కన్నులందముగా గలవాడు. ఈతడు శివభక్తుడు. వేటాడి తెచ్చిన మాంసఖండముల వాయులింగ రూపమున వెలసిన శివుని కర్పించనిదే అతడేమియు తీసికొనడు. ఈ కృతి వ్యవహారేతర పద్ధతిలో శివుని కొలుచుట చూచి ఋషులు అసహ్యించుకొనుచుండిరి. పరమేశ్వరుడు తిన్నని భక్తి వారికి చూపదలచి యొకనాడు తన ఆలయమును కూలిపోవునట్లు జేసెను. మునులందరు భయపడి పారిపోవుదురు. కన్నప్ప కదలక లింగముపై రాళ్ల పడకుండగ తన శరీరము నడ్డు పెట్టెను. ఋషులు ఈతని శ్లాఘింతురు. ఈతడు యథాపూర్వకముగా శివలింగము నర్చింపదొడగెను. తననోట నీరు అభిషేకించును. నైవేద్యము పెట్టును. మునుల కీవిధమగు పూజ చూచిన జుగుప్స కలిగెను. శివుడు తిన్నని భక్తి వారికి ప్రదర్శింప నెంచి కంటనీరు గార్చగా తిన్నడు తనకు తెలిసియున్న యడవి మందులన్నియు తెచ్చి వైద్యము చేయగా వృథా యగును. చివఱకు కంటికి కన్నే మందని తన కంటిని పెరకి యిచ్చును. రెండవ కంట కూడ నీరు గారగా తిన్నడు రెండవ కంటిని కూడ సమర్పింప ప్రయత్నము చేయగా పరమేశ్వరుడు ప్రత్యక్షమై అడుకొనును. ధూర్జటి ప్రబంధము ననుసరించి కన్నప్ప అర్జునుడు. కాని యిచట నట్లుగాక హిమాలయ ప్రాంతపువాడగు నొక కిరాతుని పెంపుడు కోడి. ఆ భిల్లుడు అఖండ శివభక్తుడు. శివుని కర్పింపనిదే ఏమియు భక్షింపని నియమము గలవాడు. అతడు శివ ప్రసాదము నొకనాడు భుజించుచుండగా ప్రమాదవశమున నందులో గొంత భూమిపై బడెను. దాని నా కుక్కుటము భక్షించి మఱుజన్మమున నంతటి భక్తుడయ్యెను. ఈ స్థలపురాణమునందలి కన్నప్ప పూర్వజన్మ వృత్తాంతమునకు ధూర్జటి ప్రబంధమున కథకును లేశము కూడ సంబంధ మున్నట్లు కన్పింపదు. ధూర్జటి శివభక్తుడు గనుక శివపురాణాంతర్గతమగు నీ స్థలమాహాత్మ్యమును చదివియే యుండును. కాని కథలు మాత్రము వేరుగా వ్రాసినాడు. కారణము బహుశః ధూర్జటి కాలమునాటికి శివపురాణములో నీ కాళహస్తి స్థలపురాణము చేరి యుండకపోవచ్చును. ఇక కాళహస్తి మాహాత్మ్యమునకు తమిళ మాతృక కలదేమో విచారింతము. శివభక్తులనబడు నాయనార్లు అనేకమంది ఈ క్షేత్ర మాహాత్మ్యమున్ను గూర్చి గానము చేసిరి. కాళహస్తి దేవాలయమున కూడ తెలుగు శాసనముల కన్న తమిళ శాసనములే అధికముగా కన్పించుచున్నవి.

కాళహస్తి మాహాత్మ్యము - తమిళమాతృక

తమిళ వాఙ్మయమునందు '[1]తిరుకాళత్తి పురాణ'మను గ్రంథమొకటి గలదు. తెలుగు ప్రబంధమగు శ్రీకాళహస్తి మాహాత్మ్యమునకు తిరుకాళత్తి పురాణమే మూలగ్రంథమైయుండునని అందలి కథల మూలమున తెలియుచున్నది. గ్రంథరచన విషయమున ధూర్జటి కొన్ని మార్పులు చేసినను తెలుగు ప్రబంధమునందుగల కథలన్నియు అందుకూడ గలవు. తమిళమున ముగ్గురన్నదమ్ములు కలసి కావ్యమును రచించినట్లు చెప్పబడినది. శివప్రకాశుడు, వేలయస్వామి, కరుణప్రకాశుడు వీరు మువ్వురు కలసి ఈ తిరుకాళత్తి పురాణము రచించిరట. కావ్యము కొన్ని సర్గలుగా విభజించిరి. ముఖ్యముగా ఈ విభాగమును బట్టియే మనకు తెలుగుప్రబంధముతో పోలికయున్నట్లు తెలియుచున్నది. ఆ విభాగమిట్లున్నది.

1. విటసంగమసర్గ (మిండజంగముకథ)
2. తెన్‌కైలాయసర్గ (దక్షిణకైలాససర్గ) వశిష్ఠుని తపస్సు
3. పోన్‌ముఖరీసర్గ (చతుర్ముఖసర్గ) బ్రహ్మదేవుని శృంగారగాథ
4. గాళత్తి సర్గ (కాళనాగముల సర్గ) హస్తినాగముల సర్గ
5. కణ్ణప్పసర్గ - కన్నప్పకథ
6. నక్కీరసర్గ - నక్కీరుని కథ
7. కన్నియర్‌సర్గ - వేశ్యాకుమారికల వృత్తాంతము.
8. శింందిముదలేసర్గ - సాక్షిపురగు పూర్వకథ

ఇందు శివప్రకాశుడు కన్నప్ప నక్కీర సర్గములు రచించెను. అరవ జుడగు కరుణప్రకాశుడు గాళత్తి సర్గము వంటివి రచించెను. వేలయస్వామి మిగిలిన సర్గలు రచించెను. తెలుగు కావ్యమునందు వలెనే తమిళమునందు గూడ కన్నప్పకథ, నక్కీరునికథ, ప్రసిద్ధములు. ధూర్జటి ఈ తమిళ మాతృక నను సరించుచే తన రచన సాగించియుండునని తోచును. పూర్వముమంచియు స్వతంత్ర

1. శ్రీ ... గారి సహాయముతో తమిళమునుండి విషయము సేకరించుట జరిగినది.

రచితలు కాక అనుసరించుట యను యాచారము గలదు. కాళిదాసు కావ్యము లన్నియు స్వతంత్రరచనలు కావు అయినను ఆయన మహాకవిగా ప్రసిద్ధివడసెను. ఈ దృష్టితోనే ధూర్జటి కావ్యమును కూడ చూచిన తమిళ కావ్యము ననుసరించినను, రచన రసవత్తరమై కావ్యము గొప్ప స్థానము సంపాదించినది.

తమిళ కావ్యమునకు కూడ తద్భాషలో మూల ముండియుండవచ్చును. ఎందుకనగా తమిళ వాఙ్మయమున గాళహస్తి క్షేత్ర మాహాత్మ్య ప్రతిపాదకము లైన కావ్యములెన్నో గలవట. అన్నిటికి మూలము కాళత్తి పురాణముగా పేర్కొనబడుచున్నది. దాని కర్త స్కాందమును వాసిష్ఠలైంగమును జూచి యా కృతిని రచించినట్లు చెప్పుకొనెను. కాని శ్రీకాళత్తి పురాణము వ్రాసిన మువ్వురును వానిని పేర్కొనలేదు. స్కాందమునో మఱి యే యితర పురాణమునో యాధారముగా జేసికొన్నవారా మాత్రము చెప్పక యుందురా యనుసందేహము. ఐహిక ప్రయోజనము నంతగా నాశింపని యొక మఠాధిపతి తన కావ్య రచనకు మాతృకగా నుపకరించిన గ్రంథమును దాచియుంచుట కవకాశముండదు. అదియును గాక తన కావ్యమందలి ప్రధాన వ్యక్తులలో నొకడై మాయాజంగమ రూపధారి యగు పరమేశ్వరుని ముఖమున కాళహస్తి క్షేత్రమాహాత్మ్యగాథలన్నియు భక్తి ప్రపత్తులతో వాకొంచిన యాదవ నరసింహనాయకుడు పౌరాణిక వ్యక్తిగాదు. చారిత్రాత్మకవ్యక్తి. ఈయన శాసన మొకటి దక్షిణ భారత శాసనములందుగలదు.

ధూర్జటి కవికి తమిళ కావ్యమును అనుసరించుటకు తగిన భాషా పాండిత్యముగలదా యను సందేహము గలుగును. కాని ఆ రోజులలో ప్రస్తుతము కానవచ్చుచున్న భాషా దురభిమానము లేమియులేవు. కన్నడమున మహాకవియని పేరొందిన రత్నాకర వర్ణిత కావ్యము ననేక ప్రాంతముల వారికి వినిపించి వారి ప్రశంసలందుకొనవలెనని తానే స్వయముగా తన కావ్యమున చెప్పుకొనెను.

అయ్యయ్యా చెన్నాదుదనె కన్నడిగారు
రయ్యామంటరి యెనె తెలుగా
అయ్యయ్యా వింతపాడ్డాందెందు తుళువరు
మయ్యుబ్బి కేళెకణ్ణా

(భరతేశవైభవ ఆస్థాన సంధి 4 పద్యము)

వారిలో తెలుగువారు కలరు. అతని కన్నడ కావ్యమును మెచ్చుకొనుటకు వారికి తద్భాషా సాహిత్యముల మంచి ప్రవేశముండితీరవలెను. ఆనాటి విద్వాంసుల అతినివేశముతో ప్రాంతీయ భాషలనేకముల నధ్యయన మొనరించుచుండెడి వారనుటకు అల్లసాని పెద్దనగారిదని చెప్పబడుచున్న యీ చాటుపద్యమొక నిదర్శనము.

ప్రాకృత సంస్కృత ఘూర్జర
మూకి కృతకు కవితుంగ ముష్ట్రాతతికిన్
వాకిలి కావలి తిమ్మని
వాకిటి కవికోటి మాదవాకిటి కోటే

దక్షిణ భారతమునందలి కవులెందరో దూరముననున్న ఘూర్జర భాష నేర్చుకొనుచుండిరనగా నిరుగు పొరుగు భాషల గురించి వేరుగా చెప్పనవసరములేదు. అందును ధూర్జటి కవి చిత్తూరు మండలమువాడు అచటి ప్రజ లిప్పటికిని తమిళము మాట్లాడెదరు. కాళహస్తి కూడ తమిళ ప్రాంతమునకు చేరువగనే యున్నది. ఇంకొక విశేషమేమన కాళహస్తీశ్వరునిపై భక్తిప్రపత్తుల తెలుగు వారికంటె అరవ వారికే ఎక్కువ. ఆస్వామిపై తమిళమున నున్నంత వాఙ్మయము తెలుగున లేదు. తమిళ దేశముతో నింతసంపర్కము అనాడు ఆ ప్రాంతమునకున్నప్పుడు ధూర్జటి కవికి తద్భాషా సాహిత్యములతో కొంతపరిచయ ముండియుండును. లేకపోయినను, తద్భాషావిదులగు మఱి యెవ్వరిచేనైన దానిని చదివించుకొని యుండును. మఱియొక విధముగా కూడ నా కవికి తత్కావ్య పరిచయమేర్పడి యుండవచ్చును. నక్కీరుని కథా ఘట్టమున ధూర్జటి కవి తమిళనాడులోని పుణ్యక్షేత్రముల నెక్కుడు యథాతథముగా స్థానిక విశేషములతో వర్ణించెను. తీర్థయాత్రా ఘట్టమునగల "చెంగట మండగాంచె" (తృ. ఆ. 181) యను పద్యమే ఇందులకు తార్కాణము. నక్కీరుడు జంబూనాధ క్షేత్రమును జూచుట యిచట వర్ణితము. ఈ వర్ణనలను బట్టి చూచిన ధూర్జటి ఆ ప్రాంతములకు పోయి చూచియుండి యుండవలెననిపించును. ఆ సంచార సందర్భముననే తమిళ కవుల కృతము కూడ సందర్శించియుండును. అచటనే తన యిష్టదైవమగు కాళహస్తీశ్వరునిపై రచింపబడిన యా ప్రబంధమును సైతము సావధానముగ ఆలకించి యుండును. అప్పుడే గ్రంథమొకటి వ్రాయవలయునని కోరిక కల్గియుండును.

ఈ కవి తమిళము ననుసరించినట్లే పేర్లైన చోట్ల మార్పులు గావించి యుండెను. కథలలో కూడ యించుక మార్పు కన్పించుచున్నది.

నారాయణ వనమును బరిపాలించుచుండిన యాదవ భూకాంతుని శివభక్తి పరీక్షింపగోరి జంగమ రూపమున ఏతెంచిన పరమేశ్వరుని వేషము కరుణ ప్రకాశిని విటసంగమసర్గమున గలదట.

నీట్రుపెల్ తిరిపుండరం
నిగరిల్ కర్మణి పూళ్
మాట్రురుం పర శివలింగం
తన్మురువ యంగ
శాట్రురుం విడ సంగమనాగి
యతడం దోళ్
ఆట్రుల్ మన్నన్ నారాయణ వం
నగర్ ఆడెందాన్ (శ్రీ కాళత్తి పురాణము విటసంగమసర్గ)

దీనిని ధూర్జటి ఇట్లు చెప్పినాడు.

సీ॥ అడుగు నెత్తమ్ముల నపరంజి పావాలు,
కరమున గేదార కంకణంబు
బంగారు వ్రాత పెట్టుంగుల గోణాము
గళమున రుద్రాక్ష కంఠమాల,
యొక కేల భసిత భస్త్రిక తోడి బెత్తంబు
సంది గట్టిన తరుణేందుధరుడు
మాణిక్య రుచుల యొడ్డాణంబు, భూతిపై
బెట్టిన కస్తూరి బిళ్ళ బొట్టు,
తే॥ సార్వకాలిక తాంబూల చర్వణార్ద్ర
రాగసౌభాగ్యమున నధరరాగ మలర

దృఢముగా జూచుదంత పేం క్తియును గలిగి
యంగం బా రాతి యొక మిండ జంగమనుచు.

(కా।మా। ప్ర.ఆ. 80 పద్యం)

ఈ పద్యము ధూర్జటి మూలము కంటె భిన్నముగా వ్రాసెనని తోచును. తమిళ మున ఈ జంగముని చూచి స్త్రీలు తమతో తామిట్లనుకొనిరట.

"వీడు మన వలువలు జారిపోవునట్లు చేయుచున్నాడు. గాజులు శిథిలమగు నట్లు కావించుచున్నాడు. వీడు పోవుచు మనసుల నపహరించుకొని పోవుచున్నాడు. వీనిని జూచిన మన్మధునకును చిత్తభ్రమ కల్గును. వీడు దయలేనివాడు. (విట సంగమసర్గ) తమిళమున ఈ భావము నారీజనుల వచోవికారమును మాత్రము సూచించుచున్నది. ధూర్జటి యీ సందర్భమున వ్రాసిన ఈ పద్యము వారి కాయిక మానసిక వాచికములైన సర్వ వికారములను చిత్రించుచున్నది.

మ॥ తన సౌందర్యము చూచి కామశర సంతాపంబునుం బొందకుం
డిన కాంతామణి, దాల్మి దూలని వధూటిం, గౌగలింపందలం
పసి శంపాలతాంగి, బోటులకు జెప్పంబోని పంకేరుహా
నన గీర్తింపని లేమ, మందనకు నైనంగాన మూహింపగన్

(82 ప్ర.అ)

అధార వ్యవహారాదికములను చిత్రించు నవకాశము దొరికినప్పుడెల్ల ధూర్జటి పెంచి వ్రాయును. దాసి జంగముని తన యింటి కాహ్వానించునపుడు పల్కిన పల్కులు తమిళమున నీవిధముగా నున్నవి.

పయ్య ఎన్ మనెక్కణ్ పోందు
పరి కలచ్చేడ పిందు
వెయ్యవల్ వినై అరత్తు - విడుక (విట సంగమసర్గ)

దయచేసి మాయింటికి వచ్చి మీ భుక్త శేషము నిచ్చి నా పాప పుణ్యముల బాపి నన్ననుగ్రహింపవలెనని దీని భావము. ఇట్లు తమిళ కావ్యమున పొడిగా చెప్పిన మాటలను ధూర్జటి కన్నడ పదములు వాడుచు తీన కావ్యమున పెక్కులి రన

వత్తరముగా చిత్రించినాడు. అతని కావ్యమునకు కొఱవేకూరుట కిదియు కారణమే.

సీ॥ బిజమాడు దేవర నిజకృపా దృష్టి జె
న్నారు నా యిల్లు బిడారు మీకు,
నాకు మీ పాదార్చనము సేయ నడ లింగ
మూర్తి! చేకుఱె వచ్చి మూర్తమాడు,
మొరయ! చిత్రేశ! నాయునికి నిమజ్జనం
బాడి శివార్చన మాడ వేకు,
విచ్చేయుడు విభూతి పిడియంబందుకో
జంగమస్వామి! నా సదనమునకు,
తే॥ నోగిరంబులు మంచి మేలోగిరములు
నావటించెద బదడు మీ రారగింప,
ప్రతిదినంబును జంగమార్చనము లేక
తనివు పడ నొల్ల విజిత కందర్ప" యనుడు (86 ప్ర.అ)

జంగమార్చనలేనిదే భుజింపని పరమ నైష్ఠికురాలు దాసి. ధూర్జటి ఈమె నీ విధముగా చిత్రించి 'విజితకందర్ప' యని సంబోధింప జేసెను. మాహాత్మ్యాలు, శివాదారైక శీలగ ధూర్జటి ఈమెను చిత్రించినాడు. ఆమె పిలువగా జంగముడు వదెంచినాడు. పిమ్మట తన కామ వాంఛను దీర్పుమని యడిగిన వట్టము తమిళ మందిట్లు గలదు.

కామన్ పోరినుక్కు- ఉడైందయాన్
నిన్ శిత్రదై మిలియ పింగుం
తికశముల్లై, అరజుం కారంద శత్రు
అంజా దెయు రుప్పు తరుడి యెల్ వరువల్ (విట సంగమసర్గ)

మన్మధునితో బోరాడిపోయిన నాకు శ్రద్ధమగు నీవే వరుమును ప్రసంగవీయుటచే దుర్గమున కాశ్రయ మిచ్చినటో వత్తునని దీని తాత్పర్యము. తెలుగు కావ్యమున ధూర్జటి ఈ విషయ మిట్లు చెప్పినాడు

అని "కాంతా! నీ యింటికి
జనుదెంచెద నీదు గుబ్బచను గొండ లిసుం
దున దెరు వెఱుగక తిరిగెడి
మనసున తెరువరికి దప్పి మాన్పం గలవే (87 పద్యం. ప్ర.అ.)

ఇక తెన్ కైలాయ సర్గ యను విభాగమున వశిష్ఠుని కథ చెప్పబడినది. పుత్ర శ్లోకముతో భృగు పాతమున కుద్యమించిన వశిష్ఠునకు భూదేవి తమిళ కావ్యమున ఉపదేశ మీ క్రింది విధముగా నిచ్చినదట.

మలై యిల్లేరిమన్ నీళ్ తరిన్
మాళు మొతంబం
కలై కురైంవవెణ్ మది ముడికదుక్కై అంకణ్ణి
తలైవనాన్ అరుళ్ పెరిదియెల్ తుంబముంతణప్పై
తాలైనిన్ ముక్తియుం పెరుకుల్ (తెన్ కైలాయి సర్గ)

కొండ మీంది దూకినంతనే కష్టము తీరదనియు శివుని యనుగ్రహము లభించిన కష్టము తీరి మోక్షము లభించునని దీని భావము. దీని భావమే యింత మించుగా ధూర్జటి యిట్లు వ్రాసెను. ఆ పద్యమిది.

శా॥ ఓ వెఱ్ఱీ! సుతులందఱుం దెగిన నయ్యో! దుఃఖివై యీ గతిన్
జావంబుట్టువుడీఱునే? మనములో సంసారమున్ రోసివన్
దేవోత్తంసుని పార్వతీరమణు భక్తిం గొల్వుమీ వేకుఱున్
జీవన్ముక్తి" యటంచు ధాత్రి యుపదేశింపం బ్రమోదంబునన్
(69. ప్ర.అ)

భూదేవి శివారాధన జేయుమని చెప్పుట ఇందలి విశేషము. చచ్చి సాధింప గలిగినదేమి లేదనియు, సంసారముపై అసహ్యము కలిగిన పరమేశ్వరుని సేవించిన యెడల జీవన్ముక్తి లభించునని యుపదేశించినది. ఇచట మోక్షమే ధ్యేయమై ధూర్జటి వైరాగ్యప్రవృత్తిగూడ వెల్లడి యగుచున్నది. ధూర్జటి ఈ ధోరణిలో వ్రాయుటలో చిన్న మార్పు చేకూర్చెను.

ఇంక పెరిశదలో గణారణ్యమున నెంకొనిన గరళకంఠుని సుఖనివాసమునకై యీ క్రింది వాస్తువిశేషములు నిర్మించినట్లు తమిళ కావ్యమున జెప్పబడినది.

మామదిలుం, గోపురముం, మండపముం
మాళిహైయుం, శోపిల్‌కరుప్పియర్‌తలం
కూళ్కైయుం (కలశం) ముదలాయకామర్‌తిరుక్కోయిల్
ఎలంకళిచ్చురుంబు విళయాడుం
శేమలర్‌తార్, అహన్‌మార్పుకైదదాల్
ఇరుందార్‌తినై, అకవేనుం
ఇకైప్పొలుపుకదిర్
పరిందు ఒళింద ఇదయెల్లాన్
పందు పోల్‌నూల్ ఇకైత్తు
వరం దినెదు నాళమవకువాద పయిలుంనాళ్
కురుంగల్ ఇలా అదన్ననృ
కోదిక్కుర్కు ఎంబెరుమాన్ (ధీకాళత్తిసర్గము)

దీని ననుసరించి ధూర్జటి యీపద్యములు వ్రాసినాడనిపించుచున్నది.

సీ॥ ప్రాకారములు, గోపురమ్ములు, కొలువు కూ
టములు, నర్తన మందిరములు, కోశ
గేహము, లుద్యానములు, కేళి నివాసంబు,
లంతః ప్రదక్షిణాయతనవీధి
యుపహార భోగమంటపము, గర్భగృహంబు,
పరిణయ హైమవైభవ నిశాంత,
మంతఃపురంబు, కక్ష్యాంతరంబులు, శాల
కంబులు మేడలు, గరుడతోర

గీ॥ ణిత ముత్యాలశాల చంద్రికల పంద
రీకలోచన మాతృకాలోకనయన
దక్షిణామూర్తి వటుకాదిదైవతముల
నిలయములు గట్టె వత్యంత నిష్ఠతోడ. (ద్వి. ఆ. ౧౧)

క॥ తీరుగ నీగతి నిండుట
తీరగ గట్టియును, గాలిద్రెవ్విన పోగుల్
జారిన పోగులు నదుకం
దీరుపనే కాని, నిలువదీరక, దినమున్ (ద్వి. ఆ. 98)

ఇక సాలెపురుగు తాను కట్టిన గోపురములన్నియు రోజూ చిందరవందర యగుట చూచి మిక్కిలిగా వాపోవుచున్నది. తమిళమున ఈ ఘట్టమిట్లు వర్ణితము.

అయిరంనాళ్ ఉడల్ వరుంది
వాయినాల్ వయిట్రు ఇరుందు
వళర్నుల్ పుళ్పంఇకై త్తు
తాయినాల్ అళిందదర్కొకై దేన్
ఇత్తిరుక్కోయిల్
తాయెనయాన్ తిరుఅరుళుంతమి
యేన్పాల్ ఇవ్వళవో (గాళత్తిసర్గము)

దీనిభావమిది : "నేను వేయిదినములు కష్టపడి అర్ధరాత్రులు నిదురలేక కడుపులో నుండి వచ్చిన నూలుతో నీగుడి చేసిన నది నిప్పులో బడి కాలిపోవుటకా తల్లివలె నుండు నా భగవంతున కసహాయుడనైన నాపై దయ ఇంతేనా!" దీనికి ధూర్జటి కవి చక్కని లోకోక్తులతో నీ విధముగా చిన్న పద్యము నందీభావము పొందు పరచెను.

క॥ "ఇది పెక్కేడులు పట్టెన్
సదనంబులు గట్ట నాకు కంటుని కొలకున్
'దుది గుమ్మరి కొక యేడును,
గుదికొక పెట్టన్న మాటకు న్సరి వచ్చెన్" (ద్వి.ఆ. 100 పద్యం)

ఇక తరువాత పేర్కొనదగినది కణ్ణప్ప కథ. ఈకథ తమిళమున శ్రీగాళత్తి పురాణమునందెట్లున్నదో తెలియదు. ఈకథ బసవపురాణమందు ఎట్లు గలదో

ఇతివృత్త పరిశీలనము యను రాబోవు ప్రకరణమున పేర్కొంటిని. ఇంక పెరియ పురాణకథకు ధూర్జటి కథకుగల భేదము లించుక పరిశీలింతము.

తమిళ వాఙ్మయమున పెరియ పురాణములో కణ్ణప్ప కథ 186 పద్యములలో చెప్పబడినది. కాని ధూర్జటి కావ్యమున ఈకథయంతయు 180 గద్య పద్యములలో చెప్పబడినది. తమిళమున వృత్తముపేరు ఆశిర్య విరుత్తము. ఇది మన చంపకమాల యిత్యాది వృత్తములవలెనే 4 పరసల వృత్తము. పెరియ పురాణమున కన్నప్ప తండ్రి పేరు నాగుడు. తల్లి తండె. తిన్నడు పుట్టుట విలువిద్యల నభ్యసించుట తమిళమున గూడ గలదు. తోటి బాలురతో ఆటకు పోయి, పందులతోను, పులిపిల్లలతోను ఆడుకొనెడివాడు. వీరు పులి వరమును చేతికి కంకణముగా ధరించెడివారట. నాగుడు పెద్దవాడగుచుండుట జేసి ఇంక వేటాడు ఓపికలేక ఆ బాధ్యతనంతయును కుమారున కప్పగించదలచి పల్లివా రందరకు నీవిషయ మెరిగించును. వారు సంతోషముతో తిన్నని రాజుగా నంగీక రింతురు. (తండె, నాగన్) వీరు సుబ్రహ్మణ్యస్వామి ఆరాధకులు. ఆదేవుని యను గ్రహముననే తండె గర్భవతియై తిన్నని ప్రసవించును. బలవంతుడుగా నుండుటచే వారా శిశువునకు తిన్నడని నామకరణ మొనరించిరి. ఇచట 'దేవరాట్టి' యనునామె ముసలిరూపమున ఆవహించినట్లు మాట్లాడును. తిన్నని విలువిద్యల నభ్యసించి వేటకు పంపుటకు ముందు నాగన్ 'దేవరాట్టి'ని తన కుమారునికి జయము కలుగునట్లు దీవింపుమని యడుగును. పులితోలుకట్టి ప్రధానిగా జేసి కత్తి చేపట్టించి తిన్నని వేటకు పంపెదరు. తిన్నడు పుట్టగనే కార్తికేయ స్వామి పూజలు గావించిరి. తరువాత ఆరవ సంవత్సరము వచ్చుసరికి మహావైభవముగా శస్త్రవిద్యాభ్యాసము చేయించిరి. తిన్ననికి పదునారేండ్ల వయస్సు వచ్చుసరికి నాగుడు వేటకు పంపును. తండ్రివెంట బయలుదేరును. కులాచారము ననుసరించి రాజైన వెంటనే కన్నె వేటకు బయలుదేరిపోయి యొక యేకలమును దరుముకొని రాగా కాళహస్తి సమీపమునకు వచ్చెను. నాణుడు, కాడడను నిరువురు మిత్రులు గూడ వాని ననుగమించిరి. కాడని ఒకచోట విడిచి నాణుని తీసికొని తిన్నడు కొండపైకి వెళ్ళెను. అచట శివుని దర్శించెను. కాడడు క్రింద నిప్పు చేయును. ఇచట విశేషమేమనగా తిన్నడు శివుని దర్శింపబోవుచున్నప్పుడు కొండ నతి వేగముగా ఎక్కగలిగినాడట. అదంతయు పరమేశ్వరుని కరుణయేయనియు,

ఏపని చేయుటకైన దైవబలం ముండవలయునన్న భావము చెప్పబడినది. అచట పూలదండలు పత్రి మున్నగునవి యెదుట చూచి నాణడు తిన్ననికి ఇంకొక బ్రాహ్మణ భక్తుడు (శివగోచరుడు) గలడనియు, అది అతని పూజయనియు చెప్పను. తిన్నడు లింగమును వదిలి రాలేక ఒకడుగు ముందుకు ఇంకొకడుగు వెనుకకు వేయుచుండును. పరమేశ్వరుడొంటిగా అచట నెందుకుండునో? ఆకలి వేయుచున్నదేమో? మాంసము పెట్టెదను. ఈభావము లాతనికి గలిగినవి. మిత్రుని వెంట నడుకుని తిన్నడెట్లో క్రిందికి రాగా కాడడు ఆలస్య మెందుకైనదని ప్రశ్నింపగా నాణడు "తిన్నడు శివుని వదిలి త్వరగా రాలేదని చెప్పను. తిన్నడు తాను స్వయముగా రుచిచూచిన వరాహ మాంస ఖండములను" శివున కర్పించెను. సిగలోని పువ్వులను కూడ సమర్పించెను. తిన్నని స్నేహితులు అతని రమ్మని బ్రతిమాలెదరు. అతడు శివుని సేవ చేయుటయందే మగ్నుడై అచటనే యుండెను. నాణుని కాడరు అడుగగా మిత్రుడైన తిన్నడు వారిని వదిలి దేవుని చుట్టమైనాడని 'దేవరాట్టి'ని తీసికుని వత్తుమాయని ఆలోచించెదరు. తిన్నడు మాత్రను దేవుని వదిలి రాలేదు. తిన్నడు పుక్కిటనీటితో శివుని వభిషేకించుట చెప్పగాలతో నా స్థలమంతయు శుభ్రము చేయుట యిత్యాది విషయములచే శృతి వ్యవహారేతర మార్గమున శివుని గొల్చుచు చివరకు ముక్తి నొందును.

ఇది పెరియ పురాణ కథ. ఇట్లున్న పెరియ పురాణ కథకును తెనుగు ప్రబంధము నందలి కథకును ఇంచుక భేదములు కన్పించుచున్నవి. మన ప్రబంధమునసుసరించి తిన్నని తండ్రి నాగుడు కాడు. నాథ నాధుడు. తల్లి పేరు రెండు కావ్యములందు నొక్కటియే. ఆ కిరాత దంపతులకు తిన్నడు సుబ్రహ్మణ్యస్వామి యారాధనమున జన్మింపలేదు. అతని తల్లియగు తండె శివానుగ్రహముననే గర్భవతియైనట్లు తెలుగు కావ్యమునందు చెప్పబడినది. ఈ సందర్భమున ధూర్జటి ఈ క్రింది పద్యము చెప్పెను.

క. తండెకు, మందస్మిత జిత
కుండకు, బ్రాజీశ్వరోప గూహన జనితా
నందకు, వచనామృత ని
ష్యందకు, నెల మసలె శైలజాధిపు కరుణన్

(శ్రీ.ఆ. 21)

శ్రీకాళహస్తి మాహాత్మ్యమున పెరియ పురాణమువలె తిన్నడు పుట్టగనే కార్తేని పూజలు జరుగలేదు. అతడు నవయౌవన శోభితుడైన పిమ్మటనే కార్తేని పూజ యొక మంగళవారము నాడు జరుగును. తిన్నడు కాళహస్తీశ్వరుని దర్శించుటకు నాణాడును మిత్రుడు ప్రేరకుడుగా దమిళ పురాణమున పేర్కొన బడినాడు. మన తెలుగు కావ్యమున వాని ప్రసక్తియే లేదు. తిన్నడు వేటకుబోవుటకు ముందు 'దేవరాట్టి' యను ముసలిదేవతచే తిన్నడు ఆశీర్వాదము పొందినట్లు చెప్పబడినది. తెలుగున అట్టిది లేదు. తిన్నడు నాకానితో కొండపైకి పోయినప్పుడు కాడదను మిత్రుడు నిప్పు చేయుట పిదప తిరిగివచ్చు సరికి మాంసఖండమును సిద్ధము జేయుటయు గలదు. మన తెలుగు కావ్యమున నిది గానరాదు. తిన్నడే స్వయముగా వరాహ ఖండములు కాల్చి రుచిచూచి శివున కర్పించును. ఈ మిత్రులిరువురు తెలుగు కావ్యమున లేరు. కొండలు బోయవారు మాత్రము కూడ వేటకు బయలు దేరిన వారు అతనిని ఉడుమూరికి రమ్మని ప్రతిమాలిరి. మిగిలిన కథాంశము లన్నియు ఇంచుమించు ఉభయ గ్రంథ సామాన్యములు.

ఇక నక్కీరుని కథ చూతము.

తమిళమున నక్కీరుడు (నక్కీరుడు) తృతీయ సంగమునకు సంబంధించిన వాడు. ఆ కాలమునందుగల కవులందరిలోను నక్కీరుడు ప్రథముడుగా జెప్పబడెను. ఇక శంక ఫలకము (సంగప్పలకై) గూర్చి చూచిన సంగ కాలమునకు సంబంధించిన ఏ కవియు శంఖ ఫలకమును గూర్చి చెప్పలేదు. శంఖ ఫలకము తరువాత కనుగొనబడినది మాత్రమే. ఇచట శంఖ ఫలకమును గూర్చి యించుక తెలిసికొనుట యప్రస్తుతము కానేరదు. నక్కీరుని కథలో శంఖ ఫలకమనియు, శంఖ పీఠికయనియు రెండు విధముల పేర్కొనబడినది. శ్రీసురవరం ప్రతాపరెడ్డిగారు "ఆంధ్రుల చరిత్ర సంస్కృతి"లోనే శంఖ ఫలక మును గూర్చి యిట్లు వ్రాసిరి "కవులు కూర్చొను స్థలమును శంఖ పీఠ యనిరి. ఇది తమిళ దేశాచారము. ఈ కవితాభిమానము వహించి నేడికి శంఖ పీఠిపై, నీ కవులున్నయట్లు వసియింపక దేవుని తోడ నేల దార్వాక మొనర్చితిన్ - ఇచట శంఖ పీఠి యననేమో? శబ్దరత్నాకరములోను శబ్దకల్పద్రుమములోను లేదు. "మదురాది తమిళ ప్రాంతములలో పూర్వము (సంఘము) అను కవుల పీఠము లుండెను. దానినే శంఖము చేసెను." (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ)

అందే రెండవ యనుబంధములో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారివిషయ మును గూర్చి వ్రాసిన వివర మిట్లు గలదు.[1] శంఖ ఫలకము అరవములో 'తంగప్పలకై' అనుదాని పరివర్తనము. మధురలోని ప్రాచీన ద్రావిడ 'సంఘ' సంప్రదాయములకు చేరినది. అరవ వ్రాత 'చంక' అనె యుండును కదా! తెలుగులో అది సంస్కృత వాసనతో 'శంఖ'గా మారినదేమో! ఈ మార్పు ధూర్జటి కాలమునకే వచ్చినదేమో! లేక ధూర్జటి కొన్ని స్వతంత్ర ప్రయోగములు చేసినట్లే యిది కూడ చేసినను చేయవచ్చును. అచ్చు వేయువారు అట్లు చేసినను చేసి యుండవచ్చును.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర ప్రథమ ముద్రణములో దీనిని గూర్చి యుంకను నిట్లు కలదు. "కవులు కూర్చొను వేదికమీద దేవతా విగ్రహము, శంఖము పెట్టి పూజించి నందున, వేదికపై శంఖమునుంచి నందునను శంఖ పీఠి యని దానికి పేరు వచ్చెను. తమిళ సాహిత్య సంప్రదాయముతో బరిచయ మున్నప్పుడు కాని యీ పదము యొక్క అర్థము పూర్తిగా బోధపడదు. తమిళ మున దీనికి 'సంగప్పలకై' అని పేరు. ఇదే కాళహస్తి మాహాత్మ్యమున శంఖ ఫలక మనియు, శంఖ పీఠి యనియు పేర్కొనబడెను. తమిళ సాహిత్యము నుండి నత్కీరుని కథను బరిగ్రహించిన ధూర్జటి యందలి 'సంగప్పలకై' యను పదము యొక్క యర్థము సంప్రదాయము పూర్తిగా నవగాహన కాకపోవుట చేతనో - సంగ ఫలకము అని పేర్కొనిన దెలుగు వారి కర్థము కాదనియో దానిని 'శంఖ ఫలక'మని పేర్కొనెనని తోచుచున్నది. సంగ పదమునకు బదులు 'శంఖ' పద ముండుటయే శ్రీ ప్రతాపరెడ్డిగారు పై విధమున దానిని వివరించుట కవకాశ మొసగినది. ఈ శంఖ ఫలకము పుట్టిన క్రమమంతయు కాళహస్తి మాహాత్మ్యమున చెప్పబడినది. పాండ్య రాజుల రాజధాని యగు మధురలో బూర్వము తమిళ కవి సంఘములు వర్ధిల్లుచుండినట్లు ప్రతీతి. ఆ సంఘములకు జెందిన కవులనేకులు తమిళమున గొప్ప కావ్యములు రచించిరట. ఇట్టి కవీశ్వరు లకు గూడలి స్థలమగుటచేతనే మధురకు 'కూడల్' అను పేరు గలిగెను. ఈ

1. భారతి 1960 నవంబరు, వ్యాసము - నత్కీరుని కథ - కొన్ని విశేష ములు - తిమ్మావజ్ఝుల కోదండరామయ్యగారు

క్రింది పద్యమున మధురకు నామాంతరమయిన 'కూడల్' పేర్కొనబడి యున్నది.

గీ॥ నిజ దృగబ్జ ప్రపూజిత నీలకంఠ
కూడల శమయ వైకుంఠ కుంఠితాఘ
నిఖిల సంపత్పరంపరానిహిత కింప
దానతాపంబు మధురాభిధానపురము (తృ. ఆ. 181)

తమిళ వాఙ్మయమున నిట్టి సంఘములు మూడు వర్ధిల్లినట్లు చెప్పబడు చున్నది. తొలి సంఘము, మధ్య సంఘము, కడసంఘము నని వాని పేర్లు. సమకాలిక కవుల గ్రంథములలోని యోగ్యతలను జర్చించి విలువ గట్టుట యీ సంఘముల యొక్క పని. అచ్చటి పొత్తామరకొలనులో సంగ ఫలక ముండెడిదట. ఆయా గ్రంథముల యోగ్యత నెఱుగుటకై యీ సంగకవులు వానిని 'సంగ పల' పైనుంచినపు డా గ్రంథము నీటిలో మునుగక నిలిచినచో సత్కావ్య మనియు, మునిగినచో నసత్కావ్యమనియు నిర్ణయించి తీర్పు చెప్పువారట! ఈ 'సంగ పలక' నే ధూర్జటి శంఖ ఫలకమని పేర్కొనెను.

ఈ కావ్యమునకు వ్యాఖ్యానము వ్రాసిన కాంచీపుర విద్వాంసుడు రామానంద యోగి జడధారిని శివునిగా భ్రమించెను. మన ధూర్జటి ప్రబంధమునందు మాత్రము అగస్త్యుడే శంఖఫలక మొసంగినట్లు పేర్కొనబడినది. తమిళ కావ్యమున 'శంఖ ఫలకము' నేరుగా జటాధారి నత్కీరునికే యిచ్చినట్లు చెప్పబడి యుండగా, ధూర్జటి మాత్రము పాండ్య ధాత్రీ కళత్రునకే దాని నిప్పించెను. అగస్త్యుని గూర్చి తెలిసికొనదగిన విషయమేమనగా తమిళమున 'తొలిక్కాప్పియమ్' యను గ్రంథ మును రచించిన తొలిక్కాప్పినార్ అగస్త్యుని శిష్యుడు. అగస్త్యుడు ద్రావిడ భాషకు అక్షరములు కల్పించెనని, భాషాభివృద్ధికి తోడ్పడెనని చెప్పుదురు. నక్కీ రుని కథా విషయమున మిగిలిన విషయము లన్నియు నుభయ గ్రంథ సామాన్య ములుగా గన్పట్టు చున్నవి. పాండ్యరాజునకు గలిగిన సందేహము తీర్చిన వారికి అతడు సిద్ధము చేయించిన బహుమతి అఱవకావ్యమున 'అయిరం పొక్కాసు' అనగా వేయి మాడలు, ధూర్జటి కావ్యమునందు కూడ ఈ వేయి మాడల ప్రసక్తి గలదు.

ఇక దుర్భిక్ష వర్ణనము కూడ నుభయ గ్రంథ సామాన్యము. దుష్టగ్రహ జనితమగు ప్రజా క్షోభ నంతను ధూర్జటి తమిళ కావ్యము చూచియే వర్ణించినాడని తోచును. ఈ విషయ వర్ణన యందే ధూర్జటి తమిళ కావ్యము కంటే కొంచెము తక్కువ జేసి దుర్భిక్షము కన్నులకు గట్టినట్లు వర్ణించినారు. ఈ కఱవు వర్ణన తమిళ ప్రబంధ మందీ విధముగా గలదు.

"కాలం అంకు అడల్ ఉరోణియల్
కరి యవన్ పుహుద"
(రోహిణిలో శని ప్రవేశించెను)
అలవెవ్వరవు అదు_త ఈర్ ఉన్వాడసం అళన్ను

(ఈ విషధరములైన రాహుకేతువులు అమావశ్య పూర్ణిమలలో నత్యుగ్రముగ)

కొలవెం కుదల్, తణ్ కుదర్
ఇరండుం వాయి క్కొళ్ళ
(సూర్య చంద్రులను మ్రింగిరి)
ఇళమైందను వెళ్ళి యుం
ఇహల్ పదనడం దార్
(కుజబుధులు వక్రముగా నడచిరి)

ధూర్జటి ఈ తమిళ పద్యము దృష్టియందిడికొని ఇంచుకమార్పులతో ఒక సీస పద్యము చెప్పినాడు. చూడు (కా।మా।తృ।ఆ. 148)

కఱవు బాధచే దురదృష్టవంతులగు ఆ దేశపు ప్రజలుపడినపాట్లు తమిళ కావ్యము నందీ విధముగా వర్ణితము.

నీడుం తిప్పశియాల్, కుదల్
కొళుంది యనిలత్తోర్
అడుం తింగలా అడపల తన్దనర్

నిలన్ అహాశిందు
వాడుం పల్వైప్పై కందముం తిన్నవర్
కాడుం కుష్టముంనెరంబినర్
శివ జనుకరుది (నక్కీరర్ సర్గము)

ఈ పద్యము కూడు ఆకలితో బాధపడుచు ప్రజలేమేమి తినుచున్నారో చెప్పబడినది. కంద మూలములు మొదలగునవి అడవి యందు లభించును గావున అవి తినుటకు ఆ ప్రాంతమునకు జనులు వలస పోయిరట. ఇంకను మేకలు మొదలగు జంతువులు కూడ తిననటువంటి ఆకులు అలములు మనుష్యులు తినుటకు సిద్ధపడిరి. క్షుద్బాధా పీడితులైన ప్రజలు పడుపాట్లీ విధముగా నున్నవని ఈ పద్య భావము. ధూర్జటి తెలుగు ప్రబంధమున ఇంజెట్లు, ఈతగుబ్బు కూడ తినుచున్నారని చెప్పినాడు.

ఆ పద్యమిది.

గీ॥ గునుకు లాదర్లు జరపటల్ గోళ్ళ గొందు
లల్లి బియ్యంబు వెదురు బియ్యంబు గొట్టె
చెట్లు నిండాట్లు తుంగముస్తియలు నీత
గుంజు మొదలుగ దిన దొరకొనియె జనము (151 తృ. ఆ.)

తమిళ కావ్యమున ఈ దుర్భిక్ష వర్ణనము సుదీర్ఘము. ఎంతటి కఠిన హృదయులైనను కరుగునట్లు ఈ వర్ణన గావింపబడినది. ఇంకొక పద్యము చాల హృదయ విదారకముగ జెప్పబడినది.

ఆ పద్యమిది

శిరువర్ కైయన తాయర్ కుం
పరిత్రవర్ శిక్తార్
మురువు తీప్పసి పొరు క్కలార్
మక్కళ్ ఉన్ మొదలా

ఉరు పశుంత శైయావయిం
    తిన్దనర్, ఉంతత్తు
అరై పశం కాలై, పుదిక్కినర్ మా
    నం మాణ్బు అట్రార్ (నక్కీరర్ సర్గము)

చిన్న పిల్లల చేతులలోని తినుబండారములను కన్నతల్లులు లాగుకొని తినిరట. అతిశయమగు వాకలి మంటలకు దాళలేక నరమాంసము తినుటకే మొదలిడిరి. మాన మర్యాదలు పూర్తిగా మర్చిపోయిరి. ధూర్జటి ఇచట వక్కాని జాతీయమును వాడి ఈ విధముగా చెప్పినాడు.

క॥ మానిసి, మానిసి దినుకఱ
వైనం దరియింప లేక, యా పురిమూల
స్థాన హరద్విజుడొక డెం
దేనియు బోదలచిన నమ్మ హేళుడు కరుణన్ (156. తృ అ)

ఇక మిగిలిన వర్ణన ఉభయసామాన్యములు.

తమిళమున నత్కీరుడు గాదు. నక్కీరుడుగా పేర్కొనబడెను. ఈ నత్కీరుడు ప్రథమ శతాబ్దమున నున్న వాడగుటచే 'తలై-యాలన్-కాన'మ్మను ప్రదేశమున సంగ్రామ జయమందిన పాండ్యరాజగు నెడుంజెలియనునకు సమకాలి కుడుగా భావింపబడుచున్నాడని పొంగూరి సూర్యనారాయణ శర్మగారు తమ "ధూర్జటి-నత్కీరుడు" యను ఆంధ్రపత్రిక వ్యాసమున (1958) పేర్కొనిరి. ఈ నత్కీరుని కథ చుట్టును ఎన్నో కథలున్నట్లు వారు పేర్కొనిరి. ప్రియురాలితో రసకేళిని సుఖించు పాండ్యరాజు నొద్దకు ప్రమాణతర్పణమగు నొక సౌరభవీచి వీతెంచెను. దాని ప్రభవహేతు వేమగునాయని యతడు పెద్దయంత్రొద్దు చింతిం చెను. ఏ కవియైనను సరే ఈ సమస్యను పరిష్కరించిన యెడల గొప్ప బహుమాన మిత్తునని ప్రకటించెను. ఆదే యూరిలో యొక శివాలయమున అర్చకుడుగా నున్న బ్రహ్మచారి పేదతర్మి (ధర్మి) యనువాడు పెండ్లికి తగిన విత్తము కావలసినవాడై ఈ సమాచారము వినెను. అంత శివునితో నీహార్త ఈవిధముగా విన్నవించుకొనెను. "నేను మాతాపితృహీనుండను, దరిద్రుండను, నీ భక్తుండను. నీవును సర్వజ్ఞం

దవు. రాజు మనోగత భావము నీకు దేటతెల్లమేగదా! నీవొక పద్యమున నాతని భావములు జెప్పినాకిచ్చిన నేనాపసదనము గ్రహించి సుఖినయ్యెద. అంతియగాక బ్రహ్మచారిగ నిన్ను పూజించుట కంటె గృహస్థుడనై పూజించుట యత్యుత్తమ మని భావించుచున్నాను. నాకాముల్లె లభించిన యెడల నీ ప్రసాదమున నొకయింటి వాడనగుదు అనుగ్రహింపవే యని ప్రార్థించెను. భక్తజనసులభుండగు నాథవాసీ పతి యాధర్మిని కృతార్థుం జేయదలపెట్టి ఈ క్రింది పద్యము వ్రాసెను.

"కొంగుదేర్ నాళ్కై అంఱై తుంది
కామంశెప్పాదు కఠందు మొళిమో
పైయిలి యదు కెళియనట్పిన్ మైదియల్
శెరియెయిట్రు అరివై కొందలిన్ నరియవుం
ఉళవోనీయరియుంబూవె"

పాండ్యరాజు తన ప్రియురాలి ధమ్మిల్లము నుండియే యాపరిమళ వీచిక వచ్చిన దను నాపద్య భావమునకు సంతోషించెను. సభయందున్న నక్కీరుడు మాత్రమది యెట్లు పొసగునని వివాద మొనరించెను. భక్తుని సమర్థించుట కొఱకప్పుడు పరమేశ్వరుడు వృద్ధ బ్రాహ్మణ రూపమున విచ్చేసెను. పాండిత్య గర్వముచే నక్కీరుడి సుమంతయు లొంగక నాయనతో వాదించెను. అంత పరమేశ్వరుడు మూడవకన్ను చూపెను. కవితాహంకారపీడితుడగు నక్కీరుని శపించెను. అటు పిదప నక్కీరుడు కాళహస్తి వాసియగు శివుని స్తోత్రము చేసి పరమేశ్వర ప్రసాదమున శాప విమోచనము నందెను. కాని మన ధూర్జటి కావ్యమున నీధర్మియను బ్రహ్మచారి ప్రసక్తిలేదు. కఱవుబాధ కోర్వలేక పేద బ్రాహ్మణ పూజారి శివుని పద్యము కొఱకు అడుగగా శివుడిచ్చుటయు జరిగినది. మిగిలిన దంతయు సమానముగనే 'తిరువళియాడల్' పురాణమందు కూడ పైవిధముగనే గలదు. ఇక హాలాస్య మాహాత్మ్యమున నక్కీరుని కథ ఎట్లున్నదో చూతము. ధర్మియనువాడు ఆ కథ యందు కూడ గలడు. పరమేశ్వరుడు శృంగార రసబంధురమగు శ్లోకము వ్రాసి పాండ్యరాజు సన్నిధికి పంపుటయు గలదు. ఆ శ్లోకమిది.

జనాసి పుష్పగంధాన్
భ్రమరత్వం బ్రూహితత్త్వతోమేఽద్య

దేవ్యాః కేశకలాపే
తుల్యోగంధే నకిం గంధః

పాండిత్యముచే ప్రకాశించు నక్కీరుడు ఈ శ్లోకమున దోషము చూపగా బరమేశ్వరుడే మారువేషముతో వచ్చి వాదులాడును. వితండ వాదమున నక్కీరుడు శాపగ్రస్తుడగును.

స్కాందపురాణాంతర్గతమైన హాలస్య మాహాత్మ్యమునే యనుసరించి శివలీలార్ణవమను నొక కావ్యమున ముగ్ధేందునిభమగు వక్రోక్తి విలాసమునకు ప్రసిద్ధుడగు నీలకంఠ దీక్షితుడు రచించెను. ఆ కావ్యమున నక్కీరుడు 'కీరకవి' యను నామముతో వ్యవహరింపబడెనట ఈ కీరకవికి తోడుగా గపిలాదులగు సత్కవులు మఱికొందఱుండిరి. కుకవుల యాగడములు భరింపలేక వారందరును మధురా పురమున నెలకొనియున్న సుందరేశునకు దమ యవస్థలను విన్నవించుకొనిరి. వారి ప్రార్థనలకు బ్రసన్నుడై యాతడు కుకవుల కప్రధృష్యమగు సంఘ ఫలకము నిచ్చి యనుగ్రహించెను.

దిష్టాపితః కవివరైరితి సుందరేశః
స్మిత్వాదదే ఫలకమేక మదృష్ట పూర్వమ్
యత్రాసతే కవయ ఏవయథాఖిలాష
మన్యేతు నాంఘ్రిమపి విన్యసి తుంక్షమస్తే
(శివలీలార్ణవము 20వ సర్గ 24శ్లోకము)

పరంజ్యోతి మునివరుడు 'తిరువళ్యాడల్' పురాణములో నీకథను సంపూర్ణముగా వర్ణించినట్లు తమిళ వాఙ్మయము వలన తెలియు చున్నది. [1]ఇది క్రీ. పూ 200 ఏండ్లకు ముందే చివరి సంఘకాల సంభవమని తెలియుచున్నది. పాండ్యరాజగు వంగియ చూడామణి కుమారుడొక యపూర్వోద్యానమును నిర్మింపజేసెను. అయ్యది దేవేంద్రోద్యానమును బోలియున్నదట. దానికే నందనోద్యానమని పేరిడెను. అతని

1. ఆంధ్రపత్రిక దినపత్రిక, నక్కీరుడు-ధూర్జటి; వ్యాసము శ్రీ పొంగూరి సూర్యనారాయణ శర్మ గారు.

వంశీయుడు "చంపకుమారుడు" ప్రియురాలితో గూడియందొకనాడు విహరింప జేసెను. వనవిహారముచే శ్రమజెంది విశ్రమార్థమై యొక శిలాఫలకమున గూర్చుం డగా దివ్యసుమగంధము ఘ్రాణ తర్పణ మొనర్ప నారాజు అద్భుత రసాక్రాం తుడై యిచ్చోట పుష్పంబులా తరులు, గానము, ఈ సువాసన, ఎట్లున్నది? ఇది నా ప్రియురాలి జటాబంధము నుండియే యేతెంచెనని యూహించి పురికేగెను. మఱు నాడు సభలో తన మనంబున నున్న భావంబును ఛందోబద్ధముగా జెప్ప నా మహా కవికి వేయి బంగారు నాణెముల నొసంగుదునని ప్రకటించి సభామంటపమున ముల్లెను గట్టించెను. ఆస్థాన కవులు తమచేతకామికి చింతించి యూరకుందురు. ఇది ఇట్లుండగా ధర్మియను దరిద్ర బ్రహ్మచారి ఆ వార్తను వినుట, పద్యము వ్రాయించుకొని పోవుట ఈ వృత్తాంత మంతయు పైన పేర్కొంటిని. ఈ కవిత్వము చెప్పిన వేయి మాడలిత్తునని యాతడు ప్రకటించెనను వృత్తాంతము శివలీలార్ణవ మున శ్లోకమందిట్లు గలదు.

మనోగతం మేకవయత్వ వేత్యయః
స ఏతదగ్ర్యంలభతాం సుధీ౨తి
అలంబయద్ద్వారి సువర్ణ ముద్రికా
సహస్రమా బధ్య సపాంద్య భూపతిః

(శివలీలార్ణవము 20 సర్గ 48శ్లో[1])

కవీశ్వరులు బహుమానాపేక్షతో వచ్చిరిగాని కవిత్వము వ్రాసిన వారులేకుండిరి. ఆ సమయమున నాదిశైవునగు నొకవటుడు దానక్రియార్థమై తరుణేందు శేఖరుని ధనము వేడగా శృంగార రసానపద్యమగు 'జనాసిపుష్పగంధా' మ్మను శ్లోకము నా మహాదేవుడు రచించి యిచ్చి పాండ్యభూనాధుని యాస్థానమునకు పంపెను. రాజాస్థానమున హృద్యమగు నా శ్లోకమును జదివి యా శివద్విజుడు బహుమాన మును గ్రహింపబోవ వసహమానుడై కీరకవి 'అపరిష్కృతే ప్రసూనైరస్తుచేట పికి మసజ్మతే గంధః కింబింతితమననిభృలాకింద్రృష్టం ధీమణా భవతా ?' యని యధిక్షేపించి బరవిద్యాధీనుడగు నా బ్రాహ్మణ బ్రహ్మచారి యప్రతిభుడయ్యెను. ఇచట భక్తునియవస్థ నెఱింగి పరమేశ్వరుడే కవివేషమున నాయాస్థానమున నావిర్భ వించి 'కళ్యంకితోఒప్యుపాదిః శ్రమతే కబరీ పరిమళేగౌర్యాః ' యని ధీరవచన

ముల నా కీరకవిని జయించి దీనుడగు నా బటునకు దీనారముల నిప్పించెను. ఈ సంఘటనానంతర మీశ్వరుడు పాండ్యరాజు నాస్థానమును విడిచిపెట్టక నదే కవి వేషమున సంఘ ఫలకమున మిగిలిన కవులతో బాటు తానును గొన్నినాళ్ళధివసించి కాలక్షేపము చేయుచుండెను. ఒకనాడు మరల కీరకవితో వాదమేర్పడగవి వేషధారియగు నా మహాదేవుడతనికి పంచవక్త్రమును ద్రిలోచనమునగు నిజరూపమును జూపెను. అప్పటికిని గీరకవి యహంకారమును విడువక నాదిదేవునితో వితండవాద మొనరించెను. తత్పాపతాపితుడైన యతడు సువర్ణపయోజినీ జలముల బడి దేహవ్యథను బాపుకొనెను.

> శివాతివాద ప్రభవేన పాప్మనా
> సతాపితో దుర్విషహేణ దుర్మతిః
> పపాత గాంగేయ పయోజినీ జలే
> తదేవ జానన్న శివజ్యభేషజమ్ (శివలీలార్ణవము 20 సర్గ 62శ్లో)

అనంతరము పశ్చాత్తాప తప్తుడై నీ పాటవి నన్నిహితుడగు నీలలోహితుని బహువిధముల స్తుతించి యాయన ప్రసాదమునకు పాత్రుడై తరించెను. ఈ కథ హాలస్య మాహాత్మ్య మాధారముగా రచింపబడెను. ధూర్జటి కథకును ఈ కథకును కొన్ని సామ్యములున్నవి. కాని పెక్కుచోట్ల భేదములే ఎక్కువగా కన్పట్టుచున్నవి. నీలకంఠదీక్షితుని కృతిలో చెప్పబడినవాడు కీరకవి. మన ధూర్జటి కావ్యమున నక్కీరుడుగా పేర్కొనబడెను. ఇంక శంఖఫలకమును శివుడే యిచ్చినట్లందు గలదు. ధూర్జటి కావ్యమున అగస్త్యుడిచ్చినట్లు గలదు. అందు దారక్రియార్థమై శివద్విజుడు వేడుకొన్నట్లుండగా నీ ప్రబంధమునందు దుర్భిక్ష పీడితుడగు మూలస్థాన హరద్విజుడొకడు వేడుకొన్నట్లు గలదు.

అచట పరమేశ్వరునితో వితండవాద మొనరించిన నక్కీరుడు పాప ఫలితముగా దేహతాపము పొందుట, హేమపయోజినీ జలముల మునిగి బాధ బాపుకొనెనని గలదు. ధూర్జటి కావ్యములో నక్కీరుడు గుహ్యవ్యాధి పీడితుడై బాధలు పడి తీర్థయాత్రలొనర్చి తుదకు సుబ్రహ్మణ్యస్వామి మూలమున రాక్షసుని బారి నుండి రక్షింపబడి ఒక సరోవరమున మునిగి దక్షిణ కైలాసమగు కాళహస్తిని

దర్శించి రోగ విముక్తుడగును. అంత నూరు పద్యముల పరమేశ్వరుని స్తుతించి ముక్తినొందెను.

తమిళ గ్రంథమగు పెరియ పురాణమున నక్కీరుడు కవితాభిమానముతో శివునితో వాదించుటయును మట్టము తెలుగునందు వలెనే గలదు. ఆ సందర్భమున నక్కీరుడు 'తల్లిచుట్టు వారకన్నులున్నను తప్పు తప్పే' యనును. ఇది సరిగ్గా తమిళ కావ్యమున కనువాదమని చెప్పనగును. ఇన్ని కథలలో నక్కీరుని కథ చాలా ప్రసిద్ధి పొందినది. కారణము తమిళ వాఙ్మయమునుండి గ్రహించుట, తదుపరి ధూర్జటి కవితా వైభవముచే రమణీయముగా చిత్రించుట కావచ్చును. దుర్భిక్ష వర్ణన ధూర్జటి తెలుగు కావ్యమున అత్యద్భుతముగా జేసినాడు. ఆకాశమండలమున నక్షత్రములు తారలు, వాటి వాటి పరిస్థితి కరువుకాటకము రాగల సూచనలు ఇందు అద్భుతముగా వర్ణితములు.

ఈ కథలన్నియు పరిశీలింపగా ధూర్జటి కథతో పోలికలు యుండుక భేదములు కన్పించుచున్నదిగాని ధూర్జటి పూర్తిగా వాటినే యనుసరించెనని చెప్పవీలు లేదు. కాని తమిళ వాఙ్మయమునుండి ధూర్జటి కొంత భాగము గ్రహించెనని కవితా పాండిత్యముచే కావ్యమును రసవంతము గావించెనని తోచుచున్నది.

ఇక చతుర్థాశ్వాసమున గల గణికా పుత్రికల కథలో కూడ సాదృశ్యము పెక్కు సన్నివేశములలో గానవచ్చుచున్నది. మాణిక్యవల్లి మధురాపురనివాసి. ఆమెకు ఇరువురు కుమార్తెలు గలరు. ఆమె తన కుమారికలకు తన కులవృత్తి ధర్మము లెస్సగా పట్టుబడవలెనని శృంగార ప్రబోధకములగు పెక్కుచిత్ర పటముల నిలయభిత్తికపై ప్రేలాడదీయించిన విధానము తమిళ కావ్యమందినట్లున్నది.

అణ్ణల్ ఇకరై అంద్ ప్రకకుశిల
పెణ్ణిన్ నల్లవర్ సెయినలై మేళలై
వణ్ణమెన్ తుహిల్ మానం కళను అరుళ్
పణిగ ఎన్ను వణి భవ రాహవుం
కలైన్ వరిందుడు కణ్ణిన్ మనిచ్చినై
తలైయి వర్పన్ ఉరతయ్యలర్ గుయ్యినుం

అల్లై ఇనుంత మదు అట్టుం మరెయిత్తు ఉళ
నిశై తళరున్దు అవళ్ నిర్పవర్ అహనం
ఓని యంగళ్ ఉళిర్ మణిమాళిప్పై
మేవురుంబడి తాన్వరై విత్తవళ్

ఇదే పద్యము ననుసరించి ధూర్జటి తన కావ్యముకందీవిధముగా వ్రాసెను.

సీ॥ రతి వధూమదనులు, రంభా కుబేరపు
        త్రకు, లూర్వశీపురూరవులు, మేన
కా కౌశికులు, గోపికా ముకుందులు, ధాన్య
        మాలినీ రావణుల్, మత్స్యలోచ
నర్ష్యశృంగులు, దాశవతినేత్రపరా
        శరులు, తారానిశాకరులు, గౌత
మాంగనాదేవేంద్రు, లమర వేశ్యాజయం
        తులు, ద్రౌపదీ పాండవులు, పృథార్క
గీ॥ హితులు, నడచిన గతులాత్మ సతలఁబెంచు
నింటిగోడల వ్రాయించు నిందువదన,
వనితలకు సరసత కల్మివావివరుస
లేమియును లేమి వారల కెఱుకపఱుప (చ. ఆ. 14)

ఈ బాలికలు చిన్ననాటినుండియు శివుని మీద భక్తి గలవారై తమ కుల వృత్తి నించుకేనియు పట్టించుకొనెడివారుకారు శివునితోడిదే లోకమని తల్లి ఎన్ని చెప్పిన వినక తమయిష్టదైవమగు శివుని గూర్చియే ఆలోచించసాగిరి. అటువంటి కుమార్తెలను మాణిక్యవల్లి ఈ విధముగా మందలించినదట.

ఎణ్ణువళల్ పీర్, ముత్తై మళ్ ఎణ్ణు
పెరుపీర్, నీం
ఎణ్ణుపయిల్ పీర్, కళై మళ్
ఎణ్ణుఇళమ్మళ్ కర్పీర్
ఎణ్ణు ఉదవుపీర్

ఎనయిరుందుకవల్ వృ దేర్కు
ఎన్నుఉదవులీర్ - ఉదవి
యివ్వేళవదేవెలు.

మదనాగములను వీరెన్నడు నేర్తురో! సంగీతమెన్నడు నేర్తురో! ఎన్నడు నాకు సహాయము చేయుదురో! మీరు చేయు నుపకారమిదియేనా ! యని దీని భావము. ధూర్జటి దీనినెట్లనుకరించెనో చూతము.

ఉ॥ ఎన్నడు నేర్తురో నడువ? నెన్నడు నేర్తురో మాటలాడగా ?
ఎన్నడు నేర్తురో చదువ ? నెన్నడు నేర్తురో యాడపాడగా ?
నెన్నడు నేర్తురో కళల నింపుదలిర్ప విటాళిగూడగా
గన్నియ ? లంచు బెంచిన సుఖంబిటు సేయగ మీకు వాడియే ?

(చ.ఆ.26)

మణిమంత్రముల ప్రయోగమున విటుల నాకర్షించుకొని వశంవదుల గావించుకొని, తద్ద్వారమున ధనము సంపాదించుకొని ఋషులకు దానధర్మముల జేయవచ్చును. ఆవిధముగా శివారాధనము కూడ చేయవచ్చునని తమిళ కావ్యమున మాణిక్యవల్లి కుమారికల నెట్టైన తన మార్గమునకు ద్రిప్పుకొనవలయునని యిట్లు పల్కుచున్నది.

మందిరం మరుందుమణి
మన్త్రుం ఉళవాయ
ఎందిరం ఎనప్పుదుంఇవత్రుళం
అరుత్తు
మైందర్ పొరుల్ వన్విల్ వరుం
మాదవర్ తనుక్కుం
తన్ది అవర్ అదై యర్ తమక్కుం
ఉరవాదో

తల్లి చేసిన ఈయుపదేశమునకు కుమారికలిట్లు ప్రత్యుత్తరమిచ్చిరి. ఆ పద్యమిది.

ఆయిరంకలన్ ఉరుంబునెత్తుం తాంగినుం ఉతుంత
మాఝరుం పౌరయాల్ వరువుదు ఉందుకాల్పనె
నాయకన్ విళమణి (రుద్రాక్ష) ఐన్తుఐర్‌నాళవుడన్
పేయణిందిడిల్, విన్నై మావుంపేయమే

తమిళ కావ్యమునందలి యీభావము ననుసరించియే ధూర్జటికవి గణికాయుగళ ముఖమున నిట్లు పల్కించినాడు.

మ॥ మణిమంత్రౌషధ శక్తిచే విటులఁ బ్రేమగ్రస్తులంజేసి, త
న్మణి భూషాదులు పుచ్చుకోఁగలుపదమ్మ ! బుద్ధి రుద్రాక్షమే
మణి, పంచాక్షరిమంత్ర, మౌషధము భస్మం, బాత్మనాథుండు ద
క్షిణ కైలాసవిభుండు, భక్తిదమకున్ శ్రీవార మింకేటికిన్. (౪.ఆ.౮౮)

తమిళ కృతినుండి యిటువంటి యనుసరణలెన్నో కన్పించుచున్నవి గనుక ధూర్జటి కావ్యమునకు తమిళముననే సరియైన మాతృకగలదని తోచుచున్నది. మిగిలినచోట్ల కూడ నీకథలు కన్పట్టినను, వరుసగ ఈ నాల్గు కథలు వీనికి మాతృకలనదగిన పద్యములు తమిళమునే గన్పట్టినవి గనుక ధూర్జటి కావ్యమునకు తమిళ కృతియే మాతృకయని స్పష్టమగుచున్నది.

ఏడవ ప్రకరణము

శ్రీకాళహస్తి మాహాత్మ్యము

ఇతివృత్త పరిశీలనము

శ్రీకాళహస్తి మాహాత్మ్యము యొక్క ఇతివృత్తము పరిశీలించుటకు ముందు ఇది ప్రబంధమెట్లైనది యను సంశయము నిచట పరిశీలింపవలసి యున్నది. రాయల కాలములో ప్రబంధములు విరివిగా వెలయించుచుండగనే శ్రీకాళహస్తి మాహాత్మ్యమును రచింపబడెను. మనుచరిత్ర ప్రథమాంధ్ర ప్రబంధ గౌరవమును పొందెనను విషయమెల్లరకును విదితమే. క్షేత్ర మాహాత్మ్యమయ్యును కాళహస్తి మాహాత్మ్యము వర్ణనలతో కూడియుండుటవలన ప్రబంధ లక్షణములు కాన్పించుట వలన ప్రబంధమని చెప్పనొప్పును. ఇందుగల వర్ణనా వైవిధ్యమే యిందులకు సాక్ష్యము.

శ్రీవిద్యానిధియై మహామహిమచే జెన్నై వసిష్ఠాజలూ
తా వాతాశన సామజాటవిక గోత్రాదేవ నత్కీరలా
జీవాక్షీయుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా
ర్యావామాంగము దివ్యలింగము మదీయాభీష్టముల్ప్రోచెడున్.

(కా.మా. 1 పద్యం)

ఇది ధూర్జటి కావ్యమున మొట్టమొదటి పద్యము. ఇందు మంగళాచరణమే గాక కావ్యకథా సూచన కూడ చేసినాడు. ఈ కావ్యమందు వశిష్ఠుడు, అజుడు, లూత, వాతాశనము, సామజము, ఆటవికుడు, గోత్రాదేవుడు, నత్కీరుడు, రాజీవాక్షీ యుగము, యాదవాధిపుడు అనువారందరును పరమేశ్వర సాక్షాత్కారమును తదైక్యమును పొందుట వర్ణింపబడినది. అందుచేతనే "వశిష్ఠాజలూతా వాతాశన

సామజాటవిక గోత్రాదేవ నత్కర రాజీవాక్షియుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యార్యావామాంగము దివ్యలింగము మదీయాభీష్టముల్ సల్పెడిన్" అని నాడు. కథాసూచన ఈవిధముగా జేసి ఇంకను చంద్రోదయవర్ణన, సూర్యాస్తమయ వర్ణన, పురవర్ణన, శైలవర్ణన, మొదలగు ప్రబంధ వర్ణనలన్నియు ఆయాపట్టుల ధూర్జటి గావించెను. అందుచే నిది ప్రబంధమైనది. ఇచట గమనింపవలసిన విషయమొకటి గలదు. ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యమును ప్రబంధమనలేదు. మాహాత్మ్యమని పేరు పెట్టినాడు. ఎందుకనగ శివునియొక్క మహిమలను గుర్తించి ఆరాధించుటయే భక్తి. ఈభక్తియే ముక్తిగా పేర్కొనబడినది. ఇది కేవలము శివునియొక్క మహిమలు గుర్తించు గ్రంథము గావున మాహాత్మ్యమని పేరు పెట్టి యుండును.

శ్రీ-సాలెపురుగు, కాళ-నాగము, హస్తి-ఏనుగు ఈ మూడింటిచే శివుని మహిమ గుర్తించబడినది. అందుచే శ్రీకాళహస్తి మాహాత్మ్యమైనది వేర్వేరు కథలనేకములు ఈకావ్యమున చెప్పబడినను కవి ప్రత్యేకముగా మూడింటిని గూర్చి చెప్పెను. ఇందుగల విశేషమేమన మానవులయందు భక్తి ఎట్టిదైనను సహజమే. కాని "తిర్యక్కులలో కూడ శివభక్తి కలదుసుమా" అని ధూర్జటి ప్రత్యేకముగా ఈకథద్వారా వ్యక్తపరచినాడు. ఇంకొక విశేష మీ గ్రంథమున ఏమన జంగమారాధన. ధూర్జటి జంగముని సాక్షాత్తూ శివునిగా చిత్రించెను. ఇతర శైవ మతస్థులందరు ఆచార్యునిగూర్చి చెప్పిరి గాని జంగమును గూర్చి చెప్పలేదు. [1]మరియు నీకావ్యమున ఆశ్వాసాంత గద్యమిట్లు గలదు. "ఇది శ్రీమత్కాళహస్తీశ్వర చరణ కమల సేవాపరాయణ సింగమ రమానారాయణ, జక్కయ నారాయణ తనూభవ భవపరాఙ్ముఖ ధూర్జటి కవి ప్రణీతంబైన శ్రీకాళహస్తి మాహాత్మ్యంబను మహాప్రబంధంబునందు" ఇది ప్రబంధము కాదనుచు విన్నకోట మాధవరావుగారు చెప్పిన అంశమును పోణంగి శ్రీరామ అప్పారావుగారు తమ గ్రంథాదిని పీఠికలో నీవిధముగా వ్రాసిరి.

"వెంకట్రామా అండ్ కో వారు ప్రకటించిన తొలి ముద్రణమున ప్రథమ తృతీయాశ్వాసాంత గద్యము లొక విధముగాను, ద్వితీయ చతుర్థాశ్వాస గద్యములు

1. శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు, పీఠిక, కాళహస్తి మాహాత్మ్యము.

వేర్వేరు విధములుగా నున్నవి (ద్వితీయ చతుర్థాశ్వాసాంత గద్యములో 'సింగము రమానారాయణ' అనునది లేదు. చతుర్థాశ్వాసాంత గద్యములో 'మహాప్రబంధమునందు' అని అధికముగా గలదు. ఈ భేదములను పురస్కరించుకొని 'ఈ గద్యములు ధూర్జటి వ్రాయలేదని వారి మతము' ధూర్జటి తన కృతిని ప్రబంధముగా భావించి యుండడు. ఈ కావ్యమునందు మహాప్రబంధ లక్షణములన్నియు పూర్తిగా నున్నవనజాలదు. మాహాత్మ్యమును, మాహాత్మ్యముగనే స్వీకరించి, గౌరవించుటయే సమంజసము సరసము అని విన్నకోట మాధవరావుగారభిప్రాయపడిరి. గద్యములలోని ఈ భేదములు కొత్తపల్లివారి ముద్రణమునందు కన్పట్టుట లేదు. అందలి చతుర్థాశ్వాసాంత గద్యములలో కూడ 'మహాప్రబంధంబునందు' అని యున్నది. వెంకట్రామ అండ్ కో వారి తొలి ముద్రణములో ప్రమాదపతితములైన ఈ భేదములు వారిమలి ముద్రణములో సంస్కరింపబడినవి. కావున ఈ భేదములు పరిగణింపదగినవి కావు. ఇంక ధూర్జటి తన కృతిని ప్రబంధముగా భావించి యుండడనుటయు సమంజసము, సరసమును కాజాలదు. ఏలయన ధూర్జటియే కృత్యవతరణికలో నాయొనర్పంబూనిన 'శ్రీమత్కాళహస్తి మాహాత్మ్యంబను మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము 16 పద్యమున తన కృతిని మహాప్రబంధముగా చెప్పుకొనెను. ఇంతకుముందరివగు నృసింహపురాణ, భీమేశ్వర పురాణములు కూడ ప్రబంధములుగానే వ్యవహృతములై యట్లే పరిగణింపబడుచున్నవి కావున ఈ కాళహస్తి మాహాత్మ్యము కూడ ప్రబంధముగనే స్వీకరించుటలో సంశయమునకు అవకాశము లేదు ఇందు ప్రబంధ వర్ణనలను పోలిన వర్ణన లెన్నియో ఆయా ఘట్టముల మనము చూడవచ్చును. అందుచే ప్రబంధ మనుట కెట్టి సందియమును లేదనియే నా అభిప్రాయము. ఇటువంటి ప్రబంధములలో సాధారణముగా వస్త్వైక్యము కన్పడదు. హరవిలాసమువంటి కావ్యములవలెనే ఏ కథ కాకథయే ఒక ప్రత్యేకతను కలిగియుండును. ఇట శ్రీకాళహస్తి మాహాత్మ్యమున శివభక్తి కథ లన్నిటికిని ఏకసూత్రత ఘటించుచున్నది. ఈ కథ లన్నింటిని జంగమ స్వరూపుడగు సాక్షాదీశ్వరుడే యాదవ భూపాలునకు స్వయముగా చెప్పినాడు. కృష్ణదేవరాయలు తాను రచించిన ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తునికథ, గోదాదేవికథ, పాండ్యరాజుకథ, ఖాండిక్యకేశిధ్వజ సంవాదము, మాలదాసరి కథ మొదలగు వానిని రచించెను. ఈ కథలన్నియు వైష్ణవాధిక్యతను వెల్లడించునట్టివే. ఆ ఖునను రాయలు దానిని మహాప్రబంధమని

పేర్కొనెను. అట్లే ధూర్జటి కూడా చెప్పెను. ధూర్జటి వస్తైక్యమునకు భంగము రాకుండ కాపాడినాడు. శ్రీకాళహస్తిపురముతో బాటు పొత్తపినాటిలోని విపిన భూమి కూడ ఇందు వర్ణితము. ప్రథమాశ్వాసమునందలి 62 పద్యము రెండవ చరణమునుండి కావ్యాంతమునరకునుగల కథలు ఈశ్వరుడు చెప్పినవే.

మ॥ అగుగాకంచు ప్రపంచ భర్త యనుకంపాలింగితస్వాంతుడై
జగతీనాథుని తోడ నిట్లనియె, దచ్చారిత్ర మాలింప నిం
పగు నేనిన్వను, మన్మహత్త్వము పురాణాబ్ధిన్మథింపంగబా
ర్ణ గతింబుట్టిన మోక్ష లక్ష్మికి విహార స్థానమై యొప్పగున్

(ప్ర ఆ 62)

కావువనే ధూర్జటి ద్వితీయ-తృతీయ, చతుర్థాశ్వాస ప్రారంభము లందిట్లు చెప్ప కొనినాడు.

ఆ. "అవధరింపు డిట్లు భవదీయ కథ విన్న
వింతు భక్తజనుల వీనులలర
మీరు యాదవునకు గారుణ్య పూరి
తేక్షణముల నానతిచ్చినట్లు (2)

శైవ భక్తునకు సర్వస్వము ఈశ్వరుడే కావున ఆ శైవసాంప్రదాయము ననుసరించియే ఈతడు స్వీయవంశ వర్ణన కావింపలేదని తోచును. ఇందు ఐదు పద్యములు షష్ఠ్యంతములు మాత్రము గలవు. ఈ ఐదింటను కూడ 'కాళహస్తిశునకున్' అనునదియే మకుటముగా వచ్చుట గమనింపవలసిన విశేషము. ఉదాహరణ కొకటి చూతము.

ఏతక్కల్యాణ గుణో
పేతున, కఖిల ప్రపంచ భిన్నా భిన్న
జ్యోతికిని, నాదబిందు క
ళాతీ తేశునకు, గాళహస్తీశునకున్ (ప్ర.ఆ. షష్ఠ్యంతములు 11)

ఇట్లే తక్కిన పద్యముల మకుటము కూడ గలదు. ఈ పద్యమునందు అద్వైత భావము కూడ గోచరమగుచున్నది. సాధారణముగా ఆశ్వాసాంతములందు పద్య రచన నియతముగా నుండును. కాని ధూర్జటి నాల్గు ఆశ్వాసముల అంతములందును వరుసగా శార్దూల - కంద - పంచ చామరములను వాడియుండుట మరియొక విశేషము. ముందు చెప్పినట్లు ఆశ్వాసాంత గద్య కొన్ని కొన్ని ప్రతులలో భిన్నముగా కనబ్బటినట్లు గలదు. కాని ఆశ్వాసాంతము ఎప్పుడు ఒకే విధముగా నుండుట సర్వసామాన్య విషయము. అందుచే అది కేవలము లేఖక ప్రమాదమని భావించవలెను గాని భిన్నముగా నుండుట తగదనియే నా అభిప్రాయము. మొదటి పద్యమున కథ లన్నిటికిని తెలిపెనని మూదే పేర్కొంటిని. తర్వాత ప్రథమా శ్వాసమునందే శ్రీకాళహస్తిపుర వర్ణన గావించునప్పుడు మరల కొంత కథా సూచన చేయబడినది. ఆ పద్యమిది.

మ॥ జన లోకోన్నతమైన తత్పురము దూదా తప్పకుండంగ వ
ర్ణన సేయన్ వశమౌనె ? కీటమునకైనం, జక్రికైన, న్మదాం
ధునకైనన్, బహు జీవ హంతకయినన్, దుర్వాసనల్ బాసి మో
క్షనిధింగొల్ల గొనంగ వచ్చునట, పై జాడన్విలోకించినన్
(ప్ర. ఆ. 20)

ఇందు మోక్ష మార్గము సూచితము. ఇట్లే తక్కిన ఆశ్వాసాది పద్యములలో కూడ కథా సూచన చేయబడినది. ద్వితీయాశ్వాస ప్రారంభ పద్య మిట్లున్నది.

శ్రీకుండాచల మారుత
రేఖా స్పర్శాది విషయ లీలా కృద్వి
ద్యాబని ! మునిజన కల్పక
శాఖీ ! శ్రీకాళహస్తి సదన ! మహేశా ! (ద్వి. ఆ. 1)

ఇందు 'విద్యాబని'యనుటలో బ్రహ్మ 'మునిజనకల్ప' యనుటలో బ్రహ్మపుత్రుడు బుధుపు 'శ్రీకాళహస్తి సదన' అనుటలో శ్రీకాళ-హస్తులు సూచితములు. అనగా ద్వితీయాశ్వాసములో వీరి కథలే చెప్పబడినవి. ఇట్లే తృతీయాశ్వాస ప్రారంభ

మున తిన్ననికథ, నత్కీరునికథ, చతుర్థాశ్వాస ప్రారంభమున వేశ్యాతనయుల కథ సూచితములైనవి. వశిష్ఠుని అగస్త్యుని (బ్రహ్మర్షుల) కథలను విన్న పిమ్మట, ప్రథమాశ్వాసాంతమున వీరనరసింహ యాదవుడు భర్గునకుం గ్రమ్మఱ మ్రొక్కి "భక్తనిధీ! నాకుం జెప్పవే విశ్వనాథుని యారాధనసేసి యగ్గిరిని జంతుశ్రేణిలో మున్నుగోరిన యర్థంబులు గాంచి రెవ్వ"రని ప్రశ్నించినాడు. ప్రథమాశ్వాసము 161 పద్యమం దీవిషయము సూచితము. ఆ పద్యమిది.

మ॥ అనగా వీరనృసింహ యాదవుడు, మాయా జంగమాకారభ
ర్గున కుంగ్రమ్మఱ మ్రొక్కి, "భక్తనిధీ! నాకుంజెప్పవే, విశ్వనా
థుని యారాధనసేసి, యగ్గిరిని జంతుశ్రేణిలో మున్నుగో
రిన యర్థంబులు గాంచిరెవ్వ?" రన గౌరీనాథుడు రాజుతోన్
(ప్ర.ఆ. 161)

అంతట గౌరీనాథుడు తరువాతి ఆశ్వాసములో జంతుశ్రేణికి జెందిన శ్రీకాళ-హస్తుల కథలను వర్ణించినాడు.

నానాయణవపురాధినాథుడగు యాదవ భూకాంతుని భక్తిని తెలియ బూని, శివుడు మాయా జంగమ స్వరూపుడై శ్రీ కాళహస్తి పురమునకు వచ్చి ఒక దాసియింట విడిసెను. ఆమె యాదవభూకాంతు దార గింపు బోయెడు వేళ స్వయముగా పళ్ళెరమిడుచుండును. కాని అనాడామె తపసి తగులమున నుండి ఆవిషయమే మరచెను. రాజు కోపముచే నామెతల గొరిగింపబడెను. కాని మాయా జంగమ స్వరూపుడగు శివుడు హస్తమస్తక సంయోగ మాచరింపగనే ఆమెకు మరలకచభరమువచ్చెను. అదివిని విస్మితుడై, యా రాజు సపరివారముగా నమ్మచ్చెలంటి యింటికి వచ్చి జంగమ లింగమును పూజించి ప్రసన్నునిచేసి కొనెను. అంతట శివుడు "కలిధౌతశైల శిఖాలయ గేహమును కట్టింపు"మని రాజును కోరెను. అందులకు రాజు అంగీకరించి "తదాది పురాణ కథాప్రసంగముల్ వినవలతు, సవిస్తర వైఖరిం జెప్పవే" అని ప్రార్థించెను. అపుడు శివుడు కాళహస్తిమాహాత్మ్యము చెప్పదొడగెను. ఇట్లు ఏకకథయైనను ఈ మహాత్మ్యమున శివభక్తి ప్రతిపాదితమే.

దక్షిణ కైలాసముగా ప్రసిద్ధినందిన శ్రీకాళహస్తిక్షేత్రము సామాన్యము కాదు. తత్సమీపముగనే గజ కాననము వనంబుకలదట. గాధినందను కతంబున తన తనయులు నూర్వురుంజచ్చిన, వశిష్ఠుడు కడలేని దుఃఖమున కొండయెక్కి క్రిందబడి ప్రాణత్యాగము చేయదలంపగా, పృథివి పట్టుకుని రక్షించి "దేవోత్తం సుని పార్వతీ రమణుని గొల్వు"మని యుపదేశించెను. అంతవశిష్ఠుడు అత్యుగ్ర మైన తపంబొనరించెను. శివుడుమెచ్చి పరమ శివలింగ రూపమున పశ్చిమాభి ముఖుండై ప్రత్యక్షమై వరము కోరుమనెను. బ్రహ్మవిద్యనొసగ వలసినదనియు, ఆ శివలింగరూపమున కలకాల మచ్చటనే వసింపుమనియు వశిష్ఠుడు కోరెను. శివుడందులకనుగ్రహించెను. పరమేశ్వరియు, పరమేశ్వర చిరవిరహాకారంబును సహింపలేకవచ్చి తదీయ సన్నిధిని నిల్చి జ్ఞాన ప్రసూనాంబగా ఖ్యాతివహించెను. పార్వతీపరమేశ్వరులు సపరివారముగా విహరించిన ఆ గిరియే శ్రీకాళహస్తియున బడెను. ఇక సువర్ణముఖరీనది ఎట్లు వచ్చినదో చూతము. శివుని పెండ్లిచూచుటకు దక్షిణ దిక్చరాచరభూతములు హిమశైలమునకు వచ్చుట వలన ఉత్తర దిశగా భూమిక్రృంగి దక్షిణ భాగము మీదికి లేచెనట. దానిని మాన్పుటకు శివుడగస్త్యుని దక్షిణ దిశకు బొమ్మని కోరెనట. అంతలో అగస్త్యుడు లోపాముద్రతో కలిసి పుణ్యనదిలేని కారణంబున తపంబు చేయ మొదలిడెను. అంతబ్రహ్మ అఖండల ముఖ్యులతో గూడి శివుని దర్శించి, అగస్త్యుని తపోనిష్ఠను గూర్చి విన్నవించెను. శివుని యాజ్ఞ ప్రకారము బ్రహ్మ అగస్త్యునకు ప్రత్యక్షమై యచట సువర్ణముఖీ నదిని ప్రవహింపజేసెనట!

ఇక ద్వితీయాశ్వాసమున బ్రహ్మకథలో విశేషమేమంత కాన్పించుటలేదు. బ్రహ్మకొలువు దీర్చియుండగా వాణి యచటకు విచ్చేయుట, అతడు కొలువు చాలించి వాణితో నూరురూపములదగ్గై కొని తనకోర్కె దీర్పవలసినదని కోరెను. అంతవా ఫలితముగా నూర్గురు దుశ్చేష్టులగు కుమారులు గల్గిరి. వారు రక్కసులై వింత విధముల ప్రవర్తింపసాగిరి. అంత వారిని వింధ్యకు పొమ్మని తండ్రి యాజ్ఞాపించెను. భూదేవి పీరుపెట్టు బాధలు సహింపజాలక బ్రహ్మతో మొరపెట్టు కొనెను. అంతకోపోద్రిక్తుడైన బ్రహ్మకు నుగ్రుడనువాడు పుట్టెను. వానిని వింధ్యకు పోయి రాక్షసులగు సోదరులను చంపుమని తండ్రి యాజ్ఞనొసంగెను అంతనాతడు పోయి వారిని చంపివచ్చి ఆవార్త బ్రహ్మకుచెప్పగా బ్రహ్మపుత్ర

హత్యాబాధచే మందిపడుచు నుగ్రుని చూడ వాడును మరణించెను. పుత్రహత్యా దోషమును, పుత్ర హీనత్వంబును సంప్రాప్త మగుటకు విచారించి, బ్రహ్మ ఆత్మ వధూటితో గూడి దక్షిణ కాష్యశైలమున శివునిగూర్చి తీవ్రతపమాచరించి ఋరువు అను సుపుత్రుని గాంచెను.

కృత యుగమున నొక చెలదిపురుగు పూర్వవాసనచే శివుని గొల్చుచు, ఆత్మనిర్గత బహుతంతు పంక్తిచే గృహకల్పనలు చేయుచుండెను. శివునకు దాని పరీక్షింపవలెనని బుద్ధిపుట్టెను. దీపకళిచే ఆ తంతుగృహములన్నియు తగుల బెట్టెను. చెలదికి దుఃఖము కోపము కలిగెను. చెలది దీపమును మ్రింగబోవ శివుడు దానిని కెంగేలునపట్టి ఆపి దాని భక్తికిమెచ్చి సాయుజ్య మొసంగెను. శివుడు ఏమి కావలెనో కోరుకొనుమనునప్పుడు సాలెపురుగు 'నాతపస్సు ఫలించినది'అని శివు నకు నమస్కరించినది. భక్తితో సంభ్రమముతో ఉబ్బి తబ్బిబ్బై పోయినది. దేవా! నేను నిన్ను స్తుతింపలేను. నాకేపాటి వేదశాస్త్రములును రావు. వేదములే తమ కాద్యంతములు లేదనగా అవి చదివిన వారికి మాత్రమేమి తెలియును? సేవించుటే కర్తవ్యమని తమ శ్రీ పాదము లాశ్రయించితిని. నాకు సంసార దుఃఖములు లేకుండ కైవల్యము నిమ్ము' అని కోరెను. శివుడానందముతో దానిని తనలోనైక్యము చేసికొనెను. అది చూచి దేవతలు మనము ప్రతిదినమును చేయు శివార్చనలేందుకు? అని నిరసించిరి మునులు తపస్సు లెందుకనుకొనిరి. యోగ ములోపడి కొట్టుకొనువారు తమ జన్మను వ్యర్థమని తిట్టుకొనిరి. తక్కిన భక్తులు ఈ మతములు దండుగయనుకొనిరి. దేవతలు మునులు చేసెడి స్తుతిధ్వను లాకాశము నిండినవి. ఇదియే సాలెపురుగు కథ.

త్రేతాంతమున నొక్క కాలఫణి, పాతాళంబున నుండి దివ్య రత్నములను దెచ్చి ప్రతిదినము శివుని అర్చించుచుండెను. ఇట్లుండగా ద్వాపరయుగ ప్రారంభ మున, ఒక ఏనుగు అచటికి వచ్చి ఫణి యర్పించిన మణులను త్రోచిమాలూర శాఖలతో నాళీక కహ్లార కుముద పుష్పంబులతో శివుని పూజింప సాగెను. అందుచే నిరువురు శత్రువులైరి. ఒకనాడు కాలఫణి పూజింపవచ్చిన ఏనుగు తొండములో దూరి, దానిని బాధింపగా ఆ బాధ భరింపలేక ఏనుగు దక్షిణకైలాస గిరిపై తలమోదుకొనిచచ్చెను. దానితో ఫణి కూడ చచ్చెను. అట్లు చచ్చిన ధృత

గజాకారంబులు దాల్చిన కాద్రవేయ భద్ర గజంబులకు శివుడు సాయుజ్య మొసంగెను.

ఇంక తిన్నని కథ చూతము. పొత్తపి నాటిలో 'ఉడుమూరు' యను పట్టణమున కధీశ్వరుడైన నాథ నాథునకును తండెకును జన్మించిన వాడు తిన్నడు. తండెకు శైలజాధిపుని కరుణచే తిన్నడు పుట్టెనట. తండ్రి వానికి బహువిధ మృగయా విహారంబుల చందం బెరింగింపగోరి, కాద్రేని జాతర సాగించి మరు నాడు వేటకు నియమించును. వేట సమయమున ఒక ఏకలము వాని నెలయించి, దక్షిణముగా గొనిపోయి, శివలింగ ప్రాంతమున నదృశ్యమయ్యెను. వెంబడి వచ్చిన బోయవారు తిన్నని పలుపరి విధముల వెదకి చివరికి శివలింగ ప్రాంతనముకొచ్చి రమ్మని బ్రతిమాలిరి. కాని అతడు మాత్రము శివునితోడిదే తనకు లోకమనియు, లింగమును విడిచి రాననియు ప్రతిజ్ఞ పట్టినాడు. పైగా లింగమును ఉడుమూరుకి రమ్మని ఈతడనేక విధముల వేడుకొనెను. అట్లు రానిచో శివునితోడనే లోకమని అచటనే యుండి పోవుదునని విడిచి మాత్రము పోనని పట్టుదలతో లింగముకనేక విధముల సేవలు చేయ మొదలిడెను మాంస ఖండములను రుచిచూచి శివునకు ఆరగింపు పెట్టుచుండెను. గుడియందు ఈ ఎంగిలి మంగలములన్నియు చూచి భక్తుడగు శివబ్రాహ్మణుడు చింతింపగా శివుడు వానిని నూరార్చి తిన్నని మహా భక్తిని నిరూపించుటకు పూనుకొనెను. అందుచే బ్రాహ్మణుని వెనుకనే దాగియుండ మని చెప్పెను. తిన్నడు యథాప్రకారముగా మాంసఖండములు తెచ్చి శివుని కందీయగా పరమేశ్వరుడు తినలేదు. తిన్ననికి కారణమర్థము కాలేదు. ఇంతలో శివుని కంటివెంట నెత్తురు గారజొచ్చెను. ఎన్నియో మందులతో తిన్నడు పరమేశ్వరునకు వైద్యము చేసినాడు కాని దేనికిని లొంగలేదు. కంటికి కన్నే మందని తలచి తనకంటిని పెరకి శివుని కంటికతికించెను

అంతటితో నాగక రెండవ కంటికి కూడ రక్తము రా మొదలిడెను. తిన్నడంతట తనకాలుచే త్రొక్కి రెండవ కన్ను కూడ పెకలించుటకు సంసిద్ధుడగు చుండగా శివుడు ప్రత్యక్షమై అడ్డుపడెను. భక్తి భావమునకు మెచ్చి శివుడంతట నా బ్రాహ్మణునకు తిన్ననికి కూడ సాయుజ్యమొసంగెను. కంటికి కన్నే మందని పరమేశ్వరునకు రెండు నేత్రములు తీసి యర్పించ బోయిన తిన్నని భక్తి

యపారమైనది. నేటికిని శ్రీకాళహస్తి పట్టణమున తిన్నని విగ్రహము ఎత్తైన కొండపైన గలదు. తిన్ననికి ప్రత్యేకాలయము నిర్మించిరి. శివభక్తులకు గుడులు కట్టి పూజించుట శైవ సాంప్రదాయము. నేటికిని యాత్రికులు పోయి కన్నప్ప దేవాలయము దర్శించుట మనము కాళహస్తి యందు చూడవచ్చును. కన్నులను పెరికినాడు గాన తిన్నడు కన్నప్పగా మారెనని 'కాళహస్తి క్షేత్ర మహిమ' యను చిన్న గ్రంథములో విద్వాన్ తిరువేంగడసూరి పేర్కొనెను.

తిన్నని కథ శ్రీకాళహస్తి మాహాత్మ్య ప్రబంధమందీ విధముగా గలదు. ఈ కథ ఇంకెచటెచట గలదో కూడ యించుక పరిశీలింతము.[1] శ్రీనాథుని భీమేశ్వర పురాణమున ప్రథమాశ్వాసమున కన్నప్పను గూర్చిన ప్రశంస యిట్లు గలదు.

పన్నీట గంధ జలమున
నన్నయ తల్లి ప్రథానుడభిషేకింపన్
గన్నప పుక్కిట నీటను
గన్నయ రోచికము వాయ గణకంతునకున్

(భీమ ఖండము 1-68)

అని కన్నప్ప వృత్తాంతము స్మరించెను. ఇంకను పాల్కురికి సోమనాథుని 'బసవపురాణ' మందు ఉదుమూరి కన్నప్ప కథ గలదు. కన్నప్ప వృత్తాంతము క్రీ.శ. 1070 నుండి 1108 లోపల రచింపబడినదని చెప్పబడుచున్న తమిళ గ్రంథమగు పెరియ పురాణమున గలదు. మన ప్రస్తుత కాళహస్తి మాహాత్మ్యమున తృతీయాశ్వాసము (1-180) పద్యములలో నీ కన్నప్ప వృత్తాంతము చెప్పబడినది. కన్నప్పయను తిన్నని జన్మభూమి వర్ణనము, తిన్నని జననము, తిన్నడు విలువిద్యల నభ్యసించుట, తిన్నడు పరిజనంబులతో గూడి వేటకు వెడలుట యను వర్ణనాత్మక భాగములు బసవ పురాణమున నిరపేక్షములు.

(బ. 1-1-68)

---

1. భీమేశ్వర పురాణము (శ్రీనాథుడు)

ప్రస్తుత గ్రంథమున

ఒకవేళ దిన్నఁడాఁకే
టక వేళా వ్యసనరతుం డస్సినవాఁడై
వికచప్రసూన పటలీ
ప్రకరంబుల నీడ నొండెబడి నిద్రింపన్ (8-54)

స్వప్నమున శివుడు సాక్షాత్కరించి మొగలేటి సమీపమున శివలింగమున్నదని చెప్పుట, ఒక ఏకలము వెంట తిన్నడు శివలింగము కడకు పోవుట, అంతనా ఏకలమట నదృశ్యమగుట, మొదలగు విషయములు బసవ పురాణమున లేవు. ధూర్జటి గ్రంథమున శివలింగమునకు తిన్నడు సేవలు చేయుట, వానిం గని బోయలు దుఃఖించుటయు గలదు. బసవ పురాణమున బోయలు పరితపించుట గానరాదు. కొండలో నొంటిగా నున్న పరమేశ్వరుని చూచి ఉడుమూరికి రమ్మని తిన్నడు పరమేశ్వరుని ప్రార్థించిన ఘట్టము బసవపురాణమందిట్లు గలదు.

కొండల లోన నొక్కండ నీవిట్టు
లుండంగ దెలవ నాకుండేదుమా శివ? (బ.పు. [illegible])

ఈ ద్విపద భావమునే ధూర్జటి మన తెలుగు కావ్యమున విపులముగ 6 పద్యము లలో చెప్పినాడు. ఉదాహరణకు

శా. ఓ స్వామీ! యిటువంటి కొండదరిలో, నొంటింబులుల్ సింగముల్
గాసిం బెట్టెడు కట్టడవిలో గల్గు ద్వ్యక్రి నీడ, నే
యాసం గట్టితి వేవి గర్వనిలు? నీవాకొన్నచో గూడునీ
శ్వైసుట్టంబులు దెచ్చి పెట్టెదరు? నీకిందేటికే లింగమా (66)

ఉ. కొండల గానలందివిగి, క్రొవ్విన పందుల లేళ్ళ దుప్పులన్
జెండిన, బెక్కు చందముల తిన్నక పెద్దక గారు కమ్మగా
వండుదు, రట్ల పిట్టలను వండుదు, రిచ్చట నుండనేల, నా
కొండొకటానతీక, యుడుమూరికి రాగదయ్య! లింగమా (6.63)

సోమనాథుడు చెప్పినవే కాక ధూర్జటి మఱికొన్ని వివరములు చెప్పినాడు. తిన్నడు పరమేశ్వరున కాహార మొసగుట యను ఘట్టము మొత్తం 10, 15 పద్యములలో ధూర్జటి వర్ణించినాడు. ఇందు తిన్నని భక్తి శివబ్రాహ్మణుని భక్తి రెండును సరి సమానముగా కవి చిత్రించినాడు. శివబ్రాహ్మణుడు కూడ మహా భక్తుడు. తిన్ననిది ముగ్ధ భక్తి సర్వము పరమేశ్వరునిగా భావించి చివరకు కన్నులను అర్పించుటకు కూడ వెనుదీయలేదు. తిన్నడు శివునికాహార మొసగు సందర్భమున మాంస ఖండములు కాల్చుటయు బ్రేల్చుటయు సోమనాథుడు కన్నప్ప చేత కూడ బసవపురాణమున చేయించినాడు. గమనింపదగిన విషయమేమన కన్నప్ప యాకార చిత్రణమున గూడ ధూర్జటి కవికి బసవ పురాణమందలి ద్విపదయే ఆదర్శమయ్యెనని తలపవచ్చును. ఆపద్యమిది.

చక్కన మొగలేటి సదమలోదకము
లక్కజంబుగ రెండు పుక్కిళ్ళ బట్టి
దాపలికరమున జాపంబు శరము
లేపార వలచేత నిట మాంసమున్న
దొప్పయు బట్టి కన్నప్ప దేతెంచి (బ. పు. తృ. ఆ.)

ఈ పద్య భావమే ధూర్జటి "విల్లో శ చంకనంపపొది" యనుచు పద్యములలోనే చెప్పెను.

శివుడు తిన్నని భక్తిని బ్రాహ్మణునకు చూపదలచెను. హరద్విజుడు.

క॥ "నీ శిష్యం బిది గానీ,
నాకా పాపాత్ము జెప్పినం బది లక్షల్
లేకున్న విడుతు ప్రాణము
నీకై కూడుగ్గబట్టి నీలగ్రీవా"

(తృ. ఆ. 101)

కం॥ అని తా నూరకయుండిన
గని తారాధిప కళాశిఖామణి చేతో
జనితాదరము నతనికి
విని తాత్పర్యంబు సంభవింపగ ననియెన్ (102)

కం॥ తపసీ విను నేనొకటి విను
శివయోగివర! నీకు నన్ను జెందానిడు శ్రుతి
స్తవహానేతర మతమున
దవిలి మహాభక్తి గొలువ దగుపుట్టుటయున్ (103)

గీ॥ "ఆ కిరాతుని పూజ నంగీకరించి
నాడ, తద్భక్తి నీవును నేడు చూతు
గాని, నావెన్కదిక్కున గానకుండ
నడగియుండుము, తడయక యతడు వచ్చు" (104)

ఇంక బసవపురాణమున తపసితో శివు డీక్రిందివిధముగా పలికినాడు.

"అట్లు నేడును వాడు నరుదెంచెనేని
యట్లైన జంపకయే పోవననుచు
వెనుకదిక్కున బొంచికొని సమీపమున
దన పొడసూపక తపసియున్నంతను
గన్నప్ప దేవుని ఘనముగ్ధతయును
సన్నుత భక్తియు సంస్పృహత్వంబు
దపసికి జూపగ దలచి శంకరుడు
విపరీత గతి గ్రిదనేత్రపరీతమైన
వదనంబు ధరియించి వలపలికంట
నుదకంబు గాఱంగనున్న యత్తఱిని

(బసవపురాణము పుటలు 82, 88 వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పరిష్కరణము)

తిన్నడు పరమేశ్వరుని నేత్రరోగమునకు చికిత్సలు గావించుట, శివుడు తిన్ననికి ప్రత్యక్షమగుట యనునవి బసవపురాణమునను. ధూర్జటి గ్రంథమునను సూచా

న్యములు. ఈ విధముగ ధూర్జటికవి యెడనెడ సోమనాథుని ననుసరించినను, బసవ పురాణస్థమగు కథలో లేని యంశములు కొన్ని చెప్పినాడు. బసవపురాణమున తిన్నని కథ (కన్నప్ప) కలదు కాని తల్లిదండ్రు లెవరో వారి నామము లేమో తెలియరావు. తిన్నడు ఎట్లు జన్మించినది కూడ తెలియదు ధూర్జటి మాత్రము యీ యంశముల నెల్ల విస్తారోదాత్తముగా చెప్పెను. కొన్ని విషయములు జెప్పుటయేగాక కొన్ని యంశములు ధూర్జటి వదిలిపెట్టినాడుకూడ. సౌందర్యమహాకాయులను శివభక్తులగు రాక్షసులు, బుద్ధిపూర్వకముగ మృగములై తిన్ననిచేతితో వధింపబడు సన్నివేశము కాళహస్తి మాహాత్మ్యమున లేదు. కాళహస్తీశ్వరుడు ప్రత్యక్షమై తిన్నని వరములు వేడుమనగా నతడు పలికిన విధము కూడ బసవ పురాణము కన్న భిన్నముగ నున్నది. ప్రసన్నుడైన పరమేశ్వరునితో బసవ పురాణమున నత డిట్లు విన్నవించుకొనెను.

"ఎఱుగ మోక్షముల పేరెఱుగ వాంఛితము" (బ. పు. తృ. ఆ.) ధూర్జటి ప్రబంధమున తిన్నడు భగవదనుగ్రహమున జగన్మిథ్యాత్మకత్వభావన చిత్తమున దృఢముగ నాటుకొన్నదనియు, నింక తిద్దగనమున గలపి క్రమ్మఱ బుట్టకుండు నట్లు చేయుమనియు వేడుకొనును. ఈ మాటలు ధూర్జటి యద్వైతిగా కన్నప్పచే జెప్పించిన మాటలని తోచును. ఇంతవరకు బసవపురాణ కథయు ధూర్జటి కావ్య కథకును గల సామ్యవైషమ్యములు స్థూలముగా పరిశీలించితిమి. ఇక పెరియ పురాణమందలి కథను 'మాతృకావిచారము'ను ప్రకరణమున పేర్కొంటిని.

ఇక సంస్కృత సాహిత్యమున కన్నప్పను మొట్టమొదట గైవార మొనరించినది ఆచార్య శంకరులుగా చెప్పబడిరి. వారు తమ శివానందలహరిలో ఈ క్రింది శ్లోకమున కన్నప్పను ప్రశంసించిరి.

శ్లో॥ మార్గావర్తిత పాదుకాపశుపతే రంగస్య కూర్చాయతే
గండూషాంబు నిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే
కించిద్భక్షిత మాంసశేషకబళం నవ్యోపహారాయతే
భక్తిః కిం న కరోత్యహో ! వనచరో భక్తావతం సాయతే

(శివానందలహరి 63 శ్లోకం)

తెలుగు తిన్నప్పను ప్రశంసించినది 'శివతత్త్వసార' మును రచించిన మల్లికార్జున పండితుడు.

తిన్నడు 'శివసాయుజ్యము వడయుట'యను వంశమును ధూర్జటి చక్కగా చిత్రీకరించినాడు. తిన్ననిది మూఢభక్తి. సంస్కారవంతుడగు శైవుడుగా ధూర్జటి భక్తిపారవశ్యమున కొన్ని పద్యములు తిన్ననిచే పలికింపజేసినాడని తోచుచున్నది. తిన్ననికి శివుని సేవయే పరమార్థము. ఎట్టి కష్టములకైన నోర్చి క్షుద్ర నట్టడవిలో లింగమువద్ద గడపనెంచెనే గాని తోటివారు బ్రతిమాలినను ఊరు మూరుకి పోలేదు.

తిన్నని కథ ఆముక్తమాల్యదలోని మాల దాసరి కథతో ప్రతిస్పర్ధిగా నున్నట్లనిపించును. అందు మాల దాసరి వైష్ణవభక్తుడైనచో ఇందు తిన్నడు శైవ భక్తుడు. కులముచే నాతడు మాలవాడు. ఈతడు బోయవాడు. ఇరువురు మూఢ భక్తులే. వేదశాస్త్ర సంబంధమగు పాండిత్యము లేనివారు. చివరకు భగవద్భక్తియే యిరువురకు కైవల్యసాధకమైనది. ఈ కన్నప్ప నాయనార్లలో నొకడుగా ప్రసిద్ధి వహించినవాడు.

ఇక శ్రీకాళహస్తిమాహాత్మ్యమున ఇదే ఆశ్వాసమున (తృతీయాశ్వాసము) నత్కీరుని కథ గలదు. ఇది కూడ అత్యద్భుతమగు కథ. ఇందు మధురాపుర రాజాస్థాన కవిశేఖరుడు శివునిచే గుప్తవ్యాధిగ్రస్తునిగా శపింపబడి సుబ్రహ్మణ్యస్వామి దయవలన కాళహస్తీశ్వరుని సేవించి తత్సాయుజ్యమును బడయుట వర్ణితము.

మధురాపుర పట్టణాధిపతులైన పాండ్యభూపతుల యొద్దకల శతతనూజు డొసంగిన శంఖఫలక మొకటి గలదు. భారతీదేవి కెనయైన వారలెందరకైన దానిపై చోటు లభించును. ఒక్కడే యున్నచో అందులకు తగినచోటుమాత్రమే యుండును. కలియుగమున, పాండ్యరాజు సభలో నత్కీరాది కవులు పన్నిద్దరుండిరి. ఒకప్పుడా రాజ్యమున దుర్భరమగు కరువు సంభవించెను. ఆకలి బాధతో దేశమును విడిపోనెంచిన ఒక హరద్విజుని వారించి, శివుడొక పద్యమును వ్రాసి యిచ్చి "భూపాలుని సభలో దీనిని చదివినచో మెచ్చి సత్కరించు"నని చెప్పెను.

ఆ ద్విజు డట్లే చేసెను. కాని సభలో నత్కీరుడు ఆ కవిత తప్పు అనెను. అంత నా బ్రాహ్మణుడు తిరిగిపోయి ఈ వృత్తాంతము శివుని కెఱింగింపగా పరమేశ్వరుడే స్వయముగా రాజసభ కరుదెంచెను. ఆ సందర్భమున పరమేశ్వరు డిట్లను చున్నాడు.

క॥ "కటకట! యన్నత్కీరుం
డట! కవితయు దప్పవట్టెనట! యటు పదమీ
యెటువలెనో తెలిసెద ?" నని
నిటలాక్షుడు వచ్చి, కుంభినీపతి సభలోన్.

(తృ. ఆ. 166.)

శా॥ ఈ రాజన్యుని మీద నేగవిత సాహిత్య స్ఫుర న్మాధురీ
దారు ప్రౌఢిమ జెప్పిపంప, వినిమాత్సర్యంబు వాటించి, న
త్కీరుండూరకె తప్పవట్టెనట! యేదీ లక్షణంబో, యలం
కారంబో, పద బంధమో రసమో? చక్కంజెప్పుడా తప్పనన్

(తృ॥ ఆ 167)

నత్కీరుడు ఊరుకొనక "గిరితనయా ఘన కచ భారంబు సహజ గంధం" బను మాట తప్పనెను. నీలగ్రీవుడు నిటల నేత్రము తెఱచినను, నత్కీరు డూరకొనక దివ్య స్త్రీలకు గంధమున్న నుండవచ్చును గాని సామాన్య స్త్రీ విషయ మట్లు గాదు' ఇది తప్పు యని వాదించెను.

క॥ "అగజకు నైనందగు నిల
మగువలకుం దగదు, మాకు మత్సర మింకన్,
గగన ప్రసూవ వాదము
జగతిం బ్రత్యక్షమునకు సరియనదగునే? (169)

ఇంకను నత్కీరుండు,

క॥ తలచుట్టు వాఱ గన్నులు
గలిగిన బద్యంబు దప్పగా దన వశమే?

వం దిచ్చట నీ మాయా
విలసనములు పనికిరావు విడువు" మటన్నన్ (171)

ఇదే విషయము తమిళమున "నెట్రిక్కణ్ కణ్టేశ్; కాట్రినం కుట్రం కుట్రమే" యని చెప్పబడినది. తలచుట్టు వారకన్నులున్నను తప్పు తప్పే యని ఖండిత వాదము చేసినాడు. అంత పరమేశ్వరుడు "కుష్ఠవ్యాధి బాధితుడవయ్యెదవు గాక" యని శాపమిచ్చినాడు. అంత నత్కీరుడు పశ్చాత్తప్తుడై శాపానుగ్రహ మీయ వలసినదని పరమేశ్వరుని వేడుకొనెను. పరమేశ్వరుడు "కైలాస శైలమును గన్నప్పుడు శాపాంతమగు'' నని అనుగ్రహించెను. దేహము పట్టుతప్పకమున్నే తీర్థయాత్ర లన్నియు జేసి చివరకు కైలాసము జేరవలయునని నత్కీరుడు నిశ్చితుడయ్యెను. నత్కీరుడు కైలాసశైల దిదృక్షతో కతిపయ ప్రయాణంబులు చని, చని కాశీ విశ్వేశ్వరుని సందర్శించి, ముందునకు సాగునప్పుడొక వన మధ్యమున నొక భూతమునకు చిక్కువడెను. అప్పుడు నత్కీరుడు సుబ్రహ్మణ్య స్వామిని స్తుతింపగా నాతడు ప్రత్యక్షమై ఆ బ్రహ్మరాక్షసుని సంహరించి, నత్కీరుని శాపాంతమునకు మార్గమును చూపెను. అప్పుడు నత్కీరుడు కాళహస్తి పతిని నూరు పద్యములలో స్తుతింపగా ప్రసన్నుండై, శివుడు వానికి సాయుజ్య మొసగెను. కాళహస్తి మాహాత్మ్యముననుసరించి ఇది నత్కీరుని కథ. ఇంక తమిళ వాఙ్మయము నందెట్లున్నదో మాతృకావిచారమున చర్చించితిని. తమిళము నందే కాక స్కాంద పురాణమున హాలస్య మాహాత్మ్యమున కూడ ఈ కథ ప్రస్తావింపబడి నది. నత్కీరుడు తీర్థయాత్రా సందర్భమున ఒక సరోవరము దగ్గరకు వచ్చి మర్రిచెట్టు నీడలో విశ్రమించును. తదుపరి యాతడు భూతమునకు చిక్కి గుహ లోనికి చేర్చబడెను. ఆ గుహయందు కొందరు మానవులుండిరి. ఇదియేమని నత్కీరుడు వారిని ప్రశ్నించగా వారు భూతము తమ్మందరి యాహారము కొఱకు అట్లు చేర్చుచుండెనని, నత్కీరునితో కలిపికొనిన 100 మంది యగుదురని ఇంక చావు తప్పదని చెప్పిరి. నత్కీరుడు నిరాశాపూరిత హృదయుడైనను ధైర్యము తెచ్చుకొని ఆ భూతమును చంపి వారందరిని రక్షింపవలెనని సుబ్రహ్మణ్యస్వామిని యనేక విధముల స్తుతించెను. ఇచట విశేషమేమనగా నత్కీరుని భక్తి భావము వలన మిగిలిన వారికి కూడ చావు తప్పినది. నత్కీరుడు గొప్ప భక్తుడు. మహా జ్ఞాని. చివరికి శివ సాయుజ్యము పొందగలిగిన మహిమాన్వితుడు.

ఇంక వేశ్యా తనయుల కథ నఱయుదము. మధురాపురమున మాణిక్య వల్లి యను వారవనిత గలదు. ఆమెకు దైవ యోగంబున నిరువురు కుమార్తెలు కలిగిరి. వారు ఆ బాల్యముగా శివభక్తురాండ్రు. వారు శివునే పరమదైవమని భావించి వార ధర్మమును పాటింపక యుండిరి. తల్లి వారికి వార ధర్మము నెంత బోధించినను వారిమది కెక్కలేదు. యుక్తవయస్కులై వారు శ్రీకాళహస్తికి బోవలెనని శివుని దర్శింపవలెనని మార్గము నరయుచు జంగమ వేషములతో వచ్చిన ధూర్తుల మాయలో పడి వారితో శ్రీకాళహస్తికి పయనమయిరి. త్రోవలో వారిని దోచుకొనుటకు ఆ ధూర్తులు చేసిన ప్రయత్నము లన్నియును, దైవ బలమున నిష్ఫలములు కాగా, వారు తమ దారిని తాము చనిరి. వీరికి ప్రతిఅడుగున శివుడు ఏ అపాయములు జరుగకుండ కాపాడుట వారి శివభక్తికి ప్రత్యక్ష తార్కాణము శివుడే మాయాజంగమ స్వరూపముతో ఆ వేశ్యా తనయులను కాళహస్తికి చేర్చి అదృశ్యుడయ్యెను. అంత నా కన్య లిరువురును స్వర్ణముఖరిలో స్నానమాడి, ద్రవిడ కవి విరచిత నుతిశతము నవిరళగతి చదువుకొనుచు, ఆలయమున ప్రవేశింతురు. శివుడప్పుడు జ్ఞాన ప్రసూనాంబా సహితుడై వారికి ప్రత్యక్షమై, సాయుజ్యంబిచ్చి యంతర్హితుడయ్యెను. ఇది వేశ్యా తనయుల కథ. ఇందు శివుని మాహాత్మ్య మెంతేని కన్పించుచున్నది. కేవలము శివుని మాహాత్మ్యము వలననే తల్లి బోధించు వార ధర్మముల నుండి తప్పించుకొని తమ మదియందు గల సంకల్పము నెరవేర్చుకొనగలిగిరి. వీరి భక్తి కనుగుణముగా పరమేశ్వరుడు అనుక్షణము వీరికి తోడ్పడి సహకరించెను. ఇదంతయు భక్తి యొక్క మాహాత్మ్యమే శివపారమ్యమిందు ప్రధానాంశము. ప్రతి కథయు ఇట్లుంతమందుట ఈ ప్రబంధ విశిష్టత.

తదుపరి ఈ కావ్యము నందు తిన్నని పూర్వ జన్మకథయు, శ్రీకాళహస్తుల పూర్వజన్మ వృత్తాంతములు స్థూలముగా జెప్పబడినవి. ఈ కథ లన్నియు పరిశీలించిన పిదప ఇందు ధూర్జటి శైవ మాహాత్మ్యమును గూర్చియే యెక్కువగా చెప్పదలచెనని తోచుచున్నది. క్షేత్ర మాహాత్మ్య ప్రాధాన్యతకంటెకూడ భక్తి భావమే ఎక్కువగా కన్పించుచున్నది. కేవల పౌరాణిక కథాగానము చేయక శివ పారమ్యమే పరమావధిగా భావించి కథలను నడిపినాడు ధూర్జటి కావ్యము శ్రీనాథుని హర విలాసము కావ్యమువలెనే గలదు. 'హరవిలాసము' నందు కూడ

యిట్లే శివ భక్తికి సంబంధించిన కథలు తీసికొని చివరకు భక్తి పారమ్యమే చూపినాడు. ఉదాహరణకు హర విలాసమున 'సిరియాళుని కథ' కాళహస్తి మాహాత్మ్యమున 'తిన్నని కథ'ను బోలియుండుట గమనింపదగిన విషయము. రెంటను మూఢ భక్తి ప్రతిపాదితమైనది. కన్నప్ప కండ్లు తీసి శివుని కర్పింప బోవుట, అందు సిరియాళుని కథలో బాలుని శివునకు బలి ఈయబోవుట మున్నగు అంశములవలన మూఢ భక్తి విదితమగుచున్నది. హరవిలాసము ఒక్కొక్క కథ చివరను శ్రీనాథుడు ఫల శ్రుతిని కూర్చుచు వచ్చినాడు. అందు పుత్ర పౌత్రాది వృద్ధియు ఆయురారోగ్యైశ్వర్యాది వృద్ధియు ముఖ్య ఆశాసనములు. ధూర్జటి వలెనే శ్రీనాథుడును వైదిక శైవము ననుసరించెనే గాని వీరశైవుడు గాడు. ఇక వేశ్యా గృహ వర్ణనము చేయునప్పుడు కూడ శ్రీనాథుడు ఓషధీ ప్రస్థపురము నందలి దివ్య వేశ్యలను, వారి గృహ వైభవము, అచట గోడలపై చిత్రింపబడిన శృంగార దృశ్యములు వర్ణన గావించెను. ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యమున ఈ పోలిక వేశ్యా తనయుల కథలో మనకు గోచరము. ముఖ్యముగా గోడలపై శృంగార దృశ్యములు చిత్రించుట మాణిక్యవల్లి యింటకూడ గలదు. చిఱుతొండ నంబి కథ, కిరాతార్జునీయ కథ, సముద్ర మథన వృత్తాంతము ఇత్యాది విషయము లన్నియు వివిధ కథలుగా కావ్యమున సంతరించినాడు. వివిధ కథలన్నింటిని నొక కావ్యమున సంతరించి శివుడే నాయకుడుగా చిత్రించినారు, ఈ ఇరువురు కవులు. హర విలాసమున దారుకా విహారము ఘట్టము నందు భిక్షాటనము గలదు. దీనికి మూలము శివపురాణములందుండవచ్చు ననుకొన్నట్లే ధూర్జటి కావ్యమునకు కూడ వివిధ కథలకు వివిధములగు పురాణములు మూలములని తోచుచున్నది. కథ యంతయు నొక చోట నుండి గ్రహించి వాని యనుసరణగా వ్రాయక హర విలాసమువలె కాళహస్తి మాహాత్మ్యము కూడ వ్రాయబడెను.

ఈ విధముగా ధూర్జటి తన కావ్యములో అనేక కథలు వ్రాసినప్పటికి వాని లోని పరమార్థము ఒకటిగానే కన్పించుచున్నది. అదియే శైవ పారమ్యమును గురించి చెప్పుట. తిన్నని వంటి భక్తులకథ వ్రాసినను, కాళహస్తుల వంటి తిర్యక్కులకథ వ్రాసినను, నత్కీరుని వంటి మహాకవి వృత్తాంతము రచించినను

ఇంకేవి వ్రాసినను ధూర్జటికి ఒకటే ధ్యేయము. మహేశ్వరుని మహిమలు చెప్ప వలయును· అతని క్షేత్రమైన కాళహస్తియొక్క ప్రాశస్త్యమును ప్రతిష్ఠించ వలెను. ఈధ్యేయము భిన్న కథలు కలిగిన కాళహస్తి మాహాత్మ్యమునకు వస్త్వైక్యతను సాధించుచున్నది. వస్త్వైక్యత యనునది ప్రబంధమునకు ప్రధాన లక్షణ మగుటచేత (ఆముక్తమాల్యదవలె) కాళహస్తి మాహాత్మ్యము కూడ ఆంధ్ర ప్రబంధ వాఙ్మయమున ప్రముఖ స్థానము పొందుచున్నది.

ఎనిమిదవ ప్రకరణము

రాయల సభాస్థానము నలంకరించిన అష్టదిగ్గజ కవులు: అందు ధూర్జటి స్థానము

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానమున అష్టదిగ్గజములను కవులెనమండుగు రుండిరను ఐతిహ్య మొకటి చిరకాలము నుండియు, ఆంధ్రదేశమున వాడుకలో నున్నట్టు మనకు విదితమే. మన పూర్వులందరు ఏ ఐతిహ్యము సత్యమైనదనియే విశ్వసించి తమ రచనలలో అష్టదిగ్గజముల ప్రస్తావన వచ్చినప్పుడు వారందరును ఆంధ్రకవులనియే వ్రాసియున్నారు. కాని, ఆధునికాంధ్ర విద్వత్ప్రకాండులు కొందరు పూర్వుల అభిప్రాయముతో నేకీభవింపక, అష్టదిగ్గజము లనగనే తెలుగు వారు మాత్రమే యనుటకేమి యాధారమనియు, వారితో గీర్వాణ కర్ణాట ద్రావిడ కవులు గూడ కొన్ని పీఠముల నధిష్ఠించియుండవచ్చు ననియు, కృష్ణ రాయలు గీర్వాణ విద్యావిశారదుడని మదాలస చరిత్ర, సత్యవధూప్రీణనము, రసమంజరి మున్నగు గ్రంథముల రచియింప నేర్చిన మహాకవి కదా యనియు పైవాదముతో నేకీభవింపక రాయలవంటి ప్రభువు తెలుగు కవులయెడ పక్షపాతము జూపి వారిని మాత్రమే అష్టదిగ్గజములలో జేర్చుకొని గౌరవించునా? యని పలుకుచున్నారు. అష్టదిగ్గజములలో ఆంధ్రకవులకేకాక తక్కిన సంస్కృతాది భాషలలో కవిత్వము చెప్పనేర్చి ప్రఖ్యాతి నందినవారికిగూడ ప్రవేశము గలిగి యుండునని యెంచుట సమంజసమని వారి వాదము. కాని యిచట నొక విషయము గమనింపవలసియున్నది. కృష్ణరాయ లన్నిభాషలయందును ఆదరముచూపి నప్పటికిని "దేశభాషలందు తెలుగు లెస్స" అని యుద్ఘోషించిన మహాప్రభువు. తెలుగుభాషపై వలపక్షము జూపలేదని వచియింపజాలము. ఇంకొక విషయమేమన ఆంధ్రలోకమున దప్ప యన్యత్ర మఱి యెచ్చటను అష్టదిగ్గజముల మాట విన రాదు. ఆంధ్రేతరులకు ఆంధ్రులు అష్టదిగ్గజముల అర్థమేమో వివరింపవలసి

యున్నది. వారి కీసంగతి తెలియదు. పై పేర్కొనిన విమర్శలు వాదించునట్లు గీర్వాణ కర్ణాట ద్రావిడ కవులకు అష్టదిగ్గజములలో ప్రవేశముండియుండవలెను. కావున పైన వివరించిన యంశములను రెంటిని దృష్టియందుంచుకొని విచారించితి మేని అష్టదిగ్గజములు ఆంధ్రవాఙ్మయప్రపంచమును మోసిన తెలుగు ఏనుగులేకాని యన్యభాషాజన్యములు గావని విశదపడగలదు. అష్టదిగ్గజములు తెలుగువారే. కాని వారందరు కవులే యనుట కాధారములేమి? అని ప్రశ్న ఉదయించుచున్నది. కృష్ణదేవరాయలు కవిత్వమును మాత్రమే గాదు సమస్తశాస్త్రములను విద్యలను కళలను పోషించెను. అటువంటప్పుడు వీరందరు వివిధ విద్యలందు, లేదా కళల యందు, చిత్రలేఖనమునందు ఆరితేరిన నిపుణులు కావచ్చును. కాని అట్లనుటకు వీలులేదు. ఏలయన రాయలనాటి శాసనములే 'వీరందరు కవులే' యని చాటిచెప్పు చున్నవి. కడప మండలములో తిప్పలూరు అను గ్రామ మొక్కటి కలదు. అది అష్టదిగ్గజ కవీశ్వరులకు దత్తమైన అగ్రహారమైనట్లు కృష్ణరాయల రాజ్యకాలమున శకాబ్దము 1450కు సరియైన సర్వజిత్సంవత్సర శ్రావణ బహుళ సోమవారం నాడు (26 ఆగష్టు 1527) వ్రాయించి నిల్పిన శిలాశాసనము వలన విదితమగు చున్నది.[1] కావున అష్టదిగ్గజములు కేవలము కవీశ్వరుల కూటమని నిస్సంశయ ముగ జెప్పవచ్చును. కాని యీ శాసనము నందా యాష్టదిగ్గజము లెవ్వరో పేర్కొనబడి యుండలేదు. ఆర్కియలాజికల్ డిపార్టుమెంటువారిచే 1903సం॥న ప్రకటింపబడిన దక్షిణ భారత శాసన సాంవత్సరిక నివేదికయందు వారు అల్లసాని పెద్దన, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుడు, ధూర్జటి, మాదయగారి మల్లన, పింగళి సూరన. రామరాజ భూషణుడు, తెనాలి రామకృష్ణుడు నైనట్లు చెప్పియున్నది. కాని వారేయాధారమునుబట్టి పై నివేదిక రచయితల నిర్ణయము నకు వచ్చిరో తెలియదు. పై పట్టికలో పేర్కొనబడిన కవు లెనమండ్రును, వాస్త వముగ కృష్ణదేవరాయల సభాస్థానము నలంకరించిన యష్టదిగ్గజములలోనివారో కారో విచారించి కనుగొనవలసి యున్నది. ఈ విషయమును నిర్ణయించి తేల్చు టకు ఇప్పటికుపలభ్యమైన చరిత్రాధారముల స్వభావమునుబట్టి చూడ వారిని మూడు తరగతులుగ విభజింపవచ్చును. 1. సమకాలిక గ్రంథ శాసనాదుల సాక్ష్యము వలన కృష్ణరాయల సభాస్థానమునందు వర్ధిల్లినట్లు తెలియవచ్చువారు మొదటివర్గమున జేర్పదగినవారు. రాయలకు తమ నిజరచనల నంకిత మిచ్చిన వారును, నతని ప్రోత్సాహముచే గ్రంథరచనకు బూనుకొనినవారును నీ వర్గము

1. అష్టదిగ్గజములు : వర్ధంత్యుత్సవ సంచిక,

నకు చెందుదురు. వీరు మువ్వురు; అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, అయ్యలరాజు రామభద్రయ్య. వీరిలో మొదటి యిద్దరిని గూర్చి విశేషచర్చ కవకాశము లేదు. అల్లసాని పెద్దన మనుచరిత్రను, నంది తిమ్మన పారిజాతాపహరణమును కృష్ణదేవరాయల కంకిత మొనర్చిన విషయము ఎరిగినదే. అల్లసాని పెద్దన రాయలకు ప్రియతముడైన మహాకవి. అతడు తన్ను రాయ లెట్లు గౌరవించి ఆదరించెనో రాయల మరణానంతరము రచించిన ఈ క్రింది చాటువులో వివరించి యున్నాడు.

"ఎదురైనచో దన మదకరీంద్రము డిగ్గి
కేలూత యిచ్చి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళ బురమేగ
బల్లకి తనకేల బట్టియెత్తె -
బిరుదైన ఘన గండపెండెరమున కీవె
తగుదని తానె పాదమున దొడిగె
కోకట గ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగిన సీమల యందు నిచ్చె
నాంధ్ర కవితా పితామహ యల్లసాని
పెద్దన కవీంద్ర ! యని నన్ను బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేగలేక
బ్రతికియున్నాడ జీవచ్ఛవంబు కరణి"

ఇది అతిశయోక్తి కాదు. ఈ యంశములు నిజమని ఋజువు చేయగల శాసన సాక్ష్యము కొంత గలదు. కృష్ణరాయలు పెద్దనయెడగల యభిమానాతిశయము వలన నతని కగ్రహారములనేగాక సీమాధిపత్యమునుగూడ ప్రసాదించియున్నాడు. పెద్దనతోపాటు కృష్ణరాయల అభిమానములకు మిక్కిలి పాత్రుడైనవాడు నంది తిమ్మన. ఇతడు తాను రచించిన పారిజాతాపహరణ కావ్యము రాయలకే అంకిత మిచ్చియుండుటవలన నతడును పెద్దనవలె రాయల యాస్థానమునందు వర్ధిల్లెనని ఋజువగుచున్నది. మరియు రాయవాచకమునందు కృష్ణరాయలు తాను యుద్ధ యాత్రలకు పోవునప్పుడుకూడ పెద్దన, తిమ్మన, మాదయగారిమల్లన, మొదలైన కవులను తనవెంట దోడ్కొని పోవువాడనియు, నతనికి గృష్ణాతీరమున తురకలతో జరిగిన తాలి సంగ్రామమున విజయము కలుగగా ముక్కు తిమ్మన మొద

లగు కవీశ్వరుల దిక్కు మొగమై "నేటి రాజయంయేరీతు" అని అడిగినందులకు ముక్కు తిమ్మన ఈ క్రింది పద్యమును జెప్పెననియు గలదు.

'నరసింహ కృష్ణరాయా!
దురమున నీపేరిబేరు తురకుల ద్రుంచెన్
కరిరాజవరదుడనుచున్
కరిఘటలను నిన్నుజూచి గ్రక్కున దిరిగెన్

(రాయవాచకము)

పెద్దన, తిమ్మనల సంగతిని తేర్పదగినవాడు అయ్యలరాజు రామభద్రుడు ఇతడు తాను వ్రాసిన సకల కథాసార సంగ్రహ పీఠికలో దన్నా గ్రంథమును రచియింప కృష్ణదేవరాయలు నియోగించెనని తెల్పియున్నాడు.

'ఇట్లు కీర్తి విస్తార ధురంధురుండగు కృష్ణరాయ నరపాలాఖండలుండు నన్ను బిలిచి శ్రీమత్సీతారమణ చరణకమల పరిచరణాయమాన మానసుండవు బహువిధ కవితా చమత్కార ధుర్యుండవు, సకల పురాణేతిహాస ప్రబంధ రచనా దక్షుండవు, మన్మనోరథ కావ్యనిర్వాహకుండ వగుటంజేసి పురాతన మహా కవి విరచిత ప్రబంధంబు లన్వేషించి భగవద్భక్తి నిష్ఠాగరిష్ఠులగు రాజ శ్రేష్ఠుల వృత్తంబులు ప్రసిద్ధంబులగునట్టుగా ప్రశస్త కథలు విన్యస్తంబుగా సాహిత్య లక్షణ చిత్ర కవిత్వ ప్రభావం బొక్కచోటం గనుపడ రచియింప వలయునని మఱియు నిట్లనియె "కావున అతి మధుర రసాయన ద్రాక్షా పాకంబుగా శృంగార రసయుక్తంబగునట్లు సకల కథాసార సంగ్రహంబు గ్రంథ విస్తారంబు గాకుండు నట్లుగా రచింపు మని యుపన్యసించితి" ....

ఇందువలన అయ్యలరాజు రాయలయాస్థానమున నలంకరించిన కవి కుంజరులలో నొక్కడని తెల్లమగుచున్నది. మరియు రాయలచే బ్రార్థితుడై గ్రంథ మును రచించినను దాని నాతని కంకితమీయలేదు. ఇందువలన రాయల యాస్థాన కవులు దాము రచించిన గ్రంథములను వాలాయముగ రాయలకే యంకితము సేయవలయునని నిబంధన లేనట్లు తెలియుచున్నది. ఇంక శాసన గ్రంథాదుల సాక్ష్యము వలన కృష్ణరాయలకు సమకాలికులైనట్లు తెలియవచ్చు వారిలో మొదటి

వాడు మాదయ గారి మల్లన. ఈతడును రాయల యాస్థానము నందలి [1]ప్రధాన కవులలో నొక్కడని వాఙ్మయ చరిత్రకారులు చెప్పెదరు. ఇతడు తాను రచించిన రాజశేఖర చరిత్రను పెద్దన తిమ్మన వలె రాయల కంకితమీయక రాయల సర్వ శిరః ప్రధానియైన సాళువ తిమ్మరుసయ్యగారి యల్లుడగు నా దింద్ల అప్పయ కంకిత మిచ్చి యుండుట వలనితడు రాయల యాస్థాన కవులలో నొక్కడై యుండ జాలడని కొందఱి వాదము. అయ్యలరాజు రామభద్రయ్యగారి సకల కథాసార సంగ్రహమువలన రాయల సభాస్థాన మందలి కవులు రచించిన గ్రంథము లన్నిందిని అతనికే అంకిత మీయవలయునను నిబంధన లేనట్లు పైన పేర్కొనబడినది. అదియును గాక క్రీ.శ. 1600 ప్రాంతమున వ్రాయబడిన రాయ వాచకము నందు అల్లసాని పెద్దన ముక్కు తిమ్మన్నలతో గూడ మాదయ గారి మల్లనయు, కృష్ణరాయల యాస్థానమున వర్ధిల్లెననియు వారి వలె నాతడును రాయలతో గూడ యుద్ధయాత్రలకు బోవువాడనియు జెప్పియున్నది. ఈ విషయ మును క్రీ.శ. 1626 ప్రాంతమున వెలసిన కుమార ధూర్జటియు వక్కాణించెను.

[2]"సరస సాహిత్య రచన విస్ఫురణ మొన య
సార మధురోక్తి మాదయ గారి మల్ల
నార్యుతల యల్లసాని పెద్దార్యవరుడు
ముక్కు తిమ్మన మొదలైన ముఖ్య కవులు
వినుతించి రపుడు వారికి
గనకాంబర భూషణములు ఘనత నొసగి యా
జన వరుడప్పాటి గనుం
గొని యిట్లని పలికెనపుడు కుతుకంబలరన్ (రాయ వాచకము)

కావున మాదయగారి మల్లన కృష్ణదేవరాయలకు సమకాలికుడగుట చేతను క్రీ.శ. 1600 ప్రాంతమున వ్రాయబడిన రాయవాచక మందును 1626 ప్రాంత మున వ్రాయబడిన కృష్ణరాయవిజయ మందును, నతడు అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మనలతో పాటు రాయల ఆస్థాన కవి వర్గములోని వాడనియే తలంచుట యుక్తము.

---

1. అష్ట దిగ్గజములు - వ్యాసము డా॥ నేలటూరి వెంకటరమణయ్యగారు.
2. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక సంపుటి 8 పుట 188.

ఇక తర్వాత పేర్కొనదగిన వాడు రామకృష్ణకవి. ఇతని అద్వితీయమైన ప్రతిభ కృష్ణరాయల కీర్తి కౌముదితోమేళనమంది దక్షిణ భారత మందెల్లెడలను వెలుగొందుచున్నది. రాయల, రామకృష్ణుల కథల నెఱుగని వారును, విని యానందింపని వారును సేతు గోదావరీ సాగర ద్వయ పరివృత దక్షిణావని యందులేరు. కాని ఇటీవల వాఙ్మయ చరిత్రకారులును, విమర్శకులును రామకృష్ణుడు కృష్ణదేవరాయల సమకాలికుడు కాదనియు, నష్టదిగ్గజ కవులలో నతడుండుట అసంభవమనియు వాదింతురు. వీరికి మార్గదర్శకుడు ఆంధ్ర కవుల చరిత్ర కర్తయైన వీరేశలింగం పంతులుగారు. రామకృష్ణకవి అప్పయ దీక్షితులతోను తిరుమల తాతాచార్యుల వారితోను సమకాలికుడైన చంద్రగిరి రాజగు వెంకటపతి రాయల ప్రభుత్వ కాలములో నుండినట్లు కొన్ని నిదర్శనలు కలవని వీరివాదము. రామకృష్ణకవి పాండురంగమాహాత్మ్యమునకు కృతిపతియైన విరూరి వేదాద్రి మంత్రికి గందాళ అప్పగారు గురువైనట్లు తన పాండురంగ మాహాత్మ్య పీఠిక యందు చెప్పియున్నాడు. గోల్కొండకు కరణమైన సారంగు తమ్మయ తన వైజయంతీ విలాస పీఠికలో ఈ గందాళ అప్పగారే తనకు గురువైనట్లు తెల్పియున్నాడు. అందువలన తిమ్మకవియు, అతనికి సమకాలికుడైన రామకృష్ణకవియు పదునారవ శతాబ్దాంతమునందును 17 శతాబ్దియందును యుండిరనుటకు సందియము లేదు. ఈ విధముగా వీరేశలింగము గారు అప్పటి కెరుకబడియుండిన స్వల్ప చరిత్రజ్ఞానము నూతగాగొని ప్రతిపాదించిన సిద్ధాంతములు ఇప్పుడంగీకార్యమగుట లేదు. చారిత్రిక పరిశోధనముల వలన యనేక సిద్ధాంతములు తారుమారగుట సంభవించినది. అప్పయ దీక్షితులు వేదాంత దేశికుల వారి యాదవాభ్యుదయముపై తాను రచించిన వ్యాఖ్యానము యొక్క పీఠిక యందు తా నా వ్యాఖ్యానమును అరవీటి రామరాజు తిమ్మరాజు, చిన తిమ్మరాజు యొక్క నియోగము వలన వ్రాసితినని చెప్పియున్నాడు. వీరు రాయల ప్రతినిధులుగా దక్షిణ రాష్ట్రములను పరిపాలించుటకు క్రీ.శ. 1542-1548 లో నియమింపబడినట్లు తెలియుచున్నది. కావున చిన తిమ్మరాజు అప్పయ దీక్షితుల వారిని యాదవాభ్యుదయమునకు వ్యాఖ్యానము వ్రాయ నియోగించినది క్రీ.శ. 1545 ప్రాంతమునందే యైయుండును. దీనివలన నితడు క్రీ.శ 1525 ప్రాంతమున అనగా శ్రీకృష్ణరాయ లింకనూ రాజ్యపాలన సేయుచుండగనే జన్మించి యుండవలయును. రామకృష్ణుడు కనీసము 1550 వరకు జీవించి

యుండినట్లు నిదర్శనములు కలవు. కావున కృష్ణరాయల సభాస్థానము నందుండిన రామకృష్ణ కవియు అప్పయ దీక్షితుల వారును సమకాలికులగుట యసంభవము కాదు.

తాతాచార్యులనునది వైష్ణవసమయాచార్యులలో కొందఱికి బిరుదనామము. కృష్ణరాయల కాలమున అతని తమ్ముడైన అచ్యుతరాయల కాలమునను కుమార తాతాచార్యుల వారొకరుండినట్లు వల్లభాచార్య కవి దేవేంద్ర [1]'ఆంధ్ర లీలావతి' వలన తెలియవచ్చుచున్నది. ఈ కుమార తాతాచార్యులవారు సదరు లీలావతీ కృతి పతియు, నరసింహనందనులైన కృష్ణరాయ భూజానికి యతని యనుజన్ములైన అచ్యుతరాయలకును, భృత్యుడైన బొమ్మలాట కాళయ్యకు గురువు. కృష్ణదేవరాయలును, అచ్యుతరాయలును శ్రీవైష్ణవ మతానుయాయులగుటచే, కుమార తాతాచార్యులవారు, కృష్ణాచ్యుతులకు గురువగుట యసంభవము కానేరదు. రామకృష్ణ కవి కథలలో వచ్చు తాతాచార్యులవారీ కుమార తాతాచార్యుల వారై యుండరు గాని వెంకటపతి రాయల గురువైన కోటికన్యాదానం తిరుమల లక్ష్మీకుమార తాతాచార్యులవారై యుండజాలరు (1585-1614)

[1]అప్పలాచార్య నామధేయముగల కందాళ వంశజులు పెక్కురు భిన్నకాలమున వర్ధిల్లినట్లు శాసనముల వలన తెలియుచున్నది. తిరుమల దేవస్థానపు ప్రాకారపు గోడలపై చెక్కబడిన యనేక శాసనముల మూలమున పాండురంగ మాహాత్మ్య కృతిపతి యగు వేదాద్రి మంత్రియు అతని గురువైన కందాళ అప్పలాచార్యులును క్రీ.శ. 1540-1550 మధ్య నుండిరని తెలియుచున్నది. తెనాలి రామకృష్ణకవియు యప్పటివాడే కావలయును. కృష్ణరాయలు మరణానంతరము 10, 14ఏండ్ల లోపల పాండురంగ మాహాత్మ్యము వంటి మహాకావ్యమును రచించిన రామకృష్ణకవి కృష్ణదేవరాయలకు సమకాలికుడై యతని యాస్థాన కవివర్గములో నొక్కడై యుండుట సంభవము.

తెనాలి రామకృష్ణుడు మొదట శైవుడనియు పిమ్మట వైష్ణవమును స్వీకరించెనని నొక యైతిహ్యము గలదు సుప్రసిద్ధ వాఙ్మయ విమర్శకులైన శ్రీ వేటూరి

1. తిరుమల దేవస్థాన శాసన సంపుటి. 2 పుట 278.

పఠాకర శాస్త్రిలవారు తెనాలి రామలింగకవి విరచితమైన ఉద్భటారాధ్య చరిత్ర మను ప్రబంధమును సరస్వతి పత్రికయందు ప్రకటించిరి. తత్సంబంధమగు పీఠిక యందు 'రామలింగ కవియే పాండురంగ మాహాత్మ్య ఘటికాచల మాహాత్మ్యాది కర్తయైన రామకృష్ణకవి' యని నిరూపణ గావించినారు. రామలింగకవి శైవమును విసర్జించి వైష్ణవమును స్వీకరించిన తరువాత ఆ మార్పున కనుగుణముగా తన పేరును రామకృష్ణకవియని మార్చుకొనెననియు చెప్పియున్నారు.రామలింగ కవియే రామకృష్ణుడైన పక్షమున అతడు కృష్ణదేవరాయలకు సమకాలికుడని ఉద్భటారాధ్య సాక్ష్యమువలన ఋజువగుచున్నది. అందువలన రామకృష్ణకవియు, అష్టదిగ్గజ కోటిలో నొకడై రాయల సభాస్థానము నలంకరించెనని నిస్సంశయముగా బలుక వచ్చును.

ఇక ధూర్జటిని గూర్చి ప్రస్తావింతము. ధూర్జటి కృష్ణరాయల సమకాలి కుడని కాని ఆతని ఆస్థానమందలి అష్టదిగ్గజ కవీశ్వరులలో నొక్కడని నిరూపిం చుటకు దగిన సమకాలిక సాక్ష్యము లేకపోయినను యితడు రాయల ఆస్థానమున లేడని యెంచరాదు. కుమార ధూర్జటి కృష్ణరాయ విజయ పీఠికలో వ్రాసిన 'స్తుతిమతి' యను పద్యమే యిందులకు సాక్ష్యము. ఇంకను అతడు కాళహస్తి మాహాత్మ్యము రచించిన ధూర్జటి తనకు పెదతాతయని చెప్పెను. ధూర్జటి కవితా మహిమకు మెచ్చి కృష్ణరాయలు ప్రతిదినము సభలో 'స్తుతిమతి' యను పద్య భాగము సమస్యగా నిచ్చుటయు రామలింగము లేచి "హా తెలిసెన్" అనుచు పూరించుటయు ప్రఖ్యాతమైన విషయము. ఈ సాక్ష్యమువలనను, కృష్ణరాయ విజయ పీఠిక పద్య భాగము వలనను తరతరముల నుండి వచ్చుచున్న జనశ్రుతి వలనను ధూర్జటి రాయల ఆస్థానము నందలి అష్టదిగ్గజములలో నొకడని యెంచ వచ్చును. ఇంకను అష్టదిగ్గజములు ఎనమండుగురని పేర్కొన్న కవులందరును (ఆరుద్రగారు, చాగంటివారు) ధూర్జటిని పేర్కొనిరి తప్ప విస్మరించలేదు. ఇంతియేకాక అష్టదిగ్గజములలో ధూర్జటికి ప్రత్యేక స్థానమున్నట్లు "స్తుతిమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో యతులిత మాధురీ మహిమ" యను శ్రీ కృష్ణదేవరాయల మాటల వలన తెలియుచున్నది. ఇంకనూ ధూర్జటి శ్రీకాళహస్తీ శ్వర శతకములో నిట్లనుచున్నాడు.

"నిను సేవింపగ నాపదల్పొడమ నీ నిత్యోత్సవం బబ్బనీ
జనమాత్రుండన నీ మహాత్ముడనవీ సంసారమోహంబుపై
కొననీ జ్ఞానము గల్గనీ గ్రహగతుల్ కుందింపనీ మేలు వ
చ్చిన రానీ, యవి నాకు భూషణములో శ్రీకాళహస్తీశ్వరా !

(శా. స. 12 పద్యం)

సర్వము శివార్పణ చేసిన వారికి కష్టసుఖములు రెండునూ సమానములే. స్వామిని సేవించునప్పుడు ఆపదలు వచ్చినను సరే. నిత్య కల్యాణము గానున్నను సరే, మోహము తన్ను ఆవరించిననూ సరే, జ్ఞానోదయము కల్గిననూ సరే, గ్రహములు వక్రించిననూ సరే, మేలు కల్గినను సరే. అవి అన్నియు తనకు భూషణములేనట, వానినే సమదర్శియందురు. సమదర్శి పురుషోత్తముడనుటలో విప్రతిపత్తియుండదు. అదియే ధూర్జటి గొప్పతనము. ఈవిధముగా ధూర్జటి తన భావములను శ్రీకాళహస్తీశ్వరునకు విన్నవించెను. శతకరూపమున వానిని వర్ణించి పాఠకులను సహితము ముగ్ధులను గావించినాడు.

[1]ఇంక అష్టదిగ్గజములలో రామరాజభూషణుని గూర్చి పరిశీలింపవలసి యున్నది. ఈతని విషయమునగూడ చిరకాలమునుండియు అష్టదిగ్గజ కవికోటిలోని వాడని తెల్పు గాథలు ప్రచారమున గలవు. రామరాజభూషణు డనునది ఈ కవిపేరు గాదు. విజయనగర సంస్థానము నాశ్రయించుకొనియుండిన భట్టుకులజులైన కవులు కొందఱు తమపై ఆదరాభిమానములు జూపి గౌరవించిన ప్రభువులకు తాము భూషణప్రాయులమని ప్రకటించుట కొఱకు కృష్ణరాయభూషణ, వేంకటరాయ భూషణేత్యాది నామములు ధరించెడివారు. రామరాజ భూషణుడు గూడ ఈతరగతికి చెందినవాడే. ఇతడు తాను విరచించిన వసుచరిత్రను జీర్ణ కర్ణాటక సామ్రాజ్యమును సముద్ధరించి క్రీ.శ. 1570-71 లో పట్టాభిషిక్తుడైన అరవీటి తిరుమలరాజు కంకిత మొసగినను, అభ్యుదయమునంది పేరు ప్రఖ్యాతులను గడించిన దంతయు తిరుమలరాజు కన్నయైన అళియరామ భూపతుని యాస్థానమునందే. ఈయంశము నతడు తన హరిశ్చంద్రనలోపాఖ్యాన పీఠికలో స్పష్ట వివరించి యున్నాడు.

1. అష్టదిగ్గజములు వర్ధంత్యుత్సవ సంచిక వ్యాసము డా॥ కేటూరి వెంకట రమణయ్యగారు.

"సకల కర్ణాటరక్షా దురంధర రామ విభుదత్త శుభచిహ్న విభవయుతుడ" అరామ విభుదత్త శుభచిహ్నమే రామరాజ భూషణ బిరుదము. ఇతని వాస్తవమైన పేరు భట్టుమూర్తియనియు నరసభూపాలీయ మను నామాంతరముగల కావ్యాలంకార సంగ్రహమను గ్రంథమును వ్రాసి గొబ్బూరి నరసరాజున కంకితమిచ్చెననియు చెప్పుదురు. అళియ రామరాజు క్రి.శ. 1564 లో రక్షసి తంగడి సంగ్రామమున మడిసెను [1]అప్పటి కతడు 90 ఏళ్ళ ముదుసలియట. ఆతడు క్రి.శ. 1548 మొదలు తరువాత ఇరువదియొక్క సంవత్సరములు సదాశివదేవ మహారాయలపేర ఆసేతు గౌతమీ పర్యంతముగల దక్షిణ భారతావనిని నిర్వక్ర పరాక్రమముతో పాలించెను. రామరాజభూషణుడు అళియ రామరాజు అధికారము వచ్చునప్పటికే కవియని ఖ్యాతి గడించిన సూచనలు గలవు. ఒకవేళ నతడు యౌవన దశయందు కృష్ణరాయల ఆస్థానమున నుండియుండవచ్చును. ఇది యసంభవము గాదు.

కృష్ణదేవరాయలను గూర్చియు, సాళువ తిమ్మరుసు మంత్రిని గూర్చియు రామరాజ భూషణుడు చెప్పినవనబడు చాటువులు కొన్ని నేడును లోకమున వాడుకలో నున్నవి. "మఱియు మంద లక్ష్మీనరసింహాచార్య విరచితమై అర్వాచీన లక్షణ గ్రంథమున భట్టుమూర్తి యనగా రామరాజభూషణు డల్లసాని పెద్దనార్య శిష్యుడని చెప్పియున్నది. ఈ ఐతిహ్యము వాస్తవమైనచో రామరాజ భూషణుడు తన కవిత్వ ప్రారంభదశను కృష్ణదేవరాయల సభాస్థానమున గడిపెనని యెంచవలసి యున్నది.

రామరాజ భూషణునివలె పింగళి సూరనార్యుడు సహితము కృష్ణరాయల కవితాగోష్ఠికి చెందినవాడని కొందఱి యభిప్రాయము. కాని వీరేశలింగము పంతులు గారు సూరనార్యుడు కృష్ణరాయల కాలమువాడు గాడనియు తరువాతి వాడనియు నిర్ధారించియున్నారు. [2]అర్వాటి బుక్కరాజు ముమ్మనుమడైన అళియరామరాజు 1563వ సంవత్సరము వరకును నుండినప్పుడు బుక్కరాజు ముమ్మనుమని

1. అష్టదిగ్గజములు పుట (15)

2. ఆంధ్రకవుల చరిత్ర పుట 358.

మనుమడయిన కళాపూర్ణోదయ కృతిపతియైన నంద్యాల కృష్ణమ రాజింతకు పూర్వమునం దుండెననుట పొసగనేరనందున వారి మాట విశ్వాసార్హమైనది కాదు. ఇతడు 1560వ సంవత్సరమునకులోపల నుండెననుట తటస్థింపదు. వీరేశ లింగముగారి అభిప్రాయము దాం మటుకు సమంజసముగనే కన్పట్టుచున్నది. కళాపూర్ణోదయ కృతిపతి చరిత్రరంగమున పొడచూపినది క్రీ.శ. 1586 ప్రాంతమున. నంద్యాల వారు సదాశివ దేవమహారాయల కాలమున కడప మండలములోని గండికోట దుర్గమున కధిపతులై యుండిరి. రక్కసితంగడి యుద్ధానంతరము రాయల కలిమి బలములు సన్నగిలగా నంద్యాల వారును తక్కిన అమరనాయకులవలె స్వతంత్రులగుటకు ప్రయత్నము చేసిరి.

1584వరకు రాజ్యపాలనమొనర్చి మొదటి శ్రీరంగరాయలకాలమున అమర నాయకులక్కడ స్వతంత్రులవలె వ్యవహరింప దొడగిరి. నంద్యాల కృష్ణమరాజు తండ్రియైన నరసింహరాజు 1580 ప్రాంతము వఱకును గండికోట దుర్గాధ్యక్ష పదవియందుండి మృతినందెను. అతని మరణానంతరము కృష్ణమరాజు దుర్గా ధ్యక్ష పీఠము నధిష్ఠించి తంత్రాంతములం దమర మాగాణముల ననుభవించు చుండిన కొండ్రాజువారు మున్నగు తెలుగు చోళవంశములతో సఖ్యము జేసికొని నిజస్వాతంత్ర్య ప్రతిష్ఠ కొఱకు ఘనమైన ప్రయత్నములు సేయగడగెను. క్రీ.శ. 1584లో మొదటి శ్రీరంగరాయల మరణమును, గుతపనమలక దండయాత్రయు, స్వార్థపరులైన యమరనాయకుల స్వామి ద్రోహమును అతని యుద్యమమునకు దోహద ప్రాయములాయెను. కావున నతడు క్రీ. శ. 1584లో శ్రీరంగరాయల తమ్ముడైన ఇమ్మడి వీరవెంకటపతి దేవరాయలు రాయల సింహాసనము నధిష్ఠింప గనే కృష్ణమరాజతని యాధిపత్యము నంగీకరింపక తిరుగుబాటుదేసి తన స్వాతం త్ర్యమును ప్రకటించెను. కాని యాతడు కృతార్థుడు కాజాలడాయెను. వీరవెంకట పతిరాయలు సేనల సమకూర్చుకొని గుత పనమలకను దేశమునుండి పాఱద్రోలి తరువాత క్రీ. శ. 1599 - 1600లో జంబుల మడక సంగ్రామమున నంద్యాల కృష్ణమరాజును పరాభూతుని జేసి జీవగ్రాహమున గొనిపోయి చంద్రగిరి దుర్గ ములో చెఱయందుంచెను. [1]మఱికొంత కాలమున కతడు చంద్రగిరిలో చెఱయందే

1. Further Sources of VijayaNagar History vol I 212, 213A 214 B

స్వర్గస్థుడాయెను. ఇందువల్ల కళాపూర్ణోదయ కృతిపతియైన నంద్యాల కృష్ణమ రాజు క్రీ. శ. 1580 ప్రాంతమునుండి 1599 వఱకు దాదాపు పందొమ్మిదేండ్ల కాలము ప్రభుత్వము సల్పినట్లు తెలియుచున్నది. కళాపూర్ణోదయము నంకితము గొనినప్పుడు కృష్ణమరాజు రాజ్యము సేయుచుండినట్లు చెప్పియుండుటచేత నా గ్రంథరచనయు, కృతి సమర్పణయు, నీమధ్య కాలముననే జరిగియుండవలయును. ఇట్లు వీరేశలింగముపంతులవారు అభిప్రాయ పడినట్లు కళాపూర్ణోదయము క్రీ. శ. 16వ శతాబ్దాంతమున రచింపబడినను తద్రచనా కాలమప్పటికి పింగళి సూర నార్యుడు అపర వయస్కుడై యుండవలయును. ఏలనగా కళాపూర్ణోదయము కంటె ముందరి రచనయైన రాఘవ పాండవీయము క్రీ. శ. 16 శతాబ్ది మధ్య మున వ్రాయబడెనని తెలుపు సూచనలందు కొన్నిగలవు. అప్పటి కింకను కర్ణాట సామ్రాజ్యమునకు రాజధానియైన విజయనగర ముచ్ఛ్రస్థితియందుండెను. క్రీ. శ. 1564లో జరిగిన రక్కసి తంగడి యుద్ధానంతరము విజయనగరము తురకలచే నాశనము సేయబడి క్రమక్రమముగా పాడుపడిపోయెనని యందరు నెఱిగిన విష యమే. కావున రాఘవ పాండవీయము 1564 ముందరి రచనయని నిశ్చయింప వచ్చును. రాఘవ పాండవీయము ఈ కవి 1550వ సంవత్సరము ప్రాంతముల యందు మంచి పడుచుతనములో రచించియుండును"[1] అను వీరేశలింగము పంతులుగారి అభిప్రాయముతో మన మేకీభవింపవచ్చును.

రాఘవ పాండవీయము సూరనార్యుని తొల్లిటి రచన కాదు. అతని మొదటి రచన గరుడపురాణము. గరుడపురాణ మితని బాల్యరచనయని వీరేశలింగము పంతులవారి యభిప్రాయము-రాఘవ పాండవీయమును వ్రాయునప్పటికి తన వయస్సుముప్పది యేండ్లుండునని యూహించితిమేని 1520వ సంవత్సర ప్రాంత మున నితడు జన్మించియుండునని మన మనుకొనవచ్చును. అగునేని కృష్ణరాయల అవతార సమాప్తియగునప్పటి కితడు కడు తరుణ వయస్కుడై యుండును. అప్పటి కితడు విద్యాభ్యాసము సహితము పూర్తిచేసి యుండజాలడు. కావున నితడు రాయల సభాస్థానమునందలి అష్టదిగ్గజ కవులలో నొక్కడగుట యసంభవము.

అష్టదిగ్గజ కవులలో పింగళి సూరనార్యు డొక్కడు కాని యెడల వారిలో నెనిమిదవ వారెవరని ప్రశ్న ఉదయించును. కందుకూరి రుద్రయ యని కొందఱు

1. ఆంధ్ర కవుల చరిత్ర పుట 285.

చెప్పుదురు [1]రుద్రకవి సంతతి వారి కడనుంచి బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిం వారు సంతరించిన యాతని చరిత్రయం దిట్లున్నది. "రుద్రకవి కృష్ణ రాయల నాటివాడు. రాయల యాస్థానమున కీయనను దత్రత్యులు మంత్రులు రానీ యరైరి. రాయల సన్నిహిత భృత్యుడగు మంగల కొండోజు యను వాని తోడ్పాటున రాయల సందర్శనము పొసగగా రుద్రకవి యీ క్రింది పద్యము చెప్పినాడు

"ఎంగిలి ముచ్చు గులాముల
సంగతిగా గులము చెఱుప జనుదెంచిరయా
యింగిత మెఱిగిన ఘనుడీ
మంగల కొండోజు మేలు మంత్రులకన్నన్"

అటుమీద రాయలవారి గురువైన తాతాచార్యుల గారితో నితనికి వాదము గలిగెను. అందితనికి విజయము చేకూఱగా రాయల వారితని అష్టదిగ్గజ కవులలో నీశాన్య సింహాసనా రూఢుని గావించెను. రుద్రకవి రాయల యాస్థానమున బంగ్రెండేండ్లు వసియించెను. సప్తకవుల నబరుగు పెద్దన, తిమ్మన పుత్తేటిరామభద్రకవి, పింగళి సూరన. కవిరాట్టు తెనాలిరామలింగయ, భట్టు మూర్తి అనువారితో దారయ దారుకీలతో వాగ్వాదములను సలిపెను శకాబ్దము 1480 జయ సంవత్సర మాఘశుద్ధ పంచమీ జయవాసరమున మల్కిబ్రహీం ప్రభువు రుద్ర కవికి రెంటచింతల గ్రామము నొసగినాడు. పైగ్రామము నేటికిని రుద్రకవి వంశ్యులచే నేల్లుచున్నది. రుద్రకవి ప్రశంసాత్మకమగు నీక్రింది పద్యమున రాయల వారి యాస్థానమున రుద్రకవి యెట్లు గౌరవింపబడెనో వివరించియున్నది.

హరియో నందపురీ జనార్దను వరంబందెన్ మహాసత్క వీ
శ్వరులో రాయలవారి సన్నిధిన హర్షం బందె బట్టంబు గ
ట్టిరి యాందోళికలున్ బహోగ్రతర ఘాటీలగ్రహారంబులం
దలుమాదన్ బహుమానమందెగవి రుద్రాఖ్యుంతు తాముఖ్యుడై

రుద్రకవి కృతమున బరుగు నీక్రింది సీసము వందు గూడ పై విషయమే వర్ణింప బడినది.

---

1. అష్టదిగ్గజమ్ములు వ్యాసము డా. నెల్లూరి వెంకటరమణయ్య పుట 18.

"పాటీర గంధ హృద్యోటీస మంచిత ధాటీ తిరస్కారి ఘూటకములు
కోటీందు వర కళా పోటీద్ధదం తోళీ దంతోళీ సిత శంఖ వ్రజంబు (?)
చేటీవిటాళీ కవాటీ ఘనా రామ వాటీ శుభ గ్రామ వారములును
.... పృథుల సత్కుండలములు
ప్రౌఢి గై కొంటి గీర్వాణ పద సమృద్ధి శతకహనుమజ్జయాది ప్రశస్తకావ్య
ప్రీతి శ్రీకృష్ణరాయ ధాత్రీశువలన మనుకులంగను రుద్రాఖ్యఘనసుకవిని"

(చాటు పద్య మణిమంజరి ద్వితీయ భాగము)
(పుటలు 25-36)

రుద్రకవి అష్టదిగ్గజ కవులలో నొక్కడగుట నిక్కమైన యతడు కృష్ణరాయల కాలము వాడని నిస్సంశయముగ జెప్పవచ్చును. ఏలనగా నొక్క కృష్ణరాయ ధరణీపతి తక్కమతి యేరాజును అష్టదిగ్గజ నామ కవి సంఘము సమకూర్చి పోషించినట్లు వినియెఱుగము. పైనుదహరించిన 'పాటీర గంధ' యను సీస పద్యము వాస్తవ మగు రుద్రకవి కృతమేని యతడు కృష్ణరాయల కవితా గోష్ఠికి చెంది నాడని యదియె చాటుచున్నది. రుద్రకవి సంతతి వారికడ నుండి సేకరింపబడిన వృత్తాంతమున పెక్కండ్రు వ్యక్తులు పేర్కొనబడిరి. వారందరు చారిత్రిక వ్యక్తు లగుదురేని కృష్ణరాయల అష్టదిగ్గజములలోని వాడగు కందుకూరి రుద్రకవికి సమకాలికులా? యనునది పరిశీలించి తెలిసికొనవలయును. తాతాచార్యులు, పెద్దన, తిమ్మన, పుత్తేటి రామభద్రయ్య, తెనాలి రామలింగయ, భట్టుమూర్తియు కృష్ణ దేవరాయల యాస్థానమునం దుండినవారే. వీరి పరిచయ మిదివరకే గావింప బడినది. 'కవిరాట్టనునది' బిరుదనామము. కృష్ణరాయల సమకాలికులలో నీబిరు దెవ్వరికి గలిగి యుండెనో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. కవి సార్వభౌమ బిరుదు డిండిమ కవులకు గలదు. ఒకవేళ యీ కవిరాట్టు అచ్యుత రామాభ్యుదయ కృతి కర్తయైన రాజనాథ డిండిముడు కావచ్చును. పింగళి సూరనార్యుడు కృష్ణ రాయల యుగమువాడు కాకపోయినప్పటికిని, రుద్రకవి సమకాలికుడై యతనితో వాదము సల్పియుండుట కవకాశము లేకపోలేదు. "చేరి కన్నడ భూమి చెలువట్టు పాళ్యాత్య నృపతికైన నొకింత కృప తలిర్చు" అను నిరంకుశోపాఖ్యానము నందలి సీస పాదము నాధార పరచుకొని యీ గ్రంథము విద్యానగర వినాశా

నంతరము రచింపబడినది కాదగును" అని *విమర్శకులభిప్రాయపడియున్నారు. అనగా నిరంకుశోపాఖ్యానము క్రీ.శ. 1564-65 ప్రాంతమున వ్రాయబడెనని వారి భావము. పైద సూచించినట్లు పింగళి సూరనార్యుడు 1550 వ సంవత్సర మప్పటికే గరుడపురాణ, రాఘవ పాండవీయాదులను రచించి ప్రఖ్యాతుడై యుండుట రుద్రకవి యాతనితో వాదమును సల్పుట సుసంగతమే. రుద్రకవికి కృష్ణరాయల యొక్క దర్శన మిప్పించిన మంగలి కొండోజును చారిత్రక పురుషుడే. అతడు పట్టపు మంగలి. అనగా రాయ పీఠమెక్కిన ప్రభువులకు క్షుర కర్మ యొనర్చువాడు. తెనాలి రామకృష్ణుడు నల్ల కుక్కను, తెల్ల కుక్కగ మార్చ బూనిన కథ కొండోజుపై అభిమానమును జూపినందులకు రాయలను గేలిసేయుట కొఱకు రచింపబడినదే. కొండోజు క్రీ.శ. 1544-60 ల మధ్య సదాశివ దేవ మహారాయల ఆజ్ఞవలన సేయబడిన పెక్కు దానశాసనములందు పేర్కొనబడి యున్నాడు. రాయలకు పనిచేసి అనగా క్షౌర కార్యమున నేర్పు చూపి మెప్పించెనట. అందువలన రాయలు ప్రసన్న హృదయుడై యాప్పితార్థము నిచ్చెద నడుగుమనగా స్వాభిమానమును ద్రోసి పుచ్చి, జాత్యభిమానము పెంపున రాయల సామ్రాజ్యమున నుండు మంగలివాడు ప్రభుత్వమునకు వాలాయముగ గట్టుచుండిన సిద్ధాయము మొదలైన పన్నులను సర్వమాన్యము సేయ వేడెను. అటుపైన రాయలు వా రనుగ్రహముచూపి యతడు కోరిన మేరకు రామ రాజ్యము లోని మంగళ్ళు అచ్చవలసిన పన్ను పర్యాయములను సర్వమాన్యము జేసి శాసనములు వేయించెను. కావున మంగలి కొండోజు కృష్ణరాయల కాలమున నుండి రుద్రకవికి రాయల దర్శనము కలిగించుట యసంభవము కాజాలదు. మల్కిభ రామను మల్కిక్ ఇబ్రహీమ్ (కుతుబ్‌శాహట్) అను గోల్కొండ సుల్తాను నామమున కాంధ్రీకరణము. ఇబ్రహీమ్ కుత్బశాహు క్రీ.శ. 1550 సంవత్సరమున గోల్కొండ సింహాసనము నధిష్ఠించి క్రీ.శ. 1580 వఱకును రాజ్యపాలన మొనర్చెను. కావున నతడు రుద్రకవికి సమకాలికుడు కానగును. కాని యతడు శకాబ్దము 1480 జయ సంవత్సరమున రుద్రకవికి రెంటచింతలను దానమిచ్చెననుట సంశయాస్పదము. శకాబ్దము 1480 సరియైన ప్రభువాద్యబ్దము కాళయుక్తి కాని జయ కాదు మల్కిభరామ్ రాజ్య కాలమునందు జయవర్షము రానే లేదు.

---

* చాటు పద్య ద్వితీయ మణిమంజరి పుట (88) వేటూరి ప్రభాకర శాస్త్రిగారు.

శ. 1456 క్రీ.శ. 1534న నొక పర్యాయమును శ. 1514 క్రీ.శ. 1594 న మఱియొక పర్యాయమును జయాబ్దము సంభవించెను. శ. 1456 లో మల్కిభ రామ్ రాజ్యమునకు రానేలేదు. 1514 నకు పదునాల్గేండ్లకు ముందే యాతడు గతించెను. కావున పై నుదాహృతమైన రుద్రకవి వృత్తాంతమందు చెప్పినదన్న కాలము విశ్వాసపాత్రము గాదు. ప్రభాకరశాస్త్రిగారు గుర్తించినట్లు రెంటచింతలయే చింతలపాలెమగునేని దానిని శకాబ్దము 1480లోని ఇబ్రహీం కుతుబు శాహు దానమీయ గలిగియుండును. ఏలనగా శకాబ్దము 1486 రక్తాక్షి వఱకున్న అళియ రామరాజు పరాక్రమ శాసనుదుగ్రతేజుడై, శత్రువులకు దేరిచూడ శక్యము గాక వెల్గొందు చుండెను. తురక రాజుల కెవ్వరికిని కృష్ణానదీ దక్షిణమున నడుగిడుటకుగూడ వలనుపడకుండెను. అట్టియెడ ఇబ్రహీం కుత్బుశాహు రుద్రకవికి నెల్లూరు మండలము కనిగిరి తాలూకాలోని చింతలపాలెము నెట్లు దాన మీయగలడన్నదియే ప్రశ్న. శకాబ్దము 1502 అనగా క్రీ.శ. 1580-81 వఱకును, ఇబ్రహీం కుతుబ్‌శాహు యొక్క అధికారము కృష్ణకు దక్షిణమున చెల్లలేదు. 'శాలివాహన శకవర్షంబు శ. 1502 అగు నేటి విక్రమ సంవత్సర చైత్ర బ. 14 భౌమవారం నాడు హజరతి యిభురాహిం పాదుషహా వొడయలుంగారు తమ నామజాదు (సేన) పంపితేను' అతని భృత్యుడైన అమీనులకు వొడయలుంగారు.

> "ధాటిగ నేగి వుద్ధగిరి దొర్కొని వెంకటరాజు ద్రోలి ముం
> గోటలు లగ్గబట్టి వినికొండయు బెల్లము కొండ తంగెడల్
> పాటవరిన్ హరిన్ మదివి బల్మి గ్రైకొనె కొండవీడు క
> ర్ణాటక రాజధాని యిభురాముడు శాహుబలంబు మీరగన్"[1]

అని యమీనాబాదు శాసనము చెప్పియుండుట వలన క్రీ.శ. 1580-81 వఱకును కుతుబ్‌శాహు వారి యధికారము చెల్లలేదని విస్పష్టమగుచున్నది. అట్లగుట వలన శ. 1480 జయ సంవత్సరమున ఇబ్రహీం కుత్బుశాహు కందుకూరి రుద్రకవికి నెల్లూరు జిల్లా కనిగిరి తాలూకా చింతలపల్లెను దానమిచ్చెననుట నమ్మదగినది కాదు. కాని ఈ విషయము విశ్వాసార్హము గాక పోయినను, రుద్రకవి క్రీ.శ

---

1. Sources of Vijayanagara History Page 240

16వ శతాబ్ది పూర్వార్ధమున వెలసెనని గట్టిగ చెప్పవచ్చు. ఒకవేళ నతడు కృష్ణదేవరాయల సభాస్థానము నలంకరించిన అష్టదిగ్గజ కవులలో నొక్కడై యుండిన కావచ్చును.

ఇంతవరకు ఆర్కియాలజికల్ డిపార్టుమెంటు వారిచే ప్రకటింపబడిన 1987-88వ సంవత్సరపు దక్షిణ భారత శాసన శాఖా నివేదికలో నష్టదిగ్గజములని పేర్కొనబడిన యెనమండ్రు కవులు వర్ధిల్లిన కాలమును వారికి రాయలసభలో గల సంబంధమును పరిశీలింపబడినది. వారిలో నిద్దరు అల్లసాని పెద్దన, నంది తిమ్మలు, రాయలు సభాస్థానము నందుండుటయే కాక స్వవిరచిత ప్రబంధముల నాతని కంకితమిచ్చిరి. అయ్యల రాజు రామభద్రయ్య రాయల నియోగమున గ్రంథ రచనమును సాగించెను. మరి ఇరువురు మాదయగారి మల్లనయు, తెనాలి రామకృష్ణుడు కృష్ణరాయల సమకాలికులని తేలినది. సమకాలిక శాసన గ్రంథాది సాక్ష్యము లేకపోయినను అర్వాచీన గ్రంథ సాక్ష్యము ధూర్జటియు పైవారివలె రాయల విద్వద్గోష్ఠిలోని వాడేయని తెల్పుచుండుట వలన నదియు నంగీకార్యమే కాదగును. తక్కిన ఇద్దరిలో రామరాజభూషణుడు కృష్ణరాయల మరణానంతరము పది పదునాల్గేండ్లలోపల మహాకవి యని వాసికెక్కి యుండుటచేతను భట్టుమూర్తియే యతడను ప్రథయనాది సిద్ధముగుట చేతను మూర్తి కృతచాటువులు కృష్ణరాయ తిమ్మరస ప్రశంసాత్మకములు. ఇంక పింగళి సూరన అష్ట గ్గజముల లోని వాడు కాడని రుద్రకవి కావచ్చునని పైన నిరూపింపబడినది.

తొమ్మిదవ ప్రకరణము

మార్గ-దేశికవిత్వములు శ్రీకాళహస్తి మాహాత్మ్యము సమన్వయము

ఆంధ్ర వాఙ్మయమునందు ప్రారంభ దశనుండి తెలుగు కవిత్వము ద్విధా విభక్తమై కావ్యరూపముల సంతరించుకొన్నట్లు కాన్పించుచున్నది. ఈరెండు రకముల కవిత్వమునే విమర్శకులు మార్గ కవిత్వమని దేశికవిత్వమని గుర్తించినారు. ప్రారంభదశలో విభక్తమని ఈ కవితా మార్గములు చాలా కాలము వరకు మన సాహిత్యములో కొనసాగినవి. నన్నయకు సమీపకాలమునందే జీవించిన నన్నెచోడుని పద్ధతి 'దేశి' కవిత యనిపించుకొని మార్గకవిత్వమైన నన్నయ పద్ధతికి భిన్నముగానున్నది. అట్లే పాల్కురికి సోమనాథాదులు 'దేశి' పద్ధతిని అవలంబించగా, కేతన, తిక్కనాదులు మార్గపద్ధతిని అవలంబించి రచన చేసిరి. ద్విధా భక్తమైన ఈ కవితా పద్ధతి శ్రీనాథుని కాలమున కూడ ప్రచారము నందుండెనని చెప్పవచ్చును. నైషదాది మహాకావ్యములు కూర్చిన కవిసార్వభౌముడు మార్గ పద్ధతికి భిన్నమై 'దేశి' రచన యనిపించుకొన్న 'పలనాటి వీరచరిత్ర'ను రచించినాడు. ఇట్లు చూడగా నన్నెచోడునితో ప్రారంభమైన దేశి కవితా పద్ధతి ప్రజాదరమును పొందుచూ తెలుగు సాహితీ క్షేత్రమున పంటలు పండించుచునే ఉండెనని చెప్పవలసి యుండును.

క్రీ. శ. 16 శతాబ్దమున తెలుగు సాహిత్యములో స్వర్ణయుగము ప్రారంభము కాగా ప్రబంధమనెడు శాఖ ఆనాడు ఉత్పత్తి చెంది వృద్ధి పొందినది. తెలుగు ప్రబంధ రచన భాష, వస్తువు, కల్పన, అలంకారములు, రీతి, శయ్య, రసము, మొదలగు వానిలో సంస్కృత లాక్షణిక పద్ధతులకు సమీపముగా నుండుటచేత

ప్రబంధ కవిత్వమును సమ్యగ్గముగ మార్గ కవిత్వమునకే సమన్వయము చేసి పండితులు చూపించుచున్నారు. కాని ప్రబంధ కవులలో ధూర్జటి మహాకవికి దేశి కవితతో ఏమైన సంబంధము కలదా, ఉన్నచో ఆ సంబంధమెట్టిది యను విషయమును పొద్భళ్య సహితముగా ఈ ప్రకరణములో ఇంక చర్చింతును.

మొదట మార్గ - దేశి కవిత్వముల విషయము సంగీత శాస్త్రమందు ప్రస్తావింపబడెను. శార్ఙ్గదేవుడు సంగీత రత్నాకరమునందీ విధముగా చెప్పుచున్నాడు.

"యేషాం శ్రుతిస్వరగామ జాత్యాది నియమోనహి
నానాదేశగతిచ్ఛాయాదేశీ రాగాస్తుతేమతాః
కామాచార ప్రవర్తిత్వం దేశీ రాగస్య లక్షణం
నియమేతు సతి తత్రమార్గత్వ మనులక్షితమ్

అని మార్గ - దేశిరాగముల భేదమును వివరించెను. దీనిని బట్టి నియమరహితమైన కామాచార ప్రవర్తిత్వమును రసానుగుణ ప్రవృత్తియు దేశిరాగములకును నియమ సాహిత్యమును సర్వదేశ సమున రూపశాలిత్వమును, మార్గరాగములకు లక్షణములని తెలియుచున్నది. సంగీత సుధాకరము, సంగీతదర్పణము, స్వర మేళకళానిధి మున్నగు నితర సంగీత శాస్త్రగ్రంథములు కూడ లోకజన రంజనమున దేశికి ప్రధానముగా నిరూపించి యున్నవి. పండితులైన వారు దేశి సంగీతమును వదలి నియమసహితమును, శాస్త్ర బద్ధమునైన మార్గసంగీతమును గూడ నాస్వాదించి యానందింప జాలుటయు, సామాన్యజను లట్లుకాక హృదయ రంజకమైన దేశి సంగీతమునవలె బుద్ధిరంజకమైన మార్గసంగీతము నాస్వాదింపజాలమియు నవి యిట్లు చెప్పుటకు కారణము.

భాషయొక్కటియే కవిత్వము కాజాలదు. భాష, భావములు, రసము, చందస్సు, రీతి, వస్తువు, మున్నగు ప్రధానాంశములన్నియు కలసి కవిత్వమగును. పండితులయినవారు వీని లక్షణములన్నియు నెఱింగి తల్లక్షణానుగుణముగనే కవిత్వము వెలయించుచుందురు. పాండిత్యము లేనివారు కూడ వివిధ సన్నివేశములందు భావోద్రేకము కలిగి నప్పుడు కవితాసృష్టికి గడంగుచుందురు. వారు లక్షణ పరిజ్ఞానములేని వారగుటచే వారి కవిత్వమున గవిత్వాంగములకు

సంబంధించిన నియమములు పూర్తిగా గానబడక పోవుటయు నది సంప్రదాయ భిన్నములైన నవ్యతా లక్షణములతో భాసిల్లుచుండుటయు సంభవించును. ఈ రెండు రకములైన కవిత్వములలో పండితులచే లక్షణానుగుణముగా వెలయింప బడిన దానిని మార్గకవిత్వమనియు, లక్షణములతో సంబంధములేకుండ దమ హృదయరుచి ననుసరించి సామాన్య జనులచే వెలయింపబడు దానిని దేశి కవిత్వ మనియు జెప్పవచ్చును.

సలక్షణమైన భాష, ఉదాత్తములైన వస్తుభావములు సంప్రదాయ సిద్ధమైన ఛందస్సు లక్షణానుగుణమైన రసపోషణము మార్గకవిత్వమునకు లక్షణములు. ఇంక తెలుగున మార్గ - దేశి పదములను కవిత్వపరముగా వాడిన మొదటికవి నన్నెచోడుడు. అతడు కావ్యారంభమున నిష్టదేవతా స్తుతియు, గురుప్రశంస గావించి తరువాత వాల్మీకి వేదవ్యాస కాళిదాసులను, ఉద్భటుడు బాణుడు మున్నగు కవులను స్తుతించెను. వీరందరు సంస్కృతములో గవిత్వము చెప్పిరి.

తదుపరి మార్గ-దేశి శబ్దములను ప్రయోగించుచు నీ క్రింది పద్యములు చెప్పెను.

మును మార్గకవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జాళుక్య రాజు మొదలుగ బలువుర్

(కుమార సంభవము 1 ఆ. 28 పద్యం)

సురవరులం గ్రమంబున వచో మణి సంహతి బూజచేసి మ
ద్గురు చరణారవిందముల కుందగ సమ్మతిజేసి కొల్చివి
స్తర మతులం బురాణ కవిసంఘము ముత్తమమార్గ సత్కవీ
శ్వరులను దేశి సత్కవుల సంస్తుతి జేసి మనోముదంబునన్.

(కు. సం. 1 ఆ. 24 పద్యం)

మార్గకు మార్గము దేశియ
మార్గము వగవంగ దమకు మది వదలక దు

ర్మార్గ పదవర్తులనదగు
మార్గవులం దలప నంతి మహి సుకవులకున్
(1 ఆ. ౨౮ పద్యం)

మృదురీతిసూక్తు లింపొదలింబలుకులిల్లు
భావమ్ము నెలిమి గ్రీడావహముగ
మెఱుగుం గన్నుల మిఱుమిట్లు వోవంగ
గాంతి సుధాసూతి కాంతి జెనయ
వర్ణన నెల్లచో వర్ణన కెక్కంగ
రసములు దళుకొత్తిరాలు వాఱ
దేశిమార్గంబులు దేశీయములుగా న
లంకారముల దానలంకరింప (కు. సం. 1 ఆ. ౩౮ పద్యం)

పూర్వకాలమున మార్గ కవిత లోకమునందు వెలయగా చాళుక్య రాజు మొదలగు వారు ఆంధ్రదేశములో దేశికవిత పుట్టించి తెలుగున నిలిపిరని మొదటి పద్యభావము. మరి నన్నెచోడుడు పేర్కొన్న మార్గ కవిత్వమెట్టిది? అదియేమైనను మున్ను లోకమున వెలసెనని అతడు చెప్పినాడు. 'లోకము' యను శబ్దము వాడుటతో మార్గ కవిత్వమొక యాంధ్ర విషయముననే కాక ఇతర దేశములలో కూడా వ్యాపించి యుండెనని యూహించినట్లు తోచుచున్నది. ఇందు తమిళ కర్ణాట దేశములు ముఖ్యములు. కుమార సంభవ కావ్యమువలన నన్నెచోడునకి రెండు దేశములతో పరిచయమున్నట్లు తెలియుచున్నది. కన్నడ కవులు మార్గ- దేశి కవిత్వములను ప్రవేశపెట్టిరనియు తెలియుచున్నది. కన్నడ కవులగు పంపాది కవులకు పూర్వము కూడ కన్నడమున గద్య పద్యాత్మకములైన కావ్యములు రచింపబడినట్లు నృపతుంగుని 'కవిరాజమార్గము' వలన తెలియుచున్నది. భాషాచ్ఛందస్సులను బురస్కరించుకొని యందలి రచన మార్గ పద్ధతికి జెందెనని చెప్పవచ్చును దీనిని బట్టి క్రీ. శ. 700కు పూర్వము నుండి కన్నడమున మార్గ కవిత ప్రచారమందుండెనని తలపవచ్చును.

నన్నెచోడుడు తనకు పూర్వము కన్నడమున రచింపబడి యుండిన వాఙ్మయముతో పరిచయముండుట వలన వానిలో నెక్కుమార్గ కవితా పద్ధతిని రచింప

బడినవే యగుటవలన "మునుమార్గ కవిత లోకంబున వెలసె"నని చెప్పెను. చాళుక్య రాజాములు తెలుగున నట్టి మార్గ కవిత్వమునుగాక దేశికవిత్వమును బుట్టించి తెలుగున నిల్పుటకు యత్నించి యుండిరని భావము. ఈ చాళుక్యరాజు రాజరాజనరేంద్రుడు కాదనియు నాతని పూర్వులలో నొకడై యుండుననియు దోచుచున్నది. అతడే చాళుక్య రాజైనచో 'బుట్టించి' యను పదమున కర్థము కుదరదు. ఏం యనగా నతనికి బూర్వము గూడ దేశి రచన నున్నదనుట కాధారముగా శాసనములు గలవు. అందలి పద్యములు సీసము, తరువోజ, మధ్యాక్కర మొదలగు దేశిఛందములకు మాత్రమే చెందియున్నవి. రాజరాజే దేశికవితను బుట్టించిన వాడ నినచో నన్నయ భారతము దేశి కవితయని చెప్పవలసి వచ్చును. కాని భాష, ఛందస్సు, వస్తువు, వర్ణనాదులను బురస్కరించుకొని చూచినచో భారతము మార్గ కవితయే గాని దేశికాదు.

తరువాత నన్నెచోడుడు 'సురవరులం గ్రమంబున'యను పద్యముచెప్పెను. ఇందు కావ్యారంభమున గావించిన స్తుతిక్రమ మంతయు సింహావలోకన మొనరించెను. పూర్వకవిస్తుతిలో వాల్మీకి, వ్యాస, కాళిదాస, భారవి, ఉద్భటు, బాణులను స్తుతించెను. తదుపరి దేశికవిత సృష్టించిన చాళుక్యరాజు బృందమును స్మరించెను. [1]ఈ స్తుతిలో వాల్మీకి మొదలు బాణుడు వరకూ కవులందరూ సంస్కృత భాషా కవులే. అనగా మార్గకవులే అయినా నన్నెచోడు దందరినీ మార్గకవులుగా పేర్కొనలేదు. కావ్యపురాణ నిర్మాతలైన వాల్మీకి వ్యాసాది కవులను విస్తారమైన నబుద్ధులుగల పురాణకవి సంఘముగా పేర్కొనెను. కాళిదాసాది కవులను ఉత్తమ మార్గ సత్కవులుగా పేర్కొనెను. ఇట్లు ద్వివిధముగా పేర్కొనుటలో నన్నెచోడునకు ప్రత్యేక ఉద్దేశ్యమున్నట్లు తోచుచున్నది. వాల్మీకి వ్యాసుడు మొదలైన విస్తర మతులైన పురాణ కవులందరూ పూజ్యులు ఉత్తములు. ఇచట పురాణ శబ్దమునకు 'అతిపురాతన' యని యర్థము చెప్పవచ్చును. పురాణ కవులుకాక తక్కిన కావ్య నాటక గద్యకావ్య గ్రంధ నిర్మాతలైన సంస్కృత కవులలో ఉత్తములు ఉత్తములు కానివారు గలరట పురాణకవి సంఘమునకు తరువాత వెలసిన కవులందరూ సంస్కృతములో కవిత నల్లిన ప్రతికవి మార్గకవి యనిపించు కొనుట కవకాశము

---

1. పరిశోధనా వాఙ్మయము (మార్గ-దేశి) వర్ధమూడి గోపాలకృష్ణయ్యగారు, (పుట-76)

లేదుగదా! అందుచేతనే నన్నెచోడుడు వాల్మీకి వ్యాసాది పురాణకవి సంఘము విస్తరమతులు కందగుటచే ఉత్తమాను త్తమ భేదమెన్నకుండ వారినందరినీ స్తుతించెను. అనంతరపు సంస్కృత (మార్గ) కవులైన పెక్కుమందిలో తనకు నచ్చిన ఉత్తములైన సత్కవులను కాళిదాసు, భారవి, ఉద్భట, బాణులను స్తుతించెను. పురాణకవి సంఘము పేరుతో మహర్షులైన కవులను వాల్మీకి వ్యాసుల నిద్దరినే స్తుతించెను. వారిరువురినే 'పురాణకవి సంఘమని' పరిగణించినాడా యని సందేహము కలుగవచ్చును. వీరుకాక ఇంకను పురాణ కవులాతని దృష్టియందుండుట వలననే 'సంఘ' శబ్ద ప్రయోగము చేసెనని చెప్పవచ్చును. వాల్మీకి వ్యాసులకు భిన్నులైన పురాణకవి మహర్షులెవరో ఈతని దృష్టియందుండుట వలననే కాళిదాసును స్మరించుచు ఈ విధముగా వ్రాసెను.

భాసురమతి వాల్మీకి
వ్యాసాదులు చనిన జగతి వరకవితా సిం
హాసనమెక్కి కవీంద్రుల
దాసులగానేలె గాళిదాసుడు పేర్మిన్!

ఈ పద్యమున వాల్మీకి వ్యాసాదులు అని 'ఆది' శబ్దమును ప్రయోగించుటకిదియే కారణము. కనుక వాల్మీకి వ్యాసులకు భిన్నులైన పురాణ కవి మహర్షులు కొందరు చోడుని దృష్టిలో యుండి యుందురని స్పష్టమగుచున్నది. అందువలననే "పురాణ కవి సంఘ"మని యితడు చెప్పెను. ఇంతకూ వాల్మీకి మొదలు బాణుడు వరకూ నన్నెచోడుడు స్తుతించిన సంస్కృత కవులందరూ మార్గ కవులే యని స్పష్టమగుచున్నది. ఇక దేశి కవులన్న మామూలు నన్నెచోడుని దేశ భాషయైన ఆంధ్ర భాషా కవులే గాని వేరుగాదు.

నన్నెచోడుడు సంస్కృత పదములను సంస్కృత విభక్తులు చేర్చి ప్రయోగించిన వారి పద్ధతి సేవగించెను. ఆరోజులలో సంస్కృతభాష వాడువారు సంస్కృత పదములు సంస్కృత విభక్తులతో వాడెడివారు. దీనినే మణి ప్రవాళ శైలి యందురు. తిక్కన నిర్వచనోత్తర రామాయణమున కూడ సంస్కృత పదములు వాడెను సంస్కృత పదములు సంస్కృత విభక్తులతో మాత్రము

వాడవని అతడు చెప్పెను. దీనికి దృష్టాంతము నిర్వచనోత్తర రామాయణ పీఠికలో "కావ్యముగాని నొప్పయి సంస్కృత మెప్పుడు కొన్న"వని చెప్పుటయే.

ఇక 'మార్గకు మార్గము'యను పద్యము చెప్పినాడు. ఇది యతని యభిప్రాయమే యైనచో అతడు రెండు మార్గములకు జెందిన కవులను గొల్చియే యుండడు. అందుచే నీ యభిప్రాయ మాతనిది కాదనియు, నాతనిచే బరిహరింపబడిన మార్గ కవుల దనియు దోచుచున్నది. ఈ మార్గకవులు మణి ప్రవాళ పద్ధతి నవలంబించినవారే. వీరికి సంస్కృత పదములను దత్సమములుగా జేసి దేశ భాషా పదములతో గలిపి చెప్పు మార్గ కవిత్వమునెడ గాని దేశి కవిత్వము నెడగాని ప్రీతిలేదు. "వీరిది తృతీయ పంథాః" వీరికి మార్గముకు మార్గము దేశీయ మార్గము· రెండు పద్ధతులు నచ్చవు. కావున మాట్లాడ కూరకుండుటకు వారికి మనస్సొప్పదు. అందుచే వారొక క్రొత్తమార్గ మవలంబించిరి. అదియే సంస్కృత పదములను సంస్కృత పదములుగనే యుంచి దేశి పదములతో గలిపి చెప్పు మార్గము. నన్నెచోడుని కిది దుర్మార్గము. ఉత్తమ మార్గ మాతనికి ప్రీతికరమే. అందుచే నాతడు తమకు (మార్గకవులకు)

వగవంగ—ఆలోచింపగా
మార్గ—సంస్కృత పదములను దత్సమీకరించి చెప్పు మార్గము
కుమార్గము—కుత్సిత మార్గము
దేశి—కేవల దేశి కవిత్వము
అమార్గము—మార్గమే కాదు.

అయినను కవిత్వమును పూర్తిగా విడిచివేయుటకు మది (మనస్సు) వదలక (విడువక) దుర్మార్గ పదవర్తులు (మణి ప్రవాళమును పదమున వర్తించువారు) అగు మార్గ కవులను సుకవులు తలప నక్కఱలేదని హేళన పూర్వకముగా జెప్పినాడు. నన్నెచోడునకు గవిరాజ మార్గ నిర్దిష్టమైన మార్గ ముత్తమ మార్గము. అతి సంస్కృతాభిమానులైన మార్గకవు లవలంబించు మణి ప్రవాళము 'దుర్మార్గము' అందుచేతనే యత డుత్తమ మార్గ సత్కవీశ్వరులను బొగడి దుర్మార్గ పదవర్తులైన మార్గకవులను దెగడెను. మార్గకవుల యభిప్రాయములో మార్గకు మార్గము దేశి అమార్గము. ఇచట కుమార్గ-అ-మార్గ పదముల కర్థమున వ్యత్యాసమున్నది.

కుమార్గ మనగా కుత్సితమైన మార్గము. అదియు నొక మార్గమే గాని చెడ్డ మార్గము. అమార్గ మనఁగ మార్గమే కాదు. అందుచే ననుసరింపదగినదే కాదు.

ఆదినుండియు మార్గ కవిత్వమున అక్కడక్కడ దేశి కవితా ఛాయలు, దేశి కవిత్వమున మార్గ కవితా ఛాయలును గొన్ని కానవచ్చుచున్నవి. ఉదాహరణకు నన్నయ భారతములో మార్గ కవితయే గలదు. కాని మధ్యాక్కరలు, తరువోజలు కాన్పించుటచే దేశిఛాయలు కన్పించుచున్నవి. కాని సంస్కృత భూయిష్ఠమగు రచన. శార్దూల మత్తేభ చంపకోత్పలమాలా వృత్తములే ఎక్కువ. అందుచే మార్గ కవిత్వమనియే చెప్పనగును. నన్నెచోడుని కుమార సంభవ రచన యంతయు మార్గ పద్ధతినే నడచినది.

శివ కవులు (పాల్కురికి సోమనాధుడు మున్నగువారు) 'జానుతెనుగు' యని పేర్కొనుట మనకు విదితమే. నన్నయాదు లిట్టివి పేర్కొన లేదు. కారణము నన్నయ మున్నగు వారుపయోగించిన భాష సంస్కార రూపమున పరిణామమును పొందిన తెనుగు భాష, ఇదియే మార్గ పద్ధతి.

అర్థ బిందువులుగల శబ్దములను పూర్ణ బిందువులుగ చూపి దానిని ప్రాస స్థానమందు ప్రయోగించుట జానుతెనుగు సాంప్రదాయమే. అర్థబిందువు తెనుగున తప్ప సంస్కృతమున నుండదు. కావున అర్థ బిందు వ్యవస్థ లేని సంస్కృత పద పూర్ణబిందువులతో తెలుగున పూర్ణ బిందువులుగల పదముల నుపయోగించిరి.

ఉ.అ. "పొంది గనగల తపశ్శిఖిమూందు జగంబులను తీవ్రముగ నిక్కిన బ్రహ్మాండము కాచిన కాంచన భాండము క్రియఁగ్రాగె తత్ప్రభాభాసురమై" (కుమార సంభవము 6-157) ఇచట "పొంది మూందు" పదములను సంస్కృతమున బ్రహ్మాండ 'భాండ' శబ్దములతో ప్రాసకుదురుకొన్నది. ప్రజా సాహిత్యములో నిప్పటికిని నర్థ బిందువులు గల పోఁడి మూఁడి పదములను పూర్ణబిందువులతోడనే వాడుదురు. ఇప్పటికిని, కొన్ని ప్రాంతముల జానపదులు 'ప్రాంక వింక పంటు,' పేంట మొదలగు పూర్ణబిందు పదములనే వాడుదురు. ఇవి దేశి సాంప్ర

1. సారస్వత వ్యాసములు (మార్గదేశి) డా॥ దివాకర్ల వెంకటావధానిగారు.

ధాయమునకు సంబంధించినవి. నన్నయాది రచనలకును శివకవుల రచనలకును ఈ మార్గ-దేశి పద్ధతి యందే భేదము కన్పించుచున్నది. సోమనాథుని తొలి కృతి యగు 'అనుభవసారము'న మాత్రమే ఇటువంటి దేశి సాంప్రదాయము లేదు.

నేటికిని కన్నడాంధ్ర సరిహద్దులలోని తెనుగు వారు కన్నడ పదము లుపయోగించుటయు, ద్రావిడాంధ్ర సరిహద్దులలోని తెనుగువారు తమిళ పదము లుపయోగించుటయు మనము చూచినదే. ఈ పద్ధతియే ధూర్జటి కావ్యమందు కన్పించుచున్నది. తమిళ దేశమునకు కాళహస్తి దగ్గర ప్రదేశమగుటవలన ధూర్జటి తమిళ పదములు వాడెను. శైవ సంబంధమగు కావ్యమగుటవలన కన్నడ పదములు కూడ కవి వాడెను. ప్రథమాశ్వాసమున బిజమాడు, మాదబేడు, ఇత్యాది కన్నడ పదములు ఇందుల కుదాహరణములు.

వైష్ణవము తమిళదేశమునుండి వచ్చినట్లుగనే, శైవమతము కన్నడదేశము నుండి వచ్చుటచేత ఆ పారిభాషిక పదములన్నియు కన్నడము నుండియే వచ్చి నవి. దక్షిణదేశమున కర్ణాటక ప్రాంతము వీరశైవమున కగ్రపీఠము. అచటి జంగ ములు మతప్రచారకులయి యితర ప్రాంతములకు వచ్చుచుండురు. దాసి కన్నడ పదము లుపయోగించి ప్రార్థించినచో జంగము తృప్తిపడి తన ప్రార్థన నంగీక రించునని రాజదాసి యాశయమై యుండును. అందుచేతనే యట్లాశ్వాసించినది. (చూ॥ కా. మా. ప్ర. ఆ. 128 పద్యం.)

ఇంక తృతీయాశ్వాసమున నత్కీరునికథలో, మజ్జాస, పొజ్జాస మున్నగు తమిళ పదములు ధూర్జటి ప్రయోగించెను. తమిళదేశమునకు దగ్గర ప్రదేశము శ్రీకాళహస్తి, కావున అట్టి పరిసర ప్రాంతమునందలి కథ గనుకను, తరువాత నత్కీరుని కథ తమిళ వాఙ్మయ మందు కూడ గలదు గావునను ధూర్జటి ఇచట నిట్టి ప్రయోగములు చేయుట కవకాశ మెంతేని గలదు.

ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నందలి వస్తువు దేశీయ మైనది. సంస్కృతముతో సంబంధము లేక లోకములో ప్రచారమందున్న కథలు ధూర్జటి వ్రాసెను. ఈ కథలు అష్టాదశ పురాణములం దెచటను నున్నట్లులోచదు. తెలుగుదేశములోనిదైన శ్రీకాళహస్తి క్షేత్రమునకు సంబంధించిన కథలనే ధూర్జటి

ఎన్నుకొనెను. శ్రీకాళహస్తిలో ఈ క్షేత్రమునందు మోక్షము వడయుట యిందు గల విశేషము. అట్లే నత్కీరుని కథ, వేశ్యాతనయల కథ, తిన్నని కథ దేశీయములే. ఈ కథలను ఎరికించిన పరమేశ్వరానుగ్రహమునకు భక్తిహేతువై నట్టితరములు గావని తెలిసికొన గల్గుదుము. బహుజన్మ పుణ్యఫలముననగాని భగవంతుని యందు భక్తి జనింపదు. భక్తునకు నాశము లేదు. 'నమే భక్తః ప్రణశ్యతి' యను భగవద్వాక్యమున కీకథంతో సమన్వయము గోచరించును. భక్తుని సమస్తము భగవంతుని కర్పణ చేయదగినది. యజ్జుహోషియదశ్నాసేత్యాది వాక్యముల కీభక్తుల గాథలతో సమాచారము గనబడును. శైవవ్రతములలో ఇష్టదానమను వ్రతము గలదట. శివస్వరూపుడగు జంగమున కేది యిష్టమో దానిని కాదనక భక్తు డీయవలెను. ఇది పరమ భక్తికి నికషోపలము. మిండజంగముల ప్రసక్తియిట్టి భక్తిపరీక్షా సందర్భములలోనే గలుగుచుండును. కాళహస్తిమాహాత్మ్యములో శౌలుదొత్తినే యిట్టి మిండ జంగము గోచరించుచున్నాడు. ఈ కథలన్నింటిని కావ్యరూపమున గూర్చి ధూర్జటి గ్రంథమున కొక ప్రామాణికత్వము కల్పించెను.

ఇక భాషాపరముగా నాలోచించిన యెడల రచనా విధానమును చూచినను మార్గకవిత్వమే కావ్యమంతటను కాన్పించును. ఉదాహరణకు ప్రథమాశ్వాసమున వశిష్ఠుడు తపస్సు చేయు సందర్భమునందలి దగు ఈ క్రింది పద్యము చూతము. ఇది శార్దూల వృత్తము.

శా॥ శుండాలార్భక షండ గండతల ఖర్జూఖర్జనోపార్జనా
ఖండగ్రావము, చండ కుండలి విశంకవ్యాప్తి కింపైన శ్రీ
ఖండ స్థాణువు, శారికా శుక విహంగవ్రాత షండ్రేఖు కో
దండ క్రీడకు నీడమై, తపమున స్థైర్యంబునం జేయగన్

(ప్ర. ఆ. 78 పద్యం)

ఇందలి సమాసముల కూర్పు, కఠినమైన శైలి పరిశీలించిన ధూర్జటి మార్గకవిత్వము నెట్లు ప్రతిపాదించెనో తెలియుచున్నది. ఇట్లే నత్కీరుని కథలో నత్కీరుడు తీర్థయాత్రా సందర్భమున వ్రాసిన శార్దూలవృత్తము కూడ మార్గపద్ధతి కుదాహరణముగా చూపవచ్చును. ఇది యొకటియేకాదు. ధూర్జటి కావ్యమున శార్దూలముల

22, మత్తేభములు 17, చంపకమాలా వృత్తములు 14, పంచచామరములు 4. ఈ విధముగా సంస్కృత వృత్తము లధికముగా గలవు.

శా॥ దెవ్వం, దీశ్వరు నీశ్వరేశ్వరుని గాంచెన్, భీషణాంహోలతల్
ద్రెవ్వం, దీవ్రతరాంగ సంభవ శరశ్రేణీవిదాహ వ్యథల్
వివ్వం, దీఱని భక్తితో హృదయ మావిర్భూత మోదంబునన్
నవ్వం, దీగయుబోలె ఱాదుక్క లొదవ నత్కారు దుత్కంఠతన్
(త. ఆ. 180 పద్యం)

ఈ పద్యమందు ఉత్తరదిశ క్షేత్రవర్ణన జరిగినది. ప్రథమాశ్వాసమున అగస్త్యుడు శివుని స్తుతించుట యను ఘట్టమున ధూర్జటి దండకము వ్రాసెను. అదికూడ సంస్కృతభూయిష్ఠమగు రచనయే. మచ్చునకు "శ్రీమన్మహాదేవ ! దేవాదిదేవా నిమగ్నీకృతాజాండ ఖండప్రకాశా ! మహేశా ! మహాయోగిపుంయోగనిద్రాసము న్నిద్రితానందరూపా ! భవార్ణోనిధానాంతరాపన్న రత్నాంతరీపా ! జగద్దీప ! సద్దీప! బ్రహ్మాండ పిండాండ బాహ్యాంతరాళంబులం బూర్ణమై సూక్ష్మసూక్ష్మార్థమై స్వార్థమైయున్న నిన్నున్ మహామాయచే జీవునింజేసి, మహాదితత్త్వాత్మకంబైన దేహంబు గేహంబుగా నిల్పి, త్రైగుణ్యమున్ గణ్యమున్ బుద్ధ్యహంకారచిత్తంబులున్ జ్ఞానకర్మేంద్రియంబుల్ షడంతర్విరోధుల్ ఘనక్లేశముల్ పాశముల్ కోశముల్ జన్మనాశాద్యవస్థల్ వృథా నీకు గల్పించి, సత్కర్మ బంధంబులం జిక్కి" .... (కా. మా. ప్ర. ఆ. 146).

ఇట్లు మార్గపద్ధతి ననుసరించి ప్రబంధమార్గము ననుసరించి ధూర్జటి కావ్య రచన గావించినను వస్తువు దేశీయమైనది తీసికొని రెండింటికి చక్కని సంబంధము గూర్చి కావ్యరూపమున ధూర్జటి తీర్చిదిద్దెను. ద్వితీయాశ్వాసమున శ్రీకాళహస్తుల కథ దేశీయమైనది. ఇందు ధూర్జటి రగడ ప్రవేశపెట్టినాడు. కాళహస్తి ప్రాంతము అచట సాలెపురుగు, నాగము, ఏనుగు శివసాయుజ్యము ఎట్లు బడసినది మనకు చెప్పినాడు. ఇందు క్షుద్రవేయభద్రగణములు రుద్రగణాకారంబులు దాల్చగా శివుడు ప్రత్యక్షమయి 'మీ యభీష్టము లెయ్యవి ?' యని అడుగగా సాష్టాంగదండప్రణామంబులు గావించి యిట్లు నుతించిరి. అదియే రగడ.

జయజయ ! కలశీసుత గిరికన్యాకైతవలిపీఠట కల్ప మహీరుహ !
జయజయ ! దక్షిణజలక్షితిధర సంయమిసేవిత పాదసరోరుహ !
జయజయ ! పీనజ్ఞాన ప్రసవాచలకన్యాకుచదృఢపరిరంభణ !
జయజయ ! కృతదుర్గాధరణీధరసాను వినోద విహారవిజృంభణ!
జయజయ ! భారద్వాజాశ్రమ నవ సరసిజ కేళివనపరితోషిత !
జయజయ ! నీలక్ష్మాధర పుణ్యస్థలశాపాలితభాషిత భూషిత !
జయజయ ! మోహనతీర్థాలోకన సంభ్రమ రత భవబంధ విమోచన !
జయజయ ! శిఖితీర్థాశ్రిత యోగీశ్వర మానస సంవిత్సుఖసూచన !

యని శివుని స్తుతిపూర్వకముగా ప్రార్థించినది.

ఇందలి భారద్వాజాశ్రమ, నీలపర్వత, మోహనతీర్థ, శిఖితీర్థ, మార్కండేయ తీర్థ, ఇంద్రతీర్థాదుల వృత్తాంతము శివపురాణములందున్నదని వెంమచర్ల రంగాచార్యులుగారు తమ టీకలో వ్రాసిరి. (కాళహస్తి మాహాత్మ్యము పుట. 127)

ధూర్జటి శార్దూల,చంపక వృత్తములతోపాటు సీసము, ఆటవెలది, కందము మొదలగువానిని కూడ వాడెను. ఇక తిన్నని కథలో దేశీయత ఉట్టిపడుచున్నది. తిన్నడు ఆటవికుడు. విలువిద్యాజ్ఞానమేగాని సంస్కృత భాషా పరిచయము లేని వాడు. మూఢభక్తుడు, అటువంటి కథను ధూర్జటి మనకు చెప్పుచున్నాడు గనుక దేశీయమైన ఆచారములు, తిన్నడు విలువిద్య లభ్యసించుట, బోయలు జాతితేని జాతర చేయుట మొదలగు విషయములు మన కన్నులకు కట్టినట్లు తృతీయాశ్వాసమున వర్ణించినాడు.

ఉదాహరణకు : చెంచెతలు ఎట్లుండురో ఈసీసపద్యము చూచిన తెలియును.

సీ. పట్టుచీరల గట్టు భాగ్యంబు గల్గియు
నాకుటాకుల గట్ట భార మనరు,
రాజాన్న భోజన ప్రౌఢత శ్రీగల్గి
యును వన్యధాన్యంబు నొల్లమనరు,
మాణిక్య భూషా సమూహంబు గల్గియు
నెల్లని గురువింద లేదె కనరు,

మంచిమెత్తం దూగు మంచమ్ములల్లియుఁ
 దాలు బూదీగ యుయ్యాలలనరు,

ఎంత సంపద గల్గియు నెట్టివారు
దమ కులాగత ధర్మ కర్మములు విడువ
కొంరటు కానఁ దత్పురీ కవర సతులు
మహిమ గలిగియు మానరు సహజవృత్తి (ర్వ.అ. 5 పద్యం)

ఇచట చెంచెతలు తమ కెంత సంపదయున్నను, ఎట్టివారును తమ కులాచార ధర్మములు, కర్మములు విడువక తమ సహజవర్తనము మానరు. పట్టుచీరలు కట్టుకొన్న భాగ్యమున్నను పండుటాకులనే ధరింతురు. సన్న బియ్య మన్నము తిను సామర్థ్య సంపదయుండియు, అడవి ధాన్యము తినుటమానరు. మాణిక్యాలంకారము లుండి కూడ ఎఱ్ఱని కురువిందలే ధరింతురు. ఇవి వారి యాచార వ్యవహారములు. దేశీయత ఉట్టిపడునట్లు ఈ ఆశ్వాస రచన గావించినను సంస్కృత భూయిష్ఠమగు మార్గకవిత లేకపోలేదు.

మ. అగురుక్ష్మారుహ కాష్ఠఖండముల సర్వాంగంబులంజేసిమై
మృగనాభిన్మసిపూసి చామరము ధమ్మిల్లంబుగా జుట్టియే
నుఁగు కుంభమ్ములలోని ముత్యములఁగన్నుగ్దుల్విర్నిర్మించి, బి
ల్లగజేంద్రుల్వెఱ బొమ్మలందవిదచేలం జేయుదుర్ గాపుగన్
(ర్వ.అ.7)

ఈ సంస్కృత వృత్తమగు మత్తేభము. ఇందు బోయలు తమ చేలలో దిష్టి బొమ్మలుగా చేసి ఎట్లు పెట్టెదరో వర్ణించినాడు కవి. ఇచట వారి యాచారములు దేయములు. ధూర్జటి వ్రాసిన పద్యము సంస్కృత భూయిష్ఠ రచన. ఇచట ఈ రెంటికి చేసిన సమన్వయము గొప్ప విశేషము.

అగురు చెట్ల కఱ్ఱముక్కలతో అన్నియవయవములను చేసి, ఆశరీరమునకు కస్తూరితో మసిపూసి, చమరీ మృగముల తోకలను జుట్టుగా జుట్టి, ఏనుగుల కుంభ స్థలములందలి ముత్యములతో కనుగ్రుడ్లు చేసిపెట్టి, ఎలుకు పోనులు

దిష్టి బొమ్మలు తయారు చేసి, తవిద చేంలో కాపుగా బెట్టుదురు. ఆవేశపు ఆదారమును గూర్చి తవి చెప్పెను.

తిన్నడు బాల్యమునందు చెంచుం బిడ్డంతో గూడి బాల్యక్రీడలాడుట వర్ణితము. ఆయాటలన్నియు దేశీయమైనవే. (మూ.తృ.ఆ.

వేఱొకచోట తిన్నడు శివుని కంటివెంట నీరు కారగా వైద్యము చేయ మొదలిడును. ఇచట కూడ మనకు దేశకవిత కన్పించును. కంటికి మందులు వేయుట, దేశీయ వైద్య విధానములో గల రకములు యీ ఘట్టమందు వర్ణితములు. అడవి యందు రకరకముల చెట్లుండును. అందు వైద్యమునకు పనికివచ్చు దినుసులు ఎన్నో రకముల ఆకులు ఉండును. వాటినన్నింటిని తిన్ననిచే శివుని కంటి కౌషధములుగా వాడి ధూర్జటి ఆ దేశివైద్యవిధాన మంతయు మనకన్నుల యెదుట ఈ దిగువ సీసమున వర్ణించినాడు.

సీ. కోక పొట్లం బావిగొన నూది యొత్తుచుఁ,
గవణోష్ణకతర భాగమున గాచి
నెత్తి తంగేడాకుమెత్తి, రేచకి నిమ్మ
పండి సీరున నూటి పట్టువెట్టి,
తెల్లదింటెన పువ్వుదెచ్చి తద్రసమిడి,
కలివె పువ్వులు గోసి నలచి పిడిచి,
పేరిననేయివెట్టి, పెరుగువత్తులు వైచి
చనుబాలతో రాచి నంటు చమిరి,

గీ. విన్న మందులు, తా సరితన్న మందు,
లడిగి తెచ్చిన మందులు, నడవి మందు
లెన్ని చేసిన మానక, యిందుమౌళి
కన్ను తొడిబడి నెత్తురు గాఱుటయును

(తృ.ఆ. 110 పద్యం)

వైద్యుల సహాయము లేక పల్లె ప్రజలు అడవిలో దొరకు ఆకులు అలములతో కొంత వైద్యము చేయుదురు. పల్లెప్రజల యాదారములలో యిటువంటివి

తరుచుగా మనకు కాన్పించును. అందున తిన్నడు బోయవాడు. అవిద్యాపరుడు. అందుచే అతని పాత్రకు తగినట్లు కవి యిచట నీ దేశివైద్యవిధానమంతయు అతనిచే శివునికి చేయించినట్లు వర్ణించుటయు యుక్తి యుక్తముగా నున్నది.

మీరి వస్త్రమును పొట్లము చేసి, ఆవిరి వచ్చునట్లు నోటి గాలితో నూది యాకులతో నొత్తుచు, చేతి మడమను రెండవ చేతి మీద రాచి, నులివెచ్చని యామడమతో కాపుగాచి, నెత్తిని తంగేడాకుమెత్తి, కరకకాయను నిమ్మపండు రసముతో నూరి యాగంధమును కంటికి పట్టువేసి, తెల్లగింజెన పువ్వు రసము పోసి, కలివెపువ్వులు గోసి నలిపి యారసము పిండి, పేరుకొన్న నేయిని గంటిలో బెట్టి, పెరుగువత్తులు వేసి, చనుబాలతో రాచి, శంఖముతో నొత్తి (ఈ ప్రక్రియ లన్నియు నీనాటికిని కంటి వైద్యమునకై పల్లెలలో జరుగుచున్నట్టివే) తాను విన్న మందులు, సరగా కన్నమందులు, అడిగి తీసికొని వచ్చిన మందులు, అడవి మందులు, ఎన్నిటి నుపయోగించినను చంద్రశేఖరుని కన్నునీరు గాఱుట మానక పోవుటయేగాక, నెత్తురు రక్తము కాఱుట మొదలిడెనని ఈ పద్య భావము.

ఇక తిన్నడు శివున కాహారమొసగు విధమున దేశీయత పొడకట్టును కఱకుట్ల నందించుట యిత్యాది విషయములు.

క. కాంచవో, క్రొవ్వవో, మాడం
గాలెనో, చవిగావొ, కమ్మగావో, నీకున్
జాలవొ, యలవడవో, తిన
వేలా కఱకుట్లు? పార్వతీశ్వర! చెపుమా!

(తృ.అ. 87)

పరమేశ్వరుడు కఱకుట్ల నారగించక పోగా తిన్నడు పై విధముగా ప్రశ్నించు చున్నాడు.

ఈ మాంసము కొఱకు తిన్నడు ప్రయత్నించు సందర్భము నందలిదే యగు ఈ క్రింది శార్దూలము సంస్కృత భూయిష్ఠమగు రచనతో కవి మార్గత్వ ముట్టిపడునట్లు రచన చేసెను.

శా. తిన్నండంతట దేవదేవునకు భక్తిం దృప్తి గావింప, నా
సన్నగ్రావ మహాటవుల్దిరిగి, దంష్ట్రాటంక కోటీపుట
చ్ఛిన్నక్ష్మాజవరాహమున్గెడపి, కాల్చెన్ క్రొత్తక్రొవ్వగ్నిం, గరున్
జెన్నైయుండెడి మాంసఖండములు నించెం దొప్పలం బొప్పరన్

(శ్రీ ఆ. 80)

ఇక ఇదే ఆశ్వాసమున గల నత్కీరుని కథ దేశీయమైనదే. కాని, క్లిష్టమగు సంస్కృత భూయిష్ట రచన ఆయా సందర్భములందు గలదు. నత్కీరుడు చదువుకున్నవాడు, జ్ఞాని గావున ఆ పాత్రకనుగుణముగా ధూర్జటి సంస్కృత భూయిష్ఠ రచన గావించి యుండును. చతుర్థాశ్వాసమున గల వేశ్యాపుత్రికం వృత్తాంతమంతయు దేశీయమే. వేశ్యలు జంగమ స్త్రీలగా మారుట యిత్యాది విషయములు వివరింపబడినవి. సంస్కృతముతో మాత్రము నికట సంబంధము లేదు.

ప్రథమాశ్వాసము నందలి కథ సంస్కృతయితివృత్త మాధారముగా వ్రాసినది గావున మార్గ పద్ధతినే నడచినదని చెప్పనగును. ఇందు సంస్కృతము అధికము. ఆటవెలది, తేటగీతి మొదలగు వాని సంఖ్య తక్కువ. ఆటవెలది 1 తేటగీతులు 3 మాత్రమే ప్రథమాశ్వాసమున గలవు. ప్రబంధములందు సామాన్యముగా వచ్చు సంప్రదాయమునే ధూర్జటి కూడ అనుసరించి శార్దూల విక్రీడితము తోనే కావ్యము ప్రారంభించెను. ఈ గ్రంథమునకు కృతిపతి మాహేశ్వరుడే. అతనిం గూర్చిన పద్యములు (షష్ఠ్యంతములు) అయిదు కందపద్యములు గలవు. ప్రబంధ మందు 'ఈ వృత్తములందవలెను, వేరే వృత్తములుండ కూడదు' యను నియమమేమియును లేదు. కాని సాధారణముగా కవులు ప్రబంధమునందు ఏదేని ఒక చోట దండకము. రగడ యిత్యాదులు ప్రవేశపెట్టెదరు అట్లే ధూర్జటియు చేసెను.

పైన వివరించినట్లుగనే ధూర్జటి ఈ కావ్యమునందు మార్గ - దేశి కవిత్వములు రెండింటికిని చక్కని సమన్వయము కూర్చి కావ్యమునకు శోభ చేకూర్చె ననుటలో ఎట్టి సందియము లేదు.

ధూర్జటి భాష - జాతీయములు

ధూర్జటి శైలి విషయ మిట్లుండగా ఇంక భాష విషయము పరిశీలింప వలయును. చక్కని జాతీయములు కావ్యమునకు వన్నెతెచ్చిన వనవచ్చును. నేడు వాడుకలో లేని కొన్ని పదములు ధూర్జటి రచనలో కన్పట్టుటయే విశేషము. సందర్భవశమున అన్య భాషా పదములను కూడ ప్రయోగించినాడు. నన్నయ కాలము నుండియు భాషను పరిశీలించినచో వివిధ రీతుల మార్పు నొందుచూ వచ్చెనని చెప్పవచ్చును. నన్నయ కాలమున పూర్తిగా మార్గ పద్ధతియే అమలు యందుండి సంస్కృత భూయిష్టమైన దీర్ఘసమాసములు పెక్కువాడుట జరిగెను. ఇంతియే కాక పూర్ణానుస్వారము ఎక్కువ అమలులో యుండెడిది. నన్నయ కాలము నాటి కొన్ని విశేష్యములు, విశేషణములు, క్రియలు మొదలైన శబ్దములు ఎఱ్ఱాప్రగడ కాలము నాటికి మార్పుజెంది ఆ మారిన రూపములే అరణ్య పర్వశేష మున ప్రయుక్తములై కానబడుట వలననే ఆ భాగము నన్నయ రచన కాదని నిర్ధారించుట జరిగినది. డా॥ చిలుకూరి నారాయణరావుగారు భాషా విషయకమైన పరిశోధన చేసి ఆ ప్రయోగ విశేషములను తమ 'ఆంధ్ర భాషా చరిత్రము'లో వివరించిరి. అందు కొన్ని ఉదాహరణములు తీసికొందము.

నన్నయ కాలమున దుమంతములుగా ప్రయోగింపబడిన మహద్వాచకము లయిన పౌత్ర, మిత్ర శబ్దములు ఎఱ్ఱన కాలము నాటికి మిత్రము, పౌత్రము అని మువర్ణ కాంతములుగా మారెను.

అంభోరుహ మిత్రుఁన్ (ఆది: 1-22)
కూర్పు మిత్రులన్ (ఆది. 2-199)

కాక అరణ్య పర్వమున - రోగార్తునకు పరమ మిత్రంబులు అరణ్య పర్వ శేష 7-489. రాజును పేరి కొక్కడున్ వెనుపగు పాత్రమయ్యె. (హరి వంశ పూర్వ భాగము 1-119)

నన్నయ మహదర్థమున 'ఒకరుడు' అనియు, అమహదర్థమున 'ఒకడు' అనియు ప్రయోగించెను. అచ్చు ప్రతులలో నీ రూపములు తారుమారు చేయబడినవి గాని తాళ పత్రంబులందు ఇట్లే కలవట.

1. వియత్తలం మను కంబ మొక్కటున తాల్పగ (సభాపర్వ 1-80)
2. అది నపకార మొక్కటయైన నదియు (అరణ్య పర్వ 1-219)

నన్నయ తరువాత కాలముననే 'ఒకడు'ను మహద్వాచకముగా వాడుట వాడుక లోనికి వచ్చినది.

వాసవనందన సఖుడగు భూసురు డొకడు (అరణ్య శేష 4-149)

వాడొక ధనాధుడు శాశ్వత సౌఖ్య సిద్ధికిన్ (నృసింహపురాణము 1-69)

అరణ్య పర్వశేష రచనా కాలమునకు 'ఒకడు' అమహద్వాచకముగా వాడుట తగ్గి 'ఒకటి' అను ఔపవిభక్తికము మహద్వాచకముగా వాడుకలోనికి వచ్చినది. దీని కుదాహరణ:

ఇతిహాసం బొక్కటి చెప్పెద (అరణ్య శేష 4-192)
తద్వృత్త మొకటి గోరట పడకుండ (హరివంశ, పూర్వ 1-150)

నన్నయ 'తదర్థము' అను పదబంధమును మధ్యమోత్తమ పురుషంలో నీ తదర్థము, నా తదర్థము అని చతుర్థీ విభక్త్యర్థమున ప్రయోగించెను. సర్వశబ్దముతో 'ఎల్ల'ను కలిపి 'సర్వ జనుల కెల్లను' అను రీతిని ప్రయోగించెను. ఇట్టి ప్రయోగములు అరణ్య పర్వమున లేవు. ఇంకను నన్నయ రచన యందు సంబోధన ప్రథమలో ఓ, ఓయి, ఓరి మున్నగునవి కానరావు. దీనిని బట్టి ఇవి నన్నయ తరువాత వాడుకలోనికి వచ్చినవని ఊహించవచ్చును. ఇటువంటి సంబోధనాత్మక పదములు అరణ్య పర్వమున హరివంశ పూర్వ భాగమునను కన్పించుచున్నవి. ఉ. అ: ఓ పాపలార! (హరివంశము పూర్వభాగము 8-184) ఓరోరి యిఃకెందు బోవచ్చు (అరణ్య పర్వశేష 6-246) నృసింహ పురాణమున కూడ నొక చోట కన్పించు చున్నది. ఓయి సమీర! (నృ పురా. 4-147) 'నన్నయ' కాలమున సమాసములందు సంఖ్యా వాచకములు ఉదంతములుగా నుండియే విశేషణార్థమును తెలుపుచుండెను. అతని తరువాత ఉకారమునకు అకార మాదేశమై ఆ విశేషణార్థ మేర్పడ జొచ్చెను ధూర్జటి మున్నగు ప్రబంధ

కవుల కాలము నాటికే ఈ విధమగు ప్రయోగములే వెలసెనని యూహింప వచ్చును.

మంత్రింతు - చేం - తిష్య - వర్ణంబులు (అరణ్య. శేష 1-4-242)

ఉపధలో రకారము గల ధాతువులు ఉపధలో 'య' కారము గలవిగా తరువాతి కాలమునకు మారెను. ఉదాహరణకు త్రోచు - త్రోయు - త్రోయుదున్ (నృ.పు 4-188).

ఇట్లే అరణ్య పర్వమున త్రేసి - త్రోసి - (అరణ్య శేష 6-177) 'కాచుగు, కరగు ధాతువులను నన్నయ సకర్మకములుగా ప్రయోగము గాక అకర్మకములుగా విరళము గాను ప్రయోగించెను ఎఱ్ఱన కాలమున వీని అకర్మక క్రియలుగానే ప్రాచుర్యము పొందినవి. 'కరగు' ధాతువునకు ఎఱ్ఱన రచనలో సకర్మకత్వము లేదు.

నన్నయ భారతములో - ఊరి కంటె కాదంగెద (ఆది. 2-158)
దానిన కరంగును - అని అరణ్య పర్వములో గలదు 2-224
హరి వంశము పూర్వ భాగములో పలుకం దొడంగి (1-103)
కరిగి ధర్మము తోడ (అరణ్య శేష 4-169)

ఈ విధముగా శబ్దములు మార్పునొందుట చూచుచునే యున్నాము. ధూర్జటి కాళ్హ విషయమున కూడ పెక్కు విశేషములు కనపడుచున్నవి. ధూర్జటి కొన్ని వ్యాకరణ విరుద్ధ ప్రయోగములు కూడ చేసెననుటకు గ్రంథమే ఆధారము. ప్రథమాంధ్ర ప్రబంధ కర్తయగు పెద్దన ప్రయోగములు పరిశీలింతము. ఈ ప్రయోగములే కొన్ని ధూర్జటి కావ్యమున కూడ కానవచ్చుచున్నవి.

మనుచరిత్ర 1వ ఆశ్వాసము 1 పద్యము-శ్రీరంగనాథ విరుదము

(1-1 పద్య)

---

1. మనుచరిత్రము ప్రథమాశ్వాసము.

కొఱత - కొఱత (1 ఆశ్వాస పద్యము)

ఒకటవ ఆశ్వాసములోనే 60 పద్యమున వైశ్యము అను శబ్దము గలదు. ధూర్జటి కావ్యమున నత్కీరుని కథా ఘట్టమున శివుని శాపము వలన నత్కీరుడు కుష్ఠింపు చున్న సమయములో వాడిన పదమిది.

గీ॥ వైశ్యమునఁగంగ లోయిన పట్ల జనులు
చూడ రోయకమున్న, కాలాడినపుడు
నడువవలె గాక కైలాస నగము జూడ
హరుని వాక్యంబు శక్యమే పరిహరింప." (కా।మా।తృ।ఆ। 177)

నత్కీరుడు తనకిఁ మాత్రము శక్తి యుండగనే కైలాసము చూడవలెనని నిశ్చయించు కొనెను. విశ్వమునుగఁగొను వానివలె నుండగా జనులు చూచి అసహ్యించు కొను స్థితిరాకుండ కాళ్ళు మొదలగు అవయవములు అధీనమునం దుండగనే కైలాసము జూడవలెనని దీని భావము. వైశ్యము అను శబ్దము పెద్దన వాడినట్లే ధూర్జటియు వాడెను పెద్దన మను చరిత్రమున "అచటి నాంప కాతి హిమ ముత్తవికాతి అది శివుని వైశ్యమైన మాన్పు" (ప్ర.ఆ.మ.చ. 60 పద్యం)

ఇంకను మనుచరిత్రమున ప్రియంభావుకుడు (1-91) కేలు (2-48) నిద్రాణము దరిద్రాణము (2-12) నలింపతము (3-11) దుర్దయము (3-144) దీపాంకురచ్ఛాయము (4-6) 'పెటలము' (4-17) వనేచరులు (4-102) గ్రాహకము (4-121) 'మూర్ఛింపచుదు' మధుపర్కము (5-77) ఇత్యాది శబ్దములు వాడబడెను. ఈ శబ్దములలో కొన్ని ధూర్జటి కూడ తన కావ్యమున సందర్భవశమున ప్రయోగించెను. కేలు శబ్దము ద్వితీయాశ్వాసమున బ్రహ్మ కథలో ప్రయోగించెను. దానిని రాజు శిక్షించిన ఘట్టమున ప్రథమాశ్వాసము 47 పద్యమున గలదు.

"వడిగొల్పియొక 'కేల' మడిచిన క్రొమ్ముడి
గొబ్బునగటి బట్టుకొన్న కేల"

ఈ కేలు శబ్దము నిత్యైకవచన మనుటకును, నిత్య బహువచన మనుటకును దెనువగు పూర్వకవి ప్రయోగములు కలవు. సందర్భము ననుసరించి కవులు ప్రయోగింతురు.

జరిగెను. ధూర్జటి ఏకలం శబ్దము తృతీయాశ్వాసము తిన్నని కథయందు వాడెను. ఆ పద్యమిది.

క॥ కలలోఁజెప్పిన యొరయం
దెలయించుక వచ్చినట్టి యే కలము, హిమా
చల తనయాధిప మాయా
విలసనములుగాఁగ నపుడు వివరించి-మదిన్ (తృ. ఆ. 82)

మను చరిత్రమున ద్వితీయాశ్వాసములో పెద్దన ఈ శబ్దము వాడెను.

"ఎన్ని భవంబులన్ గలుగు నిక్షశరాసన సాయకవ్యధా
ఖిన్నతవాడి వత్తలయుకేల గపోలములాని చూపులన్
విన్నదనంబుదోఁపగను వేదుటునన్ బయిగాలి సోకినన్
వెన్నవలెన్ గరంగు నలివేణులఁగౌగిట జేర్చు భాగ్యముల్

కేలన్ - చేతులందుయని చెప్పబడినది. కేలు శబ్దము నిత్యైక వచనమగుటచే, కుడి చెక్కిలి కుడిచేతియందు కొంత సేపును నచట తాపము హెచ్చగా నెడమచెక్కిలి యెడమచేతియందు కొంతసేపును జేర్చు అనిగాని, 'అలివేణులు' బహువచన మగుటచే కేలుశబ్దము నిత్య బహువచనముగా గూడనుండుట వలన నా యలివేణులు ప్రత్యేకముగా తమ తమ చెక్కులను తమ తమచేతులం జేర్చుకొని యనికాని యన్వయించుకోదగును.

ఇక ఏకలము శబ్దము కూడ పెద్దన మనుచరిత్రయందును ధూర్జటి శ్రీకాళ హస్తి మాహాత్మ్యమునందును కూడ వాడిరి. ఏకలమనగా పందియని సాధారణ ముగా అర్థము. తృతీయా శ్వాసమున తిన్నడు పరిజనముతో గూడి వేటకు వెడలి అలసి నిద్రింపగా కల వచ్చుటయు, కలలో ఏకలము కన్పించి దగ్గరలో నుండు శివలింగమును కొలువ-మనియు చెప్పగా లేచి నలుదిక్కుల చూచుసరికి 'పంది' కనబడుటయు దాని వెంట పరిగిడి మెదలగా శివలింగము జేరగనే అది అంతర్ధాన మగుటయు జరిగినది. ఈ సందర్భమున ధూర్జటి ఈ శబ్దమువాడెను.

క. ఎలయించుచు దిన్నడు దన
కంఠలోపం గన్న శివుని గనుగొనుదాకన్
జలమున గొనిచని, నయ్యే
కలమిప్పు దదృశ్యమైనగడు శోద్యమునన్   (కా. మా. తృ. ఆ. 81)

పెద్దన మనుచరిత్రము చతుర్థాశ్వాసమున నీ ఏకల శబ్దము వాడెను. దీని వివరణ మిట్లుగలదు. ఏకలము అచ్చ తెలుగు పదమని గీ. పందిసలుగేకలమ్మన బరగు ఘృష్టి (అం. ఖా. 2. 82) సీ. పంది. ఏకలము గుర్గురింతన వెసగుదంష్ట్రి. సా. ని. తిర్య. 76 అని అచ్చతెలుగు నిఘంటువులందు గలదు. కాని, గీ. కౌగలించె దివాచర కంధకరటి, పాకలంబు మహాకుహనైకలంబు (1-49) సీ. తనదేహ విస్తారమున ముజ్జగములైన నాక్రమింపదె యీ మహైకలంబు (12-81) అని వరాహ పురాణమునను ఉ. ఏకల సద్గుణంబు మహియెన్నదనే కల సద్గుణాక్తిచే (పీఠిక 89) అని రాఘవ పాండవీయమునను సంస్కృత సమాసఘటితమై 'ఏకల' శబ్దము కనబడుచున్నది. ఏకలము: సం. విణ ఒంటరిగా నుండునది అను నర్థముతో సూ. నిఘంటువులో, సంస్కృత పదముగా నీయబడినది. ఏకచరము, ఒంటిగాడు అని పందికి నామములున్నవి. కాన నారెండు కావ్యములందును ఏకల శబ్దమునకు 'పంది' యని నైఘంటి కార్థము గ్రహింపదగును.

ఏకలీడు అనుపదము బట్టి 'ఏకలము' అను నాచ్ఛిక పదముమీద స్వార్థమున ఈ ప్రత్యయము వచ్చిన దనవలెను కాని సంస్కృత పదమైనచో ఈ ప్రత్యయము రానేరదు. కాన ఏకలము అచ్చతెలుగు పదమే అనుట కెక్కువ యవకాశము కనబడుచున్నది. సంస్కృత నిఘంటువులందు గానరాదు.

'ముష్టింపచుడు' అను శబ్దము పెద్దన మనుచరిత్రమున పంచమాశ్వాసమున 17వ పద్యమునను ధూర్జటి కాళహస్తిమాహాత్మ్యములో ప్రథమాశ్వాసమున 101 పద్యమునను వాడిరి. ప్రథమాశ్వాసమున కా. మా. న పార్వతీ పరమేశ్వరుల విహార ఘట్టములోవారు ఋష్యాశ్రమములన్నియు తిరుగుచూచుచున సందర్భములో ధూర్జటి ఈ పదము వాడెను. "శిష్టనీవారముష్టింపచాశ్రమముల" మెలగు సంయమి గృహమేధియగుచు (ప్ర. ఆ. 101) ముష్టింపచుడు. సూ. నాడీ ముష్టిశ్చ

(పా 8. 2. 80.) చేరయ, పచశబ్దము ఉత్తర పదములుగా నున్నపుడు పిడి ముష్టి శబ్దములకు ఇక్ ,ముగాగమములురాగా, ముష్టింధయ, ముష్టింపచ శబ్దములు సిద్ధించినవి. ముష్టింధయుడు=పిడికిలి నోట బెట్టుకొని పానము చేయువాడు, పసి బిడ్డడు అను నర్థమున వ్యవహృతము. 'ముష్టింపచుడు' అనగా పిడికిలి బియ్యము మాత్రమే వండుకొని తినువాడు. వ్రతవిశేషము.

శా· ముష్టింపచుల్, శాకాహారులు గంద భోజులు శిలోంఛప్రక్ర
ముల్ తాపసుల్ = (కాశీఖండము 7 ఆశ్వాసము 162)

"ఓరి .... సీవార ముష్టింపచా, దాసీ యోజనగంధి ప్రథమపుత్ర .... అని భీమ ఖండము 2 ఆశ్వాసమునను ప్రయోగములు గలవు. ముష్టింపచుడు - పిడికిలి కొలతగల బియ్యము వండుకొనువాడు. దరిద్రుడు అను లాక్షణి కార్థమున ప్రయుక్తమైనది. చేలో కోయగా మిగిలిన గింజలు ఏరుకొని వాటిని పచనము చేసికొని తినువారిని ముష్టింపచులందరు

అచ్చతెలుగు పదములను వాడుటయే గాక ధూర్జటి కావ్యమునందు అటవట రమణీయమగు జాతీయములు కూడ వాడినారు. జనవ్యవహారములో, అందున, విద్యావంతులలో వినవచ్చుసూక్తులే లోకోక్తులు లేదా సామెతలు అనబడును. ఇవి కావ్యమునకు శోభ చేకూర్చును. అందు ప్రగాఢమయిన ఒక సత్యము, ఒక చమత్కారము భాసించుచుండును. ఇవి ఆ జాతి యొక్క ఆచారములను, సంస్కృతిని, భాషలోని పలుకుబడులను కన్నులకు కట్టుచుండును. దీనిని సందర్భోచితముగా ప్రయోగించుచు, కవి తన కావ్యమునకు వన్నె చేకూర్చును. ధూర్జటి కావ్యమున యిటువంటి లోకోక్తులు జాతీయములు వాడినతీరు పరిశీలింతము.

నీవారముష్టింపచా = Cooking only a handful of wildrice extremely frugal in eating.

(Sanskrit-English Dictionary by Sir. Monier, Monier Williams)

క॥ ఇది పెక్కేడులు పట్టెన్
సదనంబులు గట్టనాకు శంభుని గొలువన్
దుది గుమ్మరి కొకయేడును,
గుదె కొకపెట్టన్న మాటకున్సరి వచ్చెన్" (ద్వి.ఆ.100 పద్యం)

సాలెపురుగు స్వీయతంతువులతో శంభునికొఱకు పెక్కేడులుగా సదనములు గట్టినది. కాని అవి యగ్ని యనుకు దీపశిఖలంటే నిమిషములో భస్మమై పోయెనట. ఇది ఎట్లున్నదనగా కుమ్మరి ఒక యేడాదిపాటు కష్టపడి కుండలు చేసి రాసి పేర్చగా గుదియతో ఆ రాసిపై ఒక దెబ్బ కొట్టినట్లున్నది. తన ప్రయత్నమంతయు వ్యర్థమైపోయినపుడీ సామెతను వాడుట పరిపాటి. తాను తన తంతువులతో నిర్మించిన దేవాలయాది నిర్మాణము త్రుటిలో మండిపోగా, సాలెపురుగు "ఈ సదనంబులు నిర్మించుటకు పెక్కేండ్లు పట్టినవి. తుదకు భస్మమై నా యత్నమంతయు వ్యర్థమైనది" అనుకొనుచున్న సందర్భమున ఈ సామెత ఉదాహరింపబడినది. ఇదే సందర్భము ఇంకో జాతీయము "పగవారిని గూడె దైవమున్" (శా.మా. 1 8) ద్వితీయాశ్వాసమందే శ్రీకాళహస్తుల కథలోనిదే యిది కూడ. కాళము, హస్తి రెండును శివుని తమ యథాశక్తి కొలది రోజూ పూజించుచుండెను. కాళము విలువగల రత్నములతో శివుని పూజింపగా హస్తి మారేడు దళములతో పూజించినది. కాళము తన పూజ వ్యర్థమైనదని తానుంచిన రత్నములు తొలగించి ఎవరో దురాత్ములు ఆకు అలములు శివునకు సమర్పించిరని బాధ నొందినది. దేవుడు కాదనక శత్రు పక్షము జేరి వారి పూజనే అంగీకరించెనని వ్యధనొందుచు పాము యీ మాట అనుకొన్నది. 'పగవారిని గూడె దైవమున్' అనగా దైవము పగవారితో కలిసెను. దేవుడు శత్రు పక్షము జేరెనని యభిప్రాయము.

'వాడొనే నొ వాక జాడ బోయెదము' (ఆశ్వా. 2-128 పద్యం)

ఈ జాతీయము కూడ కాళహస్తుల కథలోనిదే. గజము పల్కిన మాటలివి. తాను శివుని సన్నిధి నున్న మణులను, రత్నములను సమర్పించిన దురాత్మునిపై (కాళముపై) కోపించి గజము పైమాటలు పల్కినది. ఇది కూడ దక్కని జాతీయము "ఇక మీద నేనైన ఉండవలెను. లేదా వాడైన ఉండవలెను" అను పట్టుదల ఈ జాతీయమువలన వ్యక్తమగుచున్నది. ద్వితీయాశ్వాసమున బ్రహ్మ

కథలో 'బ్రహ్మపంపున నుగ్రుడు తన యన్నలగు రక్కసులను చంపుట' యను ఘట్టములో ఉగ్రుడు ఆ రక్కసులతో గూడి యుద్ధము చేయుచుండ యుద్ధక్రమ మంతయు వర్ణితమైనది. అట్టి సందర్భమున 'మడిసి' దాపకట్టుగ గూలెన్ అను జాతీయము కవిచే ప్రయోగింపబడెను.

క॥ చెదరిన సేనల నన్నిటి
గుదురుకొనం ద్రోలి, చుట్టుకొని, పడినేసెన్
మదకరులం హరుల రథులను
గదనంబున మడిసి దాపకట్టుగ గూలన్ (కా.మా.ద్వి.అ.49)

ఏకముగా మరణించుట అని దానికి వ్యావహారికార్థము, సామూహిక మరణము అను నర్థముననే యిచట ప్రయుక్తమైనది. ఇదే ఘట్టమందింకొక జాతీయము గలదు. బ్రహ్మ ఉగ్రుని రక్కసులను వధించి రమ్మని ఉగ్రునితో పల్కిన సందర్భమున ఈ జాతీయము వాడబడినది. తన్ను తరలికి రమ్మన్న దాశ నోటి మాట నోటనె యుండ (కా. మా. ద్వి. అ. 88), ఉగ్రుడు వింధ్యగిరి మీద నున్న రాక్షసులను సంహరించుటకు పోయినాడట. నోటినుంచి మాట వచ్చిరాక ముందే ఉగ్రుడు పయనమయ్యెనని దీని భావము. ఈ జాతీయమువలన ఉగ్రుడు తండ్రి యాజ్ఞ ననుసరించి యిసుమంతయు యోచన చేయక అతి త్వరితగతిని రక్కసులను చంపుటకు చనెనని తెలియుచున్నది.

తృతీయాశ్వాసమున తిన్నని కథలో గూడ కొన్ని జాతీయములు కలవు. "నీతోడిదే లోకము" (తృ. అ. 72 పద్యం) తిన్నడు అడవికి పోయి శివలింగమును చూచి సేవలు చేయ మొదలిడును. అతడు శివుని ఉడుమూరుకు రమ్మని పలు విధముల బ్రతిమాలును. శివలింగమును విడిచి తాను పోలేక తిన్నడీ పలుకులు పలికెను. 'నిన్ను విడిచి యుండలేవనియు నీవు లేనిదే నా జీవితము వ్యర్థమనియు దీని భావము నీతోడిదే లోకమనుచున్నాడు తిన్నడు. ప్రపంచములో తనకు సంబంధము శివుని మూలముననే ఉన్నదనియు అతడు లేనిచో లోకమే లేదని ఈ జాతీయము యొక్క భావము. ఇట్లే ఇదే కథలో 'తిన్నని గని బోయలు దుఃఖించుట' యను ఘట్టమున ఇంకను పెక్కు జాతీయములు గలవు.

ఓశ గట్టిన దూలంబై (తృ. అ. 80 పద్యం)

తిన్నడు తన యూరికి రమ్మని వేడుచున్న సహచరులతో నీ మాటలు పల్కెను. "ఈ లింగముతోనే నా ప్రాణము లంకెపడి యున్నది. ఈ శివలింగ మెక్కడున్న నే నక్కడే యుందును. విడిచి రాను."యని దృఢ నిశ్చయముతో పల్కుచు నీ జాతీయము వాడెను ఓడకు దూలము కట్టిన యెడల, ఆయోడ ఎటు పోవునో, దూలము కూడ ఆయోడతోపాటు ఆ వైపునకే పోవును. అదేవిధముగా తిన్నడు లింగమువిక్కే తన ఉనికి యని సూచించినాడు. 'తోడునీడయై' (తృ. అ. 81 పద్యం) నీడ ఎల్లప్పుడు విడువక మన వెంటనే యుండును. అదియే తోడు. తన్ను ఊరికి రమ్మని నర్బంధించుచున్న సహచరులతో తిన్నడు ఈమాట లనెను

క॥ 'నావెంట నెవరు వచ్చిన
నే వచ్చెద మిమ్ముగూడి యిప్పుడు, లేదా
యే వంకన భవుడుండిన
నావంకనె తోడునీడయై వసియింతున్

(తృ. అ. 81)

శివునికి నీడవలె విడువక యుందునని భావము.

"చెప్పినం బదివేలు" (కి అ. 101 పద్యం) తిన్నడు శ్రుతివ్యవహారేతర మార్గమున శివుని కొలుచుచుండగా ఆలయము నందలి అరాచకలు గని శివబ్రాహ్మణుడు దుఃఖించుచుండెను. ఆ సందర్భమున అతడు పల్కిన మాటలివి.

క॥ ఏకిష్టంబిది గానీ
నా కీ పాపాత్ము జెప్పినం బదివేల్,
లేకున్న విడుతు ప్రాణము
పీకై కూడుగ్గబట్టి పింఛగిరా !

(కా. మా. తృ. అ. 101)

ఈ రీతిని కశ్మలము చేసినవాడెవడో చెప్పినయెడల పది లక్షలు నాకెను లిచ్చి నంత పరమానందమును పొందెదను' అని దీని భావము. శివబ్రాహ్మణుడు శివ

నితో ఈ పల్కులు పలికినట్లు చెప్పబడెను. పది లక్షల సంఖ్యకు ఇచట జాతీయము.

వెల్లిగదిపిన చింతపండు,
నీట వ్రాసిన వ్రాలు

(8 ఆశ్వాసము 111 పద్యం)

ఈ జాతీయములు తిన్నడు పరమేశ్వరుని నేత్రరోగమునకు చికిత్సచేయు ఘట్టము లోనివి. తిన్నడు పరమేశ్వరుని కంటినుండి రక్తము కారగా వైద్యముచేయ నారంభించెను. తాను విన్న కన్న మందు లన్నియు వాడినాడు. అడవిలో దొరకు వస్తువులతో తనకు తెలిసిన చికిత్స లన్నియు చేసినాడు. అయినను రక్తము కారుట తగ్గలేదు. ఆ సందర్భములో 'వెల్లిగదిపిన చింతపండు. నీటవ్రాసిన వ్రాలు' అను జాతీయములు వాడెను. తనశ్రమమంతయు వ్యర్థమైనదే తప్ప ఏ మందుకు లొంగలేదు. పాత్ర చిల్లుపడినప్పుడు చింతపండుతో అతకవచ్చును. కాని అది నిష్ప్రయోజనము. క్షణకాలములో మరల రంధ్రము బయటపడును. అట్లే నీటిపై వ్రాతను వ్రాసిన యెడల అదికూడ నిలవదు. ఈరెండు ఎంత నిష్ప్రయోజనములో తిన్నని చికిత్సకూడ అంత నిష్ప్రయోజనముగనే కన్పట్టుచున్నది.

ఇక నక్కీరుని కథలో జాతీయములు.

"త్రోసిన దొంతి చోట్ల గూలువారు" తృతీయాశ్వాసమందే నక్కీరుని కథలో దుర్భిక్ష వర్ణనా సందర్భమున నీ జాతీయము వాడబడెను. కరవువలన తిండికి లేక జనులు కృశించి పైచర్మము ఎముకలు మాత్రమే మిగిలి బలహీనులై ఒక్కత్రోపు త్రోసినంతమాత్రముననే కూలి పడిపోవుచుండిరి. వారిస్థితి ఎట్లున్నదనగా "త్రోసిన యెడల దొంతి చోట్ల పడుచున్నట్లున్నది. ఇది జాతీయము. పాండ్య రాజ్యములో సంభవించిన క్షామము యొక్క తీవ్రతను వర్ణించుపట్ల కవి ఈ జాతీయము వాడెను. త్రోసిన దొంతి చోట్ల గూలుటయేకాక "మానిసి మానిసి తివినంత" (కా. మా. తృ. ఆ. 158) తీవ్రముగా అన్నదట ఆ దుర్భిక్షము. మనిషిని మనిషి మ్రింగి వేయునంత కఱవేర్పడినదని దీని భావము. అంత తీవ్రమగు దుర్భిక్షమని వర్ణన చేయుటలో కవివాడిన ఈ జాతీయము కావ్యమునకు శోభ కూర్చుచున్నది.

"అలదబోవు తీర్థమెదురైన రీతి సిద్ధించు" (తృ. అ. 214 పద్యం)
నక్కీరుడు సుబ్రహ్మణ్య స్వామిని స్తుతించు సందర్భమున నీ జాతీయము వాడ బడెను. ఇంకను కైలాసము దర్శింపక ముందే నక్కీరునకు సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యక్షమై అచటనున్న కొలనులో స్నానమాచరించిన కైలాసము చేరెదవని చెప్పెను.

గీ॥ తన మహత్త్వమ్ముదాచి నెత్తమ్మి కొలని
మహిమవలెనుంద, నాకవి మండలేంద్రు
'నాదు మిందున గైలాస' మాదబోవు
తీర్థమెదురైన రీతి సిద్ధించు ననుదు (తృ.అ. 214)

నక్కీరుడు ఇంకను శ్రమపడి కైలాసము చేరకుండనే తనకు కైలాస దర్శనము ప్రాప్తించెను. సుబ్రహ్మణ్యస్వామి తన మహత్త్వమును ప్రకటింపలేదు. దాని నా కపులాకారమునందే సంక్రమింప జేసెను. మనమొక తీర్థమున స్నానము చేయు టకై అచటికి పోవ సంసిద్ధుల మగుచుండగా ఆ తీర్థమే మనకెదురుగా వచ్చినచో శ్రమలేకయే మనసంకల్పము సిద్ధించును. సులభముగా శ్రమలేక కార్యసిద్ధి కలు గుట ఈ జాతీయ మందు చెప్పబడినది. నక్కీరుడు ఏమియు తోచక కైలాసమును చేరుటెట్లాయని ఆలోచనలో నుండగా అతని యిలవేల్పగు సుబ్రహ్మణ్యస్వామి ఆయనకీ ఉపాయము చూపినారు.

కాకుల తెఱగున. (చ. అ. 104)

క॥ ఆకల కలమున, చిత్తం
బాకులతం బొంద, దొంగలదవుల పాఱై
కాకుల తెఱగున జనిరే
కా కులగుచు, నొకరినొకరు గానక, భీతిన్ (చ. అ. 104)

వేశ్యాతనయులు శ్రీకాళహస్తికి పయనమైనప్పుడు దారియందు వారిని దొంగలు చంప యత్నింపగా పరమేశ్వరుని కరుణ వలన దొంగలు వివశ మనోరథులగు సందర్భమున నీ జాతీయము వాడబడెను. జంగమ వేషములో శివుడు వారి నను క్షణము కాపాడుచుండెను. వారిని చంప ప్రయత్నింపిన దొంగలు కాకులవలె పారి పోయిరట. చెల్లాచెదరై పోవునప్పుడు కాకులవలె పారిపోయిరనుట జాతీయము. ఇతర

పక్షులు ఎగురునప్పుడు గుంపులు గుంపులుగా కలిసి కట్టుగా ఎగురును. కాని కాకు లట్లుకాదు. చెల్లాచెదరై ఒకదానికొకటి సంబంధము లేకుండగా పలుదిక్కులు పారి పోవును. అందుచే కాకులు తెలుగునయని చెప్పబడినది.

ఇఁక పూర్వ జన్మ వృత్తాంతములు వివరించునపుడు కూడ ఊర్ణనాభుని కథ యందొక జాతీయము కన్పట్టుచున్నది.

క॥ ''విడువు విచారము, నీవిక
నడవి జరింపంగ గలుగు టలిగి పఱుపుపై
బడిన గతియయ్యె, జను" మన,
దడయక నా విశ్వకర్మ తనయుడు ప్రీతిన్ (జ. అ. 148)

బ్రహ్మ చేసిన సృష్టికి ప్రతిసృష్టిచేసి, అతనియెడ మహాపరాధ మొనరించిన ఊర్ణ నాభుని విరించి చెలది పురుగగునట్లు శపించెను. పశ్చాత్తప్తుడైన ఆ విశ్వకర్మ పుత్రుడు ప్రార్థింపగా 'ఓయీ నీకి జన్మము కంటె అజన్మమే మేలైనది'. నీవు చెలె పురుగువై గజారణ్యమున నివసించి శివుని పూజించుచు, కైవల్యము పొంద గలవు అని చెప్పెను. అపరాధుడగు ఊర్ణనాభున కిట్లు శాపము మేలే కలిగించెను. ద్రోహముచేసి పఱుపుపై పడినట్లయ్యెననగా- మేలే పొందెనని భావము. ఇదే జాతీ యముగా వాడబడెను. కోపించి తన్నినయెడల పఱుపుపైపడె ననునది సరియైన జాతీయము. శిక్షింప దలపగా శిక్ష తప్పి మేలె కలిగె ననుటయే దీని భావము. ధూర్జటి కాలమున 'అలిగి పఱుపుపై పడుట' అనునదియే వాడుక యందుండెనని భావింపనగును. శప్తుడైన ఊర్ణనాభునకు శాపమే మోక్షోపాయమును చూపినది.

ఇఁక ప్రథమాశ్వాసమునగల జాతీయములు.

'ఆజ్ఞ పెట్టించి చేతడి యారదిపుడు' (అశ్వా. ప్ర. పద్యం. 54)

శిక్షితదాసిని శివుడనుగ్రహించుట యను ఘట్టమునందీ జాతీయము వాడబడెను. యాదవరాజు దాసిపళ్ళెరమిడు కాలమునకు రాక తపసి తగులమున నుండెనను కార ణముగా ఆమెకు తల వెండ్రుకలుతీయ నాజ్ఞాపించెను. భటులు అటులనే కానిమ్మని రాజాజ్ఞ శిరసా వహించిరి. అంత నా దాసి శివుని కాళ్ళపైపడి కేశములు పోయెనని

బాధపడెను. పరమేశ్వరుడామె తలపైన చేయిడినంతనే యథాప్రకార మామెకు జుట్టువచ్చె. అది చూచి రాజు మున్నగు వారాశ్చర్య చకితులైన సందర్భమున నీ జాతీయము వాడబడెను.

తే|| "ఆజ్ఞ పెట్టించి చేతడి యారదిపుడు|
దీనికెబ్బంగి మోహనంబైన వేణి
గలిగె? నీమాయ మంగలి కతనగాదె|
వానిదె"మ్మన్న, గ్రమ్మఱ వనిత మ్రొక్కె (ప్ర.అ 64)

రాజు ఆజ్ఞాపించి భోజనముచేసి చేతడియైనను ఆరకముందే ఆమెకు కేశములువచ్చెను. మంగలి మాయ చేసెనా ఏమి? యని రాజున కనుమానము కలిగెను. ఆమె ఏడ్చుటయు, శివుడు తలపై చేయినుంచుటయు, కేశములు వచ్చుటయు త్రుటికాలములో జరిగిపోయెను. తిని కడుగుకున్న చేతడి యారునంతసేపు కూడ పట్టలేదు ఆమెకు కేశములు వచ్చుటకు. మంగలి మాయలు కావనియు శివుని మహిమయే యనియు ఆమె తదుపరి నిరూపించును. ధూర్జటి యింతవరకు వాడిన తెలుగు జాతీయములే కాక సంస్కృత జాతీయమును కూడ నొకచోట ప్రథమా శ్వాసముననే వాడినట్లు కన్పట్టుచున్నది.

మ|| జనలోకోన్నతమైన తత్పురము దూ
దా తప్పకుండంగ వ
ర్ణన సేయందర మౌనె?........ (ప్ర. ఆశ్వా. 20 పద్యం)

సంస్కృతమున శ్లోకములోని పాదములను నింపుటకు తు.చ. అను దానిని చేర్చుట పరిపాటి. వానికి ఆయాయెడల అర్థము లేకుండినను ప్రయోగింపబడుటకు ప్రయోజనము పాద పూరణము మాత్రమే. తు.చ. తప్పకుండ అనగా సమ్యగ్గముగా అను నభిప్రాయము. అర్థవంతమై ఇది తెలుగు ప్రబంధములలో కన్పించుచున్నది. కాళహస్తి పురము తు చ. తప్పకుండగ వర్ణన సేయుట ఎవ్వరి తరము గాదని యిచట భావము. ముక్తి నొసంగుటలో శ్రీకాళహస్తి క్షేత్రముతో ఇతర పుణ్యస్థలము లేమాత్రము సాటిరావని చెప్పినప్పుడింకొక జాతీయము ధూర్జటి వాడెను. 'హస్తి మశకాంతము' (ఆశ్వా 1 పద్యం 22) ఏనుగునకును దోమకును ఉన్నంత వ్యత్యాసము హస్తిమశకాంతరము. ఇట్లే యిచట మిగిలిన

పుణ్యక్షేత్రములకును శ్రీకాళహస్తి పురమునకును దోమకును ఏనుగునకు ఉన్నంత వ్యత్యాసము గలదని సూచించి నట్లైనది.

ఇంక ధూర్జటి కావ్యమున నేడు వాడుకలోలేని పదములు కొన్ని కన్పట్టు చున్నవి. ఈపదములు కాళహస్తి మాహాత్మ్యము తృతీయాశ్వాసమున వాడఁబడినవి.

తృ.ఆ. గగ్గులకాడు = గింజలేని కంకి
కొట్ట = ఎసరు
అరజములు = పెర్లు

తృ.ఆ లాలామాలపు మాటలు = మోసపు మాటలు. ఇత్యాదులు
ధూర్జటి రచనలో అన్యభాషా పదములు కూడ అచటచట కన్పడుచున్నవి. ప్రథమాశ్వాసమున దాసి జంగముని తనయింటికి రమ్మని యాహ్వానించునపుడు కన్నడ పదములు కన్పించును.

"బిజమాడు దేవరు నిజకృపా దృష్టి జె
న్నారు వాయిల్లు బిడారు పీకు,
నాకు మీ పాదార్చనము సేయ నడలింగ
మూర్తి ! చేకుతెవచ్చి మూర్తమాడు
మొదయ ! చిత్తేశ ! నాయునికి నిమజ్జనం
బాడి శివార్చన మాడ బేకు

మూర్తమాడు : మూర్తమాడి = మూర్తము అనునది ముహూర్తమునకు తద్భవము. 'ఆతు అనుదానికి విశ్రమించు అను అర్థమున్నట్లు లేదు. ఈ సందర్భమున మూర్తమాడి అనగా క్షణకాలము. కాలది కాలము 'విశ్రమించి అని అర్థము చెప్ప వచ్చును.

మాడబేకు = చేయుము : బిజమాడు = విచ్చేయుము

ధూర్జటి కావ్యము శైవభక్తి నిరతమైనది. గావున కర్ణాటదేశమునందు తెక్కువ శైవమతము బాగుగా వ్యాపించుటవలనను ఇటువంటి పదములీ కావ్యమున కన్పడు

చున్నవని యూహింపవచ్చును. ఇంకను తమిళ పదములు కూడ చతుర్థాశ్వాసమున గలవు. కాళహస్తి ప్రాంతమున తమిళ ప్రభావ ముండుట కవకాశము గలదు. అదీ కాక ఈ కథలు కొన్ని తమిళము నుంచి ధూర్జటి గ్రహించెను. అందువలనకూడ తమిళ పదములు వాడుట కాస్కారము గలదని భావించ వచ్చును.

తిరు = శ్రీ

చతుర్థాశ్వాసమున నక్కీరుని తీర్థయాత్రా సందర్భమున నొక పద్యము గలదు.

క. ఉణ్ణాదులం జగదంబిక, నణ్ణామలం విశ్వనాథునారాధించెన్
మణ్ణాసయు బొణ్ణాసయు, బెణ్ణాసయు లేనివారి పెన్నిధు లగుటన్
(ఆశ్వా 8 పద్యం 186)

ఇందు తమిళ పదము లెక్కువ గలవు. కైలాస పర్వత దర్శనార్థ ముత్తర దిశగా ప్రయాణము చేసిన నక్కీరుడు తిరుపణ్ణామలకు పోయి అచ్చటి ఉణ్ణామల జగదంబికను, అణ్ణామల విశ్వేశ్వరుని ఆరాధించెనట. వారు మణ్ణాస పొణ్ణాస పెణ్ణాస లేని వారి పెన్నిధులట!

మణ్ణాస = మన్నుపై నాశ
పొన్నాస = ధనాశ (పొన్ను = బంగారము)
పెణ్ణాస = స్త్రీల యందాస (పెణ్ణు)

అణ్ణామల విశ్వనాథుడనగా అరుణాచలేశ్వరుడు! ఆయన దేవి ఉణ్ణామల జగదంబిక. పార్వతీదేవి. తమిళమున ఆ దేవతలకీ పేర్లు ప్రసిద్ధములు. మణ్ణాస మున్నగు మూడును లౌకికేచ్ఛలు. గృహారామక్షేత్రాదులపయి గల ఆశ మణ్ణాస. సర్వాభరణములు సంపదలు మున్నగు చరములపై గల అధికాసక్తి పొణ్ణాస. కాంతా వ్యామోహము పెణ్ణాస. తమిళమున మణ్ = భూమి. పొణ్ = బంగారము. ఈ రెండు పదములు తెలుగున మన్ను పొన్ను అని గలవు.

నక్కీరుడు భూతమునకు చిక్కుటయను ఘట్టములో చిక్కి బడిన పులుగుల గతి యని ధూర్జటి ప్రయోగించెను. వేటగాడు పిట్టలను కొట్టపడవేయగా కదలక పడి ఉన్నట్లే భూతము తెచ్చి తన గుహలో పడవేసిన మానవులు కదలలేక పడి

ఉన్నారట. ఈనాడు తట్ట, బుట్ట యని వాడుకలో నున్న పదములు ఆనాడు తట్టి బుట్టియని వ్యవహరింప బడుచుండెడివని తలపనగును. బుట్టకు బదులుగా 'బుట్టి' యని పాండురంగ మాహాత్మ్యమున కూడ వాడబడినట్లు చెప్పబడెను.

ఈ శతకమునకు చిక్కుట యను పట్టమందే 'నూలుకత్రావు' యని ప్రయోగము గలదు. నూలుక త్రావుట యనగా నూలుకొని ద్రవముగా చేసికొని త్రాగుట యను అర్థము కాదు. అవలీలగా మ్రింగివేయుట యను సందర్భమున నిది వాడబడెను శూలముచే గుహయందు బంధింపబడిన మానవులు క్రొత్తగా వచ్చిన నత్కీరునితో నీమాట యందురు. 'నూలుకొని' యనుదానికి 'నూలుక' స్వతంత్ర ప్రయోగము.

ఈ నత్కీరుని కథ యందే గగన ప్రసూనవాద మను ప్రయోగము గలదు. (ఆశ్వా ౪ పద్యం 169) గగనము = బట్టబయలు. ఈ గగన ప్రసూన వాదమను దానినే గగన కుసుమము, 'ఆకాశ పుష్పము' మున్నగు రీతుల చెప్పుదురు. గగనము నాధారము చేసుకొని ఏదియు నిలువదు. నేలవంటిది కాదుగదా! గగన భాగమున చెంగలువలు మొలచునా? అని యనుటయు కలదు. ఆకాశ కుసుమ మసత్యమునకు ప్రతీక అట్లే హేతు శూన్య వాదమును వ్యక్తము చేయును. గగన ప్రసూన వాదమనగా ఏమిలేనిది యని యర్థము. మహాకవి యగు నత్కీరుడు "సింధుర రాజగమనా ధమ్మిల్ల బంధంబు సహజ గంధం"బను దాని నాక్షేపింపగా ఆకల్పనం గూర్చిన మహేశ్వరుడు కోపించి 'అట్లనుట సరియే' అనెను. అట్లు పల్కుట నిరాధారమని, హేతు శూన్యమని నత్కీరుడు చెప్పుచు నట్టిది 'గగన ప్రసూనవాద' మనెను.

ధూర్జటి కావ్యమున కొన్ని పట్టుల ఉర్దూ భాషా పదములు కూడ కన్పట్టు చున్నవి. ద్వితీయాశ్వాసమున బ్రహ్మ కథలో ప్రారంభ పద్యముననే ఉర్దూ భాషా పదములు కన్పించుచున్నవి.

గీ. గరుడ గంధర్వ భుజగ కిన్నెర పిశాచ
ఘటుల దావడి ముంగట బట్టబయల

కటుల తరవృత్తి గోటుల సంఖ్యలెసగ
నర్థి గర్భుండు గొలువున్న యవసరమున (ద్వి.అ. 11)

కుతుబ్షాహి పరిపాలనా కాలము వలన 'దావడిముంగట' మొదలగు పదములు వచ్చినవి.

మ. చెలికత్తె ల్గయిదండ లిట్టగ, సురస్త్రీలెందఱైన న్గెలం
కుల సేవింపగ, వజ్రనిర్మిత తులాకోటిద్వయంబున్ ఝళో
ఝళనాదంబుల నీన, మానికపు గెంజాయల్దు వాలించుపా
వలు పావలు పాదంబులమెట్టి, ప్రాణవిభు గొల్వం గొల్వ మోసాలకున్

ఇచట మోసాలకున్ అను ఉర్దూ పదము వాడబడెను (ద్వి.అ. 6) సభాభవనమని యర్థము.

'ఏ తెంచునపుడు పాదుకలాతలిఃష్యాంతరమున్నటువిడిచి ఆతల', అవల శబ్దములు సమానార్థములేయైనను 'ఆవల' అనునదే బహుళ ప్రచారమున నున్నది. 'అతల' ధూర్జటి విశిష్ట ప్రయోగము. దీనివలన ప్రాసము కూడ రక్షితమగుచున్నది. ఈ పద్యములలో ఉర్దూ భాషా పదప్రయోగమే కాక అనాటి సాంప్రదాయములు కూడ తెలుపబడినవి. మొదటి పద్యము సీస పద్య భాగమున అప్పటి రాజసభల తీరు తెలియుచున్నది. సభలో ప్రభువును స్తుతించు స్తోత్ర పాఠకులుండుట ఆచారము. సభ్యులు చేతులు కట్టుకొని వినయ విధేయతలు కలిగి యుండుట తమ తమ మనవులను విన్నవించుకొనుట కొరకు నోటి వద్ద చేతులు పెట్టుకొని సమయమున కెదురుచూచుట సంప్రదాయములు. ఇక తరువాతి పద్యమున బ్రహ్మవద్దకు సరస్వతి రాక చెప్పబడినది. చెలికత్తెలు కయిదండ పట్టుకొనగా వెంట నెందరో దేవతలు రాగా సవిలాసముగ సభకు వచ్చుట రాజుగారి సభకు రాణి చెలికత్తెలతో వచ్చు సంప్రదాయము సూచింప బడినది సభాభవనమున ప్రవేశించునప్పుడు బయట పాదరక్షలు విడిచివచ్చుట పరిపాటి. శ్రీమంతుల గృహిణులు చెలికత్తెలు కైదండలు పూనివచ్చుట ఒక సాంప్రదాయము. అది వారి గౌరవమునకు సూచన. సరస్వతీదేవి భర్త యొద్దకు వచ్చునపుడు పరిజనముతో కూడ వచ్చుట సరికాదని పరిజనము నంపి, నాథుని

పరిసరమునకేగినదట. ఈ ఉత్తమ సంప్రదాయ మాకాలమున విధిగా పాటింప బడినట్లు తెలియుచున్నది.

ద్వితీయాశ్వాసమునందే బ్రహ్మ పంపున నృగుడు రక్కసులగు తన యన్న లను చంపబోవు ఘట్టమున యుద్ధ సమయమున నీ పద్యములో ఉర్దూ పదములు కలవు.

క॥ చది పెంగాలు ఖలుంఖులం
గది యెన్నుట్టంపు టౌలు గగ్గులం గాడై
చెదరంగ గంధ గజములం
మదమడచెం, జంద వీర మండలి దాకెన్ (ద్వి॥అ 41)

ఇట్టి ఉర్దూ భాషా పదము లానాడు ప్రబంధములలో వాడబడెనని చెప్ప నగును. ఇంకను తృతీయాశ్వాసమున శంఖవలకము పుట్టిన క్రమము అను ఘట్ట ములో తొలి పద్యమందే రాజులు కవులను సన్మానించి గౌరవించుట యను సంప్ర దాయము యగస్త్యుడు ప్రారంభించినట్లు కవి వర్ణించెను సరస్వతీదేవితో సమాన మైన కవులను గౌరవించ వలెనని అగస్త్యుడాదేశించి శంఖ వలక మిచ్చెనని చెప్ప బడినది (తృ.అ. 141 పద్యం) నక్కీరుని తీర్థయాత్రా సందర్భమున (తృ.అ. 184 పద్యం) "అరుణ గిరీంద్ర కూటము, గృతామకపోంచ పీటమున్" అనుటలో చక్కని నుడికారపు సొంపు కన్పట్టుచున్నది.

[1]శైవ కవులవలెనే ధూర్జటి స్వతంత్రించి కొన్ని ప్రయోగములు చేసినట్లు తోచుచున్నది.

'కొను' శబ్దమునకు 'క' ఆదేశమగుట అపూర్వముగా కన్పట్టు చున్నవి. ఉదా. విందుక (ద్వి.అ. 26 పద్యం) విడల్చుక (తృ.అ. 80 పద్యం) పుచ్చుక (తృ.అ. 43 పద్యం) మొదలగునవి.

---

1. కాళహస్తి మాహాత్మ్యము పీఠిక, పోణంగి శ్రీరామ అప్పారావుగారు

ఇంకను కటువుగా నుండెడి యిత్వ సంధులు గలవు.

ఈది యీది అనుటకు బదులుగా 'ఈ దీది' యనెను (ద్వి అ 154)

'క్రీడియించుక' అనుటకు బదులుగా 'క్రీడించుక' యనుట (న.అ. 188)

మా పటి యీ సందునన్ అనుటకు బదులు 'మాపటే సందునన్ (త.అ. 101 పద్యం)

'తొంగి యుండెరు' అనుటకు బదులు 'తొంగుంటెరు' అనుట (చ.అ. 152 పద్యం) దీనిని శబ్దపల్లవముగా గ్రహించినచో దోషము కాదందురు

వ్యవహార ప్రసిద్ధములగు రూపములను గ్రహించుట 'కొంతసేపునకున్' (ద్వి.అ. 118) కానీ (త.అ. 118) ఇంక రోసి రోయదు (82 ప) వంటి వ్యవహార ప్రసిద్ధ రూపములు శతకములలో ఎక్కువగా గలవు. అంతా మిధ్య తలంచి చూడ, చింతా కంతయు (8 ప. శ) అంతా సంశయమే (61 పద్యం) మాతంగ్రాన (60) రోసిందేటిది (71) కడాసింపరు (80).

ఇక నుగాగమము పరిహరించుటకు ఉదాహరణములు: తాళోప్పన (ద్వి.అ. 57) తాళునొప్పన యని యుండవలెను. చిందమృతంబు (ద్వి.అ. 186) చిందు సమృతంబు. వేట లాడెటుకు గోవాకుల్ (తృ అ. 16ప) వేటలాడునెటుకు గోవాకుక, అని యుండవలెను.

అద్రిరాజల్లుని (తృ.అ. 87) అద్రిరాజునల్లుని అనిరూపము. పొందామర యనుటకు బదులు పొత్తామర యని. అనాడు ధూర్జటి ఇట్టి ప్రయోగములు వ్యాకరణ విరుద్ధములుగా పరిగణింపబడలేదు. కాని ధూర్జటికి తెలియక అట్లు చేయలేదు. కావ్య పోకడను ధారకు భంగములేకుండ వచ్చిపడిన ప్రయోగము లివి. నిరంకుశాః కవయః అను దృష్టితో మనము వీనిని గ్రహించిన ఒప్పులే యగునుగాని తప్పులు గావు. ఈ ప్రయోగములు అనాది వాడుకలో నుండగా ధూర్జటి గ్రహించి యుండవచ్చును మరి కొన్ని ప్రయోగ విశేషములు పరిశీలింతము.

(ద్వి.అ. 148 పద్యం) తేసాచి ఝల్లున తీది చీఁగి. చీదినపుడు వచ్చు శబ్దమున కనుకరణము 'ఝల్లు'. అది ప్రకృతమునకెంతో అనుకూలము. రచనా శోభాధాయకము అదే పద్యమున ఉన్నచోన్

'ఉరివో విలేదవ నున్నచో నుండక'

ఉన్నచో' అనగా 'ఉన్న యెడల' అనియు అర్థము వచ్చును. కాని యిది ఇచట కుదురుట లేదు. 'ఇచట ఉన్నచో నుండక' అనగా 'ఉన్నచోట ఉండక' అని 'యర్థము. వ్యాకరణమున చోటు శబ్దములోని టవర్ణమునకు లోపము వికల్పమని చెప్పబడెను. 'కుట్రటనట్టడివి' (ఆశ్వా. 8 పద్యం 68)

శా॥ పులుల్ సింగముల్, గాసింబెట్టెడు కుట్రటనట్టడవిలో గల్గావ్వి
క్రీడనే, యానం గట్టితి వేదిగర్వనిలు.

బాల వ్యాకరణమున కట్టుసురు శబ్దమునకు కుఱు + ఉసురు అని విడదీసి తొలి పదమును కుఱుగానే గ్రహింపబడినది. భాషా శాస్త్రవేత్తల సిద్ధాంతమును బట్టి కుట్రు అనునదియే ప్రాచీన రూపమనియు, కుఱు అనునది క్రమ పరిణామమున ఏర్పడినదనియు గ్రహింపవలసి యున్నది. ధూర్జటి ప్రాచీన ప్రయోగమునే గ్రహించెను. కుట్రయనగా చిన్నది యను యర్థము, ఏసుట్టంబులు, 'కూదు నీళ్ళే సుట్టంబులు దెచ్చి పెట్టెదరు.' అనునెడ పరుషములకు గసడదవాదేశము చేయ బడెను. ఈయాదేశము ప్రథమ మీది తెలుగు పదములకును, ద్వంద్వ సమాసము నందలి ఉత్తర పదమునకును చెప్పబడినది. ఇచట త్రికము మీద కూడ గసడద వాదేశము వచ్చుట విశేషము.

కతకుట్టులు - కృపతో గఱకట్టు లారగింపంగదవే (ఆ.శ్వా. 8.ప. 90) అడవులలో మృగములను వేటాడి వాని మాంసమును ముక్కలుగా చేసి వానిని కర్రల చివరలను కట్టి నిప్పులో కాల్చి తినుటకు యోగ్యములుగా చేయుదురు. కర్ర చివకుంట్టబడిన వగుటచే ఇవి కర్రకట్లు అయినవి. ఈ పదము ప్రబంధము లలో తరచుగా కన్పించుచున్నది.

ఎంగిలి మంగలంబులు - ఆశ్వా 8 పద్యము 66

అపవిత్ర పదార్థములకు ఇట్లు చెప్పుట పరిపాటి. మంగల మనగా వేచుట కుపయో గించు మట్టి పాత్రము యను నర్థము కలదుగాని యీ సందర్భమున నది కుదర కున్నది. కసు మూలము

దేవా యీ కసు మాలముందే వెడుకేర్దోయి నీదు దేహంబంటం
(ఆశ్వా. 3. పద్యం. 97)

కశ్మలము నుండి యేర్పడినదీ కసు మాలము. ఏహ్యమైన వస్తుచయము. భావ స్ఫోరకముగు నీ పదము ధూర్జటిచే తగిన సందర్భముననే ఉపయోగింపబడినది. తిన్నడు అచట పడవేసిన మాంసపు దొప్పలను తీసివేయునపుడు శివ బ్రాహ్మణుడు విచారించు సందర్భమున నీ పదము వాడెను.

ఉగ్గబట్టు - నీకై కూడుగ్గబట్టి నింగ్రివా! (ఆశ్వా. 3 పద్యం. 101)
ఉగ్గబట్టుట యన విడిచిపెట్టుట - కూడుగ్గబట్టుట - నిరాహారదీక్షవహించుట. నిఘంటువులలో ఇది ఉక్కబట్టునకు రూపాంతరమని చెప్పబడినది.

పటీ పటీ - పటీ పటీమై యవియనుల్లెపడి చెడిపోయెన్
(ఆశ్వా.3 పద్యం. 162)

ఇది యనుకరణ పదము. జాతీయము. ఆయా సందర్భములను బట్టి దీనికి అర్థము చెప్పుకొనుచుందురు. పీడింపబడి యను నర్థము నిఘంటువులలో గలదు. ఇచటి వర్ణనీయ విషయము సస్యమునకు సంబంధించినది. కాన ఎదుగు పొదుగులు లేక కృశించి - అనుట ఉచితముగా తోచుచున్నది. అందువల్లనే మల్లె పడుటయు ఉబ్బిపడుటయు సంభవించినది. భాషా సంబంధమైన విశేషములను, ఇటువంటి వానిని ధూర్జటి తన కావ్యమున చాల ఉపయోగించినాడు. ముఖ్యమైన దానిని నేను వివరించితిని.

పదవ ప్రకరణము

ధూర్జటి అలంకారములు, వర్ణనలు

ఈ ప్రకరణమున ధూర్జటి అలంకారముల నెట్లు ప్రయోగించినది తెలియ వగును. సందర్భానుసారముగా ఆయా ఘట్టములందు రక్తి కట్టునట్లు ఏయే అలంకారములను సమయస్ఫూర్తిగా వాడెనో పరిశీలించుటయే ఈ ప్రకరణ లక్ష్యము. అలంకారమననేమో ముందు ఇంచుక తెలిసికొని తదుపరి వాటి ప్రయోజనమేమో, అవి కావ్యమున కెట్లు శోభగూర్చునో కూడ పరిశీలించుట యవసరము. ధూర్జటి వాటిని తన కావ్యమునందెట్లు అన్వయించెనో కూడ పరిశీలింతము.

మొదట భరతముని నాట్యశాస్త్రమున యమక మనునొక శబ్దాలంకారమును ఉపమ, దీపక, రూపకములను మూడర్థాలంకారములనే పేర్కొనెను. తరువాత దండి ముప్పది నాలుగును, మమ్మటు డేబది తొమ్మిదియు, విద్యానాథుడు అరువది ఆరు, చంద్రాలోకకర్త నూటొకటియు, అప్పయ దీక్షితులవారు కువలయానంద మున నూటిరువది నాలుగు దెలిపిరి. భట్టుమూర్తి విద్యానాథు ననుసరించి యరువ దారింటినే యుదహరించెను.

ఆంగ్లమున Simile (ఉపమ) Metaphor (రూపకము) Hyperbole (అతిశయోక్తి) Vision (భావికము) Irony (వ్యాజస్తుతి) Allegory (అప్రస్తుత ప్రశంస) Personification Epithet Synecdoche, Metanony, Eaphemism, Parodox; (విరోధాలంకారము) Paramanisia (శ్లేష) climax (సారము) అను నలంకారములు మాత్రము గలవు.

అలంకారములలో శబ్దాలంకారములని, అర్థాలంకారములని రెండు విధములు. అందు అర్థాలంకారములకే ప్రాముఖ్య మీయబడినది.

"అలంకరణ మర్థానామర్థాలంకార ఇష్యతే
తం వినా శబ్ద సౌందర్య మపినాస్తి మనోహరం
అర్థాలంకార రహితా విధవేవ సరస్వతీ"

అర్థాలంకారములేని శబ్దసౌందర్యము మనోహరము గాదు. అర్థాలంకారములు లేని సరస్వతి (కావ్యము) విధవ వంటిది, అని అర్థాలంకార విశిష్టతను దెల్పెను.

అసలు అలంకార మననేమి ? యను ప్రశ్నకు లాక్షణికులు వివిధరీతుల నిర్వచనల నొసగిరి. వామనుడు "సౌందర్య మలంకారః" అని నిర్వచించి వేనివలన సౌందర్యము కావ్యమున గలుగునో యవియు నలంకారములే యని నుడివెను దండి ఈవిధముగా జెప్పెను.

"కావ్యశోభాకరాన్ ధర్మానలంకారాన్ ప్రచక్షతే"

కావ్యశోభాకరములగు ధర్మములను నలంకారములని చెప్పుదురు. అని దీని భావన. ఇక భామహు డలంకారము లన్నిటిని వక్రోక్తులనెను. వక్రముగా నసగా వికటముగా స్వభావ విరుద్ధముగా జెప్పిన యుక్తి. కావున స్వభావోక్తి నాతడంగీకరింపలేదు.

అలంకారము లన్నిందిలోను నుపమాలంకారము సర్వాలంకార బీజ భూతమని వామనుని మతము అందుచే నాతడు ఉపమాగర్భములగు అలంకారము లనే ఉదహరించెను. 'ఉపమాకాళిదాసస్య' అని మహాకవి కాళిదాసు ఉపమాలంకారమును బరాకాష్ఠ నొందించెను. మమ్మటుడు అతిశయోక్తియే సర్వాలంకార బీజమని ఈ క్రింది విధముగా వచించెను.

సైషాసర్వైవ వక్రోక్తి రనయార్థో విభావ్యతే
యత్నోఽస్యాం కవినాకార్యఃకోఽలంకారోఽనయావినా.

ఇట్లు వివిధ లాక్షణికులు అలంకార నిర్వచనము చెప్పుచు ఒక్కొక్క రొక్కొక్క యలంకారమునందు మక్కువ చూపిరి. పైశ్లోకమున వక్రోక్తియన

సుందరమైన యుక్తి. ఆసౌందర్య మతిశయముచే లభించును. కాన వక్రోక్తి యనగా యతిశయోక్తి. దీనిచే నర్థము విశేషముగా భావింపబడును. ఆస్వాద్య మగును. కావున కవి దీని విషయమున యత్నము సేయవలెను. లేనియెడల అలంకారమే లేదు.

వామనుని తరువాత వచ్చిన సర్వాలంకారికులు వామన మతమునే స్వీకరించి తమ గ్రంథములలో నలంకార ప్రకరణమున ప్రప్రథమమున ఉపమా లంకారమునే వివరించిరి. కాని దండి ఉపమా భేదములను కూడ ఎక్కువగా చూపెను. ఉపమాలంకారమును అప్పయ్య దీక్షితులవారిట్లు పేర్కొనిరి.

[1]ఉపమైకా శైలూషీసంప్రాప్తాచిత్ర భూమికా భేదాన్
రంజయతి కావ్యరంగే నృత్యంతి తద్విదాంచేతః"

అని తెలిపెను. ఉపమ (అలంకారము) ఒక నటి. అది చిత్ర విచిత్రము లయిన వేషములను ధరించి కావ్యమను రంగస్థలమున నాట్యమాడుచు నా కావ్య వేత్తల మనస్సును రంజింప జేయుచున్నది. అనగా నీ యుపమాలంకారము కొంచెము మార్చినయెడల మరియొక అలంకారమగును. ఎల్ల అలంకారములును శ్లేషస్పర్శచే సౌందర్యాతిశయమును వహించుననియును గొందఱు చెప్పిరి. "శ్లేషః పుష్ణాతి సౌభాగ్యం ప్రాయో వక్రోక్తిమస్థితం"

ఈ యలంకారములన్నియు గావ్యజీవితమగు త్రివిధమగు ధ్వన్యుపస్కా రకములుగనే నిబద్ధము గావలయును; అట్లు గానిచో నవి కేవలముగా వర్ణ చిత్రములే యగును. అలంకారశబ్దమయ్యెడ సార్థకముగాదు ఎట్లనగా :

సచ్ఛిన్నమూలః క్షతజేనరేణుస్తస్యోపరిష్టాత్పవనావధూతః
అంగారశేషస్యకానస్య పూర్వోత్థితో ధూమఇవాషభాసే.

రక్తపాతముచే ఛిన్నమూలము గలదై, వాయుధూతమై యాకాశమున నిగిడిన రేణువు ఇంగలము మాత్రమే మిగిలిన యగ్నియొక్క (అర్పుటకు) ముందు లేచిన ధూమమువలె భాసిల్లెను. కాలుచున్న కట్టెపై నీరు పడగా నింగలము

1. కావ్యాలంకార సంగ్రహము-పుట 687

మెఱుగులను. పొగ పైకి పోవును. అట్లే రక్తపాతముచే నేల తడియగా రేణువు పైకెగసిపోయెను ఇచ్చటి యుపమాలంకారము ధ్వన్యుపస్కారము గాక కేవలౌపమ్య మాత్ర పరముగా నున్నది. ఇందర్థ వైచిత్రియేగాని యాస్వాద్యత లేదు. కాన నలంకారము లిట్లుగాక త్రివిధమగు ధ్వని పర్యవసాయములుగా నుండవలెను. ఉదా॥ కు "ఓ సుందరీ ! నీ ముఖము చంద్రునివలె నున్నది" అను చోట నున్న యుపమాలంకారము వక్తయొక్క రతిని (శృంగార రసమును) పోషించుచున్నది. అదియే అలంకార ధ్వని.

సాధారణముగా అర్థాలంకారములన్నియును త్రివిధ ధ్వని పర్యవసాయులు గనే యుండును. సమాసోక్తి, అప్రస్తుత ప్రశంస, దీపకము, పర్యాయోక్తము, ఉత్తరాలంకారము, పరికరము, అర్థాంతరన్యాసము మొదలగునవి ధ్వని పర్యవసాయులే. ఇందు సమాసోక్త్యాదులు గుణీభూత వ్యంగ్యములుగా నుదహరింప బడినవని కావ్యాలంకార సంగ్రహమున పేర్కొనబడినది. ఏవో కొన్ని మాత్రము "సచ్ఛిన్నమూలః" అను శ్లోకమునందువలె ధ్వన్యుపస్కారకములు కావు. అందుచే వానిని కవులు ధ్వనిపర్యవసాయులుగానే చేయుటకు యత్నింపవలె ననియు కావ్యాలంకార సంగ్రహము చెప్పుచున్నది.

భాషతోకూడ నలంకారములు బుట్టినవి. మనుష్యులు మాట్లాడు భాష ఒక్కొక్కప్పుడు అలంకార యుక్తముగా నుండును ఉదాహరణకు "అదంపతులు చిలకా గోరింకల్లా ఉన్నారు ఆ యిల్లు సీతలేని పర్ణశాల వంటిది" యిట్టివి. వామనుడు 'కావ్య శోభాయాః కర్తారోగుణాః తదతిశయ హేత వస్త్వలంకారాః పూర్వేనిత్యాః (కావ్యశోభను గూర్చునవి గుణములు, తదతిశయ హేతువులలంకారములు. ఇందు మొదటివి (గుణములు) నిత్యములు అని చెప్పెను గుణములు నిత్యమనుటచే నలంకారములనిత్యములు అని చెప్పినట్లయినది. మఱియు "యువతేరి వరూప మంగకావ్యం యది భవతి వచశ్చ్యుతంగుణేశ్యం" అనువానిచే గుణములు ప్రధానములనియు ననగా [1]ఐరంపరా రసోపస్కారకములనియును దెలిపెను.

ఈ ప్రశంస యిట్లుండగా ఆంధ్రసాహిత్యములో క్రీ. శ. 16వ శతాబ్దముతో ప్రారంభమై కొనసాగిన ప్రబంధ సాహిత్యము నందు అలంకార ములకు ఒక ప్రముఖ స్థానము లభించినది. నన్నయ తిక్కన మొదలైన

1. కావ్యాలంకార సంగ్రహము (పుట 712)

ఆంధ్ర మహాభారత కవులుగాని, శ్రీనాథుడు పోతన మున్నగు 15 వ శతాబ్దపు కవులుగాని చేయని ఒక విన్యాసము ప్రబంధకవులు తమ కావ్యములందు అలంకార సందర్భముగా ప్రయోగించిరి. సందర్భమును బట్టి అలంకారము ఉపయోగించినచో కావ్యమునకు సొగసు కలుగునని ప్రాచీనాంధ్ర కవులూహించగా ప్రబంధ కవులు ఎన్ని అలంకారములు ఉపయోగించిన అంతటి సౌందర్యము కావ్యమునకు కలుగునని భావించి దానిని నిష్ఠతో అమలు చేసిరి. నన్నయాది కవులు ఉపమ, రూపకము, వంటి అలంకారములకు ప్రముఖ స్థానమీయగా ప్రబంధకవులు ఉత్ప్రేక్ష, అర్థాంతరన్యాసము, విరోధాభాసము, శ్లేషవంటి సంక్లిష్ట భావ చిత్రములను ఇతర శాబ్దికాలంకారములను ప్రవేశపెట్టి తమ కావ్యమునకు సొగసును కల్పించితిమని కృతార్థులమైతిమని భావించుకొనిరి. కాళహస్తి మాహాత్మ్యము రచించిన ధూర్జటి మహాకవి ప్రబంధ కవుల కాలములో నివసించిన అష్టదిగ్గజములలో ఒకడుగా శ్రీకృష్ణరాయల సభను అలంకరించి ఈ ప్రబంధమును వ్రాసిన వారగుటచేత ప్రబంధ ప్రక్రియలోని అన్ని గుణములను ఆకళించుకొని నట్లుగానే అలంకార ప్రయోగమును కూడా అనయించుకొనెను. ఈయన కావ్యములో తరచుగా మనకుఅలంకారములు కన్పించును

ఈ ప్రబంధకవుల దృష్టి అలంకార ప్రయోగ సందర్భమున ఇట్లుండగా ఈ అలంకారముల వలన వారు సాధించిన ప్రయోజనమేమి? అను విషయమును వివరించి చెప్పుటకు కొన్ని ఉదాహరణములు పరిశీలించ వలసియే యుండును

ధూర్జటి కాళహస్తి నగర వర్ణనము నందు అనేక పద్యములు వ్రాయుచు

మ॥ అతులైశ్వర్య పరంపరా విలసితంబై నట్టి తత్పట్టణ
ప్రతిబింబంబుని ఇంద్రకాంత రచిత ప్రాకార మొప్పారు న
ద్భుత మాయా బహు విభ్రమ భ్రమితవస్తు వ్రాతలో దయ
స్థితి లోఁగొన్న శివుండనంగ, హృదయా చింత్య ప్రభావంబునన్
(కా. మా. ప్ర. ఆ. 19)

అను పద్యమును వ్రాసెను దీనిలో పట్టణ ప్రాకారమును ఉపమేయముగా చేసి అది అనంత ఐశ్వర్య పరంపరలచేత ప్రకాశించుచు, ఆ పట్టణమునకు ప్రతిబింబముగా నున్నదని అద్భుత మాయా విభ్రమము చేత అమిత వస్తు వ్రాతమ్మును కలి

గిన లోకమును లయము చేసికొన్న శివునివలె నున్నదనియు రెండుపమానములను గ్రహించి ఉత్ప్రేక్షా లంకారమున వానిని కూర్చినాడు. ఇట్లు చేయుటవలన పట్టణ సౌందర్యమును వర్ణించుట ఒక ప్రయోజనము. సార్థకమైనన్ని అలంకారములు వ్రాయుట రెండవ ప్రయోజనము. కాని ఉత్ప్రేక్షాలంకార ప్రయోజనము ఈరెంటి తోనే తీరిపోలేదు. ఆ ఉపమానములను గ్రహించుట చూడగా వాని ప్రయోజనము స్పష్టమగుచున్నది.

1. కాళహస్తి నగరమందు అనంతమైన ఐశ్వర్యమున్నది. అనగా ధన కనక వస్తువాహన సమృద్ధి యున్నది. ఆ సమృద్ధి తాత్కాలికముగా కాక పరం పరగా అనంతముగా ఉన్నది. అనగా అచట ప్రజలు అనంతమైన వస్తుసమృద్ధిని ఐశ్వర్యములను అనుభవించుచున్నారు. అని కవి చెప్పవలసిన భావము స్పష్ట మైనది. ఇక ఉపమేయమైన ప్రాకారమందు ఈ ఐశ్వర్య విలాసము ప్రతిబిం బించుచున్నట్లున్నదని చెప్పగా ఈ ఐశ్వర్య సమృద్ధిని కనుగొనుటకు విశాలమైన పట్టణమునందంటను సంచరించవలసిన పనిలేదు. కేవలము ప్రాకారము చూచిన చాలును-దానియందే సర్వము ప్రతిఫలించినట్లుండును.

పట్టణము వస్తుసమృద్ధిని కలిగి యుండవలయును. అప్పుడే సర్వజన సంక్షేమము వాని యందుండునని ప్రాచీన కాలమున రాజులు భావించి అట్టి పట్టణ ములను నిర్మించెడివారట. శ్రీకాళహస్తి పట్టణము కూడ అట్టి పట్టణములలో చేరిన దని కవి ఈ అలంకారము వలన సూచించినాడు. ఇచట ఒక విశేషాంశమును కూడ చెప్పవలెను. ఐశ్వర్యమనగా వస్తుసమృద్ధి యనునది సామాన్యార్థము. ఈ సమృద్ధి ఈశ్వరుడు ప్రసాదించినదగుట చేత అది ఐశ్వర్య మగుచున్నది. పద ప్రయోగమందును కవి యిట్టి భావమును మనస్సు నందుంచుకొనియే యున్నాడు

ఇక ఆ ప్రాకారము శివుడేమో అన్నట్లుగానున్నదని రెండవ ఉపమానము. ఆ శివుడు సామాన్యుడు కాదు. "అద్భుత మాయా జవా విభ్రమ భరిత వస్తు వ్రాత లోకోదయ స్థితిలోగొన్న శివుఁడు" అనగా అద్భుతమైన మాయచేత అనంతమైన ఆశ్చర్యమును కలిగించు వస్తువ్రాతమును కలిగిన లోకము ఉదయిం చగా అట్టి స్థితి నిలయము చేసి కొన్నవాడు. అని చెప్పవలయును. అనగా లోకము

నందలి సమస్త వస్తుప్రాతము ఈశ్వరుని యందే లీనమైయున్నదన్నమాట. అట్లను టచేత ఈశ్వరుడు లోకమును నశింపజేయువాడు అని అర్థము కాదు. అతడు శివుడు-అనగా శుభప్రదుడు. ఇక అచట ప్రాకారము చతుర్దశభువనాకారము కలిగిన శివునివలె యున్నది. ఇట్లు ఉత్ప్రేక్షించుట కూడ కాళహస్తి నగర ప్రాకారము లోకము నందలి సమస్త వస్తు ప్రాతమును కలిగియున్నదని ఒక యర్థము. శ్రీకాళహస్తి పట్టణము మాహేశ్వర ప్రాధాన్యము కలిగినట్టి పట్టణము. అచటి పౌరులందరును ఈశ్వర భక్తులే. అచటనున్న భవనములన్నియు ఈశ్వర మందిరములే. అట్టి మాహేశ్వర భరితమైన ఆమహా నగరమునందలి ప్రాకారము కూడ శివ స్వరూపమనే కలిగి యున్నదని కవి ఉత్ప్రేక్షించినారు. అట్లు చూడగా ఆ పవిత్ర నగరము ప్రాకారము మొదలుకొని చివరివరకు మహేశ్వర భరితమైనది యని కవి చెప్పినట్లైనది.

ఒక ఉపమేయమును గ్రహించి రెండు పమానములతో దాని నుత్ప్రేక్షించుటలో కవి సాధించిన విశేషములివి. ద్వితీయాశ్వాసమున బ్రహ్మపుత్రులతో వాని సోదరుడు యుద్ధము చేయు సందర్భమునను చక్కటి ఉపమానముతో కవి యొక పద్యము వ్రాసెను.

క॥ "బలములు దీర్చిరి, నడిచిరి
బలవంతుడైన యుగ్రుపై నేచి, బలా
బలచింతలేక, రాక్షస
బలములు రఘురాము మీద బైకొను రీతిన్

(ద్వి. ఆ. 88 పద్యం)

"యుగ్రుపైనేచి" యనుటలో రాక్షసులందరు కలిసి యుగ్రునిపై విజృంభించిరని భావము. వీరి యుద్ధము రామ రావణ యుద్ధముతో పోల్చబడినది. కవి చక్కటి ఉపమాలంకారము నిచట ప్రయోగించెను. ఉపమానములు పెక్కులు ప్రయోగించిన పద్యములు కూడ నీ సందర్భమున గలవు.

శత్రుబలము చూచి జాగ్రత్తగా శత్రువుపై విజృంభించుట యుద్ధనీతి. కాని ఉద్రేకమున క్రోధమున శత్రువులను జయించుట సాధ్యముగాదు. రాముడు విష్ణు-

సన్నిభుడై మహాశక్తి సమన్వితుడని తెలియని రాక్షస సైన్యము అతనిపై విజృంభించి తాము నశించిరి. తమ నాయకుని పోగొట్టుకొనిరి. ఈ ఉపమానముతో యిచట విజృంభించిన శత్రువులు కూడ నశించిపోవనున్నారని ధ్వనిని సూచించుటకు ఇట్టి పద్యము కవి వ్రాసెను ఇది అలంకార ధ్వనిలోని యొక పద్ధతి. ఉపమానములు పెక్కుటుప యోగించిన పద్యములు కూడ నీ సందర్భమున గంపు.

మ॥ గరళంబుద్ధరి నారగింప జను నుగ్రవ్యాఘ్ర విస్ఫూర్తి, సా
గర మాపోశనమెత్తు కుంభజుని రేఖన్ధ్వాంత సంతాన సు
స్థిరతం దీర్చు దినేంద్రు చందమున నాసేనంగనుంగొంచు, భీ
కర వేగంబున దాకె నుగ్రుడపు దుగ్రం బైన రూపంబునన్ (ద్వి.అ.10)

ఇచట ఉగ్రుడు విషమును భయంకరముగా తినుటకు వెళ్ళు శివునివలె నున్నాడని కవి వర్ణించినాడు బ్రహ్మ పుత్రుడైన ఉగ్రుడు రాక్షసులను తాకుట ఇచట వర్ణనీయమగు విషయము. ఇంకను ఉగ్రుడు సముద్రము నాపోశనము పట్టు అగస్త్య మహాముని వలెను, గాఢాంధకారమును పటాపంచలు చేయు దినకరుని వలెను ఉన్నట్లు మూడు ఉపమానములు చెప్పబడినవి. ఇట్లు చెప్పబడుటవలన దీనిని మా లోపమ లేక పరంపరోపమ యందురు పరంపరలుగా ఉపమానములు వాడుట ఇందలి విశేషము. ఇట్లే ఇంకో ఉపమాలంకారము ఇదే సందర్భమున

క॥ తానేసిన శరములు దా
వానలమున బడ్డ మిడుతలట్లు, శరనిధిన్
సోనలుగ వర్షించిన
బానల్క్రియ, వారి మీద వమ్మైపోవన్ (ద్వి.అ. 48)

ఇచట బాణములు ఉపమేయములుగా చెప్పబడినవి. వ్యర్థములైన ఆ బాణములు దావానలము పయి పడిన మిడుతలుగను సముద్రమున పడిన వానలుగను చెప్పబడినవి. ఈ రెండును ఉపమానములు. అవి నిరుపయోగములని చెప్పబడినది. ఇచట నీరెండుపమానములకును భేదము పొడచూపుచున్నది. సముద్రమున కురియు వాన నిష్ప్రయోజనము. దావానలము పయిపడిన శలభములు నిష్ప్రయోజనములు మాత్రమేకాక ఆత్మ వినాశమును కూడ పొందుచున్నవి. ఈ విషయ

మునే ఇచట కవి ధ్వనింప జేసినాడు. ధూర్జటి రూపకాలంకారము లలితముగా వాడినట్లు కావ్యములో పెక్కుచోట్ల తెలియుచున్నది. తృతీయాశ్వాసమున నత్కీరుని తీర్థయాత్ర సందర్భమున చక్కటి రూపకముతో కవి ఈ క్రింది పద్యము చెప్పెను.

గీ॥ అనుచు చింతా పరంపర లనెడు వర్ష
ముడిగి, నత్కీరుడను మేఘ ముత్తరంబు
నడచ సంతోషమున, దక్షిణమున నున్న
కవుల ముఖ పంకజములు వికాసమొంద (తృ.ఆ. 178 పద్యం)

ఇచట నత్కీరుడు విచార మనెడు పరంపరను విడిచి సంతోషముతో బయలు దేరెను. కవియను మేఘము ఉత్తర దిశకు ప్రయాణమైనట్లు చెప్పబడినది. ఉపమానోపమేయములకు అభేదమును చెప్పిన యెడల రూపక మగును. అట్లే ఉపమేయమునందు ఉపమాన తాద్రూప్యమును వర్ణించినను రూపకమగును. పై పద్యమందు నత్కీరుడు మహాకవి గనుక దక్షిణముననున్న కవులందరు సంతసిల్లి రనియు చెప్పబడినది. ఇందు చింతా పరంపరలు వర్షముగను, నత్కీరుడు మేఘముగను, దక్షిణ కవుల ముఖములు పద్మములుగను రూపింపబడినవి. వర్షము కురిసి, మేఘములు చెదిరిపోయిన పిదప కమలములు వికసించినట్లు వర్ణన చేయ బడినది. ఇందు మరియొక విశేషమేమనగా నత్కీరుడు దక్షిణమున ఉన్న యెడల ఆ ప్రాంతపు కవులకు దిగులు ఎక్కువ. మహాకవి యగు నతడు సర్వదా యితర కవుల దోషములను వెల్లడించుచు వారికి దుఃఖమునే కలిగించును. వారి ముఖములు వికాస హీనములై యుండును. ఇపుడతడు దక్షిణమును విడిచి యుత్తరదిక్కునకు పోవుటవలన అతని వలన బాధ వారికి లేదు. ఇచట ఉత్తరిం చుట దాటుట [illegible] యను అర్థము కూడ పొసగును. నత్కీరుని పక్షమున ఉత్తర దిక్కుగాపోవుట యని అర్థాంతరము. ఇట్లే చతుర్థాశ్వాసమున

చ॥ తిమిరదినేంద్రజా జలము దెచ్చి, యజాండఘటంబునందు బో
సి, మరల బశ్చిమాశయను చెల్వ వహించిన పద్మరాగ కుం
భముగతి సూర్యుడుం జనియె, బ్రాక్సతి వెన్నెలవెల్లువేదితో
యము వడబోయు హేమకలశాకృతి జంద్రుడు నొప్పెనయ్యెడన్
(ఆశ్వా. 4. పద్యం 91)

సాయంకాల సమయమున తూర్పున చంద్రోదయము, పడమట సూర్యాస్తమయము అగుచున్నప్పటి వర్ణన పై పద్యము. పశ్చిమ దిక్కు మహిళగను, చీకటి జలము గను, బ్రహ్మాండ మొక పెద్ద మటముగను, తూర్పు దిక్కాక సతిమణి గను, వెన్నెల వెల్లువేటి జలముగను రూపింపబడినవి. సూర్యుడు పద్మరాగ కలశము రీతిని చంద్రుడు బంగారు కలశము రీతిని, ఉన్నట్లుగా పోలిక చెప్పబడినది. సూర్యాస్తమయ సమయమున పడమటి దిక్కున చీకటి తలసూపుచున్నదనియు, తూర్పున వెన్నెల వెలుగు పొడసూపుచున్నదనియు గ్రహించవలెను.

చీకటిని అజ్ఞానముతోను, వెలుగును జ్ఞానముతోను సమానముగా భావించుట సాహిత్య సంప్రదాయము కవిసమయము ఇచట వినువారికి అజ్ఞానమను అంధకారము కలుగగా దానిని తొలగించుటకు శివ కథా వర్ణనముచేసి జ్ఞానమును కలిగించుట సంభవించినది. ఈ రెంటింటికి సంకేతముగా సూర్యుడస్తమించగా ఏర్పడిన అంధకారము తొలగిపోవునట్లు చంద్రోదయమైనదని కవి ధ్వన్యాత్మకముగా ఈ రూపకానుప్రాణిత ఉత్ప్రేక్షవలన సూచించియుండెను. ఇదియే దీని ప్రయోజనము

ఇచట ఉపమ రూపకములు రెండునూ గలవు. సంస్కృతమున మాఘ మహాకవి ప్రాతఃకాలమునందలి సూర్య చంద్రులను వర్ణించుచు "ఘంటా మాఘ" డను ప్రశస్తిని గాంచెను. ధూర్జటి మహాకవి సాయంకాల మందలి సూర్య చంద్రులను వర్ణించుచు తన కవితా ప్రౌఢిమ నిందు వెల్లడించెను.

శా॥ తారా ప్రోష్ఠలగాలసూతుడు వియద్వారాశి వేటాడి ప్రా
ష్ఠోరంతంబను బుట్టి తెట్టె నులివాయంగుండియా దాజె
న్నారనైచిన జలమో యనగ, శోభకించనత్వంబునన్
దారానాయక మండలం బమరె నస్త్రగ్రావ కూటంబులన్ (ద.అ. ౪౮)

ప్రాతఃకాల వర్ణనమునందలి పద్యమిది. ఇందు చుక్కలు మత్స్యములుగను, కాలము జాలరిగను, ఆకాశము సముద్రముగను ప్రాతఃకాలము చేపలబుట్టగను రూపింపబడుట స్పష్టము. జాలరివైచిన వలయాయనునట్లు మిగుల శోభావంత

ము పదమటి కొండపయి చంద్రమండలము ప్రకాశించెనను ఉత్ప్రేక్షయూ ఇందు కానవచ్చుచున్నది.

నక్షత్రములను చేపలను కాలమనెడు బోయవాడు ఆకాశమనెడు సముద్రము నందు వేటాడి మధ్యాహ్న ప్రారంభమునందు బుట్టపెట్టి చిక్కు పోవునట్లుగా గుంజి ఎండబెట్టుటకు ఇంపుగా కన్పించునట్లుగా ఆరవేసిన వలయేమో అన్నట్లుగా కాంతి తగ్గుటచేత అస్తాద్రియందు చంద్ర మండలము కన్పించినది. ఇచట ఉపమను చెప్పినను చెప్పవచ్చును. కాని దానికంటె ఉత్ప్రేక్షయే రసవంతముగా కన్పట్టు చున్నందున అదియే గ్రహింపనగును. ఇక శ్లేషాలంకారమును పరిశీలింతము. శ్లేష యనగా రెండర్థములు వచ్చునట్లుగా పదము ఉపయోగించుట. అర్థ శ్లేష మనియు శబ్దశ్లేషమనియు ఇందు రెండు విధములు. ధూర్జటి కావ్యమున శ్లేషతో కూడిన ఉపమాలంకారములు గలవు. దీనినే శ్లిష్టోపమ యని యందురు అందుల కుదాహరణముగా ఈ క్రింది పద్యము పరిశీలింతము.

చ. పరిచిత బంధనై పుణి నపార కళానుభవ ప్రసక్తి, నా
దరసవివేక సంపద, సదా శుకవాక్యసుధానుభూతి, మో
హరహితవృత్తి, బ్రస్ఫుర దనంగరహస్య విచార బుద్ధి, న
ప్పురమున గామినీ జనులు పొల్తురు యోగిజనంబు పోలికన్

(ప్ర.అ. 24 పద్యం)

ప్రథమాశ్వాసమున శ్రీకాళహస్తి మహాపురవర్ణన ఘట్టమునందు ధూర్జటి పుర వర్ణన చేయుచు అచటి స్త్రీలు యోగిజనంబులను పోలియున్నారని శ్లేషాలంకారముతో పై పద్యము చెప్పెను.

ఈ పద్యమున కవి శాబ్దికమైనటువంటి చమత్కారము చేసి కాళహస్తి నగరమున నుండు స్త్రీలను యోగులతో పోల్చినాడు. బంధము కళనాదరసము శుకవాక్యము, మోహము, అనంగ రహస్యము అను పదములలోని శ్లేషార్థముల చేత ఉపమేయమైన స్త్రీలకు ఉపమానమైన యోగులకును సంబంధము కల్పించినాడు. సామాన్యముగా ప్రబంధములలో ప్రయత్న రూపకముగా శ్లేషాలంకారమును ప్రవేశపెట్టుట వంటిదే ఇచట కవి కూడ చేసెను.

ఆ పట్టణము నందలి వారకాంతలు యోగులను పోలియుందురని యుపమాలంకృతి కూర్పబడియున్నది. పోలిక యున్నచో ఉభయులకును సాధారణములగు ధర్మము లుండవలెను. అవి శబ్ద శ్లేష మూలమున చూపబడినవి ఇరువురికిని బంధనైపుణి గలదు. యోగులది ఆధారబంధము, ఉడ్డీన బంధము, జాలంధరము మున్నగు యోగ బంధములందే పుణి. వారకాంతలది కామశాస్త్రమునకు సంబంధించిన భ్రమర చక్ర బంధాదులందే పుణి. ఇరువురికిని కళానుభవము కలదు. కళా శబ్దమునకు యోగి పక్షమున యోగకళలు, కామిని పక్షమున కామకళాస్థానములును అర్థము. 'నాదరస వివేక సంపద' అనుదానికి యోగిపక్షమున నాదబిందు వివేక సంపదయు వారకాంతల పక్షమున వీణాది వాద్యధ్వని సంపదయు నర్థములు. శుకవాక్య సుధానుభూతి యనగా యోగి పక్షమున శుకయోగి సిద్ధాంతమనెడి యమృత రసానుభవము వారకాంతాపక్షమున చిలుకపలుకుల వంటి ముద్దుప్రీతి కరములగు మాటల మాధుర్యపు ననుభవము అర్థములు. 'మోహరహితవృత్తి' యోగి పక్షమున అజ్ఞానములేని రీతి. వేశ్యా పక్షమున మొగ్గరమునందు హితమగు పద్ధతి. అనంగ రహస్య విచారబుద్ధి యనగా- యోగి పక్షమున-అంగముల బహుళాఖలు లేక ఏకమార్గమున నుండు తత్త్వ విచారము నందలి బుద్ధి వేశ్యా పక్షమున మన్మథ శాస్త్ర విచారము నందలి బుద్ధి. ఇట్లు పరస్పర విరుద్ధములగు విషయములు పలుశబ్దముల వలన ఇచట మిక్కిలి నేర్పుతో నిబంధింపబడినవి కవి పాండిత్యమునకిది యొక నిదర్శనముగ చెప్పవచ్చును. ఈయలంకార ప్రయోగమున కిదియే ప్రయోజనముగా కనబడుచున్నది.

ఇదే సందర్భమున సంకీర్ణ శ్లేష

మ. అరగంటం గనుగొంట మందగతి బూర్ణాహం కృతిం బ్రార్థనా
కర భుక్తి స్థితి, ముక్తలోక భయశంకావృత్తి, నున్మత్త న
శ్వరతి, స్వత్వ సమగ్రత న్మదిత పద్మ ధ్యాన్నతిన్గంధమం
థర దంతావళకోటి యొప్పు నవధూత ప్రక్రియం దత్పురిన్
(ప్ర.ఆ. 25 పద్యం)

గంధ మంథర దంతావళకోటి — మదించిన ఏనుగుల సమూహము.
అరగంటం - తెరిచి తెరవని కన్నులతో చూచుట

మందగతి - మెల్లగా నడచుట

పూర్ణాహం కృతి - పరిపూర్ణమైన దర్పము

ప్రార్థనాకర భుక్తిస్థితి - తొండముతో భుజించుట

ముక్తలోకభయ శంకావృత్తి-వదలబడిన లోకము వలని భయము గలిగి

ఉన్మత్త నవ్యరతిన్ - క్రొత్తగా మదము గల్గుటచేత సంతోషము

సత్వ సమగ్రత — నిండిన బలము చేత

అవధూత ప్రక్రియన్ - సన్యాసులవలె

మృదిత పద్మభ్యున్నతి - విచ్చుకున్న పద్మముల మీద గోరింకలు

ఇంక సన్యాసుల విషయము నర్థమీ విధముగా నుండును.

సగము కన్నులు తెరచి చూచుట, మెల్లగా గాలి పీల్చుట, పూర్ణాహంకృతి - నిండిన భావముతో నుండుట ప్రార్థనాగరభుక్తి స్థితి భిక్షాన్నము గ్రహించి తినుట.

ముక్తలోక భయశంకావృత్తి-లోపమును వదలుదుమన్న భయములేకపోవుట

ఉన్మత్త నవ్యరతి - పిచ్చి వానివలె ప్రవర్తించుట

ముదిత పద్మాభ్యున్నతి - పద్మాసనమున కూర్చుండుట

ఈ పద్యమున కవి ఏనుగులకు సన్యాసులకు సామ్యము చెప్పినాడు. ఇచట పదములలో శ్లేష లేకపోయినను అన్వయమునందు వాక్యములు రెండర్థములు కలిగి యున్నవి. అందుచే శ్లేషానుప్రాణిత ఉపమానమని చెప్పవలెను.

ఆ ఊరిలోని మదపుటేనుగు లవధూతలను పోలియున్నవని ఉపమాలంకారము చెప్పబడినది. ఉభయ సామాన్య ధర్మము మాత్రము శ్లేష మూలమున చూపబడినది. అరగంటం గనుగొంట ఏనుగుల పక్షమున క్రీగంట జూచుట, అవధూతల పక్షమున ముక్కు కొనను దృష్టిని నిలుపుట, మందగతి రెండింటి యందును సామాన్యము. ఏనుగులు మెల్లగా నడచును అవధూతలును ప్రాణశక్తిని గోలుపోకుండుటకును మెల్లగా నడచెదరట. పూర్ణాహంకృతి గజ పక్షమున పరిపూర్ణమగు అహంకారము అవధూతల పక్షమున నశించిన అహంకారము. ప్రార్థనా కరభుక్తిస్థితి - ఏనుగుల పక్షమున మావటినిచే బుజ్జగింపబడి యాహారమును స్వీకరించుట. అవధూత పక్షమున జనులను యాచించి కరతల భిక్షను గ్రహించుట. ముక్తలోక భయశంకావృత్తి గజ పక్షమున కట్టు విడిచినచో జనులకు భయశంకను కల్గించుట. అవధూత పక్షమున భయ

సందేహములను విడిచియుండుట. ఉన్మత్త నవ్వరతి గజపక్షమున మదమెక్కి యుండుట. అవధూత పక్షమున పిచ్చివానివలె కానబడుట. సత్త్వసంపద గజ పక్షమున బలసంపద. అవధూత పక్షమున సత్త్వగుణ సంపద. మృదిత పద్మా ళ్యున్నతి గజపక్షమున పద్మములను నలిపి వేయుట. అవధూత పక్షమున మర్దింపబడిన తిరస్కరింపబడిన పద్మ సంఖ్యగల సంపద అభివృద్ధి. ఇందు కొన్ని శబ్దముల యందు శబ్దశ్లేషయు కొన్నింటి యందు అర్థశ్లేషయు కన్పించు చున్నది. ఇక ధూర్జటి వాడిన అర్థాంతరన్యాసాలంకారము చూతము. చతుర్థా శ్వాసమున వేశ్యాకూతుల చేష్టలు యను షట్టమున వేశ్యా పుత్రికలు శివుని కొలుచు విధానము చెప్పుచూ కవి

చ. కనక శలాకలందెగడు కన్యలు గట్టిన బొమ్మరిల్లు శం
భునిగుడి, బొమ్మ శంకరుడు. బోనము గుజ్జెన గూడు, వేడ్క జే
సిన పనులన్నియున్ శివుని సేవయొనర్పగ బద్ధపాట్లుగా
మనమున నూహ సేయుదురు, మానుచె తొల్లి జన్మవాసనల్
(చ ఆ 21 పద్యం)

సామాన్యమును విశేషముచే గాని విశేషమును సామాన్యముచే గాని సమర్థించిన యెడల అర్థాంతరన్యాసమగును. ఇచట బొమ్మరిల్లు, బొమ్మ, బోజనము గుజ్జన గూర్లు మున్నగు ఆటలన్నియు, సామాన్యముగా చిన్నపిల్లలాడుకొను ఆటలు. ఇటువంటి సామాన్య విషయములచే శివునికి సంబంధించిన మహత్తర విషయములు జోడింపబడినవి. వేశ్యాతనయులు బొమ్మరిండ్లను శంభుని గుడిగాను అందు బొమ్మను శంకరునిగాను భావించిరి. గుజ్జన గూడును నైవేద్యముగా భావింతురు. సంతోషముతో చేయు కార్యములు (వంట) శివుని సేవగా భావింతురు. ఇవన్నియు పూర్వ జన్మవాసనవలె కన్పట్టుచున్నవి. ఇందు కవి పాండిత్యముతో బాటు శైవ మాహాత్మ్యము గూడ వెల్లడింపబడుచున్నది. అంతియేగాక ఇచట కవికి పూర్వజన్మ సిద్ధాంతముపై గల గాఢ విశ్వాసము వ్యక్తమగుచున్నది. ఇంకొక అర్థాంతరన్యాసము యాదవరాజు కథలో ప్రథమాశ్వాసమున చూతము.

చ. నిలిచిన జూచి మంచి ధరణీపతి సిస్తుకభాషలాడి వే
ల్పుల భ్రమయించు నీ చిగురుబోడి మనోహరమూర్తి రేఖతున్

వెలితి యగుంగదా యసక వేగమ నిర్దయ చిత్తవృత్తిమై
దల గొఱిగింప బంచె; నొక తప్పున గావరుగా నృపాంకుస్
(ప్ర అ. 48)

రాజులు తప్పులేకయే భృత్యులను కఠినముగా శిక్షింతురనునది సామాన్య విషయము. యాదవరాజు తన దాసి శిరోజములను గొరిగించి వికార స్వరూపమును చేయుట విశేషము. పరు సామాన్యముచే నీ విశేషము సమర్థింపబడినందున ఇది అర్థాంతరన్యాస మగుచున్నది.

ఇక దృష్టాంతాలంకారము. చతుర్థాశ్వాసమున వేశ్యాతనయులు వారధర్మమును రోయుట అను ఘట్టమున :

చ॥ ''అమృతము గ్రోలు జిహ్వ చవియించు దలచునే తేనె! సింటిలో
నమరమహీరుహంబు దయమై ననరుండవనీశు వేడునే?
యమిజన భాగ్యరూపమగు నాదమశక్త్యము గాశహస్తి దై
వము భజియించు మానసము వారవధూమదసౌఖ్య మెంచునే ?
(చ. అ. 48 పద్యం)

ఈ పద్యమందు కవి దృష్టాంతాలంకారము వాడెను. వాక్యములకు బింబప్రతిబింబత్వముండునేని దృష్టాంతాలంకార మగును. అనగా ఉపమేయ వాక్యములయొక్క వేఱువేఱు ధర్మములను బింబ ప్రతిబింబ భావముచే చెప్పినచో దృష్టాంతాలంకార మగునని యర్థము. అమృతమును రుచిచూచిన నాలుక తేనెను కోరునా ? ఇంటిలో కల్పవృక్షముండగా రాజు నెవరు యాచింతురు ! మునుల భాగ్యము వంటి కాళహస్తీశ్వరుడు మా మనస్సునకు లభించగా వేశ్యాసంబంధమైన సౌఖ్యమెందుకు ?

దీనిలో అమృతము కల్పవృక్షము అను లోకాతీత వస్తువులను కవి గ్రహించినాడు. తేనె అవనీశుడు అనునవి లౌకికములైన వస్తువులు. మాధుర్యము అను గుణమున అమృతమునకు తేనెకు సామ్యమున్నది. దానగుణమున కల్పవృక్షమునకు రాజునకు సమానత్వము గలదు. కాని ఎట్లు చూచినను దైవమహత్త్వము కలిగిన అలౌకిక వస్తువు లెక్కడ ? ఈ రెండిటికి హస్తిమశకాంతర భేదమున్నది. దీనిని సూచించుటకే కవి యిట్టి ఉపమానములను గ్రహించెను.

కాళహస్తీశ్వరునిమీద భక్తిభావము అలౌకికమై శాశ్వత సౌఖ్యమును కలిగించునట్టి దనియు లౌకికములైన ఏ సౌఖ్యములును దానితో సమానము కావనియు కవి సాదృశ్య సహితముగా నిరూపించుటకు ప్రయత్నించెను.

పైన పేర్కొనిన అలంకారములు ధూర్జటి ఎక్కువగా వాడినట్లు చెప్పియుంటిని. తరువాత శ్లేషానుప్రాణితములైన అలంకారములు చెప్పవచ్చును. పిమ్మట ఉత్ప్రేక్ష, ఉపమ, అర్థాంతరన్యాసము, అతిశయోక్తి, లోకోక్తి కూడ పేర్కొనవచ్చును. ఇంకను క్రమాలంకారము, కావ్యలింగము ఇత్యాదులు కూడ ఈతని రచనలో మనము చూడవచ్చును. ఈ అలంకారములకు కూడ ఉదాహరణము లిత్తును.

అతిశయోక్తి : ద్వితీయాశ్వాసమున బ్రహ్మ పంపున నుగ్రుడు తన యన్నలగు రక్కసులను జంపుటకు పోవు ఘట్టమున మొదటి పద్యము అతిశయోక్త్యలంకారము నకు నిదర్శనగా చెప్పవచ్చును ఆ పద్యమిది.

ఉ॥ కోపున నార్చినం దెసల కుంజరముల్ సెదరెం ధనుర్గుణా
రావముం గలంగె జలరాశి, పదంబెరఁగాంగ తీవ్ర సం
రావమునం గుంతితిధరంబులు, రథ్యమృగేంద్రసాంద్ర హే
షావళి బ్రక్కలయ్యె హరిదంతము, లేమని చెప్ప నత్తఱిన్.

(ద్వి. ఆ. 85)

ఈ పద్యమున చక్కటి ప్రబంధరీతి వర్ణన మరియు అతిశయోక్త్యలంకారమును గనవు

ఇట్లే కావ్యలింగము. సమర్థింపవలసిన విషయమును సమర్థించుట కావ్యలింగము.

ఉ॥ ప్రాతలు మీద గప్పిన గృపామతి నోర్చితి, నీచు పొత్తునన్
బ్రాతిమెయిన్ మొసంగితివి; భక్తుడు కుంటెక బంపదోలి, మై
పూత యొనర్చుకొంటి శవభూతి, గపాలమునన్ భుజించితీ
రోతలు పెక్కులుండ నిట రోయదు వే? యిక భక్తవత్సలా

(తృ. ఆ 100)

శివబ్రాహ్మణుడు కల్లువిరిచెట్టు క్రింద శివలింగము వద్దనున్న కళ్మలము నంతను చూచి, పరితపించి, దానికి సమ్మతించిన శివుని నిందించుచు చెప్పిన పద్యమిది. "నీ విట్టి కళ్మలమునైనను ఏవగించుకొన దనుట యింతటి విషయము. దానిని సమర్థించుట తోలు కప్పుకొనుట, సీమని పొత్తున భుజించుట, ఘంటెనకత్తెను కూడుట, శవములు దహించిన భస్మమును పూసికొనుట, కపాలమునందు భుజించుట అను కారణములు తెల్పబడినవి. ఇదియే యిచట అలంకార ధ్వని. ఇచట యలంకారము కావ్యలింగము ఇందు వ్యాజస్తుతి కూడ గోచరము.

ఇంక క్రమాలంకార మరయుదము.

తొలుత చెప్పిన వస్తువుల క్రమము ననుసరించియే సమన్వయమును కూర్చిన యెడల క్రమాలంకార మగును. ప్రథమాశ్వాసము కాళహస్తి పురవర్ణన సందర్భముననే ధూర్జటి అచటి ప్రజల గూర్చి వ్రాయుచు ఈపద్యము వ్రాసినాడు.

సీ॥ "నైజంబులగు నిత్య నైమిత్తికంబులు
నడుపుచో బ్రహ్మార్పణంబుసేసి
సంగ రహితబుద్ధి శాంతనవస్ఫూర్తి
వైరివర్గంబు సంహారమాడి,
ప్రజల మహార్ఘప్రభాసమానస్థితి
కోశంబులుండెడి కొలదు లరసి,
యాతపశీతవాతాదుల సమముగా
నాత్మ ప్రయత్నంబులందు దలచి,
తే॥ సంచరింతురు బ్రాహ్మణక్షత్రవైశ్య
శూద్రులచ్చోట సంతత భద్రహృదయ
నిరుపమానంద విహరణోన్నిద్రులగుచు
రాజయోగైక సామ్రాజ్యరతుల భంగి (ప్ర. ఆ. 28)

ఈ సీసపద్యములో పైనాల్గు పాదములయందును వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల కృత్యములు వివరింపబడినవి. తేటగీతిలో క్రమముగా నాలుగు వర్ణములవారును చెప్పబడిరి. గనుక క్రమాలంకార మగుచున్నది. సాంఘిక వ్యవస్థ

లోని క్రమమును చెప్పుట ఇచట కవికి ధ్యేయము కావచ్చును. తృతీయాశ్వాసమున తిన్నని కథలో కిరాతులు వస్తుసంపదగూర్చి వర్ణించు సందర్భమున ఉదాత్తాలంకారము కూడ నుపయోగించెను. సమృద్ధమగు వస్తుసంపదను వర్ణించినను, శ్లాఘ్యమగు చరిత్ర మితరమునకు అంగభూతమైయున్న ఉదాత్తాలంకార మగును. ఈ క్రింది పద్య మీ యలంకారమున కుదాహరణగా చెప్పవచ్చును.

ఉ॥ సంకుమదంబున్నుం బునుగు జాదును గస్తురియున్ ఘటంబులం
బంకము జేసి యిండ్లలికి ప్రత్యహమున్ వెలివైన మార్గ కూ
ల్యంకష గోమయ ప్రతతులం బరుడించుచు నుందు గుప్పలై
యింక దదీయభూతి నిదమిత్థమటంచు నుతింప శక్యమే ?

(తృ. ఆ. 6 పద్యం)

ఇందు అటవికుల వస్తు సమృద్ధి వర్ణింప బడినది. సుగంధద్రవ్య సమృద్ధి కూడ ఇందు గోచరము.

ప్రథమా శ్వాసమున ఇంకొక యుదాహరణము.

మ॥ తనయిల్లా లఖిలైకమాత, తన సంతానంబు భూతవ్రజం
బనులాపంబులు వేదముల్ఘన విహారాగారముల్కొని హృ
ద్వన జంబుల్ఘ న సేవకుల్గమలకారశ్రీధరుల్గాజెలం
గిన దేవోత్తము నమ్మహాత్ముదరమే కీర్తింపగా నేరికిన్

(ప్ర ఆ. 10 పద్యం)

శ్లాఘించుట యను విషయమున కీ పద్యము నిదర్శనము. ఇచట తన సతీమణి లోకైకమాత యగుట మున్నగు శ్లాఘ్యమగు వృత్తాంతమంతయు మాహేశ్వరున కంగముగా వర్ణింపబడినది. ఇంతకుముందు మంగళాచరణ పద్యములో కవి 'మదీయభీష్టముల్ప్రపెల్పెరుదున్' అని చెప్పుకొనినాడు. ధూర్జటి వంటి మహాకవి మహాభక్తుని అభీష్టములు తీర్పు పరమేశ్వరుడెటువంటివాడు అను విషయము గురించి చెప్పుచు ఆయన ఇల్లాలు సకలలోకములకు తల్లి. సకల ప్రాణులు ఆయన సంతా

నము మరియు మహర్షుల హృదయ పద్మములు ఆయన విహారస్థలములట. బ్రహ్మ, విష్ణువులు ఆయన సేవకులు అటువంటి దేవోత్తముని వర్ణించుట ఎవరి తరము? ఇది దీని భావము. అందుచేతనే చేతోగమ్యుండనీ, అనుభవ గోచరుండనీ దూర్జటి పేర్కొనినాడు. అంటే పరమేశ్వరుని మనస్సు చేతనే చేరుకోగలమని, అనుభూతి ద్వారానే తెలుసుకోగలమని చెప్పుట. ఈ పద్యము వలన కాసుల పురుషోత్తమ కవి పద్యము జ్ఞప్తికి వచ్చును. నిందా పూర్వకముగా నాతడు విష్ణువును స్తుతించుచు "ఇష్టసంపన్నురా లిందిరభార్యయై కామితార్థమడన్న ఖ్యాతి తెచ్చె .... కాని మొదటినుండి నీవు దామోదరుండవె.... (ఆంధ్రనాయక శతకము)

ఇక దూర్జటి కవి గావించిన వర్ణనల గూర్చి పరిశీలింపవలసి యున్నది. కావ్యములు వర్ణనా ప్రధానములనియు, వర్ణనల వలన కావ్యమునకు శోభ చేకూరుననియు మనకు తెలిసిన విషయమే. పూర్వపు కవుల కావ్యములందు వర్ణనల కంటె ప్రబంధకవుల కాలపు కావ్యములలో వర్ణనలు సౌందర్యవంతములుగ నుండుట విశేషము. ప్రబంధములందు అష్టాదశ వర్ణనలుండ వలయునని లాక్షణికులు చెప్పిరి. ప్రబంధ కవులందరును అమితముగా వర్ణనలు చేసిరనుటకు వారి కావ్యములే నిదర్శనములు. ప్రబంధకాలములోనివాడే యగు ధూర్జటి వర్ణనలందు యించుకభేదము కన్పట్టుచున్నది. వర్ణనాభిలాషలో దూర్జటి ఏ ప్రబంధ కవికిని తీసిపోడు. ధూర్జటి ప్రకృత్యాది వర్ణనములన్నియు శైవమయములుగనే కన్పట్టుచున్నవి. అదియే ఇతర ప్రబంధ కవుల వర్ణనలకును ఈయన వర్ణనలకుగల ప్రధాన భేదము.

ప్రబంధమున అష్టాదశ వర్ణలుండవలయునని విశ్వనాథుడు ఆంధ్రప్రతాప రుద్రయశోభూషణమున చెప్పినాడు.

> నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయ వర్ణనమ్
> ఉద్యాన సలిలక్రీడా మధుపాన రతోత్సవాః
> విప్రలంభో వివాహశ్చ కుమారోదయ వర్ణనమ్
> మంత్రద్యూత ప్రయాణాజి నాయకాభ్యుదయా అపి,
> ఏతాని యత్ర వర్ణ్యంతే తన్మహాకావ్య ముచ్యతే
> ఏషా మష్టాదశానాం యైః కైశ్చిదూన మపీష్యతే
>
> (ప్రతాప రుద్రీయమ్ - నాయక ప్రకరణము)

ఇందుమించుగా ఈ వర్ణనలన్నియు ధూర్జటి తన ప్రబంధమున గావించెను. ఇంతే గాక ఒకే విషయమును రెండు మూడు సార్లు వర్ణించుటయు జరిగినది. ధూర్జటి వర్ణనలు క్లుప్తముగను మనోరంజకముగా నుండును. హితమిత వర్ణనల విషయములో నీతడు ప్రబంధ పరమేశ్వరుని మార్గమవలంబించెను. ఈ కవి వర్ణనలలో సూక్ష్మ పరిశీలన దృష్టి కనబడును. చక్కని కల్పనలు గూడ దోచును.

ధూర్జటి ప్రబంధమందలి కథలు భిన్నవేమైనను వర్ణనా మూలమున వాటిని పెంచెనని శ్రీపోణంగి శ్రీరామ అప్పారావుగారు తను కాళహస్తి మాహాత్మ్య పీఠికలో దెల్పిరి. వర్ణలనహితమితముగా నున్నవని శ్రీ వెంపరాల సూర్యనారాయణ గారభిప్రాయపడిరి (శ్రీ. కా. మా. పీఠిక) వర్ణనల ద్వారా ధూర్జటి కావ్యము నంతగా పెంచి వ్రాసినట్లుతోచదు. హితమిత వర్ణనలు చేసెననుటయే సమంజసమని నా యభిప్రాయము ఎందుచేతననగా ధూర్జటి పుర వర్ణన కూడ గతాను గతికముగా పురస్వరూపము, అందు సౌధములు, ప్రాకారములు, ఎలదోటలు అగడ్త, చాతుర్వర్ణ్యము, కామినీ జనులు, చతురంగ బలము మొదలగు వానిని వర్ణించెను. సూర్యోదయ సూర్యాస్తమయ ఘట్టములందు మాత్రమే కొద్దిపాటి దీర్ఘ వర్ణన కందు తప్ప మిగిలిన విషయములన్నియు మితముగానే ఈ కవి చేసెను. రెండుసార్లు గావించిన ఈ పురవర్ణనలో భేదము గలదు. ఎందువలననగా కాళహస్తి మాహాత్మ్యమున మొదటిది కాళహస్తి పురవర్ణన రెండవది మధురాపుర వర్ణన. మొదటిది శివాత్మకమైన పురుషునికి రంగభూమిగా వర్ణింపబడినది. రెండవది చైతన్య స్వరూపిణియగు దేవికి రంగభూమిగా వర్ణింపబడినది. మొదట జ్ఞాన తత్త్వమునకు అతీతమైన ఆనంద స్థితిని తదభిముఖమైన కుండలినీ శక్తిహంస మార్గము నిర్గుణ ధ్యాన సంధా నాదులు వర్ణితములు. ఇది కాళహస్తి పురవర్ణన. ఇంక మధుర వర్ణనలో శంఖఫలకము గూర్చి చెప్పబడినది. ఈ శంఖఫలకము తమిళ వాఙ్మయమున సంఘ సాహిత్యము గూర్చి చెప్పబడుచున్నది. ఇది కవులకు నెలవీడు. కవులకుగల ఈ గుణములన్నియు శక్తియగు మీనాక్షిదేవి యను గ్రహ ప్రభావములే. కాళహస్తి శివునికి నెలవైనన మధుర దేవికి నెలవై కళలకు పుట్టినిల్లైనది. ఇట్టి పురవర్ణన మనము ఆంధ్రమున ఏ గ్రంథమునందు చూడ లేము. ఆధ్యాత్మిక సౌందర్యములు అనుభవైన వేద్యమైన ధూర్జటి పుర వర్ణనమే విలక్షణమైయుండును.

ద్వితీయాశ్వాసమున కాళహస్తుల కథలో ఏనుగు, పాము ఎప్పుడు తెల్లవారునా యని ఎదురు చూచుచున్న సందర్భమును పురస్కరించుకుని సూర్యోదయ, సూర్యాస్తమయ వర్ణనలు ప్రవేశపెట్టెను.

సంప్రదాయము ప్రకారము కావ్యము పురవర్ణనతోనే ప్రారంభమయినది. ఆ పురమందలి కామినీ జనులు కూడ యోగి జనంబుల పోలికయని కవి వర్ణించినాడు. ఆ పురమందలి చరాచర జాతము సర్వమును శైవమయమే. ఇదియే ఈయన ప్రత్యేకత. అష్టాదశ వర్ణనలందు పురవర్ణనకు ప్రాధాన్యము గలదు.

సీ॥ సంసార పారదోచ్చాట నానలశిఖ,
కలుష సంచయ తామ్ర గంధకంబు
కామ లతామూల కంద కుద్దాలంబు,
సంకల్పపాషాణటంక ముఖము,
రాగాలి వనాంకుర కరంగరీయంబు,
శంకా కళంక భుజంగన కులి
నవ మనోగోరాజ నాసికా రజ్జువు,
కోపనేత్రుల విశిఖోపలంబు,

తే॥ దివ్య దేశిక హంసోపదిష్టమార్గ
నిర్గుణ ధ్యాన సంధాన నిరుపమాన
సౌఖ్య సంపత్తిసాధక జన నివాస,
మమృత లింగాకారము కాళహస్తిపురము (ప్ర. ఆ. 17)

కాళహస్తిపురము అమృతలింగము గల్గినటువంటిదనియు, సంసారమనెడి పారదమును నిర్మూలింప జేయుట కగ్నివంటి దనియు. పాపము అనెడి రాగి లోహమునకు గంధకము వంటిదనియు, మోహమనెడి తీగయొక్క దుంపను త్రవ్వుటకు పనికివచ్చు గడ్డపారవంటిదనియు. సంకల్పములకు రాతికి ఉలివంటి దనియు, అనురాగ మనెడి వరిచేల మొలకకు జంతువుల సమూహమువంటి దనియు, సందేహము పాపము అను సర్పమును నశింపజేయుటలో ముంగిస వంటిదనియు, ఆపురమును ధూర్జటి వర్ణించినాడు. ఇంకను యౌవనమను ఆంబోతుకు ముక్కుత్రాడువంటిదని, కోపము గలిగిన స్త్రీలకు తీక్ష్ణమైన రాయివంటిదని వర్ణించినాడు.

తేటగీతి పద్యమున శ్రేష్ఠమైన గురువులయొక్కయు, పరమ హంసల చేతను ఉపదేశింపబడిన మార్గమున నిర్గుణ స్వరూపమును ధ్యానించుటచేత, ఆచరించుటచేత అసామాన్యమైన సౌఖ్య సంపదను జనులకు సాధించిపెట్టునది కాళహస్తి పురమని చెప్పినాడు.

ఇక మధురాపుర వర్ణన నత్కీరుని కథలోను, వేశ్యా తనయుల కథలోను రెండుసార్లు జరిగినది.

సీ॥ కపట చతుష్షష్టిగతుల నాడిన వాల
వాయి చొక్కేశుని వాసభూమి,
యతని పట్టపు దేవియైన మీనేక్షణా
ధరతనూభవకు ప్రధాన గృహము
ద్రవిడ భాషా పీఠతల శంఖఫలకంబు
గల కనకాబ్జ పుష్కరిణి కిరవు
దక్షిణాంబుధి వధూ తామ్రపర్ణీనది
సవతువైభవము నెన్నజాలునునికి,

గీ॥ నిజదృగగ్ని ప్రపూజిత నీలకంఠ
కూటలశమయ వైకుంఠ కుంఠితాఘ
నిఖిల సంపత్పరంపరానిహతకింప
దానతాపంబు మధురాభిదానపురము (శ్రీ.ఆ. 181)

కవి 2, 3 సార్లు పురవర్ణన చేయుట యాతని కావర్ణన యందుగల మక్కువ సూచితము. కథా ప్రారంభమున పురవర్ణన చేయుట యను సాహితీ సాంప్రదాయము కూడ నిచ్చట కన్పించుచున్నది. ఇచట 'అలవాయి' శబ్దము నించుక పరిశీలింపనగును.[1] మధురకు తమిళమున 'అలవాయి'యను నామాంతరము. కాని పద్యమందు 'వాలవాయి'యని గలదు. ధూర్జటి యట్లు పొరబడుట కవకాశము లేకపోలేదు. తమిళములో మధురను పేర్కొనునప్పుడు పూజ్యతార్థకమయిన 'తిరు' పదముతో జేర్చి 'తిరువాలవాయి' అందురు. తిరు+అలవాయి అను పదములు కలిసినప్పుడు సంధివశమున వడాగమము వచ్చి 'తిరువాలవాయి' యని

యగును. ధూర్జటి యారూపమును 'వాలవాయి'గానే గ్రహించెను. మధురానగర మునకు 'ఆలవాయి' యను పేరు కలుగుటకు గల కారణము తిరువళ్యాదల్ పురాణములో నిట్లు గలదు.

"సుగుణ పాండ్యుడు దివంగతుడయిన పిదప చిత్రరథుడు చిత్ర భూషణుడు, చిత్రధ్వజుడు, చిత్రవర్ముడు, చిత్రసేనుడు, చిత్రవిక్రముడు రాజమార్తాండుడు, రాజ చూడామణి, రాజశార్దూలుడు, ద్విజరాజకులోత్తముడు, ఆయోద్ధన ప్రవీణుడు, రాజకుంజరుడు, పరరాజభయంకరుడు, ఉగ్రసేనుడు, శత్రుంజయుడు, భీమరథుడు, భీమ పరాక్రముడు, ప్రతాప మార్తాండుడు, విక్రమ కంచుకుడు, యుద్ధ కోలాహలుడు, అతుల విక్రముడు, అతుల కీర్తి యను ఇరువది యిద్దరు పాండ్యుల వంశ పారంపర్యముగా రాజులై రాజ్యమును పరిపాలించిరి. అతుల కీర్తి పాండ్యునికి పిమ్మట నతని కుమారుడైన కీర్తి విభీషణుడు రాజ్య పరిపాలనము చేయుచుండిన కాలములో నొక గొప్ప ప్రళయము సంభవించెను. అంత సప్తసముద్రము లుప్పొంగి వెల్లువలై పాటి విశ్వమునంతను ముంచెత్తెను. సోమసుందర దేవుని విమానమును, మీనాక్షీదేవి దేవాలయమును, ఋషభ పర్వతమును, గజపర్వతమును, నాగపర్వతమును, పశుపర్వతమును, వరాహ పర్వతమును మాత్రము నశింపక యుండెను. వెల్లువతీసిన వెనుక పరమేశ్వరుడు ప్రపంచమును తొంటివలె సృజించి చంద్ర సూర్యాగ్నులను ముప్పురి యొక్క వంశములనుండి తమిళ భూపతులు ముప్పురిని సృష్టించెను.

అప్పుడు చంద్రవంశమునందు బుట్టిన వంశశేఖర పాండ్యుడు సోమసుందర దేవుని దేవాలయము చుట్టును నొక చిన్న నగరమును నిర్మించి యందులో నివసించుచు రాజ్యపాలనము చేయుచుండెను. నీతిదప్పక ఈతడు రాజ్యపాలన చేయుచుండెను. క్షామ బాధలేక అతని రాజ్యమంతయు సుభిక్షముగా నుండెను. జనసంఖ్య దినదినాభివృద్ధి గాంచదొడగెను. ఆ జనులెల్లరును నివసించుటకు స్థలము చాలకుండుటచే పాండ్యుడు దేవాలయమునకు బోయి సోమసుందరదేవునికి నమస్కరించి "దేవా! తమరీ జనులందఱును నివసించుటకు వీలుగా నొక

1. భారతి 1960 నవంబరు వత్కోరుని కథ - కొన్ని విశేషములు: - తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు.

నగరము నిర్మింపవలెను. ఈ నగరమునకు పూర్వముండిన యెల్లలేవో నాకు దెలియవు. నేడు వానిని నాకు దెలుపుడు" అని ప్రార్థించెను. అప్పుడు పరమేశ్వరుడు మెలఁగాడు. కౌపీనము, యజ్ఞోపవీతము, కుండలములు, పాదకింకిణులు కరకంకణములు అనునవియెల్ల నాములుగానే యున్న యొక సిద్ధ పురుషుడై విమానమునుండి లేచివచ్చి మనో మండపమునకు బ్రక్కనిలిచి తన హస్తమునందు గంకణముగా నున్న నాగమును జూచి నీ వితనికి నగరపు టెల్లలను గుర్తించి చూపుము" అని యాజ్ఞాపించెను. అంత నా నాగ మాతనికి నమస్కరించి 'దేవా ఈ నగరము నా పేరుతో ప్రసిద్ధి చెందునటుల ననుగ్రహింపుము' అని, ప్రార్థించెను. పరమేశ్వరుడు 'అట్లే యగుగాక' యని యాపామునను గ్రహించెను నాగము వేగముగా దక్షిణపు దిక్కుగా బోయి తన వాలమును నిగిడ్చి నగరమును ప్రదక్షిణము చేయునట్లు శరీరమును బెంచి తన వాలమును నోటనుంచి పాండ్యున కెల్లలను జూపి తిరిగిపోయి సిద్ధపురుషుని హస్తమున గంకణమయ్యెను. సిద్ధుడును దన దేవాలయములోని కంతర్ధానము చెందెను.

పాండ్యుడును నానాగము కొలిచినట్లే ప్రాకారములు లేవనెత్తి దక్షిణద్వారమునకు తిరపురంకుండ్రము, ఉత్తరద్వారమునకు తిరువేంగడము, తూర్పుద్వారమునకు తిరుప్పూవణమును నెల్లలుగా నియమించెను. ఆ ప్రాకారము 'అలవాయి' ప్రాకారమని, ఆనగరము అలవాయి నగరమని పేరుపొందెను. పాండ్యుడు ఆనగరమును మండపము, గోపురము మొదలగువానిని నూతనముగా నిర్మించి సోమసుందర దేవునికి రత్న కిరీటమును, రత్నాభరణములను జేసి సమర్పించెను. ఆ అలవాయి నగరములో బలువిధములయిన కుటుంబములను నిలిపి పెక్కు సంవత్సరములు రాజ్యపాలనము చేసెను. ఇట్లు ఆ నాగము కోరిన మేరకు మధురా నగరమునకు 'అలవాయి' అని పేరయ్యెను. అలవాయి అనగా పాముని అర్థము. ధూర్జటి దీనిని 'వాలవాయి' యని పేర్కొనెను.

ధూర్జటి వర్ణనలు శైవమయములే యని చెప్పుటకి క్రింది పద్య మొక చక్కటి ఉదాహరణము ద్వితీయాశ్వాసమున చంద్రోదయ వర్ణన చేయుచు, అప్పుడే ఉదయించిన చంద్రుడు శివలింగమువలె నున్నాడనుచు ధూర్జటి ఈ పద్యము వ్రాసెను.

మ॥ "ఉదయగ్రావము పానవట్టమభిషేకోదప్రవాహంబు వా
ర్థి ధరధ్వాంతము ధూపధూమ ముజ్జ్వల దీప ప్రభారాజి కౌ
ముది, తారా నివహంబు లర్పిత సుమంబుల్‌గా దమోదూర సౌ
ఖ్యదమై శితగళ స్తిదింబ శివలింగం బొప్పె ప్రాచీదిశన్.
(ద్వి. ఆ. 188)

'సర్వం విష్ణుమయం జగత్' అని వైష్ణవులు భావించినట్లుగనే శైవులు కూడ 'సర్వం శివమయమ్ జగత్' అని భావింతురన్పించుచున్నది. ఎందుచేత ననగా ధూర్జటి శివభక్తుడు కావున తన కృతి నాపరమేశ్వరునకే యంకిత మిచ్చెను. గావున అందలి వర్ణనము లన్నియు శైవమయములుగనే కన్పట్టుచున్నవి. సూర్య బింబమును శివలింగముతో బోల్చుట. అట్లే తృతీయాశ్వాసమున తిన్నని తల్లి తండె గర్భవతియైనప్పుడు ఆమె లక్షణములన్నియు శివునితో పోల్చబడినవి. బిడ్డ పుట్టిన తరువాత ఆతడు ఆటపాటలు నేర్చు వయసున ఆ బిడ్డను 'శివభక్తిరహితమై చెడియె జంగంబని - నవ్వినట్లోయ్యన నవ్వసాగెనట. శివుని సాయుజ్యము ప్రసాదించుమని చెంది ఇట్లనుచున్నది.

క॥ నాకీ భవదుఃఖంబులు
లేక, మహాజ్ఞానరసవిలీనుడనగుచున్,
లోకం బెన్నడు నెఱుగని
యా కైవల్యమె యభీష్టమని ప్రార్థింపన్
(ద్వి. ఆ. 104)

"దిక్కులు ముంచుకొన్న తన తేజములోపల నూర్ణనాభమున్
గ్రక్కున గూర్చెదన్మయముగా శివలింగము భక్తిలోలతన్"
(ద్వి. ఆ. 107)

అట్లే సర్పమునకు ఏనుగునకు తన సర్వవ్యాపక జ్యోతిలో సాయుజ్యం బొన గూర్చినాడు శివుడు. అప్పటినుండియే యా లింగమునకు శ్రీకాళహస్తిపతి యను పేరు వచ్చెను. విజయనగర రాజుల కాలములో వెలసిన కావ్యములందు జైమినీ భారతము, మనుచరిత్ర, విష్ణుచిత్తీయములు వైష్ణవమత గ్రంథములు. అందు

జైమినీ భారతము శ్రీకృష్ణుడు పరతత్త్వముగా బోధించును. అతడు హరి, సర్వవ్యాపకుడు, వాని భక్తిరక్షణదీక్ష బహుముఖముల జైమిని భారతమునందు వర్ణింపబడినది. రాయలవారు భక్తికి ప్రాధాన్యమిచ్చి విష్ణుచిత్తీయము రచించిరి.[1] మనుచరిత్ర విష్ణుచిత్తీయముల మొదట భిన్నభావముల కలవయ్యెను, తుదియందేకాభిప్రాయము కలవయినవి ఇది రాయలనాటి విష్ణుమత తత్త్వము. శైవము గంగతోడ యమునానదివలె వైష్ణవము నొరసికొని దేశములో ప్రచారమునందున్నది. దాని తత్త్వము శ్రీకాళహస్తిమాహాత్మ్యము. ఇది శైవమతగ్రంథము. శివసాయుజ్యమును బోధించును. కావున భక్తిచేత చెంది మున్నగువారు శివసాయుజ్యము పొందినట్లు చెప్పబడినవి. కృష్ణరాయల కాలమునందీ రెండు మతములు ప్రచారమందున్నవి. భక్తుడు తా నుపాసించు దైవమును సర్వవస్తువుల యందు పరిశీలించును. 'శివమయం జగత్సర్వం' అని శైవమతము. 'విష్ణుమయం జగత్సర్వం' అని వైష్ణవము. ఈ మూలసూత్రములనుబట్టి శైవవైష్ణవుల భావనలో భేదము కల్గుచున్నది. కావున శైవుడు ప్రతివస్తువును శివుడుగా విలోకించును. తాను శివుడు తాను చూచు ప్రతిజీవుడు శివుడు. ఈ సందర్భమును పురస్కరించుకొనియే ధూర్జటి కవి "ఉదయగ్రావము పానవట్ట" ఇత్యాది పద్యములు వ్రాసెను. ఉత్తర మీమాంసలోని 'తత్త్వమసి', 'బ్రహ్మాస్మి' అను సూత్రముల నుపాధిగా గైకొని శివోఽహం యని శైవులందురు. పరబ్రహ్మకు శివుడని నామకరణము గావించిరి. విష్ణువునకు భక్తులకు గల సంబంధము శేషశేషిత్వము. భక్తుడు ఎప్పటికి దాసుడేగానీ విష్ణుత్వము పొందడు. అతడు వైకుంఠమునందున్నను దాసుడే. కావున 'అహం విష్ణుః' అనలేడు. వారివారి నమ్మకములనుబట్టి రచనలందు వారి కథలు వర్ణనలు ఉండును. ఇచట 'ఉదయగ్రావము' ఈపద్యము చంద్రోదయ వర్ణనము. ఇట్టి వర్ణనలు శైవమతాచార దీక్ష శివభక్తి ప్రాబల్యము వెలయించుచుండును. ఇట్టివి వైష్ణవ కావ్యములం దరుదు. దానికి కారణము హరి సర్వాంతర్యామిగా వినుతింపబడినను విష్ణుత్వసిద్ధి భక్తునకు లేకపోవుటయే నన వచ్చును. కాళహస్తి మాహాత్మ్యమున కావ్యత్వ ప్రతిపాదనకంటె శివతత్త్వ ప్రతిపాదన విస్తరించి కనుపించును.

---

1. విజయనగరాంధ్రకవులు - శిష్టా లక్ష్మీకాంతశాస్త్రిగారు.

ధూర్జటి ఋతు వర్ణనము కూడ చేసినాడు. "తపమొనరింతుగాక హిమధామ కిరీటుని గూర్చి, తన్మహో కృప ప్రవహించుగాక భవ కిల్బిష విద్విష ద్రభసిందుపీ పుంజనంబు లెల్ల గడువేడుక బొందగ (చూ. ప్ర. ఆ. 120 పద్యం) అని వింధ్యారి నిశ్చల తపోనిష్ఠను వహించినాడు. అతడు బహుకాలము తపము చేసినా డనియు, కాలవశనమున ప్రకృతిలో వచ్చిన మార్పులు వాని నిష్ఠను చలింపజేయ లేకపోయిననవియు సూచించుటకే ధూర్జటి ఋతువర్ణన కావించెను. ఈ సందర్భమున గ్రీష్మ, వర్ష, శిశిర ఋతువులను వర్ణించినాడు. ఇందు వేసవి వర్ణన ఎంత స్వాభావికముగా నున్నదో ఈ క్రింది పద్యములో తెలియును.

సీ॥ దురీకృత స్తనభార కంచుక వధూజనము
మానవ కరాంచద్వ్యజనము
గంధసారచల గంధవాహ రిరంసుజన్యము
ముష్టీకృతశ్వాసచయము
విశిష్టజలసమావిర్భూత బాష్పభూతల
మధ్యగాయాసదాయకంబు
ప్రాణేశ్వరీ పరీరంభజ ప్రత్యూహకారి
ఘర్మోదకోద్గమన క్రర్త

తే. యాబరాంతర విశ్వంభరాంబు పూర
సంచరిష్ణు పరస్పర స్థల విహార
సమభిలాష ప్రవర్ధిష్ణు చటుల తాప,
మంత నేతెంచె దారుణోష్ణామంబు

(ప్ర ఆ. 122 పద్యం)

మండువేసవిలో తాపమునకు తాళలేక యువతులు రవికలను విప్పివేయుటయు, గాలి కొరకు జనులు విసన కర్రలను పట్టుకొని విసరుకొను చుండుటయు, వారు చల్లని మలయ మారుతమునే అభిలషించుటయు, వేడి నిట్టూర్పులు వచ్చుచుండుట యనునవి సహజము. ఈ సమయమున భూమిపై నీరు చల్లిన యావిరి వచ్చు చుండును. ప్రయాణికులకు మిక్కిలి ఆయాసము కలుగును భార్యాభర్తలు పరస్పరాలింగమునకు కుతూహల పడుచున్నను, ఈ వేసవి పరిష్వంగమున

కాటంకము కలిగించును. శరీరము నుండి చెమటలు పైకుబ్బును. ఆకాశముపై చరించు పక్షులును, భూమిపై తిరుగు జీవులును జలచరములును తాపమును సహింపలేక నివాసమునకనుకూలమగు స్థలములను తెలిసికొన గోరుచుండును. ఇట్లు స్వభావ సిద్ధముగ వేసవిని వర్ణించు గ్రంథములరుదు.

ఇక యుద్ధ వర్ణన విషయమున ధూర్జటి ఇతర కవులవలె ఊహాశీతముగా కాక మన కన్నులకు కట్టినట్లు వర్ణించినాడు. ఉగ్రుడు ముప్పదివేల రక్కసులతో యుద్ధము చేయుట చతుర్థాశ్వాసమున పూర్వజన్మ కథలు వ్రాయు సందర్భమున మాయా కిరాతార్జునుల యుద్ధము ఇందులకుదాహరణములుగా పేర్కొనవచ్చును. ఉగ్రుడు రక్కసులను చంపటయను యుద్ధ వర్ణనము ద్వితీయాశ్వాసము 40వ పద్యము మొదలు 60వ పద్యము వరకు గలదు. 20 పద్యములలో కనులకు కట్టినట్లు ఈ యుద్ధమును వర్ణించినాడు. తదుపరి దీర్ఘ వచనములో కూడ యుద్ధ వర్ణన గలదు. యుద్ధ వర్ణనలో వచ్చు నొకపద్యము నిట ఉదాహరింతును.

శా. చెక్కల్సేసె రథంబులశ్వముల గూల్చెన్ ఖండఖండంబులై
దిక్కుంబుల్వడనేసె, రత్నమయ కోటీరంబులందుణముల్
ప్రక్కల్గా నొనరించె, ధూళి గలపెన్వర్మంబులన్, సూతులన్
జక్కాడెం, దునుమాడె వీఁడ్ల నసురుల్ సంక్షోభముం బొందగన్
(ద్వి.అ. 59 పద్యం)

విజయమును పొందుట - ఉగ్రుని విజయము, అర్జునుని విజయమును దీని కుదాహరణములుగా గ్రహించ వచ్చును. విజయోత్సాహము మాత్రమందు వర్ణితము కాలేదు. ధూర్జటి రెండు చోటుల ప్రయాణ వర్ణనము కూడ చేసెను. కప్తరగు నత్కీరుడు తీర్థయాత్ర చేయుట విపులముగా వర్ణింపబడినది. తృతీయాశ్వాసమున 178వ పద్యము మొదలుకొని 199 పద్యము వరకు ఈ తీర్థయాత్ర వర్ణన సాగినది. ఇట్లే వేశ్యాతనయుల కథలో వారు మధురాపురము నుండి శ్రీకాళహస్తికి వచ్చుట వర్ణింపబడినది. ఈ వర్ణన కూడ దీర్ఘమైనదే (56 పద్యము నుండి 108) 58 పద్యములలో వర్ణింపబడినది. ఈ ప్రయాణ సందర్భమున వేశ్యాతనయులు సముద్రమును చూచినట్లు కవి వర్ణించెను. ఆ సముద్ర వర్ణన మిట్లున్నది.

సీ. దరిదన్నితిరిగెడు తరగలు చనుదెంచు
తరగలు నొరొందాకు రవము,
గుహలు గూడుక కంధరము లాకసముదిగ్గి
నీరంబు గ్రోలెడు నిబిడ రవము,
మబ్బునగసలెత్తి యబ్బియంతంతకు
బొరలంగ బడియెడు భూరిరవము,
ననుదిన పూర్వాపరాహ్ణవేళలబోటు
పొడిచివిచ్చిన నీటిబోరురవము,

గీ. దశదిశాభాగముల బ్రతిధ్వనులనీన
వలయ శైలాదిగిరి గుహావాససింహ
శరభశార్దూల హృదయ భీకరములగుచు
దనకునైజంబులుగ మించు వనధిరాజు

(చ.అ. ౧౦)

ఈ రవములన్నియు సముద్రునకు నైజము లేనట. ఇందతిశయోక్తి యేమియు లేదని కవియే చెప్పెను. ఇదే ఘట్టములో భైరవాస్పదమగు పర్వతపు వర్ణన మెంతో యింపు గొల్పుచున్నది. ఆ వర్ణన మిది.

సీ. ఎఱుకులీ గిరి మీద నిచ్చద్రిమ్మర
నయోమయసాధనమ్ములు హేమంబు లగును,
శబరులు మృగముల జంపి యిమ్ముల డిగ్గి
వచ్చునాలో సజీవంబులగును,
వ్యాధులీ కొండపై వన్యాశనంబులు
సేవింపగా గాయసిద్ధి యగును,
చెంచులీ యద్రి నిద్రించి మేల్కొనువేళ
దమవధూటుల తల్పతలము లగును,

గీ. దృశ్యమగు వారికిందు నిధి వ్రజంబు,
దృశ్యమగు గూడి తమతోడ దిరుగు జనము,

విస్మయము చెప్ప నొక్కొక్కవేళ దీని
సానుభూముం మహిమాతిశయ విధంబు (చ.ఆ. 88)

ఇందలి విషయములు మిక్కిలి ఆశ్చర్య జనకములుగా గలవు. ఈ పర్వతపు మహిమ యిట్టిదని కవియే తెల్పినాడు. మున్నొక చోట ధూర్జటి సూర్యోదయ సూర్యాస్తమయముల వర్ణించినాడని తెలిపి 'ఉదయగ్రావ' మను పద్యము నుదహరించియుంటిని. అదియే గాక చతుర్థాశ్వాసమున వేశ్యాతనయుల కథలో కూడ సూర్యోదయ, సూర్యాస్తమయములు వర్ణితములైనవి. కావ్యమున మూడు చోటుల ఆయా సందర్భములు పురస్కరించుకొని కవి 'దౌహృదము'ను వర్ణించెను.

1. సరస్వతీదేవి గర్భమును ధరించుట (ద్వి ఆ. 80 పద్యం 84)

2. భిల్లాంగన తండె గర్భమును ధరించుట, మాణిక్యవల్లి గర్భము దాల్చుట (చ.ఆ. 7 పద్యం) అను మూడు ఘట్టములిందులకుదాహరణములుగా చెప్పవచ్చును. వారికి బుడుపు జనించుట (ద్వి.ఆ. 86-87) తండెకు తిన్నడు జనించుట. (చ.ఆ. 26,27) వర్ణితములైనవి మాణిక్యవల్లికి ఇరువురు కుమార్తెలు జనించుట తృతీయాశ్వాసమున బోయలను వర్ణించుటలో ధూర్జటి నైపుణ్యము వెల్లడియగుచున్నది. వారి నివాసము ఉడుమూరు సర్వ సంపత్సమృద్ధము. ఎంత సంపదయున్నను, భోగ్యవస్తువు లున్నను, వారు తమ సహజ వృత్తిని మానుటలేదు అలంకారములందును, భోగములందును ఆసక్తిని చూపు స్వభావము గల యువతులే వాని యెడ ఆసక్తిని చూపరట.
ఆ పద్యమిది.

సీ. పట్టుచీరలు గట్ట భాగ్యంబు గల్గియు
బాబుటాకుల గట్ట భారమనరు
రాజన్న భోజన ప్రాభవ శ్రీ గల్గియును
వన్యధాన్యంబు నొల్లమనరు
మాణిక్య భూషా సమాజంబు గల్గియు
నెల్లని కురువింద లేటికనరు

మంచి మెచ్చుల తూగు మంచముల్ గల్గియు
కాలు జాదీగ యయ్యాల లనరు
ఎంత సంపద గల్గియు నెట్టివారు
దమకులాగత ధర్మకర్మములు విడువ
కాల, రటుగాన దత్పురీ కటిర సతులు
మహిమ గలిగియు మానరు సహజ వృత్తి

(తృ.ఆ. ౯ పద్యం)

తిన్నని బాల్యక్రీడలు ఆనాడు తెలుగునాట ప్రచారములో నున్న ఆటలను వివరించు చున్నవి. ఈ క్రింది పద్యమున యివి వర్ణితములు.

సీ॥ చిట్ల పొట్లకాయ, సిరిసింగజావత్తి
గుడుగుడు గుంచాలు కుందెన గుడి,
దాగిలి మ్రుచ్చులాటలు, గ్రచ్చకాయలు
వెన్నెల కుప్పలు తన్నుబిల్ల
తూరన తుంకాలు, గీరన గింజలు,
పిల్లిదీపాలంకి, బిల్లగోడు
చిడుగు దువ్వెం పోటి, చెండుగట్టిన టోడి
యల్లియుప్పెన బట్టె, లప్పళాలు
గీ॥ చిక్కనా బిల్ల లోదిక్కు చిందజాది
యైనశైశవక్రీడా విహార సరణి
జెంచు కామరుఁలోడ నుద్దించుట కాదు
దిన్నతభినవ బాల్య సంపన్నుదగుచు (తృ. ఆ. ౪౪)

కొన్ని ఆటలు నేడు మనకు తెలియుటలేదు. బహుశ ఆ కాలమున ఆ ఆట లన్నియు ఉండి ఉండవచ్చును నేటికిని మనకు తెలిసిన ఆటలు కూడ గలవు. "గుడు గుండాలు" బాల బాలికలందరు కూడి గుండ్రముగా కూర్చొని ఆడుట మనకు విదితమే. చేతివ్రేళ్ళు ముడిచి గుప్పుడుపెట్టి ఈ ఆట ఆడెదరు. పిల్లలు యిది ఆడునపుడు 'గుడుగుడు గుంచం గుండారాజం పాముల పట్టం పడగా రాజం'

యని చెప్పుదురు. దాగుడు మూతలు ఆనాటికి ఈనాటికిని ప్రచారమునందున్న ఆటయే. పిల్లలు ఇండ్లయందును పాఠశాలలందును ఈ ఆట ఆడుగ మనము చూచుచున్నదే. గచ్చకాయలు ఆడుట కూడ విదితమే. గచ్చకాయలు తీసి కొని ఇరువురు కలసి ఈ ఆట ఆడెదరు. ఈ కాయలు అడవి ప్రాంతమున దొర కును. బిచ్చగాండ్రు అడవి ప్రాంతమునుండి వీటిని తెత్తురు చింతగింజలాడునట్లే వీనిని కూడ ఆడెదరు. ఇది సాధారణముగా బాలికలు ఆడు ఆట. పద్యములో వర్ణింపబడిన మిగిలిన ఆటల స్వరూపమెట్టిదో తెలియదు బహుశ అనాడు బోయ పల్లెలో పిల్లలాడుట బాడుకయం దుండియుండవచ్చును.

తిన్నని కథలోనే ధూర్జటి అడవిలో దొరుకు పండ్లను, రకరకములగు తేనెలను వర్ణించినాడు. శివుని పూజించుటకు వారమున కొకసారి వచ్చు శివ బ్రాహ్మణుని వేషభాషాదులిట్లు వర్ణింప బడినవి.

సీ॥ పంచాక్షరీ పూత భసిత త్రిపుండ్రాంకి
తాంగభాగములు స్నానార్ద్ర శిఖయు
క్రమ కృత గ్రంధి సూత్రప్రోత రుద్రాక్ష
భూషణంబులు శైవ భాషణములు
నాగుల్ప లంబ మానాంబు కౌపీనం బైన
పోత్రంబు నుపవీత సూత్రములును
కరగృహీతాభిషేకక్షీర సంపూర్ణ
భాండంబు బుష్పకరండకంబు

గీ॥ గుండ బొజ్జయు, పొకపాటి గుజ్జురూపు
నుత్తరీయంబు దనరంగ యోగి హృదయ
గోచరుని గొల్వ శివ చిహ్న గోచరాంగు
డొకడువచ్చె శివబ్రహ్మణోత్తముండు (తృ. ఆ. 94)

శివభక్తులు విభూతిని ధరించునపుడు "నమశ్శివాయ" అను పంచాక్షరీ మంత్రము నుచ్చరించుచునే ధరింతురు - స్నానము చేసిన పిదప తడియారుటకు జుట్టు విప్పి కొనియు, చివర మాత్రము ముడివేసికొందురు. విరియ బోసికొనియుండుట సంప్రదాయము కాదు. ఈ విషయములన్నియు ఈ పద్యమున వ్యక్తము చేయ

బడినవి. ఇది యర్చకుని స్వరూప వర్ణనము. లేని విషయమేమి యించు తెలుప బడలేదు. అతిశయోక్తి కూడ ఏమియులేదు. స్వరూప వర్ణన మింతను ప్రథమాశ్వాసమున జంగమును వర్ణించునప్పుడుకూడ కవి కావించెను. అలంకారములు లేకున్నను స్వాభావికములగు వర్ణనలు సహృదయుల మనస్సులకు రంజింప జేయును. ఈ శివుని మాయా జంగమ వేషవర్ణన మిట్టిదే. ఈ జంగము బిచ్చమెత్తుకొని జీవించు ముష్టి జంగము కాదు. భక్తులను పరీక్షింప వచ్చిన జంగమ వేషధారి. శ్రీమంతుడు కావుననే యిట్టి మహాసీయ వేషమును ధరించినాడు. కవితాహంకార పతిత చేతస్కుడగు నత్కీరుడు శివుని లెక్కచేయక ధిక్కరించి, శాపము పొంది పశ్చాత్తప్తుడై శాప విముక్తి మార్గమును తెలిసి కొనియు, అది తన కసాధ్యమని పరితపించు వర్ణన యెంతయు స్వాభావికమై యున్నది.

ఉ॥ ఈ కవితాభిమానము వహించితి నేటికి ? శంభుపీఠిపై
నీకవులున్నయట్లు వసియింపక దేవునితోడ నేల చా
ర్వాక మొనర్చితిం ? కడుభరంబగు కుష్ఠు రుజా విషాదమే
నేకరణిం ధరింతు ? నిక నెన్నడు చూచెద పెండిగుబ్బలిన్

(తృ ఆ. 174)

ఇతరులగు మహాకవులందరును ఊరక యున్నట్లు తాను కూడ యూరక యుండక దేవునితోనే వాదులాటకు దిగుట పెద్ద పొరపాటని నత్కీరుడు గ్రహించెను. కవులలో తానె గొప్ప వాడనను తన యహంకారమునకు తగిన శాస్తియై నట్లాతడు గుర్తింప గలిగెను. ఈ పద్యమున "చార్వాక" మను పదమెంతయు యుక్తియుక్తము. చార్వాకమనగా వాగ్వాదము. ఇచట వాగ్వాదమను పదము నుపయోగింపక "చార్వాక" మనుట వలన చార్వాక సిద్ధాంతము కొంత వ్యక్తమగుచున్నది. చార్వాకుల కైహికమేకాని పారలౌకికములేదు. వారికి దేవుడంతకన్ననులేడు చార్వాకుల పద్ధతినే యవలంబించిన నత్కీరుడు దేవుని యాధిక్యమును లెక్కచేయనందున అంతతో ఊరక యుండక "మూడవ కన్ను చూపినంత మాత్రమున భయపడువాడను కాను" అని వ్యక్తపరచినందునను నత్కీరుని వాగ్వాదము చార్వాక మనుకొనుట సముచితమై యున్నది. సరస్తీరమునందలి వింతలంగాంచి యచ్చెరువొందుచున్న నత్కీరునకు కానవచ్చిన భూతము పాతకుల కన్నులంతు కట్టినట్లు కవి వర్ణించినాడు.

ఉ॥ క్రూరనిరీక్షణ ప్రకల గ్రుడ్డులు కోఱలు నూర్ధ్వకేశముల్
నీరదనీల గాత్రమును, నిష్ఠుర వాక్యము, లట్టహాసముల్
భైరవ కంఠనిస్వనము, భీకర హేతియు మానవాస్థిమా
లారవముల్సెలంగ వికటా కృతితో నొకభూత మాతనిన్
(తృ. ఆ. 200)

ఆ భూతమిట్లున్నదట. అది మిడి గ్రుడ్లు త్రిప్పుచు చూచుట వలన దాని వీక్షణ ములు దుర్నిరీక్ష్యములై క్రూరత్వమును వెల్లడించుచున్నవి. పారకోరలు, సంస్కార రహితములై మొరటు బారిన తలవెంట్రుకలు నిక్కపొడుచుకొని యుండుటలో వింతలేదు. అతనిది కారు మబ్బురంగు దేహము. నోరు విప్పినచో బండమాటలేగాని మంచి మాటలు వెలికిరావు. వికటముగా పెద్ద నవ్వు నవ్వుట వానికి స్వాభావికము. కంఠధ్వని మానవాసాధారణమై నక్క ఊళ పెట్టినట్లుం డును. మెడలోని ఎముకల దండలు పరస్పరము రాపిడివలన ధ్వని చేయు చుండును. ఇదే మానవాస్థిమాలా రవముల్ అను పదముచే వ్యక్తము చేయబడు చున్నది. సహజముగనే భీకరముగా నున్న ఈ భూతము భీకరాయుధమును ధరించినపు డెట్లుండునో చెప్పబనిలేదు. ధూర్జటి ఈ వర్ణన మూలమున దానిని మన కన్నుల యెదుట పెట్టినాడు.

ఇచట ఈ రాక్షసుని వర్ణన ఆముక్తమాల్యదలో రాక్షసుని వర్ణనను పోలి యున్నది. ఇచట నత్కీరుడు బ్రహ్మరాక్షసుని కాంచినట్లు వర్ణింపగా నచట విష్ణు భక్తుడైన భాగవతుడు వట వృక్షమును చూచినట్లు వర్ణితము. ఈ రెండు వర్ణన లకు పెక్కు పోలికలు గలవు.

నత్కీరుడు చూచిన బ్రహ్మరాక్షసుని గుఱించి వర్ణించెడు పద్యము ఆతని స్వరూప స్వభావములను రూపు కట్టించునట్లుగా జటిల సమాసాఢ్యమై యున్నది. ఇంతవరకును నత్కీరుని ఉత్తరదేశ యాత్ర సుగమముగనే సాగుచుండెను. ఇప్పు డతని యాత్రలో ఒక కఠిన సంఘటన ఏర్పడనున్నది. రాక్షసుడాతనిని మూవి యాతనిని బంధించుటయే అది. కథలో ఇట్టి కఠినమైన సంఘటనను ధ్వని పూర్వ కముగా సూచించుటయే ఈ పద్య శైలిలోని చమత్కృతి. ఇట్టి పద్యములు వ్రాయుట ప్రబంధకవులందరికిని ఒక గుణ విశేషముగనే కన్పించును. శ్రీకృష్ణ

దేవరాయలు ఆముక్తమాల్యదలోని మాలదాసరి కథలో బ్రహ్మరాక్షసుని నివాస మైన వటవృక్షమును మాల దాసరి దర్శించినట్లుగా ఈ పద్యమును వ్రాసి యున్నాడు.

శా॥ కాంచె న్వైష్ణవు డర్ధయోజన జటా ఘాటోద్ధశాఖోపశా
ఖాంచద్ఘాట చరన్మ రుద్రయ దవీయః ప్రేషితో ద్యచ్ఛదో
దంచ త్కీట కృత వ్రణచ్ఛల నలి ప్యాపాదితా ధ్వన్యని
స్పంచారార్త మహా ఫలోప మఫల స్ప్రాయద్వటక్ష్మాజమున్
(షష్ఠాశ్వాసము 15 అముక్తమాల్యద)

ఈ పద్యము నందు కూడ శైలి ఓజోగుణ ప్రధానమైనట్టిదే. సంఘటనను పట్టి చూడగా నత్కీరుని వలెనే మాలదాసరి కూడ ఒక క్లిష్టమైన సన్నివేశమును ఎదుర్కొన బోవు ఘట్టమది. కథలో ఒక క్లిష్ట సంఘటనను వ్యంగ్యాత్మకముగా స్ఫురింపించుటకే రాయ లీ పద్యమును వ్రాసి యున్నాడు.

నిజమునకు యిట్టి విశేషము పెద్దన వ్రాసిన మనుచరిత్రతోనే ప్రారంభ మయినది. 'అట జని కాంచె' అని పెద్దన వ్రాయుట కూడ ప్రవరుడు ఎదుర్కొన బోవు క్లిష్టసమస్యను వ్యంగీకృతము చేయుటకే. కాళహస్తిమాహాత్మ్యమున నత్కీరుని కథలో అముక్తమాల్యద మాలదాసరి కథలో, మను చరిత్రమున ప్రవరుని కథలో కథానాయకులు సాత్త్వికులైన వారు. ఈ ముగ్గురికిని కథా సందర్భమును బట్టి ఒక విషమ స్థితికలుగ బోవుచున్నది. కథా సందర్భమున ఏకీభావమున్నట్లుగనే పద్యరచన యందును శైలీ కాఠిన్యము నందును ఏకీ భావము కన్పించుచున్నది.

ఇంతవరకు ధూర్జటి వర్ణనంలో కొన్ని విపులముగా వ్రాసితిని. ఇంకను మిగిలిన వర్ణనలు నా దృష్టికి తోచినవి క్లుప్తముగా పేర్కొందును. వేశ్యాతనయుల కథలో అవయవ వర్ణనము కొంత విపులముగా సాగినది. దీనినే కన్యాంగ సౌందర్య కథన మందురు. వనవిహార వర్ణన కూడ పార్వతీ పరమేశ్వరుల వన విహారమును గూర్చి ప్రథమాశ్వాసమున గలదు. ఈశ్వరుని రూపములు నాలుగైదు ధూర్జటి ఘంటమున చిత్రితములైనవి. మింద జంగమ వేషము, దక్షిణా మూర్తి రూపము, ద్రవిళ జంగమ వేషము, సహజ వేషము, శబర వేషము ఇత్యాదులు.

ఇంకను కొన్ని రూప చిత్రములు, భావ చిత్ర వర్ణనలు గలవు. రూప చిత్రముల వర్ణనము విషయమున పేర్కొనదగినవి శైవ బ్రాహ్మణుడు (తృ. ఆ. 94 పద్యం) జంగమ స్త్రీ (చ.ఆ. 54) బాలింతరాలు (చ. ఆ. 10) ఇట్లే భావ చిత్రముల కొన్ని కఱవు వర్ణనము, ప్రసవసమయ సంభ్రమము, వారి చేష్టావర్ణనము, మల్లి యుద్ధ వర్ణనము. భక్త్యావేశమున జనించు సాత్త్విక భావములను చతుర్థాశ్వాసమున ధూర్జటి రమ్యముగా చిత్రించినాడు. మైపులకలు (చ.ఆ. 122 పద్యం) స్వేదము (123) బాష్పోద్గమము, కంపము మొదలగునవి ఇవి సాత్త్విక భావ వర్ణనములన వచ్చును.

విపుల వర్ణనము అవశ్యకరమైన చోటులందు సైతము విసువు పుట్టింపని రీతిని హృదయంగమముగా వర్ణన గావించుట ధూర్జటి ప్రత్యేకత యనవచ్చును. సువర్ణముఖరీ ప్రవాహ వర్ణనము, ఉగ్రుని యుద్ధ వర్ణనము, కిరాతుల కాట పట్టగు పొత్తపి నాటి వర్ణనము మున్నగు వర్ణనము లిట్టివి. ఒకే వర్ణనము పెక్కు పర్యాయములు ప్రాప్తమైనప్పుడు వస్తుగతమగు ఒకానొక విశేషము ధ్వనింప జేయునదిగా ఆ వర్ణనమును మలచుట ఈయనలో విశేషము. ప్రథమాశ్వాసము నందలి వశిష్ఠాగస్త్యుల తపముల వర్ణనములు, ద్వితీయాశ్వాస మందలి బ్రహ్మ తపోవర్ణనము ఇట్టివి ఇందు వశిష్ఠుని తపస్సు సాత్త్వికము. అయ్యు, పరేచ్ఛా ప్రారబ్ధముగా సంభవించిన పుత్రశోకమునుండి విముక్తి నొందుటయను స్వార్థ స్పర్శ కలదు. కావుననే 'ఆయుగ్ర తపస్సు' ఆ బ్రహ్మర్షి తనువు కరికలభముల కరతల కండూతి నివారణార్థమైన గండ శిలగా రూపొందవలసినంత దీర్ఘకాలము కొనసాగినది. అగస్త్య మహర్షి తపము లోకోపకారకమగు మహా ప్రయోజనము నుద్దేశించినది గనుక ఫలాభి సంధి రహితమయ్యు పరమ సాత్త్వికమైనది. అట్లది దాదాపు వత్సరమాత్రవ్యాప్తి గల 'తీవ్రతపము' గా దనరి, లక్ష్యమును సాధించినది. ఇక నలువ తపస్సు పుత్ర దుఃఖ పుత్ర హత్యాపాతక పున్నామ నరకముల నుండి తరించు నుద్దేశ్యముతో గూడిన దగుట స్వార్థరహితమై, రాజసమై బహు వత్సరముల 'ఘోరతపము'గా జరిగినది.

వర్ణనల ఆధ్యాత్మిక సమన్వయము ద్వార నెలకొనిన పవిత్ర వాతావరణమున ఇతివృత్త మహిమను ఇంపుగా ఇనుమడింప జేయుట ధూర్జటి కవితలో నింకొక విశేషము. ధూర్జటి కవి హృదయమనదగిన యీ తత్త్వ మీ కావ్యక్షేత్రమున స్వర్ణముఖివోలె నంతర్వాహినియయి ఆయా ఘట్టములకు మాహాత్మ్య ప్రతిభతో పాటు మాధురీ శోభను సమకూర్చుచున్నది. ఈ కావ్యారంభమందు గల కాళహస్తి పురవర్ణనలో ఈ గుణ విశేషమును ప్రస్ఫుటముగా పరికింపగలము. ఇందు విరక్తిని రక్తితో జోడించి యాసక్తికరముగా వర్ణించుటలో సాధితమైన మాధురీ మహిమ సహృదయ హృదయైకవేద్యము.

పదకొండవ ప్రకరణము

కాళహస్తి మాహాత్మ్యము - రసపోషణము

శ్రీకాళహస్తిమాహాత్మ్యమున రసమేదో పరిశీలించుటకు ముందుగా రస నిర్వచనము, రస సంఖ్య కూడ యించుక తెలిసికొనుట యవసరము. పదునారవ శతాబ్దమున యనేక ప్రబంధములు వెలసినవి.[1] రాయల యుగమున కృష్ణరాయలు స్వయముగ సంస్కృతమున గొప్పపండితుడై బహుగ్రంథకర్త యయినట్లు ఆముక్తమాల్యద అవతారికలో జెప్పుకొనెను. అపూర్వముగా పెద్దనాది మహాకవుల ననేకులను పోషించి వారిచే గ్రంథ రచనము చేయించి తత్కృతులగు మను చరిత్రాదుల నంకితము గొనెను. అష్టదిగ్గజము లనబడు కవులెనమండుగురును రాయలకాలమువారు కారని నేడు చరిత్ర పరిశోధకులు రూఢిగా దెల్పుచున్నారు, వారిలో పెద్దన, తిమ్మన, రామభద్రుడు, ధూర్జటి, మల్లన యను కవు లేవురును రాయలకాలమందే రాయల యాస్థానముననే యున్నట్లు చారిత్రకులే ప్రమాణములు చూపి నిర్ణయించిరి. ఈ విషయ మష్టదిగ్గజములు యను ప్రకరణమున సప్రమాణ ముగా నిరూపించి యుంటిని.[2] శృంగార నైషధమును చదివి యాంధ్రకవి పండితు లత్యంతము హర్షించినను, సంస్కృత పండితులు దాని నంతగా మెచ్చిరన వీలు లేదు. కావున పెద్దనాదు లికమీద గేవలానువాదములు కాని స్వతంత్రానువాదములు కాని, పనికిరావని నిశ్చయించిరి. ఇట్లు నిశ్చయించి తమ భాషలో స్వతంత్ర కావ్య నిర్మాణమునకు బద్ధకంకణు లగుటయేగాక, సంస్కృత పంచ కావ్యములకును, సుప్రసిద్ధములగు నితర ప్రౌఢ కావ్యములకును దీటుగా గావ్యము లను తొలిసారిగా నిర్మించి, తమ సాహిత్యము కూడ సంస్కృత సాహిత్యమువలె సర్వసంపన్నమనియు దమ మాతృభాషయు, దేశభాషయగు సంస్కృతమువలెనే సర్వశక్తిమంతమనియు ప్రౌఢకావ్య, శ్లేషకావ్య, ద్వ్యర్థికావ్యాది రచనా సమర్థ

---

1. ప్రబంధ వాఙ్మయ వికాసము - డా॥ పల్లాదుర్గయ్యగారు పుట-272.
2. ,, ,, ,, ,, పుట-280.

మనియు సంస్కృత కవి పండిత లోకమునకు వాని, తమ మాతృభాషకు దేశ భాషలలో విశేష కీర్తి నార్జింప దీక్షితులయి, మాతృభాషాభిమానముతో స్వతంత్ర యుగమగు రాయల యుగమున మనుచరిత్రాది స్వతంత్రాంధ్ర కావ్య నిర్మాణము నకు నేక ముఖముగా పెద్దనాదులు రాయల సభలో నడుము బిగించి గంటము నందుకొని సాహిత్య సమరాంగణమున గవితావేశ విజృంభితులయి దూకిరి. ఈ స్వతంత్ర కావ్య నిర్మాణ మహోద్యమమునందు శిరీష కుసుమ పేశల సుధామయోక్తు లచే బెద్దనార్యుడు మనుచరిత్ర మహాకావ్యమును రచించి ప్రథముడుగా గృత కృత్యుడయ్యెను. మనుచరిత్ర ప్రథమాంధ్ర ప్రబంధముగా ప్రశంస లందెను. రాయలవారు అల్లసాని పెద్దనామాత్యుని పల్లకిలో నూరేగించిరి. సంస్కృతాంధ్ర కర్ణాటాది భాషా కోవిదుడగు సాహిత్య సమరాంగణ సార్వభౌముడు చక్రవర్తి 'దేశభాషలందు దెలుగులెస్స' యని కొనియాడి "ఆముక్తమాల్యద" రచన కుపక్రమించెను. ముక్కు తిమ్మనార్యుడు ముద్దుపలుకులతో నొద్దికగా దిద్దితీర్చిన పారిజాతాపహరణ మును పెద్దనవలె ప్రభువునకే యంకిత మొసంగి బహుకృతుడయ్యెను. ఏవంవిధ నూత్నకవితావేశ పూరిత స్వతంత్ర వాతావరణమునందే యతులిత మాధురీ మహిమాధురీణమగు ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యము, మాదయగారి మల్లన రాజశేఖర చరిత్రము, రామభద్రుని రామాభ్యుదయము, రామకృష్ణుని పాండు రంగ మాహాత్మ్యము, పింగళి సూరనార్యుని రాఘవ పాండవీయము, ద్వ్యర్థి సంధాన కావ్యము కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్న ప్రబంధములు, రామరాజ భూషణుని వసుచరిత్ర, హరిశ్చంద్ర నలోపాఖ్యానములు నిబంధింపబడినవి. మాంధాతృ చరిత్ర యయాతి చరిత్రాదు లితరములును గలవు. అష్టదిగ్గజము లనబడు పెద్దనాదుల ప్రబంధములు తొమ్మిదియు దొమ్మిది రత్నములు. రాయల ఆముక్తమాల్యద యొక రమణీయ వజ్రము. అనంతరకాలమున పిల్లవసుచరిత్రలు కొల్లలుగా వెలసినవి. భోగప్రధానమైన యుగము గనుక ప్రభువులు రసికులు గనుక ఈ కాలమున వెలసిన కావ్యము లన్నియు శృంగార రస ప్రధానము లైనవే ఎక్కువగా గలవని చెప్పనగును.

[1]ఇంక రాజకీయముగా చూచిన కృష్ణరాయల నంతరము కుటిలకుహక ములు ఎక్కువగా కనబడుచున్నవి. అయినను సాంస్కృతిక రంగములో

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యము - ఆరుద్ర 7 సంపుటము, పుట-141,

అవిచ్ఛిన్నమైన సంప్రదాయమువలె తెను. [1]రాయలు వారంతకాకపోయినను తదితరులు సహితము ఈ కాలమున కళలను పోషించిరి. దాసానుదాసులు సహితము హుందాగా ఉండెడివారట. మంత్రులు ఉద్దమంత్రులు కూడ కృతులు అంకితము పుచ్చుకునెడివారు. కృష్ణరాయల అంతఃపురములో సంగీత నాట్య విద్యలకు ఆచార్యుడుగా నున్న బండారు లక్ష్మయ్య ఒక సామంతుడుగా నిండు పేరోలగమున ఉండెడివాడట. ఇతడు భానుకవిచేత పంచతంత్రము అనువాదము చేయించెను. తిమ్మరుసు మేనల్లుడు నాదెండ్ల గోపమంత్రి కొండవీటి దుర్గమునకు పాలకుడుగా నుండెను. ఇతని యుద్ధ పసచేయు ఊరదేచయ్య తెనాలి రామలింగని తొలి రచనను అంకితము తీసికొనెను. కృష్ణరాయల వారి తరువాత సింహాసనమునకు వచ్చిన అచ్యుత దేవరాయలు కూడ సాహిత్యమును పోషించెను. అతడు స్వయముగా 'తాళమహోదధి' అను గ్రంథమును సంస్కృతములో వ్రాసెను. రాజనాథ డిండిమభట్టు 'అచ్యుత రామాభ్యుదయము' అను గ్రంథమును వ్రాసెను. ఈ ఆస్థాన కవి సంస్కృతములో భాగవత చంపు వ్రాసి అచ్యుత దేవరాయలకు అంకితమిచ్చెను. పురుషులేకాక స్త్రీలు కూడ ఈ కాలమున గ్రంథరచన చేసినట్లు తెలియుచున్నది. అనేకమంది అనేక ప్రక్రియలను చేపట్టిరి గనుక వివిధ రసముల సమ్మేళనమే ఈ యుగమున కన్పట్టుచున్నది. భక్తి, కరుణ, హాస్య, శృంగారములు మిళితములైన కావ్యములు కూడ పెక్కుగలవు. ధూర్జటికి కూడ సాని వాడల పరిసరములన్నియు కరతలామలకములే. ప్రవరుని సృష్టించిన పెద్దనగారు కూడ రమణీప్రియ, దూతికతెచ్చిఇచ్చుకప్పువిడెం లేనిదే కావ్యము చెప్పని రసికులు. ఈ విషయము గూర్చి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారిట్లు చెప్పిరి. 'రసికత్వం తిరస్కరింపదగినదికాదు. అది నాగరికతకు నిదానము. పౌరుషమునకు ఫలము; అభ్యుదయమున కాధారము.'

మనుచరిత్ర శృంగార రస ప్రధానమైన కావ్యమే. అయినను పెద్దనగారు మధ్యలో వీరరసము రౌద్రరసము కూడ ప్రవేశపెట్టిరి. రాయలవారు చేయు కసరత్తులు, ముద్గరాలు, సంగడములు త్రిప్పుటచూచి అల్లసాని వారు మనుచరిత్ర యందిట్లు పేర్కొనిరి.

---

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యము. ఆరుద్ర, పుట. 81; 84 7th Volume.

ఉరుసంధ్యాతపశోణిమవ్యతికరలిప్తమై యొప్పారు బ్రహ్మాండము
న్గరిడింగాలపుహోంతగాడు చరమాగస్కంధముం జేర్చుని
ల్పరపున్ సంగడమోయనన్ శశిదిగెం బ్రాగ్భూమిభృత్తుంగ-
తరబాహాగ్రపు సంగడంబనగ మార్తాండుండు దోచెన్ దివిన్

(మనుచరిత్ర 3-59)

బ్రహ్మాండమైన గరిడీశాలలో ప్రభాతసంధ్య పరచిన ఎఱ్ఱమన్నువలె గలదట. అందుకాలమను హోంతకారి సూర్యచంద్రులను సంగడముల జతను రెండుచేతులా పట్టుకొని కసరత్తు చేయుచున్నవాడట. చంద్రుడను సంగడము దిగెనట. సూర్యుడను సంగడముపైకి లేచెనట. పెద్దనగారు భావించిన కాలమను హోంతకారి రాయలవారి ఆకారమునే కనబడెనట.

ఇక ధూర్జటి కాళహస్తిమాహాత్మ్యమున ప్రధాన రసము శాంతమనియు, భక్తి భావపూరితమగు కావ్యమనియు తోచుచున్నది. శాంతరసము మోక్షమునకు దారితీయునందురు. ధూర్జటి గ్రంథమున నిట్లే ప్రతికథయందును మోక్షము కన్పించుచున్నది. మొదట శాంతమును చారిత్రికులు రసముగా నంగీకరింపలేదు. భరతుడు నాట్యశాస్త్రమున రసములు ఎనిమిదియనియే నుడివెను. తదుపరి శాంతము కూడరసముగా నంగీకరింపబడి రసములు తొమ్మిదియై 'నవరసముల'ను నామకరణము సార్థకమయ్యెను. మొదట భక్తికూడ రసముకాదనిరి. కాని తరువాత భక్తికూడ రసముగా నంగీకరింపబడెను. కాళహస్తిమాహాత్మ్యమునందలి రసము పరిశీలించుటకు ముందు యించుకరసమును గూర్చియు, శాంతమురసముగా నెట్లంగీకృతమయ్యెనో తెలిసికొనుట యవసరము. కావ్యాలంకార సంగ్రహమున రస నిర్వచనమిట్లుగలదు.

క॥ పులకండంబులు గలిపిన
సలువగుసలిలమురసాయనంబగు పగిదిన్
లలిత విభావాదులచే
నలమతరస్థాయి భావమమరున్ రసమై

(కావ్యాలంకార సంగ్రహము తృ.ఆ. పుట. 279)

కండ చెక్కెఱకలుపగా జలము పానకమగు విధమున విభావ, అనుభావ, సంచారీ భావములచే బరిపుష్టమై యధికముగా నాస్వాద్యమైన స్థాయీభావము రసము. జలము తన జలరూపముతో నున్నపుడెక్కువగా నాస్వాద్యముగానుండదు. అట్లే సహృదయుల హృదయమున వాసనా రూపముననున్న స్థాయీ భావము గూడ నాస్వాద్యముగా నుండదు కాని యాజలము కండచెక్కెర, ఏలకులు, మిరియపు పొడి మొదలగు వాని యొక్క కలయికచే బానక రూపము పొందిక కడుంగడు నాస్వాద్యమానమగుచున్నది. అట్లే ఆసహృదయుల స్థాయియు విభావ, అనుభావ సంచారీ భావములచే బరిపుష్టమై మిక్కిలియు నాస్వాద్యమగుచున్నది. కాబట్టి సహృదయుల హృదయమున నున్నస్థాయియే రస మగుచున్నది.

ఇదియును దశ రూపకమున నిట్లుగలదు
విభావై రనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభి చారిభిః
ఆనీయమానః స్వాదుత్వం స్థాయిభావోరసః స్మృతః
(కావ్యాలంకార సంగ్రహము పుట. 279)

విభావాను భావ వ్యభిచారీ భావములచే నాస్వాద్యమానమగు స్థాయి భావము రసము అని అభిప్రాయము.

[1]రసపదము మొట్టమొదట ఋగ్వేదమున గానబడుచున్నది. ఆపద మీ కాలమున వ్యవహరింపబడు కావ్యరస పరముగా గాక భిన్నార్థమున వ్యవహృతమై యున్నది. అది తొలుత సోమరసము, జలము, క్షీరము, సారము అను నర్థము లందు భిన్న భిన్న మండలములలో గానవచ్చుచున్నది. అధర్వవేదమునందు బైయర్థములందు వ్యవహారముగానరాదు. కాని 'రుచి' అనునర్థమున సర్వ సాధారణముగా గానబడును. ఉపనిషత్కాలమున 'ప్రధానరసము' అను నర్థము వచ్చినది. ఛాందోగ్యోపనిషత్తులో రుచి, ప్రధాన రసము అను రెండర్థములును భిన్న భిన్న స్థలములందు గలవు తైత్తరీయోపనిషత్తులో "రసోవైసః" 'రసగ్ హ్యేవాఽయం లబ్ధ్వానందీభవతి' అనియు మైత్రేయోపనిషత్తులో తద్వై సత్వస్వరూపం; తత్సత్యమేవేరి తంరసః; ససంప్రాస్రవత్" అనియు గలదు. వీనిలోని 'రస' పదములకునీ యుభయార్థమును (రుచి-ప్రధానరసారము) నిమిడి

1. కావ్యాలంకార సంగ్రహము, తృతీయాశ్వాసము, కాలంసం పుట. 281

యున్నది. జగత్తునకు (ప్రధాన సారభూత) మేదిగలదో, యేది యోగులు రుచ్యమానముగ దలతురో దేనిని సాక్షాత్కరించుకొని శాశ్వతానందమనుభవింతురో యాపరమాత్మయే యీరస పదమునకు అర్థము అలంకారికులట్టి యుభయార్థముగల రసపదమును గ్రహించి దీనిని గావ్యమున వ్యవహరించిరి. కావుననే కావ్యానందము బ్రహ్మానంద సహోదర మనియు నుడివిరి.

"విభావాను భావ వ్యభిచారి సంయోగాద్ర సనిష్పత్తిః" అని భరతుని రససూత్రము. విభావాను భావ వ్యభిచారుల యొక్క సంయోగము వలన రసము నిష్పన్నమగునని యర్థము. సంయోగ, నిష్పత్తిపదముల కర్థభేదమును గల్పించి భట్టలోల్లట, శ్రీశంకుక, భట్టనాయక, అభినవగుప్తులను నలుగురు పండితులు నాలుగు విధముల వ్యాఖ్యానించిరి. లోకమున శకుంతలాదుష్యంతాదులనుభవించిన రసమును దర్శకమునకు గారణముగాని, సామాజికుడెట్లు అనుభవించి యానందించును యని ప్రశ్నించుకొని అప్పుడు "విభావానుభావ" యను పై సూత్రమును జెప్పెను.

పై ప్రశ్నకు భట్టలోల్లటుడు 'రసము దుష్యంతాది నాయకుడే యనుభవించును. వాని ననుకరించు నటునిగాంచి సామాజికుడు చమత్కారమును బొంది యానందించును'. శ్రీశంకుకుడు అనుకర్త యనగా నటుడు నటించిన విభావయను భావాదులఁ గాంచి వ్యాప్తిజ్ఞానమూలమున సామాజికుడానందపడు ననివచించెను. భట్టనాయకుడు సామాజికుడు నాయకా భేదమును బొంది సాక్షాన్నాయక రసానుభవము బొందునని నుడివెను. అభినవగుప్తుడు సామాజికుడు వాసనచేత నాయకా భేదమును బొంది సాక్షాన్నాయక రసానుభవమును బొందునని తెలిపెను. భట్టలోల్లటుడును, శ్రీశంకుకుడును సామాజికుడానందమును బొందుననిరి. భట్టనాయక అభినవగుప్తులు సామాజికుడు సాక్షాన్నాయకుడు పొందిన రసానుభవమునే సామాజికుడును బొందుననిరి. అభినవగుప్తుడు భట్టనాయకమతమున లేని వాసన నంగీకరించెను. ఇదియే భేదము. భట్టలోల్లట, శ్రీశంకుకుల మతమున్న సామాజికుడు సాక్షాన్నాయక రసానుభవమునే పొందునను మాటలేదు. కేవలము ఆనందపడునని మాత్రమే గలదు.

క॥ ధర శృంగారము, హాస్యము,
కరుణము, వీరము, భయానకము, బీభత్సం
బురరౌద్ర, మద్భుతము శాం
త రసంబును రసములనగ దనరుం గృతులన్

శృంగార, హాస్య, కరుణ, వీర, భయానక, బీభత్స, రౌద్ర, అద్భుత, శాంతము లనునవి తొమ్మిది కావ్యరసములు.

కాని మొదట [1]రసము లెనిమిది యని చెప్పబడినవి. లాక్షణికులీ విషయమున భిన్నాభిప్రాయములను వెలిబుచ్చిరి. వీరిలో మూల విరాట్టయిన భరతము.

శృంగార హాస్యకరుణాః రౌద్రవీరభయానకాః
బీభత్సాద్భుత సంజ్ఞౌ చేత్యష్టౌనాట్యేరసాః స్మృతాః
ఏతేహ్యష్టౌరసాః ప్రోక్తాద్రుహిణేన మహాత్మనా
(నాట్య శా. VI 16-17)

అని బ్రహ్మ చెప్పినట్లుగా శృంగారాదులు రసము లెనిమిది యని వక్కాణించెను. ఈ ఎనిమిది రసములకు స్థాయీభావము లీ క్రింది విధముగా చెప్పబడినవి.

రతిర్హా సశ్చశోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శ్చేతి స్థాయి భావాః ప్రకీర్తితాః
(నాట్య శా. VI - 1?)

ఇట్లు రసము లెనిమిది యనియే చిరకాలము విద్వాంసులు భావించుచుండిరి. కాళిదాస మహాకవి 'మునినా భరతేనయః ప్రయోగో భవతీష్వష్టరసాశ్రయోనియుక్తః' అనియు వరరుచి మహర్షి 'షట్ స్థానాని, గతిద్వయమ్ అష్టౌరసాః' అనియు రసాష్టకమునే చెప్పిరి. దండి ప్రభృతులు ప్రాచీనాలంకారికులును ఎనిమిది రసములనే గుర్తించిరి. అర్వాచీనులలో ధనంజయుడీ వాదమునకు పట్టుగొమ్మ. అతడు కూడ రూపకములలోనే శాంతము రసము కాదనును. కాని కావ్యములలో అదికూడ అతని

---

1. ఆంధ్రప్రతాపరుద్ర యశోభూషణము - పుట 271

శిష్టమే యని వ్యాఖ్యానించు వారు కలరని ప్రతాపరుద్ర యశోభూషణమున చెప్ప బడినది. నవరసములలో శాంతము రసముగాదని కొందఱు, శృంగార మొక్కటే రసమని కొందఱు, కరుణయే రసమని కొందఱు అద్భుతము రసమని కొందఱు, ఈ తొమ్మిదికాక భక్తికూడ రసమేయనియొకరు వత్సలమును రసముగా గ్రాహ్య మని కొందఱు, ప్రేయో రసమనునది యున్నదని కొందఱు, వ్యభిచారీ భావము లన్నియు రసములే యగునని యొకరు, ఒక్కటే రసముగాని యిన్ని రసములు లేనేలేవని మరియొకఱు, ఇట్లు రససంఖ్యను గూర్చి విభిన్న దృక్పథములు ఏర్ప డినవి.

శాంతరస ప్రస్తావన భరతుడు సేయలేదు. కాని ప్రకృతము మనకువల భ్యమానమగు నాట్యశాస్త్రగ్రంథములలో శాంతరసప్రస్తావన గలదు. ఇది భరతుని తరువాత శాంత రసాభిమానులగు పండితులు తమ యభిప్రాయములను నాట్యశాస్త్ర ములలోని కెక్కించినట్లు కానబడును కొందఱు 'వాసుకి' యను నాతడు ప్రప్రథ మమున శాంతరసమును స్థాపించెనందురు. కొందరు 'కోహలుడు' శాంతరస సిద్ధాంతమును బలపరచెనని చెప్పుదురు. కాని వాసుకి, కోహలుల ప్రమాణ వాక్య ములు లభింపలేదు (చూ॥ కా. సంగ్రహము పుట. 292) పిమ్మట నీ శాంతరస మును గుఱించి విచారించి నిర్ధారించినవాడు భట్టోద్భటుడు. అతడు తన కావ్యా లంకార సంగ్రహమున తొమ్మిది రసములనుదహరించెను. అతడే శాంత రస మును అంగీకరించి వానికి వలసిన స్థాయీభావాదులను నిర్ణయించి నాట్యశాస్త్రమున ప్రవేశపెట్టెను.

> శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానకాః
> బీభత్సాద్భుతశాంతాశ్చ నవనాట్యేరసాః స్మృతాః
> రతిర్హాసశ్చ శోకశ్చక్రోధోత్సాహౌభయంతథా
> జుగుప్సా విస్మయశమాః స్థాయీభావాః ప్రకీర్తితాః

పై శ్లోకమున శాంతము రసముగాను, శమము దాని స్థాయీభావముగాను పేర్కొన బడియున్నది. భరతుడు శాంతరసమును గూర్చి ఋజు మార్గమున దెలుపకపోయి నను వక్రమార్గమున నంగీకరించెను. ఎట్లనగా

"క్వచిద్ధర్మః క్వచిత్క్రీడా క్వచిదర్థః క్వచిచ్ఛమః
దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినాం
విశ్రాంతి జననం కాలే నాట్యమేతద్భవిష్యతి,
బ్రహ్మర్షీణాంచ విజ్ఞేయం నాట్యం వృత్తాంత దర్శనం"

దుఃఖార్తులకు ధర్మముపదేశించుచు, శ్రమార్తులకు వినోదము కలిగించుచు, శోకార్తుల కర్థోపదేశము సేయుచు, దపస్వులకు బ్రశాంతిని గూర్చుచు, నాయాకాలముల యందు నాట్యము విశ్రాంతి కారణమగును అని నిస్పష్టార్థము. ఇందు "క్వచిచ్ఛమా" అని యుండుటం జేసి యభినవ గుప్తుడు శాంతిరసమును స్థాపించు ఘట్టమున "మునినాఽప్యంగీ క్రియతే క్వచిచ్ఛమ ఇతి వదతా" (క్వచిచ్ఛమః అని చెప్పుటచే నీ శాంతము నంగీకరించెను) అని వచించును. మఱియు భరతుడు నాటకమున

"తుష్యంతి తరుణాః కామేవిదగ్ధా స్సమయాశ్రితే
అర్థేష్వర్థ పరాశ్చైవ మోక్షేష్వథ విరాగిణః"

"విదగ్ధులగు తరుణులు సమయమున గామమున (శృంగారమున) హర్షింతురు. అర్థపరులర్థముల గాంచి సంతోషింపెదరు. విరాగులు మోక్ష విషయమున సంతోషమందెదరు" అని చెప్పెను. దీనిని బట్టి విరాగులు శాంతరసాస్వాదకులని తేలెను. భరతుడు శాంతమును రసముగా నంగీకరింపనిచో నాట్యము త్రైలోక్యాను కరణమని చెప్పలేదుకద.

"నానాభావో సంపన్నం నానా వస్థాంత రాత్మకం
లోక వృత్తాను కరణం నాట్యమే తన్మయా కృతం
....
సప్త ద్వీపాను కరణం నాట్యేఽ హ్యస్మిన్ ప్రతిష్ఠితం"
(నాట్యశాస్త్రము)

అని నాట్యశాస్త్రమున చెప్పబడినది ఇంతేకాక నాట్యాంశము కానిదేదియు లేదని యిట్లు తెలిపెను.

---

1. కావ్యాలంకార సంగ్రహము-పుట 293.

"నతత్ జ్ఞానం నతచ్ఛిల్పం నసావిద్యానసా కళా
నసయోగో నతత్కర్మనాట్యేఽస్మిన్ యన్న దృశ్యతే"

ఈ కారణముల వలన భరతుడు ఋజుమార్గమున శాంతము రసముగా నంగీకరింప కున్నను వక్రమార్గము నంగీకరించెనని స్పష్టమయ్యెను.

కావ్యమందువలెనే నాట్యమందును తొమ్మిది రసములు సిద్ధించును. ఈ యభిప్రాయ ప్రకారము "శాంతోఽపి నవమోరసః" అని చెప్పబడినది. ధ్వన్యా లోకమునకు వ్యాఖ్యాతయగు చంద్రికాకారుడు శాంతమును కావ్యమున అంగి రస ముగా గాక యంగరసముగా మాత్రమే నిర్వహింపవచ్చునని చెప్పెను. అభినవ గుప్తుడీ యభిప్రాయము ఖండించుచు 'అధికారి వశేనతు శాంతో గనో ననిబద్ధవ్యః ఇతి చంద్రికాకారః తచ్చేహాస్మాభిర్న పర్యాలోచితం'' తుదకు కావ్యమునను, నాటకముననుగూడ నంగిరసముగా శాంతరసము గ్రాహ్యమేనని యభినవగుప్త పాదులవారు సిద్ధాంతీకరించిరి. తదుపరి శాంతమునకు శమము స్థాయీ భావముగా నెన్నుకొనిరి.

కాళహస్తి మాహాత్మ్యము నందలి భక్తి భావ బంధురములగు కథలను జూచి విమర్శకులు కొందరు ఈ కావ్యమున పరిపోషితమైన ప్రధాన రసము భక్తి యని భావించిరి. విజయనగర సామ్రాజ్య మందలి ఆంధ్ర వాఙ్మయము పై చారిత్రక దృష్టితో చక్కని సమీక్షా గ్రంథము వెలయించి శ్రీ టేకుమళ్ళ అచ్యుత రావుగారు తమ గ్రంథమున నీయభిప్రాయము తెల్పిరి. ఈ గ్రంథము నందంతయు భక్తి జాలు వారుట మనము చూచినాము కాని పరిపోషితమైనది శాంత రసము. వారిట్లనిరి. ఈ కావ్యమందు ముఖ్యముగ భక్తిరసము కనిపించుచున్నది. భక్తి రసమున కంగిగానున్న శృంగార వీర శాంత రసములు స్థాయి రసమున కుద్దీపములుగా నున్నవి. ఆయా రసము లన్నియు నెట్టి వికృతులు పొందినను సూత్ర రూపముగనున్న భక్తిరసము యావికారములకు నింపు సొంపులు గలి గించుచున్నది. (ఆంధ్ర వాఙ్మయ చరిత్ర పుట 861)

కాళహస్తి మాహాత్మ్యములో అంగిరసమైన శాంతమున కంగములుగా శృంగారము, వీరము ప్రధానములుగా కన్పించుచున్నవి. మిగిలిన పట్టుల అద్భుతము, భీభత్సము పోషింపబడినను శృంగార వీరములు ప్రధానములు. భక్తి

భావము సరేసరి. ఈ భక్తి భావము మోక్షమునకు దారితీయుట చివరకు మోక్షము వలన శాంతరసము పోషింపబడుటయు జరిగినది. ధూర్జటి తన శుభ కావ్య రత్నమున కీశునధీశుని జేసెనని ముందే తెలిసికొంటిమి. సార్వభౌముడు మదిం బ్రమదంబు వహించి "ధూర్జటి! నీ శివభక్తి కావ్య సరణిం గడు ధన్యత బొంద నవ్య భాషా శతధానిగుంభన రసస్థితి నొప్పదలిర్ప జెప్పుమీ" అని యను గ్రహము చేసెను. ప్రథమాశ్వాసము 8వ పద్య మందీ విషయము చెప్పబడెను.

ఉ॥ "ఈ శుభ కావ్య రత్నమునకీశు నధీశుని జేసినన్, మహా
దేశిక సార్వభౌముఁడు మదిం బ్రమదంబు వహించి "ధూర్జటీ!
నీ శివభక్తి కావ్య సరణిం గడు ధన్యత బొంద నవ్య భా
షా శత ధాని గుంభన రసస్థితి నొప్పదలిర్ప జెప్పుమీ."

(కా.మా.ప్ర.ఆ.8)

ఇది గురువుగారి యాదేశము. ఇందు 'శతధా నిగుంభన రసస్థితి, అనుదానికి యర్థమును నిర్ధరింపవలసి యున్నది.

కావ్యమున 'కాత్మరస' మని యాలంకారికుల నిర్ణయమని తెలిసికొంటిమి. అట్టి రసము ప్రతీయమానమగునప్పుడే లోకోత్తరాహ్లాద జనక సమర్థమగును. కావుననే 'రసధ్వని' కావ్యమున కాత్మయని అర్వాచీనాలంకారికులు నిర్ణయించిరి. 'రసధ్వని యను దానినే యిచట ధూర్జటి నిగుంభనరసస్థితి' యనెను. ఇంక ధ్వని భేదములు (శతధా) పందల కొలది గలవు. కాబట్టి రసము శతధా ప్రతీయమాన మగుచున్నది. అట్టి రస ధ్వనిని నవ్య భాషలో వెలయింపుమని గురువు ఆదేశము. కావ్యానందము బ్రహ్మానంద సహోదరము గనుక యోగసాధనచే బ్రహ్మానంద స్థితిని పొందిన గురుడు, ఆ స్థితిని పొందుటకు ముందు 'కావ్య సరణింగడు ధన్యత'ను అనగా కావ్యమును నిర్మించుట ద్వారా ఆనందానుభూతిని పొందు మని శిష్యుని ఆదేశించినట్లు చెప్పబడినది. రసమును దశరూపకపరముగా భరతముని తొలుత చెప్పెను. దానిని అర్వాచీనులు శ్రవ్య కావ్యపరముగా అన్వయించిరి. వారిలో ప్రధానులు ఆనందవర్ధనుడు. తద్వ్యాఖ్యాత అభినవ గుప్తపాదుడు. వీరు రసమును కావ్యపరముగా సమన్వయించుటయే గాక, శాంతమును తొమ్మిదవ రసముగా నంగీకరించి, అదియే రసరాజ మనిరి. ఇట్టి శాంతము నంగి రసముగా జేసి కావ్య రచన చేసినాడు ధూర్జటి.

కావ్యము నందలి వివిధములైన కథలన్నీ ఏక సూత్రత ఘటించినది. శివభక్తి యని ఈ కావ్యమువలన తెలిసెడి. శివభక్తులు సర్వమును శివార్పణము గావించి తదైక్యమును బొంద గోరుదురు. ఇదియే శాంత రస పరమావధి. ఇక భక్తిభావము కావ్యమంతటను గోచరించుచున్నది. భక్తికి పర్యవసానము శాంతమే యని ప్రతాపరుద్రయశోభూషణకారుడు తెల్పెను. [1]శాంతరస తత్త్వమును తెన్నుగా నెఱిగిన వాడౌట చేత స్తుతి మతియైన ధూర్జటి కవీంద్రుడు తన కావ్యమునకు శాంత రస రత్నమును శిరోమణిగా గూర్చి వన్నెలొలుక జేసెను.

'ధూర్జటి కావ్యారంభము చేయుచు శ్రీకాళహస్తి పురవర్ణన గావించెను. కావ్యారంభముననే శాంతి సుధాసేకముతో గావించెను. ఈ పుర వర్ణన చేసిన పది పద్యములలోను ధూర్జటి గతానుగతికముగ పుర స్వరూపము సౌధములు, ప్రాకారములు, ఎల దోటలు, అగడ్త చతుర్వర్ణములు, కామినీ జనులు, చతురంగ బలము మున్నగు వానినే వర్ణించినను అన్నింటను శివభక్తిని, శివపారమ్యమును, ఐహిక వాంఛా విరక్తిని, యోగసాధనను, శాంతత్వమును, శివైక్యమును ధ్వనింప జేసినాడు.

కాళహస్తి మాహాత్మ్యము ప్రథమాశ్వాసము 17వ పద్యములో పురవర్ణన చేయుచూ ధూర్జటి ఆపురమును 'సంసారపారదోచ్చాట గానల కీల కలుష సంచయ తామ్ర గంధకంబు' అని నిండుగా బాఱు గంగానది వంటి ధారతో నోజో గుణ సంపన్నమైన సీస పద్యముతో మొదలిడి "దివ్యదేశిక" యను తేట గీతితో ముగించెను. అమృత లింగాకరము కాళహస్తిపురము అనినాడు. అది సంసారికమోహమును, కామమును, రాగమును, జేరనీయని మహత్తుగలది. అచటి జనులు సద్గురూప దిష్టమైన ధ్యాన మార్గమున సాధన చేయువారు. ఇంతే కాక తటాకము సముద్రము చంద్రుడు సర్వము శివమయము చేసి ధూర్జటి వర్ణించినాడు. ఇదియే నవ్య భాషా రచన. ఈ రీతిగా అతడు పుర వర్ణన చేసిన పది పద్యములలో నొక్కొక్క పద్యమందు నొక్కొక్క విశేషము జెప్పినాడు. అందు జనులు యోగులుగను అవధూతలుగను చెప్పెను. ఇక ముందు తాను జెప్పబోవు కథలలోని నాయకుల నిందు చమత్కారముగా సూచించినాడు. అచట వాతావరణ

1. పీఠిక। కా।మా। చలమచర్ల రంగాచార్యులు.

మంతయు శాంతిమయ మని నిరూపించెను. ఇట్లే ప్రథమాశ్వాసమున వసిష్ఠమహర్షి తపశ్చరణము - పరమేశ్వర సాక్షాత్కారము అను ఘట్టమున శాంత రసము దీప్తం జేసెను.

శా॥ దావానేకపముల్ కరాపహృతపాథః పూరము ల్దెచ్చి, యి
చ్చా వృత్తిం జలకంబు లార్చ, చమరీ జాలంబు వాలంబులన్
వీవం, గ్రోతులు పండ్లు గానుకలు గావింపం, గిరాతాంగనల్
సేవల్సేయ, జెలంగె నమ్ముని తపస్సింహాసనాసీనుడై.

(ప్ర.ఆ. 78 పద్యం)

అతడు తపస్సు చేయుచున్న సందర్భమున జంతుజాలమంతయు సహకరించినదని పై పద్య భావము. ఆ పిమ్మట అగస్త్యుడు గంగానదిని సువర్ణముఖరీ నదిగా నవతరింప జేయుటకు గావించిన ఘోర తపస్సు వర్ణించు పట్టుల కూడ దూర్జటి శాంత రసము పోషించెను.

శా॥ శంకాతంకము మాని మౌనియు సహర్షస్వాంతుడై చంద్రమో
లంకారున్, జగదేకనాయకు, మహాశ్లాఘాపరస్థాను, మీ
నాంకధ్వంసకు, నీశ్వరున్ హృదయపీఠాసీనుగావించి, సా
యంకాలానల మూర్తియై తపము సేయందొచ్చె ధైర్యంబునన్

(ప్ర. ఆ. 121 పద్యం)

ఇక ద్వితీయాశ్వాసమున ఆశ్రమమును వర్ణించు సందర్భమున శాంతమును వాచ్యముగానే ధూర్జటి చెప్పినాడు.

సీ॥ తల్లిగానని లేడిపిల్లకు జన్నిచ్చి
పెంచు బెబ్బులి తన బిడ్డయట్ల,
దైవికంబున గూడు దప్పి వేలను బడ్డ
రాచిల్క బోదం బ్రోచు బిల్లి,
యెండచే గ్రాగిన కొండ గొఱియ దెచ్చి
యెలమావి నీడ నిలుపు గ్రోతి,
యెడబాసిపోయిన పిడియేనుగుల గూర్చి
కరవిరహంబు కేసరి హరించు,

గీ॥ స్తనితముల కెగబడివచ్చు శరభములను
బట్టి యొయ్యన ధాత్రిపై బెట్టి కాచు
గండభేరుండ పక్షులు గలిగి యజుని
యాశ్రమము శాంతరసరూపమయ్యె నపుడు.

(ద్వి. ఆ. 70 పద్యం)

ఈ విధముగా కావ్యమంతయు శాంతరసమయము చేసి ధూర్జటి రసపోషణమున కడు చమత్కారముతో మెలగెను. ఇంకొక విశేషమేమన పురవర్ణనమున ధూర్జటి కల్పనా విషయమున సమకూర్చిన సామగ్రి విలక్షణమై యున్నది. కాళహస్తిపుర వర్ణనమున కామినీజనమును యోగిజనముగను ఏనుగుల నవధూతలుగను చిత్రించుటలో నాతనికి గల యోగసన్న్యాసములందలి యభిలాష గోచరించుచున్నది. కవికి నేవిషయమందభిరుచియెక్కువ యగునో కల్పనావిషయమునందది స్ఫురింపక మానదు. కవికి యోగాభ్యాసమునందాదరము కలదనుట కిది యొక నిదర్శనము కాకున్న కామినీజనమును యోగిజనముగా చిత్రించుటపొసగదు. ఇటులనే లీలారతి నుండి మానవులకు వైరాగ్యము నాపాదించుట యాతనికిగల మోక్షాపేక్షకు దార్కాణము. ఈ భావము లన్నియు కవి ప్రథమాశ్వాసము "పరిచిత బిందునైపుణి" అను పద్యమున వ్యక్తీకరించినాడు.

ఇక శాంతరసమున కంగములుగా నీ కవి శృంగారము, వీరములు పోషించెను. తదుపరి అద్భుతము నొకటి రెండు చోటుల, హాస్య, కరుణములు పరిపోషితములు. వీరరస చిత్రణమునందు ధూర్జటి సిద్ధహస్తు డనిపించును. బ్రహ్మ కథలో నీ వీరరసము ఎక్కువగా పోషింపబడినది. ఉగ్రుడు ముప్పదివేల రక్కసులతో యుద్ధము చేయుటయందును కాద్రవేయ భద్రగణములు పోరాడుసమయమునను, తిన్నని వేటసందర్భమునను మాయాకిరాతార్జునుల సంగరము నందును మనకు వీరరసము గోచరము. అకాలసంగమదోషంబున నుదయించి రక్కసులై లోకోపద్రవకారులై సంచరించు తన కొడుకులపై గినిసిన బ్రహ్మదేవుని కోపంబు వలన 'నుగ్రుడ'ను మహావీరుడు పుట్టెను. దుష్టులగు తన కుమారులను దునుమాడి రమ్మని బ్రహ్మచే నాజ్ఞప్తుడైన యుగ్రుడు విలయకాలోగ్రుడై వీర విహారము చేసి రక్కసి మూకలను చీల్చి చెండాడిన ఘట్టమున వీరరసము

పొంగులువారినది. వీరరసస్థాయి యగు నుత్సాహము ఉగ్రవీరునిలో నెట్లులుకు చున్నదో చూతము.

ఉ॥ కోపున నార్చినన్ దెసల కుంజరముల్ సెదరెం, ధనుర్గుణా
రావమునం గలంగె జలరాశి, వడంకె రథాంగతీవ్ర సం
రావమునం గులక్షితిధరంబులు. రథ్యమృగేంద్ర సాంద్ర హే
షావళి వ్రక్కలయ్యె హరిదంతము, లేమని చెప్పన త్తఱిన్
(ద్వి. ఆ. 85 పద్యం)

గీ॥ తన్ను ధరణికి బొమ్మన్న ధాత నోటి
మాట నోరనె యుండ భూమండలంబు
జేర జనుదెంచె సింగపు దేరిజోదు
వింధ్యగిరి నున్న రాక్షస వితతి మీద
(ద్వి. ఆ. 86)

కోయని యార్చినంతనే దిగ్గజములు బెదరి చెదరిన రీతిగా పుడమికి బొమ్మను తండ్రి నోటిమాట నోటనే యుండగా యుగ్రుడు రాక్షసుల మీదికి నుత్సాహముతో నురికెనట. ఉగ్రవీరాలంబనమైన యా యుత్సాహము శత్రువులగు రాక్షసులను జూచుట, వారి యాక్షేపరూప వాక్యాదులను వినుట మొదలైన యుద్దీపనములచేతను, రోమాంచ వైస్వర్యాదులగు సాత్త్విక భావముల చేతను, గర్వామర్షాదులగు వ్యభిచారి భావముల చేతను సముల్లాసితమై వీరరసముగా రూపొందిన విధ మీ ఘట్టమున జక్కగా చూపబడెను. ఇంకను-

శా॥ క్రోధాగ్ని ప్రభ రీతి శోణరుచి దృక్కోణంబులం జిందగా
వేధోండంబు గలంగ నార్చి, శరము ల్వేగ గోదండ వి
ద్యాధౌరేయత మీఱనేసె మనుజాహారౌఘదేహ ప్రధా
రాధౌతక్షితి ధూళిపాళిగ మృగేంద్ర స్యందనుం డుద్ధతిన్
(ద్వి. ఆ. 49)

మొదలైన పద్యములందు వీరరసానుగుణమైన మత్యమారభటీవృత్తిని, కాంతోజోగుణ సమ్మితమైన గౌడరీతిని గూర్చి కవి చూపిన కవితాశిల్పము కానియాడ

దగినది. పిదప నుగ్రుడు రక్కసులతో యుద్ధము చేయునప్పుడు యుద్ధభూమి వర్ణన యంతయు వచనములో చెప్పబడినది. ఇందు భీభత్సరసము వర్ణితము. ఈ యుద్ధవర్ణనము తిక్కన చేసిన యుద్ధవర్ణనమును పోలియున్నది. మచ్చునకు-

వ॥ "అమ్మహారణ్యస్థలంబున వారణంబుల యట్టలు కట్టలు వడుటం జేసి తొట్టిన నెత్తురు మడువులం దెట్టువలు గట్టిన యంపకట్టియలం దెప్పలు గట్టుకొని యాదం దంపెట్టు బిడ్డల యెడెలాతనంబునకు మనంబున ఘనం బగు వేడుక వొదవ బెద్దయుం బ్రొద్దు మొద్దాడు శాకినీఢాకినుల కలకలం బును, విచ్చలవిడిం బచ్చిపొలసు దిని వెగటగుటం జేసి తొడవుల నెరలి పడిన పద్మరాగంపు గుప్పలు నిప్పులనుచు గండలు బిరికట్టియలన్నుట్టి కఱకుట్లు గాలు పందాలువడి తిరుగు భూతభేతాల బాలికాకుల కోలాహలం బును, మిట్టకోలల గులగులలైన కిరీటంబుల నుండి రాలిన వజ్రమౌక్తిక రజోగు (గ?) ణంబు వలన లవణంబు చవి మంగి ముఱుగ కుండ నుప్పు గండలు పెట్టజూచు పిశాచ మందగామినుల క్రందను, బదడునం బొదివిన మెదడునుం బ్రదరంబుల బిదిసి కదిసిన మాంసంబును, ప్రేవుల ప్రోవులు మొదలుగా....

ఇత్యాదిగా యీ వర్ణన సాగెను. దీనికి ముందు ఒక పద్యముగలదు.

చ॥ పరులకు గుండె గూడు దిగె, నాగకులంబులు నిద్రవోయె, ని
ర్జరులును మిన్నుదన్నిరి, ధరామరకోటియు, దృప్తిబొందె, సు
స్థిరత వహించె ధాత్రియు, ఋషివ్రజ మిచ్చగరించె, రాక్షసో
త్కరము రణంబునన్ వాని రథప్రదరాహతి చేత గూలినన్
(ద్వి. ఆ. 62 పద్యం)

ఇక తిన్నని వేట సందర్భము నందు వీర రసము కవి పోషించెను.

సీ॥ ఒకనాడు తెరవేట మృగ సత్త్వంబుల
బుడమిపై దడకాలు పడవధించి,
యొకసారి సారమేయోద్ధతినుద్ధుర
స్తబ్ధరోమంబుల సంహరించి,

యొకమరి దీమంబు లొడ్డి పాదులు దీర్చి
బహు విహంగంబుల బట్టితెచ్చి,
యొకవేళ దేగవేటకు జని యెగజోపి
నానాండజముల ప్రాణములు గెడసి,

గీ॥ ముంగివే, చేదువేట, సివంగివేట,
యిఱ్ఱివేటయు, గంటవే, జెద్దువేట
మొదలుగా గల వేటల యదనెఱింగి
తిన్న డొక్కొక్కతూకు వర్తింపదొడగె (తృ. ఆ. 47 పద్యం)

తెరవేట యన నెటువంటిదో చలమచర్ల రంగాచార్యులుగారు తమ కాళహస్తి మాహాత్మ్యటీకలో నీ విధముగా చెప్పిరి. పెద్దపులి, చిఱుతపులి, పంది మున్నగు క్రూరజంతువులుండు మఱుగు తావునుండి దూరముగా నొక జలాశయము నాను కొని విశాల ప్రదేశమున కఱ్ఱలు ప్రాతి ఒకటే ద్వారముండునట్లు పెద్దదగు దొడ్డి వలకట్టి, ఆ ద్వారమునుండి జంతువులుండు తావుదాక నొకపెద్ద త్రాడుగట్టి, యాత్రాటికి నచ్చటచ్చట తెరచీరలు గట్టి, వాద్యములచే జంతువులను జోపి, సూటిగా నా దొడ్డివలలో బడునట్లు బెదరించితెచ్చి వలకివలనుండి బల్లెముంచేతను, బాణముంచేతను, వానిని చంపువేట. త్రాటికి గట్టిన తెర చీరలు చూచి యటు వంక నెవరో మనుజులున్నారని యాజంతువులు త్రాటేసి దాటి యావంకు జనవు. రెండవవైపున వాద్యకాండ్రుండుటచే నా వంకకును రాక, సూటిగా దొడ్డివలలోని కా జంతువులన్నియు వచ్చిపడును. తెరవేట మొదటి పాదమున చెప్పబడినది.

ఇక సీసము రెండవ పాదమున పందివేట వర్ణింపబడినది. కుక్కల సాయమున బహిరంగముగా నీటెతో బందెనిబొడిచి చంపెడివేట పందివేట.

మూడవ పాదమున పాదివేట వర్ణింపబడినది. ఒకచోట జిగురు గండెలు, ఉచ్చులు నొగ్గి, కౌజు మున్నగు పెంపుడు పక్షులలో నొకదాని నచట నిలిపి ఎరగా నేకమ్మరి పురువునో జిగురుగండె కంటించి వేటకాడు దాగియుండును. దీనుగా నిలిపిన యాపిట్ట యాయెరను పొడిచి తినుచు గూయుచుండ సజాతీయము లగు పిట్టలచట వ్రాలి జిగురు గండెలలో గాని, యుచ్చులలోగాని చిక్కుకొనగా వేటకాడా పిట్టలను బట్టుకొనుచుండును. నాల్గవ పాదమున విడివేట వర్ణితము.

ఆకటి పడనుననుండు డేగను బక్షుల మీదికి విడిచి యాడేగచే బిట్టలను గొట్టించు వేటయే పిడివేట. గీతపాదము లందలివి ముంగివేట, ఏదువేట, సివంగి వేట, ఇట్టివేట, గంటవేట, ఎద్దువేట మున్నగునవి. పెంచిన ముంగిస, కుక్కలు, సివంగి ఇట్టిఎద్దు మున్నగు జంతువుల సాయమున పాములను ఏదుపందులను ఓఱుత పులులను, లేళ్లను, కణతులను వేటాడెదు వేటలు. గంట వేట మాత్రము వేటకాడు మాటున నుండి వేటాడునది. తిన్నడిన్ని విధములగు వేటలయందును నిపుణత జూపెనని కవి యిందు వర్ణించెను. ఈ తిన్నని వేటపట్టమంతయు వీర రసమే పోషించెను.

ఉ॥ అవనవీధిలోగల మృగావళి బక్షుల సంహరించి, పూ
ర్వావని కృత్తటాటవుల నాటవికుల్మృగయా విహారముల్
చేవదలిర్ప జేయుటకు శ్రీఘమపాళియమెత్తి, కుంభజ
గ్రావసుతా ప్రతీర గిరికాననమధ్యమున న్వసించుచున్
(తృ. అ. 62 పద్యం)

ఇట్లావనమున గల మృగములను, పక్షులను పూర్తిగాజంపి, వేట కాండ్రు తూర్పు కొండయందు వేటాడ తలంపుతో వెంటనే సేనానివేశము (పాళెము)ను ఎత్తివైచి, బయలుదేరి సువర్ణముఖీ నదీ యొద్దున విడిసి యా యడవి యందు వేటాడ మొదలిడిరని భావము

ఇంక వీరము తరువాత ఎక్కువగా ధూర్జటి కావ్యమునందు పరిపోషిత మైనది శృంగారమని చెప్పనగును. కాని ధూర్జటి శృంగారము భక్తిభావమునకు ప్రతిబంధకము కాజాలదు. అవకాశము లభించినపుడెల్ల ఈ భక్తాగ్రగణ్యుడు శృంగార దర్శన కూడ కావించెను. ప్రథమాశ్వాసమున జంగమరూపియైన శివుడు చూచిన దాసి యిట్లున్నదట.

శా॥ ఆవేశం బురపల్లవ ప్రకరనేత్రానంద బాష్పాంబుధా
రావర్షాగమ చంచలాలతిక, దుర్వార ప్రసూనాస్త్రతే
జోవైశ్వానర సామిధేని, రశనా సూత్ర స్థితస్వర్ణపే
దీవిన్యస్తకపర్ది యొక్క కలకంఠీ రత్నమేతెంచుచున్
(ప్ర. అ. 88. పద్యం)

జంగమ వేషధారియైన శివుడు దాసితో క్రీడించు సందర్భము నందలి రెండు పద్యములు కూడ శృంగార రసపూరితములు.

ఉ॥ తాను సుమార జంగమ సుధాకర మౌళియు గూడిమాడి, యిం
పైన రతి ప్రసంగములు, నర్థనిమీలిత నేత్ర పద్మములీ,
మానని చుంబనంబులును, మాటలబొక్కులు, పీడిపీడిపో
నీని కవుంగిలింతలు, ననేక విలాసములుం జెంంగిఁగన్
(ప్ర. ఆ. 42 పద్యం)

ఉ॥ ఎక్కడఁబట్టినం గళిం యిక్కువ, లెక్కడ నోరుసోకినన్
జెక్కరలప్పు, లేమనిన సొన సుధారస, మెట్టులుండినన్
జక్కదనంబు పెన్నిధులు, సంభ్రమ మొప్పగ నేమి సేసినన్
మక్కువ చెయ్యులై మెఱయు మన్మథకేళి యొనర్పునంతటన్
(ప్ర. ఆ. 48 పద్యం)

ఇఁక ద్వితీయాశ్వాసమున బ్రహ్మ సరస్వతుల ప్రణయ సందర్భమున కూడ కొద్దిపాటి శృంగారము వర్ణితము.

సీ॥ మ్రొక్కిన నొకలేమ మో మెత్తిగా జేయు,
దిట్టు గూరిమి నొక్క తీఁగబోఁడి,
తలపట్టుకొను నొక్క తరుణీ లలామంబు,
హుమ్మని యదలించు నొక్కయింతి,
పట్టుకుమని యానవెట్టు నొక్కవధూటి,
యేడుచునొక్క పూర్ణేందు వదన,
ముసుగు వెట్టుచు నొక్క ముద్దియ పవళించు,
సిగ్గు లేదను నీకు జెలువ యొకతె,
గీ॥ మఱియు గోపించి వలసిన మాడ్కినుండు
వారిజాక్షుల దగినట్లు గారవించి

రతి సుఖంబుల జొక్కనోరంత ప్రొద్దు
నజుడు మన్మథ రాజ్య సింహాసనమున (ద్వి ఆ. 18)

ఇంక తిన్నని కథలో ధూర్జటి శృంగారము మితిమీతి వర్ణించి నట్లనిపించును. ఆవర్ణనలు లేకపోయినను కథాంశమునకు భంగము వాటిల్లదు. అయినను ధూర్జటి శృంగారమును వర్ణించెను గనుక ఆతని శృంగార ప్రియత్వము మనకు తెలియు చున్నది.

ఉ. మంచెల మీద నెక్కి, కటిమండలి జుట్టిన పాఱుటాకులిం
చించుక చంచలించి మరుసిల్లు బయల్పడ జేయు, బిట్టలన్
జెంచెతలార్చి ప్రేయుదురు చిత్రముగా నొడిసెళ్ల, బాహుమూ
లాంచిత దీధితుల్ చెలుతయైన చనుంగవ మీద బర్వగన్
(తృ.ఆ. 10)

ఇంక చతుర్థాశ్వాసమున వేశ్యామాత కుమార్తెలకు వారవనితా ధర్మములను బోధించు ఘట్టమునందును శృంగార రసము పరిపోషితము. ఉదాహరణకు ఇందు కొన్ని పద్యములు.

గీ. చిరు నాలుక, బలము రాజీవ దళము,
నడుసు గుమ్మరి పురువు దేహంబు, గచ్చ
కాయ బూచిద బొరయును కరణి విటులఁ
గలసియును గలయకుండంగ వలయు లలన
(చ.ఆ. 28 పద్యం)

చ. జిగురున బద్దరాచిలుక చెల్వున, సంపెగ పువ్వుతావికిం
దగిలిన మిండ తుమ్మెద విధంబునఁ, దేనియ జిక్కినట్టి యీ
గ గరి, విటుండు కూర్మిదన కౌగిటి పొందున జిక్కకున్న, న
మ్మగువకు నేల యిచ్చు నసమాన ధనంబులు రిత్తమాటలన్?
(చ.ఆ. 29)

సీ. మణిమంత్ర తంత్రము, ల్మందులు, మాయలు,
సరస భాషలు, వృథా సంభ్రమములు
దెచ్చికోలేడ్పులు, నిచ్చకంబులు, వట్టి
యానలు దక్కులు, నలస గతులు,
నలుకలు, దరితీపు. లాసలు, ప్రియములు
నగవులు, బిగువులు, నయము, భయము
బలిమియు, జెలిమియు, బాసలు, ననుపులు
దిట్టులు, గొట్టులు, దిట్టదనము,

గీ. జాయవాటులు, సన్నలు, గాయకములు
మెచ్చులును, దచ్చనలు, పౌర పొచ్చెములును
దగవులును, వారకాంతా వితానములకు
జలజ లోచనలార! నైసర్గికములు (చ.ఆ. 80)

క. ననుపు విటుని దక్కుచు, నా
తని చెలికానికి ప్రియంబు దగ జెప్పిన, న
వ్వనితపయి న్విఱుగదు మన,
మనుమానము లేదు ధనము ననువుగ జేరున్
(చ.ఆ. 81)

ఈ విధముగా ధూర్జటి తన కావ్యమున శృంగారమును బోషించినను భక్తి భావమునకు లోటు రానీయక కావ్యమంతయు తన శివభక్తిని దాటి భక్తిరసమే పరిపోషితమైనదా యనుభావన కల్పించెను. పూర్వాచార్యులు భక్తి రసముగాదని నుడివిరి. "రతిర్దేవాది విషయా వ్యభిచారీతథాం జతః భావః ప్రోక్తః" అని యుండుటచే దేవతా విషయకమగు రతిభావముగాన భక్తిభావమేయని చెప్పిరి. భక్తి రసముగాదని సిద్ధాంతమును ప్రతిపాదించినవాడు ధనంజయుడు. సాహిత్య శాస్త్రకారులలో నిరువురు మాత్రమే భక్తికి రసత్వ మంగీకరించిరి. వారిలో మొదటి వాడు "ఉజ్జ్వల నీలమణి" కర్తయగు వంగదేశీయుడు రూప గోస్వామి. రెండవ వాడు మధుసూదన సరస్వతి.

రూపగోస్వామి "పృథగేవ భక్తి రసరాట్ సవిస్తరేణోచ్యతే మధురః" అని ప్రతిజ్ఞ చేసి మధురము, ఉజ్జ్వలము నను పేరితో భక్తి రసమును విస్తరించి తెలిపెను. కాని యీ భక్తి శ్రీకృష్ణ గోపీ విషయకము. శృంగార రూపము. దీనికి చిత్త ద్రవము స్థాయీ భావము. ఇతర శృంగారముపాదేయముగాదు. కాని శ్రీకృష్ణ గోపీ విషయకమగు రతియుపాదేయమనియు సది భక్తి రసమనియు నాతని మతము ఇది నిజముగా భక్తిగాదు భక్తిలో నేకదేశము. కాని "మధుసూదన సరస్వతి" తన హరి భక్తి రసాయనమను గ్రంథమున ప్రతిపాదించిన భక్తిసంపూర్ణమైనది. ఉదాత్తము. అతడు ప్రమాణ ప్రమేయోపన్యాస పూర్వకముగా భక్తికి రసత్వము స్థాపించెను.

ఇక కాళహస్తి మాహాత్మ్యమున భక్తిభావమెట్లు జాలువారినదో కొన్ని యుదాహరణలు పరిశీలింతము. శ్రీకాళహస్తులు శివైక్యము బొందిన కథలును, నక్కీరుని చరిత్రయును భక్తిరస నిలయములు. ఇందు పరీక్షుడు భక్తితో సల్పిన యీశ్వర స్తోత్రమును, బ్రహ్మహత్యా నివారణము కొరకు శివుని స్తుతించిన పథమును, అగస్త్యుడు సువర్ణముఖిం దెచ్చు కథయు భక్తి రసపూరితములు, హృదయంగమములునై యొప్పుచున్నవి. అన్నిటికి మించిన భక్తి తన్మయత తిన్నని మోక్ష గాథ. తిన్నని యాద్గ్రిత కవి భక్తిరసావేశమున సహృదయంగమమైన అమృతమును గురిసినది. తిన్నని బాల్యమునుండి శివభక్తి లక్షణములున్నట్లు కవి వర్ణించినాడు. తిన్నని తల్లి గర్భచిహ్నములందు పుట్టుక యందు కవి తిన్నని వర్ణించిన తీరు గమనించిన కవి శివభక్తి ఎట్టిదో కూడ మనకు తెలియగలదు.

సీ. భసితాంగ రాగ శోభా విలాసంబుతో
  ప్రతివచ్చువానన పాండుగరిమ,
కంఠహాలాహల కాళి మచ్చువితోడ
  నెనవచ్చు గుబ్బచన్మొనల నలుపు,
పరశివాకృతి తోడ సరివచ్చునలు
  తరంబైన జాలిఘనతరంబైన నడుము,
స్వస్వరూప వివర సంప్రాప్త కాంతితో
  మార్పడుజిలై భమాన జడిమ,

తే. సరససానంగ సంక్రీడ జరుగనీక,
దౌహృదము "గర్భమున నున్న తనయుడీశు
డై ప్రకాశింప గల"డని యవుడు
తెలుపుకరణి బెంపొందె నమ్మందగామినికిని

(తృ. ఆ. ౨౬)

ఇంక తిన్నని బాల్య వర్ణన యందును కవి భక్తి భావము ఒప్పిం జేసినాడు

సీ. శివభక్తి రహితమై చెడియెజంగం బని,
నవ్వినట్లొయ్యన నవ్వసాగె,
ధృతిమోహ బంధంబు దెగదన్నుగతి
ముద్దుటడుగు లెత్తి విదిల్చికాలదాచె,
భవపరాఙ్ముఖుడైన పగిది సత్త్వము గూడి
పొత్తుల పాన్పుపై బొరలబడియె,
శ్రేయోమహారాజ్య సింహాసనంబున
నుండు చందమున గూర్చుండ దొడగె,

తే. దడవియాడె వసుంధరా స్థలమునందు
విశ్వపతి తత్త్వమను మణివెదకురీతి,
దత్ప్రకారి జగత్పూర్ణదారు భీతి
నడుగువెట్టెడు గతిదప్పటడుగు వెట్టె (తృ. ఆ. ౪౦)

ఇంక తిన్నడు శివుని ఒడు మూరు నమ్మని ప్రార్థించు ఘట్టమున భక్తిభావము పెల్లుబుకుచున్నది.

శా. ఓసామీ! యిటువంటి కొండరిలో, నొంటింబులుల్ సింగముల్
గాసిం బెట్టెడు కుట్రనట్టడవిలో గల్లువ్వి క్రీనీడ, నే
యాసంగట్టితి వేదిగర్భనిలు? నీవాకొన్నచో గూడునీ
శ్లేషుట్టంబులు తెచ్చిపెట్టెదరు? నీకిందేది కేలింగమా

(తృ. ఆ. ౮౬)

శా. ఇల్లో, ముంగిలియో, యనుంగుజెలులో, యూడైన, చుట్టంబులో,
యుల్లాలో, కొడుకో, ధరింపవశమే, యేపోదుముల్లేక? మా
పల్లెంగోరిన వెల్లనుంగలవు తెప్పల్గాగ, నీకిచ్చెదన్
జెల్లంటో! యిట నొందినుంః కటువిచ్చేయంగదే లింగమా
(తృ. ఆ. 70)

మ. నను మన్నించెదవేసి నీవిపుడు రా నావెంట, రాకుండినన్
నినునేలాసి చనంగనోప, నిచట న్నీతోడిదే లోకమై
మనువాడం, గనువాడనీకరుణ, నీమౌనంబు చిత్తంబున
చ్చినచో మానదుగాని, నిన్నిపుడు కస్తింజెట్టనాకేటికిన్
(తృ. ఆ. 72)

అంతను అట్లే ప్రార్థించుచు "నాకుం జూడగ తల్లిదండ్రులు చెలుల్ నాథుండు నీదైవమేయని నమ్మి మూఢ భక్తితో నర్పింపదొరకొనును. ఎన్నేండ్లనుండియో పస్తున్నాడీతడని చింతించి 'దేవదేవునకు భక్తిం దృప్తిగావింప నాసన్నగ్రావ మహాటవుల్ తిరిగి చివిన్ చెన్నైయుండెడి మాంసఖండములదెచ్చి 'యారగింపుమని ప్రార్థించును. తనభక్తి తన్మయత బయల్వెర 'ఆకలిగాదో? భక్తిన్ తేకువగం నాడగానో? తినవేలా? యని కాలవో క్రావ్యవో, మాడంగాలెనో, చవిగావో కమ్మగావో, కాలవో యలవరవో యని ప్రశ్నించి 'నీవారగింపకుండిన జీవన మేమిటికి నాకుశివ' యని వాని పాదములపైబడును ఇచట తిన్నని భక్తి పరాకాష్ఠనందుకొన్నది. విల్లొకచంక, నంపపొది వీపున దొప్పలు కేలుదోయి, బుక్కిళ్ళ పవిత్ర కాంచన ముఖీజలమొప్పగా తడంబు మజ్జనముజేయుచు, కరకుట్లు నారగింపుమని శివుని ప్రార్థించు తిన్నని భావప్రతిమ కన్నులకు గట్టినట్లున్నది. తిన్ననిభక్తి శివబ్రాహ్మణునికి జూపనెంచిన శివుడు కంటవెంట కోణితముం గార్చ, తిన్నండార్తింబొంది, పసరులు దించి, పిసిగి వేసారి, తుదిని తన కన్నొక దానిం దవిలించిపెట్టి రెండవకన్ను నట్లే కాగ చెప్పుగాం నిటలాక్షుని కన్గొనదన్నిపట్టి, సునిశిత బాణమున తనరెండవకన్ను బెకలింప బూనెడి తిన్నని యనన్య సామాన్య మూఢభక్తి యిచట పరాకాష్ఠ నందినదనియే చెప్పనగును.

చతుర్థాశ్వాసమున వారవనితల భక్తికూడ గొప్పది వారిని శివ స్వరూపులుగా ధూర్జటి చిత్రించినాడు.

ఉ. ముట్టని చిత్తజాతుశరముల్ దెలిగన్నులు, రాజకీరముల్
ముట్టని పక్వబింబములు మోవులు, చన్నులు మిండతుమ్మదల్
ముట్టని పుష్పమంజరులు, మోములు రాహువుదంష్ట్రికాగ్రముల్
ముట్టని చంద్రబింబములు ముట్టని లింగములౌట చిత్రమే?

(చ. ఆ. 47)

వేశ్యాతనయలేమిచేసినను, దానిని భగవత్పరమైన దానిగనే భావించుట వారిభక్తిభావమునకు ప్రతీక. ఇట్లే ప్రబంధమునందలి పాత్రములన్నిటి యందును భక్తిబాగుగా పరిపోషింపబడి చివరకు సర్వము శివార్పణ గావింపబడి తదైక్యము సాధింపబడినది. ఇదియే శాంతరస పరమావధి.

ఇంక నత్కీరుని కథలో నత్కీరుడు సుబ్రహ్మణ్యస్వామిని స్తుతించిన ఘట్టమున భక్తిభావము పెల్లుబుకుచున్నది.

క. ఓశరజాగతవత్సల!
కాశవనప్రభవ! దీనకల్పక! యాప
న్నాశకర! దురితగిరిదే
వేశ! ననుంగరుణ జూడవే సుఖిసగుదున్

(తృ. ఆ. 210 పద్యం)

నత్కీరుని భక్తిభావమిందు వ్యక్తమగుచున్నది.

ఇంక ముండిత శిరస్కయగు దాసికి మిండజంగమ హస్త మస్తక సంయోగమున మరల శిరోజములు వచ్చుటయందును గుడిలో ప్రవేశించిన వేశ్యా తనయులు అంతర్హితులగుటయందును, ఇంక నత్కీరుని తీర్థయాత్రా సందర్భ మున భూతమునకు చిక్కు ఘట్టమునందును అద్భుతరసము పోషింపబడినది. నత్కీరుడు మఱ్ఱిచెట్టు నీడకూర్చుండ నచట "తద్వటంబున నుండి రాలిన పండుటాకులు బట్టబయలుబడినయపు విహంగంబులు, జలంబునబడిన యవి మీనం

బులునై పోవనం బొక్క పలాశంబు జలాశయంబున సగమును, దట ప్రదేశంబున సగమునుబడి, మీన పక్షిత్వంబులంగై కొని, లోపలికి న్వెలు పలికిం దివియు చమత్కారంబు నక్కిరుందు చూచి యద్భుతరస పరవశుండై యుండె" అని కలదు. ఇచట అద్భుతరసము చక్కగా పరిపోషితము. ప్రథమాశ్వాసమున ముండిత శిరస్కయగు దాసి విలపించుటలో కరుణరసము పొడకట్టుచున్నది. ఆ ఒక్క సందర్భమునందే కరుణము కనబడుచున్నది. తృతీయాశ్వాసమున శబరకాంతలు మధుపాన మత్తచేష్టితలైన సందర్భమున కొంత హాస్యము కన్పట్టుచున్నది.

సీ. మాటలాడదలంచి మఱచిపోయెడువారు,
నడవబోవుచు దొట్రుపడెడివారు,
నూరకుండెదమని యుండనోపనివారు
లేచెదమని లేవలేనివారు!
బనిలేనిపని బట్టబయలు దిట్టెడి వారు,
బాడనేరకయును బాడువారు,
నెదురైన వారికి నెల్లమ్రొక్కెడివారు,
వ్రీడావిహీనులై యాడువారు,
గీ. బాలద్రావియు మగుడ జేసాచువారు
దొడరయుపదంశ ఖండబుల్ద్రొడుకు వారు
వైరి, మృగయాధిదైవత యాత్రయందు
బానములుచేసి శబరదంపతులు రతుల

(తృ. ఆ. 41)

ధూర్జటి కొన్ని పట్టులరసము వాచ్యముగా చెప్పెను. ద్వితీయాశ్వాసమున (67 పద్యమున) 'వీరరసమొక్కెడు' అనిగలదు. మరియు (72 పద్యమున) శాంతరసరూపమయ్యె. అదే ఆశ్వాసమున 146 పద్యంబున 'కారుణ్యరసతరంబగు' తృతీయాశ్వాసమున 'అద్భుతరసాసహము' అని వాచ్యముగా చెప్పెను.

ఈవిధముగా ధూర్జటి 'శ్రీకాళహస్తీశ్వర' మాహాత్మ్యమున కడుచమత్కారముగా రసపోషణము గావించెను.

కాళహస్తీశ్వర శతకము - రసము

శ్రీ కాళహస్తి మాహాత్మ్యము వలెనే కాళహస్తీశ్వర శతకము కూడ శాంత రసభరితమైనది. భక్తి భావ బంధురమై శాంతరస ప్రధానమై యొప్పుచున్నది శతకము. భక్తి భావమే ప్రధానముగా అన్ని పద్యములందును గోచరమగును ఒకటి రెండు తావుల మాత్రము భీభత్సము, వీరము పొడకట్టుచున్నవి.

భాగవతమున వివిధ భక్తులీ విధముగా జెప్పబడినవి.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్
(భాగవతము సప్తమ స్కంధము)

ప్రేమించుట, వినుట, భృత్యుడగుట, మ్రొక్కుట, పూజించుట, పరిచరించుట, తనలో నెయుక గలిగియుండుట, కీర్తనము, ధ్యానము అను నీ తొమ్మిది భక్తి మార్గములు చెప్పబడినవి. ఈ నవవిధ భక్తులలో నేదోయొక భక్తి భావము వివిధ పద్యములలో గోచరమగుట ఈ శతకములోని విశేషము. భక్తి భావముతో గూడి శాంతరస ప్రధానములగు పద్యములనింటుక పరిశీలింతము.

నీనాసందోడబాటు మాట వినుమా నీచేత జీతంబునే
గానిం బట్టక సంతతంబు మదివేడ్కన్గొల్తునంతస్సప
త్నానీకంబున కొప్పగింపకుము నన్నాపాటియే చాలుదే
జీనొల్లం గరినొల్ల నొల్ల సిరులన్ శ్రీకాళహస్తీశ్వరా! (కా. శ. 4)

ఈ పద్యమున ధూర్జటి కేవలము నిస్వార్థ భక్తితో శ్రీకాళహస్తీశ్వరుని వేడుకొనుట వెల్లడియగుచున్నది. క్రోధ మద, మాత్సర్యాదులకు తను బానిస కాకుండునట్లు తన్ను కాపాడుమని కాళహస్తీశ్వరుని వేడుకొనుచున్నాడు. తా నేవిధములైన బహుమతులుగాని, వరములుగాని దేవుని వేడలేదు. తనకు కావలసినంత ఆత్మ

నిగ్రహము నొసంగుమని దేవుని ప్రార్థించుచున్నారు. ఇందు నిర్వేదము స్థాయిగా వున శాంతరసమే ఇందు ప్రధానము. ఇట్లే తర్వాత పద్యము.

భవకేళీ మదిరా మదంబున మహాపాపాత్ములై వీరు న
న్ను వివేకింపరటంచు నేనునరకార్ణోరాశి పాలైన బ
ట్టవు; బాలుండొకచోట నాట తమితోడ న్నూతగూలంగ దం
డ్రి విచారింపకయుండునా! కటకటా! శ్రీ కాళహస్తీశ్వరా! (౯)

మానవులు సంసార లంపటులై భగవంతుని స్మరించుటయే మరచి పాపములకు దాసులగుచున్న సమయమున భగవంతుడు చూచుచూ ఊరకొనుట మంచిదికాదని, భగవంతుని కర్తవ్యమును ధూర్జటి ఆయనకు గుర్తు చేయుచు పిల్లవాడు బావిలో పడిన తండ్రి యూరకుండునా? యని ప్రశ్నించు చున్నాడు. ముక్తి మార్గము చూపుమని భగవంతుని వేడుటయే యిందలి తాత్పర్యము. ముక్తిమార్గము సూచితము గనుక ఇందు కూడ శాంత రసము పరిపోషితము.

ఈశ్వరాయత్తమైన చిత్తము క్షణికమైన సుఖముల నాశించదని పోతన మహాకవి చాటెను. ధూర్జటి కూడ శ్రీకాళహస్తీశ్వర సేవామృత పానమత్త చిత్తుడు. "రాజుల్ మత్తులు వారిసేవ నరక ప్రాయం" బని నిర్భయముగా చాటెను. వారిచ్చు నంబోజాక్షీ చతురంతరయాన తురగీ భూషాదులాత్మవ్యథా బీజములని గుర్తించెను. వీనికై నృపధామ ద్వారదేశంబు గాచి దినములు వ్యర్థముగా గడుపు కవులను ధూర్జటి విమర్శించెను. కుటుంబ సంరక్షణార్థమై రాజాస్థానముల స్తోత్రము జేయనొల్లనని శపథ మొనర్చుటయేగాక 'నీ కుంగాక కవిత్వమెవ్వరికి నే నీనంచు మీఁదెత్తితిన్' అని తన సంకల్పమును కాళహస్తీశ్వరునకు విన్నవించెను. తీర్థ యాత్రలు ముక్తి నొసగలేదని ధూర్జటి నిర్ణయించుకొనెను. కాళహస్తీశ్వరుని పట్ల నిశ్చలమైన భక్తి కుదురుటకు ఇంద్రియ నిగ్రహమవసరమని గుర్తించి అట్టిశక్తిని ప్రసాదింపుమని ధూర్జటి ఎన్నో విధముల కాళహస్తీశ్వరుని అర్థించెను. పరమేశ్వరుని మెప్పించిన భక్తులు కవులు మాత్రమే తనకు బంధువులని విశ్వసించెను.

హృదయమున వైరాగ్య భావము స్థిరముగ నిలిచిన తరువాత ధూర్జటి నిశ్చలమైన ధ్యానము చేతను కవితా శక్తి చేతను ముక్తిని సాధించవచ్చునని విశ్వ

సించెను. ఈశ్వరార్చనకు తగిన సాధన సంపత్తి తన కవితకు గలదని ధూర్జటి భావించెను.

ముక్తిని సాధించుటకు వేదశాస్త్ర పఠనాదులనవసరములనియు ధూర్జటి విశ్వసించెను. కాళహస్తీశ్వరుని సేవించి తరించిన లూత ఏ వేదము పఠించలేదు కద? భుజగమే శాస్త్రాధ్యయన మొనర్చెనని ఆతడు తనలో తాను ప్రశ్నించుకొని నిశ్చల భక్తికే ప్రాధాన్యము నొసగెను. తిన్ననివలె ఈతడును పరమేశ్వరుని మందలించెను. భక్తులు నానా విధములుగ సేవించుచుండ వారి కోర్కెలు తీర్పక లోభమేమిటికి? అని పరమార్థం బిచ్చి పొమ్మన్న నీ శ్రీ భండారములో గొరంత పడునా అని సూటిగా ప్రశ్నించెను తనను నిరాదరించి వెడలగొట్టినచో "మారు పట్టు" కొని ప్రేలాడుదునని హెచ్చరించి తనకుగల వజ్ర సంకల్పమును వ్యక్తి కరించెను, ఇట్లే శాంత రసప్రధానములు కొన్ని భక్తి భావ పూరితములు యగు పద్యములు ఈ శతకమున గలవు. ఒకచోట కరుణరస పూరితమగు ఆక్రందనతో కూడిన పద్యము కూడ గలదు.

ఎన్నేళ్ళుండుదు నేమిగందునిక నేనెవ్వారి రక్షించెదన్
నిన్నే నిష్ఠభజించెద న్నిరుపమోన్నిద్రప్రమోదంబునా
కెన్నండబ్బెడు నెంతకాల మింక నేనిట్లున్న నేమయ్యెడిన్
జిన్నంబుచ్చక నన్నునేలుకొనవే శ్రీ కాళహస్తీశ్వరా! (88)

భక్తియనునది భావమేననియు రసముకాదని ఆలంకారికులు పేర్కొనిరి.

మధుసూదన సరస్వతి భక్తి రసాయన మను గ్రంథమున భక్తిస్వరూప స్వభావ తత్త్వములను చక్కగా వివరించెను

"ద్రుతస్య భగవద్ధర్మాద్ధారావాహికతాంగతా
సర్వేశేమనసోవృత్తిర్భక్తిరిత్యభిదీయతే"

అని యాతడు భక్తి కొసగిన నిర్వచనము.

స్వభావముచే లక్కవలె గఠినమైనదనియు, నిప్పు సెగచే లక్కవలె తాపలకముకు కామక్రోధాది విషయములు తోడియోగముచే నది ద్రవత్వము

నొందునని నాతడింకొక శ్లోకమున జెప్పెను. భగవంతుని గుణరూపాది వర్ణనము లను వినుటచే గామ క్రోధాదులుద్దీపితములై భక్తుల చిత్తములకు ద్రవత్వము నాపాదించును. అట్లు ద్రుతమై సర్వేశ్వరుని యందు వర్తించు మనస్సు యొక్క వృత్తియే భక్తియని యాతని యభిప్రాయము. ద్రవత్వము నొందిన చిత్తమున ప్రవేశించిన వస్త్వాకారము స్థిరముగా నుండిపోవును గాన స్థాయి భావమను పేర బరగుచున్నది. ఇది విభావాను భావ వ్యభిచారి భావములచే బరిపోషము నొంది బ్రహ్మానందాత్మకమైన రసమై సహృదయులకు బారవశ్యము కలిగించుచున్నది.

భక్తిరసమునకు భగవంతుడాలంబన విభావము. తులసీ చందనాదు లుద్దీపన విభావములు నేత్రభ్రువిక్షేపాదు లనుభావములు. నిర్వేదాదులు వ్యభిచారి భావములు. ఈ విభావాను భావ సంచారీ భావములు ద్రుత చిత్తమున ప్రవేశించి స్థాయిత్వము నొందిన భగవదాకారతారూపమైన మానసవృత్తిని పోషించి పరమానంద సాక్షాత్కారాత్మకమైన భక్తిరసమును ప్రతీయమాన మొనరించును.

భగవంతునిపైగల భక్తి వివిధ భావములలో వ్యక్తము చేయబడుచుండును. అందు శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మాధుర్య భావములు ముఖ్యములైనవి. ఇందేభావముతో గూడిన భక్తియైనను నిస్తారకమైనట్టిదే శాంత భక్తి తపోనిధు లును, వీతరాగులునై యుండు నారదాది మునీంద్రులందు గోచరమగును. ధూర్జ టియు నిట్టి కోవలోని వాడే యని చెప్పనగును. శతకమునందలి పద్యములు పెక్కులీరని శాంత భక్తికి నిదర్శనములుగా దోచుచున్నవి.

నిప్పైపాతక తూలరాశి బడచుప్పీనామము న్నానపుల్
దప్పన్ దవ్వుల విన్నె నంతకభుజాదర్పోద్ధత క్లేశముల్
తప్పుందారును ముక్తులౌదురని శాస్త్రంబుల్మహాపండితుల్
చెప్పంగా దమకింక శంకవలెనా! శ్రీకాళహస్తీశ్వరా (10)

ఇందు ధూర్జటి భగవంతుని మాహాత్మ్యమను గొప్పతనమును దాటి చెప్పినాడు. భగవన్నామము వినినంతనే, శ్రీకాళహస్తీశ్వరుని స్మరించినంతనే ముక్తి లభించు నను భావము వ్యక్తీకరించినాడు. ఇందుకూడ శాంతమే పరిపోషితము. నిర్వేదము స్థాయీ భావము. ఇంకను శాంతరసము చిప్పిలు పద్యము చూతము.

నిను సేవింపగ నాపద ల్పొడమ నీ నిత్యోత్సవం బబ్బ నీ
జన మాత్రుండన నీమాహాత్మ్యదన నీ సంసార మోహంబుపై
గొనని జ్ఞానము గల్గనీ గ్రహగతుల్ గుందింపనీ మేలు వ
చ్చిన రానీ యవి నాకు భూషణములో శ్రీకాళహస్తీశ్వరా! (12)

దినముం జిత్తములో సువర్ణముఖరీతీర ప్రదేశామ్ర కా
నన మధ్యోపల వేదికాగ్రమున నానందంబునం బంకజా
సన విష్ణున్నిను జూడగన్న నదివో సౌఖ్యంబు, లక్ష్మీ విలా
సిని మాయా నటనల్ సుఖంబులగునే? శ్రీకాళహస్తీశ్వరా! (85)

ఒకటి రెండు తావుల బీభత్సరసము వర్ణితము. ఉదా॥

నీకున్మాంసము వాంఛయేని కఱవా నీచేత లేడుండగా
జోకై నట్టి కుఠారముండ ననలజ్యోతుండనీరుండగా
పాకంబొప్పఘటించి చేతిపును కన్భక్షింపకా బోయచే
జేకొంటెంగిలి మాంసమిట్లు తగునా! శ్రీకాళహస్తీశ్వరా! (20)

ఇంకొక చోట

మల భూయిష్ఠ మనోజధామము సుషుమ్నాద్వారమో యారుకుం
డలియో, పాదకరాక్షియుగ్మములు షట్కంజంబులో మోముపై
జలజంబో నిటలంబు చంద్రకళయో సంగంబు యోగంబొ గా
సిలి సేవింతురు కాంతలన్ భువిజముల్ శ్రీకాళహస్తీశ్వరా! (49)

పై రెండు పద్యములందు బీభత్సరసము పరిపోషితము. ఈ శతకము నందలి ప్రతిపద్యము ధూర్జటి లోకానుభవమును అనుభూతిని దర్శింప జేయు చున్నది.

పన్నెండవ ప్రకరణము

ధూర్జటి వ్యక్తిత్వము

కవియొక్క వ్యక్తిత్వము సాధారణముగా అతని గ్రంథములపై నాధార పడి యుండును. అట్లే ధూర్జటి వ్యక్తిత్వము ఈతని కృతులలో ప్రతిబింబించు చున్నది. శతకమునందు కూడ పలుతావుల ఈ కవి వ్యక్తిత్వము గోచరము. ధూర్జటి జీవితానుభవముల కీశతకము చక్కని ప్రతిబింబమన వచ్చును. శైవభక్తి, ఆత్మాశ్రయత్వము, రాజనింద, వైరాగ్యము ఇత్యాది విషయము లన్నియు ఈశత కమున పొందుపరుప బడినవి. శ్రీకృష్ణదేవరాయల వారు వైష్ణవ మతాభిమానియై నప్పటికిని సర్వమతముల వారి నాదరించి వివిధ భాషాకవులను తన యాస్థానము నకు రప్పించి గౌరవించెడి వారనియు, ధూర్జటిని యట్లే ఆదరించెననియు మనకు విదితమే. ధూర్జటి కవితా శక్తియు కూడ అతని నాదరించుట కొక కారణమై యుండవచ్చును ధూర్జటి మాత్రము శ్రీకాళహస్తీశ్వరునే నమ్మి ఆపరమాత్మునకే తన కృతి నంకిత మిత్తునని ప్రతిజ్ఞ పట్టిన మహాభక్తుడు.

ధూర్జటి మహాకవిది విజయనగరమా? లేక శ్రీకాళహస్తియా? యను విష యము పరిశీలింపవలసి యున్నది. ధూర్జటి జన్మస్థలము శ్రీకాళహస్తియనియు మధ్యకాలములో విజయనగరమునకు వచ్చి కృష్ణరాయల యాస్థానము నందుండి తరుపరి అనంతర రాజుల పరిపాలన కాలములో విజయనగరము వీడి చివరకు మరల కాళహస్తి చేరెనని అతని కావ్యములను బట్టి ఊహించుట కవకాశముగలదు. అయితే విజయ నగర మెందులకు వీడెనను ప్రశ్న ఉదయించును. రాయలు కవుల నాదరించి పోషించినట్లు అతని తరువాతవచ్చిన రాజులు చేసియుండక పోవచ్చును ధూర్జటి మనస్సు ఏ సంఘటనల వల్లనైనను గాయపడి రాజాస్థానములన్న ఏవ గింపు కలిగి తాను నమ్మిన దైవ సాన్నిధ్యమునకే చేరవలెనని ఆకాంక్షతో శ్రీకాళ హస్తి జేరి యుండవచ్చును. ధూర్జటి వంశాదికములు యను విషయము గూర్చి వ్రాసిన ప్రకరణములో ధూర్జటి యింటిపేరు తదితర విషయములు వ్రాసితిని.

అతని శైవభక్తి రాజాస్థానములో నున్న సమయము నందు కూడ కొనసాగి రాజాస్థానము వీడు సమయమునకు పరాకాష్ఠ నందినదని చెప్పనగును. ఈ పరిణత దశయందే శతకరచన చేయుటయు, పూర్వ జీవితానుభవము లన్నింటి నందు పొందుపరచెనని శతకము వలన తెలియుచున్నది. వేశ్యం పట్ల కూడ విరక్తి కలిగినదీ సందర్భమునకే. వేశ్యంతో పరిచయము, ఆనాడు భోగపరాయణత్వమునకు సూచనగా కన్పట్టును. కాని తప్పుగా ఎంచవీలులేదు. ఈ కవి వేశ్యాలోలుడన్నంత మాత్రమున అతని భక్తికిగాని వాక్శుద్ధికిగాని, కీర్తికిగాని ఎట్టిభంగము కలుగదు. ఈ సందర్భము లోనిదే యనిపించు పద్యమొకటి శతకమునందు గలదు. "కాయ ల్గాచె వధూనఖాగ్రములచే" (కా. శ. 14)

ఈ పద్యమందు ధూర్జటి వ్యక్తిత్వము కూడ కొంత కాననగును. తన పూర్వజీవి తానుభవములు కొద్దిగా సూచన ప్రాయముగ ఇందుకవి చెప్పినట్లు తోచుచున్నది. యౌవ్వన ప్రారంభము నుండి వయసు మరలువరకు స్త్రీలోలుడై పనికిరాని సుఖముల కాశించి వృధాగా కాలము గడిపితిననియు కనీసము ఇప్పుడైనను విరాగిగా జేసి ముక్తినిమ్మని కవి ఈపద్యమున శ్రీకాళహస్తీశ్వరుని వేడుకొనుచున్నారు.

"నిన్నే రూపముగా భజింతుమదిలో నీ రూపు మోకాలో స్త్రీ
చన్నో కుంభము మేకపెంటికయో యీ సందేహముల్మాన్పి నా
కన్నారన్భవదీయ మూర్తి సగుణాకారంబుగా జూపవే
చిన్నీరేజ విహారమత్తమధుపా శ్రీకాళహస్తీశ్వరా!

(కా. శ. 16)

పరమేశ్వరుడు సర్వాంతర్యామి. తన భక్తులు తన్ను కోరిన రీతిని సేవించనచోట నచటనే తప్పక ప్రత్యక్షమగును. అకలంక మూర్తియని దీని భావము ఇందు చిన్న పూర్వ కథ సూచితము. ఒకతరి అర్జునుడు శివధ్యానమునకై ప్రదోష కాలమున ఆలయమునకేగు దరి కృష్ణుడు అతనిని పరీక్షింప భక్తుడవైన నీవు శివుని ధ్యానించుటకు ఆలయమునకే పోవనక్కరలేదు. శంకరుడు ఇచటలేడా! అని అనగా అర్జునుడు శివునిగా దేవుని భావించి పూజింపమని అడుగగా కృష్ణుడు తన మోకాటిని చూపెను. నిష్కళంకమైన భక్తితో కృష్ణుని మోకాటిని శంకర భావనతో పూజచేయగా అర్జునుని భక్తికి పరమేశ్వరుడు ప్రత్యక్షమగును.

ఒక జారుడు మహాశివరాత్రి పర్వదినమున అతని వేశ్యతో కలిసియున్న సమయమున ఆమె ఆపర్వదినమున అందరును శంకరునకు సేవలు చేయుచుండగా "మీరు ఇట్లు ఉపేక్షించుట తగునా 'యని అడగెనట. అందులకు శివుని పూజించుటకు దేవాలయమునకే పోవనక్కరలేదు. ఈశ్వరుడు సర్వాంతర్యామి అనగా ఆమె 'చూపు'మని యడిగెను. అపుడు అతడు ఆ వేశ్యాయొక్క స్తనమునందు ఈశ్వరుని రూపమును భావింపగా అతని భక్తికి మెచ్చి శివుడు అక్కడ స్తనేశ్వరుడుగా ఆవిర్భవించెను. నేటికిని పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట గ్రామమందు పెద్ద శివాలయము గలదు. ఇచటనే శివుడు స్తనేశ్వరుడుగా ఆవిర్భవించెనని చెప్పుదురు. ఈ కథ బహుశ దీనికి సంబంధించినదే కావచ్చును. నేటికిని అచట శివరాత్రి మహా పర్వదినమునందు గొప్పతీర్థము జరుగును. అనేక మంది ప్రజలు ఆ దినమున ఆలయమున కొచ్చి దైవదర్శనము చేసికొని జాగరణ మొనర్చుట చూచుచుందుము. ఇటులనే ఒక గ్రుడ్డివాడు కుంచమును శివలింగముగా ఆరాధింపగా శివలింగము ప్రతిష్ఠితమై కుంచేశ్వరుడుగా ఆవిర్భవించెను. ఇటులనే ఒక బ్రాహ్మణ ప్రభావితుడైన గొల్లవాడు ఒక మేక పెంటికను ఈశ్వరలింగముగా భావించి పూజచేయుచుండెను. తదుపరి తండ్రి ఆ విషయము తెలుసుకొనగోరి ఆ ప్రదేశమునకేగగా అచట ఒక దివ్యలింగము ఆవిర్భవించి వుండెను. ఆ గొల్లవాని భక్తికి మెచ్చి ప్రత్యక్షమైన దైవముగాన ఆ గొల్లవాని పేర (కాటడు) అతని కొడుకు పేర కూటేశ్వరుడుగా వ్యవహరింపబడుచుండెను. ధూర్జటి విజయనగరాస్థానమునయుండగా మోహిని యను వేశ్య స్తనమునందు శివలింగము నావిర్భవింప జేసినట్లు నోరి నరసంహశాస్త్రిగారు [1]తమ 'ధూర్జటి' యనునవలలో వ్రాసిరి. ఇది కల్పితమే కావచ్చును. కాని ఈ పద్యము చదివినప్పుడీ విషయము తలంపుకు వచ్చుచున్నది. ఆదియును గాక ఆవేశ్యా పుత్రికల తల్లి ధూర్జటి కావ్యమందుగల మాణిక్యవల్లిగను, పుత్రికలు మోహిని, మదనికలుగను తలంపునకు వత్తురు. ఈ విషయము స్వప్రమాణముగా నిరూపించుట కాధారమేమియు లేదు ఊహ మాత్రమే. ఇంకను ధూర్జటి ఈ శతకమునందు తన తప్పులను మన్నించి మోక్ష మార్గమును చూపమని అనేక విధముల శివుని వేడుకొనును. ఇట్లు వేడుకొను సందర్భమునందీ కవి వైరాగ్యము మనకు వెల్లడియగుచున్నది.

---

1. 'ధూర్జటి'-నవల; నోరి నరసింహశాస్త్రి గారు

నీ రూపంబు దలంపగా దుదిమొదల్ నేగాన నీవైనచో
రారమ్మని యెంచు జెప్పవు వృథారంభంబు లింకేటికిన్
నీ రమ్యంబుగు పాలమ్ముంపు మిక నిన్నే నమ్మినాడం జుమీ
శ్రీరామార్చిత పాదపద్మ యుగళా శ్రీకాళహస్తీశ్వరా! (19)

ఈ పద్యమందు భక్తితో కూడిన వైరాగ్య భావము తాత్త్విక విశేషములే సూచింపబడినవి. కవి యిట్లనుచున్నారు. ఈశ్వరుని రూపము మనస్సులో భావించగా ఏది ప్రారంభమో ఏది అంతమో తెలియక పోవుచున్నది. ఈశ్వరుడు ఆద్యంత రహితమైన స్వరూప స్వభావములు గలిగిన వాడు కదా! ఇక ఈశ్వరుడైనను భక్తుని ఆహ్వానించి తన స్వరూపమును గురించి చెప్పుటలేదు. ఈ ప్రయత్నములన్నియు ఇంక నిష్ఫలమే. తనను నీటముంచినను పాలముంచినను అనగా సుఖదుఃఖములలో ఏది కలిగించినను ఈశ్వరునిదే భారమని భక్తుని రూపముగా కవి ఈశ్వరునికి నివేదించు కొనుచున్నారు.

ఇంకనూ ధూర్జటి "పరమేశ్వరా! నీకు మాంసమును ఆరగించవలెనన్న రుచి అని హస్తము యందున్న జింకని మరియొక చేతిలోనున్న పదునైన గొడ్డలితో చంపి దాని మాంసమును మరియొక చేతి నుండిన బ్రహ్మ శిరస్సునుంచి దగ్గరున్న గంగా నది నీరు పోసి నొసటనున్న అగ్నివంటి నేత్రమునుండి ఆరగింపక కిరాతుడైన తిన్నడు భుజించి రుచిచూచిన మాంసమును భుజించితివి. దీనికి కారణము అతని పైని నీకు గల భక్తిభావమే కదా!" యని శతక పద్యములో చెప్పినారు. (శ.శ.20) ఇచట భక్తికి కవి ఎక్కువ ప్రాధాన్యమిచ్చెను. ఇంకనూ ధూర్జటి కావ్యమునందు గల తిన్నని పాత్ర శివభక్తికి తార్కాణము. ఈతని భక్తికిని, శివబ్రాహ్మణుని భక్తికిని కొద్దిపాటి వ్యత్యాసము గలదు శివుడందుంకే శివబ్రాహ్మణుని దాంభికమనుకొని తిన్నని భక్తి వెల్లడిచేయుటచే కంటివెంట రక్తము కార్చెను. ఇచట మూఢభక్తికి కవియిచ్చిన ప్రాధాన్యమిట్టిది. సాలెపురుగు, పాము, ఏనుగు మొదలగు అడ పదార్థములకే శివుడు సాయుజ్య మొసగెను గనుక తిన్నని వంటి మూఢభక్తునికి వానికి సాయుజ్య మిచ్చుటలో ఆశ్చర్య మేమియును లేదు. కాని ధూర్జటి శివభక్తిని తిన్నని భక్తితో జోడించుటకు వీలులేదు. ధూర్జటి జ్ఞాని, మహాకవి గాన రెంటింటికిని పొత్తుకుదరదు. కాని కవి మూఢుని అజ్ఞానుని పూజకు పరమేశ్వరుడు

విలువనిచ్చి చివరకు సాయుజ్య మొసంగుట కవి గొప్పగా ప్రతిపాదించినారు. ఇక రాజనిందాత్మకములగు పద్యములు పెక్కులీ శతకమున గలవు. మచ్చునకు-

రాజై దుష్కృతి జెందె జందురుడు రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబున గాంచె దుఃఖము కురుక్ష్మాపాలుడా మాటనే
యాజిం గూలె సమస్త బంధవులతో నారాజ శబ్దము చీ
చీ జన్మాంతరమందు నొల్లను జుమీ శ్రీకాళహస్తీశ్వరా! (21)

గురుపత్నీ సంగమ దోషము వలన రాజైన చంద్రునకు దోష మాపాదింప బడినది. ధనపతియై సార్వభౌమునితో సమానమైనవారుగా నున్న [1]కుబేరుడు చూచుటకు వికృతాకారమును గల్గి దుఃఖము పొందినాడు. రారాజుగా వ్యవహరించబడు దుర్యోధనుడు సకల బంధువులతోను యుద్ధము నందు హతుడయ్యెను. అందుచే రాజని పేరు పడ్డ వారందరు ఏదో ఒక దోషమునకు పాల్పడిరి. కాబట్టి రాజుగా నన్ను చేయక ఏ జన్మమునందును కూడ ఇట్టి రాజ శబ్దము నాకు ననుగ్రహింపకుము అని ఈ పద్య భావము. దీని వలన రాజశబ్దము ఉచ్చరించు నంతనే ధూర్జటి పాపమని భావించుచున్నట్లు తోచుచున్నది. ఇంకను అతనికి రాజాస్థానముల యందు గల్గిన ఏహ్య భావము వ్యక్తమగుచున్నది. ఇంకను రాజనిందాత్మకములగు పద్యము లీశతకమునందు పెక్కులు గలవు ఆ కాలములో రాజునకు సార్వభౌమాధికారముండెను. రాజవ్యవస్థను ధిక్కరించిన ధూర్జటి కవి, నిరంకుశమైన రాజాధికారమును కూడ నిరసించెననియు తెలియుచున్నది.

మాహేశ్వరుని కరుణకు పాత్రుడగుటకు ఈ కవి తనకు కవిత్వమొక్కటియే తప్ప వేరే విషములైన మార్గములు తెలివితేటలు లేవని ఈ క్రింది విధముగా ననుచున్నాడు.

శా॥ దంతంబుల్పడ నప్పుడే తనువు నందారూఢి యున్నప్పుడే
కాంతా సంఘంబు రోయనప్పుడె జరాక్రాంతంబుగానప్పుడే

---

1. Kubera is represented as being deformed in body having three legs only eight teeh and yellow mark in plate of one eye (Sanskrit English Dictionary) V. S. APTE

నిందల్మైన భరించనప్పుడె కురుల్వెల్వెల్ల గానప్పుడే
చింతింపన్వలె నీపదాంబుజములన్ శ్రీకాళహస్తీశ్వరా ! (116)

"ఓ మహేశా ! కరుణా కటాక్షములు సంపాదించుటకు నాకు ఇతరములైన తెలివి తేటలు లేవు. అందుచే నాకు చేతనైన కవిత్వము నిన్ను స్తుతించుట కొరకు మాత్రము ఉపయోగించెదను. అట్లుగాక మరియొకరికి నా కవిత్వంబును ఉపయోగించనని ప్రతిజ్ఞ చేసికొంటిని. ఈ కలికాలమాహాత్మ్యమున ఈనా నియమంబునకు భంగము రాకుండ కాపాడ వలసినది" యని భావము. కవిత్వమునకు ఈశ్వర స్తుతియే పరమార్థము అనుభావము కూడ కవి వ్యక్తము చేసినారు.

ఇక కావ్యమునందలి విశేషము లించుక పరిశీలింపనగును. కాళహస్తి మాహాత్మ్యము నందలి రచనా మాధురికి కారణమగు యంశము నాటకీయత సంవాదాత్మకత దీనికి జీవగఱ్ఱ. ఈ సంభాషణలు పాత్రల మూలమున నిర్వహింపబడును. ఇందు కొన్ని ముఖ్య పాత్రలు కపట జంగముడు, వీరనృసింహ యాదవుడు, వశిష్ఠుడు, బ్రహ్మ, చెంచి, కాళము హస్తి తిన్నడు, శివగోచరుడు, నత్కీరుడు, వేశ్యాతనయులు అనువారు. ఈ పాత్రలందు శివభక్తి సమాన ధర్మము కలిగి శివాభిముఖముగా ప్రస్తావించిన వారైనను వారి స్వరూప ప్రవృత్తులను బట్టి యెన్నుకొనిన మార్గము ననుసరించి యేర్పడిన వైవిధ్య మాధారముగా ధూర్జటి యా పాత్రలను ప్రత్యేక వ్యక్తిత్వము ప్రస్ఫుటమగునటుల ప్రతిభావంతముగా తీర్చిదిద్దెను.

ఈ ప్రబంధమున మొదట నడుగిడిన పాత్ర కుమార జంగముడు కాళహస్తీశ్వరుని యపరావతారమగుటచే తెరవెనుక సూత్రధారుడైన యీతడిందు పసిబాని వేషముకట్టి నటించి పాత్రలను నడిపించెను. యాదవ రాజునకు తన మహిమ ప్రకటించి యతనిని తన సన్నిధికి రప్పించుకొను ప్రయత్నములో ఈ కపట జంగమునకు పరమశివారాధనైకసంశీలయైన యొకదాసి మిగుల నుపకరించినది. ఈ సందర్భములో కవి ప్రకటించిన సంభాషణాత్మకమైన నైపుణ్యము గొప్పది. ఇట్లే వశిష్ఠునకు తపః ఫలముగా శివుడు సాక్షాత్కరించినపుడు ఆ పరమేశ్వరునితో తమ తమ యభిమతములను వెల్లడించి వివిధ సన్నివేశములలో నాటకీయ వైచిత్రి తత్తద్దేశకాల పాత్రోచితమై దీపించినది. తిన్నడు శివలింగమును పిలిచిన పలి

కెడు దేవునిగా భావించి ఉడుమూరికి రమ్మని అమాయకముగా బ్రతిమాలుట యందు, కన్నప్ప మాంసపు కబళమ్ము తినుమని కరంగడు వేడుకొనుచు బాసలు చేయుటలోను, ముఖ్యముగా కన్నులర్పించు సందర్భమునందును గోచరించు నాటకీయ నైపుణి పాఠకులను శివగోచరునివంటి ప్రత్యక్ష ప్రేక్షకులనుగా నొనర్ప జాలియున్నది. ఇంకనూ నీకవి నాటకీయ శిల్పము నత్కీరుని కథలో బాగుగా కన్పించు చున్నది. నత్కీరుడు తమిళ భాషయందు మహాకవి. పాండ్యరాజు నాస్థాన విద్వత్కవులలో అగ్రశ్రేణికి చెందినవాడు. తాను మహాకవి ననెడు అహంభావమితని కధికము. దోషైక దృక్కగుట వలన శివుని రచనయందు తప్పువట్టి యాదేవదేవుని క్రోధమునకు గురియయ్యెను. పిదప పశ్చాత్తాపముతో బాధనొంది కైలాసము చూచిన శాపవిముక్తి కలుగునని చెప్పగా శాపవిముక్తికి సుబ్రహ్మణ్యస్వామి ఉపాయము చెప్పి అవలీలగా శాప విముక్తిని కల్గించెను. శాప విముక్తి యనంతరము శివుని పెక్కు విధముల స్తుతించి నూరు పద్యములు చెప్పెను. ఆపద్యములే కొన్ని ధూర్జటి శతకమున కలవేమో తెలియదు. శాపానంతరము నత్కీరుడీవిధముగా పశ్చాత్తాపపడెను.

ఈ కవితాభిమానము వహించితి నేటికి శంభు పీఠిపై
నీ కివులున్నయట్లు వసియింపక దేవునితోడ నేల బా
ర్వాక మొనర్చితిం గడు భరంబగు కుష్ఠు రుజా విషాదమే
నే కరణిం భరింతు నిక నెన్నడు చూచెద వెండి గుబ్బలిన్ (శ్రీ.అ 174)

గిరి తనయా ఘనకచ భారమ్ము సహజ గంధంబని శివుడు సమర్థించినాడు.

అగజకునై నందగు నిల
మగువలకుం దగదు మాను మత్సర మింతన్
గగన ప్రసూన వాదము
జగతిం బ్రత్యక్షమునకు సరియనదగునే (శ్రీ. అ. 169)

అని నత్కీరుడు శివుని వాదము ఖండించెను. తార్కికులు ప్రత్యక్ష ప్రమాణము నంగీకరింతురు, పరోక్ష ప్రమాణము నంగీకరించరు. దానిని గగన ప్రసూన వాదమని త్రోసిపుత్తురు. భూమియందే యువతి తలవెండ్రుకలు సహజ గంధము

కలవికావు. పార్వతి కుందిన నుండవచ్చును. అది యెవరును చూచినదికాదు. కావున నమ్ముటకు వీలులేదు అది నత్కీరుని వాదము. శివునికి కోపము వచ్చి శపించెను. ఇచట ధూర్జటి నత్కీరుని పాత్ర చిత్రణ మద్భుతముగ జేసెను. శంఖపీఠిపైయున్న తక్కిన కవులందఱు ఊరకయుండినట్లు తానూరక యుండ లేదని ఈ కవి పశ్చాత్తాపము నొందెను. 'ఈ కవితాభిమానము వహించితి నేటికి' అని పశ్చాత్తాపపడుట యందును, ఈశ్వరునంతివాడు వచ్చినను తప్పు తప్పే లక్షణంబో, అలంకారమో పదబంధమో రసమో చక్కజెప్పుదని ప్రశ్నించినను తన పట్టు వీడక స్వవిషయమునే స్మరింప జేయుచున్నది. దీనిని తలపించు కాళహస్తీశ్వర శతకములోని పైభావము స్థిరీకరించు ఈ క్రింది పద్యము చూతము.

చదువుల్ నేర్చిన పండితాధములు స్వేచ్ఛా భాషణ క్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవుల త్రోవల్దప్పి వర్తింపగా
మదన క్రోధ కిరాతులందుగని భీమ ప్రౌఢిచే దాకినం
జెదరుం జిత్తము చిత్తగింపగదవే శ్రీకాళహస్తీశ్వరా (70)

నత్కీరుడు తీర్థయాత్రలకు బయలుదేరినాడు, దారియందు

శా॥ చెవ్వం దీశ్వరు విశ్వరేశ్వరుని గాంచెన్, భీషణాంహోంతర్
ద్రెవ్వం, దీవ్రతరాంగ సంభవశర శ్రేణీవిదాహవ్యథల్
వివ్వం, దీఅని భక్తితో హృదయ మావిర్భూత మోదంబునన్
నవ్వం, దీగయుచోలి జూడ్కులొదవ, నత్కీరుడుత్కంఠతన్
(తృ. ఆ. 180)

ఈ ఘట్టము నందు మొదటి పద్యమిది ఈ నత్కీరుని కథా సందర్భమున ధూర్జటి ఆయా ఘట్టము లందు సమయస్ఫూర్తిగా తనకు గల పరిజ్ఞానము వ్యక్త పరచెను. దుర్భిక్ష వర్ణన చేయునప్పుడు ఈ కవికి గల జ్యోతిషశాస్త్ర పరిజ్ఞానము వెల్లడియైనది. ఈ క్రింది పద్యములో నీ విశేషము చూతము.

సీ॥ చనుదెంచె శని మీనమునకు దూర్పున ధూమ
కేతువు దోచె. జీమూత దంబ

రంబేచె, మర్త్యం దినంబులతో పాటి
చినికె దుషారంబు దినదినంబు
రాత్రుల మిన్ను నిర్మల భావమును బొందె,
వెలి యెండగాసె, గర్వలి దొరంగె,
వర్ష గర్భము నడపకపోయె, విదియల
గుము దాప్త దారణ కొమ్ము దళిగె,

గీ॥ కన్య డిండింపదయ్యె, మఖా ప్రవేశ
కాలమున యందుమఖము దఖండ గర్జ
లిపగెఱము దెస దొలకరి, నేమిసెప్ప!
నెల్ల జనముల మనములు తల్లడిల్ల. (శ్రీ.ఆ. 149)

ఇంకను ఈఘట్టము నందు కవికి గల ప్రకృతి పరిశీలనా శక్తి కూడ వ్యక్తమగు చున్నది. అడవి జాతి ధ్యానము నందు గల పరిజ్ఞాన మీ క్రింది పద్య మందు విదితము.

గీ॥ గునుకు లాదర్లు బరపటల్ గోళ్ళగొండు
ఒల్లి బియ్యంబు వెదురు బియ్యంబు గొట్టె
చెట్లు నింజట్లు తుంగ మస్తియలు నీత
గుంజు మొదలు గదిన దొరకొనియె జనము. (శ్రీ ఆ. 161)

ఇక నత్కీరుని తీర్థయాత్రా సందర్భము నందు ఈ కవికి గల భౌగోళిక పరిజ్ఞానము బాగుగా వ్యక్తమగుచున్నది.

"దెవ్వం దీశ్వరు" నను పై పద్యము చదివినంతనే ఇది సందేశ కావ్యమను తలంపు కల్గును. తదుపరి జంబూనాథ క్షేత్రము చూచినట్లు కవి చెప్పినాడు. ప్రబంధ కవులు సామాన్యముగా అష్టాదశ వర్ణనల యందు పుణ్యక్షేత్ర వర్ణనము కూడ కావింతురు. ధూర్జటి కూడ ఈ సాంప్రదాయమననుసరించియే యిచట పుణ్యక్షేత్ర వర్ణన గావించినాడు. ధూర్జటి దేశ పర్యటనానుభవ మీ ఘట్ట మందు మన కన్నులకు కట్టినట్లు తెలియు చున్నది. ఇంతియే కాక కవికి తెలుగు దేశము పై

గల యభిమానము కూడ వ్యక్తమగుచున్నది. ఇచట వర్ణనలు పెంచక రచన సంగ్రహము గావించినాడు. వైష్ణవ క్షేత్రములు కూడ ఈ మట్టమున వర్ణితములు. ఇంతను గంగానదిని కూడ ధూర్జటి వర్ణించినాడు తీర్థయాత్రా సందర్భమున ఇంకొంత దూరమేగుసరికి నత్కీరునికి శాపము వలన కుష్ఠవ్యాధి మొదలయ్యెను. ఇచట నత్కీరునికి జ్ఞానోదయము గల్గు సూచన గావించుచు కవి ఈ క్రింది పద్యము వ్రాసినాడు.

గీ॥ హంస సంస దభీష్ట విహార హేతు
వై, బహూదక హృద్యమై, యప్రతర్క్య
మగుచు, నద్వంద్వమై, పంకజాకరంబు
పొలిచె బ్రహ్మంబు తెలుగున యార్థ మగుచు (శ్రీ.మ. 196)

ఇది శ్లేషాలంకారాన్వితమైన పద్యము. ఈ పద్యమున హంస అను మాటకు హంస యను పక్షి పరమ హంస యను విజ్ఞాని యని రెండర్థములు. అట్లే బహూదక మనగా విస్తారమైన నీరు, బహూదకులను యతులు అను రెండర్థములు. అద్వంద్వ మనగా సాటిలేనటువంటిది, రెండవ వస్తువు లేనిది అని అర్థములున్నవి.

ఈ విధముగా సరస్సు హంసలతో నిండి విస్తృతమైన నీటిని గలిగి మనోహరమై ఊహాతీతముగా అతుల్యముగా నుండి పరబ్రహ్మవలె నిండైనదని ఒక యర్థము.

పరమహంసలకు సమూహమై బహూదకులను యతులచేత ఇంపుగా నుండి ఊహింపరాని అద్వంద్వ తత్త్వమును గలిగి పరబ్రహ్మవలె పరిపూర్ణమైన దని తాత్త్వికమైన రెండవ అర్థము.

ఇట్లే తిన్నని కథలో బోయల యాచార వ్యవహారములన్ని ధూర్జటి మన కన్నులకు గట్టినట్లు వర్ణించినాడు. అడవిలో దొరకు వస్తు సమృద్ధి నంతను వర్ణించుట వలన కవికి గల లోక పరిజ్ఞానము వ్యక్తమగుచున్నది. అనాది నుండే నేటి వరకును వాడుకలోనున్న కొన్ని ఆట పాటలను కూడ ధూర్జటి ఈ సందర్భమున పేర్కొనెను. శ్రీకాళహస్తి మాహాత్మ్యము చిక్కని శైవ మత గ్రంథము.

[1]కావ్యత్వ ప్రతిపాదన కంటె ఇందు శివతత్త్వ ప్రతిపాదన విస్తరించి కనిపించును. శైవులు రజోగుణముగలవారు. శ్రీనాథునివలె ధూర్జటియు నెవ్వరిని లెక్కచేయ లేదు. "ఎవ్వరేమనుకొన్న నాకేమి కొరత" అను ధీమాకలిగినవాడు అల్లసాని పెద్దన కాలమువరకుగల కవులందరును దాదాపు శైవులు. వారిలో వీరశైవులు గూడగలరు. వారి రచనలు వీరావేశముతో నిండి యుండును. వీరశైవ సాంప్రదాయములు వీరావేశమునకు నిలయములు. ఆవేశపూరితమగు రచనలు వారి శైవక్షేత్రములు వర్ణించుపట్లగా శివుని కథలు చెప్పునప్పుడుగాని ఈ ఆవేశము కన్పించును. ఇట్టి రచన పాల్కురికి సోమనాథునిలో శ్రీనాథునిలో కన్పించును. ధూర్జటియు నించుమించు నీకోవలోనివాడే యనిపించును. వీరశైవుడుకాడు ధూర్జటి ప్రవృత్తి తీవ్రమైనది. ఇట్టిది మనము కొన్ని పైపద్యములలో చూడ వచ్చును. కవి, తాను రచించు కావ్యమున ప్రయత్న పూర్వకముగానో, ప్రయత్న రహితముగానో అనేక భావములు చెప్పుచుండును. అనేక పాత్రములను సృష్టించి వానిముఖమున అభిప్రాయములను వ్యక్తీకరింపజేయుచుండును. అట్టి సందర్భములలో కవి వ్యక్తిత్వము ఆ పాత్రలలో ఆ భావవ్యక్తీకరణములలో రూపుదాల్చుచుండును. ఆంధ్ర మహాభాగవతమున ప్రహ్లాదుడు, గజేంద్రుడు అను పాత్రలను పరిశీలించినపుడు వారి భావవ్యక్తీకరణమును చూచినపుడు ఆ గ్రంథ రచయిత పోతన్నగారి భక్తిభావములు అతని వ్యక్తిత్వము స్పష్టముగా దర్శన మిచ్చుచుండును. అట్లే కాళహస్తిమాహాత్మ్యమున నత్కీరుని కథ వచ్చినప్పుడు కవియైన ధూర్జటి అతని మాటలలో భావములలో స్వరూపము స్వభావములు దిద్దుకొనినాడు. అందుచేతనే నత్కీరుడు రూపాంతరమును పొందిన ధూర్జటిగా మనకు దర్శనమిచ్చును.

కాళహస్తి మాహాత్మ్యము - ఆశ్వాసాంత పద్యములు

తెలుగు కావ్యములలో ప్రతికావ్యమున ఆశ్వాసము చివరన మనకీ యాశ్వాసాంత పద్యములు కన్పించుచున్నవి. సాధారణముగా నీయాశ్వాసాంత పద్యములు సంఖ్యలో 8, 4 ఉండును. ఆదినుండియు నీసంప్రదాయమే వచ్చుచున్నది. కవులు కృతికర్త నుద్దేశించి ఈ పద్యములు వ్రాయుట పరిపాటి. తిక్కన మాత్రము భగవదంకితముగా కావ్యరచన చేసెను. గనుక తాత్త్వికదృష్టితో

1. విజయ నగరాంధ్ర కవులు, శిష్టాలక్ష్మీకాంతంగారు, (నిర్మల పబ్లిషర్స్)

భగవంతునుద్దేశించి అశ్వాసాంతము వ్రాసినాడు. పోతనకూడ అట్లే వ్రాసెను. తిక్కన తరువాత మరల ధూర్జటియే ఇటువంటి అశ్వాసాంతములు వ్రాసెనని చెప్పవచ్చును. జరిగిన కథలు ధ్వనింపజేయుచు, తాత్త్విక విషయములతో నీ యాశ్వాసాంతములు ధూర్జటి వ్రాయుట ఈయన ప్రత్యేకతయే యనవచ్చును. అంతను నీయాశ్వాసాంతములలో తన యిష్టదైవమగు శ్రీకాళహస్తీశ్వరుని. శివుని అనేక విధముల సంబోధించుట మనము చూడవచ్చును.

ప్రథమాశ్వాసమున 16ం పద్యము -

శా॥ పాశక్లేశ గుణేషణేంద్రియతను ప్రత్యర్థితా పోర్మికా
కోశా దివ్యతి రిక్తమూర్తి! త్రిజగత్కూలంకషాకార! మా
యా శృంగారవతీ విలాస విభవ వ్యావిద్ధముగ్ధాంత వే
ళా శర్మావహ తారకాక్షర మహోలాపో పదేశప్రదా!

1. ఈషణత్రయము - అనగా దారేషణ ధనేషణ పుత్రేషణ అను కామ క్రోధాదితమైన అంతః శత్రువులు అను వాని నశింపజేయు స్వరూపము గలవాడు అనగా సమ్యజ్ఞానము ప్రసాదించువాడు (శివుడు అని భావము).

పాశయనుట వలన పాశ (మాయ) పాశుపతశైవమునవచ్చు పాశముగా నిట గ్రహింపవలెను. శైవమున పాశుపత మతిప్రాచీనమైదని చెప్పెదరు. ఇట దాన్ని గూర్చి యుంచుక వివరముగా తెలిసికొననగుదు.[1] పాశుపత దర్శనమే శైవదర్శనములందు బాల ప్రాచీనమైనది. ఇది పది శివాగమముల సూత్రము గ్రహించి యుండెను. దీని సిద్ధాంత స్వరూపములను తెలుపు గ్రంథములు మనకిప్పుడు లభ్యమగుట లేదు. బాదరాయణుడు పాశుపతమును దర్శనముగా అంగీకరింప లేదు. నాటి పాశుపతమున శివుడు కేవలము ఉపాదాన కారణమగుటచే "పత్యురసామంజస్యాత్" అని బ్రహ్మ సూత్ర పత్యధికరణమున పాశుపతద్వైత శైవమును నిరాకరించెను. శంకరుల వారీ సూత్రమును విమర్శించుచు పాశుపతము లోని కొన్ని లక్షణములు దెల్పిరి. ఈశ్వరుడు నిమిత్త కారణమగుట, కార్యకారణ విధి యోగ దుఃఖాంతములు పతి, పాశ, పశువులు కలవని. పతి

1. బసవ వచనములు, డా॥ బండారు రామయ్య 349 పు. 304

యనగా శివుడు. పాశమనగా మలాదులు, పశువనగా జీవుడు. ఈ భావమే శైవాగమముల యందున్నదని - 'శైవాగమేషు ముఖ్యం పశుపతి పాశా ఇతిత్రి తయం తత్రపతిశ్శివ ఉక్తః పశవోహ్యణవోఽర్థ పంచకం పాశాః' (తత్వ ప్రకాశిక, ప్రథమ పరిచ్ఛేదము, 6 పుట పరిష్కర్త:నంజుండారాధ్యులు, మైసూరు) అని తత్వ ప్రకాశిక చెప్పుచున్నది. ఇక్కన 18 శైవాగమనులు చేరి పాశుపతమే శుద్ధ శైవమై దక్షిణ భారతమున ప్రచారమునకు వచ్చెను. ఇది ద్వైత శైవము. ఇంత ప్రాచీనమైన ఈ పాశుపతమును గూర్చి ధూర్జటి పై పద్యమునందు చెప్పెను. ఇట పాశమనగా మాయ. ప్రకృతి. దాని ప్రతి రూపమే ధూర్జటి కథలో వచ్చిన దాసి. ఈ దాసి కథచే యాదవరాజునకు శక్తిపాత మేర్పడుచున్నది. శక్తి పాతము కాగానే పురుషుడగుచున్నాడు. ఆ భక్తుడు శివాభిముఖుడగుచు శివ కథల నాలించును ఈ సందర్భమున బ్రహ్మజ్ఞానియైన వశిష్ఠుడు ఈషణత్రయ బాధితుడై జీవన్ముక్తి పొందక బాధనొందుచుండును. అది పార్వతి ప్రియునివల్లనే అతడును సిద్ధి పొందునని మొట్టమొదటనే బ్రహ్మజ్ఞానమునకు మించి శైవము నిట ఈ కాళహస్తి మాహాత్మ్యమున ధూర్జటి ప్రతిపాదించినాడు. ప్రత్యర్థులైన వారు తాపమును ఉపశమింపజేయ సువర్ణముఖీనది అలలే కారణమని అగస్త్యుడు సువర్ణముఖిని తెప్పించిన కథ యిచట గలదు. "త్రి జగత్ కూలం కాషా కారా" అనుటచే మూడు లోకములు నాశనము చేసిన శివుని రూపమునే (జంగమునే) ఇచట స్మరించుచున్నారు. ఇట మాయా ప్రద యనగా దాసి. దాని విలాసముచే జంగముడు లోబడుట లేదా యామె వానికి లోబడుటయు జరిగినది. మాహాత్మురాలిది యనుచు జంగముడు అమె యింటి కరుదెంచుట కంగీకరించినాడు పంక్తి భోజనము యందాసక్తి కలిగినదీ దాసి. శివార్చన లేక భుజించ ననుచున్నది. జంగముని రాక వలన తన గృహము పావనమైనది. ఈ తపసి తగులమున నుండి రాజుగారి కొలువు మరచినది. అంత కురులు పోగొట్టుకున్నది. జంగముని మహిమ వలననే మరల నిజకురులు వచ్చినవి. ఇదంతయు మాయ.

ఇక 168

క. కాంతాకార! యిదంతా

హంత చింతా విదూర! యపవర్గరమా

కాంతా కాంతా! దిగంతా
భ్రాంతా భ్రాంతాంత తాండవాభినయకరా!

(ప.ఆ. 168)

కాంతాకారుడనగా లయమైన లోకమునకు కాంతిని ప్రసాదించువాడు. అహంకారము అను దానిని నశింప జేసి వికారమును దూరము చేయు స్వభావము గలవాడు. ప్రళయ కాలనృత్యము చేసి లోకమున కలిగిన భ్రాంతిని పోగొట్టు శక్తి గలవాడు' ధూర్జటి యిట తత్త్వమును చెప్పినాడు. అహంకార నిర్మూలమునకు మార్గమెట్టిదో యిట కవి సూచించినాడు. శివుడు జీవులను కాపాడుటకు తాండవమున తేల్చుచున్నాడని యిచట భావము. ఇదే విషయమును తరువాతి పద్యములో కవి చెప్పినాడు. పై రెండు పద్యములందు ఈశ్వరుడు ప్రళయకాల స్వరూపుడని లోకము నందలి కామక్రోధాది దుష్ట శక్తులను నశింప జేయువాడని మూర్తిత్రయమునకు ముఖ్యుడని నిరూపించుటకు కవి ప్రయత్నించినాడు.

ద్వితీయాశ్వాసము -

శా. కామక్రోధమదాంధకార పటలాఖండ ప్రచండార్క! వే
ధోమస్కక్షయ తాండవ భ్రమణ నిర్ధూత ప్రపంచా! పుర
శ్రీమాహాత్మ్య హరప్రభావ! దశ దిక్సేల ప్రభేద స్ఫుర
ద్ధామా? కాలజయేందిరా మదవతీ దాంపత్య నిత్యోదయా!

(157. ద్వి.ఆ.)

మొదటి సమాసమునందు కామక్రోధములను నశింపజేయు వాడు అని తిరిగి చెప్పినాడు. 'వేధోమ' యను సమాసములో లయ కాలము నందలి తాండవ మాహాత్మ్యమును వర్ణించినాడు. పురశ్రీ అను సమాసమున త్రిపురాసురుల సంపదను హరించిన వృత్తాంతము సూచితమైనది. ఈ వాక్యము శివుని మాహాత్మ్యమును తెలుపు పూర్వగాధా వృత్తాంతము సూచించుచున్నది. దిక్సేల అను వాక్యమున పది దిక్కుల యందు వ్యాపించిన తేజస్సు గలవాడని చెప్పుట వలన మాహేశ్వరుడు భగవత్ స్వరూపుడైన సర్వాంతర్యామి యను విషయము స్పష్టమగుచున్నది. శివుడు మృత్యుంజయుడు. అతనికి మృత్యువు దంపతీ సదృశమైనది.

ఈ విషయము సూచించుటకు 'కాలజ యేందిరా మదవతీ దాంపత్య నిత్యోదయా !' అను వాక్యము వ్రాసినాడు.

ఇంకను ఈ పద్యమునందు మొదట కామ - యనుటవలన బ్రహ్మ ప్రవర్తించిన విధము సూచితము. ప్రథమాశ్వాసమున బిడ్డలను కోల్పోవుట వలన వశిష్ఠుడు చావ సిద్ధపడగా ఇచట బ్రహ్మ బిడ్డల క్రౌర్యమును సహింపక వింధ్య పర్వత ప్రాంతమునకు పొమ్మని తరిమి వేసినాడు. వారిని నాశనము చేసి రమ్మని ఉగ్రుని బ్రహ్మ పంపినాడు. కామక్రోధమదాంత గుణములన్నియు బ్రహ్మయందే గలవు. వశిష్ఠునిది కేవలము జ్ఞానము. ఇక్కడ బ్రహ్మ జ్ఞానము కర్మతో జేరిన వాడయ్యెను. అయినను ముక్తుడు కాలేక పోయినాడు. ముక్తికొఱకు మరల శివునే ప్రార్థించవలసి వచ్చినది. సమర్థి అయ్యు పుత్రహత్యా పాతకమునకు లోగొనినాడు. తత్పరిహారార్థమై శివానుగ్రహమును బొంది కాళహస్తిలో మోక్షము పొందినాడు.

క. ఖంటీ కృతాంత ! ముక్తిచి
రంటీ గాఢోప గూహరత ! విద్వద్యా
ఘంటా పథచర ! తారక
ఘంటారవ హృత మనోమృగ వ్యాధేశా ! (ద్వి.ఆ. 159)

ఈ పద్యమందు పాపములు హరించువాడనియు మోక్షమును లభింప జేయు వాడని ఆముష్మిక విద్యయందు ప్రవేశపెట్టు వాడని తారక మంత్రమునకు నాయకుడని చెప్పబడినది.

పంచచామరము

దివానిశోదయావసాన దిగ్విహీన ! ఖండితా
జవంజవాంధకారి ! సత్యసంవిదభ్రమండితా !
దివాకరాదికగ్రహోగ్ర దీధితి ప్రమాద ! వా
గ్దవాంద భాసకాది తత్త్వతారకక్షపాధవా !

(ద్వి. ఆ. 159)

ఈ పద్యమందు 'దివానిశోదయావసాన' దిగ్విహీన అనగా దివారాత్రి సమయములకు అతీతుడని తెలియవచ్చుచున్నది. 2) సంసారమను అంధకారమును ఖండించు

వాడు. అనగా ముక్తిని ప్రసాదించువాడు. 3) సత్యమైన అనంతమైన జ్ఞానము చేత అలంకృతుడు, జ్ఞానస్వరూపుడు. 4) బ్రహ్మాండమును ప్రకాశింపజేయు అది తత్త్వములనెడి నక్షత్రములకు చంద్రస్వరూపుడు. ఇట్లనుటచేత సమస్తజ్ఞాన స్వరూప మూర్తులకు నాయకుడు అని తెలియవచ్చుచున్నది.

శా॥ యోగిస్వాంత శకుంత వాగురిక! సర్వోపాధి శూన్యా! జగ
ద్యోగాయోగ విహీన! భూగగన వాయుశీతవహ్న్యంతరా
ద్యాగణ్యా! గణనీయమూర్తి! పరమార్థాకార! స్వాభావతే
జోగండూషిత పద్మజాండ! భవచక్షుశ్శ్రోత్రపక్షీశ్వరా!
(శ్రీ. అ. 224)

ఈ పద్యమంతయు సంబోధనాత్మకముగా నున్నది. ఆశ్వాసాంతములో నున్న విరుదు గద్యసంప్రదాయములో సంబోధనాత్మకమైన పద్యములు వ్రాయుట యొక పద్ధతి. ధూర్జటి యిచట నీ సాంప్రదాయమే పాటించెనని తోచును.

యోగుల మనస్సనెడు పక్షులకు వలయైనవాడా! సమస్త ఉపాధులకు శూన్యమైన స్వరూపము గలిగినవాడా! లోకమునందు సంబంధములు కలుగుటకును లేకుండుటకును కారణమైనవాడా! పంచభూతమయమైన శరీరముచే గణించుటకు సాధ్యముకానివాడా! అనగా మనుష్య శరీరము పంచభూతాత్మకమైనది. కాని మనుష్యాతీతుడై పరమాత్మ స్వరూపమగు మహేశ్వరుడు పంచభూతముల కతీతుడని యర్థము ఉన్నతమూర్తి, పరమార్థమైన ఆకారము కలిగినవాడా! స్వాభావికమైన నీ తేజస్సుచేత బ్రహ్మాండమును పుక్కిలించినవాడా! అనగా తేజస్వరూపుడనియు బ్రహ్మాండమును లయముచేయు శక్తి గలవాడనియు యర్థము. 'శకుంత వాగురికా'-యనుటలో తిన్నని కథ నిట కవి ధ్వనింపజేయుచున్నారు. యోగీంద్రుల హృదయములకు వలలువేసి పట్టుకొనినాడు. ఆ తిన్నడు శివుని యందే గలడు. ఆ విషయము కూడ నిచట ధూర్జటి ధ్వనింపజేసినాడు. ఈ సత్యము యోగీంద్రస్వాంత శకుంత వాగురిక యనుటలో వ్యంగ్యమాన మగుచున్నది. "స్వాభావతేజోగండూషితాపద్మజాండ"- యనుటచేతను "భవచక్షుశ్శ్రోత్రపక్షీశ్వరా"- యనుటచేతను నక్కీరుని కథ సూచితము. ధూర్జటి శివుని

స్తుతిపూర్వకముగా ఆశ్వాసాంతములు వ్రాయుటయే కాక, ఆయా కథలను ధ్వనింపజేయుచు కూడ ఈ పద్యములను పొందుపరచుట మరొక విశిష్టాంశము.

కం॥ అష్టాపదగిరి చాపా!
యష్టాపదగర్భ శౌర్యర్చిత చరణా!
యష్టాపదముఖరీజని
కాష్టాపదకమల వాసనాధీనమనా!

(శృ. ఆ. ౨౨౫)

బంగారుమయమైన మేరుపర్వతమును చాపముగా కలిగినవాడా! హిరణ్యగర్భుడైన బ్రహ్మ విష్ణుమూర్తి నమస్కరించుపాదములు గలిగినవాడా! స్వర్ణముఖరీ అను నది యందు బుట్టిన బంగారు కమలముల పరిమళమునకు అధీనమైన మనస్సు కలిగినవాడు.

పంచచామరము:

మునీంద్ర మౌనముద్రికాసముక్త! ముక్తవాసనా!
సనాతనాత్మ! సేవకార్తిసారసావళీ ఘనా!
ఘనా ఘనా ఘన ప్రకాశ! కాయజాగ్ని జీవనా!
వనాధినాథ నందనేశ! వాగధీశ పావనా!

(శృ. ఆ. ౨౨౬)

మహర్షులయొక్క మౌనమైన నియమముచేత వర్ణింపబడువాడా! అనగా మహర్షుల మౌనముద్రతోగూడిన ధ్యానమున కవశమై వ్యక్తమగువాడు కాని మాటలకు గోచరించనివాడని యర్థము. సంసార సంస్కారములను వదిలినవాడా! శాశ్వతమగు పరమాత్మ స్వరూపమును ధరించినవాడా! సేవచేయు భక్తుల దుఃఖము లనెడు పద్మముల పంక్తికి మేఘమైనవాడా! అనగా భక్తుల దుఃఖమును నిర్మూలించువాడని యర్థము. ఘనమైన మేఘముల యందలి ఘనమైన ప్రకాశముతో సమానమైనవాడా! మన్మథుడను అగ్నికి ఉదకమైనవాడా! అనగా మన్మథాగ్నిని నిర్మూలించువాడని యర్థము. అడవిలో నివసించు కిరాతులకు రాజైనవాని కుమారుడు తిన్ననికి ప్రభువైనవాడా! 'వాగధీశ పావనా' యనుట వలన నక్కీరుని

కథ సూచితము. ఎట్లనగా వాగధీశుడనగా మహాకవిగా చిత్రించిన నత్కీరునికి చెల్లునుగాని బ్రహ్మకు చెల్లదు. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారిచే టీకా తాత్పర్యము వ్రాయబడిన శ్రీకాళహస్తి మాహాత్మ్యమునందు వారు దీనికి టీక వ్రాయుచు బ్రహ్మకు పుత్రహత్యా పాపమును పోగొట్టెనని పవిత్రుని జేసెనని వ్రాసిరి. ఇట వాగధీశ పావనయనుట నత్కీరునికి చెల్లును. ఈ విషయమునే 218 పద్యమున 'సాహిత్య శ్రీవర' యని నత్కీరుడు శివునిచే సంబోధింపబడినాడు. 'సాహిత్య శ్రీవర' యన్నను 'వాగధీశ్వరా' యన్నను ఒక నత్కీరునికే ఈ సందర్భమున చెల్లునుగాని బ్రహ్మకు గాదు. ఈ ఆశ్వాసమున బ్రహ్మ కథ లేదు. నత్కీరునికథ తిన్నని కథయే చెప్పబడినవి. బ్రహ్మకు ఈ ఆశ్వాసమున తావులేదు. సాహిత్యములో వాక్కున్నది. వాక్కులో సాహిత్యము లేదు. కనుక ఇచట నత్కీరునికే ఈ పద్యభాగ మన్వయించును. ఇక వేశ్యాతనయుల కథలో కూడ 24 వచనములో "ఆసమయంబున నియమంబున శ్రీకాళహస్తీశ్వరునకు గవితాచమత్కారంబు మీఱ, నత్కీరుండు చెప్పిన నూరు పద్యములు పాఠంబు చేసి, నిత్యవ్రతంబుగా బఠించుచు, గఠినకుచకనకకుంభలు శంభుండే తమకు బరమ పురుషుండని యుండు, బుండ్రేక్షుకోదండవిద్యారూఢ కాంతామతల్లియగు తల్లిదగ్గఱ కేళించి యిట్లనియె" నత్కీరుడు చెప్పిన నూరు పద్యములు వేశ్యాతనయులు పఠించిరని పై వచనమున గలదు. దీనినిబట్టి కూడ నత్కీరునికి 'సాహిత్యశ్రీవర' యను బిరుదు సార్థకమగునని తెలియుచున్నది. (228) ఈ పద్యము లన్నియు సంబోధనాంతములుగనే యున్నవి. అందులో చివరి పద్యము (228) నందు ముక్తపదగ్రస్తమను యలంకారమును ప్రయోగము చేయుట కూడ బిరుదు గద్య సంప్రదాయమునందు ఒక పద్ధతిగా కలదు.

శా॥ నీవారాగ్రశిఖాంత చిద్రసమయా! నీవారముష్టింపచా
ద్యావాసస్థిత దేవ! షట్సమయవాదారూఢ భేద ప్రతి
ష్ఠావష్టంభ విజృంభితా వననికాయద్వాఃకవాటా! మహా
దేవా! జన్మ జరా విపల్లయ దశాది క్లేశ సంహారకా!

(చ. ఆ. 204)

ఈశ్వరుడు చిత్ స్వరూపము గలిగినవాడు. అట్లగుటచే నీవార ధాన్యము యొక్క చివరిభాగమందలి అణుమాత్రమైనా అగ్రమువంటి జ్ఞానస్వరూపము గలగినవాడా!

ఈశ్వరుడు 'అణోరణీయాన్' అనగా అణువులయందు అణువు అను శ్రుతివాక్యములకు లక్ష్యమైనవాడని చెప్పుట యిచట కాన్పించును. షట్సమయ వాదములు అనగా సత్ఖ్యాతి, అసత్ ఖ్యాతి, అన్యధా ఖ్యాతి, ఆత్మ ఖ్యాతి, అఖ్యాతి, అనిర్వచనీయాఖ్యాతి అనునవి. ఈ ౬ విధములైన సిద్ధాంతము లందలి వాదములలో ప్రసిద్ధమైన జీవేశ్వర భేదమును నెలకొల్పుటయందు ఆధారమైన భవనముల యొక్క ద్వారములకు తలుపులవంటివాడా! అనగా షట్ సమయ వాదములచేత జీవేశ్వర భేదమును సిద్ధాంత మొనర్పు వారి నోళ్ళు మూయించువాడని యర్థము. సర్వము శివమయమని చెప్పుట దీనిలోని పరమార్థము. పుట్టుక, వార్ధక్యము ఆపద, నాశము అను దిశలను క్లేశములను నశింపజేయువాడా! అనగా మనుష్యునకు జననము, మరణము, వృద్ధాప్యము మొదలగు అవస్థలచే కలుగు దుఃఖములను పోగొట్టి కైవల్యమిచ్చువాడని భావము. ఇంకను 'నీవారాగ్ర శిఖాంతచ్ఛిద్రసమయా' యనుటలో భగవంతు డెట్లుండెననగా (నారాయణోపనిషత్తు నందు గలదు) నివ్వరి గింజ యొక్క తుదిభాగమందును రమ్యమైన జ్ఞానస్వరూపము గలవాడా! ఇది ఉపనిషత్తుల వాక్యము. కాని ధూర్జటి చతుర్థాశ్వాసమున నాధారముగా గ్రహించినచో నిరంతరము వేశ్యపుత్రికలను దోచుకొని ప్రయత్నించు తస్కరులను ప్రతిఘటించి ఆ స్త్రీలను కాపాడ యత్నించుచుండుటచే అత్యంతజాగరూకత కలిగిన జ్ఞానమే కాక కార్యసిద్ధియు జూపుచున్నాడు. దీనిచే 'చ్ఛిద్రసమయా'-యనుటకు జ్ఞానమేగాక చేతనము యొక్క కార్యమును చెప్పవలసియున్నది.

'షట్సమయ' అనుటవలన న్యాయవైశేషికాది షడ్దర్శనములలోని వాదములయొక్క ప్రసిద్ధమైన భేదములను నెలకొల్పుచున్న సిద్ధాంతమును కట్టివేయ చెలరేగిన మూఢములను ఇండ్లయొక్క ద్వారమునకు తలుపువంటివాడా! కేవలము సర్వము శివమయమని చెప్పుటయేగాక షడ్ దర్శనాతీతమైన శైవమునకు గలదని ధూర్జటి యిందు సూచించినాడు.

క॥ బంధత్రయనాశక ! భవ
బంధాదిక బంధరాశి బంధనవిద్యా
బంధుర ! సమస్తభూత
స్కంధావారేశ ! భక్తకల్పమహీజా ! (చ.అ. 206)

బంధత్రయములు అనగా జన్మ జరా మృత్యువులు లేక భార్యా పుత్ర ధనములు యని యర్థము. ఈ మూడు విధములైన బంధనములను నశింప జేయు వాడా ! సంసార బంధమనెడు సముద్రమును బంధించుట యనెడి విద్యచేత ఉన్నతుడైనవాడా! సమస్త భూతములు అనగా పంచభూతములకు సేనాధిపతి వంటి నాయకుడైనవాడా! భక్తులకు కల్పవృక్షమువంటివాడా ! అనగా నిరంతరాయముగా భక్తుల కోర్కెలను తీర్చువాడా !

బంధత్రయమనగా ఇట అణవ మాయ కార్మిక మలములు. వీటిని నాశనము చేయువాడు పరమశివుడు అని తెలియవలెను. దారేష, ధనేష, పుత్రేష ఈ ఈషణత్రయనాశము ప్రథమాశ్వాసములోని కథలయందే కనబడుచున్నది. జన్మ జరామృత్యువులు తృతీయాశ్వాసముననే నశించినవి. ఇంక ఇచట మలత్రయ నాశకమని చెప్పవలెనేగాని పైవి చెప్పనక్కర లేదు.

పంచచామరము

వటక్షమాజవాస ! భేదవాదివాగఖండితా !
జటాకుటీవిటంకలగ్న చంద్రఖండ మండితా !
కటీపటీ భవద్దిగంత ! కాలకూట మస్మరా !
నటత్కృపీట భూశిఖాపినద్ధదృగ్గితస్మరా (చ.ఆ. 208)

మాహేశ్వరుడు వటవృక్షవాసి యను ఖ్యాతిగలడు. వటవృక్ష నివాసము గలిగినవాడా ! శివేశ్వరుడు వేరైనవారు యనువాదించువారి వాక్కులచేత ఖండింపబడని స్వరూపము గలవాడా ! జడల సమూహమునందు ప్రకాశించుచున్న అర్ధచంద్రునిచేత అలంకరింపబడినవాడా ! దిగంబర స్వరూపము కలిగి దిక్కులే వస్త్రముగా గలిగినవాడా ! హాలాహల విషము తినినవాడా ! చెలరేగుచున్న అగ్నిజ్వాలలచేత కట్టబడిన దృష్టిచే మన్మథుని జయించినవాడా ! ఈ చివరి వాక్యమున మన్మథుని జయించుట యను మంగళ వాక్యముచేత ధూర్జటి కావ్యమును ముగించినాడు. ఈ ఆశ్వాసాంతమునందలి పద్యములు మూడు కూడ సంబోధనాంతములుగనే యున్నవి. దీనినిగూడ బిరుదు గద్య సంప్రదాయము మనస్సునందుంచుకొని కవి వ్రాసినాడని చెప్పవచ్చును.

ఆశ్వాసాంతములన్నియు పరిశీలించి చూడగా 1) ఈశ్వరుడు జ్ఞానస్వరూపుడనియు 2) ఈశ్వరుడు లోకములందలి పాపములను నశింపజేయువాడనియు ౩) జీవేశ్వర భేదము అను వాదమును ఖండించుట యను విషయములు కాన్పించుచున్నవి. ఇంకను శివుడు పూర్వము చేసిన లీలలను దాన సంహారములను ఈ పద్యములందు పేర్కొనెను. ఈశ్వరుడు భక్త సులభుడు. ఈశ్వరుని చేరుటకు భక్తియే సులభమార్గమను సిద్ధాంతము కూడ ఈ ఆశ్వాసాంతములలో గోచరము. ఇంకను చెప్పవలెనన్న తాత్త్వికమైన విషయములు ఆశ్వాసాంతములలో గలవు. అత్యంత ప్రాచీనమైన 'పాశ' (162 పద్యం ప్ర.అ) పాశములోని పాశము లాకులీ మతములోని పాశమునకు సంబంధించిన కామక్రోధాదులు రెండవ ఆశ్వాసములో చెప్పబడినవి. ఇంక తృతీయాశ్వాసములో (యోగి స్వాంత శకుంత వాగురిక) యనుటవలన యోగశాస్త్రమును సూచించు వీరశైవ లక్షణమును ఉపనిషత్ ప్రతిపాదితమైన ప్రత్తి జిజ్ఞాశైవమునకు ఉదాహరణగా 'నీవారాగ్ర శిఖాంత చిద్రసమయా' యని ఆశ్వాసాంత పద్యములలో కనబడుచున్నది. దీనిని బట్టి ధూర్జటి శైవము నాలుగాశ్వాసములందు ఈ క్రింది నాల్గువిధములుగా గలదని ఊహింపవచ్చును.

1. పాశుపతము
2. లాకుళము (కామక్రోధాది 28 శైవాగమములలో వచ్చును.)
3. వీరశైవము (పూర్తిగాలేదు)
4. ప్రతిభిజ్ఞాశైవము లేక కాశ్మీరశైవము

ఈ ఆశ్వాసాంతములన్నియు పరిశీలింపగా ధూర్జటి ప్రతి ఆశ్వాసాంతమునందును చివర ఒక పంచచామరము వ్రాసినాడు. దీనికి కారణము యోచన చేయగా భగవంతునికి ఉపచారములు చేయుటలో చామరము వీచుట యొకటి. షోడశోపచార పూజలలో చామరము వీచుట యొకటి. అందులకేనేమో నీ కవి యిచట పంచచామర వృత్తమును వాడినట్లు తోచుచున్నది. ఇంక గణ విభజన చేసి చూడగా పంచచామరమున జ, ర, జ, ర, జ, గ అను గణములుండును.

గణ - ఇందు చివరి గణమగు గకారము మొదటి గణమగు జకారము

గజ - అహంకారమునకు చిహ్నము-ఏనుగు.

అట్లే చివరనుంచి రెండవదియగు జ గణము మొదటినుండి రెండవదియగు ర గణము కలిపిన జర యగుచున్నది. అనగా కాలమును సూచించుచున్నది.

జర-కాలవాచి-అనగా కాలసర్పము.

ఇంక చివరినుండి మూడవదియగు ర కారము మొదటినుండి మూడవది యగు జ కారము కలిపిన రజ యగుచున్నది. అనగా ఇచట రజోగుణము సూచింపబడినది. అనగా సాలెపురుగని ధ్వనించుచున్నది. నోటిలంకతో గోపురముల కట్టుచున్నది శ్రీ. సాలెపురుగు.

గజ-ఏనుగు (అహంకారమునకు ప్రతీక)

జర-కాలసర్పము (కాలవాచి)

రజ-నోటిలంకతో కరుచున్నది శ్రీ-సాలెపురుగు రజోగుణము లక్షణము గలది కీ౨.

ఈవిధముగా ఆలోచించిన శ్రీ కాళ, హస్తి యను పేరు వచ్చును. అనగా ఇట కవి 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము'ను నాదములో సూచించినాడు. అందువలన ధూర్జటి చివర పంచచామరము వాడినాడు. నాదముచేతనే దీనిని సాధింపవచ్చును. పైవిధముగా విభజనచేసిన శ్రీకాళహస్తి యమనది ధ్వనించుచున్నది.

పైన చెప్పిన విధముగా శివుని స్తుతించుటేకాక ధూర్జటి కథలను గూడ అశ్వాసాంతముల ధ్వనింపజేసినాడు. ఇదియే ఆయన విశిష్టత.

ధూర్జటిపై నితరకవుల ప్రభావము
ధూర్జటి ననుసరించిన తరువాత కవులు

పూర్వపు కవులను అనుసరించుట కవులందరి రచనలలో మనకు కన్పించు చున్నది. కాళిదాసు రచనలలో తత్పూర్వ కవులగు వ్యాస వాల్మీకుల ప్రభావము

కన్పట్టును. అట్లే నన్నయ మున్నగువారి రచనలలో అచటచట వ్యాస వాల్మీకుల యనుసరణలు కన్పట్టును. ఇదే విధముగ పూర్వ కవులందరి ప్రభావము మహాకవి ధూర్జటి రచనలలో మనకు కన్పించుచున్నది. కావ్యములో, శతకములో కూడ నీయనుసరణలు కన్పించుచున్నవి కృష్ణదేవరాయల కాలమున ప్రబంధ మనునది నూత్నప్రక్రియ. కవులు ఎంత క్రొత్తదనమునకు ప్రయత్నించినను పూర్వ వాసనా బలమున కొన్ని అనుసరణలు వారి రచనలలో పొడకట్టుచునే యున్నవి. శ్రీకాళహస్తి మాహాత్మ్యములో ద్వితీయాశ్వాసమున ఆశ్రమ వర్ణన చేయుచు ధూర్జటి వ్రాసిన పద్యము మహాభారతములో నన్నయ చేసిన కణ్వాశ్రమ వర్ణనను పోలియున్న దనిపించును.

నన్నయ పద్య మిట్లున్నది.

సీ॥ శ్రవణ సుఖంబుగా సామగానంబులు
చదివెడి శుకముల చదువుదగిలి
కదలక వినుచున్న కరులయు గరి
కర శీతలచ్ఛాయ దట్టికరాంబు
కణముల చల్లనిగాడ్పాసపడి దాని
జెంది సుఖంబున్న సింహములయు
భూసురప్రవరులు భూతబలుల్ దెచ్చి
పెట్టు నీవారాన్న పిండతతులు
తే॥ గడగి భక్షింప నొక్కట గలసియాడు
చున్న యెలుకలు బిల్లుల యొందు సహజ
వైరి వర్గంబులయు సహవాసమపుడు
చూచి మునిశక్తి కెంతయు జోద్యమంది.

(భా. ఆదిపర్వం. ఆ. 4 పద్యం 2౫.)

ఈ పద్యము కణ్వాశ్రమము వర్ణించు సందర్భములోనిది. ఆ యాశ్రమము నందలి జంతువులు ముని ప్రభావమున సహజ వైరములు మాని కలసి, మెలసి, పరస్పరము మైత్రితో మెలగుచున్నవని కవి వర్ణించెను. ఈ ప్రభావనే ధూర్జటి

ఆశ్రమ వర్ణన సందర్భమునందలి పద్యమందును కానవచ్చుచున్నది. ధూర్జటి పద్యమిది.

సీ॥ తల్లిగానని లేడిపిల్లకు జన్నిచ్చి పెం
చు బెబ్బులి తన బిడ్డయట్ల
దైవికంబున గూడు దప్పినేలను బిడ్డ
రాచిల్క బోదల బ్రోచుబిల్లి
యెండచే గ్రాగిన కొండగొఱియ దెచ్చి
యెలమావినీడల నిలుపు గ్రోతి
యెడబాసిపోయిన పిడియేనుగుల
గూర్చి కరివిరహంబు కేసరి హరించు

గీ॥ స్తనితముల కెగపడివచ్చు శరభములను,
బట్టి యొయ్యన ధాత్రి పైబెట్టికాచు
గండభేరుండ పక్షులు గలిగి యజుని
యాశ్రమము శాంకరసరూపమయ్యెనపుడు.

(ఆశ్వాసం 2 పద్యం 71)

నన్నయ యెలుకలు, పిల్లులు పరస్పర మైత్రితో నున్నట్లు చెప్పగా, ధూర్జటి దానిని స్వీకరించి పద్యమంతటిని స్నేహ భావముతో నింపివేసెను.

ప్రథమాశ్వాసమున యాదవ భూపాలుని బరీక్షించుటకు మాయా జంగమ రూపమున వచ్చిన పరమేశ్వరుని యాకార సౌష్ఠవమును ధూర్జటి

సీ॥ అడుగు నెత్తమ్ముల నపరంజిపావాలు,
కరమున గేదార కంకణంబు,
బంగారు వ్రాత చెంగులు గోణము,
గళమున రుద్రాక్ష కంఠమాల,
యొకకేల భసిత సంచికతోడి బెత్తంబు,
సందిగట్టిన తరుణేందుధరుడు.

మాణిక్యరుచుల యొడ్డాణంబు, ఫాలిపై
బెట్టిన కస్తూరి బొట్టు,

తే॥ సార్వకాలిక తాంబూల చర్వణార్ద్ర
రాగసౌభాగ్యమున బద్మరాగమణుల
దృణముగా జూచు దంత పంక్తియును గలిగి
యంగజారాతి యొకమిండ జంగమగుచు

(కా. మా. ప్ర. ఆ. 80)

అను పద్యమును వర్ణించెను. ఈ పద్యము పెద్దన మనుచరిత్రమున ప్రవరుని ఇంటికి అతిథిగా నరుదెంచిన రససిద్ధుని గురించి చెప్పిన పద్యమును తలపింప జేయుచున్నది. ఆ పద్యమిది.

సీ॥ ముడిచిన యొంటికెంజడ మూయ మువ్వన్నె
మొగము తోలుకిరీటముగ ధరించి
కకపాల కేదారకటక ముద్రిత పాణి
గుఱుచలాతాముతో గూర్చి పట్టి
యైణేయమైన యొడ్డాణంబు లవణిచే
నక్కళించిన పొట్ట మక్కళించి
యారకూటప్రాయ నవఘళింపగ జాలు
బడుగుదేహంబున భస్మమలది

తే॥ మిట్టయురమున నిడు యోగపట్టి మెరయ
జెవుల రుద్రాక్షపోగులు చవుకళింప
గావికుబుసంబు జలకుండికయును బూని
చేరెదగ్గేహ మౌషధ సిద్ధుడొకడు. (మనుచరిత్ర ప్ర. ఆ. 66)

ఇంకను పెద్దన ననుసరించిన ఘట్టము తృతీయాశ్వాసమున కన్పించుచున్నది. ధూర్జటి మధురా పురాధీశ్వరుడగు పాండ్యరాజు గుణవైభవమును వర్ణించు పట్ల నీ క్రింది పద్యము వ్రాసెను.

ఉ॥ ఆపురమేలు భూవిభు డనంత పరాక్రము, డప్రతర్క్యధా
త్రీ పరిపాలన ప్రథితధీనిధి, వైరినృప ప్రతాప సం
క్షాపతి, వాసవాదిక యశస్సముదీర్ణుడు, దీర్ఘదాన వి
ద్యాపరకర్ణు, డర్ణవసమగ్ర గభీరు, డుదారుడెంతయున్.

(కా.మా.తృ.అ. 188)

ఈ పద్యము మనుచరిత్రమున ఈ క్రింది పద్యమును బోలియున్నది.

ఉ॥ ఆపురిబాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా
షా పరశేష భోగి వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీ
క్షాపర తంత్రు డంబురుహ గర్భకులాభరణం బనారతా
ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యు డలేఖ్యతనూ విలాసుడై.

(మనుచరిత్రము ప్ర.అ. 51)

ఇంకను నత్కీరుని కథలో శివుని శాపమునకు నత్కీరుడు దుఃఖించుట యను ఘట్టములో నత్కీరుని పశ్చాత్తాపము మనుచరిత్రమున ప్రవరుని పశ్చాత్తాపమును బోలియున్నది. నత్కీరుడిట్లు పశ్చాత్తాపము నొందుచున్నాడు.

మ॥ హరిశార్దూలమదేభఖడ్గ శరభ వ్యాకీర్ణముల్, రాక్షసో
త్కర సంచారనివాసముల్, హిమపయోధారాశవర్షంబు, లు
దుర సంఘర్షణ జాతకోపలములౌ త్రోవల్సనన్యత్యమే !
కరుణాసాగర ! భక్తవత్సల ! శివా ! గౌరీశ ! యెట్లోగదే !

(తృ.అ. 176)

ధూర్జటి నన్నెచోడుని కూడ ననుసరించినట్లగపడుచున్నది. తృతీయాశ్వాసము నత్కీరుని కథలో నత్కీరుని తీర్థయాత్ర ఘట్టములోని ఈ పద్యము కు.మా॥ సంభవములోని పద్యమును బోలియున్నది.

దళములలో రథాంగవి నదంబు, పరాగము, రాజహంస సం
కులము, శిలీముఖ భ్రమణ ఘోషము, నవ్య కబంధముల్ప ము

జ్వలతర పుండరీకములు, జాలగ గల్గి, మహాహవస్థితిన్,
బొలుపువహించు శక్కిలని పొంతకు నొయ్యనజేరి, యచ్చటన్.

(కా. మా. .తృఆ. 197)

దర్శనీయమగు తమ్మికొలనును దారుణరణాంగముగా దర్శించుటయే ఇందు గల వైశిష్ట్యము. ఈ వైశిష్ట్యమే నన్నెచోడకవి కావ్యమందు కాన్పించుచున్నది. కుమార తారకుల సంగ్రామరంగము నాతడిట్లు విచిత్రముగా సభివర్ణించినాడు.

చ॥ ఉరుతరవారి చక్ర కుముదోత్పల భూరిశిలీముఖోమ టీ
కర ఖరదండ రక్తరుచి కంజ వశోత్కర పుండరీక వి
స్తరిత హరీశ్వర ప్రకర సద్గుణ కేతనభాతితో సరో
వరమునుబోలి యొప్పె శిఖివాహను సంగర రంగమున్నతిన్.

(కుమారసంభవం. అ. 11 పద్యం 198)

ధూర్జటి పోతన ననుసరించిన తావులు పెక్కు గలవు. రాజసేవా తిరస్కృతి విషయమును, ఆముష్మిక పరత విషయమున కూడ ధూర్జటి పోతనతో సరితూగును. రచనా విషయములో పోతనవలెనే ధూర్జటికూడ అంత్యానియమ మందు ప్రీతిగలవాడు. ఇందులకు కాళహస్తి మాహాత్మ్యమున పెక్కుదాహరణ ములు గలవు.

మ॥ ప్రణతుల్సేయుచు గాంచె గుంభజుడు, లోపాముద్రతో గూడి ద
క్షిణకైలాసము,నింబికాహరకృత శ్రీపాదు తాన్యాసమున్,
మణి మంత్రౌషధవాసమున్, భవ మహామాయావిపర్యాసమున్,
గణనాతీత నటీవిలాసము, సమగ్ర శ్రీసముల్లాసమున్.

(ప్రథమాశ్వాసము 109 పద్యం)

ఇట్లే ఇంకొక స్రగ్ధర వృత్తమునకు అంత్యానియమమున కన్పట్టుచున్నది.

స్రగ్ధర. పంచాశద్వర్ణమూర్తిం, బరశివరమణిం, బంచభూతాత్మ పీఠం
బంచక్లేశ ప్రవాళ ప్రపుటనచతురం, బంచవిద్యా స్వరూపం

ఇంచారకోట్కటి పృథ్వీ ధరజచల మహాభాగ్యంశ్రీ ప్రధాత్రిన్,
సంచారాగారయోగీశ్వర జనహృదయన్, జ్ఞాన పుష్పాంబగొల్పెన్,
(ప్ర. ఆ. 115 పద్యం)

ఇంకనూ తృతీయాశ్వాసమున 180, 181, 182, 184 మొదలగు పద్యములందు కూడ ఈ అంత్యనియమము పాటింపబడెను. ప్రథమాశ్వాసమున ఈ క్రింది పద్యము కేవలము పోతన కృతమా యనిపించునట్లే యున్నది. వశిష్ఠుడు పరమేశ్వరుని స్తోత్రముచేయు ఘట్టమునందలి పద్యమిది.

"విశ్వపతి ! విశ్వకల్పక !
విశ్వాత్మక ! విశ్వసాక్షి ! విశ్వంభర ! యో
విశ్వజనిస్థితిలయకర !
విశ్వాధిక ! ధనగ, విన్నవించు మహేశా !"
(ప్ర. ఆ. 78 పద్యం)

ఇంకను చతుర్థాశ్వాసమున వేశ్యాతనయులు శివభక్తి వెల్లడిచేయు సందర్భమున ధూర్జటి పద్యము పోతన భాగవతమునందలి

సీ॥ మందార మకరంద మాధుర్యమునదేలు మధుపంబువోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికలదూగు రాయంచ చనునె తరంగిణులకు
లలిత రసాల పల్లవఖాదియైచొక్కు కోయిల చేరునే కుటజములకు
పూర్ణేందు చంద్రికాస్ఫురిత చకోరక మరుగునే సాంద్రనీహారములకు

తే॥ నంబుజోదర దివ్య పాదారవింద,
చింతనామృతపాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల.
(భా. సప్తమస్కంధము 150)

పై భాగవత పద్యము ఈ క్రింది ధూర్జటి పద్యముతో ఎంత సన్నిహితముగానున్నదో చూతము.

ధూర్జటి పద్యమిది-

సీ॥ శివునపేక్షించిన చిత్తంబు, చిత్తజా
యత్తమై విటులపై నాసపడునే?
పరశివస్తుతి కథా భాషల వినువీను
లానవే కుంటెనలాడు పలుకు?
శీశ్వేశ్వరమూర్తి వీక్షింపగోరెడు
చూపన్యరూపంబు జూతమనునే?
ముక్తివల్లభు ననురక్తిగూడదలంచు
కాయంబు గూడునె కాముకులను?

గీ॥ హరుని భవహరు శ్రీకాళహస్తి నిలయు
వినుతి యొనరించు జిహ్వక, మనుజతతికి
ప్రియము జెప్పంగబోవునె నయము మీఱ?
వారధర్మోపదేశంబు వలదు తల్లి! (చ. ఆ. ౩౯)

భాగవతమున ప్రహ్లాదుడు హరిభక్తుడు. శ్రీకాళహస్తిమాహాత్మ్యమున వారకన్యలు హరభక్తురాండ్రు. ప్రహ్లాదుడు తండ్రికి తన నిశ్చయము వెల్లడించినాడు. ఈ కన్యలు తల్లికి తమనిశ్చయము తెల్పినారు. ఈయాశ్వాసమందే ౪౮వ పద్యమున కూడ ఈ భావమే వ్యక్తీకరింపబడినది.

చ॥ అమృతము గ్రోలు జిహ్వ చవియంచు దలంచునె వేవె! నిందలో
నమర మహీరుహంబుదయమైన, నరుండవనీరు వేడునే?
యమిజన భాగ్యరూపమగు నాదిమతత్త్వము గాళహస్తిదై
వము భజియించు మానసము వార వధూమదసౌఖ్యమెంచునే
(చ. ఆ. ౪౮)

ఇంకను ధూర్జటి భాగవతమున 'సిరికిం జెప్పడు' యను పద్యమును కూడా యనుకరించినట్లు తోచును. భాగవతమున శ్రీమన్నారాయణుండు-

మ॥ సిరికింజెప్పడు శంఖచక్రయుగమున్ జేదోయి సంధింపడే
పరివారంబును జీరఁడభ్రపగతిం బన్నింపఁడాకర్ణికాం
తరధమ్మిల్లము చక్కనొత్తడు వివాద ప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

(భా.స్కం.8-96 ప)

దీని ననుకరణగా ధూర్జటి ఈ క్రింది పద్యము వ్రాసెనని తోచును.

ఉ॥ వాకిటఁగాచియున్న హరి వారిజసంభవ ముఖ్యదేవతా
నీకమునుం దలంప, కవనీధర జాధరహాసలోలతం
బోక, సమీపవర్తులగు పుత్రులఁ జూడక, భక్తభక్తిక
వ్యాకర పంకజగ్రహణనైష్ఠికుడై, కదు సంభ్రమంబునన్

(ప్ర. ఆశ్వా. 74 పద్యం)

అని చెప్పెను. భాగవతములో శ్రీమన్నారాయణుడు భక్తుడగు గజేంద్రుని రక్షించుటలో ఆతురతనుచూపగా, ఇచట శివుడు వసిష్ఠుని యార్తినపనయించుటకు వచ్చెను. ఇంక ధూర్జటి యుద్ధవర్ణనల సందర్భమునందు, సంభాషణాత్మకములగు సన్నివేశములందును తిక్కన ననుసరించెననిపించును. ద్వితీయాశ్వాసమున ఉగ్రుడు తనయన్నలతో జేసిన యుద్ధము తిక్కన యుద్ధ వర్ణనముతో పోల్చవచ్చును.

ఇంకను తృతీయాశ్వాసమున నత్కీరుని కథలో రాజాస్థానమున అవమానితుడైన మూలస్థాన హరద్విజుడు శివునితో తన దైన్యమును వెళ్ళగ్రక్కుట కూడ ఇందులకు చక్కని దృష్టాంతము ఇది సంభాషణాత్మక సన్నివేశమున కుదాహరణముగా పేర్కొనవచ్చును. ఇటువంటివి తిక్కన రచనలో అధికము. ఇంక ధూర్జటి రచనలో శ్రీనాథుని పోకడలు పెక్కుచోట్ల కాంచవచ్చును. శ్రీనాథునివలె ధూర్జటి కూడ యోగశాస్త్రవేది, బ్రహ్మవిద్యా నిష్ణాతుడు. అయా సందర్భములందీ సత్యము గోచరింపగలదు. రచనా విషయములో శ్రీనాథునకుద్దిగాగలదనిపించు ఘట్టములు కూడ గలవు శ్రీకాళహస్తిమాహాత్మ్యమున ప్రథమాశ్వాసమున-

శా॥ కాంచెన్ వంచిత పాంచ భౌతిక సుఖాకారాంగమున్, జిన్నది
సందారాంచి తరంగమున్, మునిమనస్సమ్యక్పరిష్వంగమున్,
జంబాస్త్రోసు మరుద్భుజంగము, గృహపాశాంధమాపాంగమున్,
ప్రాంచన్ముక్తి కళత్ర సంగము, ఫణారాజన్మహాలింగమున్

(ప్ర. ఆ. 112 పద్యం)

అను పద్యము తృతీయాశ్వాసమున

కాంచెం గాంచిన పంకజాత విలసద్గంధాంధ సారంగ, పే
శాంచత్తుంగ తరంగ, వారినిధి శీతాగాంతరాభంగ, రో
మాంచస్వేద జలాక్రపూర ఘనకామానంద సంపన్మనో
కుంభాగ్ర స్థిత విశ్వనాథపద సమ్యక్సంగ, గంగానదిన్

(తృ. ఆ. 189)

అను పద్యము శ్రీనాథుని భీమేశ్వర పురాణమున ఈ క్రింది పద్యమును తలపించుచున్నవి.

శా॥ ఆలోకించె మహామునీంద్రుడు గుమారారామమున్ విం
ధ్యకు, త్కీలోపాంతధరాలలామము జహుక్రీడా వనశ్యా
మమున్, ప్రాలేయాచల కన్యకాధవ జటా తారా సనార్ధేందు రే
ఖాలానాయిత హేమ కూట కల ధౌతాట్టాల కగ్రామమున్

(భీ.పు.ద్వి.ఆ. 61 పద్యం)

ఇంకను కాళహస్తి మాహాత్మ్యమున ప్రథమాశ్వాసములో

ఉ॥ ఎక్కడ జట్టినం గళం యిఱుక్కవ, లెక్కడ నోరు సోకినన్
జక్కెరలప్పు, లేమనిన సార సుధారస, మెట్టులుండినన్
జక్కదనంబు పెన్నిధులు, సంభ్రమ మొప్పఁగనేమి సేసినన్
మక్కువ లెయ్యవలె మెఱయు మన్మథకేళి యొనర్పునంతటన్

(ప్ర.ఆ. 48 పద్యం)

అను పద్యము భీమేశ్వర పురాణము నీ క్రింది పద్యమును తలపించుచున్నది.

ఉ॥ ఎక్కడ జూచినన్ సరసి యెక్కడ జూచిన దేవ మందిరం
బెక్కడ జూచి నందనిని యెక్కడ జూచిన బిల్వ వాటికల్
ఎక్కడ జూచినన్నది మహీవలయంబున భీమ మండలం
బెక్కడ నన్య మండలము లెక్కడ భావన చేసి చూచినన్
(తృ.ఆ. ౨౮. భీ.పు)

కాళహస్తి మాహాత్మ్య మందలి తృతీయాశ్వాసమున తిన్నని కథలో ఈ క్రింది పద్యమునకు సరివచ్చు పద్యము భీమేశ్వర పురాణమున కూడ గలదు.

సీ॥ భసితాంగ రాగ శోభా విలాసంబుతో
ప్రతివచ్చు, నావన పొందు గరిమ,
కంఠ హాలా హల కాళి మచ్చువిశోధ
నెనవచ్చు గుబ్బ చన్మొనల నలుపు,
పరశివాకృతి తోడ సరి వచ్చు నఖరరం
బన బాలి ఘనతరంబైన పదము,
స్వ స్వరూప విచార సంప్రాప్తి కాంతితో
మార్పడు చిత్తైక మాన జడిమ,
గీ॥ శరథ సానంగ సంక్రీడ జరుగ వీక,
దౌ హృదము, 'గర్భమున నున్న తనయు, డీశు
డై ప్రకాశింప గలం' డని యపుడు దెలుపు
కరణి, జెంపొందె నమ్మందగామినికిని. (తృ.ఆ. ౨౮)

భీమేశ్వర పురాణమున గల పద్యమిది.

సీ॥ సరివచ్చు ననవచ్చు శతమన్య వీటికి
వివిధ దేవాగార విభ్రమమున
ప్రతివచ్చు ననవచ్చు కాలమున్నిటికి
నక్షయంబగు జీవనాళివృద్ధి

నెనవచ్చు ననవచ్చు నిండుబింబమునకు
సకల కళా విలాస ప్రవృద్ధి
దొరవచ్చు ననవచ్చు దోయజాక్షుని మూర్తి
కళి రామలక్ష్మి సమగ్ర మహిమ.

తే॥ జెప్ప నొప్పదె యప్సర స్త్రీసహస్ర
ధవళతర దీర్ఘదృక్పుట ధాళ ధళ్య
సమ్మిళ ద్వీమనాథ భూషాళ కాంక
తరళ దీధితి పరిపాటి దశవాటి. (భీ పు. ప్ర. ఆ. 107)

ఇంకను కాశీ ఖండమున కూడ కొన్ని యనుకరణలు కన్పించుచున్నవి. శ్రీకాళహస్తి మాహాత్మ్యమున నక్కీరుని కథలో నక్కీరుడు శివునిచే శాపగ్రస్తుడై శాప విమోచనమునకు కైలాసము దర్శించవలె నను సందర్భమం నందలి పద్యము శ్రీనాథుని కాశీ ఖండమున పద్యమును తలపించు చున్నది. ధూర్జటి పద్యము.

సీ॥ తివిరి యంగమ్మున దిమ్మరెత్తక మున్న,
యొడ లెల్ల మచ్చలు జెడక మున్న,
దళమెక్కి గాత్రంబు చెలువు తప్పక మున్న
బుడుపులు మేన నేర్పడక మున్న
యలత విగ్రహమున నంకురింపక మున్న
కాయంబు వెడ రూపు గాక మున్న
తనువున జీము రక్తములు గారక మున్న
దేహ పీగలు మూగి తినక మున్న

గీ॥ బైక్షమడుగంగ బోయిన పట్ల జనులు
చూడ రోయక మున్న, కాలాడినపుడు
నడువ వలె గాక కైలాస నగము జూడ,
హరుని వాక్యంబు శక్యమే పరిహరింప. (కా. మా. తృ. ఆ. 177)

ఇక కాశీ ఖండములో పద్య మిట్లున్నది.

సీ॥ పొడిదగ్గు కంఠంబు బారి పుచ్చకయ మున్న
తల ప్రకంపంబు బొందకయ మున్న
బొమలు కన్నుల మీద గొదివి వ్రాలక మున్న
పర నేత్రముల కఢ్ఢు పరక మున్న
శ్రుతి పుటంబుల శక్తి సురిగి పోవక మున్న
వళు లాననమున బర్వకయ మున్న
హృదయంబులో జాగ పదను దప్పక మున్న
గాత్రంబు శిథిలంబు కాక మున్న

తే॥ పండ్లు వేర్వాసి కదలు చూపకయ మున్న
కాకి కడకంటి చూపుపై రాక మున్న
కాలుసేయాడు కాలంబె కదల వలయు
దీర్ఘసేవకు దేహ మస్థిరము కాన (తృ.అ. 86 పద్యం)

ఇంకను ధూర్జటి కావ్యములో ద్వితీయాశ్వాసమున శ్రీకాళహస్తిం కథలో నున్న సూర్యాస్తమయ వర్ణన మందలి ఈ క్రింది సీస పద్యము కాశీ ఖండమున వింధ్య పర్వత ఘట్టమున "చిరసాన" యను పద్యమును పోలి యున్నది. రెండు పద్యములు చూతము

ధూర్జటి కావ్యమున -

సీ॥ ప్రాగ్వధూమణి చిమ్మ, బశ్చిమ దిక్కాంత
పట్టిన చెంగల్వ బంతి యనగఁ,
గాల విష్ణుండంధకార దైత్యుని వ్రేయ,
జరమాద్రి బడిపోవు చక్రమనగ,
దిన మహీరుహమున దేజోమయంబుగాఁ
బండి రాలిన పెద్ద పండనంగ,
దివి నుండి దేవ దానవ యుద్ధ రక్తార్ద్ర
మై నేల గూలు రథాంగ మనగ,

గీ॥ బద్మినీ సంగమ భ్రాంతి బరిహరింప,
నపర జలనిధి జలకంబులాడ బోవు
కరణి, నెఱ సంజ చంద్రుడుగావిపచ్చ
డంబు ధర బెట్టి, భాను బింబంబు గ్రుంకె. (ద్వి.అ. 127)

కాశీ ఖండము నందు శ్రీనాథుని పద్యము.

సీ॥ చిఱుసాన బట్టించి చికిలి సేయించిన
గంద్రగొడ్డలి నిశాగహన లతకు
గార్కొన్న నిబిడాంధకార ధారాచ్ఛటా
సత్త్రివాటికి వీతి హోత్ర జిహ్వ
నక్షత్ర కుముద కాననము గిల్లెడు పొంటె
ప్రాచి యెత్తిన హస్త పల్లవాగ్ర
మరసి మింటికి మంటి కైక్య సందేహంబు
బరిహరింపంగ బాల్పడ్డ యవధి
తే॥ సృష్టి కట్టిట్టి తొలు సంజ చెలిమి కాదు
కుంటు వినతా మహాదేవి కొడుకు గుజ్జు
సవితృసారథి కట్టిట్టి దాయ వేలు
పరుణుడుదయించె బ్రాగ్దిగాభ్యంతరమున (కా।ఖం।ప్ర।అ 121)

ప్రముఖ ప్రబంధ కవులందరును తమతమ కావ్యములలో కావ్యనా[illegible] దుఃఖమును సందర్భాను సారముగా వర్ణించిరి. ధూర్జటియు వారితో తీసిపోక ప్రథమాశ్వాసమున యాదవ భూపాలుని యాజ్ఞ ప్రకారము తలగొరి గింపబడిన దాసిచేత "పంచమధ్వనుల గానము లీను పికాంగనాగరిన్" పలవింప జేసినాడు.

చ॥ పడి, బిగువైన పీనకుచ భారము వంక ధరిత్రి మోవకుం
డెడు తనువల్లితో, గటికి డెందము భూపతి దూఱుచున్ వడిన్

వెడలుదృగంబు పూరములు వెల్లిగొనన్, బలవించె. దైవమున్
దడవుచు, బంచమ ధ్వనులు తానములీను పికాంగనాగతిన్
(కా. మా. ప్ర. ఆ.50)

ఇక శ్రీనాథుడు

చ॥ కొసరి వసంత కాలమున గోయిల క్రోల్చిన భంగినేడ్చె న
బ్జసరుహనేత్ర కొండచటి పెద్దయెలుంగున వెక్కివెక్కి వె
క్కస మగు మన్యువేగమున గాటుక కన్నులనీరు సోనలై
యసరిక కాయలంతలు పయోధరముల్ దిగువాఱునట్లుగన్
(కాశీఖండము 6—167)

ఇక పెద్దన మనుచరిత్రలో ఇట్టి పద్యమే ఉన్నది.

ఉ॥ పాటున కింతులోర్తురే ? కృపారహితాత్మక। నీవ్రుత్రోవని
చ్చోట భవన్నఖాంకురముసోకె। గనుంగొను మంచుజూపియ
ప్పాటల గంధి వేదన నెపంబిడి యేడ్చె గలస్వనంబుతో
పీటిన పిచ్చుగుబ్బచను మిట్టల నశ్రులు చిందు వందగన్
(మ.చ.ద్వి.ఆ. 70)

"ఏడ్చె.........బాలపల్లవ గ్రాస కషాయ కంఠ కలకంఠవధూ
కలాకా కలిధ్వనిన్" (తిమ్మన పారిజాతాపహరణము ప్ర. ఆ. 108)
"ఎల్గెత్తి....ఏడ్చె గిన్నెర వధూరాజత్కరాంభోజకాంబో
జీ మేళ విపంచి కార వసుధా పూరంబుతోరంబుగన్"
రామరాజ భూషణుడు, వసుచరిత్ర, చ.ఆ.62 పద్యం.

ఇక ఉత్తర హరివంశము కూడ ధూర్జటి బాగుగా చదివి అందుండి కూడ అనుక
రించినట్లు తోచును. కాళహస్తి మాహాత్మ్యమున తృతీయాశ్వాసమునందు శివ
లింగ సంగతా భంగుర హృదయుడగు తిన్ననితో నాతని చెలికాండ్రిట్లనిరి.

సీ॥ వలలును దెరలు ద్రోగుల జుట్టగా లేదు,
పోటు కోలోతడియు బుచ్చలేదు,

తెగిన మేకంబుల దేలేదు, విడివేట
పిట్లలకును మేత పెట్టలేదు,
చెంచు లేరికి నేమి సేదదేఱగలేదు,
చెదకుండ మెకముల జేయలేదు
కుక్కలిట్టులు సివంగులు మేపుగొనలేదు
బలివెట్టి కాట్రేని గొలువలేదు
వేటలాడంగ వచ్చిన వేడుకెల్ల
నక్కటా! తండ్రి కెఱిగింపనంపలేదు,
మ్రాను పడియుండనేటికి మేను మఱచి?
యేల మాఱాలి మాన్పవే యెఱుక పఱిచి? (తృ ఆ. 76)

ధూర్జటి కవి వ్రాసిన యీ పద్యము నాచనసోముని ఉత్తర హరివంశములో పంచ మాశ్వాసమున బాణాసురుడు, సరియైన ప్రతిభటుడు లభింప మిరిత్తగా నున్న తన గుణసహస్రముల దుస్థితిని బరమేశ్వరునకు నివేదించుకొను సందర్భము నందలి ఈ క్రింది పద్యమును స్మరింపజేయుచున్నది.

గీ॥ అచల గతినుండె దనుజసైన్యంబు మిగుల
బెరగి దైవ సైన్యంబుచే దరల దయ్యె
దనుజ సింహనాదములు డెందములు సొరగ
దిరుగబడజొచ్చె నమర కుంజర బలంబు
(ఉత్తర హరివంశము, ప్ర. ఆ. 19)

చతుర్థాశ్వాసమున వేశ్యా తనయులు కాళహస్తీశ్వరుని సన్నిధానమునకేగు సందర్భమున శివభక్తి సంపన్నులగు వారి యాకృతి ధూర్జటి యిట్లు వర్ణించెను.

సీ॥ నగవు రాకుండియు, మొగము నెత్తమ్ముల
నగవంకురించు సోయగమునిగుడ
మదము లేకుండియు, నుదిత తారుణ్యాసం
పదమదంబుదయించు నుదుట దెలుప

మెఱుగు పెట్టకయును, మెఱయు నిద్దపుమేని
        మెఱుగులు తరగలై తుఱఁగలింప
నడపు బిత్తరముగా, నడవ నేరకయును
        నడవ నొయ్యారంబు మడిపడంగ

సర్వేకార వికారాత్మ పార్వతీశు
గలయ నేతెంచదరుగాన గామినులకు
గలుగ కుండునె తద్గుణ గౌరవంబు ?
పతికి సరిగారె హితలైన భాగ్యవతులు (చ.ఆ.121)

ఈ పద్యము ఉత్తర హరివంశమునందు నరకాసురుని సన్నిధానమున కరుదెంచి యూర్వశిపై నాచన సోముడు చెప్పిన ఈ క్రింది పద్యమును కొంతవరకు పోలియున్నదని చెప్పవచ్చును.

సీ॥ తొడవు లూడ్చినసైన దొయ్యలి రూపుతో
        చిన్నవోయినపట్ల సెన్ను మీఱ
విరులు పుచ్చినవైన వెలది పెన్నెఱితావి
        బాయ నిఱవ్వాది బయలు మెఱయ
బూతరాల్చినసైన బొంతుకమైదాయ
        గవుసెనలో మున్న క్రమము దెలుప
మడుగు మాసిననైన మగువ పిఱుందు నో
        యగము చూపఱ చిత్తమాక గొలుప

తే॥ మురిపముల నుజ్జగించిన ముగుదనడపు
గలికిచూపుల వీడ్కొన్న కన్నుగవయు
జిఱువగవునోసరించిన చిగురు మోవి
నింతి మదభీతి వెలుపలికెఱుక సేయ

(హరివంశము. ప్ర. ఆ. 67)

కిరాతార్జునీయ ఘట్టమున గిరిజారమణుని కృతక శబరవేషధారణమును ధూర్జటి యిట్లు వర్ణించెను.

సీ॥ జడకొప్పు, కేకి పింఛపుద్రాటి చుట్టగా,
బిసరుహాహితరేఖ పీకెగాగ,
సెగలు చల్లెడు కన్నుజేగురు బొట్టుగా,
శ్రుతిఫణి యౌవధలతిక గాఁగ
మెడను బున్కలం పేరుమేటి తామరులుగా,
దోలు దుప్పటి యొకదోలు గాఁగ
చేతి పినాకంబు సెలవింటి బద్దగా,
శూలం మేర్చిన యంపకోలం గాఁగ
ఆ॥ ప్రమథు లెలుకులుగా, నద్రిరాజ తనయ
శబరిగా, నాల్గు వేదముల్ జాగిలములు
గాగ మూకాసురుని బందిగా, నొనర్చి,
శబరుడై భర్గుడర్జు నాశ్రయము జేరగ.

(కా.మా.చ.ఆ. 178)

శ్రీనాథ కవి హర విలాసమున ఇదే సన్ని వేశమున మాయా కిరాతుని గూర్చి సీ విధముగా వర్ణించెను.

సీ॥ వికటల జటా మకుటికా భారంబు
కుటిలైన నజాంజుబునెలలుగాఁగ
నారసుధామ శకలావతంసంబు
పెడకొప్పుపై నుండు పీకె గాగ
మునలలాటంబున గనుపట్టుకను బిచ్చు
గైరిక ద్రవతిలకంబుగాఁగ
భుజ మధ్యమున గ్రాలు భుజగహారంబులు
గురిజ పూసల గుల్పసరులు గాఁగ
తే॥ శంకరుండు కిరాత వేషంబుదాల్చి
యగజ చెంచెతయై తోడ నరుగు దేర

బాణి నోంకార దివ్య చాపము ధరించి
వచ్చెవివ్వచ్చు వరతపోవనము కడకు

(హ.వి.న.ఆ. 41 పద్యం)

శబరవేషధారియగు శంకరునకు శశిరేఖ పింఛె యగుటయు నసల లోచనము జేగురుబొట్టగుటయు రెండు పద్యము లందును గలదు. కొంచెము మార్పుచేసి శ్రీనాథుని పద్యమే ధూర్జటి వ్రాసెనని తోచును. శ్రీనాథుని పద్యముల వంటివని పించు పద్యములు ధూర్జటి కవి తన ప్రబంధమున దాల రచించెను. ప్రథమా శ్వాసమున ఈ క్రింది పద్యమిందుల కుదాహరణముగా చెప్పవచ్చును.

గీ. ఎక్కె దుర్గంబు కొండ మునీశ్వరుండు,
మ్రొక్కె దత్పాద నీరేజములకు భక్తి,
జొక్కె దద్దివ్యరూపంబు జూచినపుడ,
దక్కె నతనికి ముక్తికాటంక వలియు.

(ప్ర.ఆ. 116. కా మా.)

ఈ పద్యము శ్రీనాథునిదేమో యన్పించునంత బింకముగా నున్నది. శ్రీనాథునకు పాణింధమ శబ్ద ప్రయోగమనిన యిష్టము. ధూర్జటియు నీ పదమునే తన కావ్య మందు పెక్కుసార్లు వాడెను. ఇంతవరకు ధూర్జటిపై పూర్వ కవుల ప్రభావము పరిశీలించితిని. ధూర్జటి పూర్వ కవుల ననుసరించిన విధమును నా దృష్టి కోచిన అనుసరణలు వ్రాసితిని. ఇంకను కొన్ని చోట్ల పూర్వ కవుల ప్రభావము కనిపించు యుండవచ్చును. ఇక ధూర్జటి ప్రభావ మాతని తరువాతి కవులపై నెట్లున్నది యను విషయము చూతము. తరువాతి కాలమున రచింపబడిన ప్రబంధములందు కాళహస్తి మాహాత్మ్యముపుట నుకరణములు కనబడుచున్నవి. ఇందుకుదా హరణము పాండురంగ మాహాత్మ్యమున కనబడుచున్నది. ధూర్జటి కావ్యమున తృతీయాశ్వాసమున తిన్నని కథలో కాబేని జాతర సందర్భమున మదుపాన మత్తులగు శబర దంపతుల వికార చేష్ట లీ క్రింది విధముగా వర్ణింపబడినవి.

సీ. మాటలాడదలంచి, మఱచి పోయెడు వారు
నడువబోవుచు, దొట్రుపడెడువారు

సూర కుండెదమని, యుండనోపని వారు
లేచెద మని, లేవలేని వారు,
పనిలేని పని, బట్ట బయలు దిట్టెడు వారు
పాడనేరకుయును, పాడువారు
నెదురైన వారికి నెల్ల, మ్రొక్కెడి వారు
వ్రీడా విహీనులై యాడువారు
బాలం ద్రావియు, మగుడ జేసాచు వారు,
దొరలి, యుపదంశ ఖాండముల్దొడుకువారు
నైరి మృగయాది దైవత యాత్ర యందు
పానములుచేసి, శబర దంపతులు రతుల.

(శృ.అ. 41 పద్యం)

ఈ పద్యమును చూచియే తెనాలి రామకృష్ణ కవి తన పాండురంగ మాహాత్మ్యమునందు మధుపాన మత్తయగు నొక విధునిభాస్యను కన్యాకుబ్జరాజ పుత్రిక చెలికత్తె నిట్లు వర్ణించినాడు.

సీ. 'దామోదరుడు యశోదా స్తన్యమానెడు' నని
మ్రొక్కు విరిగు త్రినతిభమింప;
'ప్రొద్దులు నొచ్చె గద్రూదేవికిపుడ' ని
ప్రియమందు వేణు గర్భిణి గుతించి;
'పాపనిగద నొచ్చె ఫణికేతు తార' లని
నరలు నేనుగు చేత నరటు లొరుగ;
'బడబాగ్ని బడది వెల్వడియెడు' నని
చూపుగాన బూచిన కింశుకము చెలులకు;

తే. శేషధృతమేరు శిఖరకుసీష బాగదు,
నంచ కౌగిట నున్న హేమాంబుజంబు;

జూర్వమగు విన్కి మదివెఱ పొదముదేర,
మధుమదక్షీణయగు నొక్క విధునిభాస్య.

(పాం. మాహాత్మ్యం. ఆశ్వా ౬. పద్యం ౪౦౦)

ధూర్జటి కవి మధుమత్తులగు శబర దంపతుల విహార చేష్టలను వర్ణింపగా, రామకృష్ణకవి యొక్క వసంతామణి విహార చేష్టలను వర్ణించెను ఆ వర్ణనలో ఎక్కువ చమత్కారము చూపెను. ఇదియే వీనికి గల వ్యత్యాసము. ధూర్జటియు రామకృష్ణుడును రాయల వారి సభలోని వారేయైనను వయోభేదముచే శ్రీకాళహస్తి మాహాత్మ్యమే ముందు రచింపబడెనని పాండురంగమాహాత్మ్యము దాని తార్వాతిదనే యని యూహింపవచ్చును. అదియును గాక పాండురంగమాహాత్మ్యము రాయల తరువాతి కాలము వాడగు విరూరివేదాద్రి కంకిత మీయబడెను. అందుచే ధూర్జటి కంటె తరువాతే ఈ రచన జరిగెనని అందు ధూర్జటి యనుకరణలు కలవని చెప్పుట జరిగెను. ఇంక ధూర్జటి మునిమనుమడగు కుమార ధూర్జటి కుమారుడింకొక కాళహస్తి మాహాత్మ్యము రచించెను. అతడే లింగరాజు కవి దీనికి పెద కాళహస్తి మాహాత్మ్యమని పేరు గలదు. ఇది ముద్రితము కాలేదు. ఈ గ్రంథమునకు మన ప్రస్తుత ప్రబంధమునకు చాల వ్యత్యాసమున్నను ఈ కవి ధూర్జటి నాదర్శముగా పెట్టుకొని ఈ గ్రంథ రచన చేసెననిపించును. ఈతనిపై తాతగారి రచనా ప్రభావమెంత వరకు గలదో ఇంచుక పరిశీలింతము. అవకాశము లభించినపుడెల్ల ఈ లింగరాజు కవి తాతగారి ననుకరించి రచన సాగించెనని తోచును. ప్రథమాశ్వాసమున విశ్వామిత్రుని కోపాగ్నికి తన సుతులందరు చావగా వశిష్ఠమహాముని యెంతయు దుఃఖించి భృగు పాత మొనరించి ప్రాణత్యాగ మొనరింపనుద్యమించును. అపుడు భూదేవి వాని నాపు జేయును. అపవర్గప్రాప్తి కొఱకు శివారాధన మొనరింపు మని హితోపదేశము గావించును. జ్ఞానని[illegible] నాసంయమీంద్రుడు నా ఉపదేశమును దాటించి పరమేశ్వరుని గురించి తపమొనరించుట గోచరించును. అతపశ్చర్యను గూర్చి లింగరాజు కవి ఈ క్రింది విధముగా వర్ణించినాడు.

సీ. చంద్రశేఖర నామసంస్తవ శశిరాంబు
వాని నిదాఘార్తి నపనయించి

కరకంతునునుతి వజ్రకవచధారణమాన
నఖిల దుష్టోరక వ్యధల మాంచి
పార్వతీశ్వర పాద భజన సుధా స్వాద
సమునను తృష్ణలనాను మణిచి
అతివేల భక్తి కన్యాశ్లేష నావాప్తి
పంచిన శిశిర భయంబు నొంది
నిశ్చల ధ్యాన సంధాన సీయతిబొదల
ధైర్య ధుర్యత మౌనము ద్రాని పిలి
తామదై వేల్పులద్భుత మందిచూచ
నమ్మని మొనర్చె నత్యుగ్రమైన తపము (పె.కా.మా.)

ఈ పద్యము ధూర్జటి కాళహస్తి మాహాత్మ్య మందలి ఈ క్రింది పద్యమున కనుకరణమని తోచును.

సీ. శ్రీగురు పాదరాజీవయుగాత ప
త్రచ్ఛాయ, నెందకు దల్లడిలక,
తరుణేందు భూషణ ధ్యాన సుధాధార,
ఘోరక్షుధా బాధ గుతిం పడక,
సకలాంగ భసిత కంచుకమున, విషపుచ్చ
విషధరాదుల భీతివెగడువడక,
ఘనభక్తి, గర్త నిఖాత చిత్తస్తంభ
తను గేహమున గాలిదలకు లేక
బహుల విఘ్నోపాయముల జిక్కువడక తిరుగు
ప్రకట సంసారమోహజంబుకము బట్టి,
యుద్ధవిడి జంపుటకు రాజయోగ జాల
మాసపడి చేసె, నత్యుగ్రమైన తపము.

(కా.మా.ప్ర.ఆ. 71 పద్యం)

వశిష్ఠుని తపస్సుకి మెచ్చి వరములీయవచ్చిన శివుని ధూర్జటి ఈ క్రింది విధముగా వర్ణించెను.

ఉ॥ వాకిట గాచియున్న హరివారిజ సంభవ ముఖ్య దేవతా
నీకమునుం దలంప, కవనీధర జాదర హాసలీలతం
తోక, సమీప వర్తులగు పుత్త్రుల జూడక, భక్తభక్తిక
న్యాకర పంకజ గ్రహణ నైష్ఠికుడై, కడు సంభ్రమంబునన్

(కా. మా. ప్ర. ఆ. 74 పద్యం)

ఈ పద్యమునే దృష్టియందుంచుకొని లింగరాజు కవి పెద కాళహస్తి మాహాత్మ్యమునందీ విధముగా వ్రాసెను.

నతమొనరించి నిల్చిన జ
నార్దన వాగ్వరులన్ దలంపక
ప్రతిహార దైత్య సంహరణ
పద్ధతి మెచ్చ భృంగి నాట్య సం
గతి బంకింప కాత్మ సుతు
కామిత మీయక నద్రిజావిలో
లత విహరింపక కమ్మని కు
ం ప్రభు వాంచిత దానదక్షుడై

ఇంకను తిన్నని కథలో కూడ లింగరాజు కవి ధూర్జటి ననుసరించిన ఘట్టములు కలవు. తిన్నడు తలకుట్లుచేసి పరమేశ్వరున కర్పింపగా అతడు తినక మౌనముగా నూరకుండుట చూచి శివుని ఈ విధముగా ప్రశ్నించును.

"పక్వములుగావో! రుచిలేదో భక్తిలేదో!
కమ్మనైయుండవో కోరగావో! నీకు
పంది కరకుట్లు............రావమేమి!
వేగ వివరింపవయ్యా! యో విశ్వనాథ"

ధూర్జటి కూడ తిన్నని కథలో ఈ పద్యము చెప్పెను. అది యిట్లున్నది -

క॥ ''కాలవొ, క్రొవ్వవొ, మారం
గాలెనొ, చవిగావొ, కమ్మగావొ, నీకున్
జాలవొ, యలవడవో, తిన
వేలా కటకుట్లు? పార్వతీశ్వర! చెపుమా"

(తృ. ఆ. ౮౮)

ఈ పద్యమునకు లింగరాజు కవి పద్యము ప్రతిధ్వని యనుటలో నతిశయోక్తిలేదు.

లింగరాజు కవి పెద కాళహస్తి మాహాత్మ్యమున పార్వతీదేవి హిమవంతుని అర్ధాంగలక్ష్మియగు మేనకాదేవి. గర్భమున జ్ఞాన ప్రసూనాంబయై జన్మించును. అప్పుడామె శైశవ విలాసముల నాతడిట్లు వర్ణించెను.

''శివమాయ యెంత విచిత్రమోహో యని
నవ్వినట్లంతంత నవ్వసాగె
హరునితో నీరీతి ననగి పెనంగుదు
నను పద్ధతిని బొరలాడ దొడగె
నశివు నంకమున నట్లదివసింతు నటన్న
సౌజగు రంజిల్ల గూర్చుండ నేర్చె
నఖిల జగమ్ము శైవాకృతియని కొంతు
నడవు నదగ దప్పటడుగు విడియె
శుక్లపక్ష దినంబుల సొంపు మీర
చంద్రరేఖా నిరూపి శైశవ విలాస
భాసుర విహార విస్ఫూర్తి బరిఢవిల్లె
సరస సౌజన్య శైల రాజన్య కన్య.

ఈ పద్యము ధూర్జటి తిన్నని కథలోని పద్యమునకు సర్వదా యనుకరణమే యని పించును. ధూర్జటి తిన్నని బాల్య చేష్టలను వర్ణించు సందర్భమున యిట్టి పద్యము వ్రాసెను. ఆ పద్యమిది -

సీ॥ 'శివభక్తి రహితమై చెడియె జగం'బని
నవ్వినట్లొయ్యన నవ్వసాగె
ధృతిమోహ బంధంబు దెగదన్ను గతి, ముద్దు
టడుగు లెత్తి విదుల్చుకొనగ జొచ్చె,
భవపరాఙ్ముఖుడైన పగిది, సత్త్వము గూడి,
పొత్తులం పాన్పుపై బొరలబడియె
శ్రేయో మహారాజ్య సింహాసనంబున
నుండు చందమున గూర్చుండ దొడగెఁ

గీ॥ దడవియాడె వసుంధరా స్థలమునందు
విశ్వపతి తత్త్వమను మణి వెదకు రీతి,
దర్పకారి జగత్పూర్ణ దాకురీతి
నడుగు వెట్టెడు గతి దప్పటడుగు వెట్టె.

(కా. మా. తృ. ఆ. 80 పద్యం)

ధూర్జటి చంద్రబింబము శివలింగము వలె నున్నదని వర్ణింపగా, లింగరాజుకవి శ్రావ ప్రసూనాంబ వివరించుటకు వెడలిన ఉద్యానవనము శివాకారమున కన్పించినదని ఈ క్రింది విధముగా చెప్పెను.

అనుపమ నీలకంఠసము
దంచితమై సుమనోఽభిరామమై
ఘనతర పన్నగాభరణ
కేళంబై నవ చంద్రధారణం
బున దనరారి సంభ్రమ స
మున్నత హేమ నగేంద్రమైన యీ
వనము సదాశివాకృతి బ్ర
వర్తిలె! కంటివే! పద్మలోచనా!

నక్కీరుని తీర్థయాత్రా సందర్భమున ధూర్జటి రచితమగు ఈ క్రింది పద్యమును గూడ లింగరాజు కవి యనుకరించెను.

శా॥ కాంచెం గాంచన పంకజాళి విలస ద్గంధాంధ సారంగ, వే
నాంచత్తుంగ తరంగ, వారినిధి శీతాగాంత రాభంగ, రో
మాంచ స్వేద జలాశ్రు పూరజన కాత్మానంద సంపన్మనో
మందాగ్రస్థిత విశ్వనాథ పద సమ్యక్సంగ, గంగానదిన్.

(కా. మా. తృ. ఆ. 189 పద్యం)

పరతత్త్వము నెఱుంగ గోరిన బాదరాయణ మహర్షి పరమ శివుని గురించి తప మొనరించుటకు హిమాలయమున కేగును. ఆ సందర్భమున పై పద్యము తీరునే లింగరాజు కవి ఈ విధముగా వ్రాసెను.

"కాంచెన్ జెంగట శీతశైలము జగ
త్కల్లోల జాలాపగా
ప్రాంచత్పద్మ మిళింద బృంవని నదో
ద్యన్మంద వాతూలమున్
చంచత్కాంచన రత్న శృంగపటలీ
సంక్రాంత కాదంబినీ
సంచారోన్మద కేకి జాలమునట
జ్జంతు వ్రజా వాలమున్"

పై పద్యము రచనా రీతియందు ధూర్జటిని సర్వదా యనుకరించినాడు. ఇక శతక విషయమున ధూర్జటి ప్రభావ మితర కవులపై కన్పట్టు చున్నది. ఇట్లే పూర్వ కవుల యనుకరణలు కూడ ధూర్జటి శతకమున గానవగును.

శంకర భగవత్పాదుల 'శివానందలహరి' లోని శ్లోకముల అనుసరణములు కొన్ని ధూర్జటి శతకరచనలో కన్పట్టుచున్నవి.

అశనం గరళం, ఫణీకలాపో
వసనం చర్మ చవాహనం మహోక్షః
మమదాస్యసికిం, కి మస్తి శంభో!
తవపాదాంబుజ భక్తి మేవదేహి! (శి. లహరి. 87 శ్లో)

ధూర్జటి దీని కనుకరణగా ఈ క్రింది పద్యము వ్రాసెను.

వన్నె యేనుగుతోలు దుప్పటము, బువ్వాకాలకూటంబు ? చే
గిన్నె బ్రహ్మకపాల? ముగ్రమగు భోగేశంతహారంబు? మే
ల్నీవిన్నీలాగున నుండగా దెలిసియున్నీపాదపద్మంబు చే
ర్పన్నారాయణుడెట్లు మానసముదా శ్రీకాళహస్తీశ్వరా!

(శ్రీ కా. శతకము 90 పద్యము)

ధూర్జటి వైరాగ్య బోధకములగు భర్తృహరి మున్నగు కవుల సుభాషితములు చదివి యుండునని తోచును. అందువలననే ధూర్జటి శతకములో ఆభాయలు కొంత వరకు కన్పించుచున్నవి శివ మంత్రము పఠించు వారి కసాధ్యమేమియు లేదని చెప్పుచు ధూర్జటి శతకము నందీ విధముగా చెప్పినాడు-

పనిపున్పంబగు నగ్నిమంచగునకూపారంబుభూమీస్థలం
బవు శత్రుండతి మిత్రుడౌ విషము దివ్యాహారమౌ నెన్నగా
నవనీమండలిలోపలన్ శివశివేత్యాభాషణోల్లాసికిన్
శివనీనామము సర్వవశ్యకరమౌ శ్రీకాళహస్తీశ్వరా !(కా.శ. 45 పద్యము)

ఈపద్యము సంస్కృత వాఙ్మయమున మలయ రాజీయమందలి ఈక్రింది శ్లోకమును బోలియున్నది-

కులిశంకుసుమతి దహన
స్తుహిమతి వారాంన్నిధిర్థ్రువంస్థలతి
శత్రుర్మిత్రతి, విషమ
మ్యమృతతి శివేతి ప్రలపతోశ్యా

ధూర్జటి పద్యమునకిది మాతృకయని తొలుత గుర్తించినవారు శ్రీ బండారు తమ్మయ్యగారు. వారి "శివ పంచ స్తవము"లను వ్యాసములందు దీనిని చూపిరి. ఈవిషయము నిడదవోలు వెంకట్రావుగారు తమ శివతత్త్వసార పీఠికలో చెప్పిరి. ఈ మలయరాజు రచించిన ఈశ్లోకమునకు మల్లికార్జున పండితుని యనుకరణ పద్యము వారు చూపిరి ఆ పద్య మీక్రింది విధముగా గలదు.

ఆయుధములు కుసుమములగు
నాయబ్ధులు మెట్టుఁగు మహామదగజముల్
వేయేల గండశిలంగు
కాయక నిను గొల్చు నచల భక్తులకు శివా

(శివతత్త్వసార పీఠిక 62 పుట)

ధూర్జటి రాజులను సేవించు అజ్ఞానులగూర్చి ఈవిధముగా చెప్పెను.

లేవో కానల గందమూలఫలముల్ లేవో గుహల్ తోయముల్
లేవో యేఱుల పల్లవాస్తరణముల్ లేవో సదాయాత్మలో
లేవో నీవు విరక్తులన్మనుపఁజాలిం బొంది! భూపాలురన్
సేవల్సేయఁగ బోదురేలొకొజనుల్ శ్రీకాళహస్తీశ్వరా! (48)

ఈ పైపద్యము భర్తృహరి వైరాగ్య శతకములో నీ క్రింది శ్లోకమున కనుకరణ మనిపించుచున్నది.

కిం కందాః కందరేభ్యః ప్రణయముపగతా
నిర్ఝరావాగిరిభ్యః
ప్రధ్వస్తావాతరుభ్యః సరసఫలభృతో
వల్క వివ్యశ్చ శాఖాః
వీక్ష్యన్తేయన్ముఖాని ప్రసభమపగత
ప్రశ్రయాణాంఖలానాం
దుఃఖోపాత్తాల్ప విత్తస్మయపవనవశా
నర్తితభ్రూలతాని (వైరాగ్య శతకము 26 శ్లో)

తరువాత ధూర్జటి విలాసములతో కాలము గడుపుట కంటె సువర్ణముఖీ నదీతీరమున కూర్చుండి పరమేశ్వరుని ధ్యానించుటే మంచిదని చెప్పుచు ఈ క్రింది పద్యము చెప్పినాడు. ఇదికూడ భర్తృహరి వైరాగ్యశ్లోకము కనుకరణమే. ఈ రెండు పరిశీలింతము.

దినముం జిత్తములో సువర్ణముఖరీతీరప్రదేశామ్రకా
నన మధ్యోపలవేదికాగ్రమున నానందంబునం జంకళా
సన నిష్ఠన్ నిను జూడఁగన్న నదివో సౌఖ్యంబు, లక్ష్మీవిలా
సిని మాయానటనల్ సుఖంబులగునే? శ్రీకాళహస్తీశ్వరా! (కా. శ. 86)

కదావారాణస్యామమరతటినీరోధసి వసన్
వసానః కౌపీనం శిరసినిదధానోఽఞ్జలిపుటం
అయే గౌరీనాథ! త్రిపురహర! శంభో! త్రినయన!
ప్రసీదేతి క్రోశన్ నిమిషమివనేష్యామి దివసాన్

ఇచట గంగానదీతీరము వర్ణితముకాగా, ధూర్జటి శతకములో సువర్ణముఖరీ నది చెప్పఁబడినది. ధూర్జటి యాశ్రమ కౌపీనము కూడ ఈపద్యములో ప్రవేశ పెట్టినాడు. దీనినిబట్టి అచటి దేశ వాతావరణము వెల్లడియగుచున్నది.

ఇంక తెలుగు శతక కర్తలలో మొదటివాడగు మల్లికార్జున పండితుని శివతత్త్వ సారమునందలి యనుకరణలు కూడ ధూర్జటి శతకమున గలవు. శైవ కవి యగుటచే సహజముగా వీరి కృతులను తప్పక చదివి యుండును. మల్లికార్జున పండితుడు పరమేశ్వరారాధనా ప్రాగల్భ్యమున ముక్తినొందిన కిరాత లూతా దీశ్వరుల యనుభావమును దన శివతత్త్వసారమున పేర్కొనెను. ఈ భావమును ధూర్జటి కూడదని శ్రీకాళహస్తీశ్వర శతకమున పేర్కొనెను. రెండును చూతము-

వేయేమి! దొల్లి ముక్తికి
బోయరె! విద్యలను వంశములు గలవారల్
బోయయు, సాలీడునుమా
కాయజహరుగొల్చి ముక్తిగాంచిరగాదే (శివతత్త్వసారము 478)

ధూర్జటి యింతక విపులముగా నీక్రింది పద్యము వ్రాసినాడు-

ఏవేదంబు పఠించె లూత, భుజగం బే శాస్త్రముల్చూచె దా
నే విద్యాభ్యసనం బొనర్చె గరి, చెంచే మంత్రమూహించె, బో

ధావిర్భావని దానముల్ చదువులయ్యా కావు, మీపాద సం
సేవాసక్తియెకాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా! (కా.శ. 18 పద్యం)

శివభక్తుల శీల స్వభావాదులను మల్లికార్జున పండితుడు 4, 5 కంద పద్యములలో చెప్పెను.

ఆ పద్యములివి.

కులగిరులు జిఱ్ఱివిరిగిన
జలరాసులు మేరదప్పి-చనుదెంచిన నీ
వల నెఱిగిన దృఢభక్తుడు
చలియింపదపార ఘోర-సంసారమునన్ (162 శివతత్త్వసారము)

పరపరివారిత్వము ని
ష్కారుణత్వము నిత్యయాచ-కత్వము నతి ని
ష్ఠుర కర్మత్వము నెన్నడు
బొరయవు నీభక్తవరుల-బురసంహారా! (169)

నీవని యెఱిగిన పిమ్మట
పీవ యెఱుంగువనియుండు-నీ నిజభక్తుం
డావంతయు నేననియెడు
భావన గైకొనడు గార్య-భారమున శివా (172)

నీవని యెఱిగిన పిమ్మట
నేవలనికిఁ వాల డొందు-లెఱుగడు దనకున్
జీవనమెట్లని తలపడు
భావన గేవల శివైక్య-భక్తుడు రుద్రా (178)

పైపద్యముల భావమంతయు ధూర్జటికవి తన శతకములో నొకశార్దూల పద్యములో నుడివెను.

నీ కారుణ్యము గల్గినట్టి నరుడే నీచాలయంబుం జొరం
దే కార్పణ్యపు మాటలాడ నరుగం డెవ్వారితో వేషముల్
గై కోడేమతముల్భజింపడిలనే కష్టప్రకారంబులన్
జీకాకై చెదిపోడు జీవనదశన్ శ్రీకాళహస్తీశ్వరా ! (కా.శ. 68)

పాల్కురికి సోమనాథుని యనుభవ సారమందలి పద్యముల ప్రభావము కూడ ధూర్జటి శతకమున కన్పించుచున్నది.

శతక కవుల చరిత్ర కర్తయైన శ్రీ వంగూరి సుబ్బారావుగారీ క్రింది పద్యముదాహరణముగా నొసగినారు-

కలవాడె ధనము ప్రాయము
గలవాడె జనంబు బలము గలవాడె విని
శ్చలం మతియు గతియు దనకున్
గలవాడె భజింపవలయు గరుణో నిలయున్ (అనుభవ సారము)

ధూర్జటి ఈ భావమునే తన శతకమునిట్లు గూర్చినాడు-

దంతంబుల్పడనప్పుడే తనువు నందారూఢి యున్నప్పుడే
కాంతాసంఘము రోయనప్పుడె జరాక్రాంతంబు గానప్పుడే
వింతల్మేన జరించనప్పుడే కురుల్వెల్వెల్లఁ గానప్పుడే
చింతింపన్వలె నీపదాంబుజములన్ శ్రీకాళహస్తీశ్వరా !
(శ్రీ. కా. శ. 116 పద్యం)

ధూర్జటి వెన్నెలకంటి జన్నయ్య దేవకీనందన శతకమును యనుసరించినట్లు కొన్ని యుదాహరణలు చూపవచ్చును. ఈ కవి కూడ ధూర్జటివలెనే రాజ దూషణ చేసినవాడు.

వాక్య ప్రతి — దేవకీ నందన శతకము
దీనినే ధూర్జటి తన శతకములో యిట్లు పేర్కొనెను.

రాజుల్మత్తులు వారిసేవ నరక ప్రాయంబు వారిచ్చునం
భోజాక్షీ చతురంతయానతురగీ భూషాదులాత్మ వ్యథా

భీజంబుల్ తదపేక్షచాలు బరితృప్తిం బొందితిన్ జ్ఞానల
క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!
(శ్రీ.కా.శ. 16)

అన్వయ్యః అంతః శత్రుం గెల్వలేరు మనుజా

ధూర్జటి :

శ్రుతులభ్యాసము జేసి శాస్త్రగరిమల్శోధించి తత్త్వంబులం
స్మృతి నూహించి శరీర మస్థిరము బ్రహ్మం బెన్న సత్యంబుగాం
జితిమంచున్ సభలన్ వృథా వచనముల్చెప్పంగనే కానిని,
ర్జితి చిత్తస్థిర సౌఖ్యముల్ దెలియరో శ్రీకాళహస్తీశ్వరా! (కా. శ. 68)

ఇతర కాళహస్తీశ్వర శతకము నితర కవులెట్లనుకరించి నదియు గమనింప వలసి యున్నది. భాస్కరకవి రచితమగు చిత్త శతకమున కాళహస్తీశ్వర శతకపు టనుసరణలు చూడవచ్చును. దానికి క్రింది పద్య ముదాహరణముగా జెప్పవచ్చును-

వట పత్రంబట శంకరుండు హరిశర్వాద్యాలుదై శేశప
ల్పుటలాపైనట, విష్ణునాభినలువే
ల్పుంబెద్ద జన్మించె వా
నట! కల్పించె జగంబు లెల్లనుటలభ్యార్చర్య మీలాదిదెం
తటి చిత్రంబని కంటినంటికనరా
దా! నీవుగా చిత్తమా (చిత్త శతకము 6 పద్యము)

ఈ పద్యము శ్రీకాళహస్తీశ్వర శతకమందు (ఏకాదమివారు ప్రచురించిన దాని యందే) ఈ క్రింది పద్యమును బోలియున్నది-

అలయేకార్ణవ వేళ నీవు వటపత్రాకారమై యుండగా
జెలువం బొప్పగ మాధవుండు కలిగెన్ జేరంగ జోటంచుదా
నెల మందామర తంపరై బ్రతికి నాడింతాకుపై నుండియే
సిలుగుల్ పొందక నీకతంబున గదా శ్రీకాళహస్తీశ్వరా!
(కా. శ. 119)

ఈ పద్యమన్ని శతకములందు గానరాదు. ఎూడమీవారు వేసిన ప్రతియందు మాత్రము గలదు.

కామేశ్వర కవి రామప్రభూ శతకమునందు సర్వదా ధూర్జటి ననుకరించెను. ధూర్జటి శతకము శైవ భక్తి ప్రధానమైనది. కామేశ్వర కవి రామభక్తి ప్రధానముగ రామప్రభు శతకము రచించెను. ఇందులకు 8, 4 ఉదాహరణములు చూతము.

ఏవేదంబు పఠించె లూత భుజగంబే శాస్త్రముల్ చూచే (కా. శ)
ఇదే పద్యము రామప్రభు శతకమున-

"ఏమంత్రంబు జపించె పక్షికరిరాజే తంత్రముల్ జూచెరా
నేముఖ్యాగమ మభ్యసించెను గిరాతేశుండు
ఏ శాస్త్రముల్ ప్రేమన్ జెంచెర నేర్పె ముక్తిపదీ
.... ధంబునీ పాదసే
వామాత్రంబె జీవుం... కైనస్వామి రామప్రభూ"

2) నిను సేవింపగ నాపదల్పొడమనీ (శ్రీ. శ.)
నిన్నుంగొల్చిన భాగ్యసంపదలు రానీ (రా. ప్ర. శ.)

3) అయవార్లై చరియింపవచ్చు (శ్రీ. కా. శ.)
ఆచార్యుండయి పీగవచ్చు (రా. ప్ర. శ.)

4) పరిశీలించితి మంత్ర తంత్రములు (శ్రీ. కా. శ.)
అవలోకించితి వేదశాస్త్రములు (రా. ప్ర. శ.)

5) రోసీ రోయదు (శ్రీ. కా. శ.)
పీడీపీడదు (రా. ప్ర. శ.)

ఇంక ఆధునికులలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ధూర్జటి శతకమునను సరించుచు 'మాస్వామి' యను శతకమును రచించినట్లు తెలియుచున్నది. వారు ధూర్జటి మహాకవి నీ క్రింద పద్యములో స్మరించినట్లు వారు వ్రాసిరి.

ఆనందైకమయ స్వరూప భవదీయైశ్వర్యముల్, ధూర్జటి
శ్రీనాథుల్ - కవితాసతీ కుచతటీ శ్రీగంధ కస్తురికా
స్థానంబుం బొనరించి దిప్పటికి నస్మత్ స్తోత్ర పాత్రంబై
తేనెల్ ద్రావిన నోటికిన్ జలములందింపయ్యె విశ్వేశ్వరా !

ధూర్జటి వాక్కులు తేనెలైన తమ వాక్కులు జలములట. ఈ మాట ద్వారా వారికి మహాకవి ధూర్జటిపై గల యభిమానము వ్యక్తమగుచున్నది.

ఉపసంహారము

అష్టదిగ్గజములు అను ప్రఖ్యాతి వహించిన ప్రబంధ కవులలో ధూర్జటి ప్రముఖస్థానమునే ఆక్రమించినాడని చెప్పుటకు పై పంద్రెండు ప్రకరణములలో చేసిన పరిశీలనము, చూచిన ప్రతిభా విశేషములు చాలుననుకొందును. ప్రబంధ యుగములో శైవమతావలంబియై శైవక్షేత్ర మాహాత్మ్యమును, అందును దక్షిణ కైలాసమును ప్రఖ్యాతి వహించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యమును వ్రాసిన ధూర్జటి ప్రాబంధిక మార్గము ననుసరించిన కవులలో ప్రముఖుడే యగుచున్నాడు. ఇతని తరువాత కావ్యరచనకు పూనుకొనిన పెదకాళహస్తి మాహాత్మ్య రచయిత యగు లింగరాజు కవి, కృష్ణరాయ విజయము వ్రాసిన కుమార ధూర్జటి, రత్నావళీ పరిణయ కర్తయగు ధూర్జటి వెంకటరాయ కవి, ఇందుమతీ పరిణయ కర్త ఈ కవిని గూర్చి సగౌరవముగా పేర్కొనుటయే కాక ఇతని మహోన్నత వ్యక్తిత్వమును గూర్చి తమకు తెలిసిన విషయములను తమ కావ్యములలో ఉటంకించి యున్నారు. కుమార ధూర్జటి తన తాతగారిని గూర్చి చెప్పిన విశేషములు ఎంతటి ఆహ్లాదకరమైనవో సాహితీ లోకమున అవి పరంపరగా ఎట్లు ఉజ్జ్వలముగా కొనసాగుచూ వచ్చినవో నేను ప్రత్యేకముగా చెప్పనిలేదు. ఇటువంటివేవైనను ధూర్జటి ప్రతిభా విశేషములను ప్రత్యక్షముగా ఆవిష్కరించునట్టివి ఆతని కావ్యములే.

ఈ పరిశీలనలో ధూర్జటిని గురించి నాకు లభించిన విషయములను సమీకరించి ఆతని కవితా వైభవమును వ్యక్తిత్వపు టౌన్నత్యమును వెల్లడించుటకు ప్రయత్నము చేసితిని. నాయీ ప్రయత్నము సమగ్రమైనదని చెప్ప సాహసము నాకులేదు. నియమిత కాల పరిధిలో, అధ్యయన పరిమితిలో ఈ వ్యాసమును ఇంత వరకు మాత్రమే తేగలిగితిని పండితులకు ఏమాత్రము సంతృప్తి కలిగించినను నేను కృతార్థురాలనే. ఇంకను సాధించవలసిన దుండవచ్చును "విపులాచ పృథ్వీ" అని కదా పెద్దలు చెప్పుదురు.

ఉపకరించిన గ్రంథములు

1. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - ధూర్జటి మహాకవి, సంపాదకులు: డా॥ P. S. R. అప్పారావు గారు.

2. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - వ్యాఖ్యాత - చిలకూరి పాపయ్య శాస్త్రి శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి గారిచే పరిష్కృతము- పీఠిక: చంమచర్ల రంగాచార్యులు గారు.

3. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - లఘుటీక సహితము - శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రి గారు.

4. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - ఎమెస్కో ప్రచురణ, పీఠిక: శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు.

5. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - తిమ్మావజ్ఝల కోదండరామయ్య గారు.

6. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - బులుసు వెంకటరమణయ్య గారు.

7. పెదకాళహస్తి మాహాత్మ్యము - లింగరాజుకవి, తాళ పత్రప్రతి. ప్రాచ్యపరిశోధన సంస్థ-తిరుపతి.

8. శ్రీకాళహస్తి మాహాత్మ్యము - కథాభాగము- వెంకటేశ్వర పబ్లిషర్స్- విజయనగరము.

9 శ్రీకాళహస్తి మాహాత్మ్యము - సమగ్ర పరిశీలన- శెట్టివారి అశ్వత్థప్ప (అనంతపురం)

10. శ్రీకాళహస్తి క్షేత్రము- మాహాత్మ్యము - విద్వాన్. టి. తిరువేంగడసూరి- శ్రీకాళహస్తి.

11. ధూర్జటి మాధురీ మహిమ - కాదంబిని- శ్రీ కె. జె. కృష్ణమూర్తిగారు, తిరుపతి.

12. శ్రీకాళహస్తీశ్వర శతకము - గొల్లపూడి వీరస్వామిసన్-రాజమండ్రి.

13. శ్రీకాళహస్తీశ్వర శతకము - with English translation
P Krishna Murthy; Foreword
by Sri Adapa Ramakrishna Rao

14. శ్రీకాళహస్తీశ్వర శతకము - ఆంధ్రసాహిత్య అకాడమీ ప్రతి.

15. శ్రీకాళహస్తీశ్వర శతకము - తాళపత్ర ప్రతులు-
తిరుపతి ప్రాచ్య పరిశోధనసంస్థ.

a) శ్రీకాళహస్తీశ్వర శతకము- D) 1524 - అసమగ్రము
b) శ్రీకాళహస్తీశ్వర శతకము - D) 1525 ,,
c) శ్రీకాళహస్తీశ్వర శతకము - D) 1526 ,,
d) శ్రీకాళహస్తీశ్వర శతకము - D) 1529 ,,
e) శ్రీకాళహస్తీశ్వర శతకము - D) 1530 ,,
f) శ్రీకాళహస్తీశ్వర శతకము - D) 1531 ,,

16. శ్రీకాళహస్తీశ్వర దండకము - D 1977 తాళపత్రప్రతి

17. శతక వాఙ్మయము - డా॥ కె. గోపాలకృష్ణరావు గారు
కళాస్రవంతి సాహితి సంస్కృతికసంస్థ
న్యూ నల్లకుంట.

18. శతక వాఙ్మయ వికాసము - డా॥ కె. గోపాలకృష్ణరావు గారు
(సిద్ధాంత వ్యాసము)

19. శతక సంపుటము - Part 1 శ్రీ నిడదవోలు వెంకటరావు
శతక సంపుటము - Part II

20. సర్వేశ్వర శతకము - యథావాక్కుల అన్నమయ్య

21. దాశరథి శతకము - కంచెర్ల గోపన్న

22. వృషాధిప శతకము - పాల్కురికి సోమనాథుడు.

23. శతకకవుల చరిత్ర - శ్రీ వంగూరి సుబ్బారావుగారు.

24. ధూర్జటి కవితా వైభవము - డా॥ పోణంగి శ్రీరామ అప్పారావుగారు.

25. శివానందలహరి - శ్రీ శంకరాచార్యులు (శ్రీ విద్యాసేవా సమితి, సికిందరాబాదు)

26. శివతత్త్వ సారము - మల్లికార్జున పండితారాధ్యుడు.

27. నృసింహ పురాణము - ఎఱ్ఱాప్రగ్గడ

28. కుమార సంభవము - నన్నిచోడుడు - (సంపాదకుడు : డా॥ కోరాడ మహాదేవశాస్త్రి)

29. శృంగార నైషధము - శ్రీనాథ కవి.

30. పాండురంగ మాహాత్మ్యము - తెనాలి రామకృష్ణుడు.

31. కాశీ ఖండము - శ్రీనాథ కవి

32. హర విలాసము - ,,

33. భీమేశ్వర పురాణము - ,,

34. కావ్యలహరి - యువ భారతి ప్రచురణ

35. బసవ పురాణము - (ద్విపద) బండారు తమ్మయ్యగారిచే పరిష్కృతము

36. బసవ పురాణము - పరిష్కర్త - డా॥ జి.వి. సుబ్రహ్మణ్యంగారు.

37. బసవ పురాణము - (పీఠిక) శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు (ఆంధ్ర గ్రంథమాల)

38. మనుచరిత్ర - అల్లసాని పెద్దన - వ్యాఖ్యాత - వెంపరాల సూర్య నారాయణ శాస్త్రి

* మనుచరిత్ర - అల్లసాని పెద్దన - శ్రీతిమ్మావజ్ఝల కోదండరామయ్య (సంపాదకులు)

39. ఆముక్త మాల్యద - శ్రీకృష్ణ దేవరాయలు

40. కృష్ణరాయ విజయము - కుమార ధూర్జటి

41. ఇందుమతీ పరిణయము - వేంకటార్యుడు.

42. రత్నావళీ పరిణయము - ధూర్జటి వెంకటరాయ కవి

43. ప్రబంధ వాఙ్మయ వికాసము - డా॥ పల్లా దుర్గయ్యగారు.

44. బసవ వచనములు - శ్రీ డా॥ బాడాల రామయ్యగారు (మైసూరు విశ్వ విద్యాలయ ము)

45. ఆంధ్ర వచన వాఙ్మయము - డా॥ యం. కులశేఖరరావుగారు.

46. విరుమ గద్య - డా॥ యం కులశేఖరరావుగారు.

47. ఆముక్త మాల్యద ప్రథమాంధ్ర ప్రబంధమా?
-డా॥ యం.కులశేఖరరావుగారు

48. ఆంధ్ర కవుల చరిత్ర - శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు.

49. ప్రబంధవాఙ్మయము - ప్రపంచ మహా సభల ప్రచురణ
-డా॥ యశోదారెడ్డి.

50. రాఘవ పాండవీయము - పింగళి సూరన

51. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము - శ్రీ చలమచర్ల
రంగాచార్యులుగారు.

52. కావ్యాలంకార చూడామణి - విన్నకోట పెద్దన.

53. కావ్యాలంకార సంగ్రహము - భట్టుమూర్తి (వివరణ కర్త) సన్నిధానము
సూర్యనారాయణశాస్త్రి.

54. ఛందోదర్పణము - అనంతామాత్యుడు.

55. చంద్రాలోకము - (జయదేవ) With English notes and translation by. L. Sankara Rama Sastry edited by Vishwanathan

56. ధూర్జటి-నవల - శ్రీ నోరి నరసింహశాస్త్రి

57. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డిగారు

58. ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి - శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

59. మన చరిత్ర-సంస్కృతి - వ్యాసము, ఉస్మానియా విశ్వవిద్యాలయము విద్యార్థులు వ్రాసినవి.

60. ప్రబంధ భావ ప్రకాశిక - వంగల శ్రీరామావధానిగారు.

61. అష్టదిగ్గజములు - అష్టదిగ్గజ వర్ధంత్యుత్సవ సంచిక.

62. ఆంధ్ర కవితరంగిణి - సంపుటములు - శ్రీ చాగంటి శేషయ్యగారు.

63. సమగ్ర ఆంధ్ర సాహిత్యము - సంపుటములు - శ్రీ ఆరుద్రగారు.

64. అప్పకవీయ భావప్రకాశిక - రావూరి దొరసామి శర్మ.

65. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - డా॥ దివాకర్ల వెంకటావధానిగారు.

66. విజయ నగరాంధ్ర కవులు - నిర్మలా పబ్లిషర్స్ - శిష్టా లక్ష్మీకాంత శాస్త్రిగారు.

67. ఆంధ్ర మహాభారతము - ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ ప్రచురణ, ఉస్మానియా విశ్వవిద్యాలయ సంశోధిత ప్రతి.

68. ఆంధ్ర మహాభాగవతము - సప్తమస్కంధము

69. శ్రీచక్ర విలసనము - తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు.

70. శ్రీతత్త్వము - మత్రిపాటి వెంకట నరసింహారావుగారు.

71. శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ సంచిక 1975, శ్రీవిద్యా సేవా సమితి - సికిందరాబాదు.

72. శ్రీవిద్య - శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ సంచిక - 1977, శ్రీవిద్యా సేవా సమితి - సికిందరాబాదు.

73. శ్రీదేవి శరన్నవరాత్రోత్సవ సంచిక 1974 - శ్రీవిద్యా సేవా సమితి - 6-1-289/16 PadmaRao Nagar, Sec'bad.

74. సారస్వత వ్యాసములు - జి.వి. సుబ్రహ్మణ్యంగారు.

75. శ్రీనాథుడు - శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి.

76. సౌందర్య లహరి - శంకరాచార్యులు.

77. స్కాంద పురాణము.

78. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయము - చేకుమళ్ళ అమృతరావుగారు.

79. తిరువిళయాదల్ పురాణము - పరంజ్యోతి మునివరుడు.
(మాణిక్యముగారి సహాయముతో విషయము సేకరించుట జరిగినది)

80. Path way to God-through Tamil Literature, G. Vanmikanathan.

81. వసుచరిత్ర - రామరాజ భూషణుడు.

8 . మార్గ-దేశి - పరిశోధనా వాఙ్మయము-వర్ధమూడి గోపాలకృష్ణయ్య గారు.

83. సమగ్ర ఆంధ్ర విజ్ఞాన కోశము - సంపుటములు.

34. విజ్ఞాన సర్వస్వము - సంస్కృతి సంపుటము.

35. English - Sanskrit Dictionary - Moniar Williams.

36. Sanskrit - English Dictionary - V.S. Apte

పత్రికలు

భారతి సంపుటములు

1. భారతి - 1961 మే

2. భారతి - 1956 సెప్టెంబరు

3. భారతి - 1958 ఫిబ్రవరి

4. భారతి - 1978 జనవరి

5. భారతి - 1971 ఆగస్టు

6 భారతి - 1960 ఆగస్టు

7. భారతి - 1968 డిసెంబరు

8. భారతి - 1962 జూలై

9. భారతి - 1960 నవంబరు

10. సాహితి - 1962 మార్చి

11. సాహితి - 1961 జూలై

12. సాహితి - 1964 ఫిబ్రవరి

ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలు

13. పరిషత్పత్రిక - సంచిక 47, 2,8, భాగములు

14. పరిషత్పత్రిక - Vol 48. సంచిక 1,2, 48వ వార్షిక సంచిక

15. దినపత్రికలు

1. ఆంధ్ర పత్రిక - 20.11.1968

2. ఆంధ్ర పత్రిక - 19.10.1968

3. (హొసబెళకు) (Kannada) సేవాసదన 1971
(Mysore University) రామయ్యగారి సహాయముతో విషయ సేకరణ జరిగినది.